వి.యాన్

# జెంఘిజ్ ఖాన్



# జెంఘిజ్ ఖాన్



వి. యాన్

అనువాదం:

ఆర్వీయార్

నవచేతన పబ్లిషింగ్ హౌస్

**GENGHIZ KHAN** - *V. yan* *Telugu translation R.V. R.*

ప్రచురణ నెం. : 2015/36

సోవియట్ ముద్రణ, 1990

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : మే, 2015

© ప్రచురణకర్తలు

ముఖపత్ర చిత్రం: స్టానిస్లావ్ ఫ్లటెంకో (రష్యన్ చిత్రకారుడు)

లోపలి చిత్రాలు : ఓ. దూగినా

**వెల : ₹ 250/-**

ప్రతులకు:

**నవచేతన పబ్లిషింగ్ హౌస్**

గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)
జి.ఎస్.ఐ. (పోస్ట్) హైదరాబాద్ – 068. ఫోన్స్: 24224454.
E-mail : navachethanaph@gmail.com

**నవచేతన బుక్ హౌస్**

**ఆబిడ్స్, సుల్తాన్‌బజార్, యూసఫ్‌గూడ, కూకట్‌పల్లి, బండ్లగూడ(నాగోల్) హైదరాబాద్.**
**హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం.**

**విశాలాంధ్ర బుక్ హౌస్**

**విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు,**
**తిరుపతి, కాకినాడ, ఒంగోలు, శ్రీకాకుళం, కడప.**

**హెచ్చరిక:** ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంత గానీ కాపీరైట్ హోల్డరు & ప్రచురణ కర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం. **– ప్రచురణకర్తలు.**

ముద్రణ : **నవచేతన విజ్ఞాన సమితి ముద్రణాలయం,** హైదరాబాద్.

# మంగోలుల మహానేత

# జెంఘిజ్ ఖాన్

బాబర్ పేరు వినని భారతీయ విద్యార్థి వుండడు.

దగ్గర దగ్గర రెండు వందల సంవత్సరాలు మహా ప్రాభవంతో వెలిగిన మొగల్ సామ్రాజ్యాన్ని భారతదేశంలో స్థాపించిన బాబర్ – తండ్రి తరఫున తైమూర్ వంశంవాడు, తల్లి తరఫున జెంఘిజ్ ఖాన్ వంశంవాడు. మొగల్ లేదా మొఘల్ అనే పదమే మంగోల్ అనే దానికి ఆరబిక్ రూపం. తైమూర్ బార్లస్ తుర్కమెన్, అంచేత బాబర్ స్థాపించిన వంశాన్ని తైమూరిడ్ లేక తుర్కమెన్ వంశం అనాలని కొందరంటారు. కాని చరిత్రలో మొగల్ అనే ప్రసిద్ధమైంది.

భారతదేశ చరిత్రలో మొగల్‌గా ప్రసిద్ధమైన మంగోలు అనే పదం మానవ శాస్త్రపరంగా కాకసాయిడ్, నీగ్రాయిడ్‌లతో సమంగా మంగొలాయిడ్‌గా వ్యవహారంలో వుంది. ఆయిడ్ అంటే పోలిన అని అర్థం. మంగోలుల్ని పోలిన జాతి మంగొలాయిడ్. “పచ్చ జాతి” అని పిలిచే అన్ని రకాలకీ వర్తిస్తుంది ఇది. చైనీస్, జాపనీస్, థాయ్, మంగోలులందరికీ దీన్ని వర్తింప చెయ్యవచ్చు. ఒక జాతిని తెలియజేసే పేరుగా ఒక పదాన్ని వాడడం అంటే భాషా, సాంస్కృతిక పరమైన పోలికల కంటే శారీరక శాస్త్రపరమైన ఆనువంశిక లక్షణాల పోలికలు వుండడం బట్టే. విస్తృతార్థంలో ఇలాంటి పదాల వర్గీకరణ కిందకి తత్సంబంధమైన జనమంతా రావచ్చు. కాని అసలుకి తేల్చుకోవాలంటే మంగోలాయిడ్ అనే వర్గీకరణ కిందికి చైనీయులు, జపాన్ వాళ్లు, మంగోలియా వాళ్లు వస్తారు. ఇవాళ మంగోలియా దేశస్థులు నిర్దిష్టంగా ఈ విభజన కిందకి వచ్చే జాతిగా వున్నారు.

ఇంతటి చారిత్రక జాతి ఇవాళ అజ్ఞాతంగా వుంది, మంగోలియాని ‘అజ్ఞాత దేశం’గా పాశ్చాత్యులు వర్ణిస్తూ వుంటారు.

ఇవాళ మంగోలియా అని ప్రపంచపటంలో వున్న భూభాగంనుంచే క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దిలో హూణులు తమ మహా సామ్రాజ్యాన్ని స్థాపించారు. వాళ్ల అధికారం చైనా

మహా కుడ్యం (The Great Wall of Chaina) నుంచి బైకాల్ సరస్సుదాకా విస్తరించి వుండేది. హూణులు చైనాతోటే గాకా పర్షియాతో, రోమన్ సామ్రాజ్యంతో వ్యాపారం చేశారని నాయిమ్ ఉలా పర్వతాల సమాధుల్లో దొరికిన వస్తువులవల్ల తెలుస్తోంది. క్రీస్తుకి కొంచెం పూర్వమూ, ఆ తర్వాతి శతాబ్దాల్లోనూ మంగోలులు ప్రపంచంలో దూర ప్రాంతాలకి పోయారు. అయిదవ శతాబ్దిలో అత్తిలా నాయకత్వాన రోమన్ మహాసామ్రాజ్య సరిహద్దుల్నే తాడించారు. తూర్పున దూన్‌హు, మియాంగ్‌ను తెగలు పురోగమించి చైనామీద దండయాత్ర చేశాయి. చైనా చక్రవర్తులు ఈ దాడుల బారినుండి రక్షణ కోసం చైనా మహా కుడ్యాన్ని నిర్మించాల్సి వచ్చింది. ఇదే మధ్య యుగాలలో ప్రపంచ అద్భుతాలలో ఒకటిగా వుండేది.

హూణుల పాలన అంతమయాక మంగోలియా అనేక రాజ్యాలుగా చీలిపోయింది.

మళ్లీ మంగోలియాకి ప్రాముఖ్యం క్రీస్తు శకం పన్నెండు, పదమూడు శతాబ్దాల్లో వచ్చింది.

"హూణుల గుర్రం నడిచిన చోట, గడ్డి పరకైన మొలకెత్తదుగా" అని అత్తిలా సైన్యం ప్రపంచ విధ్వంసం చేసినప్పుడు అనుకున్నారు. దాదాపు వెయ్యేళ్ల తర్వాత అది మళ్లీ రుజువైంది. మంగోలు గుర్రాలు అప్రతిహతంగా అన్ని వేపులకీ సాగిపోయాయి.

పచ్చిక బీళ్లమీద "యుర్త్"లనే డేరాలు దింపుకుని, దిమ్మరి బతుకు గడిపే తెగ ప్రపంచాన్ని సంక్షుభితం చేసే శక్తిని యెలా సాధించుకుంది? ప్రపంచమంతా నాగరిక జీవిత విధానం – యెన్ని లొసుగులు అందులో వున్నాగానీ – సాగుతూ వుండగా, ఒట్టి కత్తి బలంతో యెదురు వచ్చిన ప్రతి దాన్నీ ఇలా తెగేసుకుంటూ పోగల శక్తి ఆ జాతికి యెలా వచ్చింది? వారి జీవిత విధానం ఏమిటి? ఇంతటి మహత్తర శక్తివంతమైన జాతిగా దాన్ని మలిచిన వాడెవ్వడు?

నగరాలన్నా, నగర విధానాలన్నా యేవగించుకునే ఆ తెగ మంగోలులు. సంచారులు అంటే ఆటవిక జాతులనీ, ఆదిమ వాసులనీ కాదు. వాళ్ల రీతిలో వాళ్ల జీవన విధానానికి ఒక పద్ధతి వుండేది. సంచార తెగలకి పశుపోషణ జీవిత విధానంగా వుంటుంది. నగరాలని, జనావాస స్థిర ప్రాంతాలని పచ్చిక బీళ్లుగా మార్చుకోవడం ఆ ఉత్పత్తి విధానానికి అవసరం. "రష్యా భూముల్ని బీళ్లుగా మార్చడంలో మంగోలులు తమ ఉత్పత్తి పద్ధతులకి అనుగుణంగానే వర్తించారు – పశుగణాన్ని పెంచడం కోసం నిర్జన మైదానాలు వుండడం మొదటి పూర్వనియమం" అన్నాడు మార్క్స్. అలా చెయ్యడం ద్వారా సాంఘికంగా, సాంస్కృతికంగా బాగా అభివృద్ధి చెందిన ఉత్పత్తి విధానాలని "మంగోలు బానిసత్వపు రక్తసిక్త బాడవ"లోకి లాగేసారనీ మార్క్స్ అన్నాడు.

సాంఘిక ఉత్పత్తి విధానంలో సహజ ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి అంతరాయం కలిగింది. అందుకనే ఆ దాడులవల్ల, కొల్లగొట్టిన సంపదవల్ల తాత్కాలికంగా లబ్ధిపొందినా తర్వాత కాలంలో ఆ గడ్డ ముందటికంటే అధ్వాన్న పరిస్థితి అనుభవించింది.

ఈ కారణం వల్లనే కావచ్చు ఈ అప్రతిహత దాడులకి కారణభూతుడూ, తిరుగులేని సైన్య నిర్మాణదక్షుడూ అయిన ఆనాటి మహా వీరుడు జెంఘిజ్ ఖాన్ పేరుని ఇవాళ మంగోలియాలో అంత మర్యాదగా చూడరట.

చైనా సముద్రంనుంచి ద్నీపర్ నదీ తీరందాకా యెదురు లేకుండా సైన్యాల్ని నడిపించిన ఆ మంగోలు మహావీరుడు జెంఘిజ్ ఖాన్. "This was the person who is known as Chengizkhan or Gengiz or Jenghiz or Jengizkhan - there are many ways of spelling it" అని నెహ్రూగారు 'Glimpses of World History' లో రాశారు.

ఈ పేరు వర్ణక్రమం యెన్ని రకాలుగా వుందో ఆ పేరున్న వాడి వ్యక్తిత్వం గురించి వేసిన అంచనాలూ అన్ని రకాలుగానే వున్నాయి. నెహ్రూగారు చెప్పిన అన్ని వర్ణక్రమాలలోనూ పుస్తకాలు కనిపిస్తాయి. (తెలుగులో – తెన్నేటిసూరి గారు “ఛంఘిజ్ ఖాన్” అని రాశారు. “దేశ చరిత్రలు” అన్న ఖండికలో శ్రీశ్రీ “జెంఘిజ్ ఖాన్” అని రాశారు. ఈ నవలా రచయిత యాన్ Jenghiz Khan అని రాయడంవల్ల, అందుకు సరిపోయేటట్టు నేనూ “జెంఘిజ్ ఖాన్”అని మహాకవి వాడిన వర్ణక్రమాన్నే వాడాను.) అసలు కచ్చితమైన మంగోలు వర్ణక్రమం ప్రకారం ‘చింగిజ్’ అని రాయాలి. ‘చెంగ్‌స్జె’ అంటే చైనా భాషలో ‘సాటిలేని యోధుడు’ అని అర్థమట. ప్రాచ్య భాషా పండితులు ‘చింగిజ్’ అనే రాస్తరట. ఇంతకీ జెంఘిజ్ ఖాన్ అనేది అసలు పేరు కాదు. అతని బిరుదు.

"Chengiz is without doubt the greatest military genius and leader in history... Alexander and Caesar seem petty before him" అని నెహ్రూగారు రాశారు.

జెంఘిజ్ ఖాన్ 1155లో పుట్టాడు. (1162 అనీ 1167 అనీ కూడా కొందరు చరిత్రకారులంటారు. మన ప్రభవ విభవ అనే అరవై సంవత్సరాల లెక్కలాగే మంగోలులకి 12 ఏండ్ల చాంద్రమాన కాలచక్రం అవడంతో కొంత గజిబిజి అవుతుంది.) తండ్రి యాసుకై భగత్తూర్. తల్లి యూలన్. యాసుకై ఆమెని యెత్తుకు వచ్చాడు. ఆమె మెర్కిట్ తండాకి చెందింది. తాతార్ నాయకుడు టెమూజిన్‌మీదకి యాసుకై దండయాత్రకి వెళ్లాడు. విజయం సాధించాడు. తిరిగి వచ్చేటప్పటికి యూలన్ మగబిడ్డని ప్రసవించిందని తెలిసింది. ఆ బిడ్డ మూసిన పిడికిల్లో ఎర్రటి కెంపులాగా యెత్తుగా రక్తం గడ్డకట్టి చిన్న ఎద్దు మూపురంలాగా వుందట. మూఢ నమ్మకాల మంగోలులకి ఇది తాతార్ నాయకుడిమీద విజయాన్ని సూచించిందట. సంతోష పారవశ్యంతో యాసుకై ఆ మగబిడ్డకి ‘టెమూజిన్’ అని ఆ పేరే పెట్టాడు. ఓడించిన శత్రువు పరాక్రమం మహిమాన్వితంగా ఆ పుట్టిన బిడ్డలో ప్రవేశిస్తుందని నమ్మకం అట. ‘టెమూజిన్’ అంటే ‘ఉక్కు మనిషి’ అని అర్థం. జెంఘిజ్ ఖాన్ కమ్మరం పని చేశాడన్న ఐతిహ్యం ఒకటుంది. అందుచేత ఈ పేరు దాన్నీ సూచించవచ్చు.

టెమూజిన్ జీవితం కష్ట భూయిష్టమైంది. సొంత కృషివల్ల జీవిత పరమపదసోపాన పటంలో నిచ్చెన లెక్కి పైకి వచ్చాడు. చతుర్విధోపాయాలనీ నేర్పుగా ప్రయోగించి పైకి వచ్చాడు. తనకి యెదురైన అవకాశాలని అనువుగా వాడుకుని పైకి వచ్చాడు.

టెమూజిన్ ఇంకా కుర్రాడిగా వున్నప్పుడే ఓగ్గిరెట్ తండాలోని బుర్టీ అనే పిల్లతో ప్రధానం అయింది. అప్పట్లో ఆచారం అయినట్టుగా ప్రధానం చేసుకున్న అత్తవారి ఇంటి దగ్గర వుండిపోయాడు. తండ్రి యాసుకైకి విషప్రయోగం జరిగి చనిపోయాడు. పోతూ పోతూ కొడుక్కి కబురు పంపి వారసుణ్ణి చేశాడు. కాని టెమూజిన్ జీవితం అప్పణ్నుంచీ బాధామయమై గడిచింది. యాసుకైకి అణిగిమణిగి వున్న చాలా తండాలు టెమూజిన్‌ని వదిలేసి స్వతంత్రించి పోయాయి. నాయిమాన్ తండావాళ్లు, కెరాయిట్ తండా వాళ్లు, మెర్కిట్ తండా వాళ్లు టెమూజిన్‌కి వ్యతిరేకంగా కుట్రలు కూహకాలు పన్నారు. బహిరంగంగా విద్వేషం ప్రకటించారు. యూలన్ కుటుంబం అడివి దుంపలు తినీ, పిట్టలు వేటాడీ బతకాల్సి వచ్చింది. పచ్చిక బీటి సంచార జీవులకి అది పరమ దరిద్ర జీవితం. టెమూజిన్ నిస్సహాయ, దరిద్ర పరిస్థితిని ఆసరా చేసుకుని శత్రుత్వం ప్రకటించిన ఆ తండాల వాళ్లు అతన్ని తరిమి తరిమి వెంటాడారు. ఒకసారి పట్టి బంధించారు కూడా. (కొంతమంది జెంఘిజ్ ఖాన్ చిన్నతనంలో బానిసగా వున్నాడని దీన్ని బట్టే అంటారు.) కాని టెమూజిన్ తప్పించుకు పారిపోయాడు. గుర్రాలని కాజెయ్యడంలో సాహసం ప్రదర్శించి సైనికుడి హోదా సంపాదించాడు. అప్పుడు తనకి ప్రధానం అయిన బుర్టీని పెళ్లి చేసుకుంటానని వెళ్లాడు. అతనికి కట్నంగా ఒక రకం అడివి జంతువు తోలుతో తయారైన అంగీని ఇచ్చారట. దాన్ని అతను యుక్తిగా వాడుకున్నాడు. దాన్ని పూర్వం తండ్రికి మిత్రుడైన తుంఘ్రిల్ ఖాన్‌కి కానుకగా ఇచ్చాడు. (ఈ తుంఘ్రిల్ ఉంక్ ఖాన్‌నే మార్కో పోలో ప్రెస్టర్ జాన్‌గా వ్యవహరించాడు) అతను కెరాయిట్ తండా పాలకుడు.

టెమూజిన్ రాజకీయ జీవితమే యుక్తిగా ఆనాటి ఆచారాల్ని వాడుకోవడంతో ఆరంభమైంది. రక్తసంబంధం తండా జీవితంలో ముఖ్యమైంది. పెళ్లిళ్లు సంబంధాలు కలుపు కోవడానికీ దారి తియ్యచ్చు, కలహాలకీ దారి తియ్యచ్చు. టెమూజిన్ తల్లినీ, టెమూజిన్ భార్యనీ యెత్తుకు రావడం జరిగింది. తల్లి తండానుంచి పిల్లని యెత్తుకు వస్తే సంధి జరిగేది.

అలాగే రక్తబంధం అనే దాన్ని "అండా" అనే ప్రమాణం తీసుకుంటే దానికీ వర్తింప చెయ్యవచ్చు. ఆ ప్రమాణం తీసుకున్న వాళ్లిద్దరూ సోదరులవుతారు. (రామాయణంలో రామ సుగ్రీవులు అగ్ని చుట్టూ ప్రదక్షిణం చేసి స్నేహం కుదుర్చుకుంటారు.) ఈ "అండా" ప్రమాణంద్వారానే టెమూజిన్ చమూగాతో సోదర బంధుత్వం కలుపుకున్నాడు. ఇద్దరూ కలిసే మంగోలు యుద్ధ శ్రేణుల్ని నడిపించారు. ఈ "అండా" సోదర బంధుత్వం కంటే ఒక మెట్టు తక్కువ "నుకూర్" సంబంధం. "నుకూర్" అంటే నేస్తం, తోడుగా వుండేవాడు. (ఇవాళ మంగోలియాలో దీన్ని "కామ్రేడ్"కి సమానార్థకంగా వాడతారు.) రక్తబంధంతో సహా అన్ని

బంధనాలనీ, అవరోధాలనీ స్నేహం కలుపుకున్న మనిషి 'నుకూర్" త్యాగం చేస్తాడు. టెమూజిన్ కింద వున్న ప్రఖ్యాత సైన్యాధిపతులలో చాలా మంది ఇలాంటి 'నుకూర్లే".

టెమూజిన్ తండ్రి చనిపోయాక బంధువులతో పోరాటాలలో నెగ్గుకొస్తూ, తాతార్లలాంటి తండాలని జయిస్తూ బహుకాలం గడపాల్సివచ్చింది. పెళ్లి నాటికి యోధుడయాడు. తన స్థానం పదిలం చేసుకోవడానికి ఇరవై ఏళ్లు పైబడి యుద్ధాలు చేస్తూనే వున్నాడు. దండయాత్రలు యాభై ఒకటవ యేట ఆరంభించాడు. అసలు ఆ వయసుకి చాలా మంది ఐహిక కామనలు తగ్గించుకుని యేదో శాంతిగా బతుకుదామనుకుంటారనీ, అలాంటిది జెంఘిజ్ ఖాన్ ఆ వయసులో దండయాత్రలారంభించడం కొంచెం ఆశ్చర్యంగా వుంటుందనీ నెహ్రూగారు రాశారు.

టెమూజిన్ "కురుల్తాయ్" అనే మంగోలుల సభని సమావేశ పరిచాడు. 1206లో ఆ సభ టెమూజిన్‌ని ఖాన్ (ఖాఖాన్)గా యెన్నుకుంది. అంటే చక్రవర్తి అని అర్థం. ఓనమ్ నదీ తీరాన ఆ సభ అతనికి "జెంఘిజ్ ఖాన్" బిరుదుని ఇచ్చింది. "సాటిలేని యోధుడనీ", "సర్వం సహాధినేత" అనీ దానికి అర్థాలట. మొత్తంమీద చక్రవర్తి అనేదే ఆ పదం. "జగజ్జేత" అనీ అర్థం వుందంటారు. చైనీయుల వాంగ్ (రాజు), హవాంగ్ (చక్రవర్తి), పర్షియన్ షా (రాజు), షాయిస్ షా (రారాజు) అనే పదాలకి సన్నిహితంగా వుండే పదం ఈ జెంఘిజ్ ఖాన్.

జెంఘిజ్ ఖాన్ రాజనీతిలో మార్గదర్శకంగా వున్న సూత్రం బహు జాగ్రత్తగా సంబంధాలు కుదుర్చుకోవడం, తను చేసేది ఒప్పు అని సమర్థనకి రంగం తయారు చేసుకుని వాటిని భగ్నం చెయ్యడం. జెంఘిజ్ ఖాన్‌కి కావలసింది తమ సంచార తెగల ఆధిపత్యం. పచ్చిక బీళ్లని, పర్వత కనుమల్ని స్వాధీనం చేసుకునే దాకా దండయాత్రలు జరిపాడు. పీకింగ్ నగరం దాకా వెళ్లాడు గాని దాన్ని ముట్టడించలేదు. కాని తర్వాత కలిగిన అపోహవల్ల మళ్లీ ముట్టడించాడు.

జెంఘిజ్ ఖాన్‌గా అతను యెన్నికయే నాటికి నాయిమాన్ ఖాన్ పోలో మంగోలు బీటిమీద శత్రువుగా మిగిలిపోయాడు. జెంఘిజ్ ఖాన్ సైన్యాలని నడిపించి పోలో సేనల్ని చెల్లాచెదురు చేసేశాడు. పోలో కుష్లాక్ మెర్కిట్ – ఖాన్ టోటోతో కలిసి ఇర్తిష్ నదీ తీరానికి పారిపోయాడు.

జెంఘిజ్ ఉత్తరచైనాని చేజిక్కించుకున్న కిన్‌తాతార్ల సామ్రాజ్యంమీద దాడిచేశాడు. మొదట్లో హియామీద దాడి చేసే బలమైన స్థావరాలని చాలా పట్టుకున్నాడు. 1208లో లూంగ్ టింగ్‌కి వెళ్లాడు. పీఠభూముల వేడి తట్టుకోలేకనే వెళ్లాడు. కాని టోటో, కుష్లాక్‌లు యుద్ధ సన్నాహాలు చేసుకుంటున్నారన్న వార్త అక్కడుండగా చేరింది. ఇర్తిష్ నదీ తీరాన ముఖాముఖీ జరిగిన పోరులో వాళ్లని చిత్తుగా ఓడించేశాడు. టోటో చచ్చిపోయాడు. కుష్లాక్ శరణు శరణంటూ ఖితాన్ తాతార్ల దగ్గరికి పోయాడు. మళ్లీ హియాకి సేనల్ని నడిపించి కిన్ సైన్యాన్ని ఓడించాడు.

చైనా మహా కుడ్యంలో వులియాంగ్ హై కనుమని స్వాధీనం చేసుకుని లోపలికి నింగ్సియాపూ దాకా చొచ్చుకు వెళ్లాడు. అడుగడుగునా జెంఘిజ్ ఖాన్‌కి విజయం లభిస్తూ వుండడంతోటి చాలా మంది కిన్ సైన్యాధిపతులు తమ రాజుకి సలాం కొట్టేసి జెంఘిజ్ ఖాన్ పక్షంలో చేరిపోయారు. చైనా మహా కుడ్యంలో భద్రమైన స్థానం సంపాదించాక సామ్రాజ్యాన్ని తుడిచిపెట్టమని 1213లో జెంఘిజ్ ఖాన్ సైన్యాల్ని పంపాడు. మూడు విభాగాలుగా పంపాడు. జెంఘిజ్ ఖాన్ స్వయంగా ఒక విభాగానికి ఆధిపత్యం వహించాడు. యెక్కడికెళ్లినా విజయలక్ష్మి దండపుచ్చుకుని యెదురొచ్చింది. యెన్‌కింగ్ (ఈనాటి పీకింగ్ లేదా బీజింగ్) తప్ప పచ్చ నదికి ఉత్తరాన అంతా అతని వశం అయిపోయింది. జెంఘిజ్ ఖాన్‌కి మంగోలు పచ్చిక బీళ్లకి వెళ్లిపోవాలనే కోరిక. అంచేత శాంతి షరతులతో కిన్ చక్రవర్తికి వర్తమానం పంపాడు. మహా ఆతృతగా అతనా షరతుల్ని అంగీకరించాడు. జెంఘిజ్ ఖాన్‌కి అనేక కానుకలు ఇచ్చాడు. కాని జెంఘిజ్ ఖాన్ చైనా మహా కుడ్యం దాటగానే తన రాజధానిని హోసన్‌లోని కాయ్ ఫెంగ్‌కి మార్చాడు. మంగోలు సరిహద్దుకి మరీ దగ్గరగా వుంటే మళ్లీ దాడి జరుగుతుందని భయపడి అలా చేశాడు. రాజధానిని అలా మార్చడంతోటి జెంఘిజ్ ఖాన్‌కి శత్రుత్వ భావం కనిపించి ఆగ్రహం వచ్చింది. మళ్లీ సైన్యాల్ని వెనక్కి నడిపించాడు.

జెంఘిజ్ ఖాన్ చైనా దండయాత్రలో వుండగా నాయిమాన్ నాయకుడు కుష్లాక్ చెదిరిపోయిన తన సేనల్ని కూడదీసుకుందుకు ఖీతాన్ ఖాన్‌ని అనుమతీ అడిగాడు. కూడ దీసుకున్నాక ఖోరెస్మ్ షా మహమ్మద్‌తో కలిసి కుట్రపన్ని తనని నమ్మి ఆశ్రయం ఇచ్చిన ఖీతాన్ ఖాన్‌కి ద్రోహం చేశాడు. పాపం అతను తన రాజ్యాన్ని ఈ ద్రోహి అతిథికి వదిలిపెట్టాల్సి వచ్చింది. కుష్లాక్ మంగోలులమీద దాడి చెయ్యడానికి తయారయ్యాడు. జెంఘిజ్ ఖాన్ తక్షణం రణభూమికి వచ్చి కుష్లాక్ ఖాన్ సేనల్ని మట్టికరిపించి, అతన్ని బందీ చేశాడు. జెంఘిజ్ ఖాన్‌కి ఖోరెస్మ్ సరిహద్దుదాకా ఆధిపత్యం వచ్చింది. అతనికి దాన్ని దాటి అటుపోవాలనీ వెంటనే అనిపించలేదు. తమ తమ ప్రజల మధ్య వ్యాపార సంబంధాలు బాగుండాలని కోరుతున్నట్టు మహమ్మద్ షాకి రాయబారుల్ని పంపాడు. మహమ్మద్ షా అందుకు అనుకూలంగానే వున్నాడు. కాని ఒక అపశకునం యెదురైంది. లేకపోతే జెంఘిజ్ ఖాన్ యూరప్‌మీదకి వచ్చేవాడే కాదంటారు. జెంఘిజ్ ఖాన్ వర్తకుల బృందాన్ని పంపాడు. ఓర్రార్ పాలెగాడు ఇవాల్‌చిక్ వాళ్లని బంధించాడు. హతం చేశాడు. ఆ పాలెగాణ్ణి శిక్షించమని జెంఘిజ్ ఖాన్ మహమ్మద్ షాని అధికారికంగా అడిగాడు. షా అలా చెయ్యకుండా ఆ వచ్చిన దూతల నాయకుడి తల ఖండించాడు. మిగిలిన వాళ్లకి గడ్డాలు కత్తిరించి పంపాడు. ఇక యుద్ధం తప్పలేదు. 1219లో జెంఘిజ్ ఖాన్ దండయాత్రకి బయల్దేరాడు. ఈ నవల్లో ఆ దండయాత్రల గాథ అంతా వుంది.

జెంఘిజ్ ఖాన్ పడమటి చైనా దాడిలో పాల్గోవడమే అతని కడపటి వ్యూహం. తంగుట్ రాజ్యం పచ్చ నదికి అటూ ఇటూ వ్యాపించి వుంది. చైనాకి పోయే దారికి అది ఆటంకంగా వుంది. అంచేత దాడి సన్నాహం చేశాడు. కాని సైహున్ నది కానుష్ దాటి ఇంకా వెళ్లక ముందే జబ్బు చేసింది. 1227లో చనిపోయాడు. కాని అతను చనిపోయాడన్న వార్తని చాలా రహస్యంగా వుంచారు. మృత కాయాన్ని కెరులెన్ నదీ తీరానికి తీసికెళ్లేంతవరకూ దారిలో కనిపించిన ప్రతి పరాయి వాణ్ణీ చంపేశారు. రహస్యం దాచడం కోసమని. జెంఘిజ్ ఖాన్ని కిలియన్ లోయలో ఖననం చేశారు.

జెంఘిజ్ ఖాన్ కోరిక మేరకి ఉగేదీయ్ వారసుడయ్యాడు.

ఊరూ పేరూలేని ఒక చిన్న మంగోలు తెగ నాయకుడికి పుట్టి, బాల్యంలో అష్టకష్టాలూ పడి, ప్రపంచాన్ని గజగజలాడించిన, దండయాత్రలు చేసిన వాడు జెంఘిజ్ ఖాన్.

జెంఘిజ్ ఖాన్ అంటే ముస్లిం పేరు అనిపించవచ్చు. కాని అది మంగోలు పేరు. జెంఘిజ్ ఖాన్ మతం షామానిజం. భూత ప్రేత పిశాచాలని వశం చేసుకుని శక్తులు సంపాదించవచ్చునే నమ్మకం వున్న మతం. ఆదిమ తెగల్లో ప్రబలంగా వుండే మతమే ఇది. తాంత్రిక పరమైన హంగులన్నీ వుంటాయి. 'షామాన్' మతాధిపతిగా వుంటాడు. ఈ 'షామాన్'– తండాకి వైద్యుడూ, భూత వైద్యుడూ కూడానూ. మూఢ నమ్మకం అనే దానికి సాకార రూపం ఇది. జెంఘిజ్ ఖాన్ కాలంలో షామానిజమే వుండేది. జెంఘిజ్ ఖాన్ మనవడు కుబ్లా ఖాన్ కాలంలో లామాయిజాన్ని టిబెట్నుంచి తీసుకొచ్చాడు. మొదట కుబ్లా ఖాన్ రోమ్ నగరంనుంచి క్రైస్తవ బోధకుల్ని తీసుకొచ్చి క్రైస్తవమతం ప్రవేశ పెట్టాలనుకున్నాడు. కాని ఆ ప్రయత్నం సఫలమవలేదు. దరిమిలా లామాయిజం వచ్చింది. మంగోలియా చరిత్రలో లామాయిజం చాలా పాత్ర వహించింది. పాలకులు లేనప్పుడు లామాలే పాలించారు. మొత్తంమీద మంగోలు ప్రజలని మౌఢ్యంలో వుంచడానికి షామానిజం, లామాయిజం ఒక్కలాగే ప్రవర్తించాయి.

జెంఘిజ్ ఖాన్ మాత్రం తన సామ్రాజ్యంలో మత స్వేచ్ఛని ఇచ్చాడు. "జాస్సో" అనే పేరు వున్న రాజ్యాంగాన్ని తయారుచేశాడు. ప్రజలు యెలా మసలుకోవాల్సిందీ (వారానికి మూడు సార్లే మత్తు పానీయాలు తాగడంలాంటి నియమాలు!) పన్నులు వగైరాల వివరాలూ మొదలైన నియమావళి అందులో వుందట. ఇది ప్రస్తుతం అలభ్యం అంటారు.

నగరజీవిత విధానంమీద సంచార జీవిత విధాన ఆధిక్యత జెంఘిజ్ ఖాన్ చూపించ దలచుకున్నాడు. తాము జయించిన ప్రాంతాలనుంచి కప్పం రాబట్టుకుంటూ తాము పచ్చిక బీళ్లమీదనే వుండాలని అనుకున్నాడు. వ్యవస్థాపరంగా యెక్కువ అభివృద్ధి చెందిన నగర

నాగరికత వున్నప్పుడు జెంఘిజ్ ఖాన్ చేసినలాంటి ప్రయత్నాలు నెరవేరవు.

జెంఘిజ్ ఖాన్ నిరక్షరాస్యుడు. అసలు లిపి అనేది ఒకటి వుందని కూడా తెలీదు. అంచేత నోటి మాటగానే దౌత్యాలు, ఆజ్ఞలు, వ్యవహారాలు నడిచేవి. కాని లిపి అనేది ఒకటి వుందని తెలిశాక దాని విలువని గుర్తించాడు జెంఘిజ్ ఖాన్. దాన్ని వాడుకోవడానికి యేర్పాట్లు చేశాడు.

జెంఘిజ్ ఖాన్ యేదో అనాగరిక తండాలో మహా తెలివైన వాడవడం మూలంగానే ప్రపంచాన్ని గజగజలాడించే దండయాత్రలు చేశాడని కాదు. తండా రాజకీయాల్లో మహా నేర్పరి. ఆ అంతరంగిక దౌత్య నీతి బాగా తెలిసిన వాడు.

జెంఘిజ్ ఖాన్‌ని వ్యక్తిగా పరస్పర విరుద్ధ అంచనాలు వేశారు. నెహ్రూ గారి లాంటివాడు. "This man fascinates me" అన్నాడు. ఏడు వందల సంవత్సరాల తర్వాత, “దేవుడి శాపం”గా వచ్చిన వాడని పర్షియన్లు, తురుష్కులు పాశ్చాత్య చరిత్రకారులు “కీర్తించిన” జెంఘిజ్ ఖాన్‌కి నెహ్రూగారు చాలా గౌరవం ఇచ్చారు.

*యెన్ని పరస్పర విరుద్ధ అభిప్రాయాలు యెంతమంది వ్యక్తం చేసినా*
*‘జెంఘిజ్ ఖాన్’ మహావీరుడన్న విషయాన్ని యెవళ్లూ విస్మరించలేదు.*
*అలాంటి వాడు మంగోలుల మహానేత జెంఘిజ్ ఖాన్.*

- ఆర్వియార్

# పాఠకులకి సలామ్!

నింగిలో డేగకి రెక్కల్లేకపోతే శక్తి లేదు. నేలమీద మనిషికి గుర్రం లేకపోతే బలం లేదు.

ప్రతిదానికీ దాని కారణం వుంటుంది. తాటికి మొదలు వుంటే తుద వుంటుంది. ప్రపంచ మహత్తర పథంమీద పోయే బాటసారి సరియైన దారి పట్టుకుంటే లక్ష్యం అందుకుంటాడు. కాని ఒక్క తప్పు దారి లేక అజాగ్రత్త – చాలు, అతను గ్రహచారం మూడిన గహనాటవిలో తప్పిపోయినట్టే.

మనిషికి యేదేనా అసాధారణ విషయం తటస్థ పడితే – ఓ నగరం అదృశ్యం అయిపోయే, ఓ అగ్ని పర్వతం పేలుడు, ఓ సర్వశక్తిమంతుడైన పాలకుడిమీద తాడిత ప్రజానీకం తిరుగుబాటు చెయ్యడం, లేదా నోటితో అనుకోలేని అనాగరిక జాతితన మాతృ దేశంమీద దురాక్రమణ దాడి చెయ్యడం: ఇలాంటి విషయాన్ని మనిషి చూస్తే కాగితంమీద పెట్టెయ్యాలి. ఒకవేళ తనకి గనక రాసే అలవాటు లేకపోతే అతను తన కథని ఓ చెయ్యి తిరిగిన రచయితకి చెప్పాలి, అతను దాన్ని భవిష్యత్తరాల కోసం నగిషీ మాటలలో నిలుపుతాడు. మహత్తర విషయాలు దర్శించి వాటిని నిశ్శబ్దంగా దాచుకునే వాడు – మృత్యువు శీతహస్తం అప్పటికే అతని భుజం తడుతున్నప్పుడు విలువైన వస్తువుల్ని యెవ్వరికీ తెలియని ఓ యేకాంత స్థలంలో కప్పెట్టి దాచుకునే పిసినారి లాంటి వాడు.

కాని నేను కలం సిద్ధం చేసుకుని సిరాలో ముంచి సందేహంలో పడ్డాను, ఆలోచనలో మునిగిపోయాను. నిర్దాక్షిణ్యంగా దేశదేశాల్ని నాశనం చేసిన జెంఘిజ్ ఖాన్‌ని, అతని బర్బర సైన్యాల్ని కళ్లకు కట్టినట్టు చిత్రించే మాటలు నాకున్నాయా? నాకా శక్తి వుందా? ఉత్తర ప్రాంతపు ఎడారులనుంచి ఈ ఆటవిక సమూహాలు చేస్తూ వచ్చిన దండయాత్రలు భయంకరమైన సంఘటన. అలుపెరుగని అశ్వాలమీద ప్రశాంత మవరాన్నహర్, ఖోరెస్మ్ లోయలనుంచి

అప్రతిహతంగా ఉరకలు పెడుతూ, తమ అగ్రభాగాన జేగురుగడ్డం నాయకుడు వుండగా, తమ వెనక ఖండించిన చీల్చిన మృత కళేబరాలని అసంఖ్యాకంగా వదిలిపెడుతూ ఈ మూకలు పోతూవుంటే మనుషులు ఒకళ్ల కళ్లు ఇంకొకళ్ళు చూస్తూ మళ్లీ యెన్నటికైనా దగ్ధమైన గ్రామాల పొగలు కమ్మి మసకైపోయిన ఈ ఆకాశాన్ని చూస్తామా లేదా ఇప్పటికే ప్రపంచ ప్రళయం చేరుకున్నామా అని ప్రశ్నించుకున్న సంఘటన అది.

మంగోలుల దండయాత్రల గురించీ, జెంఘిజ్ ఖాన్‌ని గురించి నేను తెలుసుకున్న వాటినీ, విన్న వాటినీ చెప్పమని చాలా మంది నన్ను అడిగారు. నేను చాలా కాలం సందేహించాను. మౌనంగా వుండడంలో ఉపయోగం లేదని ఇప్పుడు నేను గ్రహించాను. ప్రపంచంలో యెన్నడూ కనీవినీ యెరుగని ఆ ఘోర విపత్తుని గురించి చెప్పాలనే నిర్ణయించుకున్నాను. అది సర్వ మానవాళినీ కమ్మేసింది. ముఖ్యంగా ఈ క్షేత్రాలని కమ్మింది, పీడిత దురదృష్ట ఖోరెస్మ్.

ఇక్కడ నేను ఆపాలి; నేను చెప్పింది చాలు. నేను వర్ణించింది అంతా నిజంగా జరిగిందని వృద్ధులు సాక్ష్యం చెప్తారు.

ఓపిగ్గా నాతో చివరిదాకా రండి. మీకే తెలుస్తుంది. జ్ఞానం అన్వేషించే వాడికి అది లభ్యమవుతుంది.

# విషయసూచిక

## ప్రథమ ఖండం

**మహత్తర ఖోరెస్మ్‌లో అంతా ప్రశాంతం**

***మొదటి భాగం***


| | |
|---|---|
| దర్వీష్ అంగీ వేసుకుని స్వర్ణశ్యేనం | **19** |
| దిమ్మరి గుడారంలో | **24** |
| పచ్చిక బీటి రౌతు | **28** |
| హాకిమ్ న్యాయం చేస్తాడు | **33** |
| మమతల దేహాళి | **37** |
| షాగారి రాయసగాడు | **41** |


***రెండవ భాగం***


| | |
|---|---|
| శక్తివంతుడూ, భయంకరుడూ ఖోరెస్మ్ షా ప్రాసాదంలో ప్రభాతం | **49** |
| మహా సికందర్‌కి 'న్యూబా' | **55** |
| ఉగ్ర అధినేత | **60** |
| నీడని కుట్టడం | **64** |
| వితరణ | **68** |
| సుల్తానా తుర్కాన్ ఖాతూన్ చేసిన కుట్ర | **73** |
| జనానా బందీ | **79** |
| "దుఃఖ దూత" సంతోషాన్ని తేవచ్చు | **83** |
| వారసత్వం తప్పిపోయిన వాడి తోటలో | **90** |

***మూడవ భాగం***

ఇర్గిజ్ నదీ తీర యుద్ధం
సైన్యం కిప్‌చాక్ పచ్చిక మైదానాలమీదకి వెళ్లడం 99
పరాయి తండాతో పోరు 106

***నాల్గవ భాగం***

సరిహద్దుల్లో శత్రువులు
మంగోలు సైన్యం సమాయత్తం అవుతోంది 115
ప్రాచ్య పాలకుడి దౌత్య కార్యాలయం 117
రాయబారీ, షా అర్ధరాత్రి కలుసుకోవడం 121
జెంఘిజ్ ఖాన్ గురించి రాయబారి చెప్పిన విషయం 124
ఘనమైన ఖాఖాన్‌కి నివేదిక 130
జెంఘిజ్ ఖాన్ నిద్రలేని రాత్రి 133
కూలన్ ఖాతూన్ యుర్త్‌లో 136
ఖాఖాన్ వేళ్లతో లెక్క పెట్టడం 140
తప్పిపోయిన బిడారు 143
రాయబారికి హాని చెయ్యకూడదు 145
జెంఘిజ్ ఖాన్ ఆగ్రహం 147
ఉత్తరం రాయడం యెలా 151

***అయిదవ భాగం***

అజ్ఞాత ప్రజల దాడి
తనని తాను రక్షించుకోలేని వాడు చనిపోతాడు 156
కుర్బాన్ కిజిక్ సైనికుడవడం 161
యుద్ధం వచ్చింది 165
సైనికుడి రక్ష కత్తిమొన 169
లొంగని తైమూర్ మాలిక్ 173
మంగోలులు ఇసక తిప్పలు దాటతారు 176
బుఖారా ముట్టడి 178
పోరాటం లేకుండా బుఖారా లొంగిపోతుంది 183
కెరులెన్ పచ్చిక మైదానాలు యెంత బాగున్నాయి! 187

## రెండవ ఖండం


**మంగోలు నియంత్రుత్వం కింద** 195

***మొదటి భాగం***

తుఫాన్ వూడ్చిన ఖోరెస్మ్
ఆయుధాలు విసర్జించిన వాళ్లకి వినాశనం! 197

నగర వృద్ధులు సమర్‌కండ్‌కి ద్రోహం చెయ్యడం 201

ఖోరెస్మ్ షాకి ఆశ్రయం దొరకదు 205

అబెస్కున్ సముద్రంలో ద్వీపం 209

కుర్బాన్ కిజిక్ ఇంటికి బయల్దేరడం 214

కుర్బాన్ కుటుంబంకోసం వెదకడం 218

మాతృశ్రీ సుల్తానా తుర్కాన్ ఖాతూన్ పారిపోవడం 221

***రెండవ భాగం***

మహా ఖోరెస్మ్ కడపటి దినాలు
జలాలుద్దీన్ జెంఘిజ్ ఖాన్‌ని యుద్ధానికి రమ్మనడం 224

సింధు నదీ తీర యుద్ధం 228

హాజీ రహీమ్ రాయసకాడు అవడం 230

నల్ల బట్టల రౌతు 233

హాజీ రహీమ్ చెప్పిన కథ 237

జెంఘిజ్ ఖాన్ ముగ్గురు కొడుకులు గుర్‌గంజ్
గురించి పోట్లాడుకోవడం 244

కథ ముగింపు తెలుసుకోవడానికి కార కోంచర్ బయల్దేరడం 247

గుర్‌గంజ్‌ని పట్టుకోవాలంటే – దాన్ని ధ్వంసం చెయ్యాలి 252

“శాశ్వత విస్మృత శిఖరం”లో కార కోంచర్ 255

యువ బటూ ఖాన్ దగ్గర హాజీ రహీమ్ 260

***మూడవ భాగం***

కల్క నదీ తీర యుద్ధం

జెంఘిజ్ ఖాన్ శాసనం
"మహానేత"కి నివేదిక 264
కడపటి సముద్రం కోసం వెతకడం 270
ఆలన్‌ల, కిప్‌చాక్‌ల దేశంలో 272
కల్కా నదీ తీరాన తాతార్ శిబిరంలో 276
దిమ్మరి ప్లోస్కిన్యాని తాతార్లు పట్టుకోవడం 279
కీయెవ్‌లో ప్రమాద సూచన 283
సుబుదై భగతూర్ పథకం 294
ద్నీపర్ నదీ తీరంలో మంగోలులు 297
రష్యన్లూ కిప్‌చాక్‌లూ పచ్చిక బీటిమీదకి రావడం 300
తాతార్ ఉచ్చు 304
సుబుదై భగతూర్ యుద్ధానికి తయారవడం 306
యుద్ధం ఆరంభమవడం 311
"భయంకర, విపత్కర ప్రళయం..." 315
ప్రాణావశిష్టులమీద తాతార్ విందు 320

## *నాల్గవ భాగం*

జెంఘిజ్ ఖాన్ మరణం
గుర్రాలు యిళ్ల దారి పట్టాలని జెంఘిజ్ ఖాన్ ఆదేశం 324
జెంఘిజ్ ఖాన్‌కీ రుషికీ ఉత్తరాలు 328
నన్ను అమరుణ్ణి చెయ్యి! 331
మంగోలులు తమ సొంత స్థావరానికి పోవడం 336
దండయాత్రలో చనిపోవాలని జెంఘిజ్ ఖాన్ నిర్ణయం 338

## *ఉపసంహారం*

మంగోలుల జాడ 346
సమ్మర్దంగా వుండే సమర్‌కండ్ యెక్కడ? 350
ఇనప బోనులో 353
పుస్తకం ఆఖరి పుట 356

# ప్రథమ ఖండం

## మహత్తర ఖోరెస్మ్‌లో అంతా ప్రశాంతం



**మొదటి భాగం**

# దర్వీష్ అంగీ వేసుకుని

## స్వర్ణశ్యేనం

"మనం నివశిస్తూ వున్న ఈ భూమి
యెండకి వెలిసిపోయి కింద పరిచిన పాత
అంగీలాంటిది. అన్ని వేపులా అనంత సముద్రాలు
తాకుతూ వున్న ద్వీపం ఇది.
(పాత ఆరబ్‌పాత్య గ్రంథం)

కారకూమ్ విశాల మైదానంమీద బావురుమంటూ వుండే ఇసక తిన్నెలు. వసంత రుతు ఆరంభంలో అకాలంగా మంచు తుఫాన్ వీస్తోంది. గాలి ఆగ్రహంగా అక్కడా ఇక్కడా వంకరగా వున్న పొదల్ని చూసి, వంచేస్తోంది. ఆ ఇసక తిన్నెమీద యెలాగో తలెత్తిన పొదలవి. నేలమీద తెల్లని మంచు తరకలు సుళ్లు తిరుగుతున్నాయి. ఓ మట్టి గుడిసె గోడకి చేర్లబడి పన్నెండు ఒంటెలు ముడుచుకుపోయి వున్నాయి. ఆ గుడిసెకప్పు గుమ్మటంలాగా వుంది. ఈ బిడారులోని మనుషులేమయిరు చెప్మా? రౌతులు ఆ పెద్ద పెద్ద మూటల్ని దింపి నేలమీద పెట్టారుగాదేం?

ఆ ఒంటెలు మంచు కమ్మిన కేశభూయిష్టమైన తలల్ని పైకి యెత్తాయి. వాటి విచారభరిత రోదన గాలి రొజతో కలిసిపోతోంది. దూరంలో ఓ గంట గణగణ మోగింది. ఆ ఒంటెలు తమ తలల్ని అటు తిప్పాయి. ఓ నల్లని గాడిద కనిపించింది. దాని వెనక, తోక పట్టుకు వేలాడుతూ ఓ గడ్డం మనిషి ఈడ్చుకుంటూ వస్తున్నాడు. అతనికి పొడుగాటి పెద్ద అంగీ, దర్వీష్*లు పెట్టుకునే కూచి కుళ్లాయి వున్నాయి. మక్కా దర్శించివచ్చిన యాత్రీకుడని సచించే తెల్లటి శిరోవేష్టనం వుంది.

---

* దర్వీష్ – ఐచ్ఛికంగా పేదరికాన్ని అనుభవించే సన్యాసుల శాఖ. వాళ్లు ప్రత్యేక తరహా ఉడుపులు వేసుకునేవారు. వాటికి బీదరిక చిహ్నం గోచరింపచేసే మాసికలు తగిలించుకునేవారు. దట్టీతో కట్టుకునేవారు. వాళ్లు బృందాలుగా ఒక సమాజంగా వుండేవాళ్లు. వాళ్లకి పైన అధిపతి వుండేవాడు. ఐహికసుఖాల కాంక్షలేని సన్యాసులు వీళ్లు. దర్వీష్‌లలో తత్వవేత్తలు, పండితులు, కవులు శాస్త్రవేత్తలు అనేకమంది ప్రఖ్యాతులైన వాళ్లు వున్నారు.

"పద, పద నా బెకిర్! మరి కాసిని అడుగులు, నీకు గడ్డి బహుమతీ దొరుకుతుంది. చూడు నా పాత నేస్తం, బెకిర్, చూడు మనకేం దొరికిందో! ఒంటెలున్నాయీ అంటే మనుషులున్నారన్న మాట; నెగడు రాజేసే నౌకర్లున్నారన్న మాట. ఓ నెగడు చుట్టూ రెండు పుంజీల మనుషులున్నారంటే కాస్త వేడి అన్నం ఓ ఒంటరి పధికుడికి పెట్టడానికి మొహం చూడరు. ఏమండోయ్ యెవరక్కడ! నిజమైన భక్తులు! మాట్లాడండి!"

జవాబు రాలేదు. ముఖ్యమైన ఒంటె మెళ్లో వున్న గంట మంద్రంగా మోగిందతే.

మంచు కమ్ముకుపోయిన ఆ యాత్రీకుడు తన గాడిదని ముందుకు తోలుతూ కురచ మట్టి గోడలున్న ఆ చిన్న ఇంటి చుట్టూ మెల్లిగా ప్రదక్షిణం చేశాడు. సున్నితమైన లతలు చెక్కిన గుమ్మం ఓ కర్ర అడ్డంతో బోటు పెట్టి వుంది. ఆ ఇంటి వెనక్కాల ఇసిక దిబ్బలతో చుట్టిన చిన్న జాగాలో కొన్ని సమాధులు నిశ్శబ్దంగా వరసలు తీరివున్నాయి. శ్రమపడి పెట్టిన నలుపు తెలుపు గులకరాళ్ల ముగ్గులు వాటికి వున్నాయి.

"శాశ్వత నిద్రలో వున్న మీకు బాగ్దాద్ నుండి వచ్చిన దర్వీష్ హాజీ రహీమ్ ప్రణమిల్లుతున్నాడు. ఈ ప్రశాంతమైన లోయలో నివశించిన గౌరవనీయులారా" అంటూ గొణిగాడా యాత్రీకుడు, రెల్లు ఉల్లడకిందనుంచి ఆ గాడిద కళ్లేన్ని కడుతూ. "యీ నిశ్శబ్ద సమాధుల కాపలాదారెక్కడ? బహుశా లోపల వున్నాడేమో" అనుకున్నాడు.

రంగురంగుల దాణా సంచీలోకి కొంచెం రొట్టెని పొడిచేసి రాల్చి, దాన్ని ఆ దర్వీష్ గాడిద మెళ్లో వేలాడదీశాడు.

"నీ కోసం, నమ్మకమైన నేస్తం, మనకి మిగిలిన ఆఖరి తిండి తునకలు. నీకిది కావాలి. ఈ రాత్రికి మనం కొరడు గట్టి బిగుసుకుపోకుండా వుంటే రేపు నన్ను మరింకొంచెం దూరం తీసుకుపోదువు గాని. అరేబియా పుణ్యభూమి ఖర్జురం చెట్ల కింద గడిపిన వేడి రోజుల స్మృతులతో వెచ్చబరుచుకుంటాను నన్ను నేను".

ఆ దర్వీష్ కర్రని తోసేసి తలుపు తెరిచాడు. గుడిసె మధ్యలో, నెగడు మండుతూ వెలుతురూ ప్రకాశించవలసి వున్న చోట, ఆరిన బొగ్గు తునకలు ఇసకతో కప్పి వున్నాయి. గుమ్మటంలా వున్న కప్పు కోసుగా పైకి వుంది. అక్కడ ఒక కంత వుంది, పొగ బయటికి పోవడానికి. గోడకి చేర్ల బడి నలుగురు మనుషులు కూర్చున్నారు.

"శాంతి, అభ్యుదయం, సుఖం" అన్నాడు దర్వీష్ యెవళ్లూ జవాబివ్వలేదు. అతను ఒకడుగు ముందుకు వేశాడు. అచల నిశ్శబ్దం, అక్కడ తిష్టవేసిన ఆకారాల పాలిన వదనాలు హఠాత్తుగా అతన్ని భయకంపితుణ్ణి చేశాయి. అతను హడావుడి పడి, తిరిగి బయటికి వచ్చాడు.

"హాజీ రహీమ్ నీదీ అదృష్టం! నాలుగు మృత శరీరాలు ప్రేత వస్త్ర ఆచ్ఛాదన కోసం నిరీక్షిస్తున్నాయి. నువ్వు దుర్బలంగా, ఆకలితో వున్నావు, కాని ప్రపంచపు అనంత జాడల్లో నీ

దారిన పోయే శక్తి ఇంకా నీకు వుంది. ఇక్కడ మొత్తం ఒక బిడారంతా అనాథ అయిపోయింది. నేను గనక చెయ్యి చాస్తే సంపదలతో నిండిన ఈ ఒంటెలు నావే అవుతాయి. కాని ఒక సత్యాన్వేషికి, దర్వీష్‌కి కోరికలుండవు. అతను భిక్షుకుడు, తన దారిన పోతాడు, అరబ్బీపాట పాడుకుంటూ. కాని ఈ జంతువుల పట్ల జాలి చూపించాలి యెవరైనా...”

ఆ దర్వీష్ ఒంటెల దగ్గరికి వెళ్లాడు. వాటి పలుపు తాళ్లు విప్పాడు. కాళ్లు వాల్చుకోవడానికి జాగా వుండేటట్టుగా వాటిని ఇంకో సారి ఒక వరసలో సర్దాడు. బస్తాలు తడిమాడు. ఓ బార్లీ మూట కనిపించింది. ప్రతీ ఒంటె ముందూ తలా కాస్తా గుట్ట పోశాడు.

“హాజీ రహీమ్ తన జీవితంలో యేదన్నా మంచి పని చేశాడా అని యెవళ్లన్నా అడిగితే ఈ జంతువులు ముక్త కంఠంతో పాడతాయి: ‘ఈ మంచు తుఫాన్‌లో ఈ దర్వీష్ మాకు తిండి పెట్టాడు, మేం చలికి బిగిసిపోకుండా బతికాం’ ”.

ఆ రాత్రంతా రెల్లు మోపుమీద గాడిదకి తాసిపెట్టుకుని ఆ దర్వీష్ పడుకున్నాడు. కాళ్లని లోపలకి ముడుచుకుని ఆ గాడిద నిశ్చింతగా కలలగంది. ఉదయం వేళకి హోరుగాలి మణిగింది. మేఘాలు చెదిరిపోయాయి. సూర్యకాంతితో తూర్పు దిక్కు వెలిగింది.

సమాధుల మధ్య ఓ ఎర్రటి వెలుతురు కనిపించి దర్వీష్ లేచాడు. ఒక్క ఉదుట్న నిలబడ్డాడు. “పదపోదాం, బెకిర్! మనం ఇంకా ప్రయాణం చెయ్యాలి”.

బార్లీ మిగిలి వున్న మూటని గాడిదమీద కెత్తి, దర్వీష్ ఆఖరి సారి గుడిసెలోకి చూశాడు. గోడకి చేర్లబడి వుండాల్సిన నలుగురి బదులుగా ఇప్పుడు ఇక్కడే వున్నాడు. అలా తేరిపార తెరుచుకున్న అతని జేగురు రంగు కళ్లు అచలంగా, అనిమేషంగా అలా వుండిపోయాయి.

“మిగిలిన శవాలు యేమయ్యాయి? సమాధుల్లోకి పోయివుండవు కదా? – లేదు, ఇది హాజీ రీహీమ్‌కి తగ్గ చోటు కాదు! మనం ఖోరెస్మ్‌కి* పోదాంపద, అక్కడ హాయిగా వున్న మనుషులుంటారు. వాళ్లు పాలలాగా తేనెలాగా తాజాగా వున్న పండితుల చర్చల గురించి చెప్తారు”.

“నన్ను రక్షించు భక్తాగ్రగణ్యా!” అంటూ ఒక బొంగురు కంఠం గొణిగింది. తిష్టవేసి కూచున్న ఆకారపు ఉంగరాల గడ్డం కొంచెంగా కదిలింది.

“ఎవరు నువ్వు?”

మహమ్మద్‌ని”.

“నువ్వు ఖోరెస్మ్ నుండి వస్తున్నావా?”

“నా దగ్గర స్వర్ణశ్యేనం వుంది”.

---

* ఖోరెస్మ్ – ఇస్లామిక్ సామ్రాజ్యం. 13వ శతాబ్దంలో అది ఆరల్ సముద్రం నుంచి పర్షియన్ సింధు శాఖ దాకా విస్తారమైన భూభాగంమీద వ్యాపించి వుండేది.

"ఓ" అంటూ ఆశ్చర్యంగా ఆ దర్వీష్ అరిచాడు. "నిజమైన భక్తుడే మృత్యు సమయంలో స్వర్ణశ్యేనాన్ని గురించి అనుకుంటాడు... తాగు!"

ఆ క్షతగాత్రుడు ఆ దర్వీష్ తాబేటి కాయలోనుంచి కొన్ని చుక్కలు తాగాడు. చంచలంగా వున్న చూపు దర్వీష్ మీద నిలిచింది.

"నన్ను తీవ్రంగా గాయపరిచారు... కార కోంచర్ దుండగులు.... మా నేస్తాలు ముగ్గురు మృత్యు ముఖంలో పడ్డారు. తలుపు మూసేశారు. బయట పడలేకపోయాం. భక్తవరేణ్యా! నువ్వు గనక ఒక భక్తుణ్ణి వదిలిపెట్టేస్తే అది హత్య చేసినంత పాపం. పవిత్ర గ్రంథంలో అలా అనే వుంది". అతని పళ్లు జ్వరంతో వజవజ వణికాయి. అర్థిస్తున్నట్టుగా అతని చెయ్యి దర్వీష్ కేసి చాచుకుని వాలిపోయింది. నిస్సహాయంగా అతను పక్కకి ఒరిగిపోయాడు.

ఆ క్షతగాత్రుడి గొర్రెతోలు కోటుని హాజీ రహీమ్ వదులు చేశాడు. చాతీమీద పడిన నల్లని గాయంనుంచి రక్తం మెల్లిగా స్రవిస్తోంది.

"ఇలా రక్తం కారకుండా ఆపాలి. దీనికి కట్టుగట్టడానికి యేం వాడాలో?"

చక్కగా అల్లిన దళసరి తెల్లని తలగుడ్డ నేలమీద వుంది. ఆ దర్వీష్ దాని మడతలు విప్పడం మొదలెట్టాడు.

ఆ చక్కటి మజ్లిస్ గడ్డ మడతల్లోనుంచి గుండ్రంగా వుండే బంగారు పతకం కింద పడింది. దర్వీష్ దాన్ని తీసుకున్నాడు. దానిమీద చక్కగా చెక్కిన డేగ బొమ్మ వుంది. దాని రెక్కలు చాచి వున్నాయి. ఇంకా యేవో వింత లిపిలో చెక్కిన రాత వుంది. అది ఒక జాడలో పరిగెత్తే చీమల్లా వుంది.

దర్వీష్ ఆలోచనల్లో మునిగిపోయాడు. ఆ క్షతగాత్రుడికేసి మరింత శ్రద్ధగా చూశాడు.

"భవిష్యత్ విపత్తుల భయంకర తటిల్లతలు ఈ మనిషి చుట్టూ సుళ్లు తిరిగి వున్నాయి. తిరిగి ప్రాణం పోసుకున్న యీ శవపు రహస్యం దీనిమీద రాసి వుంది" అనుకున్నాడు దర్వీష్. "ఇది శక్తివంతుడైన తాతార్ ఖాఖాన్* పైస్తా** ఈ స్వర్ణ శ్యేనాన్ని నేను భద్రంగా దాచాలి. ఈ క్షతగాత్రుడికి నయమై స్పృహ వచ్చాక తిరిగి ఇచ్చేస్తాను". ఆ దర్వీష్ ఆ బంగారు పతకాన్ని మడతల్లో పెట్టుకున్నాడు.

ఆ చక్కటి మజ్లిస్ తలగుడ్డతో క్షతగాత్రుడి ఛాతీకి కట్టుగట్టాడు. తర్వాత బయటికి వెళ్లి ఓ ఒంటెని లేపి గుమ్మందాకా తీసుకొచ్చాడు. ఒంటెని మోకాళ్లమీద వాలేటట్టు చేసి, ఆ

---

* ఖాఖాన్ – ఖాన్‌లకి ఖానుడు. మంగోలులకీ, తాతార్‌లకీ రాజాధి రాజు.

** జెంఘిజ్ ఖాన్ చెక్కించిన ఫలకం, లోహంతో గాని చెక్కతో గాని చేసింది. మొత్తం మంగోలు సామ్రాజ్యం గుండా స్వేచ్ఛగా విహరించేందుకు ఫర్మానాగా ఉపయోగపడుతుంది. యీ ఫలకాలు దగ్గరున్న వాళ్లకి స్థానిక అధికార్లు యే సహాయం అయినాగానీ చెయ్యాల్సి వుంటుంది. గుర్రాల్నీ, రక్షకుల్నీ తిండి తీర్థాల్నీ సమకూర్చాల్సి వుంటుంది,

మనిషిని ఇవతలికి తీసుకొచ్చి ఒంటె రెండు మూపురాల మధ్య పడుకోబెట్టి, కురువ తాటితో కట్టాడు.

ఇసక తిన్నెలమీద సూర్యుడు ఉదయించేటప్పటికి మంచు కప్పడిపోయి కనిపించీ కనిపించని దారిమీద కరుగుతూ వున్న మంచుపైన ప్రయాణం చేస్తున్నాడు. అతని వెనక్కాల తపాతపా మంటూ గాడిద గిట్టల చప్పుడు. గాడిద వెనక్కాల రెండు మూపురాల ఒంటె ఆలస్యంగా వస్తోంది. ఒంటె వీపుమీద క్షతగాత్రుడైన ఆ మనిషి నిస్సహాయంగా అటూ ఇటూ ఊగుతున్నాడు.

“పద ముందుకు, బెకిర్! మనం గుర్‌గంజ్***కి చేరుకోవాలి. అక్కడ బోలెడు యెండు గడ్డి నీ కోసం వుంది. ఇక్కడ ప్రమాదకరంగా వుంది. దుండగీడు కారకోంచర్**** ఇసక తిన్నెల వెనకనుంచి నీమీదకి లంఘించడానికి సిద్ధంగా వున్నాడు. నీ యజమాన్ని బానిసని చేస్తాడు. నీ నల్లని చర్మం ఒలిచేస్తాడు. త్వరగా దూరం పోదాంపద”.

*** గుర్‌గంజ్ – ఖోరెస్మ్ రాజధాని. దిగువ అమూదార్య ఒడ్డున వుంది. దాన్ని తర్వాత మంగోలులు ధ్వంసం చేశారు.

**** కార కోంచర్ – నల్లని కత్తి.

# దిమ్మరి గుడారంలో

ఖోరెస్మ్ షా* పెద్ద కొడుకు జలాలుద్దీన్ మంగుబర్తి కారకూమ్ ఇసక దిబ్బల మీదకి వేటకొచ్చాడు. ఈ ఖాన్ వెంట, యెంపిక చేసిన గుర్రాలమీద రెండు వందల మంది సాహసోపేతులైన రౌతులు వచ్చారు. షాగారి రహస్య ఆజ్ఞని నిర్వర్తించడానికి వాళ్లు అక్కడ వున్నారు. జలాలుద్దీన్‌ని కనిపెట్టి వుండి అతను ఖోరెస్మ్ సరిహద్దులు దాటి పోకుండా చూడాలి. రౌతులు ఒక అర్థవలయంగా దౌడు తీయించారు, పర్వత సానువుల వేపు జెరెన్లనీ**, అడివి గాడిదలనీ తరమ ప్రయత్నిస్తూ. అక్కడ నౌకర్లు తెల్లని శిఖరం వున్న నల్లని గుడారాన్ని యేర్పాటు చేశారు. వేటగాళ్లు తిరిగి రావడం కోసం చూస్తూ విందు భోజనం తయారు చేస్తున్నారు.

ఇసక తిన్నెలమీద వసంత కాలపు తొలి పుష్పాలు విడివిడిగా చెదిరిపోయాయి. మంచు దిమ్మలు తీక్షణమైన యెండలో గబగబా కరిగిపోతున్నాయి. వేట మూడవ రోజున ఆకాశం హఠాత్తుగా చీకటి కమ్ముకుపోయింది. ఉత్తరాన కిప్‌చాక్ పచ్చిక బీళ్లమీదనుంచి శీత వాయువు, సుళ్లు తిరిగే మంచు తుఫానూ వీచాయి.

చురుకైన కర్రి రంగు కాకేషియన్ గుర్రంమీద జలాలుద్దీన్ ఒక పోతు జెరెన్‌ని తరముతూ తన బృందంనుంచి విడిపోయాడు. ఆ జంతువు కుంటుతోందనీ, చెవులు రిక్కించి చుట్టూతా అనుమానంగా చూస్తోందనీ అతనికి కనిపిస్తూనే వుంది. జలాలుద్దీన్ దాదాపు తన వేట దగ్గరికి వచ్చేశాడు. అప్పుడా జంతువు కొంచెంగా వంపు తిరిగిన కొమ్ముల్ని విదిలించి, మళ్లీ పచ్చిక బీటిమీద దూసుకుపోయింది. యువ ఖాన్ సురగలుకక్కే కర్రి గుర్రంమీద ఆగ్రహంగా లేచి, మళ్లీ మొండిగా తరమడం ఆరభించాడు. తన ముందు వేగంగా అదృశ్యం అయిపోతూ వున్న నల్లని తోక మిణుకు నుంచి ఒక్క క్షణం కూడా దృష్టిని తప్పించలేదు.

ఆఖరికి ఆ జెరెన్‌ని ఒక్క బాణం దెబ్బతో పడగొట్టడం జరిగింది. జీనుకి వెనక్కాల దాన్ని కట్టేశాడు. ఈలోపున తుఫాన్ పెరిగింది. మంచు జాడల్ని కమ్మేసింది. తను దారి

---

* ఖోరెస్మ్ షా – ఖోరెస్మ్ పాలకుడు. 13వ శతాబ్దం ప్రారంభంలో ఇస్లాం రాజ పుత్రుల్లో మహాబలోపేతుడు.

** అడవిలో వుండే దుప్పి జాతి జంతువు.

తప్పిపోయానని జలాలుద్దీన్ గ్రహించాడు. తుఫాన్ గనక కొన్ని రోజులు ఇలాగే తగ్గకుండా వుంటే తను నాశనం అయిపోవచ్చు కూడా. గుర్రం కళ్లేల్ని పట్టుకుని నడిపించుకుంటూ పోతూ అతను గాలికెదురుగా దారి కోసం యాతన పడ్డాడు. చీకటి పడింది. ఇక అలిసిపోయి ఖాన్ గుర్రం పచ్చడం తీసి గుర్రానికి కప్పాడు. మంచులో సగం కూరుకుపోయి, రాత్రంతా ముడగలాక్కుని కూర్చుండిపోయాడు.

సూర్యోదయం అవుతూ వుండగా హోరు గాలి మణిగింది. మంచు కరగడం మొదలెట్టింది. ఇసక దిబ్బల మధ్య పిల్ల సెలయేళ్లు పారడం మొదలెట్టాయి. దూరంగా జలాలుద్దీన్‌కి దారిని సూచించే కెర్న్ ఒకటి కనిపించింది. కెర్న్ అంటే పొదలతో, అస్థికలతో తయారైన యెత్తు గుట్ట. సముద్రం ఉపరితలంలాగా సమంగా వున్న అంతంలేని చదును మైదానంమీద అది దారిని చూపించేటట్టుగా వుంది. ఖాన్ అటువేపు మళ్లాడు. కొంచెం సేపటికి ఇసక దిబ్బల మధ్య మట్టి సొరంగం లోయలో అతనికి పొగచూరిన, చిరిగిపోయిన నాలుగు గుడారాలు కనిపించాయి. అవి దిమ్మరులవి.

కుక్కలు భీకరంగా మొరగడంతో ఒక గుడారం లేదా "యుర్త్"లో నుండి వయసు మళ్లిన తుర్క్‌మెన్ ఒకడు బయటికి వచ్చాడు. భుజాలమీద గొర్రెతోలు కోటు ఒకటి వేలాడేసుకుని అతను హుందాగా ఈ ఆగంతకుణ్ణి కలుసుకుందుకు ముందుకు వచ్చి, ఆదరంగా గుర్రం కళ్లెం తాకాడు.

"మా ఇళ్లు నీకు మరీ బీదదిగా కనిపించకపోతే సుఖంగా లోపలికి రా, గౌరవనీయుడైన నాయకా" అన్నాడా ముసలతను. సంపద్వంతమైన దుస్తులు, యెర్రటి పట్టు షల్వార్, అన్నిటినీ మించి హుందా అయిన కర్రి గుర్రం అతనికి ఆశ్చర్యం కలిగించాయి. అలాంటి గుర్రం సుల్తాన్‌లకి తప్ప మరేవరికీ వుండదు.

"సలాం! నీ దగ్గర బార్లీ వుందా? రెండింతలు డబ్బిస్తాను".

"యెడారిలో డబ్బులంటే విలువైంది రొట్టె. రాకరాక వచ్చే చుట్టానికి యెప్పుడూ తగినంత వుంటుంది. బార్లీకి బదులుగా నీ గుర్రానికి ఒకటో రకం గోధుమ దాణా పెడతాం".

పక్క గుడారంలో నుంచి తిరగలి మోత వినిపిస్తోంది. ఆడవాళ్లు పిండి విసురుతున్నారు.

"ఒయ్! ఎవరక్కడ? గుర్రాన్ని చూడండి".

ఒక గుడారంలోనుంచి ఇద్దరు పడుచు అమ్మాయిలు రవసెల్లా గుడ్డతో తలలకి ముసుగు కప్పుకుని పరిగెత్తుకుంటూ ఇవతలికి వచ్చారు. వాళ్లు ముదురు ఎరుపు బట్టలు వేసుకున్నారు. అవి కాలి మడమల దాకా వున్నాయి. వాళ్ల వెండి నగలు, నాణేలు గల్లుగల్లు మంటున్నాయి. వాళ్లు గుర్రం కళ్లేలు రెండు వేపులనుంచీ పట్టుకుని దాన్ని నడిపించుకు వెళ్లిపోయారు.

ఖాన్ గుడారంలోకి వెళ్లాడు. లోపల వెచ్చగా వుంది. మధ్యలో జిగురులో వుండే చెట్లవేళ్ల పొగమంట వుంది. గోడకివార పరిచిన గొంగళిమీద ఒక మనిషి పడుకుని వున్నాడు.

నల్లని గడ్డంతో పాలిపోయిన బూడిద రంగు బుగ్గలు, ఛాతీమీద ముడుచుకున్న చేతులు వున్న ఆ వ్యక్తి మృత్యువు సమీపంలో వున్నాడు. అతని శ్వాస అసమంగా వుంది. అతని నిస్తేజ శరీరంలో ప్రాణం కొట్టుమిట్టాడుతోంది.

ఆ జబ్బు మనిషి కాళ్ల దగ్గర గడ్డం వున్న దర్వీష్ కూర్చున్నాడు. దర్వీష్‌లు పెట్టుకునే కూచి టోపీ పెట్టుకున్నాడు. అది హాజీ*కి గుర్తు. అర్ధనగ్నంగా వున్న అతని ఒంటిమీద పెద్ద అంగీ వేలాడుతోంది. దాని మీద బోలెడు రంగురంగుల మాసికలున్నాయి.

"సలామలేకుం" అన్నాడు జలాలుద్దీన్. ఆ జబ్బు మనిషి ఉన్ని కంబళీమీద కూర్చున్నాడు. కళ్ల దాకా గట్టిగా ముసుగు వేసుకున్న ఆడబానిస ఒకామె లోపలికి వచ్చి ఖాన్ కాళ్లకి వున్న ఆకుపచ్చ బూట్లని తీసేసింది. కరిగే మంచుతో అవి తడిసిపోయి వున్నాయి. జలాలుద్దీన్ కత్తి వేలాడుతూ వున్న తోలు పటకాని విప్పి పక్కన పెట్టుకున్నాడు.

"ఎవరు నువ్వు?" అని దర్వీష్‌ని అడిగాడు. "నీ బట్టల్ని బట్టి చూస్తే నువ్వు దూర దేశం తిరిగినట్టుంది" అన్నాడు. "నేను ప్రపంచ పరివ్రాజకుణ్ణి. అనృత సముద్రంలో సత్య ద్వీపాల కోసం అన్వేషిస్తాను". "నీ స్వగ్రామం యేది? యెక్కడికి వెడుతున్నావు?"

"నన్ను హాజీ రహీమ్ అంటారు. 'బాగ్దాది' అంటారు కూడా. యేమంటే బాగ్దాద్‌లో చదువుకున్నాను. మా గురువులు ప్రఖ్యాతులు. అత్యుత్తమ మేధా సంపన్నులైన ఉన్నతులు. మహా పండితులు. నేను చాలా విజ్ఞానశాస్త్రాలు అధ్యయనం చేశాను. అరబ్బీ, తురుష్క, పర్షియన్ పురాణాలు అధ్యయనం చేశాను, పాత పహ్లవీ లిపిలో రాసిన వాటిని. నా యౌవన దినాల చిహ్నంగా మిగిలిందల్లా పాపపు స్మృతులు, దురదృష్టకరమైన విచారాలు".

జలాలుద్దీన్ అతనికేసి సంశయాత్మక భ్రుకుటి కింద నుంచి చూశాడు. "యెక్కడికి వెడుతున్నావ్ యేమిటి అన్వేషిస్తున్నావ్?"

"పంచ సముద్రాల మధ్య చదునుగా వున్న ఈ నేలమీద, నగరాలని దర్శిస్తూ ప్రయాణం చేస్తాను. హ్రదాలని చుట్టి యెడారులమీదుగా ప్రయాణిస్తాను. తీవ్ర కాంక్షా జ్వాలలు మండే మనుషుల్ని అన్వేషిస్తాను. అసాధారణ విషయాలని దర్శించడానికీ, మహా వీరుల ముందు ధర్మబద్ధుల ముందూ మోకరిల్లడానికీ ఇష్టపడతాను. నేనిప్పుడు గుర్‌గంజ్‌కి వెడుతున్నాను. ఖోరెస్మ్ రాజ్యంలోనూ ప్రపంచంలోనూ అది మహా సంపద్వంతమైన నగరం అని వినికిడి. మహా విద్వాంసులూ సకల కళా పారంగతులూ అక్కడ వుంటారని అందరూ అంటారు. వాళ్ల కృషితో ఆ మహా నగరం అంతా అలంకృతం అయిందట".

"యుద్ధరంగంలో కత్తి మొనతో తమ సాహసకృత్యాల్ని రాసిన వీరుల్ని అన్వేషిస్తావా?"

* హాజీ అంటే హాజ్ – మక్కాయాత్ర చేసి వచ్చిన వాడు అని అర్థం.

అని జలాలుద్దీన్ గాఢ ఆలోచనామగ్న ధోరణిలో అడిగాడు. "కాని యువతీ యువకులు నీ పాటల్ని పాడుకునేటట్టు, రణ భూమిలో కత్తి తిప్పే యోధులు లేదా గోరీలలో కాళ్లు పెట్టడానికి సిద్దంగా వున్న వృద్ధులు తమ పెదాలమీద నిలుపుకునేటట్టు వీర పద భూయిష్టంగా యుద్ధరంగ యోధుల కృత్యాల్ని వర్ణించగలవా?" అని అడిగాడు.

ఆ దర్వీష్ ఈ పాదాల్ని వల్లిస్తూ జవాబు చెప్పాడు:

పదకర్తగ రుదాకి పేరుగాంచెనెంతో
అందమైన మాటలంత యెక్కువగా లేవు నాకు
అంధుడిగా, ప్రపంచాన్ని గెలవ పాడెనాతడు
నెగడుకాడ చలికాగే నేస్తాలకె నా పాట.

ఖాన్ చంపిన జెరెన్‌ని ఆ సంచారి గుడారంలోకి తీసుకువచ్చాడు. దాని తోలు ఒలిచేశారు. పేగుల్ని తీసేశారు.

"నీకు రాత్రి భోజనం సిద్ధం చేసేందుకు 'యుర్త్'లోని ఆడవాళ్లకి కొంత మాంసం ఇచ్చేందుకు దయచేసి అనుమతిస్తావా?"

"మొత్తం తీసుకో. మొత్తం అంతా మీదే తీసుకోండి" అన్నాడా జలాలుద్దీన్. "నేను బెక్ దగ్గర వేటగాణ్ణి గాను. నేనే బెక్‌ని, బెక్ కొడుకుని. నే చంపిందానికి జవాబు చెప్పుకోవాల్సిన వాణ్ణిగాను". అతను ఒరలోనుంచి నాజూకైన బాకుని తీసి జెబెన్ వీపుమీదనుంచి పల్చని మాంసం ముక్కలు కోసి, వాటిని ఓ పుల్లకి గుచ్చి నిప్పుమీద కాల్చడం మొదలుపెట్టాడు.

ఆ జంతువు కళేబరాన్ని తీసుకుపొమ్మని ఆ సంచారి ఆడవాళ్లకి సైగచేశాడు. తను అతిథి పక్క చేర్లబడ్డాడు. నిడుపాటి గడ్డాన్ని నిమురుకుంటూ మర్యాద మేరకి అతిథిని ప్రశ్నలడిగాడు.

"నీకు బాగానే వుంది కదా? నీకు శక్తి బాగానే వుంది కదా? నెగడు వెచ్చగా వుందా? నీ తల్లిదండ్రుల ఆరోగ్యం బాగుందా?"

ఖాన్ కూడా ఆచారం ప్రకారం కొన్ని కుశల ప్రశ్నలు వేసి ఆఖరికి అడిగాడు: "నా మాటల్ని తప్పుగా భావించకపోతే ఈ గుడారం యెవరిదో, నేను యెక్కడ వున్నానో చెప్తావా?"

"మా యుర్త్ నాసా నగరంకి పోయే మహా బిడారి రస్తాకి కొంచెం దూరంలో వుందిప్పుడు. నేను విస్తారమైన పచ్చిక బీటిలో దారితప్పిన దిమ్మరిని. నన్ను బీటిని కోరకుడ్ చోబన్* అంటారు".

బయట కుక్కల గుర్రు భీకరంగా వుండే మొరుగుగా మారింఇ. కొన్ని అరుపులు వినిపించాయి, యేడుపు వినవచ్చింది. గుర్రపు గిట్టల చప్పుడు చేరువైంది. దృఢమైన గొంతుక అరిచింది. "ఎవరక్కడ గుడారంలో? కోరకుడ్ చోబన్, జవాబు చెప్పు".

---

* చోబన్ – గొర్రెల కాపరి.

# పచ్చిక బీటి రౌతు

ఆ ముసలతను లేచి బయటికి వెళ్లాడు. గుడారం లోపలికి గొంతుకలు సన్నగా వినిపిస్తున్నాయి.

"ఎందుకొచ్చాడతను?" అని ఆ రౌతు చిన్నగా గుర్రుమంటూ గద్దిస్తున్నాడు. "వాడి ఆఖరి ఘడియలు మూడాయి".

"వున్న ముగ్గురూ నా అతిథులు".

"వాళ్ల నుదుటిమీద అల్లా రాసిన రాత చూపిస్తాను".

"వాళ్లు అతిథులు - వాళ్ల మీద చెయ్యి వెయ్యలేవు. - ఈ అయిదుగురు కొత్త బానిసలూ నీకెక్కడ దొరికారు?"

"వీళ్లు చెయ్యి తిరిగిన పనివాళ్లు. రాగి పని చేస్తారు. కవచాలు చేస్తారు. వీళ్లు బిడారులతో కలిసి ప్రయాణం చేశారు. ఈ బిడారుల "గడ్డం కత్తిరిద్దా"మనుకున్నా గాని సైతాను యెవడో పెద్ద బెక్ వేట కోసం తరుముతూన్న రెండు వందల మంది రౌతుల్ని ఆవాహన చేశాడు. ఒంటెల్ని ఒదులుకోవాల్సి వచ్చింది, తోలేవాళ్లు పారిపోయారు. ఈ అయిదుగుర్ని మాత్రం పట్టుకోగలిగాను. వీళ్లని మెర్వ్ పట్టణానికి తీసుకుపోతున్నాను. మంచి ధరకి అమ్మేస్తాను".

"నీ ఆశలకి అల్లా సాయం చెయ్యుగాక!"

ఆ సంచారి కొత్త అతిథితోటి గుడారం లోపలికి వచ్చాడు.

ఆ కొత్తతను పడుచువాడు. పొడుగ్గా వున్నాడు. వెడల్పాటి భుజాలున్నాయి. అతని నడుం దగ్గర అన్నువగా వుంది. అతని పక్క భాగంలో రంగు వేసి పదును చేసిన ఆకుపచ్చ గొర్రెతోలు ఒక వేలాడుతోంది. అందులో పొడుగు కత్తి వూగుతోంది. మెత్తటి ఒంటె చర్మం పసుపుపచ్చ బూట్లు తొడుక్కున్నాడు. వాటికి సన్నటి యెత్తు మడమలు వున్నాయి. నిడుపాటి గొర్రెతోలు టోపీ, వింతగా శోభించే నల్లని కఫ్తాన్ అతను తుర్క్‌మెన్ అని సూచిస్తున్నాయి. అతని నల్లని, నిశ్చలమైన ముఖాన్ని బట్టీ, స్ఫుటమైన చెక్కిళ్ల బట్టీ కూడా ఆ విషయం స్పష్టంగా చెప్పచ్చు.

"నెగడు దగ్గరికి రా, కూర్చో" అని పిలిచాడా యజమాని. కాని ఆ కొత్త అతిథి నెగడి దగ్గరి కంబళీమీద చతికిల పడలేదు; తను లోపలికి అడుగుపెట్టిన చోటే నిల్చుండిపోయాడు. అతని కళ్లు నిప్పారి, గుడ్లగూబ కళ్లల్లా గుండ్రంగా అయ్యాయి.

"ఎవరు నువ్వు?" అని అడిగాడు జలాలుద్దీన్, పైకి చూడకుండా.

"పచ్చిక బీటి మనిషిని".

"పశువులతోబాటు సంచరిస్తావా లేకపోతే వేరే వృత్తి యేమన్నా వుందా?"

"బిడారుల్లోని వర్తకుల గడ్డాల్ని కత్తిరిస్తా".

పచ్చిక బీటి మర్యాదల ప్రకారం అలాంటి జవాబు పొగరు మోత్తనంగా వుంటుంది. విడిది నెగడు దగ్గర అంతా సమానమే. యెంత చింకిపాతలు తొడుక్కున్నా నెగడు దగ్గర కలుసుకునే కొత్త ముఖాలు కూడా మర్యాదగా కుశల ప్రశ్నలడగడం – యెలా వున్నారూ యేమిటీ, పిల్లాజెల్లా, ఆవూ మేక బాగుండడం గురించీ అడగడం ఆచారం. ఆ తుర్కమెన్ పేచీకి తయారవుతున్నాడనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది.

జలాలుద్దీన్ పైకి కళ్లెత్తి మళ్లీ కిందికి చూపు వాల్చుకున్నాడు. అతని నోరు మాత్రం ఓ మూల కనిపించకుండా కంపించింది. పెద్ద ఖానుకి ఓ యెడారి దిమ్మరితో తగూ పడ్డం తగదు.

"నువ్వు గుర్‌గంజ్ దారికోసం వెతుకుతున్నావని విన్నాను" అన్నాడా తుర్కమెన్ కొంచెం సేపటి తర్వాత. "అక్కడికి నేను తీసికెళ్లగలను నిన్ను" అన్నాడు.

జలాలుద్దీన్‌కి భయం లేదు కాని అతని గుర్రం అలిసిపోయింది. ఇక్కడ అతనికేం ప్రమాదం లేదు. అతిథి సత్కారం అనే రక్షణ వుంది. కాని ఒక సారంటూ దారిన బడితే ఈ తుర్కమెన్ తన్ని తరుముతాడు, తనే అప్పటి దాకా జెరెన్‌ని వెంటాడినట్టు. ఖాన్ జవాబిచ్చాడు:

"నేను గుర్‌గంజ్‌కి వెళ్లడం లేదు".

"ప్రపంచ యాత్ర ముగించే ముందు ఇంత కఠినంగా మూలిగే ఈ మనిషెవరు?"

"ఇతన్ని బందిపోట్లు గాయపరిచారు" అని దర్వీష్ జవాబిచ్చాడు. "యేం అనుమానం లేదు ఇది క్రూరుడైన ఆ కార కోంచర్ పనే. ఈ యెడారి చిరుతపులి యెవళ్లనీ కనికరించదని తెలిసిన విషయమే" అన్నాడు.

"కార కోంచర్‌కి యెవళ్లూ అన్యాయం చెయ్యలేదనుకుంటున్నావా?"

"నేనుమనుకుంటాను? నేనెవర్ని? యెడారి దారులమ్మట గాలికి యెగిరిన పల్లేరుని" అన్నాడా దర్వీష్.

"కార కోంచర్ చొరరాని, నీళ్లు లేని ఉప్పుకయ్యలో వుంటాడు. ఇసకలోకి చొచ్చుకుపోయే బల్లిలాగా లేకపోతే రెల్లులో జారిపోయే త్రాచులాగా అందకుండా పోతాడు. ఎవరూ అతని దగ్గరికి పోలేరు కాని తను మాత్రం అందరి దగ్గరికి వెళ్లగలడు".

"బందిపోటుతనం వల్ల బతికేవాడికి కీడు మూడుతుంది. అతని తలకాయని గుర్‌గంజ్ గోడమీద యెత్తుగా గడకర్రపైన వేలాడేస్తారు" అంటూ యేం పట్టనట్టుగా జలాలుద్దీన్ జవాబిచ్చాడు, మాంసం కాలుతూ వున్న పుల్ల తిప్పుతూ.

"దుష్టుణ్ణి జయించే రాత్రి నీడ కార కోంచర్" అంటూ కొనసాగించాడు తుర్క్‌మెన్. "అతను కసితీర్చుకునే బాకు, ఆగ్రహపు బల్లెం, పగతీర్చుకునే కరవాలం. కార కోంచర్ ఇప్పుడు ఒంటరిగా వున్నాడు. తమ్ముడు గాని కొడుకు గాని లేరు. అతను నిర్జీవంగా పడిపోయే రోజు వస్తుంది, అతని గుడారం వున్న తావు బోసిపోతుంది. ఈ సంగతులు మంచివా?"

"అవి దుఃఖభాజకమైన సంగతులు" అని జలాలుద్దీన్ అన్నాడు.

"ఒకప్పుడు కార కోంచర్‌కి నెరిసిన గెడ్డం తండ్రి వుండేవాడు. దృఢగాత్రులైన సోదరులుండేవారు. మృదువైన అక్క చెల్లెళ్లుండేవారు. కాని మహమ్మద్ షాకి ఓ వంద గుర్రాలు కావల్సివస్తే కిప్‌చాక్‌ల* సైన్యంతో సంచార విడుదుల దగ్గరికి వచ్చేవాడు. వంద గుర్రాలకి బదులుగా ఉత్తమ జాతి మూడు వందల అశ్వాల్ని తీసుకుపోయేవాడు. ఆడవాళ్ల మెళ్లల్లోంచి వెండి ఆభరణాల్ని ఒలుచుకుపోయేవాడు, ఎవరో పొగరుమోతు కిప్‌చాక్ ఖాన్‌ని ఒక దిమ్మరులు దోచుకున్న దానికిది దండన అట. తన అంతఃపురంలో మూడు వందల జనానా వున్నా షా కిప్‌చాక్ సైకికులతోటి వచ్చి సాటిలేని సౌందర్యవతి గుల్ జామిల్‌ని యెత్తుకుపోయాడు. అంతకు ముందు ఆమె కంటి సైగ కోసం వంద మంది యువ రౌతులు పోరాడుకున్నారు. ఆమెని బలవంతంగా తన అంతఃపురంలో బందీని చేసి మూడు వందల ఒకటో పెళ్లాంగా వుంచాడు. ఇవి మంచి విషయాలా?"

"ఇవి కూడా చెడ్డ విషయాలే" అని జలాలుద్దీన్ మెల్లిగా జవాబు చెప్పాడు. "అయితే మీ వంద మంది ఆశ్వికులూ ఆమెని యెత్తుకు పోనిచ్చారన్న విషయమూ, ఆమెని రక్షించలేదన్న విషయమూ – అదీ మంచిది కాదు".

"మా రౌతులు మకాంలో లేకపోయారు. యీ కిప్‌చాక్‌లు మోసగాళ్లు, ఆ సమయాన్నే యెంచుకున్నారు".

"నే చెప్పేది విను, ఆశ్వికా" అన్నాడు జలాలుద్దీన్. "నీకు తండ్రీ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ వుండేవాళ్లని అన్నావు. 'ఒకప్పుడని' యెందుకన్నావు?"

"తెల్లటి గడ్డం వున్న మా తండ్రిని షాగారి దళాధిపతి పట్టుకుని ఆపాదమస్తకం కిందనుంచి పైకి గుర్‌గంజ్ చౌకులో మెల్లిగా చీల్చేశాడు. మా సోదరులు తూర్పు పడమరలకి పారిపోయారు. కిప్‌చాక్ రౌతులు మా అక్కచెల్లెళ్లని యెత్తుకుపోయారు. ఈ సంగతులు మంచివేనా?"

* కిప్‌చాక్‌లు – తురుష్క జాతి అసంఖ్యాక సంచారజనం. ఈ సమయంలో ద్నీపర్ నుంచి పాత తుర్కెస్తాన్‌లోని తియోన్‌షాన్ పర్వతాల దాకా తూర్పుకి వ్యాపించిన పచ్చిక బీళ్లలో వుండేవాళ్లు.

"ఇవి మంచి విషయాలు కావు" అని జలాలుద్దీన్ జవాబిచ్చాడు.

"ఇక నేనెక్కడ తల దాచుకోను? ఈ భూమ్మీద నాకు యేం మిగిలింది?"

జలాలుద్దీన్ కళ్లు జ్వలించాయి.

"నీ చేతిలో తళతళ మెరిసే కరవాలం నీ మాతృదేశ రక్షణ కోసం మెరవగలిగితే, బిడారుల జాడలో వినోదించే కంటే మంచి పనులు నువ్వు చెయ్యగలిగితే, ఆకుపచ్చ జెండా కింద నువ్వు సైనికుడివి కాగలిగితే రా గుర్‌గంజ్‌కి, చెరగని పేరు ఎలా సంపాదించాలో నీకు చూపిస్తాను".

"విను, నాయకా!" అన్నాడా తుర్క్‌మెన్ హుందాగా. "నేను గుర్‌గంజ్‌కి గనక వస్తే షాగారి గూఢచారి 'జ్వాజులు' నక్కల్లా నా వెంట మూగుతారు. నేను లొంగిపోను. కాని పోరులో పడిపోతాను. నన్నీ పని చెయ్యమంటావా?"

"అలా జరగదు" అని జలాలుద్దీన్ బదులు చెప్పాడు. "గుర్‌గంజ్ పడమటి ద్వారం దగ్గరికి వెళ్లగానే పొడుగాటి పోప్లార్ చెట్ల వనం నీకు కనిపిస్తుంది. ఆ కాపలావాణ్ణి 'ఇదేనా తిల్లాల తోట, కొత్త ప్రాసాదమూ?' అని అడుగు. 'దీని యజమాని దగ్గరికి తీసికెళ్ల'మని చెప్పు. వాళ్లకీ కాగితం చూపించు".

జలాలుద్దీన్ కాషాయి రంగు తలగుడ్డ మడతల్లోనుంచి ఓ పల్చని కాగితం ముక్క తీసి, యెడమ చేతి ఉంగుటం వేలినుంచి బంగారు ఉంగరం తీశాడు. మండే పుల్లతో ఆ ఉంగరానికి మసి పూశాడు. కాగితం ముక్క చివర్న నాలికతో చెమ్మ చేసి ఈ ముద్రికని దానిమీద నొక్కాడు. మసి బొగ్గుతో గీసిన స్థూల రేఖల అందమైన లిపి దానిమీద ముద్రపడింది. ఆ కాగితం ముక్కని గొట్టంలాగా చుట్టి, మధ్యకి మడిచి మోకాలిమీద పెట్టుకుని చదును చేసి, తుర్క్‌మెన్‌కి అందించాడు. అతను దాన్ని పెదాలకి, కనుబొమలకీ తాకించుకుని, పటకాలోనుంచి వేలాడే చిన్న రాగి భరిణలో పెట్టుకున్నాడు.

"నీ మాట నమ్ముతున్నాను, నాయకా! నేను వస్తాను. సలామ్" ఆ తుర్క్‌మెన్ గుడారం ముందు తెరవెనక మాయమైపోయాడు.

నిశ్శబ్దంగా ఆ సంచారి అతన్ని అనుసరించాడు. గుడారం ముందర నెగడు మండుతోంది. దానిమీద ఓ పెద్ద రాగి డేగిసా కాగుతోంది. నేలమీద మంచు కరుగుతోంది. ఆ అయిదురుగు బానిసలూ అలిసిపోయి అక్కడ వాలారు. చిరిగిన పీలికలు వాళ్ల ఒంటిమీద అంటి పెట్టుకుని ఉన్నాయి. వాళ్ల చేతులు వీపుల వెనక పెడరెక్కలు విరిచి కట్టి వున్నాయి. ప్రతివాళ్ల మెడకీ ఉచ్చు చుట్టి వుంది. వాటి చివళ్లు కలిపి లాగి పశువుల వెంట్రుకలు ఉచ్చు తాడుకి కట్టేసి వున్నాయి. ఆ బానిసలకి దగ్గరనే యెత్తైన ఎరుపు గోధుమ రంగు గుర్రం ఒకటి నుంచుంది. దాని మెడ చుట్టూతా వెండి పట్టీ వుంది. దాని కళ్లేలు బిగిగా లాగి జీనులో ముందర వుండే గుబ్బకి కట్టేసి వున్నాయి. యీ గుబ్బకి ఆ బందీలని కట్టేసిన వెంట్రుకల తాడు చుట్టి వుంది.

తుర్క్‌మెన్ గుర్రంమీదకి యెగిరాడు.

"పద ముందుకు! వెనకబడ్డావంటే నా కత్తితో నిన్ను ముక్కలుగా కోసి కుళ్లిపోయేటట్టు దారిలో వదిలేస్తాను".

అయిదుగురు బానిసలూ లేచి ఒకళ్ల వెనక ఒకళ్లు కుంటుతూ దొర్లుకుపోయారు. ఆ తుర్క్‌మెన్ కమ్చీ ఆడించాడు. కొంచెం సేపట్లోనే ఆ బృందం గుట్ట వెనక అదృశ్యం అయిపోయింది. సంచారి లోపలికి తిరిగివచ్చాడు.

"అతిథి మహానుభావా! ఒక వంద మంది రౌతులు దూరంలో కనిపించారు ఇటు వేపే వస్తున్నారు".

"ఖోరెస్మ్ షాగారి రౌతులు నా కోసం వెతుకుతున్నారని నాకు తెలుసు. ఇంతకీ ఇప్పుడు నేను మాట్లాడిన ఇతనెవరు?"

"అతను–" ఆ సంచారి గొంతుక సన్నగా అయిపోయింది, ఆ తుర్క్‌మెన్‌కి ఇంకా వినిపిస్తుందేమోనని భయపడుతున్నట్టుగా– "అతనే కార కోంచర్ చిరుతపులి; అల్లా అతన్ని శిక్షించు గాక!"

# హాకిమ్ న్యాయం చేస్తాడు

ఆ సంచారి గుడారంనుంచి బయల్దేరిన హాజీ రహీమ్ రెండ్రోజులు యెడారిలో సన్నటి బాటమీద ప్రయణం చేశాడు. జైహున్ (అమూదార్య) దిగువ ప్రాంతాల్లో వుండే ఒక హ్రదం వేపు ఉత్తరంగా వెళ్లాడు. ఆ జైహున్ దిగువ ఖోరెస్మ్ రాజ్యం పట్టణాలు, గ్రామాలు ఉన్నాయి. గాడిద మెల్లిగా ముందుకు ఈడ్చుకుంటూ పోయింది. దాని వెనకాల ఒంటె ఆ వర్తకుణ్ణి మోస్తూ అలసంగా నడిచివస్తోంది. అతనికింకా స్పృహ రాలేదు. దర్వేష్ అరబ్బీ, పర్షియన్ పాటలు పాడుకున్నాడు. ఖోరెస్మ్ మసీదుల ధగద్ధగాయమైన గుమ్మటాలు దీర్ఘ నిరీక్షణ తర్వాత కనిపిస్తాయా ఆఖరికి అనిపించే విధంగా దిఙ్మండలాన్ని పరిశీలిస్తున్నాడు.

మూడవ రోజుకి ఆ సన్నటి రాస్తా వెడల్పయింది. ఓ రాళ్ల గుట్టమీదికి దారి తీసింది. అక్కడినుండి చూస్తే తోపులతో, తోటలతో, పచ్చని పొలాలతో కళకళ్లాడే పుష్కల మైదానం విస్తరించుకుని కనిపించింది. ఆ చెట్ల మధ్యలో ప్రతి చోటా చపటా కప్పులున్న చిన్న ఇళ్లు, పొగబారిన గుడారాలు ఉన్నాయి. కిప్‌చాక్ ఖాన్‌ల భవంతులు దుర్గాల్లా యెత్తుగా వున్నాయి. వాటి మూలల్లో బురుజుల్లాంటివి వున్నాయి. అక్కడక్కడా కోసుగా మినార్‌లు వున్నాయి. వాటి పక్కల మసీదుల గుమ్మటాలు రంగురంగుల పెంకులతో శోభిల్లుతున్నాయి. నీళ్లు పారే పొలాలు నీటితో నిండి పెద్ద చదరపు అద్దాల్లా యెండలో మెరుస్తున్నాయి. ఆ పొలాల్లో అర్ధనగ్నంగా వున్న మనుషులు పని చేస్తున్నారు. వాళ్ల ఒంటిమీద పీలికలు వేలాడుతూ వున్నాయి, వాళ్ల కాళ్లకి సంకెళ్లు వున్నాయి.

ఆ దర్వేష్ గుట్టపైన ఆగాడు.

“అదుగో స్వర్గంలాంటి చోటు!” అని అతను గొణుక్కున్నాడు. “కాని ఇది వేదనకీ కన్నీళ్లకీ లోయగా మారిపోయింది. పదిహేనేళ్లవాడు నేనిక్కడినుంచి భయంతో వగురుస్తూ, వెంటాడబడిన వాడిలాగా బెదిరి చుట్టూ చూస్తూ పారిపోయాను. ఎండకి నల్లబడిపోయిన ఈ దర్వేష్‌ని చూసి సర్వాధికారి ఇమామ్‌చేత బహిరంగంగా శాపనార్థాలు అందుకున్న యువకుడని యెవళ్లు గుర్తుపడతారు? పద, బెకిర్! – అన్ని రాజధానులకీ రాజధాని అయిన ఈ నగరపు దేహళి దగ్గర నిద్రపోదాం. ప్రపంచంలో అత్యంత ఐశ్వర్యవంతమైన నగరమా గుర్‌గంజ్,

సర్వ ఇస్లాంలోనూ మహాబలోపేతుడూ, పరమదుర్మార్గ రాజు అయిన ఖోరెస్మ్ షా మహమ్మద్ పీఠమా!"

దర్వీష్ ఈడ్చుకుంటూ పోయాడు. అతను ముందుకు పోయే కొద్దీ పొడుగాటి కొమ్ములతో బలిష్టంగా వున్న ఎద్దులు కట్టిన చెకడాబళ్లు తగిలాయి. పాదచారులు తగిలారు. చక్కగా షోకు చేసిన గుర్రాలమీద స్వారీ చేసే ముచ్చటైన ఆశ్వికులు తగిలారు. చిక్కిపోయిన గాడిదలమీద అటూఇటూ కాళ్లు వేసి కూర్చున్న రైతుల నల్లని ముఖాలు తగిలాయి. అన్ని వేపులనుంచీ ఆవుల అంబారవాలు, గొర్రెల అరుపులు, సంతలో పశువులనమ్మేవాళ్ల కేకలు వినిపిస్తున్నాయి.

మొదటి పేటలోనే పొడుగాటి తెల్లటి కర్రలున్న మనుషులు వెంటనే దర్వీష్‌ని చుట్టుముట్టేశారు.

"ఎవరు నువ్వు? నువ్వు భిక్షాటన చేసే దర్వీష్‌వే అయితే నీకు ఒంటె ఎలా వచ్చింది? మాతోబాటు హాకిమ్ (న్యాయాధికారి) దగ్గరికి రా. నీకు ఉరిశిక్ష వేస్తాడు ఆయన".

వాళ్లు దర్వీష్‌ని ఓ దివాణం దొడ్డిలోకి తీసుకుపోయారు. చుట్టూతా పందుటిటుకలతో కట్టిన ఎత్తైన గోడ వుంది. భరంతు పైన వెడల్పాటి జంబుఖానా పరిచి వుంది. దానిమీద చారల అంగరఖా తొడుక్కున్న ఓ పెద్దాయన కాళ్లు మడం వేసి కూర్చున్నాడు. ఆయన బక్కపల్చగా నిబ్బరంగా వున్నాడు. మంచులా తెల్లగా, భారీగా వుండే తలగుడ్డ, జాగ్రత్తగా కత్తిరించుకున్న తెల్లని గడ్డం, తీక్షణంగా కఠినంగా చూసే చూపూ, హుందాగా మెల్లిగా కదిలే ఆ విగ్రహం ఆయన దగ్గరికి వచ్చిన వాళ్లందరికీ భీతి కలిగిస్తాయి. వాళ్లు మట్టిలో సాష్టాంగ పడిపోతారు. ఆయన కాళ్ల దగ్గర, నడుం ఒంచి కూర్చున్నాడు ఓ యువ రాయసగాడు. అతని చేతిలో రెల్లు కలం వుంది. తీర్పుల కోసం నిరీక్షిస్తున్నాడతను.

"ఎవరు నువ్వు?" అనడిగాడు హాకిమ్.

"పవిత్రమైన మా తల్లిగారికి పుట్టిన పాపిష్టి కుమారుణ్ణి నేను. హాజీ రహీమ్ బాగ్దాదీని. పవిత్ర బాగ్దాద్ షేక్‌ల అంతేవాసిని. సమాధి శీతల నిశీధిలో కప్పడిన భక్తుల పద చిహ్నాల కోసం అన్వేషిస్తూ వృధాగా దీర్ఘ పథాలు గమిస్తాను..."

ఆ ముసలాయన అనుమానంగా కనుబొమలు పైకెత్తాడు. ఆ దర్వీష్ మీదనే చూపు లగ్నం చేశాడు.

"అయితే ఆ ఒంటెమీద వున్న రోగిష్టి మనిషెవరు? అతనికి తలగుడ్డ లేదేం? అతను నిజమైన ముస్లిం భక్తుడేనా లేకపోతే కాఫిరా? నువ్వతన్ని గాయపరిచావని వీళ్లు అంటున్నారు, అతన్ని దోచుకుని అతని విలువైన వస్తువుల్ని అమ్మేశావట. నిజమేనా?"

ఆ దర్వీష్ ఆకాశంకేసి చేతులు యెత్తాడు.

"సకల సాక్షీభూత ఆకాశమా! నా రక్షణకి నీవే దిక్కు! అంగుడుదుడిపి దుష్టుడు. అతని శ్వాసే అనృతమయం. అతను దుఃఖాన్ని కలిగిస్తాడు, దేన్నీ పట్టించుకోడు!"

హాకిమ్ అర్ధవతుగా కుడిచేతి చూపుడు వేలు పైకి యెత్తాడు.

"ఈ జబ్బు మనిషి గురించి నీకు తెలిసింది నిజంగా మాకు చెప్పు".

దాడికి గురైన బిడారుల్ని తను కలుసుకోవడం గురించీ, హతులైన వర్తకుల గురించీ, ఆ క్షతగాత్రుణ్ణి రక్షించేందుకు తను చేసిన ప్రయత్నాల గురించీ నివేదించాడు.

హాకిమ్ నిడుపాటి తెల్ల గడ్డాన్ని నిమురుకుని అన్నాడు:

"ఈ గాయపడ్డ మనిషి గొప్పవాడై వుండి వుండచ్చు. అతని హస్తం సూర్యుణ్ణి తాకగలిగేటువంటిది. నేనే స్వయంగా గాయం యేమిటో. చూస్తాను".

దిసపాదాలని చెప్పుల్లో పెడుతూ ఆయన భరంతుమీదనుంచి దిగివచ్చాడు. ఒంటె దగ్గరికి నడిచివెళ్లాడు. ఒకొళ్లకంటే ఒకళ్లు యెక్కువగా అరుస్తూ ఆ పల్లెటూరి వాళ్లు ఆయన్ని చుట్టుముట్టారు.

"ఈ క్షతగాత్రుణ్ణి మేం యెరుగుదుం. గుర్‌గంజ్‌లో ఐశ్వర్యవంతుడైన వర్తకుడు మహమ్మద్ యాల్‌వాచ్. చూడండి అతని ఒంటెమీద అతని ముద్ర యెలా అచ్చుపోసి వుందో. రెండు, మూడు వందల ఒంటెల బిడారులితనివి. తబ్రీజ్, బల్గార్‌లకి, అతి పవిత్ర బాగ్దాద్‌కి యాత్రలు చేస్తాయి".

హాకిమ్ నిశ్శబ్దంగా విన్నాడు, పెదాలు కొరుక్కుంటూ, గంభీరంగా తీర్పు చెప్పాడు. రాయసగాడు దాన్ని రాశాడు.

"ఈ క్షతగాత్రుడు యోగ్యుడైన వర్తకుడు గుర్‌గంజ్ వాసి మహమ్మద్ యాల్‌వాచ్ అని పవిత్ర విశ్వాస భక్తులు, ఆస్తికులు చెప్పినందువల్ల, ఇతన్ని ఒంటెమీదనుంచి జాగ్రత్తగా దింపి మా ఇంట్లో పెట్టవలసిందిగానూ, వైద్యుని కోసం ఒక బానిసని పంపవలసిందిగానూ, ఇతనికి సరిఅయిన మూలికలతో వైద్యం చేసి నయం చేయవలసిందిగానూ నేను ఆజ్ఞాపిస్తున్నాను. నిజమైన భక్తుణ్ణి ఆదుకోవడంద్వారా సత్కార్యం చేసిన ఈ దర్వేష్ తన దారిన వెళ్లిపోవచ్చు. ఆపదలో ఆదుకోబడ్డ ఈ వర్తకుడు ఇతనికి బహుమతీ ఇస్తాడు. దర్వేష్‌కి ఒంటె వుండగూడదు కాబట్టి, యజమాని కోలుకునే దాకా ఒంటె నా వద్ద వుంటుంది. నా తీర్పుకీ, అధికార ముద్రకీ అచ్చుకొనేందుకు గాను యీ దర్వేష్ నల్ల గాడిద నా అధీనంలో వుండిపోతుంది".

"రాశావా?" అని హాకిమ్ రాయసగానికేసి తిరిగి అడిగాడు.

రాయసగాడు వినయంగా విన్నవించుకున్నాడు:

"ప్రభువులు సత్యపూరితమైన తీర్పు ఇచ్చారు".

హాకిమ్ ఇంకా చెప్పాడు:

"పండితుడైన దర్వేష్ నా బీద నిధినుంచి ఒక దిర్హమ్ గ్రహించు".

హాజీ రహీమ్ రాగి నాణేన్ని తీసుకుని, నుదుటిమీద రుద్దుకుని, పెదాలకి తాకించాడు. దాన్ని చేత్తో ముడిచి పట్టుకుని అన్నాడు:

"నీ విద్యత్తు మహత్తైంది, హాకిమ్, న్యాయాధిపతీ! ఈ క్షతగాత్రుణ్ణి గురించిన ఆందోళననుంచి నన్ను విముక్తుణ్ణి చేశావు. ఈ ఒంటెనుంచీ, గాడిదనుంచీని. ఇక దీనిమీద నేను స్వారీ చెయ్యను. దీనికి దాణా పెట్టను. దానం చేసిన వాడి చేతినుంచి పట్టించుకోకుండా వుండేటట్టు భిక్షుకుడి చిప్పలోకి పోయిన నాణెంలాగా భ్రష్టమైన ఆత్మల్లో కనిష్టమైనవాణ్ణి నేను. నీ తెలివి నీ తెల్లటి గడ్డం అంత స్వచ్ఛమైందీ అయితే యీ రాగి నాణెం బంగారు దినార్‌గా మారుగాక!"

హాజీ రహీమ్ చెయ్యి తెరిచాడు. అందులో మెరుస్తూ వుంది బంగారు నాణెం – దినార్.

"సత్యాన్ని దర్శించి చెప్తున్నా మహానుభావా, నువ్వు పాదం పెట్టిన చోటనల్లా ఆ నేల కరువు యెరగదు".

హాజీ రహీమ్ మళ్లీ నాణేన్ని చేతిలో మూశాడు, నిశ్చలంగా నుంచున్నాడు. హాకిమ్, ఆయన చుట్టూ మూగిన వాళ్లూ ఒకళ్లకేసి ఒకళ్లు నిశ్శబ్దంగా ప్రశ్నార్థక దృక్కులతో చూస్తూ వుండిపోయిరు. దర్వేష్ మూసిన చేతికేసి నోళ్లు వెళ్లబెట్టి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయారు.

"ఇతనికి నేను ఒక రాగి దిర్హమ్‌ని ఇచ్చాను. నాకా సంగతి తెలుసు. కాని అతను అరచేతిని తెరవగానే బంగారు దినార్ వుండటం మీరంతా చూశారు కదా" అన్నాడు హాకిమ్. ఆయన హఠాత్తుగా దర్వేష్ మీదకి వురికి, మూసిన ఆ చేతిని పట్టుకున్నాడు. వయసులో అంత పెద్దవాడు అలా చురుగ్గా వేగంగా ఉరకగలడని యెవరూ వూహించరు.

"బంగారు దినార్‌ని ఇచ్చెయి! ఈ తీర్పు ఖర్చులు నేను భరిస్తాను".

హాజీ రహీమ్ చేతిని తెరిచాడు. హాకిమ్ నాణేన్ని లాక్కున్నాడు. కాని మళ్లీ అది రాగి నాణెంగానే మారిపోయింది. అట్టహాసంగా వుండే హాకిమ్ వుస్సురనుకుని, గంభీరంగా భరంతుకేసి నడిచిపోయాడు.

హాజీ రహీమ్ గాడిద దగ్గరికి వెళ్లి, తన సంచీ తీసి భుజానికి తగిలించుకుని, ఇటు తిరిగి చూడకుండా గుర్‌గంజ్‌కేసి వెళ్లిపోయాడు. దర్వేష్ అరుచుకున్నట్టుగా నిండు గొంతుకతో అరుచుకుంటూ పోయాడు.

"యా హుహు! యా హక్! లా ఇలాహి ఇలాహు!"*

---

* యా హు ఓ వాడు! (దేముడు) యా హక్ (ధర్మం) దేవుడు లా ఇలాహి ఇలాహు (వాడు తప్ప లేదు) (అరబిక్).

# మమతల దేహళి

"యెన్నో యెళ్లనాడున్నట్టుగానే వుంది ఇదేం మారలేదు" అనుకున్నాడు హాజీ రహీమ్. గుర్‌గంజ్‌లోని ఓ నిర్జనంగా వున్న సందులో ఓ యెత్తు మట్టి గోడకి ఆనుకున్నాడు. "ఆప్రికాట్ మల్‌బరీ చెట్ల వెనక ఛాదితమైన అవే చదును కప్పుల ఇళ్లు. అదే వినీలాకాశం. అవే యెగిరే పావురాలు. వాటిపైన యెత్తు ఆకాశంలో నిరీక్షిస్తూ వుండే అవే గోధుమ రంగు రాబందులు. ఆ మట్టి గోడమీద పువ్వులు తొడిగే అకేసియా తెల్ల కొమ్మలు అలాగే వేలాడుతూ వున్నాయి. పువ్వులతో ఆ చిన్న మమతల దేహళిని సగం మూసేస్తూ అలానే వున్నాయి. ఆ దేహళి బూడిద రంగు కలప యెండకీ వానకీ మాసిపోయింది. దానిమీద నేర్పుగా చెక్కిన అలంకార లతలు ఇంకా కనిపిస్తూనే వున్నాయి. ఒకానొకప్పుడు ఈ గుమ్మంలోనుంచి గులాబీ రంగు దుస్తులు తొడుక్కుని, నారింజ పండు రంగు ముసుగు కప్పుకుని ఒక పడుచు అమ్మాయి వెళ్లింది. ఆమె యెక్కడుంది? ఆమె యెక్కడుందిప్పుడు?"

గుమ్మం తెరుచుకుంది. ఓ అమ్మాయి వచ్చింది. ఆమెకి ఇంకా ఇరవై యేళ్లు వుండవు. గులాబీ రంగు దుస్తులు, కాషాయ రంగు ముసుగు వేసుకుంది. చేతిలో ఓ పార వుంది. ఎత్తు చెక్కిళ్లని బట్టీ, కొంచెం అర్ధనిమీలితంగా వున్న కళ్ల తీరుని బట్టీ ఆమె బట్టల తరుని బట్టీ, కాషాయ రంగు రుమాలు వంపుని బట్టీ ఆమె తురుష్క జాతిదని చూసేవాళ్లకి తెలుస్తుంది. తనలో తను రాగం తీసుకుంటూ ఆమె పారతో పనికి ఉపక్రమించింది. తోటలోకి నీళ్లు పారే బోదెని అడ్డం లేకుండా చేస్తోంది. మట్టి గోడ కింద వున్న బిలంలోనుంచి నీళ్లు పారడం మొదలెట్టాయి.

వాతాత్తుగా ఆమె నిటారుగా నుంచుని, చిన్న గోధుమ రంగు చేతిని కళ్లమీద అడ్డంగా పెట్టుకుని, సందు చివరకంటా తేరి చూసింది.

రాగ వరస గొంతుక పాటగా మారింది.

"రాతిరి వచ్చెను, నిద్దర రాదు<br>
చుక్కల కేసే చూస్తూ వుంటిని<br>
తెల్లవారునని–

రేవెలుంగు దొర కాంతుల కిందను
నక్కుతు నక్కుతు ఉదయం వచ్చును.
చీకటి గాని, చుక్కలు గాని చక్కని
చందురుడాతనె గాని చెప్పలేరుగా
ఆ దివసానికి ఉషాకన్య యే కానుక తెచ్చునో".

సందువార ఓ యువ రౌతు స్వారీ చేసుకుపోతున్నాడు. అతను ముదురాకుపచ్చ కఫ్తాన్ తొడుక్కున్నాడు. నడుం దగ్గర తళతళలాడే రంగు పట్టీ కట్టుకున్నాడు. గొర్రెతోలు టోపీని కుడి కంటిబొమమీద ఓరగా పెట్టుకుని, ధనురాకారంగా గెంతుతూపోయే ముదురు గోధుమ రంగు గుర్రంమీద తాయితీగా స్వారీ చేస్తూ పోతున్నాడు. కమ్చీ తగలగానే ఆ గుర్రం దౌడు అందుకుంది. ఆ రౌతు ఈ అమ్మాయి దగ్గరికి రాగానే ఒక్కసారి గుర్రాన్ని అదిమిపట్టాడు.

ఆ అమ్మాయి పారని విసిరేసి గుమ్మంలోనుంచి పెరట్లోకి పరిగెత్తిపోయింది. ఆమె వెనకాల గుమ్మం తలుపు వూగింది. రౌతు గొర్రెతోలు టోపీని తల వెనక్కి తోసుకుని, నెమ్మదిగా సందు చివర అదృశ్యమైపోయాడు.

గుమ్మం మళ్లీ తెరుచుకుంది, ఆ అమ్మాయి ఇవతలికి తొంగి చూసింది. బెదురు బెదురుగా ఇటూఅటూ చూస్తూ పార అందుకుని, మళ్లీ మాయమైపోయింది.

ఆ దర్వీష్ గుడ్డివాడిలాగా కర్రతో తాటించి చప్పుడు చేస్తూ దారినబడి సందు అవతలి వేపు వెళ్లాడు. అతను ఎత్తుగా కూచిగా వున్న టోపీ పెట్టుకున్నాడు. హాజీ తలపట్టీ చుట్టుకున్నాడు. యెండకి కమిలి వున్నాడు. అతనికి గడ్డం వుంది. యెవళ్లేనా తనని గమనిస్తున్నారేమోనని భయపడినట్టు, అటూఇటూ చూస్తూ వంగి, గుమ్మాన్ని తగులుకున్న గులాబీ రంగు పీలికని తీశాడు. ఆమె హడావుడిలో ఆ పీలిక చిరిగి గుమ్మానికి తగులుకుంది. దాన్నతను తన ఛాతిలో దాచుకున్నాడు.

"అవును" అని అతను గొణుక్కున్నాడు. "యేమ్మీ మారలేదు అదే చెట్టు. ఇంకొంచెం పెద్దదైంది. ఆకులు ఇంకొంచెం దట్టం అయ్యాయి. అదే గుమ్మం. ఇంకొంచెం నల్లబడింది, శిధిలం అవుతోంది. అదే అమ్మాయి–పదిహేనేళ్ల నాడు నేను ప్రేమించిన ఆ అమ్మాయే దాదాపుగా. కాని ఆ అమ్మాయి మాత్రం కాదంతే. ఓ బుట్టనిండా ఆప్రికాట్ పళ్లతో యేన్నో యేళ్లనాడు ఇదే చోట్లో నుంచున్న ఆమె ఇప్పుడెక్కడుంది? తనే ఆప్రికాట్‌లా మృదువుగా, మధురంగా వుండే ఆమె ఇప్పుడెక్కడుంది? ప్రతీదీ మారకుండా అలానే వుండిపోయింది. ఇంకా చెప్తే అదుగో, అక్కడ ఆ పాత బురుజుపైన అదే డేగలు చక్కర్లు కొడుతున్నాయి. ఒక్క హాజీ రహీమ్ మాత్రమే అప్పట్లోలా లేడు..."

దర్వీష్ కర్రతో గుమ్మం తట్టాడు. వెనకనుంచి వయసు మళ్లినవాడి దగ్గు వినిపించింది. కృశించి వంగిపోయిన ముసలాయిన ఒకతను తెల్లని తలగుడ్డ చుట్టుకుని గుమ్మం దగ్గరికి వచ్చాడు.

"యా హుహు! యా హక్" అని దర్వీష్ వల్లించాడు.

ఎర్రటి కొలకులతో చెమ్మగా వున్న కళ్లల్లోనుంచి మసగ్గా చూస్తూ ఆ ముసలాయన కట్టుకున్న నేతబట్ట మడతల నడుం దగ్గర తడుములాడి పాత తోలు అడపంతీసేడు. రక్తం లేక స్రుక్కిపోయిన వేళ్లతో లోపల తడిమి నల్లని చిన్న నాణేన్ని తీశాడు.

"ఆలేకుం సలాం" అన్నాడు దర్వీష్ నాణేన్ని కనుబొమలకీ, పెదాలకీ తాకించుకుంటూ. "ఈ ఇంట్లో యెవళ్లుంటున్నారు? ఆ సర్వేశ్వరుడికి యెవరి కోసం విన్నపం చెయ్యను?"

"ఈ ఇంట్లో వుండేది నేనే. కాని ఇది నాది కాదు. ఇది కార మక్సుమ్ అనే కమ్మరతని ఇల్లు. ఊరి నడిబొడ్డున కార మక్సుమ్ పెద్ద కమ్మరశాలనీ, ఆయుధాలు చేసేశాలనీ అందరూ యెరుగుదురు. భక్తులకి దానం తిరస్కరించడతను".

"నీ పవిత్ర నామధేయం యేమిటి, సిద్ధుడా".

'సిద్ధుడా' అనే పెద్ద బిరుదు నాకు తగిలించద్దు. నేను షాగారి పాత రాయసగాణ్ణి, పేరు మీర్జా యూసఫ్. నన్ను గురించి నేను చెప్పదలచుకున్నదంతా కవి చెప్పిన మాటల్లో చెప్తా:

గడిపితి రాసభ జీవితంబు
బానిసనైతిని బతుకున సంసార సంతానములకు
ఇహలోక సంపదలన్ని నా శూన్య హస్తంబుల
పేద బతుకున, అనంత కోటి దుఃఖముల
కావలనున్నవి; కాని యీ దుఃఖాని కంతులేదు". *

"లేదు, లేదు, నువ్వు మహిమలు చెయ్యగలవాడవనేది ఇంకా నిజం" అని దర్వీష్ జవాబిచ్చాడు. "నువ్వొక నల్లని దిర్హమ్‌ని త్యాగం చేశావు. దయాంతఃకరణతో ఇచ్చిన నీ దానం తక్షణం అకలంక పసిడి దినార్‌గా మారిపోయింది".

ఆ ముసలతను నల్లని పంజాలా వున్న దర్వీష్ చేతి మీదకి వంగాడు. చాచిన అరచేతిలో మొహరు చెక్కిన దినార్ వుంది.

"నా ఇంత వయసులోనూ పవిత్ర గ్రంథాల్లో రాసిన ఆ మహిమలేమీ నేను చూళ్లేదు. దర్వీష్ నువ్వే ఈ మహిమల్ని చెయ్యగలవు లేదా అంగడి వీధిలో గారడీ వాడిలా సగం అంధుడైన ముసలాణ్ణి ఆట పట్టించదలుచుకున్నావు".

---

* 9వ శతాబ్దం నాటి పర్షియన్ కవి కిసాయి కృతుల నుంచి.

"ఈ దినార్ పరీక్షకి నలబడుతుంది. దీన్నిచ్చి నీ బానిసని అంగడికి పంపు. వాడు బుట్టనిండా వేపుడు కబాబ్, ఉడికించిన సేమ్యా, తేనె, కర్బూజాకాయలు తెస్తాడు. అప్పుడు, బాగ్దాద్‌నుంచి వస్తూ వున్న ఈ దీన పథికుడికి మృష్ట భోజనాన్ని వాటా పెడతావా బహుశా?"

"అయితే నువ్వు బాగ్దాద్ మహా నగరంనుంచి వస్తున్నావా? నా గృహం పావనం చేసి, నువ్వు దర్శించిన విశేషాలు నాకు చెప్పు. మహిమాన్విత దినార్ శక్తి పరీక్షించడానికి నా బానిసని పంపుతాను".

# షాగారి రాయసగాడు

"మా నివాసాలు బహు దూరం వున్నాగానీ,
దారిలో కష్టాలున్నా గానీ, అతను నా
దగ్గరికి వచ్చాడు".
(ఇబన్ హాజిమ్, 11వ శతాబ్దం)

పసుప్పచ్చ రంగు కొండ జింక తోలు చెప్పులు తొడుక్కుని ఆడించుకుంటూ ఆ ముసలతన పెరటి గుండా అతన్ని నడిపించి భరంతు దాకా తీసికెళ్లాడు.

దర్వీష్ అతని వెనకాలే ఓ గదిలోకి వెళ్లాడు. దానికి ఇటికల నేల వుంది. గోడల వార వెడల్పు తక్కువ కంబళ్లు పరిచివున్నాయి. గోడలో అల్మారాలున్నాయి. వాటిమీద రెండు వెండి కూజాలు, పర్షియన్ గాజు పాత్ర వున్నాయి. గుమ్మటంలా వున్న కప్పు అటూ యిటూ అల్లుకుపోయే దంతెలలో చిత్రంగా వుంది. దానికి మధ్య భాగంలో పొగ పోవడానికి కంత వుంది. గది మధ్యలో చదరంగా వున్న గుంతలో కణకణ మండే బొగ్గుల కుంపటి వుంది. దూరంగా వున్న గోడకి ఆనుకుని తెరిచిన మూడు ఇనప సందుకాలున్నాయి. వాటిల్లో పసుప్పచ్చ తోలు జిల్దు చేసిన పెద్ద పుస్తకాలు బోలెడున్నాయి.

దర్వీష్ గుమ్మం వార తన కర్రనీ, ఇతర సామాన్లనీ చేరవేశాడు. చెప్పుల్ని పక్కన వదిలి అతను బస్కీ వేసుకుని ఆ ముసలతని పక్క కంబళీమీద కూలబడ్డాడు.

"బింట్ జాంకిజా" అని వణుకుతూన్న కంఠంతో ముసలతను పిలిచాడు.

మడమలు తాకే పొడుగాటి చారల అంగరఖా తొడుక్కున్న కుర్రాడొకడు లోపలికి వచ్చాడు. అతను నీలం తలగుడ్డ చుట్టుకున్నాడు. చేతులు దండ కట్టుకుని వంగి, ఆదేశం కోసం నుంచున్నాడు.

"ఈ బంగారు దినార్ తీసుకో. ముసలి సక్లాబ్‌కిచ్చి చెప్పు: 'సక్లాబ్ తాతా! అంగడి వీధికెళ్లు; బంగారు, వెండి నాణేలు మూటగట్టి పెట్టుక్కూచున్న హిందూ వణిక్కుల దగ్గరికి వెళ్లు. వాళ్లే జూదం పావులు అమ్ముతారు. యెవరి గడ్డం బాగా పండిపోయిందో అతని

దగ్గరికెళ్లి ఈ నాణెం నిజంగా బంగారు దినారో కాదో తూకం అంతే వుందో లేదో చూడమని చెప్పు. ఆ హిందువు గనక ఇది నిజంగా దినార్ నాణెమేనని అంటే, అప్పుడు దీన్ని వెండి నాణేలుగా మార్చమను. వెండి నాణేలు పుచ్చుకున్నాక బాటసారులు భోజనం చేసే చోటికి వెళ్లాలి సక్లాబ్. అక్కడ ఈ సత్యాన్వేషి కావాలన్న వాటిని అతను కొనాలి".

"బానిస యేం కొనాలంటారు?" అంటూ ఆ యువకుడు దర్వీష్ కేసి తిరిగి అడిగాడు.

ఆ దర్వీష్ యువకుని ముఖంకేసి చూశాడు. ఆ లేత కవళికలు చిత్రంగా పరిచితమైనట్టే వున్నాయి. అతన్ని తను ముందెప్పుడు చూసినట్టు?

దర్వీష్ బదులు చెప్పాడు:

"బానిసని బుట్ట తీసికెళ్లమను. యెన్నో యేళ్లుగా తను చూడని అన్న కోసం యేవేం కొంటాడో అన్నిట్నీ కొనమను. అతని ఇష్టం".

ఆ ముసలతను యువకుణ్ణి దగ్గరికి రమ్మని పిలిచి చెవిలో చెప్పాడు:

"అంగడినుంచి రాగానే తను మామూలుగా వచ్చేట్టు ఇక్కడికి చింకి పాతల్లో రావద్దని సక్లాబ్‌కి చెప్పు. నా పాత అంగరఖా వేసుకుని రమ్మను. అతనికి దినార్ ఇచ్చి పంపేశాక ఇక్కడికి రావాలి. సిరా బుడ్డీ, రెల్లు కలం, రాసేందుకు కాగితం తీసుకురా. అప్పుడీయన చెప్పే వాటిని రాద్దువుగాని".

యువకుడు వెళ్లిపోయి, అంతలోనే కాగితం, రాసే సరంజామా తీసుకుని వచ్చాడు.

"యాత్రికా, చెప్పు. మొదటగా నీ పేరు, పుట్టిన ఊరు. యెక్కడినుంచి వస్తున్నదీ, బాగ్దాద్ మహా నగరానికి యెలా వెళ్లిందీ".

"నన్ను బాగ్దాదీ హాజీ రహీమ్ అని పిలుస్తారు. పుట్టుక బాస్రా నగరం దగ్గర వున్న కుగ్రామం. నువ్వడిగే వాటన్నికీ జవాబు చెప్తాను. కాని ముందటగా నా హృదయాన్ని వ్యథపెట్టే ఓ విషయాన్ని ప్రస్తావించనియ్యి దయచేసి".

"వూఁ చెప్పు" అన్నాడు ముసలతను.

"నేను ప్రసిద్ధ గురువుల దగ్గర బాగ్దాద్ నగరంలోని మహా మదారస్*లో అధ్యయనం చేశాను. నాతోబాటుగా విజ్ఞాన జ్యోతినుంచి వెలుతురుని ఆశించిన విద్యార్థుల్లో ఒక యువకుడు వుండేవాడు. విచారంగా, మౌనంగా, విజ్ఞాన దాహంతో వుండేవాడు. దారిద్ర బంధనంతోటి నడుము చుట్టుకుని, పథికుడి వూత కర్ర తీసుకుని ప్రపంచ ప్రఖ్యాత గుర్‌గంజ్‌కి, ఉన్నత బుఖారాకీ, అందమైన సమర్‌కండ్‌కి వెళ్లాలని నా సంకల్పంగా ఆ యువకునికి చెప్పినప్పుడు అతను ఈ మాటలు నాతో అన్నాడు, 'ఓ, హాజీ రహీమ్, ప్రపంచపు మహా మైదానాలమీద ప్రయాణం చేసి నువ్వు ఖోరెస్మ్ షాల మహా నగరం అయిన ప్రఖ్యాత గుర్‌గంజ్ చేరితే,

---

* మదారస – ముస్లింల మత విశ్వవిద్యాలయం.

పడమటి దేహళి అంగడి వీధినుంచి ముఖ్య మార్గాన్ని అడ్డే మూడవ వీధికి వెళ్లి ఆయుధాలు చేసే కమ్మరి కార మక్సుమ్ ఇళ్లు పట్టుకుని, నా గౌరవనీయులైన తల్లిదండ్రులు సజీవులో కాదో వాకబు చెయ్యి. నేను బాగ్దాద్‌లో యేం చేస్తున్నదీ అంతా వాళ్లకి నివేదించు. నువ్వు బాగ్దాద్‌కి తిరిగివచ్చాక నువ్వేం తెలుసుకున్నదీ చూసిందీ నాకు చెప్పు'. నేనతనికి అలాగేనని వాగ్దానం చేసి ప్రయాణమయ్యాను. అదృశ్య వాయువులు, విపత్కర తుఫానులు నన్నీ ప్రపంచంలో విసిరేశాయి. ఎండ మండించే హిందూస్తాన్ గడిచి వచ్చాను. తాతార్ యెడార్లు* దాటాను. చైనా సామ్రాజ్యాన్ని ఆవరించి తాతార్ ఖాన్‌ల దాడినుంచి రక్షించి కాపాడే మహా కుడ్యం చేరాను. గర్జాఘోషతో వుండే మహా సముద్రాన్ని చూశాను. తియెన్‌షాన్ హిమా వృత పర్వతాలు యెక్కాను. తెలిసిన ఈ ప్రపంచమంతా నాకు ముసల్మాన్లు కనిపించారు. యెన్నో దీర్ఘ సంవత్సరాలు గడిచిపోయాయి, యెట్టకేలకి గుర్‌గంజ్ చేరాను. బాగ్దాద్‌లో నా మిత్రుడు చెప్పిన వీధికి వచ్చాను. ఆ ఇళ్లు దొరికింది, మంచు లాంటి తెల్లటి అకేసియా కింద వున్న గుమ్మం కనిపించింది. ఆఖరికి నీతో మాట్లాడగలుగుతున్నాను. మహిమాన్వితా, పదిహేనేళ్లనాడు గుర్‌గంజ్ నుంచి ప్రయాణం చేసి వెళ్లిపోయిన యువకుణ్ణి యెవరు గుర్తు పెట్టుకుంటారు?"

"ఆ యువకుణ్ణి యేమని పిలిచేవారు?"

"ఆ మహా విశ్వవిద్యాలయంలో అతన్ని ఖోరెస్మ్ ఆబూజాఫర్ అనేవారు".

"ఇక్కడ ఆ పేరు ఉచ్చరించడానికి నీకెన్ని గుండెలు?" అంటూ ఉగ్రుడయ్యాడు రాయసగాడు వృద్ధ మీర్జా. అతని పెదాలు ఆగ్రహంతో వణికాయి. "అతను మహాపాపి అని నీకు తెలుసా? వయసులో చిన్న వాడైనా గానీ తననీ, తల్లిదండ్రుల్నీ అవమానభారంతో ముంచేశాడు. రక్తసంబంధీకులందర్నీ ఘోర విపత్తుకి గురిచేశాడు".

"కాని అతను నిజంగా చిన్న వయసువాడు. అతనేం చేసి వుండగలడు? యెవరి ప్రాణమేనా తీశాడా? యే గొప్ప రాజుమీదేనా హత్యా ప్రయత్నం చేశాడా?"

"ఈ సిగ్గులేని ఆబూజాఫర్‌కి – యెంత బాధ పడుతున్నానో ఈ విషయం చెప్పడానికి – చిన్నప్పటినుంచీ మంచి ప్రతిభావంతుడిగా పేరుంది, చదువులో మెరిక. మహత్తర గ్రంథం గంభీర చింతననీ, ఉన్నత భాషనీ, పదాన్నీ అర్థం చేసుకుని ఆపోశన బట్టడానికి మన మహాదేశికుల దగ్గర మిగతా విద్యార్థులతోబాటుగా కూర్చునేవాడు. యేది పడితే అందులో నెగ్గుకొచ్చేవాడు. ఫిరదౌసి, రుదాకి, అబు సయ్యద్‌ల బాణీలో శ్లాఘనీయమైన పద్యాలు అల్లేవాడు. కాని తర్వాత ఈ ప్రతిభా సంపత్తులు కుక్కమూతిపిందెలు దింపాయి. అతని పద్యాలు తోటివాళ్ల బోధనకి పనికిరాకుండా పోయాయి, జల్సారాయుళ్ల లోలత్వానికి ఉపయోగపడ్డాయి".

ఆ ముసలాయన కంఠం గుసగులాడుతున్నట్టు తగ్గింది.

---

*ఆ కాలంలో ఇప్పటి పశ్చిమ చైనా, మంగోలియా ప్రాంతాన్ని ఇలా పిలిచేవారు. అక్కడ చాలా సంచార తెగలు వుండేవి. వాళ్లందర్నీ కలిపి తాతార్ అనేవారు.

"ఈ దురదృష్ట యువకుడు స్వేచ్ఛా ఆలోచనా శీలి అయ్యాడు. జుట్టు పండిన ఆలిమ్‌లతో, ఇమామ్*లతో వాదనకి దిగేవాడు, సాదా జనాల ఆలోచనలని కలవర పెట్టేవాడు. ఆఖరికి ఇమామ్ అతనికి 'నువ్వు స్వర్గ పథంమీద ప్రయాణించడం లేదు, భయంకర నరక కూపంలోకి పడిపోతున్నావు' అని హెచ్చరిక చేసినప్పుడు ఈ ఆబూజాఫర్ తల బిరుసుగా జవాబు చెప్తాడు: 'నన్ను నామానాన వదిలిపెట్టు. నాకు స్వర్గం అవసరం లేదు! జపమాల తిప్పమని, మడికట్టుకు కూర్చొమ్మని, పూజాదికం నిర్వర్తించమనీ చెప్తావు నువ్వు కాని నాకు అంతా ఒకటే – మహమ్మద్‌వారి మసీదు గాని, గంటలు మోగుతూ వుండే ఇజా మతం గాని, మోజెస్ యూదు దేవాలయం గాని. దేవుడి కోసం అన్ని చోట్లా అన్వేషించాను కాని ఆయన కనిపించలేదు; దేవుడూ లేడు గీవుడూ లేడు. కల్పించారు, ఆయన పేరుమీద వ్యాపారం చేసేవాళ్లు. నా దర్శకుడూ జ్యోతీ అబు ఆలీ సినా'**. దాంతోటి ఇమామ్‌లు అతన్ని శరించి బందీ చెయ్యమని ఆజ్ఞాపించారు. నగరపు శృంగాటంలోకి అతన్ని తీసుకుపోవాలని ఆదేశించారు. అక్కడ అతని విషపుచ్చి నాలికనీ, రెండు చేతుల్నీ ఖండించేస్తారు, ఇక అతను ఎప్పటికీ చెత్త పద్యాలు చదవకుండా, రాయకుండా వుండేందుకని. కాని జిత్తులమారి ఆబూ జాఫర్ పారిపోయాడు పాములాగా. తండ్రి పుత్రప్రేమ కొద్దీ పాపిష్టి కొడుక్కి రక్షణ ఇచ్చాడని మొదట్లో అనుకున్నారు. అంచేత ఈ విషయాన్ని ఇమామ్‌లు తెలియజెయ్యగానే ఖోరెస్మ్ షా మహమ్మద్ తండ్రిని నిర్బంధించమనీ కీటకావృత బిలంలో తోసెయ్యమనీ, 'చచ్చిపోయేటంత దాకా' అని రాసిన సంకెళ్లతో కట్టెయ్యమనీ హుకుం జారీ చేశారు. ఆ ముసలాడు గనక చచ్చిపోతే అతను సమీప బంధువుని ఆ స్థానంలో పెట్టాలని – ఆబూజాఫర్ తనకిగా తిరిగివచ్చేదాకా, – షా ఆజ్ఞాపించాడు".

"ఆ బిలంలో తండ్రి యింకా బతికే వున్నాడా?" అని దర్వేష్ లోగొంతుకలో అడిగాడు. విపారిన అతని నేత్రాలు మెరిశాయి, కాని అతని ముఖం శవం ముఖం మాదిరీ బూడిద రంగుగా అయింది.

"తండ్రి చచ్చిపోయాడు. ఆ భయంకరమైన చోటులో వున్న గాఢాంధకారాన్నీ, చెమ్మనీ, దుర్గంధాన్నీ, కీటకాలనీ తట్టుకోలేకపోయాడు. షాగారి ఆజ్ఞల మేరకి అతని కనిష్ట పుత్రుడు

---

* ఆలిమ్ (బహువచనం ఉలమా) – ముస్లిం ధర్మవేత్తలకి మతజ్ఞానం కలవాళ్లకి అరబిక్ పేరు. ఇమామ్ – మసీదు అధిపతి, బోధకుడు.

** 11వ శతాబ్దం నాటి ప్రసిద్ధ వైద్యుడు, తత్వవేత్త. యూరప్‌లో అవిసెన్నా పేరుతో ప్రఖ్యాతుడు. నాస్తికుడనీ, స్వేచ్ఛా ఆలోచనాశీలి అనీ ఆయన్ని ఇస్ఫహాన్‌లో కొంత కాలం ఖైదు చేశారు. తత్వశాస్త్రంమీద, వైద్యశాస్త్రంమీద యెన్నో గ్రంథాలు రాశాడు. ప్రాచ్య ఇస్లాంలో స్వతంత్ర చింతనా ధోరణిని అనుసరించిన వాళ్లల్లో ముఖ్యుడు. 'వైద్య దర్పణం' అన్న ఆయన విజ్ఞాన సర్వస్వం లాటిన్‌లోకి అనువాద అయింది. మధ్యయుగాల్లో యూరపియన్ వైద్యులకి ముఖ్య పాఠ్యగ్రంథంగా వుండేది.

తుఫాన్‌ని బంధించి అదే సంకెళ్లతో కట్టేసి, అదే బిలంలోకి తోశేశారు".

"యెంత ఘోరం!" అన్నాడు దర్వీష్.

"చిన్న తుఫాన్ అంటే నాకు చాలా విచారంగా వుంది" అంటూ ముసలాయన చెప్పుకుపోయాడు. "అతని కోసం చాలా కష్టపడ్డాను. అతను అన్నగారి దుర్మార్గపు దారి పట్టకుండా వుండేందుకన్చెప్పి అతని చదువు బాధ్యత నేను తీసుకున్నాను. తుఫాన్ నా దగ్గర రాయడం చదవడం నేర్చుకున్నాడు. కాని చేతిపనులన్నా, యుద్ధ సంబంధమైన విషయాలన్నా బాగా మొగ్గు చూపించేవాడు. అతన్ని కార మక్సమ్ కమ్మరిశాలలో పెట్టాను. మంచి పనివాడితనం గల ఆయుధాలు చెయ్యడం అతను ఇతనికి నేర్పాడు. తుఫాన్ పనిని మా ఇంట్లో బింట్ జాంకిజా అనే పడుచు పిల్ల అందుకుంది. ఆమె అనాథ, ఓ బానిస కూతురు. చదువు సంధ్యలంటే యెంతో ఇష్టం ఆమెకి, పాటలు పద్యాలు పాడడమంటే మనసు. వయసు పెరిగే కొద్దీ నా కళ్లు మసక కమ్మేస్తున్నాయి. వస్తువులు రెండు రెండుగా కనిపిస్తున్నాయి. ఆకాశంలో ఒక చంద్రుడికి బదులు ముగ్గురు చంద్రులు కనిపిస్తున్నారు. బింట్ జాంకిజా నాకు ఆసరా. నాకు రాసిపెడుతుంది. నే మాట్లాడేవి రాసిపెడుతుంది, నా పుస్తకాలని తిరగరాస్తుంది. ఆమె నీ ముందు రెల్లు కలంతో కూర్చుని వుంది".

నీలం తలగుడ్డ కట్టుకున్న ఈ లేఖకి వ్యక్తి, గుమ్మం గుండా అకేసియా గుత్తుల కింద నుంచి పార పుచ్చుకు పారిపోయిన ఆ అమ్మాయేనని దర్వీష్ తెలుసు.

దర్వీష్ ఆమెకేసి చూశాడు. కళ్లు వాల్చుకున్నాడు. తనకి పదిహేనేళ్లనాడు తెలిసిన ఆ వేరే అమ్మాయిని గురించి అడిగే ధైర్యం లేకపోయింది.

ఉద్రేకాన్ని అణుచుని దర్వీష్ అడిగాడు:

"నువ్వు నిజంగా మహిమలు చెయ్యగల వాడివేనా? ఈ అమ్మాయికి చదవడం, రాయడం అనే సున్నిత విద్యలు నేర్పావు. దాంతోటి ఈ అమ్మాయికి మీర్జాలకి మాత్రమే వుండే ముడిని తల పాగాకి చుట్టుకునే హక్కు వచ్చింది. నీ గృహం విజ్ఞాన మందిరం అని నిజంగా నాకనిపిస్తోంది".

ముసలతను చేతులు పట్టుకుని, దర్వీష్ మీదే దృష్టి లగ్నం చేశాడు.

"ఇప్పుడు నీ గురించి చెప్పు. ఎంత కాలం నీ యాత్రలు సాగుతాయి" దర్వీష్ జుట్టు రేగిపోయింది. అతను తలని తిప్పి ముసలాడికేసి తిరిగి తీక్షణంగా చూశాడు.

"నా తండ్రి ఆకలి, యెడారిమీదుగా నన్ను వెంటాడుతూ. నా తల్లి దారిద్ర్యం, ఆమెకి దుఃఖాశ్రులు లేవు, ఆమె పక్షస్సులో అప్పుడే పుట్టిన శిశువుకి స్తన్యం లేదు. నా గురువు తలారివాని కరవాలం పట్ల భయం. కాని నాకో కంఠం వినిపిస్తుంది: విచారించద్దు, నీకు తగింది నువ్వు చేశావు".

ముసలి మీర్జా తల వూపాడు.

"నువ్వు జ్ఞాన సంపన్నుడివి. యే న్యాయాధికారి అయినా, యే సామంతుడైనా నిన్ను రాయసగాడిగా సంతోషంగా స్వీకరిస్తాడు. షాగారి గ్రంథాలయంలోని పుస్తకాలని యెత్తి రాసేందుకు నేనే నిన్ను నియమిద్దును. అక్కడ వెలలేని పుస్తకాలున్నాయి. వాటికి ప్రతులు లేవు. వాటి పేర్లు కూడా మనుషులకి తెలీవు. వాటిని యెత్తి రాయించాలి, మానవాళి నష్టపోకుండా. నువ్వెందుకు దిమ్మరిగా తిరుగుతావు? సంచారం అంటే, నా పాదాల కింద ధూళి అంటే, దుమ్ము అంటే రాళ్లు అంటే వుండే ప్రేమా?"

దర్వేష్ జవాబు చెప్పాడు:

" 'నీ గుడారాన్ని చిత్ర వర్ణ శోభితమైన తివాసీలతో తేజోవంతం చెయ్యవా?' అని నన్ను అడుగుతున్నారు. 'యుద్ధరావం పెదాలమీద వున్నప్పుడు గాయకుడి పాటయేమైంది? గుర్రం యుద్ధానికి ఆయత్తమైనప్పుడు గులాబీలలో నేనెలా పడుకుంటాను?'* అని అన్నాడు".

ఆ ముసలాయన ఆశ్చర్యంగా కళ్లు తెరిచాడు.

"యుద్ధాల్ని గురించి యెలా మాట్లాడగలవు? ఇస్లాం మహానేత శక్తివంతుడైన సుల్తాన్‌ని యే ప్రమాదం బెదిరించగలదు. ఆయనే యుద్ధం చేస్తున్నప్పుడు మరే ఇతర సైన్యం కదం తొక్కలేదు".

"ప్రపంచాన్ని దగ్ధం చేసే దవానలం తూర్పునుంచి వస్తోంది".

ఆ ముసలతను తల పంకించాడు.

"ఓ, లేదు! ఖోరెస్మ్ షా కత్తి ఒరలో వున్నంత కాలం మవరాన్నహర్ లోయలో, ఖోరెస్మ్ యెల్లల్లో అంతా శాంతిగా వుంటుంది".

ఓ ముసలి బానిస గదిలోకి వచ్చాడు. అతని కాళ్లకి భారమైన సంకెల వుంది. అది మొల దగ్గర తోలు పటకాకి కట్టేసి వుంది. అతను ఓ బుట్ట మోసుకొచ్చాడు. మహిమాన్విత దినార్‌తో కొన్న రకరకాల తినుబండారాలు దాన్నిండా వున్నాయి.

అతని చిక్కిపోయిన శరీరంమీద చారల అంగరఖా వుంది. అది అతని యెత్తు శరీరానికి చాలటం లేదు. పొడుగాటి నెరిసిన జుట్టు అతని భుజాలమీద వేలాడుతోంది. కంబళీమీద ఓ పట్టు గుడ్డ పరిచి అతను రొట్టెల్నీ, బాదంపప్పు అపూపాల్నీ, తేనె గిన్నెల్నీ, పిస్తాకాయ పప్పుల్నీ, బాదంకాయల్నీ, పంచదార చల్లిన పుచ్చకాయ ముక్కల్నీ ఇతర తీపి పదార్థాల్నీ సర్దాడు.

"ఈ పాత బానిసతోటి మాట్లాడనిస్తారా నన్ను?"

"అయ్యో, దాన్దేముంది, దర్వేష్ జీ".

"నీ పుట్టిన ఊరు యేది, నాయనా?" దర్వేష్ బానిసని అడిగాడు.

"చాలా దూరం, రష్యన్ల దేశంలో వుంది. నేనూ మా నాన్న కలిసి వుండేవాళ్లం.

---

* ఇబ్రహీం ముంతజీర్ కృతుల నుంచి, 10వ శతాబ్దం.

ఆయన వోల్గా నది ఒడ్డున చేపలు పట్టేవాడు. ఆ నదిని ఇక్కడి వాళ్లు ఇతిల్ అంటారు. నేనింకా చిన్న పిల్లాడిగా వున్నప్పుడు పొరుగున వున్న సూజ్దాల్ రాజు రౌతులు నన్ను యెత్తుకుపోయారు. మా దగ్గర 'రాజు' ఇక్కడ మీ 'ఖాన్'లాగా 'బెక్' లాగా. మా రాజులు వాళ్లల్లో వాళ్లు పోట్లాడుకుంటారు. నెగ్గిన రాజు మగాళ్లని, ఆడాళ్లని, పిల్లల్ని బానిసలుగా యెత్తుకుపోతాడు. బానిసల్ని పశువుల్లాగా పరాయి దేశాల్లో అమ్మేస్తారు. ఆ రకంగా నన్నూ, నా చెల్లెల్నీ రాజు బుల్గార్ వర్తకులకి అమ్మేశాడు. వాళ్లు నన్ను కామా నదీ తీరంలో వున్న బైర్యార్ వ్యాపార పట్టణానికి తీసుకుపోయారు. అక్కణ్ణుంచి బందీలందర్నీ నాతో సహా యీ యెడారి దాటించి తీసుకొచ్చేశారు, గుర్‌గంజ్‌కి. మా చెల్లెలికి యేమైందో తెలీదు. ఇదంతా జరిగింది యేనాడనగానో. ఇప్పుడు నా జుట్టు కూడా నెరిసిపోయింది, ముసలి గొర్రెలాగా వేలాడుతోంది. అయినా యెత్తైన నది ఒడ్డున వున్న మా సొంత కిష్లాక్‌ని ఇంకా చూడాలనే తపిస్తున్నాను. నేను తుర్క్‌మెన్ భాషనీ, పర్షియన్ భాషనీ మాట్లాడ్డం నేర్చుకున్నాను. మిగిలిన బానిసలుండబట్టి గాని లేకపోతే మా మాతృభాషని పురా మర్చిపోయి వుండేవాణ్ణి. నీకు వాళ్లు అప్పుడప్పుడు అంగడి వీధిలో తగుల్తారు. చాలా మందే వున్నారు, నడుస్తూ వుండే వాళ్ల సంకెళ్లు ఘల్లుఘల్లుమని మోగుతూ వుంటాయి".

"నీ పేరేమిటి?" అని దర్వీష్ అడిగాడు.

"ఇక్కడ నన్ను సక్లాబ్ అంటారు. మా దేశం బానిసలు ఇంకా నన్ను తాతస్లావ్క అంటారు. మాట్లాడ సాహసించిన బానిసని మన్నించు", (ఇక్కడ ఆ బానిస తన మొహం నేలని తాకేటట్టు దర్వీష్ ముందు మోకరిల్లాడు) "నువ్వు దూర దేశాలు తిరిగావని విన్నాను, సిద్ధుడిలాగా రాగి దిర్హమ్‌ని బంగారు దినార్‌గా మార్చవని విన్నాను. అంచేత నన్ను నా యజమాని దగ్గర్నుంచి కొనడం నీకు యే మాత్రం కష్టం కాదు. నన్ను కొను. నిన్ను నమ్మిన బంటులా కొలుస్తాను. యేమో బహుశా నువ్వు యేదో ఒక రోజున నా మాతృదేశం రష్యా దర్శిస్తావు, అప్పుడు నువ్వు నన్నూ తీసికెడతావని".

"నా బానిసని ఆశ చూపించి వల్లో వేసుకుందామని వుందా యేమిటి?" అని యజమాని కనుబొమలు ముడిచి అడిగాడు.

"నాకు బానిసలేమిటి?" అని జవాబిచ్చాడు దర్వీష్. "నేనే తిరిపె మెత్తుకునేవాణ్ణి, పిడికెడు గింజలు దానంతో వెళ్ల బారుస్తాను, భిక్షమెత్తితే" అన్నాడు.

"అయితే నా అస్థికలు దూర దేశంలో కలిసిపోవలిసిందే" అని ముసలి బానిస విచారంగా గొణిగాడు. "మా భోజనాన్ని రుచి చూడండి" అని అన్నాడు. అతను లేచి ఓ రాగి పాత్రని, నగిషీ చెక్కిన నీళ్ల కూజానీ తెచ్చాడు.

మీర్జా యూసఫ్, ఆ దర్వీష్‌లిద్దరూ పాత్రలో చేతులు కడుక్కుని, లేసు అల్లిన తువ్వాలుతో చేతులు తుడుచుకుని, మౌనంగా భోజనం చెయ్యడం ఆరంభించారు. దర్వీష్ అన్ని పదార్థాలనీ

రుచి చూసిం తర్వాత మర్యాదగా కృతజ్ఞతలు చెప్పే మాటలు కొన్ని అని తనకి సెలవిమ్మని అడిగాడు.

నిర్జనంగా వున్న వీధిలోకి వచ్చిన ఓ చెట్టు నీడలో చాలా సేపు నుంచుని, ఆ పురాతన దేహళికేసి తేరి చూశాడు.

"ఇక మళ్లీ నేనీ ఇంటిని – ఆ మంచి ముసలాయన నాకు చదువు సంధ్యలు నేర్పి ఓనమాలు దిద్దించిన ఈ ఇంటిని – ఇక చూడను మళ్లీ. నా ఒక్క బంగారు దినార్‌నీ అతనికిచ్చినందుకు బాధ లేదు, ఊరికే కొంచెం సేపు ఆయనతో గడిపి, నాకు అంత బాగా పరిచితమైన, ఆ కంఠం వినేందకు.... కాని ఇప్పుడు, మళ్లీ నా దారిన పోవాలి!"

మీర్జా యూసఫ్ చాలా సేపు ఆ వింత అతిథి వెళ్లిపోయిన గుమ్మంకేసే చూస్తూ వుండిపోయాడు. కాని బింట్ జాంకిజా వచ్చి అంది:

"తాతా! నా మనసుని ఒక ఆలోచన పాములాగా చుట్టుకుంది. యేమంటే యీ దర్వీష్, బాగ్దాద్ హాజీ రహీమ్, అచ్చు అప్పుడెప్పుడో నగరంనుంచి పారిపోయిన యువకుడు పాపి స్వేచ్ఛాయుతుడు ఆబూజాఫర్‌లాగా వున్నాడు; గడ్డం ముఖాన్ని కప్పేస్తూ వుంది. యెండకి కమిలి వున్నాడు, తన దర్వీష్ రూపంలో పాత కాలపు యువకుణ్ణి యెవళ్ళూ గుర్తుపట్టకుండా..."

"హుష్! లేకపోతే మన ఇంటికి పాపం చుట్టుకుంటుంది. మన పుణ్య మూర్తి ఇమామ్‌లు శాపానికి గురైన నాస్తిక పతితుడితోటి నేనెలా మాట్లాడి వుండగలను? ఈ క్షణిక అతిథి గురించి ఇక మళ్లీ ప్రస్తావించకు నా దగ్గర. మనం యెలాంటి రోజుల్లో బతుకుతున్నామంటే ప్రతి కంతకీ చెవులున్నాయి, గుసగుసలాడే మాటలు వినడానికి. అహోరాత్రాలూ మనం కవి మాటల్ని గుర్తుపెట్టుకోవాలి: 'మౌనమే శక్తివంతమైంది. మిగిలిందంతా దుర్బలమయిందే'*".

"స్నేహితుల మధ్య కూడా మౌనంగా వుండాలా? అదే కవి అనలేదా: 'అందరి దగ్గరా పెదవి మూసుకునే వుండు, నీ మిత్రుడి దగ్గర తప్ప'. జీవితమంతా మాట్లాడ్డానికి భయపడతావు! వుహుఁ, చచ్చిపోవడం మెరుగు, పాట పాడుతూ హుషారుగా".

"నిశ్శబ్దం! నిశ్శబ్దం!" అని ముసలాయన అరిచాడు. "దేవుడా కాపాడు. వొంటరిగా వున్నాను. రాత్రి దీర్ఘం, ఖోరెస్మ్ షా కథ ముగియలేదు. ఒక అర్థమైన పని కోసం నిరీక్షిస్తున్నాను. కాని పీడన, హింస తప్ప ఘనకార్యం యేమీ లేదు. వీరుడు పాషాణం, జీవంలేని నిగ్రహం విషపూరిత వృశ్చికాలు అతని కాళ్ల మధ్య తారాడుతున్నాయి అని మేల్కొని చూడాలంటే భయం నాకు. అల్లా! దయచూసి నన్ను వికాసవంతుణ్ణి చెయ్యి..."

---

* 11వ శతాబ్దం నాటి పర్షియన్ కవి ఆబుసయ్యద్ కృతుల నుంచి.

రెండవ భాగం

# శక్తివంతుడూ, భయంకరుడూ ఖోరెస్మ్ షా ప్రాసాదంలో ప్రభాతం

"రాజుల కొలువుకి రెండు పార్శ్వాలున్నాయి-
ఒకటి ఆశ, రెండవది తమ ప్రాణ భీతి".
(సైది, 13వ శతాబ్దం)

తెల్లవారడానికి ముందుగా ఆ మసక చీకట్లో ముగ్గురు వృద్ధ ఇమామ్‌లు గుర్‌గంజ్‌లో ఒక ఇరుకు వీధిలో వెడుతున్నారు. వాళ్లకి యెదర చమురు కాగితం దీపం పుచ్చుకుని ఒక బానిస వెడుతున్నాడు. జీరాడే మత అంగరఖాలని పైకి ఎత్తి పట్టుకుంటూ ఇమామ్‌లు మురికి కాలవలమీద గెంతుతున్నారు.

చీకట్లో మసాలా దుకాణం దాటి పోతూ వుంటే వాళ్లకి మిరియం వాసన, అల్లం వాసన, సుగంధ ద్రవ్యాల వాసనా తగులుతున్నాయి. లేకపోతే జీనులు, ముస్తీబు, పొడుగాటి బూట్లు అమ్మే తోలు అంగడిని దాటేటప్పుడు తోలు వాసన సోకుతుంది. చౌకులోకి రాగానే ఒక కఠిన కంఠస్వరం వాళ్లని ఆపింది.

"ఆగండి! రాత్రి వేళ యేం పనిమీద బయట తిరుగుతున్నారు?"

"సర్వేశ్వరుడి కృపవల్ల, మత సేవకులమైన మేము, మహా మసీదు ఇమామ్‌లం, పాదుషా వారి ప్రాసాదానికి ప్రభాత ప్రార్థనల నిమిత్తం వెడుతున్నాం".

"నిరాటంకంగా వేంచేయండి".

ఆ ముగ్గురు ఇమామ్‌లూ ప్రాసాదపు యెత్తు గుమ్మం దగ్గరికి వచ్చి నిశ్శబ్దంగా అక్కడ నుంచున్నారు. తట్టడం నిరుపయోగం, నిజానికి పొగరు మోత్తనం. కాని అవే తెరుచుకున్నాయి. యెంతో మంది రౌతులు ఆ చీకట్లో స్వారీ చేసుకుంటూ బయటికి వచ్చి చౌకుకి అడ్డంగా దౌడు తీసుకుంటూ పోయారు. వీళ్లు విశ్వాసాన్ని "మహోన్నతంగా, మహా యుక్తివంతంగా రక్షించేవాడు, న్యాయమూర్తీ" అయిన వాని ఆజ్ఞల్ని అమలుజరిపే దూతలు. వాళ్లు తమని పంపించిన వాడికి తప్ప మరెవ్వరికీ తెలియని గమ్యానికి వెళ్లిపోయారు.

ఆ ఇమామ్‌లు రాతిమీదనుంచి రాతిమీదకి గెంతుతూ ఓ పెద్ద కయ్యని దాటారు. ద్వారం గుండా వెళ్లారు. ఆ విశాలమైన ముంగిట్లో అన్ని దిశల్లోనూ షా సైనికులు కదం తొక్కుతున్నారు. ఈ వచ్చిన వాళ్లు మతాధిపతులని గుర్తించిన కాపలావాళ్లు పక్కకి నుంచుని దారి ఇచ్చారు. ఈ ముగ్గురు ఇమామ్‌లూ నౌకర్లని అలా దాటుకుంటూనే వెళ్లారు. నిద్రమత్తుగా వున్న కాపలావాళ్లు కిర్రుమనేటట్టు ఇనప తాళం తిప్పుతూ పెద్ద గుమ్మాల్ని తెరిచారు.

చివరికి వాళ్లు మూసి వున్న ఒక ద్వారం దగ్గరికి వెళ్లారు. చెరో వైపునా శిలాప్రతిమల్లా శిరస్త్రాణం ధరించి, గొలుసు కవచం పెట్టుకుని, బల్లెంమీద ఆనుకున్న సైనికులు నుంచున్నారు.

ఒక నౌకరు ఇవతలికి వచ్చాడు. ప్రమిద దీపం వెలుతురులో వాళ్లని పరకాయించి చూశాడు.

“ ‘విశ్వాస రక్షకుడు’ ఇంకా దయచెయ్యలేదు”.

“మేం నిరీక్షిస్తాం” అని ఇమామ్‌లు బదులు చెప్పారు. చెప్పులు తీసేసి నేలమీద పరిచిన తివాసీలమీద మోకరిల్లుతూ వాళ్లు రాగి అంచులతో తోలు జిల్డు చేసిన పెద్ద ఉద్గ్రంథాలు తెరిచారు.

“తిరుగుబాటు చేసిన ఖానులు నలుగురూ నిన్న తమ యువ తనయుల్ని పూటగా పంపారు. షాగారు విందు జరుపుతున్నారు. పన్నెండు గొర్రెల్ని వేయించారు” అన్నాడొక ఇమామ్.

“ఇవాళ దేన్ని గురించి ఆలోచిస్తాడాయన?” అని మెల్లిగా అడిగాడింకొకాయన.

“ప్రతిదానికీ వూ అను. దేనికీ అడ్డు చెప్పొద్దు” అన్నాడు మూడో ఆయన.

ఖోరెస్మ్ షా కలగంటున్నాడు. తను విశాలమైన బయలులో ఓ యెత్తు కొండపైన వున్నాడు. చుట్టూతా కను చూపు మేర వేలాది జన సమూహం మూగి వుంది. సూర్యుడు ఇంకా కళ్లు మిరుమిట్లు గొలిపేటట్టు ప్రకాశిస్తూ వున్నా, అనంత, జడ మైదానం దిగువన మునిగి పోబోతున్నాడు.

“పాదుషా వర్ధిల్లాలి!” సమూహం మధ్యలో నుంచి కేకలు. ఆ కేకలు దొర్లుకుంటూ, తరంగిస్తూ మెల్లిగా బయటికి వ్యాపిస్తున్నాయి. జనం మెల్లిగా నడుములు వంచారు. వాళ్ల ముఖాలు తెల్లటి తలగుడ్డలకి చాటు అయిపోయాయి.

ఆ మహా సమూహం తమ పాలకుడి ముందు మోకరిల్లింది. వాళ్ల అంగరఖాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఆ కదలిక వాళ్లమీదనుంచి ఖోరెస్మ్ సముద్ర* అలల్లాగా పాకింది.

---

* 13వ శతాబ్దంలో ఆరల్ సముద్రం పేరు.

"పాదుషా వర్ధిల్లాలి!" బయటి అంచులనుంచి ఆ కేక ఒక ప్రతిధ్వనిలా వచ్చింది. నిశ్శబ్దం ఆవరించింది. సూర్యుడు అంతర్ధానం అయ్యాడు. పచ్చిక బయలుమీద సాయం సంధ్య నిశ్శబ్దం కమ్ముకుంది. సూర్యుడి ఆఖరి మిణుకులో, వంగిన నడుముల మహా సముద్రం మెల్లిగా ముందుకు పాకుతూ కొండ యెక్కడం షా చూశాడు.

"ఆగండి!" అని షా అరిచాడు. కాని వంగిన నడుముల సముద్రం ముందుకు పాకింది, అన్ని వేపులనుంచీ ఆవరించుకుంటూ. చారల అంగరఖాలతో నారింజ పండు రంగు పటకాలతో వున్న అనంత సముద్రం. వాళ్లల్లో ప్రతి ఒక్కడూ ఛాతీలో వాడి కత్తిని దాచుకున్నట్టు షాకి అనిపించింది. ప్రజలు తమ పాలకుణ్ణి చంపాలనుకున్నారు. ఆయన ముందుకు దూసుకుపోయి దగ్గర్లో వంగి వున్న ఆకారాన్ని కాలితో కొట్టాడు. పట్టీ చుట్టుకున్న అంగరఖా చిరిగి గాలిలో ఎగిరిపోయింది పక్షిలాగా – దాని కింద యేమీ లేదు. షా మళ్లీ కొట్టాడు ఇంకో చారల అంగరఖామీద, ఇంకో దానిమీద. అక్కడ యేమీ లేదు.

"కాని ఒకడున్నాడు! వాళ్లల్లో ఒకడున్నాడు. వాడు దాంకున్నాడు. దొంగగా లేచి కత్తితో నా గుండెలో పొడవడానికి: ఖోరెస్మ్ షా కీర్తి ప్రతిష్టల కోసమే కొట్టుకునే ఈ గుండెలో".

"చాలు! వెళ్లిపొండి! షా ఆజ్ఞాపిస్తున్నాడు". కంఠం బొంగురు పోయింది. సరిగా వినిపించడమే లేదు. జనసమూహం మాయమై పోయింది. పచ్చికబీడు విశాలంగా అనంతంగా, నిశ్శబ్దంగా విస్తరించుకునే వుంది. అంతులేని యెడారిలో షా ఒక్కడే, గుర్రం లేకుండా, వున్నాడు. కాని తను ఒంటరిగా లేడు. యెవరో దగ్గరగా వున్నారు, కొండమీద గోతిలో దాంకుని. వాడే, కత్తి పుచ్చుకుని వాడే, షాని చంపబోయే వాడే. అందరూ–అందరూ తనని చంపాలనుకున్నవాళ్లే; కాని ఒక్కడే నిర్ణయించుకున్నాడు, తీర్మానించుకున్నాడు తన ప్రాణం తియ్యడానికి. ఎవరు? ఎవరు వాడు?

అదృశ్యమైన జనసమూహం ఆ కేకని దూరంలో ప్రతిధ్వనింపజేసింది. "జలాలుద్దీన్ వర్ధిల్లాలి! ఖోరెస్మ్ షా తనయుడూ వారసుడూ అయిన జలాలుద్దీన్ మహనీయుడు!"

"వాళ్లు నన్ను మర్చిపోయారు. నా కొడుకు చేతిని చుంబించడానికి త్వరపడుతున్నారు. కథ చాలా దూరం పోయింది. నా దారికి అడ్డం వచ్చిన వాళ్లందర్నీ అణగదొక్కేస్తాను: తిరుగుబాటు చేసిన ఖలీఫ్‌ని, అదుపు లేని నా కొడుకునైనా సరే! చాలు!"

ఇంకా సగంమగత నిద్రలో వున్న షాకి దగ్గర్లోనే కొంచెం అలికిడి వినిపించింది. యేదో చల్లనిది ముఖాన్ని తాకినట్టు అయింది. భయమూ, గాఢ జీవిత కాంక్షా అతన్ని యెంతో ప్రయత్నం చేసేటట్టూ, సర్వశక్తితోటీ ఉరికేటట్టూ చేశాయి. భయంతో తెరుచుకున్న కళ్లు ఆ గది చీకటి మూలల్ని వెదికాయి.

గోడలో వున్న పెద్ద నెగడులో* కణకణ మండే బొగ్గుల వేడి అతనికి తగుల్తూనే వుంది. ఎవరో తన పక్కన కూర్చున్నారు. పచ్చిక బీటి అమ్మాయి. తన రౌతులు ఆమెని ముందు రోజున తీసుకువచ్చారు. ఆమె చేతులతో ముఖం కప్పుకుని భయంతో దూరంగా జరిగింది.

"ఎవరు నువ్వు?"

"అల్లా శక్తివంతుడు! నేను గుల్ జామిల్‌ని. ఎడారినుంచి వచ్చిన తుర్క్‌మెనియన్‌ని. నిన్నరాత్రి నిద్ర మత్తులో వుండగా నిన్ను ఇక్కడికి తీసుకువచ్చారు. నువ్విప్పుడు అలా పడుకోబెట్టిన చోటే నిద్రపోయావు. నాకు భయం వేసింది. నిద్రలో భయంకరంగా అరిచావు, చచ్చిపోతున్న వాడికి మల్లే ఊపిరి కోసం తన్నుకులాడావు. రాత్రి దయ్యాలు నిన్ను పీక పిసికేశాయి. అవి చీకట్లో యుర్త్‌లమీద యెగిరి, మధ్య వున్న కంత గుండా లోపలికి వస్తాయి. మనసులో హత్యా కోరిక వున్న వాళ్లని వేధిస్తాయి".

"నీ చేతిలో వున్నదేమిటి?" షా ఆమె చిన్న చేతిని అంది పుచ్చుకుని బలవంతంగా తెరిచాడు వెతుకుతూ. అక్కడ ఏమీ లేదు.

"నాకు నొప్పి పెడుతోంది, వదులు".

"నీ చేతిలో యేం వుంది?"

"యేమీ లేదు. నా చేతులు ఒట్టివే. వసంత రుతువు పాట, గులాబీని ప్రేమించిన నైటింగెల్ పాట పాడనా? లేకపోతే రాజు కొడుకుని గురించిన పర్షియన్ కథ చెప్పనా? అతను అద్దంలో చైనా రాకుమారి ముఖం చూస్తాడు".

"గులాబీల గురించీ, యువ రాజుల గురించీ నాకు పాటలూ వద్దు, కథలూ వద్దు. ఆహాఁ! ఇదిగో బాకు ఒర! నువ్వు పాదుషా పడక గదిలోకి బాకుతోటి యెందుకు వచ్చావు?"

"నన్ను పోనియ్యి. మా తండాలోని పెద్దవాళ్లు చెప్తూ వుంటారు: 'గుర్రాన్ని కొట్టకు, ఓ నేస్తాన్ని పోగొట్టుకుంటావు' అని".

గుల్ జామిల్ అతని పిడికిలి ఒదిలించుకుని, గది మధ్యగా పరిగెత్తింది.

"నన్ను పీక పిసికేస్తావు నువ్వు! నువ్వంటే నాకు భయం" అని ఆమె చిన్న మడత గుమ్మం దగ్గరికి దూసుకుపోయింది. బయట వింటూ వున్న కాపలా వాళ్ల చేతులకి ఢీ కొట్టుకుంది.

ఆయాసపడుతూ షా నెగడు దగ్గరికి వెళ్లాడు. ఉబ్బిన అతని కళ్లల్లో నిప్పులు రాలాయి. ఓ పేం బెత్తంతోటి రాగి పాత్ర చప్పుడయేటట్టు కొట్టాడు. మడత తలుపు గుండా ఓ ముసలి

---

* మధ్య ఆసియాలో 12వ శతాబ్దంలో పొయ్యిలు లేవు. గది మధ్యలో మంట వేసి గదుల్ని వెచ్చబరుచుకునేవారు, అక్కడ కప్పుమీద కంత వుండేది పొగపోవడానికి. లేకపోతే గోడలో అమర్చిన నెగడుతో వెచ్చ చేసుకునేవారు.

నౌకరు జారి లోపలికి వచ్చాడు. అతనికి జీరాడే మేక గడ్డం వుంది. అరిచేతులతో షా ముందు పడ్డాడు.

"కంబళీల గదిలోకి ఈ రాత్రి ఈ అమ్మాయిని తీసుకు రా. వకీలూ*, పెద్ద వజీరూ** వచ్చారా?"

"వాళ్లు నిరీక్షిస్తున్నారు మహా ప్రభూ! వార్తాహరుడు, ఇమామ్‌లు ముగ్గురూనూ".

"జలాలుద్దీన్ ఖాన్ ఇంకా రాలేదా?"

"సింహాసనా రూఢుడింకా దయచెయ్యలేదు".

"వాళ్లని వుండమను. స్నానాల గది దగ్గరికి మంగల్ని పంపించు. నా గడ్డానికి రంగు వెయ్యడానికి నా వీపు రుద్దడానికి బానిసల్ని".

ఖోరెస్మ్ షా పక్క గదిలోకి వెళ్లాడు. ముసలి నౌకరు మెత్తల్నీ, దుప్పటుల్నీ మడిచి గోడలో వున్న గూట్లో పెట్టబోయాడు. అతను శుష్కించి, వంగిపోయి వున్నాడు. కళ్లు చెమ్మగా వున్నాయి ఎర్రని కొలకుల్తో. మడత పెడుతూ వుంటే దుప్పటీమీద యేదో మెరిసింది. ముసలి నౌకరు ఒంగి దాన్ని తీశాడు. వాడి కొన వున్న బాకు. దంతం పిడి వుంది దానికి.

"ఇది తురుష్క బాకు. అబ్బ! ఈ తుర్క్‌మెన్‌లు! దుర్మార్గులు. దిసపాదం కనిపిస్తుందా అని వెదికే విషపూరిత కారకుర్త్ సాలెపురుగు లాంటి వాళ్లు, దీన్ని వకీలుకి చూపించనా లేకపోతే దాచెయ్యనా? దీన్ని గురించి తొందరపడకుండా ఆలోచించి నిర్ణయం చెయ్యాలి".

విశాలమైన షల్వార్‌ని పట్టు తాడుతో బిగించుకుని, బాన పొట్టమీద చారల పట్టీని కట్టుకున్నాడు షా. పటకా వెండి ఒరలో బాకుని దోపుకున్నాడు. సరిగబుటా బొచ్చుఉత్తరీయాన్ని భుజాలమీద కప్పుకున్నాడు. గోడగూట్లోనుంచి కుటిలంగా అల్లిన తలగుడ్డని తీసుకున్నాడు. అలవాటు పడ్డ చేత్తోటి దాన్ని నెరుస్తూ వున్న పొడుగాటి ఉంగరాల జుట్టుమీద పెట్టుకున్నాడు.

గాలి పీల్చకుండా ఉగ్గబట్టి గుమ్మం దగ్గర నుంచుని విన్నాడు. అతని చెయ్యి బాకు పిడిమీద వుంది.

"ఎవళ్ల కాపుదలలో వాళ్లుంటేనే ప్రాణం దక్కుతుంది! రాజ భవనంలో మెలితిరిగిన చీకటి దారుల్లో శనిగొట్టు శత్రువు బాగ్దాద్ ఖాలీఫ్ పంపిన హస్తం దాగి వుండవచ్చు".

"వకీల్, వున్నావా?" అని లోగొంతుకలో అడిగాడు.

"ప్రభువుల ఆజ్ఞ కోసం నిరీక్షిస్తున్నాను".

షా చెక్క గడియ తెరిచి తలుపు తీశాడు. రెండు ప్రమిదల మసక వెలుతురులో, ఇద్దరు రాజాధికారులు వంగి నిరీక్షిస్తున్నారు.

---

* ప్రాసాదపు పాలకుడు. ** ముఖ్యమంత్రి

దిసపాదాల్ని బిర్రుగా వున్న చెప్పుల్లోకి పెట్టి మహమ్మద్ పక్క గదిలోకి వెళ్లాడు. రాత్రి గాలికి ఆ చెప్పులు చల్లగా వున్నాయి. పక్క గదిలో నౌకర్లు హాజరుగా వున్నారు. ఒకడు మట్టి ప్రమిదని పట్టుకున్నాడు. ఇంకోడు వెండి పాత్రని పట్టుకున్నాడు. మూడో వాడు జారీ మూతి వున్న కూజా పట్టుకున్నాడు. షా తొట్టె దగ్గర ప్రక్షాళనం చేసుకుంటూ వుంటే వాళ్లు హాజరుగా వున్నారు. ఆ తొట్టెకి ఓ రంధ్రం వుంది. అందులోనుంచి నీళ్లు రాతినేలమీదకి చిందుతున్నాయి. నాలుగో వాడు చేతులు చాచి, పొడుగాటి పట్టు తువ్వాలుని పట్టుకున్నాడు. అలంకారం చేసిన ఓ జత ఉన్ని మేజోళ్లని సార్వభౌముల కండగల కాళ్ల పైకి లాగాడు.

షా ముస్తాబవడంలో మునిగి వుండగా, వకీలు తాజా వర్తమానాన్ని నివేదించాడు.

“ముంగిట్లో చాలా చలిగా వుంది. తెల్లటి మంచు అన్నిట్నీ కప్పేసింది. ముగ్గురు ఇమామ్‌లూ రాజ ప్రాసాదానికి వేంచేసి ఆజ్ఞల కోసం నిరీక్షిస్తున్నారు. అలాగే ముఖ్య తలారి జహాన్ పహ్లవన్ హాజరుగా వున్నారు. నిన్న సాయంత్రం మూడు వందల ఒంటెల పెద్ద బిడారు బుల్గార్ దేశం నుంచి వచ్చింది. వాటిమీద పదును చేసిన గొర్రె తోలు చెప్పుల సరుకు యెత్తి వుంది. రష్యానుంచి పెట్టితెచ్చిన వందమంది బందీలూ వున్నారు. సుమారుగా రెండు వందల మంది బానిసలు చచ్చిపోయారు దారిలో, వాళ్లకి దాదాపు ప్రతిరోజూ పాయసమూ నువ్వుల నూనే భోజనం పెట్టినా. దీనికి ముందు మరో బిడారుని తుర్క్‌మెన్ బందిపోట్లు దోచుకున్నారు. ఇది ఖాయంగా కార కోంచర్ పనే అయి వుంటుంది”.

“తుర్క్‌మెన్ శిబిరాన్ని నాశనం చేసి పారేస్తాను! కాని నాకు బాగా ఇబ్బంది కలిగించేవాళు బాగ్దాద్‌నుంచి వచ్చిన యాత్రీకులు, బాగ్దాద్‌నుంచి వచ్చిన దర్వీష్‌లూ ఆరబ్‌లూ తగుల్తున్నారా? వాళ్లంతా ఖాలిఫ్ గూఢచారులు. నాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారు”.

“విశ్వాస పవిత్ర రక్షకులకి వ్యతిరేకంగా కుట్ర పన్నే దుర్మార్గులు యెవరుంటారబ్బా?”

“ముసల్మానులే”.

ముస్తాబైం తర్వాత షా మామూలు కార్యక్రమం ప్రారంభించాడు. మొదటగా మలుపులు తిరిగిన దారిలో వెళ్లాడు. తర్వాత వర్తులంగా వున్న రాతి మేడ మెట్లు యెక్కాడు. వకీలు, ఓ కొజ్జా దీపంతో ముందు నడిచేరు. తలుపులు తెరిపించారు. షా రాతి మెట్లు యెక్కుతూ పోయి ప్రాసాదపు గోపురం పైకి వెళ్లాడు.

# మహా సికందర్‌కి 'న్యూబా'

అక్కడక్కడ కన్నాలున్న కోట బురుజు గోడ దగ్గర చదును కప్పు వుంది. ఇరవై యేడు మంది యువ ఖానులు అర్ధ వృత్తాకారంలో నుంచుని వున్నారక్కడ. వాళ్లు గుర్, ఘజనీ, బాల్క్, బమియన్, తెర్మెజ్ తదితర రాష్ట్రాల పాలెగాళ్ల కొడుకులు. వాళ్లని షా రాజ ప్రాసాదంలో గట్టి కాపలా కింద వుంచాడు. వాళ్ల తండ్రులు, షాకి సామంత ఖానులుగా వున్న వాళ్లు, తిరుగుబాటు చేసి కత్తులు దూయకుండా వీళ్లు పూటగా వుంటారన్న మాట. బందీగా వున్న ఆ యువకుల్లో ప్రతివాడి దగ్గరా ఓ మృదంగమో, గజ్జలు కట్టిన మద్దెల వాయిద్యమో వున్నాయి. వీళ్ల వెనకాల పెద్ద బాజాలతో, రాగి తాళాలతో భజంత్రీలు వున్నారు. దగ్గర్లోనే షా సైన్యంలోని ముఖ్య దళాధిపతులు కొంత మంది వున్నారు.

షా రాగానే వాళ్లంతా ఒక్క సారి పెద్ద పెట్టున అరిచారు:

"దుష్టుల పాలిటి సింహస్వప్నం, విశ్వాస రక్షకుడు, అజేయుడు అయిన షా వర్ధిల్లాలి!"

షా అందర్నీ ముటముటలాడుతూ పరకాయించాడు.

"తైమూర్ మాలిక్ యెక్కడ?"

"హజర్, ప్రభూ".

పొడుగ్గా, యెప్పుడూ మందహాసంతో వుండే తైమూర్ మాలిక్ ముందుకి వచ్చి నుంచున్నాడు, తైమూర్ మాలిక్ యుద్ధాల్లో షాకి కుడి భుజంలా వుండేవాడు. అతను ఇద్దరు పిల్లల్ని ముందుకు నడిపిస్తూ తీసుకొచ్చాడు. ఒకతను షా కొత్తగా పెళ్లిచేసుకున్న ఆవిడ కడగొట్టు కొడుకు. ఆమె కిప్‌చాక్ ఖాన్ కూతురు. రెండో వాడు షా మనవడు. జలాలుద్దీన్‌కీ, తుర్‌మెన్ భార్యకీ పుట్టిన వాడు. తైమూర్ మాలిక్ ఆ ఇద్దరు పిల్లల్నీ షా దగ్గరికి తీసికెళ్లాడు. షా వంగి ప్రేమగా కొడుకు బుగ్గలు గిల్లాడు. కాని మనవడి పట కఠినంగా వున్నాడు.

"ఖాన్ జలాలుద్దీన్ యెక్కడ?" అని కఠినంగా అడిగాడు.

"మా నాయన గద్దలతోటి వేటకెళ్లాడు" అన్నాడా కుర్రాడు. తెల్లటి తలగుడ్డ కింద నల్లని కళ్లు పరిశీలనగా వున్నాయి.

"తైమూర్ మాలిక్, జలాలుద్దీన్‌ని వెదకడం కోసం రౌతుల్ని అన్ని వేపులా పంపించు. తుర్కమెన్‌లు బిడారులమీద దాడి చేస్తున్నారు. వాళ్లు నా కొడుకుమీద కూడా దాడి చెయ్యొచ్చు".

"అలాగే హుజూర్".

ఆకాశంలోనుంచి, యేదో మేఘం మాటునుంచి వచ్చినట్టుగా చిన్న పిల్లవాడి కంఠస్వరంటాంటి హెచ్చు స్థాయి ప్లుత స్వరం వినవచ్చింది.

"జాగరూకులు అదృష్టవంతులు! నిద్రించని వారికి సంతోషం!"

ఆకాశానికి యెత్తిపట్టిన మైనం వత్తి దీపంలాగా వున్న నిటారు గోపురం అంచు చివర్న, దూరంలో అప్పుడే తొంగి చూస్తూ వున్న గులాబీ సూర్యకాంతిలో మెరిసింది. ఆ మహా నగరపు భవనాలన్నీ ఇంకా చీకట్లోనే వున్నాయి.

యువ ఖానులందర్లోకీ పెద్ద వాడైన ఖాన్ ఒకడు ఖోరెస్మ్ షాకి ఒక మద్దెలని అందించాడు. మహమ్మద్ గొంతెత్తాడు:

"సికందర్‌కి కీర్తి కలుగు గాక! ప్రపంచ విజేతకి కీర్తి కలుగు గాక! జైహున్, జరఫ్‌షాన్ తీరాల దాకా అన్ని ఇరాన్ ప్రాంతాల్నీ ఆయన లొంగదీసుకున్నాడు. సికందర్ మా ఆదర్శం, మా బోధకుడాయన. ఆయన్ని కీర్తిద్దాం, మూడు చరణాల న్యూబా* తోటి".

మద్దెళ్లూ, మృదంగాలూ ధనామని మోగాయి. రాగి తాళాలు ఖంగుమన్నాయి. పొడుగాటి బాకాలు మోత యెత్తాయి, తుతారలు గుంయ్‌మన్నాయి. మూడు సార్లు సంగీతం మగింది మహా మాసెడోనియన్ గౌరవార్థం. అది ఆగి, ప్రాసాదపు యెత్తు బురుజులనుంచి ప్రతిధ్వని రాగానే తైమూర్ మాలిక్ ఊపిరితిత్తులు ఉగ్గబట్టి అరిచాడు:

"ఘనమైన రూమిత్స్**కి, రెండు శృంగాల సికందర్‌కి అభివాదం చేస్తాం. ఆయన ఆత్మ శాంతించుగాక. కాని ఆయన మరీ చిన్న వయసులో పోయాడు; చెయ్యవలసినవన్నీ చెయ్యదగ్గంత జీవితం లేకపోయింది. ఇప్పుడు మన మధ్య ఒక కొత్త సికందర్ వున్నాడు. మహా శక్తివంతుడు మహమ్మద్, రణనేత మహమ్మద్, నాయకులకి నాయకుడు మహమ్మద్, ఖోరెస్మ్ మహా సామ్రాజ్య నిర్మాత! ఇస్లాం దేశాల మహా ప్రభువు మహమ్మద్ అల్లా ఉద్దీన్ అధికారాన్ని అల్లా విస్తరింప చేయుగాక. మన ఘనమైన షా గౌరవార్థం మూడు చరణాల న్యూబాని వాయిద్దాం".

మరో సారి మద్దెళ్లూ, తాళాలూ, మృదంగాలూ నిశ్చలంగా వున్న గాలిలో బంయ్‌మన్నాయి. పొడుగాటి తుతారలు మోగాయి.

---

* న్యూబా – సికందర్ (అలెగ్జాండర్ ది గ్రేట్) గౌరవార్థం అన్ని స్థానిక రాజ భవనాల్లోనూ ఖోరెస్మ్ షా ప్రవేశపెట్టిన సంగీత రూపకం లేదా స్తోత్రగానం.

** రూమిత్స్ – గ్రీకు.

గోడ దగ్గర మహమ్మద్ గాఢాలోచనా మగ్నుడై కఠినంగా, భయంకరంగా నుంచున్నాడు. మంచులాంటి తెల్లని తలగుడ్డలోపల పెద్ద వూహలు తారట్లాడ్తూ వుండవచ్చు.

"మీకు శాంతి కలుగు గాక, వెళ్లండి" అన్నాడు ఖోరెస్మ్ షా.

ప్రతి ఒక్కడూ దండలు కట్టుకుని అతని దగ్గరికి మునికాళ్లమీద వెళ్లి, బొచ్చు అంగీ అంచుల్ని ముద్దుపెట్టుకుని వెనకడుగు వేసి రాతి మెట్ల చీకటి గుమ్మంలోనుంచి మాయమైపోయాడు.

ఆఖర్న రాజపుత్రులిద్దర్నీ నడిపించుకు వెళ్లినవాడు తైమూర్ మాలిక్.

"నాయనగారు బతికున్న అడివి జెరెన్‌ని తెచ్చి ఇస్తామన్నార"ని షా మనవడు అన్నాడు.

"నీ జెరెన్‌నీ, నిన్నూ కూడా భోంచెయ్యడానికని చిరతపులిని తెచ్చి ఇస్తారు పాదుషా నాకు, కుర్ర కుంకా".

షా బురుజుగోడ అంచున మోచేతిని ఆనుకున్నాడు. కింద వందలాది చదును కప్పులు కలగాపులగంగా వున్నాయి. కోట అసంఖ్యాకమైన కురచ భవనాలలో వుంది. దారులు ఒకటి ఇంకొక దానితో కలుస్తూ పెద్ద బాటగా ఒక తీరులో లేనట్టుగా యేర్పడ్డాయి. చుట్టూతా చదును పహారా బురుజులతో వున్న యెత్తైన పాత గోడ వుంది. నిశ్చలంగా వున్న కాపలావాళు బల్లేలు యెత్తి పట్టుకుని తేజోవంతమవుతూ వున్న ఆకాశ నేపథ్యంలో నుంచున్నారు.

షా దూరంకేసి తేరి చూశాడు. ఆ పెద్ద నగరం మెల్లిగా ఒళ్లు విరుచుకుని లేస్తోంది, ఇళ్ల కప్పుల పైనుంచి పొగని చిమ్ముతూ. అతని చూపు కోటని ఆవరించి వున్న చిన్న ముంగిళ్లలో ఒక దానిమీద నిలిచింది. ఆ ముంగిటి మధ్యలో, ఒక ఎత్తైన పోప్లార్ చెట్టు కింద ఒక సంచార గుడారం వుంది. తన జనానాకి కొత్తగా వచ్చిన ముత్యం ఆ అందమైన తుర్కమెన్ అమ్మాయి గుల్ జామిల్ గుడారం అది. ఆ ఉదయం తన పడగ్గదినుంచి పారిపోయింది ఆమే. ఆమె కోటలోని చీకటి గదుల్లో వుండనని తనకిగా ఒక యుర్త్ కావాలంది. పచ్చిక మైదానంమీద తను వున్నట్టుగానే వుండాలట, శిబిరపు పొగలో పెరిగిన ఆదిమ తుర్కమెన్ అమ్మాయిల్లాగా. ఆమె జనానాలో ఇతర "స్వర్లోక గులాబీల"తో వుండదట. ఒక షాతో యెలా ప్రవర్తించాలో ఆమెకింకా తెలీదు. రాజమాత సుల్తానా తుర్కాన్ ఖాతూన్‌కి ఆమె అంటే అందుకే అసహ్యం.

"ఈ పిల్లకి అతిపొగరు. తన ప్రభువుమీదకి చెయ్యి యెత్తడమే! నా పెంపుడు మంచు చిరుతపులి కంబళ్ల గదిలో తన దగ్గరికి వచ్చినప్పుడు యెలా అరిచి గీపెడుతుందో చూద్దాం".

కింద బురుజు పీఠం దగ్గర ఓ గొంతుక ఖంగు మంది.

"వినండి, నిజమైన ఆస్తికులారా! మహమ్మద్ షా వారు ఇస్లాం ధర్మాలకి పెడ మొఖం అయ్యాడు. పర్షియన్ భ్రష్టుల్ని ఆదరించి, దురాచారులైన కిప్‌చాక్‌లని చుట్టూ చేరనిస్తున్నాడు.

ఈయన తండ్రి తకాష్ షా మాననీయుడైన తుర్కమెన్, కాని ఈ మహమ్మద్ తుర్కమెన్‌లను చీలుస్తున్నాడు. ఈయన్ని విశ్వసించకండి".

"యెవడా పేలుతూ వున్న కుక్క? వకీల్, శాంతి భద్రతలు కాపాడలేవా?"

వకీలు మన్నించమన్నట్టుగా షా ముందు వంగాడు.

"దుర్గం చీకటి కొట్టులో వున్న దర్వీషు మజద్దీన్ ఆ అరిచేవాడు. సంకెళ్లు గాని, చీకటిగాని లొంగదియ్య లేకుండా వున్నాయి. విదుషీమణి మీ తల్లిగారు తుర్కాన్ ఖాతూన్ వాణ్ణి కాపాడుతున్నారు. వాడు పాదుషాలకి వ్యతిరేకంగా జంకుగొంకూ లేకుండా అరుస్తూనే వున్నాడు. నిన్న నగరంలోని దర్వీషులంతా ఓ పొలంలో చేరారు. మహా సమూహంలాగా బురుజు దగ్గరికి వచ్చి యీ పిచ్చి షేక్ మజద్దీన్‌ని విడిపించాలని శపథం చేసుకున్నారు".

మహమ్మద్ వకీల్ని భుజం పట్టుకుని కోపంగా ఊపాడు.

"వదరుబోతా! ముఖ్య తలారి జహాన్ పహ్లవన్ దగ్గరికి పరిగెత్తి వెళ్లి ఈ తిరుగుబాటు చేసిన వాణ్ణి అప్పగిస్తున్నానని చెప్పు. ఈ మనిషిని విడిపించడానికి దర్వీషులు అరుచుకుంటూ వచ్చే లోపునే వేగిర పడమని చెప్పు".

ఖోరెస్మ్ షా బురుజు దిగి దర్బారు మందిరంకేసి వెళ్లాడు. గోడలకి ఎర్రటి జాలరి తెరలు వేలాడ తీసి వున్నాయి. ఇక్కడ పాదుషా వారి రాక కోసం ముగ్గురు ముసలి ఇమామ్‌లూ నిరీక్షిస్తున్నారు. చెప్పులు గుమ్మం దగ్గర వదిలి షా గది మధ్యలోకి వెళ్లి తివాసీమీద కూర్చున్నాడు. నేలలో వెచ్చని కంతమీద కప్పిన పట్టు రొజాయికింద కాళ్లు పెట్టాడు. ఈ కంతకింద కణకణ వుండే బొగ్గుల కుంపటి వుంది.

"రండి, కూర్చోండి, గురవరేణ్యులారా!"

తివాసీ అంచుల దగ్గర మోకరిల్లి వున్న ఇమామ్‌లు ముగ్గురూ ఆరబిక్‌లో కృతజ్ఞతలు చెపుతూ షా దగ్గరికి వచ్చి, తమ కాళ్లనీ రొజాయికింద పెట్టారు.

"కానివ్వండి" అని షా చెప్పాడు. "బాగ్దాద్ ఖాలిఫ్ నాకు లొంగి వుండాలన్న ఆదేశానికి సంబంధించి ఇస్లాం దేశాల మహా పాలకుడై నేను ధర్మంగా వున్నట్టా లేనట్టా, మీ నిర్ణయం చెప్పండి. ఖాలిఫ్ లొంగి రావడానికి నిరాకరిస్తే నేను యేం చెయ్యాలో కూడా తీర్పు చెప్పండి".

ఇమామ్‌లు తాము తీసుకువచ్చిన ఉద్గ్రంథాల్ని తెరిచారు. ఖోరెస్మ్ షా మహమ్మద్ – ఇలమీద అల్లా తర్వాత అంతటి అధికారంగలవాడు – సర్వదా సబబేననీ ఆయన ప్రతి కోరికా, మాటా పవిత్రమైందనీ రుజువు చేస్తూ కొరాన్‌నుంచి ఒకళ్ల తర్వాత ఒకళ్లు పాఠం చదవడం మొదలెట్టారు.

మందిరంలో సగం మసగ్గా వుంది. గుండ్రటి కటాంజనంలోనుంచి మసక వెలుతురు కొంచెంగా వస్తోంది. కప్పు దగ్గర గోడలో ఆ కిటికీని చెక్కారు. ఇత్తడి చమురు దీపం మసక

వెలుతుర్ని ప్రసరింపజేస్తోంది. ఇమామ్‌లు పుస్తకం చూడకుండానే ఆరబిక్‌లో చదడవం మొదలెట్టారు.

మందిరంలో సగం మసగ్గా వుంది. గుండ్రటి కటాంజనంలోనుంచి మసక వెలుతురు కొంచెంగా వస్తోంది. కప్పు దగ్గర గోడలో ఆ కిటికీని చెక్కారు. ఇత్తడి చమురు దీపం మసక వెలుతుర్ని ప్రసరింపజేస్తోంది. ఇమామ్‌లు పుస్తకం చూడకుండానే ఆరబిక్‌లో చదవడం మొదలెట్టారు.

షా వెనక ఘనమైన భోజనాధికారి నుంచున్నాడు. షా తిండి తీర్థాలని అజమాయిషీ చేసే ముఖ్య అధికారి అతను. అర్థోక్తిగా అన్న ఒక మాటతో గాని, కనుసైగతో గాని అతను ఆ దళసరి కంబళ్లమీద ఉలుకూపలుకూ లేకుండా తచ్చాడే నౌకర్లకి ఆదేశాలిస్తాడు. రెండవ అధికారి – వడ్డన చూసేవాడు – ముఖ్య పాచకుడి దగ్గర్నుంచి వెండి పళ్లేల్ని అందుకున్నాడు. షాగారి కరుణా వీక్షణ కోసం నిరీక్షిస్తూ వుండే ముఖాలు గుమ్మంలోనుంచి ఈషణ్మాత్రంగా కనిపిస్తున్నాయి.

ముక్కుకి వెండి నత్తు పెట్టుకున్న నల్ల బానిస ఒకడు షా కాళ్లని కప్పిన రొజాయిమీద వెడల్పాటి కురచ బల్లని పెట్టాడు. భోజనాధికారి లాఘవంగా చేతులు తిప్పి ఆ బల్లమీద పట్టుగుడ్డని – దాస్తర్‌ఖాన్ – కప్పాడు. వడ్డించే మనిషి షా ముందు వెండి తళ్లిక పెట్టాడు. దానిమీద వేడి తేనీటి ఛషకాలున్నాయి. ఉప్పు, మాంసం కొవ్వు వేసి సువాసనతో వుంది తేనీరు. కొవ్వు ముక్కలతో కరకరలాడేటట్టు కాల్చిన పల్చటి అప్పచ్చులు బొత్తిగా వున్నాయి. వెన్న పాత్రలున్నాయి. తేనె, మీగడ పాత్రలున్నాయి.

ఇమామ్‌లు ఆర్భాటంగా చదివే వాటిని వింటూ షా ఛషకం తర్వాత ఛషకం తేనీరు తాగుతూనే వున్నాడు, అప్పచ్చి తర్వాత అప్పచ్చిని తింటూనే వున్నాడు. హాయిగా వున్నాననే భావం కుంపటి వెచ్చదనంతో, వేడి తేనీరుతో, అతనికి తిరిగివచ్చింది. షా వెనక్కి మెత్తమీదకి వాలాడు. దాన్ని హాజరుగా వున్న ఓ అధికారి షా వెనక్కి గెంటాడు. షా గుర్రుకొట్టాడు. తమ ప్రభువులకి ఆ ముగ్గురి ఇమామ్‌లతోనూ పని అయిపోయిందనడానికది సంకేతం. వాళ్లు చప్పుడు చెయ్యకుండా వెళ్లిపోయారు. బల్లనీ, పట్టుగుడ్డనీ తీసేశారు. అధికారులూ, నౌకర్లూ అదృశ్యం అయిపోయారు. నల్లబానిస మాత్రం గుమ్మం వార గొంతు కూర్చున్నాడు, సకల ఇస్లాం దేశ మహాపాలకుడు మేలుకొనే క్షణం కోసం చూస్తూ.

# ఉగ్ర అధినేత

ఎత్తుగా వుండే ‘శాశ్వత విస్మృత శిఖరం’ గుర్‌గంజ్‌లో ప్రతి ఒక్కళ్లకీ తెలుసు. అది చౌకులో షా ప్రాసాదానికి పక్కనే వుంది.

కురచగా వుండే ఇనప గుమ్మం మీద పెద్ద తాళం వుంది. కాపలావాడి మెళ్లో నుంచి పెద్ద తాళం చెవి వేలాడుతూ వుంది. అతను బయట రాతి మెట్టు మీద, కాల్చిన మట్టిగొడకి తుప్పుపట్టిన బల్లేన్ని ఆనించి, కూర్చున్నాడు. అతని ముందు నేలమీద ఓ తివాచీ పీలిక పరిచి వుంది. దారమ్మట పోయేవాళ్లు దానిమీ తమ కానుకల్ని పెడతారు – ఓ కొయ్య గిన్నెడు విరిగిన పాలో, కొన్ని అట్లో, కాసిని ఉల్లిపాయలో, రాగి నాణెమో యేదో. మరింత దాతృత్వం వున్న వాళ్లకి గుమ్మం దగ్గరికి వెళ్లి ఖైదీలతో మాట్లాడే అవకాశం లభిస్తుంది.

శిఖరం పాదపీఠంలో గుండ్రటి మసక కన్నాలు కొన్ని వున్నాయి. అవి కమ్ములు కప్పి వుంటాయి. లోపల వున్న అంధకారంలోనుంచి అణిచి పెట్టుకున్న రోదనలు వీటిగుండా వినిపిస్తూ వుంటాయి. ఆగంతుకుల అడుగుల చప్పుడు చేరువవుతూ వుంటే అంధకారంలోని అరుపులు స్వరంలో హెచ్చవుతాయి. శుష్కించిన చేతులు, గాలిని పట్టుకున్నట్టు, కమ్ముల్లోనుంచి బయటికి వస్తాయి. తలకి మాసిన పీలిక చుట్టుకుని చారల అంగరఖా వేసుకున్న ఒక పౌరుడో లేదా పెద్ద, మంచులాంటి తెల్లని తలగుడ్డ వున్న ముల్లాయో ఆ కాపలావాడికి ఓ రాగి నాణెం విసిరి నిశ్శబ్దంగా ఆ చీకటి కంతల దగ్గరికి పోతారు. కమ్ములగుండా బయటికి చాచుకున్న యెండు మురికి చేతులకి రొటెపెచ్చుని ఇస్తారు. అప్పుడా అరుపులు మరింత హెచ్చుతాయి, కమ్ముల దాకా ఈడ్చుకుంటూ రావడానికి ఓపికలేని వాళ్ల శాపనార్థాలతో కలిసి.

“ఆ అంధకారంలో వున్న వాళ్లకి ఇవ్వండి”.

“ఓ పాత చొక్కా ఇప్పించండయ్యా – నాది చిమ్మెట్లు కొట్టేశాయి”.

“ఓ...య్! నా కంటిమీద అడుగేస్తున్నావ్”.

పక్క వీధిలోనుంచి ఓ గుంపు దగ్గరికి వస్తూ వున్న మూలుగు వినవస్తోంది. ఎత్తైన కూచి టోపీలు పెట్టుకుని పొడుగాటి కర్రలు పట్టుకున్న దర్వేషులు చౌకులో మూగడం మొదలుపెట్టారు. వాళ్లు బృందగానంలో ప్రార్థనలు చెయ్యడం మొదలెట్టారు, వెనక్కాల వేడుక

చూసే గుంపు పోగయి వచ్చింది. దర్వీషులు శిఖరపు ఇనప ద్వారాలపైకి పాకారు, బండరాళ్లతో తాళాన్ని బద్దలుకొట్ట ప్రయత్నించారు. కొంతమంది చీకటి కొట్టు మసక కంతల్లోనుంచి లోపలికి చూసి, అరిచారు:

"షేక్ మజద్దీన్ బాగ్దాదీ! బతికే వున్నావా? నిన్ను గౌరవించాలని వచ్చాం, పవిత్ర విశ్వాసపు త్యాగ జీవీ! త్వరలోనే నిన్ను విడుదల చేస్తాం".

చీకటి కొట్టు లోపలినుంచి దీర్ఘ రోదన వినవచ్చింది. గుంపు నిశ్శబ్దంగా వుంది.

"క్రూరులైన ఖాన్లని అల్లా శపించుగాక, ప్రజా పీడకులు! యీ ఆగ్రహపు పిడుగు ఖాలిఫ్‌మీదకి కత్తి దూసిన వాణ్ణి హతమార్చుగాక! దుండగులకీ, దోపిడీగాళ్లకీ చావు మూడుగాక!"

భయపడిపోయిన కాపలావాడు సురక్షితంగా వుండే కోటలోకి పారిపోయాడు. కోటలోనుంచి కిప్‌చాక్ రౌతులు దూసుకువచ్చారు. వాళ్లు పొడుగాటి కమ్చీలతో గుంపుని తరిమేశారు. దర్వీషులు అరుచుకుంటూ చౌకులో అన్నివేపులా చెదిరిపోయారు.

ప్రాసాద ప్రవేశద్వారాలపైన బురుజు కంతల్లోనుంచి తలలు కనిపిస్తున్నాయి. నారింజపండు రంగు చారల అంగరఖా తొడుక్కున్న పొడగరి ముందుకు వచ్చాడు. మిగిలిన వాళ్లు ఛాతీలమీద చేతులు కట్టుకుని ఆయన ఆజ్ఞల కోసం మర్యాదగా నిరీక్షించారు. ఖోరెస్మ్ షా ప్రాసాద ద్వారం దగ్గర కనబడ్డాడూ అంటే అది దుశ్శకునమే! యెవడో చస్తాడు!

ద్వారంలోనుంచి ఇద్దరు ఇద్దరుగా జాండర్లు – షాగారి తలారులు, కదంతొక్కుతూ వచ్చారు. వాళ్లు బారుగా పుష్టిగా వున్నారు. భుజాల దాకా చేతులు మడుచుకున్న నీలం చొక్కాలు తొడుక్కున్నారు. విశాలమైన పసుప్పచ్చ షల్వార్‌లు వేసుకున్నారు. వాటికి యెర్రటి లేసు కుట్టి వుంది. భుజాలమీద పెద్ద ఖురాసాన్ కత్తులు మెసుకు వస్తూ, వాళ్లు ముందుకు తొసుకువచ్చే గుంపుని వెనక్కి గెంటేస్తూ చౌకులో ఒక వృత్తంగా ఏర్పడ్డారు. వీళ్లని అనుసరిస్తూ వెనక్కాలే ప్రధాన తలవరి "ఉగ్ర అధినేత" మహమ్మద్ జహాన్ పహ్లవన్ సాటిలేని మేటి బలవంతుడు వచ్చాడు. అతను పొడుగ్గా వున్నాడు. అతని భుజాలు ఒంగి వున్నాయి. మనిషి పొడారిపోయి వున్నాడు. చేతులు బారుగా మోచేతులు ఒంచి వున్నాయి. అతను పీకలు పిసికేయడానికి ప్రసిద్ధుడు. అతని అంగీ పసుప్పచ్చ గొర్రెతోలు షల్వార్‌లో దోపి వుంది. వెడల్పాటి తోలు పటకా దానిమీద బిగించి వుంది. అతని భుజాలమీద ఒక బట్టువా సంచి వేలాడుతోంది. అది షా ముందు వుంచవలసిన ముఖ్య అపరాధి తల పెట్టడం కోసం.

చౌకు మధ్యలో ఒక నల్లని బిలం ఆవులించుకుని వుంది. పక్కనే యేత్తుగా వున్న వితర్ది దగ్గర నాలుగు స్తంభాలున్నాయి, వాటికి మధ్యగా అడ్డ దూలాలు వున్నాయి. అర్ధనగ్నంగా వున్న ఇద్దరు బానిసలు గణగణ మోగే సంకెళ్లతో వున్నారు. వాళ్లు పెద్ద మేదరి బుట్టని ముందుకు ఈడ్చుకు వచ్చి దాన్ని వితర్ది దగ్గర పెట్టారు.

ఖైదు కాపలావాడు భారమైన గొలుసులున్న ద్వారం తెరిచాడు. ప్రధాన తలవరి, అతని సహాయకులూ చీకటి కొట్లోకి దిగివెళ్లారు. లోతుల్లోనుంచి చెవులు చిల్లులుపడే అరుపులూ కేకలూ వినవచ్చాయి. తర్వాత నిశ్శబ్దం ఆవరించింది. తలారులు పదిహేను మంది ఖైదీల్ని నడిపించుకు వచ్చారు. వాళ్లందర్నీ కుడి కాళ్లని కట్టి ఒకే గొలుసుతో బంధించారు.

వాళ్లు బురదతో మురిగ్గా వున్నారు. ఇంకా వాళ్ల శరీరాలమీద ఇక్కడా అక్కడా కొన్ని పీలికలు వేలాడుతూనే వున్నాయి. వాళ్ల జుట్టు పొడుగ్గా వుంది. బందిఖానావల్ల మేట వేసుకుపోయి వుంది. చౌకులోకి తూలుతూ వస్తూవుంటే ఈ బందీలు ఒకళ్ల నొకళ్లు ఆసరా కోసం పట్టుకున్నారు. హఠాత్తుగా వెలుతురులోకి రావడంతో వాళ్ల కళ్లు బైర్లు కమ్మేశాయి. శిఖరం ద్వారం ఊగింది. భారమైన తాళం మరో సారి గొలుసులమీద వేలాడింది. అంధకారంలో అంతులేని ఆర్తనాదాలు మళ్లీ రేగాయి.

రక్షక భటులు చావుమూడిన ఈ మనుషుల పక్క నడిచారు. ఈ మనుషుల్లో ఓ ముసలాయన వున్నాడు. అతనికి చిక్కు పడ్డ వెండ్రుకలు గుబురుగా వున్నాయి. అతను తడబడి కింద పడిపోయాడు. ఆ పడ్డంలో మరో ఇద్దర్నీ పడేశాడు. దెబ్బలు కొట్టి వాళ్లని నిలబెట్టారు, ఉరికంబం దగ్గరికి ముందుకు తోలారు. ఎత్తు వితర్దిమీదకి ఖైదీల్ని తోశారు. మోకాళ్లమీద ఆనుకునేట్టు చేశారు. ఖర్మకాలిన మనిషి జుట్టు ఒక తలారి పట్టుకున్నాడు. ముఖ్య తలారి రెండు చేతులతోనూ కత్తి పట్టుకుని ఒక్క వేటుకి తల తెగేసి జుట్టు పట్టుకుని నిశ్శబ్దంగా వున్న గుంపు వేపు యెత్తి చూపించి, బుట్టలో పడేశాడు.

చౌకు అంతా కలకలం వ్యాపించనారంభించింది, “ఈ ఖైదీల్లో ఎవడు దర్వీషుల నాయకుడు, షేక్ మజద్దీన్ బాగ్దాదీ?” అని. ఒళ్లంతా పుళ్లరసి ఒడుతూ వున్న శుష్కించిన ఆ అస్థిపంజరాలు ఒక దాని తర్వాత ఒకటి వెళ్లాయి. పధ్నాలుగో తల తెగగానే మొత్తం చౌకు అంతా అరుపులు పిచ్చిగా లేచాయి.

“పాదుషా మాట్లాడుతున్నాడు! పాదుషా ఆజ్ఞాపిస్తున్నాడు!”

కోట ద్వారం పైన బురుజు కంతలపైకి అన్ని కళ్లూ తిరిగాయి. బురుజు కంతలపైన ఖోరెస్మ్ షా రూపం తళతళలాడే రుమాలుని ఒక్కసారి తిప్పుతూ కనిపించింది. ఆ సూచన ఇదీ: “ఉరితీత ఆపండి! షా క్షమాభిక్ష పెడుతున్నాడు”.

బారు కత్తిని ఎర్ర గుడ్డతో తుడుచుకుంటూ ప్రధాన తలవరి అరిచాడు: “కమ్మర్ని తీసుకురండి”.

క్షమాభిక్ష దక్కిన ఖైదీ తుఘాన్. మీర్జా యూసఫ్ శిష్యుడు. ఇంకా అతను చిన్న కుర్రాడే. భీతి చెందిన కళ్లు అలా చూశాయి యేం జరుగుతోందో అర్థం చేసుకోలేక.

“పాదుషా వారి ఘనమైన దయకి గాను ఆయన ముందు మోకరిల్లు” అన్నాడు తలారి. కుర్రాణ్ణి కోట వేపు తిప్పుతూ, అతని ముఖాన్ని నేలకేసి గెంటాడు.

ఎదురుచూస్తూ వున్న కమ్మరి తుఘాన్ కాళ్లకి వున్న సంకెళ్లని తెగ్గొట్టడం మొదలెట్టాడు.

"ఆగు! ఆగు! యెక్కడికి పోతున్నావ్? నేనింకా పూర్తిచెయ్యలేదు" అని కమ్మరి అరిచాడు. కాని తుఘాన్ తనని యిక యెంత మాత్రమూ చచ్చిన వాళ్ల సంకెలలు బంధించడం లేదనీ చూసి వితర్దిమీదనుంచి గుంపులోకి వురికాడు. అతని వెనకాల అరుపులు రేగాయి. కాని కింద వంగి మూగివచ్చే ప్రజల మధ్య తుఘాన్ దారి చేసుకుంటూ పోయాడు, ఈ భీకర దృశ్యంనుంచి సాధ్యమైనంత దూరంగా వుండేందుకు ఆత్రపడుతూ.

పెద్ద చౌకు ఖాళీ అయింది. ఖైదు కాపలావాడు మళ్లీ భారమైన గొలుసు వున్న తలుపు దగ్గర, తుప్పు పట్టిన బల్లేనికి ఆనుకుని, చేరాడు.

గోడవారనే పాక్కుంటూ ఒక అమ్మాయి వచ్చింది. ఆమె పొడుగాటి రుమాలుతో కళ్లదాకా ముఖం కప్పుకుంది. ఇనప కమ్ములున్న గుండ్రటి కంత దగ్గరికి వెళ్లి, మెల్లిగా లోతుల్లోకి గొణిగింది: "తుఘాన్! కవచాలు చేసే తుఘాన్!"

కమ్ములగుండా చర్మం యెండిపోయిన చేతులు బయటికి వచ్చాయి, ఓ బొంగురు కంఠం జవాబిచ్చింది:

"నీ తుఘాన్‌ని తల తీశారు! మాకు తిండి పెట్టు! అతని కోసం ప్రార్థిస్తాం".

ఆ అమ్మాయి, విదారకంగా యేడుస్తూ కమ్ముల్ని కరుచుకు పోయింది.

"తుఘాన్, మాట్లాడు! నువ్వు బతికే వున్నావా?" కేకలు మళ్లీ చీకట్లో యెగిశాయి.

"నువ్వు తెచ్చిందేమిటో మాకియ్యి! నీ తుఘాన్‌కిప్పుడు దాని అవసరం లేదు. వాడప్పుడే స్వర్గంలో ప్రవక్తతోటి పలావ్ తింటున్నాడు".

ఆ అమ్మాయి తను తెచ్చిన రొట్టెనీ, పుచ్చకాయ ముక్కల్నీ కమ్ముల్ని పట్టుకున్న ఆ చేతుల్లో పడేసి, కాపలావాడి దగ్గరికి పరిగెత్తింది.

"చెప్పు, నాజర్ తాతా, తుఘాన్ చనిపోయినట్టేనా?"

"ఆఁ, చచ్చిపోయినట్టుగానే వుంది. మిగిలిన వాళ్లతోబాటుగా వాణ్ణి తల తియ్యడానికి తీసుకుపోయారు". కాపలావాడు చౌకు వేపు చేతిని ఆడించాడు.

ముసలి దర్వీష్ ఒకడు కాపలావాడి చేతిలో కొన్ని నాణేలు పెట్టి చెవిలో గొణిగాడు:

"తల తీసిన వాళ్లల్లో మన పుణ్య షేక్ మజద్దీన్ బాగ్దాదీ లేడేం? ఉరితీత వాయిదా పడిందా లేక ఖోరెస్మ్ షా అతన్ని క్షమించాడా?"

కాపలావాడు నాణేల్ని బొడ్డు దగ్గర మడతల్లో దోపుకుని, గొణిగాడు:

"యెప్పుడూ శపిస్తూ వుండడంతో మహా షా వారికి షేక్ అంటే కోపం వచ్చింది. తక్షణం అతని తల తరగమని ఆజ్ఞ ఇచ్చారు, దర్వీష్‌లు విడిపించక ముందే".

"అతనింకా బతికే వున్నాడా?"

"ఉహూఁ లేదు. వాళ్లని తీసికెళ్లినప్పుడు ప్రధాన తలవరి జహాన్ పహ్లావన్ తనే స్వయంగా చీకటి కొట్లోకి వెళ్లి, అతని పీక పిసికేశాడు".

# నీడని కుట్టడం

"దారిన పోయే పరాయివాడికి
అభివాదం చెయ్యి – అతను మళ్లీ
రాకపోవచ్చు"
(తూర్పు దేశాల సామెత)

గుంపుని తప్పించుకుని బయటపడ్డ తుఘాన్ ఒక నిర్జన వీధిలో తేలాడు. ఆ వీధిని అంతులేని మట్టి గోడలు ఆవరించి వున్నాయి. దానమ్మటే పోయి అతను కాలవ ఒడ్డుకి వచ్చి చేరాడు.

ఒడ్డుకి ఓ మాదిరి దగ్గరగానే ఇసక మేట పసుప్పచ్చగా మెరిసింది. తుఘాన్ గట్టు దిగి దానిమీదకి వెళ్లాడు. ఒళ్లు కడుక్కుని, పీలికలు ఉతుక్కుని యెండలో వెచ్చగా వాలాడు. చలిగా వున్న పొద్దుటి తర్వాత వెచ్చబడి, ఆలోచనలో మునిగిపోయి విశ్రాంతి తీసుకున్నాడు.

"చీకటి కొట్లోంచి వదిలిపెట్టిన ఖైదీకి యేం ఒరుగుతుంది? పనెవరిస్తారు? నగరం జనంతో కిక్కిరిసి పోయింది. యెవడి మట్టుకువాడు పళ్లెం పలావ్ కోసం దేవులాడుతున్నాడు". తుఘాన్ చీలమండలకేసి చూశాడు. ఇంకా బరువైన ఇనప గొలుసు గణగణ మోగుతోంది. దానికి ముద్ర చెక్కి వుంది: "చచ్చిపోయేటంత దాకా". "చీకటి కొట్లోనుండి వచ్చిన మనిషితో మాట్లాడాలంటే కూడా పాపం ముసలి మీర్జా యూసఫ్ భయపడిపోతాడు. బహుశా బింట్ జాంకిజా మాత్రం నా కోసం విచారిస్తుంది. కాని తను ఆమె దగ్గరికి యెలా వెళ్లగలడు, కుష్టువాడిలాగా పుళ్లతో పులుముకుపోయి?

"యేమైనా నేను మా పాత యజమాని కార మక్సుమ్ దగ్గరికి వెళ్లాల్సి వస్తుంది. ఈ ఇనప గొలుసు పగలగొట్టడానికి ఆయన నాకు సాయం చేస్తాడు".

తుఘాన్ బారుగా వున్న వీధిలో వెళ్లాడు. అక్కడ అంతం లేకుండా దుకాణాలున్నాయి. వర్తకులు బయట కంబళ్లమీద కూర్చుని వున్నారు. తెరిచిన తలుపులమీద సరుకులు వేలాడుతున్నాయి. గోడవారలనే వున్న అల్మారాల్లో పేర్చి వున్నాయి.

భవనాల మధ్య వేలాడదీసిన చాపలతో వీధంతా పెద్ద ఛాయలో వుంది. కళ్లు పొడిచేసే సూర్య కిరణాలు ఇక్కడా అక్కడా యేటవాలుగా పడుతున్నాయి. ఎరుపు, ఆకుపచ్చ రంగు పట్టుతో అలంకరించిన పసుప్పచ్చ పాదరక్షలని కాసేపు ఎండ మెరిపించేది. కొరాన్ సూక్తులు వెండితో పొదిగిన ఇనప డాలుని కాసేపు తళతళ మనిపించేది. తోడేలు తోలు అంచుల టోపీ పెట్టుకున్న సంచారికి వర్తకుడు ప్రదర్శించి చూపించిన చారల గుడ్డలు మెరిసేవి. లేకపోతే జిగేలు మనిపించే రంగురంగుల బట్టలతో వున్న ఆడవాళ్ల బృందం మెరుస్తూ గోచరమయేది.

కమ్మరి వీధి వరసలో కార మక్సుమ్ ఆయుధశాలే ఆఖరిది. దగ్గరికి వచ్చే కొద్దీ సమ్మెట్ల మోత, ఇనప పళ్లేలు ఘల్లు మనడం వినిపించేవి. కమ్మరివాళ్లు పనిలో వున్నారు. సామాన్లని తయారుచేస్తున్నారు. అవి వంపు తిరిగిన కత్తులు, చిన్న బాకులు, పొడుగాటి బల్లేలు.

షల్వార్ తప్ప ఒంటిమీద మరేంలేని పర్షియన్ బానిసలూ, రష్యన్ బానిసలూ శ్రమిస్తున్నారు. కణకణ మండే ఇనుము వల్ల వాళ్లు పైన కప్పుకున్న తోలు గుడ్డలు చిల్లులు పడ్డాయి. దాయలమీదకి వంగి రాగి పాత్రలమీద చిత్రంగా నమూనాలని సుత్తితో పోగరిస్తున్నారు. తెల్లగా వేడిగా వున్న ఇనుంమీద భారమైన సమ్మెట్లని మోదుతూ మిగతా వాళ్లు మూలుగుతున్నారు, చెమటలు కక్కుతున్నారు. ఒళ్లంతా మసికమ్మిన అబ్బాయిలు కొలుముల పక్కన తిత్తులకి గాలిపోస్తూనేనా వున్నారు లేదా నీళ్లు తేవడానికి కొయ్య బాల్చీలు తీసుకుని కాలవల దగ్గరికి పరిగెత్తిపోతూనేనా వున్నారు.

యజమాని కమ్మరి కార మక్సుమ్ దిట్టంగా, వెడల్పాటి భుజాలున్న మనిషి. అతని గడ్డం అంచు ఎర్రటి ఎరుపుతో రంగు వేసి వుంది. అతను చదర పరిచిన మట్టి ఆసనంమీద కూర్చుని వున్నాడు. పనివాళ్లని తిడుతూ, దారమ్మట పోయేవాళ్ల అభివాదాలకి ప్రత్యభివాదం చేస్తూ వున్నాడు. అతని పక్కనే ఇద్దరు బానిసలున్నారు. పడుచువాడైన ఒకడి నుదుటిమీద వేడి ఇనుప ఊచ కాల్చిన మచ్చ వుంది, వాడు పారిపో ప్రయత్నించాడన్న దానికి అది గుర్తు. ముసలాడైన రెండో అతను మసిబారిన ముఖంతో యేం పట్టనట్లుగా వున్నాడు. వాళ్లిద్దరూ తమ చిన్న సమ్మెట్లతోటి ఇనుము, ఉక్కు ముక్కలు ఒకదాని తర్వాత ఒకటిగా పెట్టిన కత్తి వాదరని క్రమ పద్ధతిలో మోదుతున్నారు. వాళ్లు అన్నింట్లోకీ విలువైన పనిని చేస్తున్నారు – "జౌఖర్" అనే ప్రఖ్యాత దమాస్కస్ ఉక్కు పోత. దీన్ని "శీతలం"గానే చెయ్యాలి – వాదరని నిప్పులో పెట్టకూడదు.

"దేనికొచ్చావ్ ఇక్కడికి? పో అవతలికి" అని కమ్మరి అరిచాడు. "ఖైదు పిట్టని నా కార్ఖానాలో పెట్టుకుంటాననుకున్నావా? జిన్దాన్‌లో వున్న వాణ్ణి?"

"నాకు ఓ సమ్మెటని బదులియ్యయ్యా; ఈ గొలుసుని నేనే విరగ్గొట్టుకుంటా".

"నీ మురికి చీకటి కొట్టు వేళ్లతో నా సమ్మెటని మైల పరచనా! పో అవతలికి, లేకపోతే వేడి ఇనుము రుచి చూపిస్తా".

అనుకోని అవమానానికి కోపం వచ్చి తుఘాన్ వెళ్లిపోయాడు. యెక్కడికి పోతున్నదీ యేం పట్టించుకోకుండా దారీ తెన్నూ కానకుండా వెళ్లిపోయాడు. ఇంతట్లోకీ అతని చూపు గోడవార కూర్చున్న దర్వీషుమీద పడింది. పైన కప్పిన రెల్లు కంతలోనుంచి పడుతున్న యెండపొడకి దర్వీషు వేసుకున్న రంగురంగుల గుడ్డ అంగీ తళతళ మెరుస్తోంది.

లోగొంతుకలో పవిత్ర గ్రంథాల నుంచి మంత్రాలు వల్లించుకుంటూ ఆ దర్వీషు పెద్ద దబ్బనంతో ఓ గులాబిరంగు పీలికని మాసిపోయిన నీలపు, పసుపు, ఆకుపచ్చ మాసికలమీద కలిపి కుడుతున్నాడు.

అవమానంతో, విచారంతో నీరసించి తుఘాన్ ఆగాడు. అతని నల్లని నీడ దర్వీషు మోకాళ్లమీద పడింది.

"చూడు నాయనా నీ నీడ నేను కుడుతూ వున్న ఈ మాసికమీద పడింది. నీ నీడని ఈ మాసికతోబాటు కుట్టేస్తున్నాను. ఇప్పుడు నువ్వు నాకు బంధితుడివైపోయావు నీ నీడవల్ల, నేను యెక్కడికెళ్లినా నా నీడలాగా అనుసరించి వస్తావు" అన్నాడు దర్వీష్.

కుర్రాడు అతని దగ్గరికి వెళ్లి పక్కన కూచున్నాడు.

"నిజం అంటున్నావా లేక నువ్వుతాలకా? నేను నిన్ను కొలుస్తాను, నువ్వు చెప్పిందల్లా చేస్తాను. నన్ను గెంటెయ్యకంతే".

దర్వీష్ తల ఊపాడు.

"నేను కమ్మరి అన్న మాటలు విన్నాను. పోన్లే. "విపులాచ పృథ్వీ'. నాతో రా! మనిద్దరం కలిసి 'ఘనమైన బుఖారా'కి వెడదాం. నిన్ను తరిమేసే వాళ్ల దగ్గర వుండకు. నిన్ను రమ్మని పిలిచేవాళ్లని సంతోషభరిత నేత్రాలతో నమ్ము. నువ్విప్పుడు దర్వీషు అంగీకి కుట్టుబడిపోయావు. ప్రయాణ సమయం వచ్చింది. నాతో రా, నా తమ్ముడూ!"

దర్వీష్ తన కర్రతో భారంగా నడిచాడు. వెనక్కాల తుఘాన్ నీరసంగా కుంటుకుంటూ వెళ్లాడు. యెన్నో కమ్మరశాలల వారనే వెళ్లి దర్వీష్ వీధి మొగలో ఆగాడు. అక్కడ ఓ చిన్న కాళీ జాగా వుంది. మసిబారిన సంచారి కమ్మరి ఒకడు వయ్యంది పెట్టుకుని పనిచేసు కుంటున్నాడు. చర్మం కప్పిన సజీవ అస్థిపంజరంలా వున్నాడతను. సన్నగా వున్నా అతని చేతులు సమ్మెటతో, పట్టకారుతో చిన్న దాయమీద నేర్పుగా పని చేస్తున్నాయి. ఎర్రగా మండే మేకులు ఒకదాని దాని తర్వాత ఒకటి చుయ్‌మంటూ కొయ్య నీళ్ల బాల్చీలోకి అలా పడుతూనే వున్నాయి.

"హేయ్! గొప్ప ఉస్తాద్! ఈ ఇనప గొలుసుని కుర్రాడికి నొప్పి పెట్టకుండా తీసెయ్య గలవా?"

"రెండు నల్లని దిర్హమ్‌లిస్తే ఆ పని చేస్తా" అన్నాడు ఆ కమ్మరి, ఆ గొలుసుని పరిశీలించడానికి ఒంగుతూ. "చీకటి కొట్ల కోసం పాదుషా భలే గట్టి ఇనప చక్రాలు పెడతాడు. ఇంకో వెండి దిర్హమ్ ఇస్తే దీంతోటి భేషైన బాకుని చేసి పెడతా".

దర్వీష్ అంగీ లోపల తడిమి ఓ తోలు వల్లువం తీసి కమ్మరతనికి వెండి నాణేన్ని చూపించాడు.

"అలాగే కానీ. కాని దీనమీద ముద్ర చూశావా? 'చచ్చిపోయేటంత దాకా' అని వుంది. బాకుని చెయ్యి కాని దీన్ని చెరగనియ్యకు".

"అలాగే చేద్దాం" అన్నాడు కమ్మరి. తుఘాన్ చెయ్యి అందుకున్నాడు. "నీ కాలు దాయమీద పెట్టు". లోపల్లోపల గొణుక్కుంటూ అన్నాడు " 'చచ్చిపోయేటంత దాకా' –పాదుషానీ, వాడి తలారుల్నీ కొట్టు..."

# వితరణ

కత్రతో తాటించుకుంటూ హాజీ రహీమ్ గుర్‌గంజ్ ముఖ్య విపణి ఇరుకు వీధుల్లో భారంగా నడిచివెళ్లాడు.

అక్కడ బంగారంలాగా నిగనిగ మెరిసిపోతూ అందంగా చెక్కిన నమూనాలతో రాగి పాత్రలు, సామాన్లు, తళ్లిగలు, కూజాలు అమ్మే అంగళ్లున్నాయి. అక్కడ రాగి సెమ్మాలు, మట్టి పాత్రలు, పళ్లాలు, ఛషకాలు వున్నాయి. చైనా సరుకులైన తెలుపూ నీలం రంగు పళ్లేలూ, ఇరాక్ గాజు సామాన్లూ వున్నాయి. ఈ గాజు సామాన్లు స్పర్శకి స్వనం చేస్తున్నాయి.

కొన్ని అంగళ్లలోనుంచి అరుదుగా లభించే సుగంధ తైలం వాసనలు వస్తున్నాయి. దాన్ని మందుల్లోనూ, అత్తరు తయారీలోనూ వాడతారు. తంగుత్ రుబార్బ్‌లాంటి ఖరీదైన మందులు, ఆముదం, గులాబీ తైలం, "హసుల్" సబ్బు పొడుం వున్నాయి. దీన్ని ఉప్పుకయ్యల గడ్డితో నూరతారు – ఇది శరీరానికీ, చిగుళ్లకీర, ఉదరానికీ కూడా మంచిది. స్నానం చేసేటప్పుడు శరీరాన్ని తోముకునేందుకు ఉపయోగించే విలువైన సుగంధ 'మృత్తిక" ఇక్కడ దొరుకుతుంది. తక్షణం జుట్టునంతటినీ తీసేసే పర్షియా ఆకుపచ్చ సశరభేత్తు దొరుకుతుంది. జుట్టుని పెంచే బుఖారా తైలం తలకు రాసుకుందుకు దొరుకుతుంది. టిబెట్ జవాజి, హిందూ దేశపు తృణమణి, సుఖంగా మత్తుకలిగించే గంజాయి మాత్రలు దొరుకుతాయి.

చిత్ర వర్ణాలుగా వున్న మూక అంగడి వీధిలో మూగి వుంది. ఆ మూకగుండా దారి చేసుకుంటూ పోతూ హాజీ రహీమ్ దుకాణాల బయట ఆగాడు, భిక్షం కోసం అన్నట్టు. కాని ప్రతి వర్తకుణ్ణీ శ్రద్ధగా చూస్తూ, యెవళ్ల కోసమో వెతుకుతున్నట్టు ఆగాడు.

ధనవంతుల జౌళి, పట్టు వస్త్రాల బేళ్లున్న దుకాణాలు దగ్గరికి రాగానే కాళ్లు మడం వేసుకున్న ఆ వర్తకులు అతనికి రాగి నాణేలు విసిరి అన్నారు:

"శాంతిగా ముందుకు వెళ్లు!"

దర్వీష్ మురికి వేళ్లు వెండి పట్టు "సింజూష్"నో, గొప్పింటి మొఖాసాదార్లు ధరించే విలువైన బంగారు సరిగ బుటా పట్టునో తాకుతాయని వాళ్లు భయపడ్డారు.

ఆఖరికి ఇక్కడ తను వెతుకుతూ వున్న మనిషి ఇతనేనేమోననిపించేవాడు హాజీ రహీమ్‌కి దొరికాడు. పట్టు బాలీసులకి ఆనుకుని ఇతర వర్తకులతోబాటుగా అతను కూర్చున్నాడు. సమర్‌కండ్ కాగితంలాగా కళావిహీనంగా పీక్కుపోయిన ముఖం, నల్లగా గుంటలు పడ్డ కళ్లు ఇటీవలే అతను జబ్బు పడ్డట్టు సూచిస్తున్నాయి. ఇతర వర్తకులు ఇతన్ని భక్తి ప్రపత్తులతో చూస్తున్నారు. అతనికి బాదంపప్పు తినుబండారాల్నీ, తేనెలో ముంచిన అల్లంరొట్టెనీ, పిస్తా పప్పుల్నీ అందివ్వడానికి ఒకళ్లతో ఒకళ్లు పోటీ పడుతున్నారు. ఆ వర్తకుడు ఖరీదైన తళతళలాడే వెలి అంగరఖా తొడుక్కున్నాడు. రంగురంగుల పట్టు కుళ్లాయి పెట్టుకున్నాడు. చేత్తో నీలం పింగాణీ ఛషకం పట్టుకున్నాడు. అందులో తేనీరు వుంది. అతని చూపుడు వేలుకి పెద్ద నీలం మణి వుంది. అది ఆరోగ్య దీపిక.

దర్వేష్ ఆ దుకాణం ముందు ఆగాడు. వర్తకులు బోలెడు చిల్లర నాణేల్ని అతని భిక్షా పాత్రలో వేశారు. కాని అతనలానే నుంచుండి పోయాడు.

"ఇంకా హాయిగా వెళ్లిపో, భిక్ష వేశాంగా" అన్నారు వర్తకులు.

ఆఖరికి జబ్బు పడ్డ వర్తకుడు అతనికేసి చూశాడు. దర్వేష్‌కేసి చూసి ఆయన ఆశ్చర్యపోయాడు.

"నాతో యేం పని నీకు?" అనడిగాడు.

"నువ్వు ఘనమైన వాడివనీ, ప్రపంచంలో బిడారులతో ప్రయాణం చేస్తూ యెన్నో నీ జీవితంలో చూశావనీ అంటారు. నువ్వు నేనడిగే ఓ ప్రశ్నకి జవాబు చెప్పగలవా?" అన్నాడు హాజీ రహీమ్.

"పవిత్ర గ్రంథాల గురించి అడగదల్చుకున్నావా పండితులైన ఆలిమ్‌లు, పుణ్య మూర్తులైన ఇమామ్‌లూ నాకంటే గొప్పవాళ్లు వున్నారు. నేనా వూరికే వర్తకుణ్ణి. నాకు తెలిసిందల్లా వస్త్రాల గురించే".

"ఓయ్, పుణ్య దర్వేష్ ఇక చాలు! శాంతంగా వెళ్లిపో. నీకు ఇవ్వాల్సింది ఇచ్చాం గదా!" అని మిగిలిన వర్తకులు అరిచారు. వాళ్లు సన్యాసి భిక్షా పాత్రలోకి కొన్ని బాదం పప్పు తినుబండారాల్నీ, కొన్ని పిస్తా పప్పుల్నీ విసిరారు.

"వుహుం, నాకు మీ సమాధానం కావాలి. నా ప్రశ్న నీ గురించే, వర్తక శ్రేష్ఠా".

"అడుగు".

"ఎండనక వాననక నీతోబాటు కష్టాల్నీ దుఃఖాల్నీ పంచుకుంటూ, దీర్ఘ ప్రయాణంలో ఆకలికి బాధపడుతూ తోడు వున్న విశ్వాసపాత్రమైన, నిజమైన మిత్రుడు నీకు వుంటే – అతన్ని గణిస్తావా?"

"ఎవరు మాత్రం గణించరు? చెప్పు" అన్నాడు వర్తకుడు.

దర్వేష్ అందరికేసీ తిరిగి అన్నాడు:

"మీరు సుఖంగా వర్ధిల్లాలి, మీ రోజులు హాయిగా గడవాలి. మీరు ఆస్వాదించేవి మధురంగా వుండాలి! ఒకప్పుడు చక్కటి ఇళ్లూ వాకిలీ తోటా దొడ్డీ వుండి ఐశ్వర్యంతో ఉల్లాసంగా జీవిత తృప్తితో నవ్వుతూ వుండే చుట్ట పక్కాలతో బతికిన వాణ్ణి చూడండి! కాని విధి దెబ్బలు తప్పించుకోలేకపోయాను, అసూయ విపత్తు తప్పించుకోలేకపోయాను. నా గుండె జారిపోయే దాకా నన్ను దురదృష్టం తరిమింది. నా ఇళ్లు ఇక సంతోష భరితంగా లేకపోయింది. తోట వాడిపోయింది. నవ్వుతూ ఉండే బంధువులు రావడం మానేశారు. ప్రతీదీ మారిపోయింది. నా రోజులు చెడ్డవయ్యాయి. ఆకలితో నా కడుపు మాడింది. రాత్రిళ్ళప్పుడు నిద్రలేదు, నా బుగ్గల రంగు తిరిగి రాలేదు. అయినా నాకో మిత్రుడున్నాడు. నా తిరుగుళ్లలో నన్నతను వదిలిపెట్టలేదు, ఓ గుహ నా నివాసంగా వున్నప్పుడు గాని, రాయి నా దిండుగా వున్నప్పుడు గాని, నా దిసపాదం ముళ్లకి గీరుకుపోయినప్పుడు గాని. నా నేస్తం నాతోపాటు ప్రసిద్ధ బాగ్దాద్ నగరానికి, ప్రార్థనల కూడలి మక్కాకి అనుసరించి తోడుగా వుండటం జరిగింది. అంత కాలమూ నాకు బలాన్నిచ్చి నా మూటని మోసి, శీత రాత్రులలో నాకు వెచ్చదనాన్ని ఇచ్చిన నేస్తం. కాని మంచి రోజులు పోయాయి. విధి దెబ్బ నన్నూ నా నేస్తాన్నీ విడదీసింది నేను ఖోరెస్మ్ మైదానం సమీపించగానే. ఇక ఇప్పుడు నేను దరిద్రానికి శాశ్వత సోదరుణ్ణి, నెత్తిమీద ఆస్తరణ లేకుండా..."

జబ్బు పడి కోలుకున్న వర్తకుడు అడిగాడు:

"అయితే నిన్ను నీ మిత్రుణ్ణుంచి యెందుకు విడదీశారు? తను గనక మహమ్మద్ వారి జన్మ స్థలానికి వెళ్లి వుంటే, తెల్ల తలగుడ్డ హాజీ – యాత్రీకుడి చిహ్నంగా పెట్టుకోవాలి. అతన్ని గాని నిన్నుగాని గాయపర్చ సాహసించిన వాడెవరు?"

"విడిపోవడానికి కారణం ఒక వర్తకుడు".

"అతన్ని గురించి చెప్పు".

"బతికున్న పరమ నికృష్టుణ్ణి నేనే అయినా దారిలో నాకంటే నికృష్టుడైన వాడింకొకడు తగిలాడు నాకు. దొంగలు గాయపరిచిన వర్తకుడు. కొనవూపిరితో పడివున్నాడు. నేను చెయ్యగలిగింది చేశాను. గాయాలకి కట్లుకట్టాను. గుర్‌గంజ్‌కి తీసుకురావడానికి ప్రయత్నించాను. అతని కోసమన్చెప్పి స్వర్ణశ్యేనాన్ని భద్రంగా వుంచాను..."

శ్రద్ధగా వింటూ వున్న వర్తకుడు కుదిలి, దర్వేష్ మాటకి అడ్డం వెళ్లాడు.

"నువ్వు ఇక చెప్పక్కర్లేదు. ఆ వర్తకుడికి యేం జరిగిందో మా అందరికీ తెలుసు. అతను నీ ముందు వున్నాడు. నేను నీ కోసం యెంతో ప్రయత్నించాను, నీకు కృతజ్ఞత చెప్దామని. కాని నీ మిత్రుడెవరు? అతన్ని కష్టాలనుంచి తప్పించగలనేమో నేను".

"నువ్వొక్కడివే నా మిత్రుణ్ణి నాకు ఇవ్వగలవాడివి. తను తెల్లని తలగుడ్డని పెట్టుకోవడమూ, హాజీ అని పిలుచుకోవడమూ పడదు. యేమంటే తనకీ సైతాన్‌కి మాదిరీ తోక వుంది. నా

గాడిద. ఈ ప్రాంతం దురాశాపరుడైన న్యాయాధికారి నా గాడిదని తీసుకుపోయాడు. నాకు మరోదాన్ని నువ్వు సంపాదించి పెట్టగలిగితే చాలు, అదే నే కోరేది".

"నీ గాడిద నీకు వస్తుంది. నేను దాన్ని హాకిమ్ దగ్గర్నుంచి కొన్నాను. కాని ఇది చాలదు. ఈ దుకాణంలో యేది కావాలన్నా తీసుకో. శ్రేష్ఠమైన అంగరఖాలు, పదును చేసిన చర్మం చెప్పులు, బట్టలు – నీ ఇష్టం యేం కావాలన్నా తీసుకో".

"నేను దర్వేష్‌ని. నాకు ముతక కంబళీ వుంది.నాక్కావలసిందల్లా అంతే. కాని నా పరమ దిగంబర ఛాయకి బట్టలిస్తావనే నీ దాతృత్వపు అంగీ పట్టుకు వేలాడుతున్నాను. నా నీడ నన్ను అనుసరించి వుంది, తిండి లేక సగం మాడిపోయిన శరీరాన్ని కప్పుకో చూస్తోంది".

వర్తకులు నవ్వారు.

"నీ పరిహాసం చాల్లే దర్వేష్! నీ నీడకి బట్టలెల్లా తొడగం?"

"వూఁ, ఇదిగో అది మీ ముందే వుంది" అంటూ దర్వేష్ గోడకి చేర్లబడి వున్న కుఱ్ఱ తుఘాన్‌ని చూపించాడు.

వర్తకుడు చప్పట్లు చరిచాడు.

"హసన్" అని లోపలికి వచ్చిన నౌకరుతో చెప్పాడు. "ఈ కుఱ్ఱాణ్ణి బట్టల దుకాణం దగ్గరికి తీసికెళ్ళి, దీర్ఘ ప్రయాణంమీద వెళే యాత్రీకుడికి యెలాంటి బట్టలుండాలో అలా బట్టలు తొడిగించు".

"ప్రతీదీ ఇప్పించనా?"

"ఇతనికి 'సార్ త పై' (ఆపాదమస్తకం) దుస్తులు ఇప్పించు. ప్రతీదీ ఇయ్యి–కఫ్తాన్, చొక్కా, షల్వార్, మేజోళ్లు, చెప్పులు, పటకా, తలపాగా. నువ్వు, గౌరవనీయుడైన జహాన్ గెష్త్ (ప్రపంచ సంచారీ) మా ఇంటికి ఈ రాత్రి రా. యెలా రావాలో హసన్ చెప్తాడు".

నౌకరు దర్వేష్‌నీ బిత్తరపోయిన తుఘాన్‌నీ రకరకాల బట్టలు – స్త్రీలని, పురుషులవి, పిల్లలవి–వున్న దుకాణం దగ్గరికి తీసికెళ్లాడు. నౌకరు హసన్ శ్రేష్ఠమైన వాటినన్నిట్నీ ఇస్తూ వున్నాగానీ దర్వేష్ ప్రయాణం కోసం ఉపయోగ పడి గట్టిగా వున్న వాటినే తీసుకున్నాడు. తలకి నీలం గుడ్డ కట్టుకుని, గుర్‌గంజ్‌లో నివసించే సంపన్నుడి కొడుకుడిలాగా దుస్తులు వేసుకుని దుకాణంలోనుంచి తుఘాన్ ఇవతలికి వస్తూ వుంటే, హసన్ దర్వేష్‌కి తోలు వల్లువం ఇచ్చి అన్నాడు:

"మా యజమాని, మాననీయులైన మహమ్మద్ యాల్‌వాచ్ ఈ అయిదు బంగారు దీనార్‌లనీ నీకు ఇమ్మని నాకు ఆజ్ఞ ఇచ్చాడు. దారిలో నీకివి యేం చాలక పోవచ్చు. నీ గాడిద జీను వేసి యజమాని ముంగిట్లో నీ కోసం చూస్తోంది, దాన్నీ ఇమ్మని ఆజ్ఞ. నీ ఇష్టం వచ్చినప్పుడు దాన్ని తీసికెళ్లిపోవచ్చు. మా యజమానికి నువ్వు చాలా పెద్ద సేవజేసి వుంటావు. ఆయన మామూలుగా దాతృత్వం గలవాడు కాదు".

ఆ సాయంత్రం హాజీ రహీమ్ వర్తకుడు మహమ్మద్ యాల్‌వాచ్‌ని దర్శించాడు. ఆ వర్తకుడతన్ని అందమైన తమంగంలో ఆదరంగా ఆహ్వానించాడు. ఓ ఛషకం బంగారు తేనీటిని తాగాక, నౌకరు వెళ్లిపోయాక, వర్తకుడు మెల్లిగా అడిగాడు:

"నువ్విందాక అన్న స్వర్ణశ్యేనం యేమిటి?"

దర్వేష్ అంగీ లోపలనుంచి డేగ బొమ్మ చెక్కిన బంగారు ఫలకం తీసి మహమ్మద్ యాల్‌వాచ్‌కి అందించాడు. ఆ వర్తకుడు గబగబా దాన్ని అందుకుని ఛాతీ లోపల దాచేసుకున్నాడు.

"నేను రేపు వెళ్లిపోతున్నాను బుఖారాకి. ఇక్కడ వుండాలంటే నాకు భయంగా వుంది, ఇక్కడ యెప్పుడూ నెత్తిమీద కత్తి వేలాడుతూనే వుంటుంది, పడేటప్పుడు ఒప్పో తప్పో చూడకుండా. వుహుఁ! పథికుడి దండం, దీర్ఘ యాత్ర మెరుగు..."

# సుల్తానా తుర్కాన్ ఖాతూన్ చేసిన కుట్ర

"తుర్కాన్ ఖాతూన్‌లాంటి యుక్తిగల ఆడవాళ్ల
నాయకత్వం కింద సైనిక ప్రభువంశీకుల (కిప్‌చాక్‌ల)
పలుకుబడి తర్వరలోనే సింహాసనాధికారాన్ని కుదిపేసింది.
కిప్‌చాక్‌లు తాము ఆక్రమించిన భూముల్ని, తాము
'విమోచనదార్లు'గా వచ్చును, నిరాటంకంగా బీడు చేశారు. ఈ
రకంగా వాళ్లు తమ సార్వభౌముణ్ణి ప్రజా ద్వేషానికి గురిచేశారు.
(అకడమీషియన్ వి.వి.బార్‌టోల్డ్)

కమాను గుమ్మం మడత ద్వారాలు తెరుచుకున్నాయి. గెంతే గుర్రాలమీద ఇద్దరిద్దరుగా రౌతులు ఇవతలికి వచ్చారు. వాళ్లు తెల్లని గొర్రెతోలు టోపీలు పెట్టుకున్నారు. ఎర్ర చారల కఫ్తాన్లు వేసుకున్నారు. వంపు తిరిగిన వాళ్ల కత్తులు బంగారంతో మెరుస్తున్నాయి.

ఖోరెస్మ్ షా మహమ్మద్ మెరిసే వజ్రాలు పొదిగిన తెల్లని పట్టుపాగా పెట్టుకుని హుందాగా ఠీవిగా వున్నాడు. వెడల్పాటి వెన్ను వున్న గుర్రంమీద విచారంగా కూర్చున్నాడు. ఆ గుర్రంమీద బంగారు ముస్తీబు వేశారు. అది జేగురు రంగు గుర్రం. షా తొడుక్కున్న యెర్ర కుచ్చు అంగరఖా, విలువైన రాళ్లు పొదిగిన కత్తి యెండలో కళ్లు మిరుమిట్లు కొల్పేటట్టు ప్రకాశిస్తున్నాయి.

ఖోరెస్మ్ పాలకుడి వెనక అగ్గి పిడుగుల్లాంటి ఇద్దరు ఆశ్వికులు స్వారీ చేస్తున్నారు. వెండి పట్టెడ వున్న కర్రి మొద్దు తుర్క్‌మెన్ గుర్రంమీద షా వారసుడు, తుర్క్‌మెన్ తల్లి తనయుడు అయిన జలాలుద్దీన్ కూర్చున్నాడు. అతని పక్కన పొడుగాటి నల్లని జూలు జళ్లుగా అల్లిన కొంచెం డాబు తక్కువ వన్నె గుర్రంమీద ఓ కుర్రాడు స్వారీ చేస్తున్నాడు. అతను అలంకృతమైన చిన్న అంగరఖా తొడుకున్నాడు. షాకి కిప్‌చాక్ రాకుమారి వల్ల పుట్టిన కనిష్ట, ప్రియ పుత్రుడు.

వాళ్ల వెనకాల ఖోరెస్మ్ పెద్దలు ఎర్ర పాగాలు కప్పిన గుర్రాలమీద స్వారీ చేసుకువచ్చారు.

షాగారి వెయ్యి మంది రౌతులు రెండు భాగాలుగా చీలిపోయారు. ఒక భాగం విపణిలోని ముఖ్య వీధిగుండా వెళ్లింది, చూడపోగయిన గుంపుని కమ్చీలతో తరిమేస్తూ. రెండవ భాగం షా ఊరేగింపుని దగ్గరగా అనుసరించి వచ్చింది.

దారిలో తగిలిన వాళ్లందరూ ముఖం నేలమీదకి వంచి మోకరిల్లారు. మహత్తర ఇస్లాం దేశ పాలకుణ్ణి దగ్గరగా యెవర్నీ చూడనివ్వలేదు. భయం కలిగించే పెద్ద తోలు బూరాల బొబ్బల్నీ, ఢంకాల మోతనీ విని వర్తకులు ఖరీదైన తివాచీలని తీసి దుకాణాల ముందు, బురదలో రాజాశ్వ ఖురాల కింద పరచడానికి వేగిరపడ్డారు.

పొగడ్తలకీ, భక్తి పూర్వకమైన అరుపులకీ షా మహమ్మద్ అలవాటుపడి వున్నవాడే. తన జేగురు గుఱ్ఱం ముందు వినయపూర్వకంగా వంగిన అసంఖ్యాకమైన చారల వీపుల్ని అతను యేం పట్టనట్టు ఈషణ్మాత్రంగా చూశాడు. పొంగరించిన ఆ కవళికల్లో యేం వెల్లడవదు. తెల్లని పాగా ముందు పెద్ద నల్లని గడ్డం స్ఫుటంగా వుంది.

మాతృ శ్రీ సుల్తానా తుర్కాన్ ఖాతూన్‌గారి ప్రాసాద ప్రవేశ ద్వారం ఇరువేపులా యెంపికైన కిప్‌చాక్ యోధులున్నారు. బాణాలు చొరుచుకుపోలేని ప్రఖాత ఖోరెస్మ్ గొలుసు కవచం ధరించారు వాళ్లు. ముక్కుకు దెబ్బ తగలకుండా కాసే నాసికా రక్షక భాగం వున్న శిరస్త్రాణాలు పెట్టుకున్నారు. చేతులతో వంగేటటువంటి పొడుగాటి బల్లేల్ని పట్టుకున్నారు.

"అజేయుడైన షా మహమ్మద్ వర్థిల్లాలి!" అంటూ గర్జించారు ఆ యోధులు. ఆ కేకలని అక్కడి గుంపు అందుకుని, ప్రతిధ్వనింపజేసింది. మనుషులు పక్క వీధుల్లో నుంచి పరిగెత్తివచ్చి, ఇళ్ల కప్పులపైకీ, మట్టి గోడలపైకీ యెక్కారు.

ఆచారానికి విరుద్ధంగా కిప్‌చాక్ యోధులు తన అంగరక్షకులకంటే యెక్కువగా, చాలా రెట్లు యెక్కువగా వుండడం షాకి ఆశ్చర్యకారకమైంది. ఇంత మంది సైనికులెందుకు? ఇదేమన్నా మాటు వల కాదుకదా? ఇంకా వేళ మించిపోక ముందే తిరిగి వెనక్కి పోవడం మెరుగేమో? వుహుఁ, అనుమానానికి తావు లేదు కదా? కన్న తల్లి కొడుక్కి ఉచ్చు పన్నుతుందా? తల్లికి తనతో సమానంగా పూర్తి అధికారాన్ని ఇవ్వలేదూ తను, తండ్రి షా తకాష్ చనిపోయాక? ఆమె సొంత కంగిలి తెగలోని కిప్‌చాక్ యోధులు తన దండ యాత్రలన్నింటిలోనూ పాల్గొలేదూ? వాళ్ల తల్లిదండ్రులు కల్లో కూడా ఊహించని కానుకల్ని కొల్లగొట్టిపోలేదూ? పద ముందుకు!

మహమ్మద్ గుఱ్ఱానికి కమ్చీకోల తగిలించాడు. రెండు అంగల్లో ద్వారం గుండా లోపలి వాకిట్లో ప్రవేశించాడు.

ఆచార ప్రకారంగా డాబు అంగరఖాలు వేసుకున్న నెరిసిన గడ్డం కిప్‌చాక్‌లు గుఱ్ఱం కళ్లెం అందుకున్నారు. దారిపైన పరిచిన ముఖమల్‌మీదకి ఖోరెస్మ్ షా గుఱ్ఱం జీనుపైనుంచి ఉరికాడు. వయసు పైబడ్డా నిటారుగా, బింకంగా వున్న షా భరంతు మెట్లు యెక్కి నడిచాడు. అది సన్నటి, వంపులు తిరిగిన స్తంభాలమీద వుంది. నడుములు వంచి వందనం చేస్తూ

వున్న మనుషుల పంక్తులు దాటి చల్లగా ప్రశాంతంగా వున్న ప్రాసాదంలోకి వెళ్లాడు. బంగారు ముక్కర వున్న నీగ్రో ఒకడు అతని ముందుకి వచ్చాడు.

"రాణులకి రాణి నిన్ను చూడ్డం కోసం నిరీక్షిస్తోంది. సలాం మహాప్రభూ!" అంటూ నీగ్రో తెరని ఓ పక్కకి లాగి పెద్దగా అరిచాడు: "ప్రపంచాధినేత! విశ్వాస రక్షకుడు! ఇస్లాం కరవాలం!"

షా ముందుకి అడుగువేశాడు. మందిరంలోని మసక చీకట్లో మెరిసే బంగారు అల్లిక బట్టల్లో చిన్న ఆకారం నుంచుంది. ఆ మందిరం చెక్క గోడలు, అల్లిక కిటికీలు నగిషీ పెట్టి వున్నాయి. రెండు వేపులా ఇరవై మంది కిప్‌చాక్ ఖానులు శిలా ప్రతిమలా అర్ధవలయంగా మోకరిల్లి వున్నారు. మహమ్మద్ ఛాతీమీద చేతులు కట్టుకుని, వంగి, తల్లి దగ్గరికి మునివేళ్లమీద వెళ్లి మెల్లిగా అన్నాడు:

"సలాం తుర్కాన్ ఖాతూన్, పుణ్యతేజమా, ధర్మ మూర్తీ".

జరీ ఉడుపుల మడతలు కదలాడాయి. ఉష్ట్ర పక్షి ఈకల తురాయి పెట్టిన పాగా దాదాపు నేలని తాకి మళ్లీ పైకి లేచింది.

"ప్రపంచ మహాధినేతకి తల్లి, బీద దుఃఖపూరిత వితంతువు స్వాగతం చెప్తోంది. ఆమె పక్కన కూర్చుని ఆనందాన్ని, సంతోషాన్ని కలిగించు".

మహమ్మద్ నిటారుగా నుంచుని కళ్లు యెత్తి తన ముందున్న చిన్న ముఖాన్ని చూశాడు. ఆ ముఖం యెరుపు, తెలుపు రంగులతో ముసురుకుని వుంది. నల్లని కళ్లు చొచ్చుకు చూస్తున్నాయి. వాటి లోతుల్లో అరుణ జ్వాలలు తారాడుతున్నాయి. తుర్కాన్ ఖాతూన్ కాళ్లు వెనక్కి మడుచుకుని ఆ అష్టకోణ తఖ్తుమీద మడం వేసి కూర్చుంది. ఆ తఖ్తు పైన చదును చాందినీ పళ్లెంలాగా వుంది. దేశ పాలకుడు కాబట్టి తల్లి పక్కన కూర్చుండి వుండాలి. కాని దానిమీద చోటు లేకపోయింది. ఆవిడ జరీ బుటా ఉడుపులే అంతా ఆక్రమించేశాయి. దాంతోటి షా తివాచీమీద కూర్చోవాల్సి వచ్చింది. తుర్కాన్ ఖాతూన్‌కి కావాల్సింది సరిగ్గా అదే. ఖోరెస్మ్ షా తనకంటే తగ్గు స్థానంలో కూర్చున్నాడని తన కిప్‌చాక్‌లకి చూపించాలి.

మహమ్మద్ చేతులు పైకెత్తి ప్రార్థన చేశాడు. వేళ్ల అంచులు గడ్డంమీద పోనిచ్చాడు. అందరూ లోగొంతుకలో ప్రార్థనని వల్లించారు.

తుర్కాన్ ఖాతూన్ సన్నని చిన్న స్వరంతో, తల ఊపుతూ మాట్లాడింది. భారీజరీ బుటా ఉడుపుల్లో ఆవిడ శరీరపు కదలికలు కనిపిస్తూనే వున్నాయి. ఆవిడ పాగాకి వున్న ఈకలు కంపించాయి.

"ఇద్దరం కలిసి యెంతో ప్రాముఖ్యం వున్న విషయాలని పరిశీలించవచ్చని నీకు కబురు చేశాను ఘనమైన ముద్దుల తనయా! ఆ విషయాలు మన ఆదర్శప్రాయమైన ఖోరెస్మ్ షాల

వంశానికీ, విశ్వాస పాత్రులైన కిప్‌చాక్ ఖాన్‌ల భవిష్యత్తుకీ సంబంధించినవి. మనం మన సింహాసనాన్ని పరిరక్షించుకోవాలి; మన అధికారాన్ని, మిత్రుల్ని కాపాడుకోవాలి..."

గదిలో నిశ్శబ్దం ఆవహించింది. అల్లిక కిటికీ కంతల్లోనుంచి దూరంగా మూకలు యెలుగెత్తి అరిచే అరుపులు వినవస్తున్నాయి: "ఖోరెస్మ్ షా వర్ధిల్లాలి!"

"మీ వివేకభరిత మాటల్ని వింటున్నానమ్మా".

"దూర దేశాలకి నూతన దండయాత్రల నిమిత్తం నువ్వు వెడుతున్నావని మా ఈ సాదా నివాసానికి వదంతులు వినవస్తున్నాయి. నీ రీవిగల అశ్వం యుద్ధరంగం మీద మళ్లీ కనిపిస్తుందట. కాని "విధి పుస్తకం"లో పరమేశ్వరుడు రాసిన శాసనాలని వాటి వ్యవధికి ముందే యెవరు జోస్యం చెప్పగలరు? పోరులో విశ్వాస రక్షకుడిగా అమర్త్యత్వం పొంది, స్వర్గక్షేత్రాలకి తృటిలో నిన్ను తీసుకుని పోవడం జరిగితే, నీ ఘనమైన హస్తం మమ్మల్ని నడిపించడానికి వుండదు, మేం అల్లకల్లోలం అయి నాశనం అయిపోతాం – అల్లా మమ్మల్ని కాపాడుగాక! మా గర్విష్టి మనవడు జలాలుద్దీన్ మూలల్లో తుర్క్‌మెన్‌లతో మంతనాలు జరిపి మా కిప్‌చాక్‌లందర్నీ హతమార్చాలని కుట్రలు పన్నుతూ వున్నందువల్ల, నువ్వు లేని కల్పంలో ఖోరెస్మ్ దేశానికి మరో పాలకుణ్ణి నియమించే సామయిక ఆలోచన చెయ్యడం మాకు మంచిది కదా?"

"అమోఘమైన మాటలు! వజ్రపు తునకలు!" అన్నారు కిప్‌చాక్ ఖానులు.

"అంచేత" అంటూ సుల్తానా మాత చెప్పసాగింది. "ఈ మా కిప్‌చాక్ ప్రజలందరి విఖ్యాతులైన ఖానులందరితోనూ సంప్రదించి నువ్వు నీ కనిష్ఠ పుత్రుడు, నీ ముద్దుల భార్య కిప్‌చాక్ యువరాణి తనయుడు కుతుబుద్దీన్ ఉజ్‌లా షాని సింహాసనానికి నీ వారసుడిగా పేర్కొనాలని నేను నిర్ణయించాను. జలాలుద్దీన్ అతి సుదూర ప్రాంతంలో పాలించాలనీ నిర్ణయించాను. అతను నీకు, మా అందరికీ కూడా యెడతెగని ప్రమాదం".

షా మహమ్మద్ యేం జవాబు చెప్తాడోనని అందరూ మౌనంగా వున్నారు. షా మాట్లాడలేదు. వణికే వేలి చివర్న పట్టులాంటి గడ్డాన్ని ఉంగరాలు తిప్పుతూ కూర్చుండిపోయాడు.

"నువ్వు దీన్ని కాదంటే కిప్‌చాక్‌లందరూ తక్షణం ఖోరెస్మ్ వదిలిపెట్టి పచ్చిక మైదానాలకి వెళ్లిపోతారు. ఇక నేను, వాళ్లల్లో అతి కనీసపు బీదదాన్నిగా, వాళ్ల తిరుగుళ్లతోబాటు పోతా".

మహమ్మద్ ఇంకా సందేహిస్తూ వుండడం చూసి తుర్కాన్ ఖాతూన్ తలని కొద్దిగా ఆడించింది. ఆమె వెనకాల ఆమె ఆస్తిని అజమాయిషీ చేసే పడుచు ప్రభువు మహమ్మద్ బెన్ సాలిహ్ నుంచున్నాడు. అతను పూర్వం గులాం (నౌకరు) స్ఫురద్రూపంగా వుండడంవల్ల ఉన్నత స్థానం ఇచ్చారతనికి. అతను ఆ తల ఆడింపుని అర్థం చేసుకున్నాడు. మందిరంలో నుంచి అవతలికి వెళ్లాడు. మళ్లీ వెంటనే తిరిగివచ్చాడు. చిన్న జరీ అంగరఖా తొడుక్కున్న యేడేళ్ల కుర్రాణ్ణి తీసుకువచ్చాడు.

"నీ సింహాసనానికి నూతన వారసుడిడుగో" అని తుర్కాన్ ఖాతూన్ కటువుగా, ఆజ్ఞాపించే కంఠంతో అరిచింది. "ఖోరెస్మ్ షా ఇతన్ని సింహాసన స్తంభంగా అంగీకరిస్తున్నట్టు కిప్‌చాక్ ఖాన్‌లకి, ప్రభువులకి, సైనికులకి, సామాన్య ప్రజానీకానికి ప్రకటిస్తున్నాను".

ఖాన్లందరూ నుంచుని, ఆ కుర్రాణ్ణి కొన్ని సార్లు తమ తలలపైన యెత్తారు.

"మా జాతి కిప్‌చాక్ సుల్తాన్ వర్ధిల్లాలి!"

మహమ్మద్ నుంచుని కొడుకుని చేతుల్లోకి తీసుకుని అతని మామ్మ తుర్కాన్ ఖాతూన్ పక్క కూర్చోబెట్టాడు.

"వినండి ప్రభువుల్లారా!" అన్నాడు మహమ్మద్. "మీరే చూశారు కదా. మీ కోరికలు నెరవేరాయి. ఇప్పుడు మీరు నా కోరికని తీర్చాలి! బాగ్దాద్ ఖాలిఫ్ నాసిర్ నా పాత శత్రువు మళ్లీ నామీద కుట్ర జరుపుతున్నాడు. నా ప్రజల్ని నామీద తిరుగుబాటుకి ఉసి కొల్పుతున్నాడు. ఈ దుష్ట ఖాలిఫ్‌ని కూలదోస్తే గాని ఖోరెస్మ్‌లో శాంతి లేదు. అప్పుడు మనకి విధేయంగా వుండే నూతన ఖాలిఫ్‌ని మనమే యెంపిక చేసి నిలబెడతాం. అంచేత ఖాలిఫ్ సైన్యాల్ని నాశనం చేసే దాకా నా వాడి బల్లాల్ని బాగ్దాద్ గడ్డమీదకి తోలిందాకా నేను కన్నుమూయను".

కిప్‌చాక్‌ల్లో కల్లా ముసలాడైన ఒకతను మాట్లాడాడు. అతనికి కళ్లు సగం మసక. యెండిపోయి, పల్చని నెరిసిన గడ్డంతో వున్నాడు.

"నీ అధికార హస్తం యెటు చూపిస్తే అటు మేమంతా ఒక్క మనిషిగా స్వారీ చేసుకువస్తాం. కాని మొదటగా మన శిబిరాలని శాంత పరచడం, వణికే మన ప్రజలకి సహాయం ఇవ్వడం ముఖ్యం. కిప్‌చాక్ పచ్చిక బీళ్లనుంచి దూతలు దౌడు తీసుకుంటూ వస్తున్నారు. ప్రాచ్య ప్రాంతంనుంచి అజ్ఞాత వ్యక్తులెవరో మన భూభాగాలమీదకి మూగి వస్తున్నారనీ, వాళ్లు అసలు యెన్నడూ పవిత్ర ఇస్లామ్‌ని గురించి విని యెరగని పరమ పాషండులనీ చెప్తున్నారు. వాళ్లు మందలతో, ఒంటెలతో, బళ్లతో వస్తున్నారనీ చెప్తున్నారు. పశువులు మేసే మన పచ్చిక బీళ్లని వాళ్లు ఆక్రమించారనీ, మన శిబిరాల్ని విచ్ఛిన్నం చేశారనీ కూడా వింటున్నాం. మనం త్వరగా మన పచ్చిక బీళ్లమీదకి వెళ్లి ఈ పాషండుల్ని అణిచి, వాళ్ల మందల్ని పట్టుకుని, వాళ్ల ఆడాళ్లనీ పిల్లల్నీ మన సైనికులకి బానిసలుగా ఇవ్వాలి".

"నీ సైన్యాన్ని పచ్చిక బీళ్లమీదకి నడిపించు!" అని ఖానులు అరిచారు.

రాస్తూ వున్న మీర్జాబ చేత్తో కలం పుచ్చుకుని ఖోరెస్మ్ షా దగ్గరికి వెళ్లి, రాసిన ఒక కాగితాన్ని అందిస్తూ మోకాళ్లమీద వాలాడు.

"యేమిటిది?" అని షా అడిగాడు.

"నీ ప్రియాతి ప్రియమైన కనిష్ట పుత్రులు కుతుబుద్దీన్ ఉజ్‌లా షాకి వారసత్వాన్ని సంక్రమింప చేసే ఆజ్ఞాపత్రం. ఇతనికి వ్యవహార జ్ఞాన వచ్చే వయసు దాకా ఖోరెస్మ్ పాలకురాలిగా, వారసుడికి రక్షకురాలిగా ఇతని మామ్మ, నీ తల్లి సుల్తానా తుర్కాన్ ఖాతూన్

వుంటారు. రాణిగారి ఆస్తి నిర్వాహకులు మహమ్మద్ బెన్ సాలిహ్ యువ వారసుడికి బోధకుడుగా ఖోరెస్మ్ ముఖ్య వజీర్‌గా వుంటారు".

"ఇక నువ్వు, విఖ్యాతుడైన పుత్రా, అజేయుడైన ఖోరెస్మ్ షా మహమ్మద్ మేం పాలిస్తూ వుండగా నీ సైన్యంతోటి ప్రపంచమంతా విహరించు, నీకిష్టమైన వాళ్లతో యుద్ధం చెయ్యి" అంది తుర్కాన్ ఖాతూన్.

మహమ్మద్ ఆజ్ఞాపత్రంమీద దస్కత్తు చేశాడు, దాన్ని చదవకుండానే. రెల్లు కలాన్ని తల్లికి ఇచ్చాడు. ఆమె కలం తీసుకుని, జాగ్రత్తగా పెద్ద అక్షరాలతో రాసింది:

"తుర్కాన్ ఖాతూన్, ప్రపంచ యేలిక, పృథ్వీమీద వున్న మహిళలందరికీ రాణి".

షా మహమ్మద్ చుట్టూతా చూశాడు, తన పెద్ద కొడుకు జలాలుద్దీన్ కోసం వెతికాడు. అతని కళ్లల్లోకి చూడ్డానికి షాకి భయమైంది. కాని జలాలుద్దీన్ అక్కడ లేడు. వకీలు ఖోరెస్మ్ షా చెవిలో మెల్లిగా చెప్పాడు:

"ఇంతమంది కిప్‌చాక్ సైనికులుండడం చూసి "నేను గొర్రెని కాను, కిప్‌చాక్ కబేళాలోకి పోవడానికి' అని చెప్పి జలాలుద్దీన్ ఖాన్ వెనక్కి వెళ్లిపోయాడు".

# జనానా బందీ

ఖోరెస్మ్ షాగారి మూడు వందల మంది భార్యలని "మంచి హుషారుగా" వుండేటట్టు చూసే బాధ్యత వకీలుగారి భుజస్కంధాలపైన వుంది. వాళ్ల ప్రవర్తనకి కూడా ఈయనదే జవాబుదారి. వాళ్లు జీవితాన్ని తగినంత గంభీరంగా పట్టించుకోక వాళ్లల్లో యేవేనా కలతలు కలవరాలు కలిగితే ఖోరెస్మ్ పాలకులకి తెలియజెయ్యవలసిన బాధ్యతా ఆయనదే.

తుర్క్‌మెన్ పచ్చిక బీళ్లనుంచి వచ్చిన అమ్మాయి గోప్య వూహల్ని, కన్నీళ్లని కనిపెట్టవలసిందిగా షా మహమ్మద్‌నుంచి ఆజ్ఞలు అందుకుని, ఇలాన్ టార్చ్ ("పాము పొలుసు") అనే సోదెకత్తె సాయాన్ని వకీలు అడిగాడు. ఆడవాళ్ల మనసుల్లో ,చిక్కుపడిన సాలెగూళ్లని విప్పడంలో ఆమె అనుభజ్ఞురాలు. ఆమె సోదెకత్తె, మంత్రకత్తే కూడా. అంతేకాక మంచి సరదా అయినవీ భయంకరమైనవీ కథలు కూడా చెప్పగలది.

ఆందోళన పడ్డ వకీలుగారి గజిగజి ఆజ్ఞలని విడమర్చి తేలుస్తూ "పాము పొలుసు" ఆయన్ని నిజంగా చిక్కు పెట్టూ వున్నవి మూడు ప్రశ్నలని ముగించింది: గుల్ జామిల్ గుబులుతో నిట్టూర్చేందుకు పచ్చిక బీళ్లమీద యెవడేనా అగ్గి పిడుగులాంటి ఆశ్వికుడున్నాడా? ఆమెకి రహస్యంగా తుర్క్‌మెన్‌లతో సంబంధాలున్నాయా? ఆమె షాతో గడిపిన నాటి రాత్రి ఆమె దగ్గర బాకు వుందా?

"నాకంతా అర్థమైంది" అని చేతిని చాస్తూ "పాము పొలుసు" జవాబు చెప్పింది.

వకీలు ఆమె చేతిలో డబ్బు పెట్టాడు.

"ఈ డబ్బులో బంగారం యెక్కడా కనిపించదే".

"నువ్వు చెప్పేది అర్థమైందైతే, నీకు బంగారం వస్తుంది".

ఈ వృద్ధ సోదెకత్తె యెండిపోయి నల్లగా వుంది. ఆమె చెవులకి పెద్ద వెండి పోగులున్నాయి. ఆమె జనానా "కొత్త ముత్యం" వున్న ముంగిటి బద్దల చట్రం దగ్గరికి వెళ్లి నుంచుంది. నల్లని కళ్లని లగ్నం చేసి ముంగిట్ని ఒక్కసారి చూసింది. దానికి చుట్టూతా యెత్తు గోడలున్నాయి. జనానా స్త్రీల ముంగిటికి మామూలుగా వుండేటట్టే ఒక పక్కన కిటికీలులేని పొడుగాటి భవనం వుంది. దాని ముందు భరంతు వుంది. భవంతికి రెక్కలు

మూసుకునే అయిదు గుమ్మాలున్నాయి. ముంగిట్లో ఒక చిన్న కాలవపారుతూ ఓ గుండ్రటి తటాకంతో పడుతున్నాయి. తటాకానికి రెండు వేపులా గులాబీ పువ్వులు పుష్కలంగా వున్న మందగట్లు వున్నాయి. దూరంగా గోడవార ఎత్తైన రీవిగల పోప్లార్ చెట్టు కింద తెల్లని బొచ్చు అట్ట తుర్క్‌మెన్ యుర్త్ వుంది.

తొడుక్కున్న చారల బట్టల్ని సవరించుకుని ఇలాన్ టార్చ్ తటాకం దగ్గరికి వెళ్లింది. రాతి మెట్టుమీద నల్లగా నాజూగ్గా బాదంకాయల్లాంటి కళ్లున్న పడుచు అమ్మాయి కూర్చుని వుంది. ఆమె చిన్న కష్గార్ పాత్రలోనుంచి అన్నం మెతుకుల్ని యేరి బంగారు చిన్న చేపలకి విసురుతోంది. ఇలాన్ టార్చ్ ఆమె ముందు రాతి పలకమీద, మోకరిల్లి, ఆమె ఎర్రటి పరికిణీ అంచుని ముద్దుపెట్టుకుంటూ, సన్నగా మంత్రం చదివే గొంతుకతో అంది:

"సలా, పుష్ప హాసమా! నీ చేతుల్లో సూర్యుడి కాంతిని చుంబిస్తున్నాను, నీ నీడకి మోకరిల్లుతున్నాను".

ఈ సోదెకత్తె ఆ అమ్మయి పక్కన కూర్చుంది. అడ్డూ ఆపూ లేకుండా పొగడ్తలతో స్తోత్రం చేస్తూనే వుంది. కాని అంత సేపూ తనలో తనే అనుకుంటూ వుంది: "పాదుషా ఈ పిల్లని యెందుకు ప్రేమించినట్టు? ఆప్రికాట్‌లాగా పీలగా చామనచాయగా వుంది. షా జనానాలోని ఇతర సౌందర్యరాశుల మాదిరీ వైభవభరితంగా బొద్దుగా లేదే. నిజంగా రాజుల పిచ్చికి అర్థం లేదు".

"పచ్చిక బీళ్లనుంచి యేదన్నా వార్త వచ్చిందా?" అంటూ గుల్ జామిల్ ఆమె ఆలోచనల్ని భగ్నం చేస్తూ అడ్డం వచ్చింది.

"పచ్చిక బీళ్ల ఖాన్ ఒకడు కొంత కాలం కితం నాకో ఒంటెని పంపించాడు, తను ప్రేమించిన అమ్మాయి కోసం తన బెంగని నేను బాగు చేసినందుకు. వాళ్లంతా నిన్ను గుర్తుపెట్టుకున్నారు. నీ అదృష్టం గురించే వాళ్లంతా మాట్లాడుకుంటున్నారు. 'ఖోరెస్మ్ షా తన మిగిలిన పెళ్లాలందరికంటే ఎక్కువగా మన తుర్క్‌మెన్ అందాల రాశినే ప్రేమిస్తున్నాడు. అందమైన వజ్రాలు పొదిగిన ఉంగరాల్ని ఆమె వేళ్లకి పెట్టాడు. ఆ రాళ్ల లోపల నీలి మంటలున్నాయి. పర్షియన్ తివాసీలున్న తెల్లని గుడారం ఇచ్చాడు. ప్రతిరోజూ ఆమెకి పిస్తాపప్పు వేసిన అడివికోడి వేపుడునీ, బాతుల వేపుడునీ వంట ఇంటినుంచి పంపిస్తున్నాడు' అని వాళ్లు అనుకుంటున్నారు".

"వాళ్లు నన్ను పాదుషా భార్యనంటున్నారు. కాని నేను మూడు వందల ఒకటో భార్యని. ఇంతకంటే సాదా రౌతు భార్యగా వుండాలని వుంది నాకు. వాళ్లు నన్ను చూసి అసూయ పడుతున్నారు కాని నాకు కారకూమ్ గాలి అన్నా, మరువం వాసనలన్నా అడివి పొద గుబాళింపులన్నా మనసుగా వుంది. షా వంట గది పొగలు నా తలని దిమ్మెక్కించేస్తున్నాయి. ఈ తెల్లని గుడారం యేమిటి నాకు కనిపించేదంతా కాపలావాళ్లు తిరిగే ఆ బురుజు, ఈ

పాత పోప్లార్ చెట్టు అయితే? ఓ సారి చెట్టు చిటారు కొమ్మకంటా యెక్కేద్దామని ప్రయత్నించాను, కాని కొజ్జాలు నన్ను కిందికి లాగేశారు. ఆ తర్వాత వాళ్లు వుయ్యాలా తాడు కూడా కోసేశారు. చెప్పు, ఇదేనా సంతోషమంటే?"

"అయ్యో నీకున్న దాంట్లో నాకు వందో వంతు వున్నా నేను సంతోషంగా వుంటాను. పిస్తాపప్పు వేసిన బాతుల్ని నాకెవడూ పెట్టడు".

"చెలికత్తెలారా, పట్టా పరచండి" అని గుల్ జామిల్ అరిచింది. "ముసలవ్వా, నా అదృష్టం యేమిటో చెప్పు".

ఇద్దరు ఆడబానిసలు తెల్లని యుర్త్‌లోకి పరిగెత్తారు. ఒక వృద్ధ తుర్క్‌మెన్ స్త్రీ బయటికి వచ్చి నేలమీద చతికిల బడింది. ఆమె జుట్టుకి యెర్రటి పట్టీ కట్టి వుంది. దానికి వెండి నాణాలు అలంకరించి వున్నాయి. ఆమె కళ్లు ముసలి సోదెకత్తెమీదనే నిశితంగా లగ్నం అయివున్నాయి.

"పాము పోలుసు" రాతి పలకమీద కాషాయ రంగు రుమాలు పరిచింది. ఓ ఎర్రటి తోలు అడపంలోనుంచి నల్లనివీ, తెల్లనివీ పావులు ఓ గుప్పెడు తీసి దానిమీద విసిరింది. చెదిరిన పావులమీద దంతం పుల్లతో కొన్ని వలయాలు చుట్టి, లూలి జిప్సీ భాషలో అర్థంకాని మాటలేవో గొణిగింది. తెల్లని గుడ్డు కనిపించేటట్టు మంటే నల్లని కళ్లని తిప్పుదూ ఆమె బొంగురు కంఠంతో మొదలెట్టింది.

"వూఁ, పావులు చెప్పేదిదుగో, నా పెద్దలు బోధించినట్టు నాకు. పచ్చిక మైదానంమీద గుర్రపు రౌతొకడున్నాడు. పడుచోడు, కాని గొప్ప యోధుడు. దారిలో అతనికో పులి తగిలినా అతనికి భయం లేదు. కాని దాన్ని బాణంతో చంపుతాడు. పది మంది దారి దోపిడీ దొంగలు అతన్ని అటకాయించినా తనే ముందస్తుగా వాళ్లని కొట్టి, అందర్నీ చంపేస్తాడు. ఈ రౌతు నిన్ను గురించే కలగంటాడు. రాత్రిళ్లు అతనికి నిద్రపట్టదు. బాక్షీల ప్రేమ మంత్రాలు విని ఆకాశంకేసి చూస్తాడు. 'అవే ఆ కళ్లు, నక్షత్రాలు' అంటాడు. నువ్వు నిట్టూరుస్తావు! నే చెప్పింది నిజమేనా?"

గుల్ జామిల్ ఒణికింది. ఆమె పరికిణీ ఓణీలకి కుట్టిన వెండి బంగారు నాణాలు గణగణమన్నాయి. ఓ నాణాన్ని పట్టుకుని పెరకబోయింది. కాని దాన్ని తాపడం చేసికుట్టారు.

"ఎన్నె జాన్, కత్తెర పట్రా". కాని ఇలాన్ టార్చ్ కొంటెగా గొణిగింది:

"కాని తెల్ల పిడి వున్న నీ బాకేది? బీటి పిల్లల్లాగా నీకూ ఒకటి బొబ్లో వుండాలికదా?"

గుల్ జామిల్ ముఖంమీద భీతి ఛాయ దూసుకుపోయింది. ఆ వృద్ధ తుర్క్‌మెన్ మహిళ మెల్లిగా లేచి యుర్త్‌లోకి వెళ్లి తివాచీలు నేసేటప్పుడు ముళ్లు కత్తిరించడానికి వాడే పెద్ద కత్తెరని తెచ్చింది. గుల్ జామిల్ పరికిణీనుంచి పల్చని బంగారు నాణాన్ని కత్తిరించి, గోధుమ రంగు చేత్తో పట్టుకుంది.

"కలలుగనే రౌతు గురించి నువ్వునాకు చెప్పావు. అతని పేరేమిటో చెప్పావు కాదేం?"

"పావులు ఆ సంగతి నాకు చెప్పవు. నీ గుండె మాత్రమే ప్రేమించిన వాడి పేరు గొణుగుతుంది".

"కిప్‌చాక్‌లు నన్ను బలవంతంగా పాదుషా జనానాకి తీసుకువచ్చారు. నా కోసమన్చెప్పి పచ్చిక బీటిమీద యెంతో మంది రౌతులు కొట్లాడుకున్నారు. కాని తన గుండెలో యెవరున్నారో ఓ పడుచు పిల్లని ముసలామె అడగ్గలదా?"

"ఈ ముసిల్ది అంతా కల్లలే కూసింది" అంటూ ముసలి తుర్క్‌మెన్ ఆమె కోపంగా అడ్డం వచ్చింది. "పాదుషా భార్యలకి మనసులో ఇంక వేరే యే పేరూ వుండదు – ఒక్కటి తప్ప, మన మహా ప్రభువు మహమ్మద్, ఖోరెస్మ్ షా. రుస్తుం*లాగా నవమన్మధుడు సికందర్‌లాగా సాహసవంతుడు. ఇక్కడి ప్రాసాదంలో ప్రతి ఆడదీ ఆయన కోసమే వుంది, ఆయన్ని గురించే ఆలోచిస్తుంది. గుల్ జామిల్, ఈ కుత్సితం మనిషి చెప్పేది వినకు".

తెల్లని తలగుడ్డ చుట్టుకున్న వో కొజ్జా బద్దల చట్రందగ్గరకి వచ్చి సోదెకత్తెని పిలిచాడు. సోదెకత్తె ఎత్తరిగా, సర్వాధికారం వున్న ఈ జనానా రక్షకుడి దగ్గరికి పరిగెత్తి వెళ్లి చెవిలో యేదో చెప్పింది. తిరిగివచ్చి గుల్ జామిల్ ముందు మోకరిల్లి వేళ్ల కొనలతో ఆమె పరికిణీ అంచులు తాకి, అంది: "మన్నించు పాపాత్మురాలి! సింహాసనానికి కొత్త వారసుడైన ఖాన్ ఉజ్‌లా షా తల్లి తనకి సోదె చెప్పమని పురమాయించింది. ఇక ఆగడానికి వ్యవధి లేదు" – మళ్లీ ఓ సారి బంగారు నాణాన్ని ముద్దుపెట్టుకుని బద్దల చట్రం గుండా కొజ్జా వెనకాలే వెళ్లింది.

---

*రుస్తుం – పర్షియా ఇతిహాస వీరుడు.

# "దుఃఖ దూత" సంతోషాన్ని తేవచ్చు

ఖోరెస్మ్ షా తన సామ్రాజ్య వ్యవహారాల్ని ఒక అత్యంత యేకాంత మందిరంలో నిర్వహించేవాడు. "గోడలకి చెవులుంటాయి" కాని కిటికీలు లేని ఈ మందిరానికి చెవుల్లేవు. ఆ గోడలకి తివాసీలు వేలాడదీసి వుంటాయి. నూతి లోపలున్నట్టుగా వుంటుంది. రాత్రిళ్లు మాత్రమే కప్పుపైన వున్న కంతలోనుంచి నక్షత్రాలు కనిపిస్తాయి. ఇక్కడ ముఖ్య తలారిలో రహస్య మంతనాలు జరపడానికి గాని, విసుగెత్తిన అసంఖ్యాక భార్యల కుట్రలూ కుహకాలూ వకీలు నివేదించగా వినడానికి గాని షా భయపడనక్కర్లేదు. ఇక్కడ షా తన ఆజ్ఞల్ని మెల్లిగా జారీచేస్తాడు: యే ఖాన్నో గుట్టు చప్పుడు కాకుండా పీక పిసికించెయ్యడం, – వాడు బహువా యే విందులోనేనా మరీ గుండెలు తీసినట్టు మాట్లాడి వుండచ్చు; లేదా ఓ పిసినారి ముసలి మన్నీడు దగ్గరకి ముసుగు మనుషుల్ని పంపించడం – అతను బంగారు నాణాల సంచుల్ని ఆర్క్కి పంపించడంలో కొంచెం అలసంగా వుండి వుండవచ్చు. ఈ తివాసీల గది రహస్య మంతనాల తర్వాత మర్నాడు ఉదయం యెత్తు శిఖరం నుంచి హాహాకారాలు చేస్తూ కింద ముక్కలై చీకలిపోవడానికి యే అజ్ఞాత ప్రాణో పడడం చాలా సార్లు జరిగింది. రాత్రి నక్షత్రాల మసక వెలుతురులో తపతప కాళ్లూ చేతులూ కొట్టుకుంటూ వుండే మూతి బిగించిన సంచుల్ని – షాకి ఇష్టం లేని మనుషులు వాళ్లు – ఓడల మీదనుంచి సుళ్లు తిరిగే జైహూన్ నదిలోకి తలారి గెంటెయ్యడం యెన్నో సార్లు జరిగింది. అప్పుడు విశాలంగా వుండే ఆ నది నీళ్లు పాటతో ప్రతిధ్వనించేవి:

"నీ వసంతారామమున కోకిలలు పాడు,
నీ వనాంతర గులాబీ ఆమనికి శోభ కూర్చు–"

తెడ్లు వేసేవాళ్లు పల్లవి అందుకుంటారు:

"ఖోరెస్మ్, ఓ ఖోరెస్మ్!"

ఆ రాత్రి మహమ్మద్ మబ్బుగా, మౌనంగా కూర్చున్నాడు. ఆ రోజు అంతా కొడుకు జలాలుద్దీన్ని యెవళ్లెవళ్లు సందర్శించిందీ వకీలు అతనికి విన్నవిస్తున్నాడు.

"ముగ్గురు తుర్క్‌మెన్‌లు భేషైన గుర్రాలమీద వచ్చారు. ఒకతను ముఖాన్ని రుమాలుతో కప్పుకున్నాడు. అతను పడుచు వాడిలాగా, దిట్టంగా వున్నాడు".

"అతన్నెందుకు బంధించలేదు?"

"అడివి దగ్గర దిట్టమైన నలభై మంది తుర్క్‌మెన్ రౌతులు కూచున్నారు. తర్వాత అంగడి వీధిలో తుర్క్‌మెన్‌లు భోజనానికి వెళ్లే పూటకూళ్ల ఇంట్లో మా గూఢచారులు కార కోంచర్ అన్న పేరు విన్నారు".

"కార కోంచర్ - బిడారుల సింహస్వప్నం!"

"నిజమే, హుజూర్! కాని, మనం నిజంగా అనుకోలేం కదా సింహాసనానికి వారసులు–"

"ఇక అతను వారసుడు గాడు"

"షా నోట్లో అల్లా వున్నాడు! మామూలు మన్నీడు కూడా బిడారుల జాడల్లో పోయి దొంగతో కలవడానికి ఇంత అధ్వాన్నంగా దిగజారడు..."

"కల్లోలగా వున్నప్పుడు యేమైనా జరగచ్చు".

"పవిత్ర మక్కాలో ప్రవక్త సమాధి ముందు ప్రార్థన చేసేందుకు ఖాన్ జలాలుద్దీన్‌లు పంపడం బాగుంటుందని మహా ప్రభువులకి తట్టడం లేదా, తుర్క్‌మెన్‌లతో ఈ మంతనాలన్నిటికీ అదే కట్టు!"

"అతన్ని దూరంగా హిందూ దేశపు సరిహద్దులోని ఘజనీకి పాలెగాడుగా నియమించాను. కాని అక్కడ కూడా అతను తిరుగుబాటు చేసే ఖాన్లని పోగుచేసి, తనతోబాటు చైనాకి, దండయాత్రకి తీసుకుపోతాడు. అప్పుడు కత్తితో పుచ్చకాయని పొడిచినట్టు ఖోరెస్మ్ ముక్కలు ముక్కలైపోతుంది. వుహుఁ, వద్దు జలాలుద్దీన్ ఇక్కణ్ణే వుండనియ్యడం మంచిది నా చేతి కింద. నా వేళ్లు అతన్ని నొక్కుతాయి".

"మంచి నిర్ణయం".

"కాని విను వకీల్, మధుర వాక్కు వాడా! కార కోంచర్ తన మాతృ భూమిలో మాదిరీ గుర్‌గంజ్ వీధుల్లో విహరించాడని మరో సారి నా చెవిన బడితే నీ తల, కళ్లల్లో నుంచి దాని తేజం పోయినట్టుగా, జలాలుద్దీన్ ప్రాసాదం ముందు కర్ర అంచున గుచ్చి వుంటుంది..."

"అల్లా మనల్ని కాపాడు గాక!" అని వకీలు ఒగిర్చాడు, వంగి వెనక్కి గుమ్మం దగ్గరికి పోతూ.

ఓ ముసలి కొజ్జా లోపలికి వచ్చాడు.

"మహా ప్రభువులు ఆజ్ఞాపించినట్టుగా ఖాతూన్ గుల్ జామిల్ మందిరానికి వచ్చిన నీ ఆజ్ఞల కోసం నిరీక్షిస్తోంది".

షా లేచాడు. దాదాపు అయిష్టంగా నన్నట్టు కనిపించింది ఆ లేవడం.

"ఆమెనిక్కడికి తివాసీల మందిరానికి తీసుకురా".

షా బయటికి నడవలోకి వెళ్లాడు. నడుం వంచి ఇరుకు గుమ్మం గుండా సుళ్లు తిరిగిన మెట్లెక్కి పైకి వెళ్లాడు. ఓ చిన్న సురక్షిత బిలం దగ్గరికి వెళ్లి ఆ చిన్న కిటికీకి కప్పిన చెక్కడపు కొయ్య చట్రంకేసి వంగాడు. తివాచీల గదిలో యేం జరుగుతోందో పరీక్షించడానికి సర్దుకుని కూర్చున్నాడు.

వంగిపోయిన నడుమూ, బొద్దు చట్టలూ వున్న ఓ గడ్డంలేని ముసలి కొజ్జా నగిషీ చెక్కిన తలుపు తెరిచాడు. అతను కాశ్మీరు శాలువా కప్పుకున్నాడు. చేత్తో ఓ వెండి సెమ్మాని పట్టుకున్నాడు. నాలుగు కొవ్వొత్తులు దని మీద రెపరెపమంటున్నాయి.

తళతళ మెరిసే బట్టలు తొడుక్కున్న ఆ చిన్న ఆకారాన్ని మొత్తం చూసి సానుభూతిగా నిట్టూర్చాడు.

"సరే, పద పోదాం" అని అతని కంపిత స్వరం మూల్గింది.

భారంగా వున్న తెరని పక్కకి లాగి, సెమ్మాని పైకెత్తాడు. గుల్ జామిల్ మెల్లిగా ఒంగుతూ అతన్ని దాటి పోయింది. దెబ్బ తగుల్తుందనుకుందేమో. ఆమె చెప్పుల్ని గుమ్మం దగ్గర వదిలి పెట్టింది. రెండడుగులు ముందుకు వేసింది.

ఎర్రటి బుఖారా తివాచీలు పూర్తిగా పరిచిన ఆ చిన్న మందిరం యేదో అవాస్తవికమైన, స్వాప్నిక లక్షణంతో వుంది. చీకట్లో యెత్తుగా వుండే కప్పు ఆనడమే లేదు.

కొజ్జా వెళ్లిపోయాడు. తాళం కప్పలో చెవి తిరిగిన చప్పుడైంది. పైన గోడలో కిటికీలోనుంచి వెలుతురు ప్రకాశించింది. ఆ కిటికీకి షోగ్గా చెక్కిన చట్రం వుంది – కొజ్జా దీపం సెమ్మాని యెక్కడ పెట్టాడో అనుమానమే లేదు. ఎదురు గోడమీద ఇలాగే కిటికీకి చెక్కిన చట్రం చీకట్లో వుంది. బహుశా అక్కణ్ణుంచి యెవరేనా నక్కి చూస్తున్నారా? వింటున్నారా?

యేదో తివాసీల మందిరం గురించి అంతఃపురంలో చెవులు కొరుక్కుంటూ వుండడం గుల్ జామిల్ వింది. ఎత్తుగా గోడమీద వున్న చిన్న కిటికీ నగిషీ చట్రంనుంచి ఖోరెస్మ్ షా నక్కి చూస్తూ వుంటే అవిధేయంగా వున్న భార్యల పీకలు జహాన్ పహ్లవన్ తలారి పిసికేస్తూ వుండేవాడని జనానా ఆడవాళ్లు చెప్పుకునేవారు.

గుల్ జామిల్ గదిలో పచారు చేసింది. నేలమీద బోలెడు చిన్న చదరలున్నాయి. అలాంటివి ప్రార్థన చేసుకునేటప్పుడు వేసుకుంటారు. "దురదృష్టవంతురాళ్లైన ఆడవాళ్ల శవాల్ని ఇలాంటి వాటిల్లో దేంట్లోనేనా పెట్టి చుట్టేసి, కోట బయటికి రాత్రిళ్లు తీసుకుపోతారేమో బహుశా!"

అనేక రంగుల మెత్తల్ని గుట్టగా ఓ మూల విసిరి గుల్ జామిల్ వాటిమీద కూలబడింది. ప్రతి చిన్న చప్పుడుకీ ఉలిక్కి పడుతూ సర్వేంద్రియాలతోటీ అప్రమత్తంగా వుంది.

వున్నట్టుండి గుమ్మాన్ని కప్పిన భారమైన తెర కదిలింది. వెనకనుంచి ఓ అడివి జంతువు తల తొంగి చూసింది. మసక వెలుతుర్లో గుండ్రటి కళ్లు పచ్చని మంటలాగా వెలిగాయి.

గుల్ జామిల్ యెగిరి గోడకి కరుచుకుపోయింది. నల్లని మచ్చలున్న పెద్ద పసుపు పచ్చ పిల్లిలాగా ఆ జంతువు చప్పుడు చెయ్యకుండా గదిలోకి వచ్చి ముందటి పంజాలమీద ముట్టె పెట్టుకుని వాలి పడుకుంది. దాని పొడుగాటి తోకతో కొద్దిగా నేలని కొడుతూ, ఝూడించింది.

“మంచు చిరుత!” అనుకొంది గుల్ జామిల్. “వేటగాణ్ణి తినేసే చిరుత! సరే, పోరాటం చెయ్యకుండా తుర్కమెన్‌లు యెవళ్లూ చావరు!” అనుకుంది. ఒక మోకాలి మీద వాలి ఆమె తివాసీ ఒక కొస పట్టుకుంది. చిరుతపులి గుర్ర్‌మంటూ ముందుకు పాకడం మొదలెట్టింది.

“ఓయ్, యులేయ్!” అని గుల్ జామిల్ అరిచింది, తివాసీని లాక్కుంటూ. ఆ జంతువు హఠాత్తుగా వురికి ఆమెని పడదోసింది. ఆమె ముణగ లాక్కు పోయింది తివాసీ కింద దాంకుంటూ. చిరుతపులి పంజాలతో మందంగా వున్న తివాసీని చీల్చ ప్రయత్నించింది.

“రక్షించండి! బాబోయ్!” అని గుల్ జామిల్ అరిచింది. తనకి తుది ఘడియ వచ్చింది. ఆమెకి తలుపుమీద గట్టిగా మోదడం, కోపంగా వున్న గొంతుకలు వినిపించాయి. మనుషుల అరుపులు, ఈ జంతువు గురకలు ఇంకా యెక్కువయ్యాయి. తర్వాత అంతా వున్నట్టుండి నిశ్శబ్దం అయిపోయింది. యెవరో తివాసీని లాగేస్తున్నారు...

సన్నగా పొడుగ్గా వున్న రౌతు ఆమె పక్కన నుంచుని వున్నాడు. అతను నల్లని గొర్రెతోలు టోపీ పెట్టుకున్నాడు. అతని బుగ్గ గీరుకుపోయింది. కణత దగ్గర్నుంచి గడ్డం దాకా చీలిపోయి వుంది. అతను నిటారైన పొడుగాటి కత్తి వాదరని తివాసీమీద తుడుస్తున్నాడు. ముసలి కొజ్జా ఆ రౌతు చొక్కా చేతి అంచులు పట్టి గుంజుతున్నాడు, అతన్ని ఈడ్చెయ్యడానికి ప్రయత్నిస్తూ.

“యెవళ్లూ రాకుండా నిషేధం వున్న ఈ గదిలోకి రావడానికి నీకెన్ని గుండెలు? యేం పని చేశావు నువ్వు, పిచ్చివాడా? పాదుషా వారి పెంపుడు చిరుతమీద చెయ్యెత్తడానికి నీకెంత ధైర్యం? నువ్వు అనుభవిస్తావ్”.

“పో, పేడి మూతి వాడా! లేకపోతే నీ తల కూడా నరుకుతా”.

గుల్ జామిల్ నుంచుంది. కాని కళ్లు నీరసంగా వణికాయి. మళ్లీ మెత్తలమీద పడిపోయింది. చిరుతపులి మధ్యలో నేలమీద పడివుంది. నరికేసిన తలని పంజాల మధ్య పెట్టుకున్నట్టు కనిపించింది. దాని కళేబరం ఇంకా మెలికలు తిరుగుతోంది.

“బతికే వున్నావా, ఖాతూన్?”

“నువ్వు చాలా గాయపడి వున్నావు, ధైర్యంగల రౌతా! నీ ముఖం మీద నుంచి రక్తం కారుతోంది”.

“ఓ, యేం ఫరవాలేదు! ముఖం మీద మచ్చ, యుద్ధ అలంకారం”.

గదిలోకి రక్షకభటుల అధిపది తైమూర్ మాలిక్ దూసుకుంటూ వచ్చాడు. గుమ్మం దగ్గరంతా సైనికులున్నారు.

"యెవరు నువ్వు? కోటలోకి యెలా వచ్చావు? కాపలావాళ్లని కొట్టడానికి నీకెన్ని గుండెలు? ఆయుధాలు ఇలా ఇయ్యి".

రౌతు తాపీగా కత్తిని ఒరలో దోపుకుని, నిదానంగా జవాబు చెప్పాడు:

"ఇంతకీ నువ్వెవరు? నువ్వు రక్షక భటుల అధిపతి తైమూర్ మాలిక్‌ని అయి వుంటావు? సలాం! ఖోరెస్మ్ షాకే సంబంధించిన అతిముఖ్యమైన విషయాన్ని మాట్లాడ్డానికి నేనాయన్ని చూడాలి. సమర్‌కండ్‌నుంచి దుర్వార్త".

"ఎవడీ పొగరుమోతు?" అని భయంకరంగా ఓ కంఠం గర్జించింది. పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఖోరెస్మ్ షా తివాసీల గదిలోకి వచ్చాడు. అతని చెయ్యి బాకు పిడిమీద వుంది.

"సలా, ఘనమైన షా!" అని రౌతు చేతులు గుండెలమీద కట్టుకుని, కొంచెం వంగుతూ అన్నాడు. మళ్లీ వెంటనే నిటారుగా నుంచున్నాడు. "నువ్విక్కడ వినోదిస్తూ, ఆడపిల్లల్ని భయపెట్టడానికి చిరతపులుల్ని తరుముతూ వుండు, ప్రపంచంలోనేమో మహత్తర విషయాలు జరిగిపోతున్నాయి. బిడారి మార్గంలో నాకో సమర్‌కండ్ దూత తగిలాడు. అను గుర్రం ఆయాసపడి చచ్చిపోయేటంత వేగంగా దౌడు తీయించాడు. అప్పుడు పరుగు లంకించుకుని ఆఖరికి కుప్పకూలిపోయాడు. అతనో పిచ్చి వాడిలా అరుస్తూనే వున్నాడు: 'సమర్‌కండ్‌లో తిరుగుబాటు జరిగింది! వాళ్లు కిప్‌చాక్‌లందర్నీ చంపేస్తున్నారు, కసాయి వాడి కొట్లో గొర్రెల కళేబరాల్లాగా చెట్లకి ఉరితీస్తున్నారు'. నీ అల్లుడు సమర్‌కండ్ పాలెగాడు ఓస్మన్ సుల్తాన్ తిరుగుబాటుని నడిపిస్తున్నాడు. నీ కూతుర్ని కూడా చంపెయ్యాలనుకున్నాడు. కాని ఆవిడ ఒక దుర్గంలో బంధించేసుకుని, వంద మంది సాహసోపేతులైన రౌతులతో వుంది. అహోరాత్రాలూ పోరు సాగుతోంది. ఆమెనుంచి ఓ ఉత్తరం తెచ్చాను".

రౌతు చేతిలోనుంచి చుట్ట చుట్టిన యెర్రటి కమ్మ తీసుకుని, ఖోరెస్మ్‌షా బాకు మొనతో మూసిన వేపు చీల్చాడు.

"వాడికి తిరుగుబాటు యేమిటో చూపిస్తా!" అని గొణిగాడు, ఆ మసక వెలుతురులో చదవడానికి ప్రయాసపడుతూ. "సమర్‌కండ్ యెప్పుడూ గొడవల గూడే. తైమూర్ మాలిక్, కిప్‌చాక్ సైన్యాల్ని పిలు–నేను సమర్‌కండ్ వెడుతున్నాను! భూమ్మీద అల్లా అవతారానికి వ్యతిరేకంగా చెయ్యెత్త సాహసించిన వాళ్లని ఉరి తియ్యడానికి సరిపడా చెట్ల కొమ్మలు గాని, తాళ్లుగాని లేవు. ఈ పిల్లని ఆమె తెల్ల యుర్త్ దగ్గరికి తీసుకుపో, ఆమె కోసం వైద్యుణ్ణి పిలు. యోధుడా, నీ పేరేమిటి?"

"పేరులో యేం వుంది? – మొత్తం యెడారిలో ఓ చిన్న రౌతు".

"నువ్వు 'చెడ్డ వార్త' తెచ్చావు. ప్రాచీన ఆచారం ప్రకారం 'దుఃఖాన్ని మోసుకొచ్చిన వాణ్ణి' ఉరిశిక్ష పాల్జెయ్యాలి. దీనికి తోడు నువ్వు నా మంచు చిరుతపులిని చంపేశావు. నీకేం దండన ఇవ్వాలి, నాకు తెలియడం లేదు..."

"నాకు తెలుసు, మహాప్రభూ" అన్నాడు తైమూర్ మాలిక్. "నే చెప్పనా?"

"చెప్పు, ధైర్యశాలి తైమూర్ మాలిక్, ఈ పొగురు మోతు రౌతుకి నా పేరుమీద చెప్పు".

"యుద్ధంలో ఒక రోజు – ఒక గంట – పోయినా విజయం పోయినట్టే. ఈ రౌతు మహోత్సాహం ప్రదర్శించి మహా ప్రభువులకి ముఖ్యమైన, మంచి వార్తని తెచ్చాడు. ఓ అమ్మాయి బతికే వున్నట్టు యీ బాబు వల్ల తెలుస్తోంది. తనే ఒక సైనికుడయినట్టుగా ఆమె శత్రుదాడుల్ని ధైర్యంగా యెదిరిస్తోందనీ తెలుస్తోంది. మా ఘనమైన పాదుషా, నవ్వు సుడిగాలిలా రివ్వున సమర్‌కండ్ వెళ్లి పరాక్రమవంతురాలైన నీ కూతుర్ని నాశనం అయిపోకుండా కాపాడు. ఇలాంటి సేవకిగాను షా ఈ యోధుణ్ణి తొంభై తొమ్మిది నేరాల దాకా క్షమించవచ్చు. చంపేసిన చిరుతపులి బదులు షా మరో చిరుతపులిని గ్రహిస్తాడు. ఇంతకంటే భయంకరమైందీ, ఉగ్రమైందీ – ఈ కొండ రౌతు తనే వంద గుర్రాలకి నాయకుడిగా వుండి యుద్ధంలోకి నడిపిస్తాడు. వాళ్లు తుర్కమెన్‌లు, కొంత భాగం నీ సొంత అంగరక్షక దళం వాళ్లుంటారు".

ఖోరెస్మ్ షా వజ్రపుటుంగరం పెట్టుకున్న వేలితో నల్లని గడ్డం ముడతని మెలితిప్పుతూ, నిశ్చేష్టుడైపోయాడు.

"డేగ విసురుగా యెరమీద దూరేటప్పుడు పక్కకి మళ్లలేదు, ఖోరెస్మ్ షాకి రెండు మాటలు లేవు" అన్నాడా రౌతు గర్వంగా. "ఈ తుర్కమెన్ పిల్లని యెక్కడికి తీసుకెళ్లను?" అని అడిగాడు.

అతను వంగి గుల్ జామిల్‌ని చేతులతో యెత్తి జాగ్రత్తగా పట్టుకున్నాడు. గుమ్మం దగ్గర అతను ఓ క్షణం వెను తిరిగాడు. సన్నగా, పొడుగ్గా, కఠినంగా వున్న రూపం. యేదో సమాన స్థాయి వాడితో మాట్లాడుతున్నట్టుగా ఖోరెస్మ్ షాని సంబోధిస్తూ అన్నాడు:

"సలాం, షా, కార కోంచర్‌నుంచి, నీ బిడారుల సింహస్వప్నం!" గర్వంగా అంగలు వేసుకుంటూ పోయాడు.

సంతోష పడాలో, కోప పడాలో తెలియనట్టుగా షా తైమూర్ మాలిక్‌కేసి చూశాడు. తైమూర్ మాలిక్ పెద్దగా నవ్వాడు.

"ఏం మనిషి! మరి నువ్వు, షా, యీ తుర్కమెన్‌లని నమ్మలేవు! ఇలాంటి మనుషుల సైన్యంతో నువ్వు ప్రపంచాన్నే జయించగలవు!"

...కొన్ని రోజులు గడిచిపోయాయి. రాత్రి చీకట్లో, పైన గోపురంమీద నెలబాలుడి సన్నని పొడువు వంక గోచరమైంది. అప్పుడు చప్పుడు చెయ్యని నీడలు కోటవారే గొందిలో పాకాయి. గోడకంటే యెత్తుగా వున్న పోప్లార్ చెట్టున్న చోట ఆగాయి.

కొక్కెం వున్న బొచ్చు నిచ్చెనని గోడపైకి విసరడం జరిగింది. ఒక నీడ పైకి యెగిరింది. తెల్లని సంచార యుర్త్‌మీద పొగ కమ్ముకుంది. ఓ వెలుతురు రేఖ దాని గుండా ప్రకాశిస్తోంది.

ఓ గుడ్డగూబ కూతకి ఓ అమ్మాయి అచ్ఛాదిత రూపం గుడారంలో నుంచి బయటికి వచ్చింది.

చీకట్లో గుసగుసలు తేలియాడాయి:

"తుర్క్‌మెన్‌లంతా సోదరులే, సలాం! ఖాతూన్ గుల్ జామిల్ యెలా వుంది?"

"నేనామె పరిచారికని. మాకు చెడు దాపురించింది. ఖోరెస్మ్ షా తిరుగుబాటు చేసిన సమర్‌కండ్‌ని అణచడానికి సైన్యంతో మూడు రోజుల పాటు వెళ్లిపోయాడు. ఆ భీకర ముసలావిడ మాతృ శ్రీ సుల్తానా తుర్కాన్ ఖాతూన్ నిశిత పారువ ఇప్పుడు అంతఃపురాన్ని కాపలా కాస్తోంది. మన 'హసించే పుష్పాన్ని' అంతఃపురంలో వున్న రాతి శిఖరం దగ్గరికి తీసుకుపొమ్మని ఆమె ఆజ్ఞాపించింది. కాపలాని రెట్టింపు చేసింది. గుల్ జామిల్ చచ్చిపోయే దాకా శిఖరంలోనే వుంటుందని ఆవిడ అంటోంది".

"ఆమె దగ్గరికెళ్లు. కొజ్జాగాడి కియ్యడానికిదుగో బంగారు దినార్. కాపలా వాళ్లకింకో రెండు. ఖాతూన్ గుల్ జామిల్‌తో చెప్పు: పట్టణం బయట రాచబాట పక్కన పుణ్య షేక్ సమాధి దగ్గర తను ప్రార్థనలు జరపాలని ఆమె మాతృ శ్రీ సుల్తానాతో చెప్పాలి. తుర్కాన్ ఖాతూన్ దైవ ప్రార్థనలని తిరస్కరించే ధైర్యం చెయ్యదు. ఇక ఈమె అంటూ పట్టణంలో నుంచి బయట పడివస్తే మిగిలింది కార కోంచర్ చేస్తాడు".

నీడ మరో సారి గోడ పైకి యెక్కి చీకట్లో మాయమైపోయింది.

పరిచారిక గొణిగింది:

"ప్రపంచంలో తుర్కాన్ ఖాతూన్ కంటే దుష్టమైందీ, కుయుక్తిపరమైందీ మరోటి లేదు. ఆమె పగబట్టిందో - యెవడు వ్యతిరేకంగా పోరాటం చేస్తాడు?"

# వారసత్వం తప్పిపోయిన వాడి తోటలో

"నాకు గుర్రం వుంది, కత్తి వుందీ,
చెట్టు కొమ్మ కింద నాకు విందు అక్కర్లేదు!"
(ఇబ్రహిం ముంతాసిర్, 10వ శతాబ్దం)

తైమూర్ మాలిక్ వృద్ధ యోద్ధ యెన్నో యుద్ధాలు చూశాడు. ప్రమాదం అంటే అతనికి భయంలేదు. యెన్నో సార్లు శత్రు కరవాలాలు అతనిపైన మెరిశాయి, బల్లాలు అతని డాలుని పొడిచాయి, బాణాలు కవచాన్ని చీల్చాయి. చిరుతపులులు అతన్ని బరికేశాయి. అతను పెద్ద పులులతో పోరాడాడు. నల్లని మృత్యు మేఘం అతనికీ సూర్యుడికీ మధ్య అడ్డం వచ్చింది. ఇప్పుడిక అతనికి భయం యేమిటి? అంచేత ఖోరెస్మ్ షా ఆగ్రహాన్ని ఆవగింజంత లెక్కపెట్టకుండా అతను తిల్లాల తోటకి బయల్దేరాడు. అది నగరం ఆవల వుంది. దాని యజమాని, అనుగ్రహం కోల్పోయిన షా కొడుకు జలాలుద్దీన్‌ని చూడ్డానికి అతను వెళ్లాడు.

యువ ఖాన్ తోట చిక్కని నీడలో వున్నాడు. జలాలుద్దీన్ ఒంటరిగా దీర్ఘాలోచనా మగ్నుడై తివాచీమీద కూర్చున్నాడు. చటుక్కున లేచి, అతిథిని కలుసుకుందుకు ముందుకు వచ్చాడు.

"సలాం, పరాక్రమవంతుడైన తైమూర్ మాలిక్! నేను కొంతమంది మిత్రుల్ని రమ్మని పిలిచాను. కాని జబ్బుగా వుందనీ రాలేమనీ విచారిస్తూ చాలా మంది వర్తమానం పంపేశారు. పచ్చిక బీళ్ల సంచారులు ముగ్గురు, నువ్వు, తైమూర్ మాలిక్, ఈ బహిష్కృతుడైన సుదూర ఘజినీ పాలెగాణ్ణి చూడ సాహసం చేశారు. ఆ ఘజనీని నేనెన్నడూ చూడను".

"షా ఇష్టం పవిత్రమైంది" అన్నాడు తైమూర్ మాలిక్ తివాసీమీద కూలబడుతూ.

"తుర్క్‌మెన్ తల్లికి పుట్టడం నా దోషమా?" అన్నాడు జలాలుద్దీన్ మబ్బుగా. "కిప్‌చాక్‌లకేమో కిప్‌చాక్ షా కావాలి. వాళ్లకి వాళ్ల షాని వుండనిచ్చుకోమను, కాని మా నాయన నన్ను ఓ సామాన్య రౌతుగా సరిహద్దులు దాటిపోయి, పోరులు జరిగేచోటకి, పోనివ్వడెందుకని? నాకు ఉగ్రమైన గుర్రం, తళతళ మెరిసే కరవాలం, పచ్చిక బీళ్ల గాలి ఇష్టం. తొక్కు మాటల ముసలాళ్లు పాడే పాటలు వింటూ, కథలు వింటూ తివాసీమీద జోల పొద్దం నాకక్కర్లేదు".

"కాని మనకి చుట్టూతా యుద్ధం వుంది కదా" అన్నాడు తైమూర్ మాలిక్. "కిప్‌చాక్ మన్నీళ్లు సైన్యం తీసుకుని పచ్చిక బీళ్లమీదకి రావాల్సిందిగా షాని అడిగారు. ఎవరో అజ్ఞాత ప్రజానీకం తూర్పునుంచి వస్తున్నారట. వాళ్లు మన భూమిని లాగేసుకుంటున్నారట, మంచి గడ్డి బీళ్లనుండి మన పశువుల్ని తోలేస్తూ..."

"మా నాయన ఖోరెస్మ్ నుంచి కిప్‌చాక్‌లందర్నీ తరిమేసి వాళ్లు లేకుండా పాలించడం మంచిది. కిప్‌చాక్‌లు మెత్తబడి పోయారు, పతనమైపోయారు. విషమ సమయం వచ్చినప్పుడు వాళ్లు మా నాయనని దగా చేస్తారు" అన్నాడు జలాలుద్దీన్.

"యెందుకని అలా అనుకున్నావు?" అని తైమూర్ మాలిక్ అడిగాడు.

"ఖొరెస్మ్ ప్రజల్ని నమ్మకుండా ఓ షా శాంతి భద్రతల్ని కాపాడ్డానికి పరాయి కిప్‌చాక్‌లని పిలవడం అనేది, పచ్చిక బీళ్ల తోడేళ్లని గొర్రెలని కాపలా కాయమనడంలాంటిది. గొర్రెలు మాయమైపోతాయి, తోడేళ్లు ఉన్నినీ ఇవ్వవు ఇక తర్వాత అవి నిన్నే భోం చేస్తాయి".

జలాలుద్దీన్ దగ్గర్లో విధేయంగా నుంచున్న ముసలి గులాంకేసి చూసి, తల ఊపి చిన్న సైగ చేశాడు. గులాం వచ్చి ప్రణామం చేశాడు.

"యెంతో మంది అతిథులు వస్తారని పెద్ద దాస్తరఖాన్ పరిచాం. కాని యెవళ్లూ రాలేదు. దారి అడ్డం కొట్టి పొయ్యే వాళ్లందర్నీ ఆపు చెయ్యి. నాకు విచారం కలిగించని వాళ్లెవరుంటారో చూసి, నా దగ్గరికి తీసుకురా. నేను పిలిచిన అతిథులు రాకపోతే గుర్రాల్నీ వీధిలోని ముష్టివాళ్లనీ పిలుస్తాను".

"నువ్వు నన్ను రమ్మన్నావు నే వచ్చాను" అని కులాసా కంఠస్వరం జవాబిచ్చింది. తోటలోని పొదలు చీలి, వాటిలోనుంచి సన్నగా పొడుగ్గా వున్న తుర్క్‌మెన్ వచ్చాడు. అతను పెద్ద గొర్రెతోలు టోపీ పెట్టుకున్నాడు. చేతులు ఛాతీమీదకి పెట్టి వంగి వందనం చేశాడు.

"నిన్ను చూడ్డం సంతోషంగా వుంది, యెడారి చిరుత కార కోంచర్! రా, మాతో బాటు కూచో".

ఖోరెస్మ్ తూర్పు సరిహద్దు దుర్గంలో అధికారి అయిన ఆలీ జాన్, పెద్ద బిడారి మార్గంలో అయిదుగురు రౌతులతో హడావుడిగా వస్తున్నాడు. గుర్రాలకి మేత కోసం తప్ప మరిదేని కోసమూ ఆగలేదు. గుర్‌గంజ్‌కి తన వింత ఖైదీని తీసుకుపోలేమోనని ఆలీ జాన్‌కి భయం అయింది.

తను పట్టుకొన్న అసాధ్యమైన ఆ దొంగ యెవడని దారమ్మట పోయేవాళ్లు అడిగారు. ఆశ్వికులు పక్కనే స్వారీ చేసుకువచ్చారు, కట్టేసిన ఆ మనిషి ముఖంకేసి చూస్తూ. కాని దగ్గరికి వచ్చిన వాళ్లందర్నీ ఆలీ జాన్ కొరడాతో కొట్టాడు. దాంతో కుతూహలం చూపించినవాళ్లు పారిపోయారు.

ఆలీ జాన్, అతని రౌతులూ రెండు కాలవలు దాటారు. గుంజలతోటీ కొమ్మల తోటీ వున్న కదలాడే తాళ్ల వంతెన దాటారు. అప్పుడే పోప్లార్ చెట్ల మధ్య గుర్‌గంజ్ మసీదులపైన, శిఖరాలపైన వున్న నీలం పెంకులు ఆనుతున్నాయి. అడ్డ రహదారిమీద తెల్ల ముస్తీబు తొడిగిన నల్ల గుర్రాలమీద యెర్రటి కఫ్‌తాన్లతో వున్న ఆరుగురు రౌతులు ఆలీ జాన్‌ని అటకాయించారు.

"ఆగండి, యోధులూ!"

"తప్పుకోండి!" అంటూ ఆలీ జాన్ అరిచాడు. "విశ్వాస రక్షకుడి పేరుమీద రౌతులకి దివాన్ – అర్ష్ (ప్రభుత్వ న్యాయసభ)కి జరూరు విషయంమీద పోయేందుకు దారి వదలండి" అన్నాడు.

"సరిగ్గా నువ్వే మాక్కావలసిన వాడివి! నువ్వు పక్కకి మళ్లి తక్షణం తన తోటలో సముఖాన ప్రత్యక్షం కావలసిందని ఖోరెస్మ్ షా కొడుకు జలాలుద్దీన్ ఆజ్ఞాపిస్తున్నాడు".

"మేం యెక్కడా ఆక్కుండా యెకా యెకీ గుర్‌గంజ్‌కి మా సర్దారు తైమూర్ మాలిక్ దగ్గరికి వెళ్లిపోవాలి".

కాని ఈ రౌతులు ఆలీ జాన్ గుర్రం కళ్లాల్ని బలమైన చేతులతో పట్టుకున్నారు.

"తైమూర్ మాలిక్ కూడా ఇక్కడే తోటలో వున్నాడు. వాళ్లిద్దరూ కలిసి పాటలు వింటున్నారు. రా, చెప్తాం నీకు. యెందుకు మొరాయిస్తావ్? నీ ఖైదీకి యేం కాదు. జలాలుద్దీన్ నీకు విందు భోజనం పెడతాడు, గొర్రెతోలు కోటు ఇస్తాడు. గుప్పెడు వెండి దిర్హమ్‌లు ఇస్తాడు. ఖాన్‌గారి పలావ్ రుచి చూడు. అలాంటిది ఇక మళ్లీ జన్మలో తినవు".

ఆలీ జాన్‌కి మంచి గొర్రె వేపుడు వాసన తగిలింది. తన రౌతులని చూపి అరిచాడు:

"రండి! ఈ తోటలోకి వెడదాం. ఇది బాగా వుండే చోటులాగే కనిపిస్తోంది".

గట్టిగా కట్టేసిన ఖైదీతో ఆ రౌతులు దారి మళ్లి, ఎత్తు ద్వారం దగ్గర కాపలా వాళ్లని దాటి మొదటి ముంగిట్లోకి వచ్చారు. మసక సంధ్య వెలుతురులో ఆరు గాడి పొయ్యిలు వరసగా ఎర్రగా మండుతున్నాయి. వాటి చుట్టూతా యెర్ర ఉడుపులు తొడుక్కున్న ఆడాళ్లు తిరుగుతున్నారు. ఆ మంటల యెరుపు జ్వాలలో వాళ్లు మంటలు అంటుకున్నట్టుగా కనిపిస్తున్నారు.

రౌతులు గుర్రాలమీదనుంచి వురికారు. వాటిని స్తంభాలకి కట్టేశారు. ఖైదీ జీనుమీదే వుండిపోయాడు. అతని గుర్రం గిట్టలతో నేలని తవ్వి మిగిలిన గుర్రాలకేసి కదం తొక్కింది. ఆ గుర్రాలకి రౌతులు పుంజీల కొద్దీ గడ్డి వేస్తున్నారు. ఆడవాళ్లు పరిగెత్తుకొచ్చి, ఖైదీ చుట్టూ మూగారు, ఆ వింత దృశ్యం చూసి ఆశ్చర్యపడుతూ.

అతన్ని బొచ్చు తాళ్లతో గుర్రానికి కట్టేశారు. చేతులకి యెర్రటి పట్టీలు కుట్టిన అతని పొడుగాటి నీలం చొక్కా, అంచులు పైకి వంపు తిరిగిన చదును ఉన్ని టోపీ అతను పరాయి

తండా వాడని తెలియజేస్తున్నాయి. అతని కణతలమీదనుంచి, రెండు యెనుము కొమ్ముల్లా, రెండు నల్లని జుట్టు జడలు భుజాలమీద పడుతున్నాయి. మంగోలియన్ కళ్లు, నిశ్చలంగా ముందున్న వాటికేసే చూస్తూ, అడివి జంతువు కళ్లల్లాగా వున్నాయి. ఆడవాళ్ల గుంపు గుసగుసలాడింది.

"ఇది శవమా?"

"వుహూం, బతికే వున్నాడు. పాషండుణ్ణి చంపడానికి చాలా శ్రమ పడాలి".

"నాతో రండి" అని ఆలీ జాన్‌తో నౌకరొకడు అన్నాడు. "ఈ రాక్షసుణ్ణి కూడా తీసుకురండి" అన్నాడు.

ఆలీ జాన్ ఖైదీ గుఱ్ఱం కళ్లెం పుచ్చుకుని దాన్నీ ఖైదీనీ నీడగా వున్న తోట దారిలో నడిపించుకెళ్లాడు. చొచ్చుకుపోలేని ఎత్తైన సెడర్ చెట్ల ముదురు గుబురుల మధ్య పీచ్ చెట్లు మిణుకుమంటున్నాయక్కడ.

ఓ తమంగం చుట్టూ గలగల పారే సెలయేరొకటి పోతోంది. ఆ ఇంటి ముందు పన్నెండు జాతి గుఱ్ఱాలు వరసగా నుంచుని వున్నాయి – వాటిలో ఆరు కఱ్ఱి గుఱ్ఱాలు, ఆరు కపిల వర్ణంవి. వాటి చర్మాలు నునుపుగా పట్టులాగా వున్నాయి. వాటి జూలు జాగ్రత్తగా దువ్వి వుంది. ఎర్రటి రిబ్బన్లు జూలుమీద జడవేసి వున్నాయి. ప్రతీ గుఱ్ఱం గొలుసుతో కురచ గుంజకి కట్టేసి వుంది. ఇద్దరు రౌతులు రాగి తళ్లికలు చేత్తో పట్టుకుని పుచ్చకాయ ముక్కల్ని గుఱ్ఱాలకి చేత్తో తినిపిస్తూ వరసగా వెడుతున్నారు.

జ్వలించే కళ్లతో, వంపు తిరిగిన మెడలతో వున్న ఆ గుఱ్ఱాల అందం చూసి ఆలీ జాన్ యెంతో ఆశ్చర్యపడిపోయి, పెద్ద పాత సెడర్ చెట్టు కింద కూర్చున్న మనుషుల చిన్న బృందాన్ని వెంటనే గమనించలేదు.

పర్షియన్ తివాసీ కప్పిన వేదికమీద ఇరాక్ గాజు పాత్రలూ, వెండి పళ్లాలూ వున్నాయి. వాటిల్లో నుదురుగా కనిపించే పంచదార తినుబండారాలు* రొట్టెలు, రకరకాల తీపి పదార్థాలు, తాజా పళ్లూ, యెండిన పళ్లూ పోగులుగా వున్నాయి. కొంత మంది మనుషులు వేదిక చుట్టూ కూర్చున్నారు, హిందూ దేశపు పాగాతో, నల్లని కఫ్తాన్‌తో యెండకి కమిలిన యువకుడొకడు ఒక వారగా కూర్చున్నాడు. ఇంటి యజమాని పట్ల మాదిరిగా, అందరూ అతని పట్ల భక్తి ప్రపత్తులతో వున్నారు. దగ్గర్లోనే భజంత్రీల బృందం ఒకటి బయ్‌మని అందుకుంది. వాళ్లు వాయులీనం వాయించారు. బూరా వూదారు. గిలక తప్పెట వాయించారు. పేటంతా వింత, అద్భుత సంగీతంతో నిండిపోయింది.

---

* అప్పట్లో చెరకునుంచి తయారుచేసిన పంచదార చాలా ఖరీదుగా వుండేది. భారతదేశం నుంచి, ఈజిప్టు నుంచి దిగుమతి చేసుకునేవారు.

"ఇటు, ఇటు॥ అంటూ యెండకి కమిలిన యువకుడు అరిచి, ఒక్క ఉదుట్న గెంతాడు. అందరూ అతనితోబాటుగా నుంచున్నారు. అతను కదలిక లేకుండా వున్న బందీ దగ్గరికి వెళ్లాడు. ఇతనే షా కొడుకు జలాలుద్దీన్ అని ఆలీ జాన్ గ్రహించాడు.

"నువ్వు అతన్ని బందీగా పట్టుకున్నావన్నమాట. యెక్కడ దొరికాడు?"

"ఒత్రార్ దగ్గర పచ్చిక బీటిమీద దొరికాడు. అబ్బో, బలంగా, శక్తివంతంగా వున్నాడు. అతన్ని సరిగా అదుపు చెయ్యలేకపోయాం".

"యెవరతను? అతని తండా యేమిటి? యేమన్నాడు?"

"యేం చెప్పటం లేదు. మూగనోము పట్టినట్టు!"

"అతని ముఖంలో జీవం లేదు. చచ్చిపోతున్నాడా?"

"నాకు తెలియదు, ఘనమైన ఖాన్! ఖోరెస్మ్ షా కళ్ల ముందు సజీవంగా తీసుకురావాలని మహా వేగంగా దౌడు తీసుకుంటూ వచ్చాను".

"కుదుపు అతన్ని చంపేస్తోంది. ఇతను మాట్లాడేటట్టు చెయ్యాలి మనం".

జలాలుద్దీన్ చప్పట్లు చరిచాడు. ఓ నౌకరు వచ్చాడు.

"వైద్యుడు జబన్‌ని పిలు. మందులూ, మూలికలూ అన్నీ తెమ్మను. ఇక్కడో మనిషికి ప్రాణంమీదకి వచ్చిందని చెప్పు".

"ఇక్కడున్నట్టుగా, హుజూర్".

బందీ ప్రాణం వున్నట్టు కదలికలు చేశాడు. అతని కళ్లు విప్పారాయి. తెరుచుకున్న నోట్లోంచి లోమూలుగులు వచ్చాయి. అతను అరిచి, తాళ్లు తెంపుకోడానికి ప్రయత్నించాడు.

"యేవంటున్నాడు?" అని జలాలుద్దీన్ అడిగాడు. ఆలీ జాన్ వివరించాడు:

"అతను మీ గుర్రాలకేసి చూస్తున్నాడు. అతనికి ఆశ్చర్యంగా వుంది. 'భేషైన గుర్రాలు, అందమైన గుర్రాలు, కాని ఇవి ఇక్కడుండవు. ఇవి జెంఘిజ్ ఖాన్ మందలోకి పోతాయి. అతను అజేయుడు. అతనొక్కడే మీ గుర్రాలమీద స్వారీ చేస్తాడు' అంటున్నాడు".

"ఈ పాషండుడి మాటలు నీకెలా అర్థమవుతున్నాయి?"

"నేను బిడారులతో చైనా వెళ్లాను. నేను తాతార్ బసల్లో వున్నాను. వాళ్ల భాష నేర్చుకున్నాను".

"ఎవరీ జెంఘిజ్ ఖాన్ అజేయుడు? యెందుకతను అజేయుడు? ఈ పాషండుడు ఇంత ధైర్యంగా ఎలా మాట్లాడుతున్నాడు?" అని తైమూర్ మాలిక్ కోపంగా అడిగాడు. "ఖోరెస్మ్ షా మహమ్మద్ ఒక్కడే సర్వ ప్రజల అజేయ విజేత. ఈ బందీ అలా మాట్లాడితే వీడ్ని ముక్కల కింద తరిగేస్తాను".

"అతనేం చెప్తాడో చెప్పనీ" అంటూ అడ్డం వచ్చాడు జలాలుద్దీన్. "తాతారుల అజేయుడైన ఈ ముఖ్యుడి గురించి మనం తెలుసుకోగలమేమో" అన్నాడు.

తోట పొదల వెనకనుంచి పెద్దగా ఓ కంఠం వినవచ్చింది. యెవళ్లో వస్తున్నారు. ఆశువుగా స్తోత్రం చేస్తూ పరిగెత్తి వస్తున్నారు.

"నిజమైన ఆస్తిక పాలకుల తనయుడైన విఖ్యాత జలాలుద్దీన్ తేజోవంతమైన పుణ్యగుణాలతో ముసల్మానులందర్నీ అల్లా ఆశీర్వదించుగాక. జలాలుద్దీన్ కరవాలం ప్రపంచంలో కల్లా తేజోవంతమైందీ, అతని గుర్రం అద్వితీయ సౌందర్యంగలదీ. ఇస్లాం శత్రువుల తలలపైన అతని కరవాలం పిడుగులాగా పడుగాక!"

తోట బాటమీద ఓ చిన్న మనిషి పరిగెత్తుకుంటూ వచ్చాడు. అతని గడ్డం బారుగా వుంది. అతను పెద్ద తలగుడ్డ చుట్టుకున్నాడు. అతను పెద్ద తోలు సంచీనీ, పెద్ద మట్టి కూజానీ మోసుకొస్తున్నాడు. అతని బొడ్డున వేలాడుతున్న అనేక రాగి శస్త్ర చికిత్స పనిముట్లు, ఛురికలు అతను వస్తూ వుంటే కదిలి మోగుతున్నాయి. జలాలుద్దీన్ దగ్గరికెళ్లి ముఖం నేలమీద కంటా పెట్టి వంగి వందనం చేశాడు.

"నీ ఘనమైన దయ నన్ను దుఃగహ్వారం నుంచి బయట పడేసింది. దయతో నన్ను నీ ద్వారం దగ్గరికి పిలిచావు. యెవరో చనిపోయేవాణ్ణి నేను రక్షించాల్సి వుందని చెప్పారు".

ధారాపాతంగా వున్న వైద్యుడి వాగ్ధాటి జలాలుద్దీన్ చేసిన ఒక్క సైగతో కట్టడింది.

"భిషగ్వర జబన్! నీ గొంతుక్కి విశ్రాంతి ఇచ్చి, నీ కళ్లని ఈ జబ్బు మనిషి కేసి తిప్పు. నీ నైపుణ్యం, పరిజ్ఞానం అతనిమీద ఉపయోగపెట్టు. నీ మందుల సీసాలు పట్టే మందులన్నీ వాడు. అతన్ని బతికించు".

"నీ నౌకర్ని, గులాంని! మా ఖాన్ చెప్పింది నే చేస్తా."

ఆ చిన్న వైద్యుడు మందులు కలిపాడు. నౌకర్లు బందీని యెత్తి గుర్రంమీదనుంచి కిందకి దించారు. అతను సరిగ్గా నుంచోను కూడా నుంచోలేకపోయాడు. అతని కాళ్లు వంగి, జీను ఆకారంలో బిగుసుకుపోయాయి. పరాయి శరీరం తాకడం అంటే వణికిపోయి, ప్రార్థనలు గొణుక్కుంటూ నౌకర్లు, వైద్యుడి ఆదేశం మేరకి బందీ బట్టలు తీసేసి, దిసగా అతన్ని తోలు పట్టా ముక్కమీద పడుకోబెట్టారు. అతను యేం మాట్లాడకుండా, బిత్తరపోయి, కళ్లు తిప్పుతూ, లొంగిపోయాడు.

వైద్యుడు మంత్రాలు చదువుతూ, ఒక పారదర్శకమైన తైలాన్ని బందీ ఛాతీమీద పోశాడు. పురుగులు పట్టిన పుళ్లని దంతం పుల్లతో గీకాడు.

"పురుగులు పట్టాయి. కాని పవిత్ర గ్రంథం చెప్పింది: 'అల్లా జబ్బుల్నీ సృష్టించాడు, ప్రతి జబ్బుకీ వైద్యాన్నీ సృష్టించాడు'. అల్లా ప్రతిభ ఘనమైంది".

గాయాల్లోనుంచి మళ్లీ రక్తం స్రవించడం మొదలయాక, వైద్యుడు గాయాల్ని దూది అట్టలతో మూసేసి, వాటిని శరీరం చుట్టూతా కట్లతో కట్టేశాడు.

"ఓ, మా మహా ప్రభూ, విఖ్యాత ఖాన్!" అన్నాడతను జలాలుద్దీన్‌కేసి తిరిగి. "నేను విద్వత్తుగల అరబ్బీ వైద్యుణ్ణి. నేత్ర రోగాలమీద ప్రత్యేక అధ్యయనం చేసినవాణ్ణి. కాయకన్ను బాగు చెయ్యగలను. జబ్బుల్ని నయం చేసి, మృత్యువుని తరిమేసిన యవన హిప్పోక్రేట్స్ గ్రంథాలు గాఢంగా అధ్యయనం చేశాను. నేను నీ గులాంని, నౌకరుని. నీ మాటమీదే బతుకుతా. కూజా పాత సారా తెమ్మని పురమాయించు, నేను మందులు తయారు చేసుకోవడానికి. నేను వైద్యం చేస్తే జబ్బు మనిషి మాట్లాడతాడు. ఒక రోజు, రెండ్రోజులు. తర్వాత చనిపోవచ్చు. బతకనూ వచ్చు అల్లా సంకల్పం వుంటే".

ద్రాక్ష సారా తీసుకుని అందులో రకరకాల చూర్ణాలు కలిపి వైద్యుడు ముందుగా తను కొంత తాగి తర్వాత జబ్బు మనిషి పెదాలకి తాకించాడు. అతను తక్షణం కోలుకుని మాట్లాడ్డం మొదలెట్టాడు.

కళ్లు జ్వరంతో మండుతూ వుండగా ఆ బందీ అక్కడి వాళ్లకి అర్థం అవని మాటల్ని పాడ్డం మొదలెట్టాడు, అరిచాడు. తర్వాత అతని మాట మరింత స్థాయిగా క్రమంగా అతనేదో పద్యం చదువుతున్నట్టుగా అయింది. ఆలీ జాన్ శ్రద్ధగా విని అనువదించాడు:

"అన్ని దేశాలకంటే నా మాతృదేశం ప్రియమైంది, ఆనంద దాయకమైంది" అన్నాడు బందీ. అతని కళ్లు దిఙ్మండలం ఆవలకి చూస్తున్నాయి. "ముప్పై మూడు ఇసక మైదానాలు దాని అంచుల దాకా విస్తరించుకుని వుంటాయి. అక్కడ సూర్యకాంతిలో పర్వతాలు వెలుగుతూ వుంటాయి. దౌడు తియ్యడానికి పేరు మోసిన గుర్రాలు కూడా ఆ దూరం దాటి పోలేవు. అవిడి జంతువులు నిడుపాటి గడ్డి మేసి అరుస్తాయి. డెబ్బై రకాల జింకలు పరిగెడతాయి. పాడే పిట్టల పాటలతో ఆకాశం మార్మోగుతుంది. నీలి ఆకాశం మధ్యగా తెల్లని హంసలు, కొంగలు యెగిరిపోతాయి. అందరికీ చాలినంత విశాలంగా వుండే మా దేశపు విశాలమైన మైదానాలన్నిటిలోనూ నా చిన్న యుర్త్‌కి చోటు లేదు. భయంకరమైన తండాలు, ఆశపోతులైన తెగ పెద్దలు మా పచ్చిక బీళ్లని కాజేశారు. వాటిమీదకి సన్నగా పుష్టిగా వుండే గుర్రాల్ని, గొర్రెల మందల్ని, పశువుల మందల్ని తోలారు. ఇప్పుడు మాకేం మిగల లేదు, బండరాళ్లు లోతు కనుమలు తప్ప. మా మందలు నాశనం అయిపోతాయి, అవి వాడిపోయాయి, మా గుర్రాలు చిక్కిపోయాయి, వాళ్లు కాళ్లు నీరసపడిపోయి, దుర్బలం అయిపోయాయి. ఇదంతా ఆ భయంకర తండాలు చేసిన పనే, వాటి బలవంతుడైన ఖాఖాన్ జెంఘిజ్ ఖాన్ ఎర్రగడ్డం గాడు, అజేయుడు, మంగోలుల్ని ఇతర భూభాగాలమీదకి ప్రపంచాన్ని నాశనం చెయ్యడానికి నడిపిస్తున్నాడు..."

"ఇతను చెప్పే ఆ జెంఘిజ్ ఖాన్ యెవడు?" అని జలాలుద్దీన్ అడిగాడు.

ఆలీ జాన్ ఆ ప్రశ్నని తర్జుమా చేసి అడిగాడు. ఆ బందీ ఆశ్చర్యంతో అరిచాడు:

"టెమూజిన్ జెంఘిజ్ ఖాన్‌ని యెరగని వాడెవడు? నేను అతని దగ్గర్నుంచి పారిపోయేను. యెవరేనా సరే బానిసలాగా అతని ముందు వంగాల్సిందే. వంగని వాణ్ణి అతను క్షమించడు. అతనికి వ్యతిరేకంగా పోరాడే ప్రతివాణ్ణి, అప్పుడే పుట్టిన శిశువుతో సహా బంధువులందర్నీ వధిస్తూ క్రూరమైన పగ తీర్చుకుంటాడు".

"నువ్వెవరు? జెంఘిజ్ ఖాన్ గురించి అంత సాహసంగా యెందుకు చెప్తున్నావ్?"

"నేనో స్వేచ్ఛాయుత వేటగాణ్ణి. గురకాన్ భగతుర్ని. నాకు నేనే ఖాన్‌ని. ఖాన్‌కి నోకర్‌ని*. తనని యెదిరించినందుకు గాను జెంఘిజ్ ఖాన్ మా నాన్నని, అన్నని నడుములు విరగ్గొట్టించాడు అందుకని అతని సైన్యాల్ని వదిలిపెట్టేశాను. అందమైన ఆడవాళ్లని పట్టుకుని బానసలుగా చేసుకుంటాడు. ఖాఖాన్ ఇచ్ఛ తప్ప మరో ఇచ్ఛ అతనికి వుండకూడదు. నేను ప్రపంచం అంచులకంటా పోయి అడివి జంతువుల మధ్య స్వేచ్ఛగా తిరిగే వేటగాళ్లతో వుంటాను, జెంఘిజ్ ఖాన్ నోకర్లు చొరలేని ప్రపంచానికి".

"జెంఘిజ్ ఖాన్ ఇప్పుడెక్కడున్నాడు?" అని జలాలుద్దీన్ అడిగాడు.

"ఇప్పుడు జెంఘిజ్ ఖాన్ సామ్రాజ్యం గట్లు పట్టని సరస్సులాగా వుంది. జెంఘిజ్ ఖాన్ సిద్ధమవుతున్నాడు. అతని సైన్యాలు కత్తులు నూరుకుంటున్నాయి. పశ్చిమ దేశాలన్నిటినీ ముంచెత్తడానికి ఆజ్ఞల కోసం తయారుగా వున్నాయి. అనిక్కడికి వరదలాగా వచ్చి మీ దేశాన్ని ముంచెత్తేస్తాయి".

"ఈ ధైర్యశాలి మనతో ఇక్కడ వుంటాడు" అన్నాడు తైమూర్ మాలిక్. "ఇతను ఓ తుర్క్‌మెన్ అమ్మాయిని పెళ్లాడి భయమెరుగని కారకోంచర్ శిబిరంలో గుడారం వేసుకుంటాడు. స్వేచ్ఛాయుతుడైన వేటగాడవుతాడు. కారకూమ్‌లో తిరిగి వేటాడతాడు".

"కాని ఈ జెంఘిజ్ ఖాన్ యెవడు?" అని జలాలుద్దీన్ అడిగాడు. "ఈ మనిషి చెప్పిన కథ నన్ను ఇబ్బంది పెట్టింది. మనకి వీలైనదంతా మనం కనిపెట్టాలి".

"క్షమించు, అతి విఖ్యాత ఖాన్" అన్నాడు తైమూర్ మాలిక్ నుంచుంటూ. "నేనీ బందీని దివాన్ – అర్గ్‌కి తీసికెళ్లాలి. ఈ గర్విష్టి జెంఘిజ్ ఖాన్ గురించి ఇతన్ని విచారించాలి".

"నన్ను కూడా క్షమించు అతి విఖ్యాత ఖాన్!" అన్నాడు ఆలీ జాన్. "మా రౌతులు కడుపునిండా తిన్నారు నీ దాస్తరఖాన్ మిఠాయిలు. నా గుర్రాలకి పుష్టిగా మేత దొరికింది. మాకు సంతోషం కలిగింది. ఆనందం చవిచూశాం. ఇప్పుడు మా దారినపోనియ్యి. మా పరాయి పాషండుణ్ణి కోటలోకి గుర్‌గంజ్‌కి తీసుకుపోనియ్యి."

---

* నోకర్–ఖాన్ సొంత అంగరక్షక దళంలో సైనికుడు.

“వెళ్లు” అని జవాబిచ్చాడు జలాలుద్దీన్. “గులాం, ఈ రౌతుకి కొత్త గొర్రెతోలు షేర్వాణి యియ్యి”.

ఆలీ జాన్ కిందికి వంగి, అన్నాడు:

“విహంగాలకి విహాయసం, అతిథులకి వందనం, యజమానికి గౌరవం, రౌతులకి స్వారీ!”

మూడవ భాగం

# ఇర్గిజ్ నదీ తీర యుద్ధం సైన్యం కిప్‌చాక్ పచ్చిక మైదానాలమీదకి వెళ్లడం

"అఫ్రాసియాబ్ అరిచాడు: 'సమరానికి
సన్నద్ధుణ్ణి నేను, అలంకరించండి
గోరింటాకుతో గుర్రం తోకను' ".
(పాత పర్షియన్ పాట)

ఆగ్రహం ఉడికిపోతూ ఖోరెస్మ్ షా మహమ్మద్ గుర్‌గంజ్‌నుంచి హడావుడిగా సమర్‌కండ్ బయల్దేరి వెళ్లాడు. అల్లుడు ఓస్మన్‌మీద తనకి వ్యతిరేకంగా కత్తి దూయ సాహసించిన ఆ నగర వాసులమీద నిర్దాక్షిణ్యంగా పగతీర్చుకోవాలని తీర్మానించుకున్నాడు.

మహమ్మద్ నగరాన్ని ముట్టడించాడు. తిరుగుబాటు చేసిన దానికి దండనగా అక్కడున్న అందర్నీ, అప్పుడే పుట్టిన పిల్లలదగ్గర్నుంచి హతమారుస్తానని చాటాడు, విదేశీయులని కూడా. సమర్‌కండ్ ప్రజలు దీర్ఘంగా పోరాటం చేశారు. ఇరుకు వీధుల్లో దూలాలతో ఆటంకాలు పెట్టారు. కాని ఆఖరికి నగరంమీద కనికరం చూపించవలసిందని అర్థించడానికి ఖోరెస్మ్ షా దగ్గరికి ఓస్మన్ ఖాన్ వెళ్లాడు. అతను ఒక చేత్తో కత్తీ, ఒక చేత్తో ప్రేతవస్త్రం పట్టుకుని మహమ్మద్ ముందు ప్రత్యక్షం అయ్యాడు. అది పూర్తి లొంగుబాటుకీ, కత్తితో దండనని అంగీకరించడానికీ చిహ్నం. నేలమీదకి ముఖం వంచి తన ముందు పడ్డ అల్లుణ్ణి చూసి షా మెత్తబడ్డాడు. అతన్ని క్షమించడానికి అంగీకరించాడు. నగరం లొంగిపోయాక, తిరుగుబాటుదార్లకి వ్యతిరేకంగా చివరిదాకా కోటలో తనని రక్షించుకున్న షా కూతురు భర్తని క్షమించడానికి నిరాకరించింది. అతన్ని చంపెయ్యాలని పట్టుబట్టింది. ఓస్మన్ తలని రాత్రి ఉరితీశారు. అతని బంధువులందర్నీ, పిల్లలందర్నీ చంపేశారు. ఆ రకంగా సమర్‌కండ్ పాలకుల కారఖానిద్స్ వంశాన్ని అంతం చేశారు.

ఖోరెస్మ్ షాతో వచ్చిన కిప్‌చాక్ ఖాన్‌లు నగర జనాభాతో క్రూరంగా వ్యవహరించారు. పది వేల మందికి పైగా పౌరుల్ని హతం చేశారు. యుక్తిపరురాలైన మాతృ శ్రీ సుల్తానా

తుర్కాన్ ఖాతూన్ ఆ హత్యాకాండని ఆపు చెయ్యమన్నప్పుడు మాత్రమే ఆగారు. ఆమె క్రూర స్వభావం వున్నదైన కొంతమందిని మిగల్చడం మంచిదని భావించింది.

ఆ తర్వాత సమర్‌కండ్ ఖోరెస్మ్ షా రాజధాని అయింది. అతను ఒక విశాలమైన ప్రాసాదాన్ని కట్టడం మొదలెట్టాడు.

అతను మెర్కిట్స్ తాతార్ తండాని ధ్వంసం చేసేందుకు తన సైన్యాల్ని పచ్చిక బీళ్లమీదకి నడిపించాలని కిప్‌చాక్ ఖానులు పట్టుబట్టారు. మెర్కిట్స్ తూర్పు ఎడారుల నుంచి వచ్చి కిప్‌చాక్ శిబిరాలని ఆక్రమిస్తున్నారు. ఇంటి దగ్గర జరూరు విషయాలున్నాయనీ, తన రాజభవన నిర్మాణం వుందనీ సాకు చెప్పి షా తిరస్కరించాడు. అప్పుడతని తల్లి తుర్కాన్ ఖాతూన్ ఇదే విజ్ఞాపనతో అతని దగ్గరికి వెళ్లింది.

ముసలి ఆడ గద్ద ఎత్తు గోడల బీటల్లో యెవళ్లూ చొరరాని గూట్లో కీచుకీచుమనే తమ పిల్లల్ని రక్షించుకున్నట్టుగా తుర్కాన్ ఖాతూన్ కూడా షా సింహాసనాన్ని సర్వదా అసంతృప్తి చెందిన ప్రజలనుంచీ, కుట్రలు పన్నే ఖానుల కుహకాలనుంచీ ప్రయత్నాలనుంచీ, హంతకుల బాకులనుంచీ కాపాడింది. ఆమె మహా కుటిల. వంచకురాలు. తన కొడుకు అజేయుడైన ఖోరెస్మ్ షా గొప్పదనానికి వ్యతిరేకంగా చెయ్యి యెత్త సాహసించిన వాళ్లందర్నీ ఖండిం చెయ్యడానికి, ప్రమాద సమయాలల్లో ఆమెకి విధేయంగా వుండే కిప్‌చాక్ సైనికులు నిషిద్ధ నిరుత్సాహపూరిత గుర్‌గంజ్ అంతఃపురంలో నుంచి లటుక్కున దూకేవారు. అలాంటప్పుడు ఖోరెస్మ్ షా హెచ్చరికగల తన తల్లి అడిగిందాన్ని కాదనగలడా?

ఆ తర్వాతి సంవత్సరం వసంతురుతువు మొదట్లో మహమ్మద్ గుర్‌గంజ్‌కి వచ్చి పెద్ద ఆశ్వికదళ అగ్రభాగంల బయలుదేరాడు. పది దళాలు నగరం బయటికి పది రోజుల వ్యవధిలో వెళ్లాయి. ప్రతిదాంట్లోనూ ఆరు వేల మంది రౌతులున్నారు. వాటి వెనక సామాను గుర్రాలున్నాయి. వాటిమీద బార్లీ, అపరాలు, బియ్యం, ఖాద్యతైలం, కుమిన్ పానీయం నింపిన తోలు తిత్తులు యెత్తించి వున్నాయి.

ఖోరెస్మ్ షాకి యుద్ధం మెరుపులంటే ఇష్టం. ఢంకాల ఉరుములు, నగారా నాదం రక్తాన్ని ఉరకలెత్తించడం ఇష్టం. వేలాది ఆశ్వికుల ముందు వెడల్పాటి వెన్నుగల యెర్ర గుర్రం గంతు వేసింది, ఎరుపు రంగువేసిన దాని తోక మెరిసింది. గుర్రం బంగారు ముస్తీబుతో ప్రకాశించింది. అది విలువైన రత్న ఖచితంతో వుంది. దాని వెండి మువ్వలు ఘల్లు ఘల్లుమన్నాయి. వజ్రాలు పొదిగిన తెల్లని మంచులాంటి పాగాని పెట్టుకుని నల్లని గడ్డం వున్న ఆశ్వికుడు ఎక్కిన ఆ ఎర్ర గుర్రాన్ని గుర్‌గంజ్‌లో యెరగని వాళ్లెవరేనా వున్నారా?

ఈ రౌతు – ఇస్లాం రక్షకుడు, అసలైన విశ్వాస స్తంభం, పాషండుల సింహస్వప్నం, తన మెరుపులాంటి ఆగ్రహంతో సంకల్పంతో బాగ్దాద్ ఖాలిఫ్ నాసిర్‌ని, ప్రవక్త వంశీకుణ్ణి

కూడా కొట్టాడు. ప్రపంచ విజేత యవన సికందర్ యెన్నడూ రాని ప్రపంచపు హద్దులకి తన సామ్రాజ్యపు యెల్లల్ని విస్తరిస్తున్నాడు. యీ రౌతు ఖోరెస్మ్ షా అల్లా ఉద్దీన్ మహమ్మద్.

సైన్యం పది రోజుల పాటు సాగింది. ప్రతి విడిది స్థావరంలోనూ ప్రతి దళం వేలాది గుర్రాలతో నూతుల్లోని నీళ్లన్నిటినీ తాగేసింది. మర్నాడు మాత్రమే నీళ్లు వూరతాయి.

మొదటి దళంలో ముందు గూఢచారులు వెళ్లారు. ఖోరెస్మ్ షా ముఖ్య విభాగం వెనక అగ్రభాగాన వుంటూ అనుసరించి రెండవ దళంలో వెళ్లాడు. అతనితోబాటు అలుపెరగని ఒంటెలు వెళ్లాయి. వాటిమీద షా గుడారాలు, వంటకవసరమైన పాత్రలు తరగని పదార్థాలూ యెత్తి వున్నాయి.

పదవదీ ఆఖరిదీ అయిన దళంలో తుర్క్‌మెన్లతో కలిసి అవమానం పాలైన షా కొడుకు జలాలుద్దీన్ వున్నాడు. తుర్క్‌మెన్లు యెప్పుడూ కలవరపాటుగా, అదుపు లేకుండా వున్నారు. వాళ్లు యెప్పుడూ కిప్‌చాక్‌లతో రాపిడిగానే వుండేవాళ్లు, వీళ్ల దురహంకారాన్నీ, దురాశనీ అసహ్యించుకుంటూ. తుర్క్‌మెన్లు తమ శిబిరం నెగళ్లని వెడల్పాటి వృత్తంలో రాజేసుకునే వాళ్లు, సాయంత్రాలప్పుడు వాళ్లు నెగడు మంటలో తలల పైన కరవాలాలు మెరుస్తూ వుండేటట్టు తిప్పుతూ, యుద్ధం పాటలు పాడుతూ వీర నృత్యాలు చేసేవాళ్లు.

దండయాత్ర దారి ఖోరెస్మ్ (ఆరల్) సముద్ర తీరం వారనే వుంది. సైహూన్ (సిర్‌దార్య) నదిని దాటి సైన్యాలు సారీ చాహనక్ సన్నని అఖాతానికి వచ్చాయి. ఇక్కడ ఆగమని షా ఆజ్ఞ ఇచ్చాడు. గూఢచారుల వార్తల కోసం అతను నిరీక్షించాడు. ఈ లోపున తన డేగలతో నీలి సముద్ర తీరంలో స్వారీ చేసుకువెళ్లాడు. శిబిరానికి బస్తానిండా పుష్కలంగా అడివి బాతుల్నీ, కొంగల్నీ మోసుకువచ్చాడు.

ఇర్గిజ్ నది దిగువ ప్రాంతాల్లో, చల్‌కార్ సరస్సులో అది కలిసే చోటుకి దగ్గర మెర్కిట్ గుర్రాల మందల్ని తాము చూశామని గూఢచారులు నివేదించారు. సైన్యాలు పోగయే దాకా ఖోరెస్మ్ షా ఆగాడు. అప్పుడు దళనాయకుల్ని సమావేశ పరిచి తన దాడి పథకాన్ని వివరించాడు. సైన్యం మూడు భాగాలుగా విడిపోతుంది. షా తనే మధ్య భాగానికి నాయకత్వం వహిస్తాడు. అది కడపటి నిర్ణాయకమైన దెబ్బ కొట్టడానికి వేర్పాటుగా వుంటుంది. వామ పార్శ్వం కిప్‌చాక్ ఖాన్ తుర్గాయ్ ఆధిపత్యం కింద వుంటుంది. దక్షిణ పార్శ్వం ఖోరెస్మ్ షా కొడుకు జలాలుద్దీన్ ఆధిపత్యం కింద వుంటుంది. అదుపూ అజమాయిషీకి లొంగని తన అతి ఆత్మవిశ్వాసంగల కొడుకు యుద్ధంలో యెలా ప్రవర్తిస్తాడో చూద్దామని మహమ్మద్ అనుకున్నాడు.

గుర్‌గంజ్ నుంచి విడిదికి దౌడు తీసుకుంటూ ఒక దూత వచ్చాడు. షా తల్లి తుర్కాన్ ఖాతూన్ నుంచి చుట్ట చుట్టిన కట్టని అతను తీసుకువచ్చాడు. షాని అనుసరించి వకీలు, మీర్జా డేరాలోకి వెళ్లారు. మహమ్మద్ చుట్టని బాకుతో సర్రున చీల్చి తెరిచాడు. లోపల ఒక

చిన్న ఎర్రని పట్టు సంచీ వుంది. దాన్ని కనుబొమలకీ పెదాలకీ అదుముకుని, ఖోరెస్మ్ షా సంచీ విప్పాడు. సన్నపాటి కాగితం మీద పెద్ద అక్షరాలతో ఒక జాబు వుంది.

"మహాశక్తివంతులూ, విశ్వాస రక్షకులూ, ధర్మ రక్షకులూ అల్లా ఉద్దీన్ మహమ్మద్ ఖోరెస్మ్ షాకి – అల్లా నీ సామ్రాజ్యాన్ని కాపాడు గాక – సలాం!

"అన్ని మసీదుల్లోనూ ఇమామ్‌లందరూ సర్వేశ్వరుడైన సృష్టికర్తకి, సకల ప్రభువుకి ప్రతి రోజూ అయిదు సార్లు ప్రార్థన చేస్తున్నారు. ఆయన నీ యేలుబడిని కొనసాగించి నీ శత్రువులమీద విజయాన్ని సంపాదించి పెట్టుగాక: తథాస్తు!

"బాగ్దాద్ ఖాలిఫ్ పంపిన ఒక దర్వీష్‌ని అంగడి వీధిలో పట్టుకోవడం జరిగింది. పర్షియన్ల భ్రష్టత్వాన్ని అనుసరించినందుకు మా ప్రియమైన షాని అల్లా శిక్షిస్తాడనీ, మన సామ్రాజ్యాన్ని ధ్వంసం చెయ్యడానికి పాషండుల మూకల్ని ఖోరెస్మ్‌మీదకి పంపుతాడనీ నోళ్లు వెళ్లబెట్టుకుని వింటూ వున్న జనానికి బోధిస్తున్నాడతను. ఈ అల్లరి దర్వీష్‌ని ముఖ్య తలవరి జహాన్ పహ్లావన్ పట్టుకున్నాడు. యెర్రగా కాలే ఇనప వూచలతో అతన్ని హింసించాడు. అంగడి వీధి చౌకులో, మొదట అతని నాలికని ఖండించి, తర్వాత ఉరితీశాడు.

"ఈ చిత్రహింసల్ని చూసి ప్రజలు భీతిల్లిపోయారు. మిగిలినదంతా బాగుంది. అనేక సంవత్సరాలు నీ సామ్రాజ్యంలో సుఖ శాంతులు వెల్లివిరియుగాక!

తుర్కాన్ ఖాతూన్

ప్రపంచ మహిళలందరి సార్వభౌమురాలు".

సైన్యం మర్నాడుదయం బయల్దేరింది. వేగంగా రెండు మజిలీల్లో ఇర్గిజ్ నదిని చేరింది.

మైదానాలు యీరికలెత్తే వసంతరుతు పచ్చికతో వున్నాయి. మామూలుగా యెంతో ఆరిపోయి నిర్జీవంగా వుండే ఇసక మైదానంమీద పసుప్పచ్చగానూ, వంగపండు రంగుగానూ వుండే ఇరిసెస్ పువ్వులు, యెర్రనితులిప్‌లు అక్కడక్కడ తేజోవంతంగా వున్నాయి. సూర్యుడు నల్లని వర్షకాభ్రాల మాటుకేనా పోతున్నాడు, కళ్లు బైర్లు కమ్మేట్టేనా ప్రకాశిస్తున్నాడు.

ఇర్గిజ్ నది ఇంకా కరిగే మంచుతో కప్పడి వుంది. నీళ్లు ఉపరితలంమీద కనిపించ నారంభించాయి. నల్లని కాళీలు, గుంటలు కనిపించడంతో సైన్యం అవతలి ఒడ్డుకి దాటి వెళ్లే ప్రయత్నాలు వమ్మయ్యాయి.

తన సైన్యాన్ని రెల్లు వెనక కనిపించకుండా దాచి మంచు కరిగే దాకా ఆగాలని ఖోరెస్మ్ షా నిర్ణయించుకున్నాడు. లేకపోతే మెర్కిట్స్ తన సైన్యాన్ని కనిపెట్టేసి పచ్చిక బీటిమీద ఇంకా బాగా వెనక్కి వెళ్లిపోవచ్చు.

శిబిరం నెగళ్లు రగిలించకుండా సైన్యం రెండ్రోజులు విడిసింది. రెండవ రోజు రాత్రి ఆకాశం విచిత్రమైన తేజంతో నిండిపోయింది. భూమి రక్తారుణ కాంతితో ప్రతి ఫలించింది. చీకటి అదృశ్యం అయింది. నక్షత్రాలు గోచరమవలేదు. సూర్యాస్తమయం ప్రభాతం దాకా విస్తరించిందా అన్నట్టు కనిపించింది.* తన సైన్యంతో ప్రయాణిస్తున్న షేక్ అల్ ఇస్లాం** దీన్ని అల్లా సంకేతంగా భాష్యం చెప్పాడు. ఖోరెస్మ్ షా మహమ్మద్‌కి మహత్తర విజయాలుంటాయని జోస్యం చెప్పాడు.

నదిమీద మంచు తొలగిపోగానే వేగులవాళ్లు ఉత్తానంగా వున్న తావులు చూశారు. మొత్తం సైన్యం నది దాటింది.

నిర్జన పర్వతాలతో విశాలమైన మైదానం అంతూ దరీ లేకుండా చిత్రంగా వాళ్ల ముందు విస్తరించుకుని వుంది. సరిగ్గా కనిపించీ కనిపించని దారులమీద జాడ చూసుకుంటూ సైన్యాలు తూర్పుకు కదిలాయి. ఆసన్న యుద్ధానికి సన్నద్ధమవుతూ అవి మరింత దగ్గరగా వచ్చాయి.

రాతి కొండల మధ్య లోయలో వాటికి అనేక నల్లని యుర్త్‌లు తగిలాయి. దుస్సాహస పలయనంలో వాటిని దిగ విడిచి వుంటారు. బొచ్చు అట్టలు, ఆడవాళ్ల బట్టలు, పాత కంబళ్లు జాడలో చెదిరిపడి వున్నాయి. వాటి మధ్య ఒక మనిషి శరీరం వుంది. అతని చెవులమీద రెండు నల్లని జడలున్నాయి. అతని కళ్లు మంగోలు కళ్లు. ముఖం పసుప్పచ్చగా వుంది. వెలిసిపోయిన నీలం రంగు పొడుగాటి అంగరఖా చీలమండలదాకా వుంది. అది చిరిగి పీలికలైపోయింది. ఇంకా యెదర రెండు చక్రాల యెద్దు బండి పక్కకి ఒరిగిపోయి వుంది.

కొండ శిఖరం పైనుంచి వేగుల వాళ్లు పక్కకి సంకేతాలు చేశారు. సైన్యం పక్కకి తిరిగి సూచించినట్టుగానే దారి చేసుకుపోయింది.

రౌతులు గుర్రాల్ని ముందుకు పొడిచారు. కళ్లేలు లాగారు. వాళ్ల ముందు బూడిద రంగు మైదానం పరుచుకుని వుంది. నల్లని గుడ్డ పీలికలు చెదిరి వున్నాయి. జీను వేసిన గుర్రం మైదానంమీద తిరుగుతోంది. ఆశ్వికుడు లేడు.

"రణ రంగం!" అని సైనికులు అరిచారు. "అల్లా దయవల్ల వాళ్ల బతుకులు అంతం అయిపోయాయి."

"కాని యెవరు అంతం చేశారు? మనకి దక్కవలసిన సంపదని యెవరు నాచుకు పోయారు? వాళ్ల మందలేవి? గుర్రాలు, ఒంటెలు యేవి?"

శవాలు పడిపోయి వున్న నేలమీద సైన్యం ముందుకు వెళ్లింది. నల్లని పీలికలు కత్తితో ఖండాలుగా తెగ్గొట్టిన కళేబరాలుగా, బాణాలతో, బల్లేలతో గుచ్చిన కళేబరాలుగా తేలాయి.

---

* అరోరా బొరియాలిస్‌ని పోలిన యీ వాతావరణ విషయాన్ని ఆనాటి చరిత్ర కారులంతా ప్రస్తావించారు.

** ఇస్లాం మతబోధకుల నాయకుడు.

అవి ఒకొటొకటిగానూ వున్నాయి, గుట్టలు గుట్టలుగానూ వున్నాయి. కొన్నింటినుంచి బట్టలూ, పాదరక్షలూ కూడా తీసేసుకున్నారు.

ఇక్కడో కత్తినీ, అక్కడో డాలునీ, బల్లేన్నీ తీసి ఆ క్షేత్రం అంతా చెదిరిపోయారు రౌతులు.

ఖోరెస్మ్ షా నల్లని గడ్డాన్ని చూపుడు వేలుతో మెలి తిప్పుకుంటూ ఆలోచనామగ్నంగా స్వారీ చేశాడు. అతని సొంత పరిచారకులు మెల్లిగా మాట్లాడుకున్నారు.

“ఇది భీకర యుద్ధం. కొన్ని వేల మంది మెర్కిట్‌లు చచ్చిపోయారు. సజీవంగా పట్టుకోలేదు, గాయపడ్డవాళ్లని చంపేశారు.

ఓ రౌతు అరుచుకుంటూ దౌడు తీసివచ్చాడు:

“బతికున్న ఓ మెర్కిట్ దొరికాడు. అతను మాట్లాడగలుగుతున్నాడు”.

ఖోరెస్మ్ షా గుర్రాన్ని పొడిచాడు. అతని పరిచారకులు వెనక గబగబా వెళ్లారు.

ఆ మెర్కిట్ కొండ పాదం దగ్గర కూర్చున్నాడు. అతన్ని ప్రశ్నలడుగుతూ కిప్‌చాక్‌లు చుట్టూ కూర్చున్నారు. నుదుటి దగ్గర్నుంచి వెనక మెడదాకా గీసేసిన అతని తల రక్తం కారుతోంది.

ఖోరెస్మ్ షా గుర్రాన్ని నిలబెట్టాడు.

“యేమంటాడు? అతని తెగ యేమిటి? యెవరు దాడి చేశారు వాడిమీద?”

మెర్కిట్ మూలుగుతూ యేడుస్తూ తన కథని చెప్పాడు.

“మేం గొప్ప ప్రజలం. కాని నాశనం అయిపోయాం. మమ్మల్ని మెర్కిట్‌లంటారు. మా ఖాన్ తుక్తు ఖాన్. ఆయన వేటగాడుగా ప్రసిద్ధుడైన కొడుకు కోల్తు ఖాన్‌తో పారిపోయాడు. కోల్తు ఖాన్ కంటే నిబ్బరంగా, దూరంగా బాణం వెయ్యగలవాడు లేడు. ఆ ఇద్దరు ఖానులూ మాకు చెప్పారు: ‘జెంఘిజ్ ఖాన్ ఆగ్రహం నుంచి తప్పించుకుపారిపోదాం పదండి. ఒక్క మెర్కిట్‌ని ప్రాణంతో వదలడు. పశ్చిమానికి, ఉప్పు సముద్రాలకావలగా కిప్‌చాక్ పచ్చిక బీళ్లు సముద్రాలదాకా వ్యాపించి వున్నాయి. మనకక్కడ చోటు ఉంటుంది. పశువులకి ఇష్టమైన గడ్డి రెల్లు అంత మందంగా అక్కడ వుంది. మన మందలు సంతుష్టిగా ఉండి, రెట్టింపవుతాయి. కిప్‌చాక్‌లు మనకి శరణు నిరాకరించరు. తమతోబాటుగా మనల్ని ఒకే కంచంల తిననిస్తారు, ఒకే పాత్రతో తాగనిస్తారు’ అని ఖానులు అన్నారు. మేం యేం చెయ్యగలం? మా వెనక చావు, యెదర బోలెడు స్వేచ్ఛ, సంపద ఉన్నాయి. కాని మమ్మల్ని సుబుదై, తోఖూచర్ నాయన్‌లు* కుక్కల్లా తరిమేశారు. ఎర్ర గడ్డం వాని పెద్ద కొడుకు జూచి ఖాన్ వాళ్లని వదిలాడు. మేం మహా వేగంగా పరిగెత్తాం. రాతి గోబిమీద, యెర్రని ఇసకలోనూ మా గుర్రం జాడలు

---

* సుబుదై భగతూర్, తోఖూచర్ నాయన్ – ప్రఖ్యాత మంగోలు నాయకులు, తర్వాత కల్కా నది దగ్గర జరిగిన యుద్ధంలో విజేతలు.

కనిపించకుండా దాచి పెట్టాలని ప్రయత్నించాం. గాని మా గుర్రాలు అలిసిపోయాయి. వాటి గిట్టలు చీలిపోయాయి, అవి మందగించాయి. మంగోలులు మమ్మల్ని తుఫాన్‌లా తాడించారు. మాకు రక్షణ లేకపోయింది. ఇరవై వేల మంది మంగోలు రౌతులు మా మీదకి విరుచుకు పడ్డారు. ఇర్గిజ్ నది దాటడానికి అసాధ్యం అయింది. మంచు గడ్డలు తేలి ప్రవహించాయి. గుర్రాలు బురద రొచ్చులో కూరుకుపోయాయి. మెర్కిట్‌ల మహా జాతి ఇక లేదు! ఖండ ఖండాలుగా నరికేస్తే కొంతమంది మంగోలులు రణ రంగంమీద పడిపోయారు, కొందమందిని బానిసలుగా పట్టుకుపోయారు. తన పసుప్పచ్చ గుడారంలో బొచ్చు అట్టల గుట్టమీద కూర్చుని యెర్ర గడ్డం జెంఘిజ్ ఖాన్ నవ్వుతున్నాడు. మెర్కిట్‌ల పురా వైభవం అంతమైంది. మెర్కిట్ జాతికి ద్రోహం చెయ్యడానికి ఒక్కగానొక్కళ్లు మిగిలారు యువ ఖాన్ కూతురు, అందమైన కూలన్! ఆమె జెంఘిజ్ ఖాన్‌కి సరికొత్త వధువు అయింది..."

కిప్‌చాక్‌లు అరిచారు:

"ఈ హంతక మూకల దగ్గరికి మమ్మల్ని తీసికెళ్లు మేం వాళ్ల పని పడతాం. పశు వులతోటీ బందీలతోటీ వాళ్లు గబగబా పోలేరు. వాళ్ల దగ్గర్నుంచి వాళ్లు కొల్లగొట్టిందాన్ని లాక్కుంటాం".

"త్వరలోనే వాళ్లని అందుకుంటాం మనం" అన్నాడు ఖోరెస్మ్ షా. ఆ మైదానం పైన తరిగేసిన మెర్కిట్ కళేబరాలమీద వున్న వాటిని వొలుచుకుంటూ చెదిరిపోయిన తమ సైనికుల్ని రమ్మని పిలుస్తూ నగారాలు వాయించమని ఖోరెస్మ్ షా ఆజ్ఞ జారీ చేశాడు.

# పరాయి తండాతో పోరు

"జల్ వీరుడు రుస్తుంతో అన్న
మాటలు దృష్టిలో ఉంచుకో: 'యే
శత్రువూ తక్కువ వాడు కాదు, యే
శత్రువూ దుర్బలుడు కాదు,' "
(పాత పర్షియన్ పాట)

సైన్యం రాత్రంతా ముందుకు సాగింది. గుర్రాలకి దాణా పెట్టడానికి మాత్రం రెండు సార్లు కొద్దిగా ఆగారు.

ఉదయం వేళకి పచ్చిక బీడుని పొగమంచు కమ్మింది. దళాల్లో ఒక దానికీ ఇంకో దానికీ సంబంధం తెగిపోయింది. తోడేళ్లల్లాగా, గుంటనక్కల్లా అనుకరిస్తూ, వేగుల వాళ్లు రోదనాభరిత రావాలు చేశారు.

సుళ్లు తిరిగే పొగమంచుని గాలి వీచి చెదరగొట్టింది. దిఙ్మండల బంగారు రేఖ పైన కొండ శిఖరాలు కనిపించాయి. కొండల దిగువన అనేక విడిదినెగళ్లు మండుతున్నాయి. రౌతులు బృందాలు, ఒంటెలు, సరుకు నింపిన పెద్ద యెత్తు చక్రాల బళ్లూ క్రమేపీ గోచరమయాయి.

ఆ అజ్ఞాత తండా శిబిరం అది. వాళ్లు అప్పటికే దగ్గర పడుతూ వున్న ఖోరెస్మ్ షా సైన్యాల్ని చూశారు. చెదిరిపోయే పొగమంచు పుంజాల్లో నుంచి ముప్పై మంది రౌతులు హఠాత్తుగా వచ్చారు. వాళ్లు పదేసి మంది చొప్పున మూడు విడి దళాలుగా ఉన్నారు. ఉదయించే సూర్యుడి తొలి కిరణాలు వాళ్ల పొడుగాటి నీలం చొక్కాలమీద, ఇనప కవచాలమీద శిరస్త్రాణాలమీద ప్రకాశిస్తున్నాయి. మొట్టమొదటి దళంతో పొడుగాటి తుర్క్‌మెన్ అశ్వంమీద తెల్ల గడ్డం ముసల్‌మాను ఒకడు స్వారీ చేస్తున్నాడు. అతను తెల్లని పాగా పెట్టుకున్నాడు. ఎర్రటి గొర్రెతోలు కోటు తొడుక్కున్నాడు. దానికి పసుపచ్చ జరీ ఉంది. ఆ ముసలతని పక్కన ఒక రౌతు స్వారీ చేస్తున్నాడు. అతను ఒక బల్లెం పట్టుకున్నాడు. దాని అంచున తెల్లని గుర్రం తోక ఉంది.

"సలాం" అని ముసలతను అరిచాడు. "నేనూ ముస్లింనే! మీ ముఖ్య దళాధిపతితో నన్ను మాట్లాడనియ్యండి. అల్లా అతన్ని కాపాడు గాక!"

"మా సైన్యంలో చాలా మంది దళాధిపతులున్నారు. కాని అందరికీ పైన, ప్రపంచపు పిడుగు, ఇస్లాం కరవాలం, ఖోరెస్మ్ షా అల్లా ఉద్దీన్ మహమ్మద్ ఉన్నాడు".

ఆ ముస్లిం గుర్రం దిగాడు. దండ కట్టుకుని, నడుంవంచి అతను నిశ్శబ్దంగా ధగధగ మెరిసిపోయే ఖానులు పరివేష్టించి వుండగా ఖోరెస్మ్ షా గుర్రంమీద వైభవంగా కూర్చున్న చోటికి వెళ్లాడు.

"మంగోలు సైన్యాధిపతి, ఘనత వహించిన నాయన్ (అంటే రాజు) జూచి ఖాను ప్రాచ్య దేశాల పాలకుడైన జెంఘిజ్ ఖాన్ కొడుకు తన దుబాసీనైన నన్ను, పశ్చిమ దేశ పాలకులైన నీకు ప్రణామం చెప్పవలసిందిగా ఆజ్ఞాపించాడు – అల్లా నీ పరిపాలనని నూట ఇరవై యేళ్లు వుండేటట్లు చేయుగాక! నీకు అతను సలాం చెప్తున్నాడు".

"సలాం" అన్నాడు షా.

"జూచి ఖాన్ అడుగుతున్నాడు: పరాక్రమవంతమైన షా సైన్యం మంగోలు సైన్యం వెన్నంటి, రాత్రంతా అంత వేగంగా ప్రయాణం చేస్తూ, యెందుకు వస్తోంది?"

ఆ ముసల్మాను జవాబు కోసం నిరీక్షించాడు. కాని నల్లని గడ్డాన్ని నిమురుకుంటూ షా, మంగోలు దూతకేసే చూపు లగ్నం చేసి, యేం మాట్లాడలేదు.

"ఖాన్ ఇష్టానికి వ్యతిరేకంగా పారిపోతున్న తిరుగుబాటు మెర్కిట్‌లని శిక్షించవలసిందిగా తన దళాధిపతులైన సుబుదై, తోఖూచర్‌లకి తన తండ్రి అజేయుడైన జెంఘిజ్ ఖాన్ ఆదేశాలిచ్చినట్టూ జూచి ఖాన్ మీకు తెలియజెయ్యమని నన్నాజ్ఞాపించారు. ఇప్పుడీ తిరుగుబాటు చేసిన వాళ్లని నాశనం చెయ్యడం జరిగింది కనక మంగోలు సైన్యాలు తమ సొంత మైదానాలమీదకి తిరిగి వెళ్లిపోతున్నాయి".

ముసలి ముస్లిం ఒక క్షణం ఆగాడు. కఠినంగా, యే భావమూ గోచరం గాని షా ముఖంకేసే కళ్లు లగ్నం చేసి, కొనసాగించాడు:

"బొచ్చు అట్టల యుర్తలలో వుండే సకల ప్రజా సార్వభౌముడు జెంఘిజ్ ఖాన్ ముస్లిం సైన్యాలపట్ల, అవి మాకు యెక్కడెక్కడ తగిలినాగానీ, స్నేహపూర్వకంగా ఉండమని మమ్మల్ని ఆదేశించాడు. స్నేహ చిహ్నంగా జూచి ఖాన్ మెర్కిట్‌లలో మేం బందీలుగా పట్టుకున్నవాళ్లనీ, కొల్లగొట్టిందాన్నీ షా సైన్యాలతో పంచుకోవచ్చని ప్రతిపాదిస్తున్నాడు".

అప్పుడు ఉన్నట్టుండి షా గుర్రాన్ని కమ్చీతో కొట్టాడు. గుర్రం ఎగిరిగెంతింది. మహమ్మద్ బలమైన చెయ్యి దాన్ని అదుపులో పెట్టింది. షా ఈ ప్రసిద్ధమైన మాటల్ని అన్నాడు. విధేయంగా నమోదు చేసే అతని రాతగాడు మీర్జా యూసఫ్ "షా దండయాత్రల సుడులు, యుద్ధాల సాహసకృత్యాల పట్టిక" అన్నదాంట్లో నమోదు చేశాడు.

"నీ సైన్యాధిపతితో చెప్పు: నాతో యుద్ధం చెయ్యద్దని జెంఘిజ్ ఖాన్ నీకు ఆజ్ఞ ఇచ్చాడు. కాని నాకు అల్లా వేరే ఆజ్ఞ ఇచ్చాడు నీతో యుద్ధం చెయ్యమని. మీ అపవిత్ర పాషండుల్ని తుడిచిపెట్టం ద్వారా నేను అల్లా కృపకి అర్హుణ్ణవుతాను".

ఆ దుబాసీ నిశ్చేష్టుడైపోయి, షా అన్న మాటలు అర్థం చేసుకో ప్రయత్నిస్తూ, అలా నుంచుండిపోయాడు. కాని షా అప్పటికే గుర్రాన్ని పొడిచి తన సైన్యం వేపు తిరిగి వెళ్లిపోయాడు. సైన్యం గబగబా యుద్ధం కోసం తయారవుతుంది.

ఆ దుబాసీ మంగోలు ఆశ్వికులున్న చోటికి తిరిగివెళ్లాడు. మొత్తం దళం అంతా మంగోలు శిబిరం వేపు కదిలింది. వాళ్లు ఓ క్షణం సేపు మెల్లిగా అడుగులు వేయించారు. కాని తర్వాతి క్షణంలోనే గుర్రాల వీపులమీద కంటా వాలి గుర్రాల్ని పూర్తి వేగంతో దౌడు తీసేటట్టు సైన్యం వెనకాల పరిగెత్తించారు.

యుద్ధం మొదలైంది.

ముస్లిం దుబాసీ మంగోలు శిబిరాన్ని చేరగానే కొన్ని విభాగాలు మెల్లిగా షా సైన్యాల్ని యెదుర్కోవడానికి సాగాయి. కొండల సానువులమీదకి వచ్చాయి.

ఖోరెస్మ్ షా తన ఖాన్లకి ఆజ్ఞలు జారీ చేశాడు.

"సైన్యం మూడు విభాగాలుగా విడిపోతుంది – కుడి, ఎడమ భాగాలు, మధ్య భాగం. ఆ రెండు విభాగాలు మంగోలు శిబిరాన్ని చుట్టుముడతాయి యెవళ్లూ పారిపోవడానికి లేకుండా. మధ్య భాగం – దీన్ని నేనే తీసుకుంటాను – కాపుదలగా అవసరానికి ఉంటుంది. మీకు యే ఒత్తిడి వచ్చినా దీన్ని సిద్ధంగా పెట్టుకుని ఉంటాను, కడపటి దెబ్బకి. శత్రువు మనమీద ముందునుంచి దాడి చెయ్యడు. ఒకవేళ అలా చేస్తే మరీ మంచిది. ఉప్పుపత్రల ఊబిలో కూరుకుపోతాడు".

షా కొండ శిఖరం పైకి యెక్కాడు. పచ్చిక బీడు దూర తీరానికి వ్యాపించింది – రాబోయే యుద్ధ రంగం. షా గుర్రం దిగి ఒక తివాసీమీద కూర్చున్నాడు. నౌకర్లు జరీ దాస్తర్ఖాన్ పరిచారు. అప్పాలు, యెండిన పళ్లు, యెండబెట్టిన కర్బుజాలు వున్న తళ్లికల్ని దానిమీద పెట్టారు. ఖోరెస్మ్ షా కుమిస్ ఛషకాల్లో పోసి యుద్ధ కళని అధ్యయనం చేసేందుకు అతనితో బయల్దేరిన యువ ఖానులకి ఇచ్చాడు.

సరుకుల బరువు యెత్తిన శీఘ్రగమన ఒంటెల్ని మెకాళ్లమీద వాలనిచ్చరు. దాస్తరఖాన్ నౌకర్లు ఖోరెస్మ్ షా అలసిన నరాలకి శక్తిని పునస్థాపించే బంగారు కూజాలతో అద్భుత భోజన పదార్థాలు నింపిన తళ్లికలతో హడావుడి పడ్డారు.

ఖోరెస్మ్ షా ప్రేమకి నోచుకోని కొడుకు జలాలుద్దీన్ కుడి పార్శ్వాన్ని నడిపించాడు. అతను కర్రి గుర్రాన్ని దౌడు తీయిస్తూ ఇసక గుట్టపైకి పోనిచ్చాడు. యువ ఖాన్ నల్లని కళ్లని కుంచించి నాజూకైన చేతిని యెండకి అడ్డం పెట్టుకుని యుద్ధ భూమిపైన సారించి చూశాడు.

"కార కోంచర్‌ని పిలు" అని అతను ఒక రౌతుని చూసి అరిచాడు. ఎర్ర కఫ్తాన్ ధరించిన బొద్దు యువ తుర్క్‌మెన్ ఒకడు కొండ దిగువకి దౌడు తీయించుకుంటూ వెళ్లాడు. నల్లని అంగీ తొడుక్కుని, నల్లని గొర్రెతోలు టోపీ పెట్టుకున్న సన్నని యోధునితో కలిసి తిరిగివచ్చాడు. కార కోంచర్ జలాలుద్దీన్ దగ్గరికి వెళ్లాడు. వంగి వందనం చేసి అతను చెప్పేది శ్రద్ధగా విన్నాడు. ఖాన్ అతనికి తన యుద్ధ తంత్రాన్ని వివరించాడు. కార కోంచర్ డేగలాంటి ముఖంలో యే భావమూ వ్యక్తం కాలేదు. గుండ్రంగా వున్న తేనె కళ్లు మాత్రం ఆసక్తితో మెరిశాయి.

"ఈ ఉప్పుపర్రలు చూశావా?" అని జలాలుద్దీన్ మొదలెట్టాడు. "దీనివల్లనే మనకి విజయమేనా సంభవించాలి, అపజయమేనా రావాలి. తాతార్‌లు యెంతో మంది లేరు. మనం వాళ్లకి మూడు రెట్లు యెక్కువ వున్నాం. కాని సంఖ్య మాత్రమే యావత్తూ కాదనుకో. నేను మన సైనికుల్ని నమ్మగలనా? చచ్చిపోయే మెర్కిట్ ద్వారా మనకి తెలిసి సుమారు ఇరవై వేల మంది మంగోలులు మాత్రమే ఉన్నారని. వాళ్లల్లో సగం మంది మనమీద దాడి చేసినా పది వేలు మాత్రమే ఉంటారు. కాని మనకి ఆరు వేల మంది తుర్క్‌మెన్‌లు, అయిదు వేల మంది కార కితాయ్‌లు ఉన్నారు. అయినా కారకితాయ్‌లు ఆకలివల్లా అవసరంవల్లా మాత్రమే పాదుషా వెనక వచ్చారు. వాళ్లు యుద్ధం చెయ్యాలని రాలేదు, పరాయి నెగళ్ల దగ్గర చలి కాచుకుందామని వచ్చారు. మనం ముందు వాళ్లని పంపుదాం. వాళ్లు సంతోషంగా ముందు వెడతారు, కొల్లగొట్టిన దాన్ని తీసుకునే మొదటి వాళ్లు తామే అవుతామని. కాని తాతార్లు 'అడివి పులుల'ని ఈ మెర్కిట్ వర్ణించాడు. అంచేత వాళ్లు కార కితాయ్‌లని ఛిన్నాభిన్నం చేసి మనమీదకి ఉరుకుతారు. మనం భీకరంగా వాళ్లని యెదిరించాలి, వాళ్లని పార్శ్వం నుంచి దెబ్బకొట్టి ఈ ఉప్పుపర్రలకేసి తరిమెయ్యాలి. వాళ్లక్కడ కూరుకుపోతారు. మనం వాళ్లని నాశనం చేసేస్తాం. అప్పుడు నాయనగారికి సాయం చెయ్యడానికి వెళ్దాం. పాదుషాకి ఇవాళ మనస్థిమితం ఉండదు. వేపుడు బాతుల విషయం మర్చిపోతాడు. హోయ్! ఇదిగో! రౌతులూ! తుర్క్‌మెన్ ఖాన్ల దగ్గరికి పోయి చెప్పండి ఇవాళ కారకూమ్ వేట చిరుత కార కోంచర్ తమని యుద్ధంలో నడిపిస్తాడని".

కొండలమీద పోగయిన తుర్క్‌మెన్ శ్రేణుల దగ్గరికీ ఆరుగురు రౌతులు దౌడు తీసుకుపోయారు. కార కోంచర్ పేరు వినగానే సైన్యంలో ఒక చలనం, ఒక చురుకు దూసుకువచ్చాయి. ఆస్తరబాద్, ఖురాసాన్ సింహస్వప్నం కార కోంచర్‌ని గురించి వినని వాడెవడు. పొడుగు కాళ్ల యెరుపు గుర్రంమీద నల్లని బట్టలు తొడుక్కుని మౌనంగా వుండే ఈ రౌతుని చూసి కారకూమ్ మైదానాల్లో నీడలా అనుసరించి వచ్చే గుండెలు తీసిన అగ్గి పిడుగు అని యెవళ్లూ అనుమానించరు.

కార కోంచర్ తుర్క్‌మెన్‌ల దగ్గరికి దౌడు తీసుకుంటూ వెళ్లాడు. వాళ్ల ముఖ్యుల్ని పిలిచాడు. యుద్ధ తంత్రాన్ని క్లుప్తంగా వివరించి తనతోబాటుగా మూడు వేల మంది రౌతుల్ని కొండ వెనక్కి తీసుకుపోయాడు. అక్కడ తాతార్‌ల కోసం మాటువేసి ఉంటాడు.

జలాలుద్దీన్ క్ర్రి గుర్రం సుడిగాలిలా కార కితాయ్‌లు మూగిన చోటికి దూసుకుపోయింది. బొచ్చు టోపీలు పెట్టుకుని, చిన్న బొచ్చు గుర్రాలమీద కూర్చుని చిన్న బల్లేలు మెరుస్తూ ఉంటే వాళ్లు ఓ వరసా పద్ధతీ లేని మూకలా ఉన్నారు.

"కార కితాయ్ వీరుల్లారా! మీరు కొండ చిరుత పులులు. యుద్ధ భూమిలో సాహసులు. మీ ముందు పిరికి సంచారుల యుద్ధ శిబిరం వుంది. వాళ్లు రాత్రి దొంగల్లాగా వచ్చారు. మన కొల్ల సంపదని కాజేశారు. అది మనదే, యీ పచ్చిక బీళ్ల యజమానులమైన మనదే. వాళ్ల శిబిరంమీద విరుచుకు పడండి, ధ్వంసం చెయ్యండి మీకేం కావాలో తీసేసుకోండి".

కార కితాయ్‌లు కదలడం మొదలెట్టారు, వాళ్ల గుర్రాలు తాతార్ శిబిరం వేపు గెంతుతూ పోయాయి. వాటి వెనక దుమ్ము రేగింది. అవి వేగం అందుకుని దౌడు తియ్యడం మొదలెట్టగానే వాళ్ల పిచ్చి అరుపులూ, కేకలూ ఓ యెడతెగని ఘోషలాగా పరిమాణంలో పెరిగాయి.

ఖోరెస్మ్ షా నల్ల బొచ్చు నిడుపాటి అంగీని వెనక్కి విసురుకుని తివాసీమీద సుఖంగా సర్దుకుని కూచున్నాడు. తెల్లని గట్టి పళ్లతోటి అడివి బాతు కాలిని కొరకడం మొదలెట్టాడు. మరో కాలిని షేక్ అలా ఇస్తాం కొరికాడు. షా పరివారంలో పాదుషాతోబాటుగా అదే తివాసీమీద కూర్చోడానికి హోదా గలవాడతడొక్కడే. షా దండయాత్రలో తోడు ఉండే తైమూర్ మాలిక్, షాకి ఇష్టుడు, "ఆయన కత్తి పిడి, ఆయన విశ్వాస కవచం" అయిన తైమూర్ మాలిక్ కూడా దండకట్టుకుని మహమ్మద్‌కీ తెల్లగడ్డం ఇమామ్ అధినేతకీ జరిగే గాఢ సంభాషణని వింటూ నిలబడి ఉంటాడు. ఇమామ్ షాకి విజయం చేకూర్చమని దండయాత్రల్లో నిరంతరం అల్లాకి ప్రార్థన చెయ్యడానికిగాను కూడా వచ్చేందుకు షాని అడిగాడు.

ఖోరెస్మ్ షా దిలాసాగా పరిహాసం మాటలు మాట్లాడాడు. మైదానంమీద విడి విభాగాలుగా పోగవుతున్న శత్రువు దిశలో మధ్య మధ్యన చూపులు విసురుతూనే ఉన్నాడు. నిశ్చల ప్రత్యూష పవనంలో వాళ్ల రౌతులు, ఇనప కవచాలు యెండలో మెరుస్తూ ఉంటే విడి విభాగాల మధ్య దౌడు తీస్తూ వుండడం స్పష్టంగా కనిపిస్తోంది.

మంగోలు రౌతుల్లో నుంచి ఒక బృందం ముందుకు దూకింది. వాళ్లు కిప్‌చాక్‌లని యెదుర్కొన్నారు. వంగిన కరవాలాలు పైకి లేచి కింద పడ్డాయి. ఒక సైనికుడు దెబ్బతిన్నాడు. జీను వేలాడుతూ వుంటే అతని గుర్రం, వెనక కాళ్లతో తన్నుకుంటూ పిచ్చిగా మైదానంమీద నుంచి దౌడు తీసుకుపోయింది.

దాడి మొదలైంది. కిప్‌చాక్‌ల విభాగాలు పసుప్పచ్చ మైదానంమీద మూగాయి.

షా బాతుని పక్కన పెట్టి అరిచాడు:

"వీరులారా! దాడికి! అల్లా మీకు తోడు ఉంటాడు".

షా ఆజ్ఞకి కిప్‌చాక్ విభాగాలు చేతిని చాచినట్టుగా పరుచుకున్నాయి మంగోలుల్ని పట్టేందుకు. కాని మంగోలులు చుట్టూ ఆవరించుకునే చేతిలో నుంచి పారిపోయే ప్రయత్నం చెయ్యలేదు.

మొదటి మంగోలు విభాగం శిబిరంనుంచి బయటికి వచ్చింది. వెయ్యి మంది రౌతులు వంద వంద శ్రేణిగా దగ్గర ఉంటూ చిన్న బొచ్చు గుర్రాలమీద ముందుకు వచ్చారు. వాటికి తోలు ఇనప కవచాలు ఉన్నాయి. వూగుతూ, చెదిరి అటూ ఇటూ మైదానం మీద వ్యాపించిన కిప్‌చాక్ శ్రేణుల్ని వాళ్లు ఛేదించడం తప్పదు.

"హో...య్" అంటూ మంగోలుల ఆటవిక గర్జాఘోష రేగింది.

మరో వెయ్యి మంది శిబిరంలోనుచి బయటికి వచ్చారు. మైదానంమీద దూసుకుపోయారు. వాళ్ల ఉక్కు శిరస్త్రాణాలు, ఇనప కవచాలు, వంపు తిరిగిన కత్తులు ఎండలో ధగద్ధగాయమానంగా మెరిశాయి.

మంగోలులు ప్రధాన విభాగం నుంచి దళం తర్వాత దళంగా విడిపోయి వస్తూ, భీకర గర్జాఘోషతో నిర్నిరోధంగా ముంఉకు దూసుకురావడం కొండ శిఖరం నుంచి షా చూస్తూనే ఉన్నాడు.

కిప్‌చాక్‌లు అయోమయంలో పడిపోయారు. మును ముందటి విభాగం కొల్లగొట్టిన సంపదని అంకించుకోవడానికి మంగోలు శిబిరంమీదకి ఉరికింది. కాని ఇంకా మరో వెయ్యి మంది శిబిరంలోనుంచి బయటికి వచ్చి కిప్‌చాక్‌లని అడ్డగించారు. రెండు విభాగాలూ యెదుర్కొన్నాయి.

ధూళి మేఘం లేచి వాటిని కమ్మేసింది. ఆ ధూళి మేఘంలో నుంచి ఒక కిప్‌చాక్ రౌతు తర్వాత ఒకడు పిచ్చిగా దూసుకుంటూ బయటికి వచ్చి, గుర్రం మెడమీదకంటా వాలిపోయి, చెప్పలేనంత వేగంతో మైదానంమీద దౌడు తీశారు.

"ఇలాంటిది నేనెన్నడూ చూళ్లేదు" అన్నాడు షా, నుంచుంటూ. వేలి చుట్టూతా గడ్డం చివళ్లని వణుకుతూ చుట్టుకున్నాడు. అతని కళ్లు దూరంలోకంటా తేరి చూస్తున్నాయి.

ఒక దాని తర్వాత ఒకటిగా నాలుగు మంగోలు విభాగాలు క్రమ పద్ధతిలో, షా సైన్యాల మధ్యకి, కొండ వేపు వచ్చాయి. ఆ కొండమీదనే మహమ్మద్, అతని పరివారం ఉన్నారు.

మంగోలు గర్జ ఇంకా ఇంకా దగ్గర పడింది.

ఈ హిమ పాతాన్ని యెవడాపగలడు? మహమ్మద్ చుట్టూ చూశాడు. తైమూర్ మాలిక్ అక్కడ లేడు. గుర్రంమీదకి వురికి అతను రణ రంగంమీదకి వెళ్లిపోయాడు.

షా సైన్యంలో మణుల్లాంటి వాళ్లు, మేలు బంతులూ సిద్ధహస్తులూ అయిన కిప్‌చాక్ ఆశ్వికులు ముందుకు వచ్చే మంగోలులమీదకి దూకారు. కాని మంగోలులు కత్తులు దూసి దారి చేసుకుంటూ కొంచెం సేపు మాత్రమే మందగించేరు. తర్వాత మహమ్మద్ నుంచున్న కొండ దగ్గరికి ముందుకు తోసుకువచ్చేరు.

"నా గుర్రం!" అని షా అరిచాడు. "నా గుర్రం!" యెవడేనా తన మాటని విన్నాడా లేదా అని ఆక్కుండా అతను వేగంగా కొండ పాదం దగ్గరికి పరిగెత్తివెళ్లాడు. అక్కడ పరిచారకులు యెర్ర తోక ఉన్న కపిల అశ్వాన్ని కళ్లెం పట్టుకునుంచున్నారు.

షా గుర్రంమీదకి యెగిరి మైదానంమీద వెనకా ముందూ చూడకుండా దూసుకుపోయాడు. అతన్ని పక్కనే అనుసరించి వుండేవాళ్లు కవచాలు ముస్తీబు, గంటలు గణగణ మోగుతూ వుండగా గుర్రాల్ని పొడిచి వెనక వచ్చారు.

కొండమీద మడతలు పడ్డ తివాసీ ఉంది. దానిమీద బంగారు ఛషకాలూ, మధురమైన తినుబండారాలు నిండుగా వున్న పళ్లేలు ఉన్నాయి. తళతళ మెరిసే రంగురంగుల పట్టు దాస్తర్‌ఖాన్ చివళ్లు గాలికి రెపరెపలాడుతున్నాయి. షా పరివారంలో ఒక్కతనే పారిపోలేకపోయాడు. అతను తెల్ల గడ్డం షేక్ అల్ ఇస్లాం. మహమ్మద్ వెనక్కాల మొత్తం పరివారం అంతా హడావుడిగా పోతూ వుంటే అతను గుర్రం మీద నుంచి పడిపోయాడు.

ఇమామ్ మళ్లీ వెనక్కి కొండమీదకి వెళ్లాడు. తివాసీని సరిగా సర్దాడు. మోకాళ్లమీద వాలిపోయేడు. మంచు లాంటి తెల్లని పాగా రవసెల్లా మడతల్లో వెతికి అండాకారంగా వున్న బంగారు ఫలకం తీశాడు.

మంగోలులు కొండ దగ్గరికి రాగానే ముగ్గురు దళ నాయకులూ, ముసలి దుబాసీ శిఖరం పైకి యెక్కి వెళ్లారు. ఒకతను పడుచువాడు. అతని ముఖం కఠినంగా వుంది. నల్లని కళ్లు, పల్చని నల్లని గడ్డం ఉన్నాయి. గడ్డం పందితోకలా ఉంది. చివర చిన్న జడలా అల్లి, యెడమ చెవిమీద విసిరి ఉంది. రెండోవాడు ముసలాడు. బొద్దుగా, భారీగా ఉన్నాడు. కుడి చెయ్యి వంగి ఉంది. అతని ముఖం కమిలిన మచ్చతో చీలి ఉంది. దానివల్ల ఒక కన్ను వంకర తిరిగింది, ఇంకో కన్ను యెప్పుడూ వెడల్పుగా ఉండడం జరిగింది. పొడుచుకు వచ్చిన కనుగుడ్డు అతని చుట్టూ జరిగే వాటినన్నిట్నీ అందుకునేది. మూడో అతను పొడుగ్గా సన్నగా ఉన్నాడు. నఖశిఖ పర్యంతం ఉక్కు కవచం ఉందతనికి. వీళ్లు జెంఘిజ్ ఖాన్ పెద్ద కొడుకు జూచి, చైనా అంతటా ప్రఖ్యాతులైన ఒంటి కంటి సుబుదై భగతుర్, సన్నని తోఖూచర్ నాయన్ దళవాయిలు. ఇమామ్ ప్రార్థన భంగిమలోనే ఉండిపోయాడు, ముఖం నేల వేపు పెట్టి కింది కంటా వంగుతూ. "ఈయన దేవుడి సేవకుడు" అన్నాడు దుబాసీ. ఇమామ్ లేచి, చేతులు దండకట్టుకుని, తడబడే కాళ్లతో మంగోలుల దగ్గరికి వచ్చాడు.

"నేను గత మూడేళ్లుగా ప్రపంచ పాలకుడు జెంఘిజ్ ఖాన్‌కి విశ్వాసపాత్రమైన నౌకరుగా ఉన్నాను" అన్నాడతను నిదానంగా. వాళ్లకి ఆ బంగారు ఫలకాన్ని చూపించాడు. "ప్రతి నెల నేను చైనా రాజబాటమీద ఉన్న మొదటి మంగోలు విడిది స్థావరం పాలెగానికి బిడారుల ద్వారా నివేదికలు పంపేవాణ్ణి. ఇప్పుడు నేను మంగోలు సైన్యం సేవకిగాను మీతో వస్తాను. ఖోరెస్మ్‌కి తిరిగిపోవాలని లేదు".

దీన్ని దుబాసీ మంగోలులకి అనువదించి చెప్పాడు. జూచి ఖాన్ ఆ బంగారు ఫలకాన్ని గబగబా చూశాడు.

"స్వర్ణశ్యేనం వున్న పైస్తా" అన్నాడు సాలోచనగా. అతని కళ్లు విశాల మైదానంమీదకి మళ్లాయి. అక్కడ రౌతులు అన్ని దిశలకీ చెదిరిపోతున్నారు. అతను బంగారు ఫలకాన్ని షేక్ అల్ ఇస్లాంకి తిరిగి ఇస్తూ అన్నాడు:

"వద్దు! షా విశ్వాసం నీమీదున్నంద కాలం నువ్వు మాకు అవసరం. అనుమానించని నీ యేలిక దగ్గరికి తిరిగివెళ్లు, నీ విధేయపూర్వక నివేదికలు పంపుతూ వుండు".

ఆ మంగోలులు వెంటనే ఆ ఇమామ్‌ని గురించి అంతా మర్చిపోయారు. యుద్ధం కొండకి దగ్గరగా వస్తోంది. జలాలుద్దీన్ నాయకత్వంలో వున్న తుర్క్‌మెన్‌లు మంగోలుల యెడమ పార్శ్వాన్ని ముంచెత్తారు. యెంతో మంది హతం అయిపోయారు. మిగతా వాళ్లని బడవలోకి తరిమేశారు.

ఈ ముగ్గురు మంగోలు దళ నాయకులూ కొండ దిగువకి దౌడు తీసుకుపోయారు.

పోరు సాయంత్రం దాకా సాగింది. తుర్క్‌మెన్‌లు, కార కితాయ్‌లూ యెడమ పార్శ్వం వేపు పడి మంగోలుల్ని గజిబిజి చేసేశారు. వాళ్లు విడివిడి దళాలుగా పోరాడారు. మంగోలులు చెదిరి పారిపోయారు, అప్పుడు వెను దిరిగి తరుముకొచ్చే తుర్క్‌మెన్‌లు యెదిరించారు. మళ్లీ చీలిపోయి, పోరు సాగించారు. చీకటి పడేవేళకి మంగోలులంతా తమ శిబిరానికి తిరిగివెళ్ళిపోయారు.

ఖోరెస్మ్ షా కొండ దగ్గరికి తిరిగివచ్చాడు. ఆ రాత్రి ఆతృతగా గడిచింది. కిప్‌చాక్ సైనికులు చుట్టూతా క్షేత్రంమీద, కట్టేసిన గుర్రాల పక్క, పడుకున్నారు.

దూరంలో మంగోలు విడిది నెగళ్ల యెర్రటి జ్వాలల్లో ఆకాశం వణికింది. రాత్రంతా జ్వాలలు మండుతూనే ఉన్నాయి. "రేపటి పోరుకి మంగోలులు సమాయత్తమవుతున్నారు" అనుకున్నారు కిప్‌చాక్‌లు. మైదానం అంతా రక్షించమనే అరుపులతోటీ, మూలుగులతోటి నిండిపోయింది. సగం కిప్‌చాక్ సైన్యం రణ రంగంలో చచ్చిపోయీ, గాయపడీ ఉంది.

జలాలుద్దీన్ షాతో వాదిస్తున్నాడు.

"మంగోలు సైన్యం మనల్ని యేమీ చెయ్యనప్పుడు తగ్గి వదిలేసుకోవడం మన గౌరవాన్ని పోగొట్టుకోవడమే. వాళ్లు శిబిరంలో తమ స్థానాన్ని కూడదీసుకుంటున్నారు. అంచేత ఆగడం

మంచిది కాదు. గుట్టు చప్పుడు కాకుండా, అకస్మాత్తుగా ఈ రాత్రి వాళ్లని తుద ముట్టించడం మంచిది".

"పోరు రేపు కొనసాగిస్తాను" అన్నాడు షా, బొచ్చు అంగీని ఇంకా దగ్గరగా లాక్కుంటూ.

మైదానంమీద తొలి రేకలు యేటవాలుగా పడేటప్పుడు, కొండలు తమ దీర్ఘ ప్రత్యూష నీడల్ని పరిచేటప్పుడు, ఖోరెస్మ్ షా సైన్యాలు మళ్లీ మూడు విభాగాలుగా చీలిపోయి మంగోలులమీదకి నడిచాయి.

పొగబారిన నెగళ్ల వెనక శిబిరం నిర్మానుష్యంగా ఉంది. ఒక్క మంగోలు సైనికుడు కూడా లేడు. క్రూరంగా హతం అయిన మెర్కిట్‌ల ఖండిత కళేబరాలు, కుంటుతూ తడబడుతూ వుండే కొన్ని ఒంటెలు తప్ప మరేం లేవు.

మంగోలుల్ని అందుకోవడానికి పంపిన తుర్క్‌మెన్ దళం సాయంత్రం వేళకి తిరిగివచ్చింది.

"మంగోలులు తూర్పుకి మహా వేగంగా పారిపోతున్నారు. దూరంలో ధూళి మేఘం తప్ప మాకేం కనిపించలేదు".

"వాళ్లు మంచి సైనికులు. ఇలాంటి సైన్యాన్ని నేనెన్నడూ చూళ్లేదు" అన్నాడు ఖోరెస్మ్ షా. తమ గుర్రాల్ని ఇంటికి మళ్లించవలసిందిగా సైన్యానికి ఆజ్ఞ ఇచ్చాడు.

"వీళ్లు ముందు వచ్చిన వేగులంతే" అన్నాడు జలాలుద్దీన్ తండ్రితోటి. "వాళ్లు పెద్ద సైన్యంతో తిరిగివస్తారు. మనం వాళ్ల వెనకబడి, వాళ్లు యేం చేస్తున్నారో చూసి, మరో పోరుకి తక్షణం తయారవాలి".

"నువ్వు పిల్లాడిలా మాట్లాడుతున్నావు! మంగోలులు మళ్లీ యెన్నడూ మనమీద దాడి చేసే సాహసం చెయ్యరు!..." అన్నాడు షా.

నాలుగవ భాగం

# సరిహద్దుల్లో శత్రువులు మంగోలు సైన్యం సమాయత్తం అవుతోంది

"ఆ మహారాజు పరమ క్రూరత్వానికీ,
నిశిత మేధకీ, విజయాలకీ పేరు
గడించాడు".
(పాత పర్షియన్ పాట)

ఇర్తిష్ నది జన్మ స్థానం దగ్గర, ఆకుపచ్చ మైదానంమీద వున్న ఒంటి మిట్ట పాదం దగ్గర పసుపచ్చ పట్టు డేరా వుంది. దాన్ని జెంఘిజ్ ఖాన్ చైనా చక్రవర్తి దగ్గర్నుంచి లాక్కున్నాడు. ఆ డేరా వెనక తెల్లని బొచ్చు అట్టల మంగోలు పెద్ద యుర్త్‌లు రెండు వున్నాయి. ఒక దాంట్లో జెంఘిజ్ నవ వధువు ఉంది. ఆమె మంగోలులు చంపిన మెర్కిట్ ఖాన్ కూతురు. ఆమె తన చిన్న కొడుకు కుల్కాన్‌తో కలిసి ఉంటోంది. రెండో యుర్త్‌లో యేడుగురు నౌకర్లు, చైనా ఆడబానిసలు ఉన్నారు.

డేరా ముందు రాతి వితర్దులమీద నెగళ్లు మండుతున్నాయి. ఘనమైన ఖాఖాన్‌కి ప్రణామం చెయ్య వచ్చేవాళ్లందరూ ఈ నెగళ్ల మధ్యనుంచి వెళ్లాలి. "అగ్ని దుష్ట ఆలోచనల్ని శుద్ధి చేస్తుంది. విచారం దుఃఖం అనే దయ్యాల్ని తరిమేస్తుంది. ఈ దయ్యాలు దుష్టుణ్ణి అనుసరించే వుంటాయి" అని షామాన్లు తాత్పర్యం చెప్పారు.

వృద్ధ షామాన్ అధిపతి బేకి, నలుగురు యువ షామాన్‌లు కలిసి వితర్దుల చుట్టూ ప్రదక్షిణగా వెళ్లారు. వాళ్లు కోణాకారపు బొచ్చు కుళ్లాయిలు పెట్టుకున్నారు. తెల్లని భారీ అంగీలు వేసుకున్నారు. అరచేతులతో పెద్ద మద్దెళ్లని వాయిస్తూ దడదడ మోతెక్కిస్తూ వున్నారు. కూతలు, మంత్రాలు చదవడం ఒకదాని తర్వాత ఒకటి చేస్తూ మంటల్లోకి జిగురు కొమ్మల్నీ సువాసన పుష్పాల్నీ విసురుతున్నారు.

డేరా పక్కన బంగారు గుంజకి కట్టేసి ఉంది సీటెర్, తెల్ల గుర్రం. దాని కళ్లు ఉగ్రంగా ఉన్నాయి, నల్లని చర్మం మీద దాని జుట్టు వెండిలా తెల్లగా ఉంది. అది జీను అనేది యెరగదు.

యెవడూ దాని మీద యెక్కిన వాడూ కాదు. జెంఘిజ్ ఖాన్ దండయాత్రలు జరిపినప్పుడు మంగోలు సైన్య రక్షకుడు, అదృశ్య మహత్తర యుద్ధ దేవుడు అయిన సుల్దే, ఈ తెల్ల గుర్రంమీద యెక్కి సైన్యాల వెంట వెళ్లేవాడట, వాళ్లకి విజయం చేకూర్చేవాడట అలా అని షామాన్‌లు అన్నారు.

దేరాకి అవతలి వేపున యెప్పుడూ జీను వేసే ఉన్న నాయ్‌మన్ ఉండేది. అది జెంఘిజ్ ఖాన్‌కి ప్రియమైన అశ్వం.

గుర్రం పక్కన యెత్తైన వెదురు గడ ఉంది. జెంఘిజ్ ఖాన్ జెండా చుట్టేసి దానిమీద వుంది.

అంగరక్షకులు మిట్ట చుట్టూతా పహారా ఉన్నారు. 'తుర్‌గాడ్స్'. వాళ్లు కవచం, ఇనప శిరస్త్రాణాలూ ధరించారు. ప్రాణమున్న పురుగేదీ ఖాఖాన్ దేరా దగ్గరికి పోకుండా చూస్తారు వాళ్లు. ప్రత్యేకమైన బంగారు ఫలకాలు – పైస్తాలు – పులి తల ముద్ర చెక్కినటువంటివి, ఉన్న వాళ్లు మాత్రం తుర్‌గాడ్స్ అంగరక్షకుల కాపలా దాటి మిట్ట దగ్గరికి పసుప్పచ్చ పట్టు గుడారం ఉన్న చోటికి వెళ్లచ్చు.

చుట్టుపక్కల మైదానంమీద పెద్ద వృత్తంలో చెదిరి ఉన్నాయి నల్లని తాతార్ యుర్త్‌లు, యెరుపు రంగు ఉన్నితో వేసిన టంగుట్ గుడారాలు. ఇది జెంఘిజ్ ఖాన్ సొంత "క్యుర్యేన్"*, యెంపిక చేసిన వేలాది మంది అంగరక్షకులు, తెల్లని గుర్రాలమీద ఉండే రౌతులు శిబిరం అతి ప్రసిద్ధ ఖాన్‌ల కొడుకుల్ని మాత్రం ఈ అంగరక్షక దళంలోకి అనుమతిస్తారు. ఖాన్ వీళ్లల్లో మహా ధైర్యవంతులూ, మహా విధేయులూ అయిన వాళ్లని మాత్రం విడి దళాలకి దళవాయిలుగా యెంపిక చేస్తాడు.

ఇంకా దూరంలో ఇతర కుర్యేన్‌లున్నాయి. అరణ్యాలతో నిండిన పర్వతాల దాకా విస్తరించిన మైదానంమీద వ్యాపించి వున్నాయని. కుర్యేన్‌ల మధ్య ఒంటెల మందలూ, నానావర్ణ అశ్వాలూ పచ్చిక బీటిమీద మేస్తున్నాయి. గుర్రం కాపలా వాళ్లు పిచ్చిగా అరుస్తూ, ఉచ్చుతాళ్లని సుళ్లు తిప్పుతూ, వేర్వేరు మందల్ని విడిగా ఉంచుతూ వాటిని పోతులనుంచీ, గొడిగెలనుంచీ వేర్పాటు చేసి ఉంచుతూ దౌడు తీస్తున్నారు.

ముసల్మాన్ భూములపై పోయే ముందు ఆ మంగోలు పాలకుడు బుఖారా దగ్గర వున్న ఖోరెస్మ్ షా మహమ్మద్‌కి విలువైన కానుకలతో దూతల్ని పంపాడు. ఈ దూతల అగ్రభాగంలో మహమ్మద్ యాల్‌వాచ్‌ని ఉంచాడు. అతను గుర్‌గంజ్‌లో సంపన్నుడైన వర్తకుడు. పూర్వం మధ్యాసియ నుంచి చైనాకి బిడారుల్ని పంపేవాడు. జెంఘిజ్ ఖాన్‌కి అనుంగు బంటు. పశ్చిమాన వ్యవహారాలు యెలా ఉన్నదీ, సైన్యాల పరిమాణం యెంత వున్నదీ, ఖోరెస్మ్ షా యుద్ధానికి తయారుగా వున్నదీ లేనిదీ కనిపెట్టే పని అతనిమీద వుంది. అదే సమయంలో జెంఘిజ్ ఖాన్ చాలా మంది రహస్య గూఢచారుల్ని ఖోరెస్మ్‌కి పంపాడు.

---

* కుర్యేన్ – యుర్త్‌ల వలయానికి మంగోలు పదం. నాయకుని యుర్త్ మధ్యలో ఉంది.

# ప్రాచ్య పాలకుడి దౌత్య కార్యాలయం

“వాళ్ల బట్టల మడతలు సుదూర
భూముల పుష్పాల సుగంధాన్ని ఇంకా
వెదజల్లుతున్నాయి”.
(పాత పర్షియన్ గాధ)

జయించిన సమర్‌కండ్ ఆఖరి ఖోరెస్మ్ షాకి తాత్కాలిక రాజధాని అయింది. స్వేచ్ఛాకాంక్షగల సమర్‌కండ్ ప్రజలమీద సాధించిన విజయానికి గుర్తుగా మహమ్మద్ అక్కడ యెత్తైన మసీదు కట్టించాడు, గొప్ప అంతఃపుర నిర్మాణం మొదలెట్టాడు. తను మహా విజేతననీ, రెండు శృంగాల అలెగ్జాండర్‌లాగా తన విధేయమైన కిప్‌చాక్ సైన్యాల్ని ప్రపంచపుటంచులకంటా నడిపించాల్సి ఉందనీ, ఖోరెస్మ్ షాల సామ్రాజ్యాన్ని కడపటి సముద్రం* దాకా – దానికవతల అంధకారమే – విస్తరింప చెయ్యాలనీ పరిగణించుకుంటూనే ఉన్నాడు. తన ముఖ్య, ప్రమాదకర శత్రువుగా బాగ్దాద్ ఖలీఫ్ నాసిర్‌ని పరిగణించాడు. మహమ్మద్‌కి సకల ముసల్మాను అధినేత అనే బిరుదుని అంగీకరించడానికి ఇష్టపడడం లేదతను. మొదటగా నాసిర్‌ని అణగదొక్కడం, బాగ్దాద్ పవిత్ర గడ్డమీద దాని ముఖ్య మసీదు ముందు ఖోరెస్మ్ షా బల్లేన్ని దించడం అవసరం. తర్వాత తన గుర్రాన్ని సుదూర విఖ్యాత సంపదల చైనాని జయించడానికి తూర్పుకి స్వారీ చెయ్యడం అవసరం.

మహమ్మద్ బలోపేతమైన సైన్యాన్ని పోగుచేశాడు. తన ఆకుపచ్చ జెండాని యెగరేసి, అతను ఇరాన్ గుండా ఆరబ్ ఖలీఫ్‌ల రాజధాని బాగ్దాద్‌కేసి సేనల్ని నడిపించాడు.

కాని షా ఎలగోలు సైన్యం వెచ్చటి దుస్తుల్లేక, మంచు తుఫాన్‌లో చిక్కుకుని ఇరాన్ పర్వతాల్లో నాశనం అయిపోయింది. చలికి వెల్లడి అయి స్రుక్కిపోయిన ఆ సైన్యం కుర్ద్

---

* భూమి ద్వీపం అనీ, చుట్టుతా అంతులేని మహాసముద్రం వుండేదనీ అప్పట్లో అనుకునేవారు.

దొంగల మూకచేత హతం అయిపోయింది. ఈ దురదృష్టం మహమ్మద్‌ని ఆపింది. బుఖారా తిరిగి వచ్చాడు.

అక్కడ 1219 కుందేలు సంవత్సరం* ఆకురాలు కాలంలో ఖాఖాన్ జెంఘిజ్ ఖాన్ పంపిన గొప్ప దౌత్యం వచ్చింది. మరో సారి ఖోరెస్మ్ షా తాతార్‌లతో వ్యవహరించాల్సి వచ్చింది.

జెంఘిజ్ ఖాన్ దూతల పచ్చిక బీటి పంచకల్యాణి గుర్రాలు షా ప్రాసాదపు యెత్తు గుమ్మాల దగ్గరికి వచ్చాయి - ముగ్గురు ముసల్మాన్ వర్తకులు ఆ దూతలు. బుఖారా, గుర్‌గంజ్, ఒత్రార్ పట్టణాల ఈ వర్తకులు చాలా కాలంగా జెంఘిజ్ ఖాన్ కొలువులో వున్నారు. అలాంటి సంపన్నులైన వర్తకులు మామూలుగా వ్యాపార కూటాలు యేర్పాటు చేసుకుని, వ్యాపారంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ప్రయత్నించే వాళ్ల నుంచి సొమ్ము మదుపు పుచ్చుకునేవారు. వ్యాపార లావాదేవీల్లో పెద్ద మొత్తాలుగా నగదు చెల్లింపులకి సంబంధించిన వాళ్ల ఫర్మానాలు మారుమాట లేకుండా సుదూర ప్రాచ్యంలోనూ, అటు చివర పశ్చిమ దేశాల్లోనూ మన్నన పొందేవి. తమ పాలకుల ఖజానాల్లోకి సుంకాలు వెళ్లేదానికంటే వేగంగా వాళ్లకి రాబడులు ఉండేవి.

ఖోరెస్మ్ షా మహమ్మద్‌కి తెచ్చిన కానుకలు వంద ఒంటెలమీద, రెండు నిడుపాటి జూలు యాక్ జంతువులు లాగే శోభాయమానమైన బండిమీద వచ్చాయి. దూతలు విడిది చేసిన ప్రాసాదం నగరం బయట వుంది. అక్కడి నుంచి షా ఆర్క్ గుమ్మం దాకా జనం పిటపిటలాడిపోతూ గుంపులు గుంపులుగా మూగారు. ఈ వర్తకుల నౌకర్లు అట్టహాసంగా దుస్తులు వేసుకున్నారు. అందరూ ఒక్కలాగే చైనా పట్టు ఉడుపులు ధరించారు. వాళ్లు ఒంటెల్ని విప్పి, ప్రాసాదపు దర్బార్ మందిరంలోకి అరుదైన, వింతైన కానుకల్ని తీసుకెళ్లారు.

ఆ కానుకల్లో విలువైన నానావర్ణ శోభిత లోహాల కడ్డీలు ఉన్నాయి. ఖడ్గ మృగాల శృంగాలు ఉన్నాయి. కస్తూరి వలాసాలున్నాయి. ఎరుపు, పసుపు వన్నె పగడాలున్నాయి. సూర్యకాంతరాళ్లూ ముదురాకుపచ్చ రాళ్లు మలిచిన ఛషకాలున్నాయి. తెల్ల ఒంటెలు జూలుతోటి నేసి, ఖానులు మాత్రమే తొడుక్కోగల విలువై "తర్ఘు" వస్త్రాలున్నాయి. బంగారు జరీ బుటా వేసి, రవసెల్లాలా శోభించే పట్టు వస్త్రాలున్నాయి. కడగా నౌకర్లు చైనా పర్వతాల నుంచి తెచ్చిన పెద్ద బంగారు ముద్దని తెచ్చారు. అది ఒంటె మూపురం అంత మందంగా ఉంది. ఈ బంగారాన్ని నిడుపాటి యాక్ జంతువులు లాగిన బండిమీద తెచ్చారు.

---

* ఆనాటి దూరప్రాచ్చంలో పంచాంగం పుష్కర ఆవృత్తంలో ఉండేది. ఒకోయేటికి ఒకో జంతువు పేరు వుండేది. పన్నెండేళ్లూ పూర్తి అవగానే మళ్లీ ఇదే క్రమం మొదలయ్యేది.

కారఖానిడ్స్ వంశంలో ఆఖరువాడైన సుల్తాన్ ఓస్మన్ పురాతనమైన యెత్తు సింహాసనం మీద ఆసీనుడై ఖోరెస్మ్ షా దూతలని ఆహ్వానించాడు. అతను మగతగా అలసంగా, అర్ధనిమీలితంగా కూర్చున్నాడు. సింహాసనం పక్కన ప్రధాన వజీరు, షా సామ్రాజ్యంలో ఉండే ఘనులు ఉపవిష్టులై ఉన్నారు.

ముగ్గురు రాయబారులూ మోకాళ్లమీద వాలి, నేలకేసి వంగి వందనం చేశారు. దూతలందర్లోకీ పెద్దవాడైన మహమ్మద్ యాల్‌వాచ్ మొదలుపెట్టాడు. ఆయన యెత్తుగా, పుష్టిగా వున్నాడు.

"మంగోలు ప్రజల పాలకుడు, బలాఢ్యుడు జెంఘిజ్ ఖాన్ మమ్మల్ని మహా దూతలుగా స్నేహపాశాన్ని అల్లేటందుకు, మన ఇరుగుపొరుగు సామ్రాజ్యాల మధ్య శాంతి, సుహృద్భావాలని అల్లేటందుకు పంపించాడు. ఖోరెస్మ్ షాకి మహా ఖాఖాన్ కానుకల్ని, ప్రణామాల్ని పంపుతున్నారు. మమ్మల్ని మీకు తన మాటలుగా ఇలా తెలియజెయ్యమని ఆజ్ఞ చేశారు" – అంటూ మహమ్మద్ యాల్‌వాచ్ రెండవ దూతకి ఒక చుట్టచుట్టిన కాగితం కమ్మని అందించాడు. దానికి తెల్లదారం చుట్టి ఉంది. పైన నీలం మైనం మొహరు వేసి ఉంది.

రెండవ రాయబారి ఆలీ ఖోజ అల్ బుఖారీ చదివాడు:

"మీ సమున్నత హోదా గురించి గాని, మీ ఘన సామ్రాజ్య విస్తృతి గురించి గాని తెలియని వాణ్ణి గాను. మీ సామ్రాజ్య భూభాగం ప్రపంచంలో అధిక ప్రాంతాలకి విస్తరించి ఉందని తెలుసు. అంచేత, మన మధ్య స్నేహ బంధాలు నేను దృఢతరం కావాలి అని భావించడం ఉచితం, ఓ! ఖోరెస్మ్ షా! యేమంటే నువ్వు నాకు ప్రియాతి ప్రియమైన నా పుత్రుల్లాగా* ప్రియమైన వాడివి..."

"పుత్రుడు? – నువ్వు పుత్రుడు అన్నావు కదూ?" అని అరిచాడు షా, హఠాత్తుగా మగత విడిచి. పటకాలో ఉన్న బాకు దంతం పిడిమీద చేతిని ఉంచాడు, ముందుకు వంగి రాయబారి ముఖంకేసి తదేకంగా చూశాడు. రాయబారి నిబ్బరంగా కొనసాగించాడు:

"నేను చైనా దేశపు ముఖ్య ఉత్తర ప్రాంత రాజధానిని పట్టుకుని ఆ సామ్రాజ్యాన్ని లొంగదీశాననీ, నీ సామ్రాజ్య సరిహద్దుల్లో ఉండే భూముల్ని పట్టుకున్నాననీ తెలుసుకోవాలి నువ్వు...

"నాకు చెందిన భూభాగాలు నా అజేయ సైన్యాలకి శిబిరాలనీ, పుష్కలంగా వెండి గనులున్నవనీ నీకు అందరికంటే బాగా తెలుసు. నా విస్తార భూభాగాలు అన్నిరకాల వస్తువుల్నీ పుష్కలంగా ఉత్పత్తి చేస్తాయి. అంచేత నా సరిహద్దుల కావల సంపద నాకవసరం లేదు. ఓ

---

* పుత్రుడు – ఆ నాటి తూర్పు దేశాల ఆచారం ప్రకారం ఒక దేశపురాజు ఇతర దేశాల రాజుల్ని వాళ్లు తనకి సామంతులు, పాలెగాళ్లూ అయినప్పుడు మాత్రమే పుత్రుడని సంబోధించేవాడు.

ఘనమైన షా! మనం ఒకళ్ల ప్రాంతంలోకి ఇంకొకళ్లం వర్తకులకి స్వేచ్ఛా మార్గాన్ని తెరవడం మంచిదని నువ్వు గుర్తిస్తే అది మన ఇద్దరి ప్రయోజనాలకీ బాగుంటుంది. ఇద్దరం దాన్నుంచి మహా లబ్ధి పొందుతాం".

తూర్పు దేశాల సంచార పాలకుడి ఉత్తరానికి పశ్చిమ ముసల్మాన్ పాలకుడు యేం జవాబు చెప్తాడోనని ఆ ముగ్గురు రాయబారులూ మౌనంగా నిరీక్షించారు. ఖోరెస్మ్ షా యేం మాట్లాడకుండా చేత్తో అలసంగా ప్రధాన వజీరుకి సైగచేశాడు.

ప్రధాన వజీర్ విధేయంగా జెంఘిజ్ ఖాన్ విజ్ఞాపనని గ్రహించాడు. అతను మహమ్మద్‌కేసి కళ్లెత్తి చూశాడు. మహమ్మద్ మళ్లీ అలసంగా చేతిని విదిలించాడు, యేదో జోరీగని తరిమేస్తున్నట్టు. తర్వాత వజీర్ వంగి వందనం చేస్తూ రాయబారుల్లో పెద్దవాడైన మహమ్మద్ యాల్‌వాచ్‌తోటి లోగొంతుకలో అన్నాడు:

"దర్బారు ముగిసింది".

ముగ్గురు రాయబారులూ లేచి, వీపు షాకేసి తిప్పకుండా గౌరవపురస్సరంగా వెనక్కి అడుగులు వేసుకుంటూ ద్వారం దాకా వెళ్లారు. తర్వాత అతిథుల్ని ఆదరించే మందిరంలోకి వెళ్లారు. అక్కడ వజీర్ వచ్చి వాళ్లని కలిశాడు. అతను మహమ్మద్ యాల్‌వాచ్ చెవిలో చెప్పాడు.

"అర్ధరాత్రి నా కోసం యెదరు చూడండి".

# రాయబారి, షా అర్ధరాత్రి కలుసుకోవడం

"నువ్వే బలవంతుడవని అనకు–
ఇంకా బలమైన వాడున్నాడు. నువ్వే
జిత్తులమారివని అనకు – నిన్ను మించిన
జిత్తులమారులున్నారు".
(కిర్ఘిత్ సామెత)

ఆ రాత్రి మంగోలు దూతలు విడిసిన ఇంటికి మహమ్మద్ యాల్‌వాచ్ కోసం ఒక నిశ్శబ్ద పరిచారకుడు వచ్చాడు. పాత ప్లేన్ వృక్షం కింద జీను వేసిన గుర్రాలు నిరీక్షస్తూ ఉన్నాయి. వెన్నెలలో మహమ్మద్ యాల్‌వాచ్ ప్రధాన వజీర్‌ని ఆ రౌతుల్లో గుర్తుపట్టాడు.

"నువ్వు నాతో వస్తున్నావ్, గుర్రం యెక్కు" అన్నాడు వజీరు.

వాళ్లు నిద్రిస్తున్న, నిశ్శబ్ద బుఖారా నిశీధి వీధుల గుండా స్వారీ యేసుకుంటూ, ఇనప తలుపులు వున్న అడ్డగోడ చేరేదాకా వెళ్లారు. రహస్యంగా తట్టడంతో తలుపు తెరుచుకుంది. వజీరు వెంట రాగా మహమ్మద్ యాల్‌వాచ్ కొలనులున్న తోట గుండా వెళ్లాడు. అక్కడ హంసలు కలలు కంటూ ఉన్నాయి. నీళ్ల పక్కన ఉన్న పొదరిళ్లలో ఆడవాళ్ల మర్మద ధ్వనులు వినవస్తున్నాయి.

అతను ఒక భరంతు దాకా వెళ్లాడు. అక్కడ ఒక అద్భుతమైన బడ్డీ వుంది. భారమైన తెర ఒక చిన్న మందిరాన్ని మరుగు చేస్తోంది. ఆ మందిరం నానావిధ పరిగ పూల వస్త్రాల తెరలతోటీ అలంకృతం అయివుంది. ఎత్తైన వెండి సెమ్మాలలో దళసరి మైనం వత్తులు రెపరెప వెలుగుతున్నాయి. పట్టు బాలీసులమీద షా మహమ్మద్ కూచున్నాడు.

"దగ్గరసా రా!" అన్నాడా షా, అతిథి ప్రణామాలు విని. "రహస్యంగా నీతో చర్చించ వలసిన ముఖ్య విషయాలున్నాయి. నువ్వు మా పౌరుల్లో ఒకడివి. నువ్వు అచ్చమైన ముస్లిం మతస్థుడివి, అశౌచ పాషండుడివి కాదు. నువ్వు మనసా, వాచా, కర్మణా అసలైన ఆస్తికుల పక్షాన వున్నావని ఇస్లాం శత్రువులకి అమ్ముడు పోలేదనీ రుజువు చేసుకోవాలి".

"ఇదంతా నిజమే పాదుషా! నేను గుర్‌గంజ్‌లో పుట్టాను" అని జవాబిచ్చాడు మహ్మద్ యాల్‌వాచ్. "ఇస్లాం భూముల పాలకుణ్ణి యావజ్జీవితం కొలవడానికి నాకు సంతోషమే" అన్నాడు.

"నువ్వు నా ప్రశ్నలన్నింటికీ సత్యపూరితంగా జవాబు చెప్తే నిన్ను ఉదారంగా సత్కరిస్తాను. నా వాగ్దానాలు నెరవేరతాయని ఇదుగో రుజువు ఇస్తున్నాను" – అంటూ షా తన బంగారు కడియంలోనుంచి పెద్ద ముత్యాన్ని తీసి దూతకి అందించాడు. "కాని గుర్తుంచుకో, నువ్వు గనక ద్రోహిగా, అబద్ధాలకోరుగా రుజువైతే ఇక తెల్లవారడం చూడవు".

"నేనేం చెయ్యాలి? సిద్ధంగా ఉన్నాను, పాదుషా".

"జెంఘిజ్ ఖాన్ గురించి నాకు కళ్లూ చెవులూ నువ్వే కావాలి. ఈ జెంఘిజ్ ఖాన్ యేమేం చేస్తూ ఉన్నాగానీ, యేం అనుకుంటూ వున్నాగానీ, అతని సైన్యాలు యెక్కడికి వెళ్తున్నాగానీ నాకు నమ్మకమైన మనిషిద్వారా నివేదికలు పంపాలి. అలా చేస్తానని ప్రమాణం చెయ్యి".

"నేను నీకు కొలువు చేస్తున్నాను, చేస్తాను అల్లా సాక్షి, పాదుషా" అన్నాడు మహమ్మద్ యాల్‌వాచ్. తన రెండు చేతులతోనూ తన గడ్డం తాకాడు.

"నువ్విక్కడ ఇంకో రోజు వుండి, మా రాయసగాడు మీర్జా యూసఫ్‌కి జెంఘిజ్ ఖాన్ గురించి నీకు తెలిసిందంతా చెప్పు. యెక్కడి వాడు, యే యుద్ధాలు చేశాడు, తాతార్‌లందరికీ పాలకుడెట్లా అయ్యాడు అన్నీ".

"అలాగే చేస్తాను, పాదుషా".

"తను మహా చైనాకి యజమానినని, దాని రాజధానిని కూడా పట్టుకున్నాననీ జెంఘిజ్ ఖాన్ భావన. ఇది నిజమా లేక ఒట్టి గప్పాలేనా?"

"ఇది నిజమే, ప్రమాణం చేస్తున్నాను!" అన్నాడు మహమ్మద్.

"సరే అలాగే ననుకుందాం" అన్నాడు షా. "కాని నా భూభాగం యెంత విశాలమైందో, నా సైన్యాలు యెంత అసంఖ్యాకమైనవో నీకు తెలుసు. అలాంటప్పుడు ఈ గప్పాలరాయుడు పాషండ తెగలవాడు నన్ను, ముసల్మానులందరి మహా పాలకుడ్ని తన పుత్రుడని యెంత సాహసంగా అన్నాడు?" షా రాయబారిని తన బలమైన చేతులతో భుజాలు అంది పుచ్చుకుని గట్టిగా పట్టుకుని, తీక్షణమైన చూపులతో కొరకొర చూస్తూ అడిగాడు. "చెప్పు, అతని సైన్యం యెంత వుంది?"

ఖోరెస్మ్ షా మాటల్లో దాగి వున్న మంట మహమ్మద్ యాల్‌వాచ్‌కి అర్థం అయింది. అతని ఆగ్రహం, తక్షణ దండన అంటే భయపడి, అతను గుండెలమీద చేతులు కట్టుకుని, గౌరవపూర్వకమైన వినయంతో అన్నాడు:

"నీ అపారమైన, అజేయమైన సైన్యాలతో పోలిస్తే జెంఘిజ్ ఖాన్ సైన్యాలు చీకటి రాత్రిలో పొగ దమ్ములాంటివి".

“అదీ!” అంటూ అరిచి షా దూతని తోశాడు. “నా సైన్యాలు అపారమైనవి, అజేయమైనవి. ఇది ప్రపంచానికి తెలుసు, నువ్వీ విషయాన్ని బాగా గుర్తుచేశావ్! ఒక రోజులో ఆ తాతార్ చక్రవర్తికి నా సమాధానం నీకందుతుంది. నీకూ, వ్యాపారంలో నీ మంగోలు సహచరులకీ సరుకుల్ని కొనడంలోనూ అమ్మడంలోనూ, అలాగే మొత్తం అన్ని ముస్లిం భూభాగాల్లోనూ ప్రయాణ స్వేచ్ఛకి సంబంధించీ అన్ని హక్కుల్నీ, హోదాలనీ ఇస్తున్నాను. నువ్విప్పుడు మా వకీలుతో వెళ్లు. అతను నిన్ను మా రాయసగాడు వృద్ధ మీర్జా యూసఫ్ నీ కోసం నిరీక్షిస్తూ ఉన్న వృత్త మందిరం దగ్గరికి తీసుకెడతాడు”.

ఖోరెస్మ్ షా అనుగ్రహపూర్వకంగా తల ఆడించాడు. కొన్ని సార్లు చేతులతో చప్పట్లు చరిచాడు.

# జెంఘిజ్ ఖాన్ గురించి రాయబారి చెప్పిన విషయం

"ఒక మనిషి గురించి పరోక్షంలో
చెడు చెప్పకు, నువ్వు చెప్పింది భూమే
అతనికి తెలియచెయ్యవచ్చు".
(ప్రాచ్య దేశ సామెత)

మంగోలు రాయబారిని తన వెంట రమ్మని వకీలు పిలిచాడు. వంకరగా మెలికలు తిరిగిన దారిలో నడిపించుకుంటూ యెత్తు సరంబీ ఉన్న వర్తుల మందిరం దగ్గరికి తీసుకెళ్లాడు. గోడవార ఇనప బద్దీలు చుట్టిన నల్లని భోషాణాలు వున్నాయి. ఇరుకు గూటి అల్మారాల్లో దుమ్ము కొట్టుకుపోయిన కాగితం చుట్టలు వున్నాయి.

వంగిపోయి, శుష్కించిన ముసలి మనిషొకడు తివాసీమీద కూర్చున్నాడు. అతని గడ్డం ముగ్గుబుట్టలా తెల్లగా పండిపోయింది. కళ్లు యెరుపు జీరలతో చెమ్మగా ఉన్నాయి. అతని పక్కనే ఓ యువ రాతగాడున్నాడ. అతని ముఖం మృదువుగా, సున్నితంగా ఆడపిల్ల ముఖంలా ఉంది. అతను కాగితాల బొత్తిమీద వంగి వున్నాడు. వకీలు వెళ్లిపోయాడు.

ఈ రాయబారి ముసలతని దగ్గరికి వెళ్లాడు. అతను ప్రణామం చేస్తూ నుంచున్నాడు. నమస్కార ప్రతి నమస్కారాలు అయ్యాక రాయబారి మోకరిల్లాడు. ఇద్దరూ ప్రార్థనలు చేసి, కుశల ప్రశ్నలు వేసుకున్నారు.

రాయబారి అన్నాడు:

"తాతార్ పాలకుణ్ణి గురించి నాకు తెలిసినదంతా నీకు చెప్పమని ఘనత వహించిన పాదుషా నన్ను ఆజ్ఞాపించాడు. నేను మామూలుగా అతని దుబాసీని, కాని ప్రస్తుతంలో అతని దూతగా వచ్చాను".

రాయబారి కళవిళపడి విచారంగా తన యెడమ చేతి మణికట్టుకి చుట్టుకున్న ముత్యపు చిప్ప తడుముకోవడం మొదలెట్టాడు.

"నేను యెన్నో విషయాలని చెప్పాల్సి ఉంది. బుద్ధి నమ్మదు వాటిని. మనం అలవాటు పడ్డ వాటన్నింటికీ యెంతో వెలిగానే ఉంటాయవి. యీ విషయాలు సత్యమా అని నేనే తరచుగా నమ్మలేకపోతాను. కాని ఇవన్నీ అబద్ధాలని ఒకవేళ నేనన్నా, ఆ అబద్ధాలు యేమిటో నువ్వు తెలుసుకోవాలనుకుంటావు. అంచేత నే విన్నదాన్ని నేను చెప్తాను".

మహమ్మద్ యాల్‌వాచ్ ఆగి, ఆశ్చర్యంతో కళ్లెత్తి చూశాడు. ఆ పడుచు రాతగాడు యెంత గబగబ తను చెప్పిన మాటలు రాసేశాడు!

"ఈ కుర్రాడిదంతా యెందుకు రాసుకుంటున్నాడు? అసలు నేనింకా తాతార్‌ల గురించి యేం చెప్పందే".

"కుర్రాడు కాదు" అంటూ జవాబిచ్చాడు రాయసగాడు మీర్జా యూసఫ్. "అమ్మాయి, బింట్ జాంకిజా. నా దృష్టి తగ్గిపోతోంది. చేతులు వణుకుతాయి. అంచేత మా మనవరాలు నాకు సాయం చేస్తుంది. ఒకటో రకం ఆరబ్ రాతగాని మాదిరీ ఆమె సునాయాసంగా, అందంగా రాస్తుంది".

ముసలతను మళ్లీ రాయబారికేసి తిరిగాడు:

"నువ్వు చెప్పగలిగిన దానంతటికీ, మేం తెలుసుకోవడానికి ముఖ్యమూ, ఉపయోగమూ అయినదానంతటికీ పాదుషా నీకు బహుమతీ ఇస్తాడు. ఫర్వాలేదులే అని అజాగ్రత్తగా ఉండడం వల్ల ఇస్లాం దేశం బలవంతుడైన శత్రువు దాడికి గురయితే అది చాలా ఘోరమైన విషయం. నువ్వు నిజంగా మాకు మల్లేనే ఆస్తికుడివేనా? నువ్వు మమ్మల్ని అదునులో హెచ్చరిస్తావా? నీకు గొప్ప బహుమతీ వస్తుంది..."

నిడుపాటి జుట్టు ఉన్న సన్నని బానిస ఒకడు రకరకాల మిఠాయిలు ఉన్న వెండి తళ్లిక తెచ్చి అతిథి ముందు వుంచాడు. మట్టి కూజాలో నుంచి యెర్రని ద్రాక్షసారాని వెండి ఛషకంలో పోశాడు.

"అంతఃపుర నేలమాళిగల పాత సారాయిని రుచి చూడు" అన్నాడు రాయసగాడు. "మొట్టమొదటగా మనం తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం యేమిటంటే ఈ మంగోలులు తాతార్‌లూ యెలాంటి మనుషులు? వాళ్లు యెక్కడ ఉంటారు? యెంత మంది ఉంటారు? యెలాంటి పోరు వీరులు?"

రాయబారి జవాబిచ్చాడు:

"మంగోలులు, తాతార్లు ఉభయులూ పచ్చిక బీటి వాసులు. వాళ్లు సుదూర ప్రాచ్య దేశాల్లో పక్కపక్కనే ఉంటారు. వాళ్లకి స్థిర నివాసం పడదు. వాళ్ల విశాల భూములు యెడారులు, పుష్కలంగా గడ్డి ఉన్న భూములు, కాని నీరు చాలా తక్కువ. గొర్రెలకీ, గుర్రాలకీ, ఒంటెలకీ, నీరు తక్కువా, గడ్డి యెక్కువా అవసరమైన ఇంకా అలాంటి జంతువులకీ సరిపడే ప్రాంతాలు".

రాయసగాడు రాయబారికి అడ్డం వచ్చాడు.

"వాళ్ల సైన్యం ప్రమాదకారకమేమో తెలుసుకోవడం మనకి ముఖ్యం".

"వాళ్లు కత్తి చెత్తో పట్టుకు పుట్టారు. వందేళ్ల పాటు వాళ్లలో వాళ్లు కొట్టుకున్నారు, ఒక తండాకి వ్యతిరేకంగా ఇంకో తండా పోరాడింది. ఒకప్పుడు ఒక తాతార్ ఖాన్‌కి వెయ్యి గుర్రాలు, పెద్ద గొర్రెలు మంద ఉండేవి. వందమంది అర్ధనగ్న కాపరులుండేవారు. యెప్పుడూ అసంతృప్తిగానే వుండేవారు. యేమంటే ఆకలిగానే వుండేవారు. ప్రతీ గొర్రెల కాపలావాడికీ ఆకలితో నకనకలాడే పెళ్లాం బిడ్డలుండేవాళ్లు. వాళ్లకి భరించే ఓపిక చచ్చిపోయి అడివి జంతువుల్లా అరిచినప్పుడా ఖాన్ వాళ్లతో చెప్తాడు: 'దగ్గరి తండామీద దాడి చేద్దాం పదండి! ఐశ్వర్యంతో, మంచి తిండితో తిరిగివస్తాం'. అంచేత ఖాన్, అతని గొర్రెల కాపరులు యుద్ధానికి వెళ్తారు. కాని యుద్ధం ఆఖర్న ఆ ఖాన్‌ని మెళ్లో గొలుసులు వేసి గొర్రెలతో, గొర్రెల కాపరులతో బాటుగా తల ఒక్కంటికి నాలుగు దిర్హమ్‌ల చొప్పున ఓ పొరుగు తండాకో, బానిస వర్తకులకో అమ్మేస్తారు..."

రాయబారి మెల్లిగా సారాయి పుచుకున్నాడు.

"ఖోరెస్మ్ షా దగ్గర నేలమాళిగల్లో భేషైన సువాసన సారాయి ఉంది" అన్నాడు మహమ్మద్ యాల్‌వాచ్ సాలోచనగా. "తాతార్ ఖాన్‌లలో టెమూజిన్ అని ఉన్నాడు. యుద్ధంలో విజయాలు సాధించి ప్రఖ్యాతుడయ్యాడు. శత్రువుపట్ల భీకరంగా, అనుయాయులపట్ల ఆదరంగా వుంటాడు. దాడి జరపడంలోని తీవ్రత రీత్యా ప్రఖ్యాతుడయ్యాడు. యీ టెమూజిన్ ఖాన్‌కి దురదృష్టం సంభవించింది. కుర్రాడుగా వున్నప్పుడు కాడి మెడమీద మోసి శత్రు తండాల కమ్మరశాలలో కష్టమైన శ్రమ చేసాడనీ అంటారు. కాని అతను పారిపోయాడు, తన గొలుసుతో కాపలా వాణ్ణి చంపి. తర్వాత చాలా సంవత్సరాలు, ఇతర ఖాన్‌లమీద అధికారం సంపాదించడానికి తంటాలు పడుతూ, యుద్ధంలో గడిపాడు. ఖాన్‌లు అతన్ని ఘనమైన ఖాఖాన్‌గా ప్రకటించి, యెక్కువ భాగం ఖానుల కోరికలని తీరుస్తాడన్న ఆశతో "గౌరవపూర్వక శ్వేత చామర" స్థానానికి యెత్తేటప్పటికి అతనికి యాభై యేళ్లు వచ్చాయి. కాని టెమూజిన్ వాళ్లందర్నీ తన ఇష్టం వచ్చినట్టు సామంతుల్ని చేసుకుని కొత్త పేరు పెట్టుకున్నాడు జెంఘిజ్ ఖాన్ – అంటే 'స్వర్గ దూత'. లొంగి వుండని తండాలని అణగదొక్కి బానిసల్ని చేసుకున్నాడు. వాటి నాయకుల్ని పెద్ద దేగిసాలలో సజీవంగా ఉడికించేశాడు".

"యెంత భయంకరం!" అన్నాడు రాయసగాడు. "నువ్వు భయంకరమైన విషయాలు చెప్తున్నావు. తాతార్ పాలకుడి సైన్యం గురించి చెప్పడం లేదు".

"ఇదే నే చెప్తూ వున్న సైన్యం" అన్నాడు రాయబారి నిదానంగా. "జెంఘిజ్ ఖాన్‌ని గొప్ప ఖాఖాన్‌గా ప్రకటించినప్పటి నుంచీ అంతకు ముందు దాకా వాళ్లల్లో వాళ్లు కొట్టుకుంటూ వున్నా తాతార్‌లు ఒక్క సైన్యం అయిపోయి అతనికి విధేయత ప్రకటించారు. తాతార్‌లని వేలు, వందలు, పదులుగా విభజించి ప్రతి వెయ్యింటికీ, వందింటికీ, పదింటికీ ఒక నాయకుణ్ణి

యేర్పాటు చేసి, తనకి గనక నమ్మకం లేకపోతే ఆనువంశిక ఖాన్‌లని తప్పించేసే యేర్పాటు చేసింది ఇతనే. తన భూభాగాలన్నింటికీ కొత్త శాసనాన్ని ప్రకటించడానికి దూతల్ని పంపాడు. యే సంచారి తెగవాడు మరో సంచారి తెగవాడితో పోరు చెయ్యకూడదు, కొల్లగొట్టకూడదు, మోసం చెయ్యకూడదు, ఇలాంటి వాటన్నింటికీ ఒకే శిక్ష ఉంది – మరణ శిక్ష.

"తన లొంగి వుండిన తండాలు ఒకే ప్రజ అవుతారనీ, భూమ్మీద వాళ్లని దైవం యెంపిక చేసిందనీ, ఇక పైనుంచి వాళ్లు 'మంగోలులు' అంటే 'విజేతలు' అనే పేరుతో వుంటారనీ జెంఘిజ్ ఖాన్ చాటాడు. భూమ్మీద మిగిలిన ప్రజలంతా మంగోలులకి బానిసలు. జెంఘిజ్ ఖాన్ భూభాగం బయట ఉన్న తండాలు, పనికి రాని కలుపు మొక్కల్లాగా తుడిచిపెట్టుకుపోతాయి, మంగోలులు మాత్రమే బతకడానికి అనుమతీ ఉంటుంది".

రాయబారి నిటారుగా కూర్చున్నాడు. అతని కళ్లు తెలివితేటలతోటీ, చురుకుదనంతోటీ మెరవడం ఆ అమ్మాయి గమనించింది. కాని అతను మళ్లీ కళ్లు మూసుకున్నాడు అలిసిపోయినట్టుగా. బడలిన గొంతుకతో కొనసాగించాడు:

"ఖాన్‌ల దురాశ తగ్గలేదనీ, సాదా గొర్రెల కాపరుల ఆకలీ, కోరికలూ యెక్కువయ్యాయనీ, పూర్వం వాళ్లల్లో వాళ్లు చంపుకోవడంమీద వ్యర్థం చేసిన తాతార్‌ల శక్తులు బద్ధలవడానికి తయారుగా వున్నాయనీ యీ తాతార్ ఖాఖాన్ గ్రహించాడు. అంచేత, ఈ సాదా గొర్రెల కాపరులు వాళ్ల ఖాన్‌లమీద తిరగబడకుండా వుండేందుకని పోగుపడ్డవాళ్ల శక్తుల్ని మరో దిక్కుకి మళ్లించాడు. అతను కురుల్తాయ్ అనే ముఖ్య ఖాన్ల సభని సమావేశ పరిచాడు. వాళ్లతో ఇలా చెప్పాడు: 'మీరు ఓ గొప్ప దండయాత్ర చెయ్యబోతున్నారు. మీరు యుద్ధంనుంచి బంగారం సంచులతో తిరిగివస్తారు, గుర్రాల మందల్నీ, పశువుల మందల్నీ ముందు తోలుకువస్తారు. పని నేర్చిన బానిసల మందతో వస్తారు. మీ అతిపేద గొర్రెల కాపరిక్కూడా కడుపులు నింపుతా, వాళ్ల శరీరాలకి విలువైన పట్టు బట్టలు కట్టిస్తా, ప్రతి ఒక్కడికీ కొంత మంది ఆడబానిసల్ని ఇస్తా. ఒక సంపన్న దేశాన్ని లొంగ దీసుకుంటాం మనం. మీరు యెంత ఐశ్వర్యవంతులైపోతారంటే మీరు కొల్లగొట్టిన సంపదని మీ లాగుడు యెడ్లు మీ యుర్త్‌లకి మోసుకురాలేవు'. వసంత రుతువులో మైదానాలు పచ్చగా వున్నప్పుడు, జెంఘిజ్ ఖాన్ ఆకలిగొన్న తన ఆశ్వికుల్ని సంపద్వంతమైన ప్రాచీన చైనామీదకి నడిపించాడు. ప్రతిఘటించే చైనా సైన్యాల్ని చెల్లాచెదురు చేసేసి, పెను తుఫాన్ గాలిలా ఆ దేశాన్ని వూడ్చేసి వెయ్యి నగరాలని నుజ్జునుజ్జుగా మట్టి చేసేసాడు. మూడు యేళ్ల యుద్ధం తర్వాతనే సగం చైనాని లొంగదీసుకున్న తర్వాతే బ్రహ్మాండమైన కొల్ల సంపదని యెత్తించుకుని తన పచ్చిక బీటి సైనిక శిబిరాలకి తిరిగివెళ్లాడు..."

"అల్లా మనల్ని ఇలాంటి దాన్నుంచి కాపాడుగాక!" అని ముసలి రాయసగాడు చిన్నగా అన్నాడు.

"నే చెప్పేదంతా నీకు కాకమ్మ కథలా కనిపించవచ్చు మరోసారి, కాని ఇదంతా నిజం".

"నీకు ఇష్టమైతే, ఘనత వహించిన మహమ్మద్ యాల్‌వాచ్, చెప్పు, ఈ మహా విజేత జెంఘిజ్ ఖాన్ యెలా ఉంటాడు?"

"పొడుగ్గా ఉంటాడు. ఇప్పటికే అరవై యేళ్లు దాటి పోయినా ఇంకా దృఢంగా వుంటాడు. నడకలోనూ, తీరులోనూ యెలుగుబంటిలాగా భారంగా వుంటాడు. నక్కలాగా జిత్తులమారి. పాములాగా విషదంష్ట్రలవాడు. చిరుతపులిలాగా ఉగ్రంగా ఉంటాడు. ఒంటెలాగా అలుపెరగడు. తను సత్కరించదలచుకున్న వాళ్ల పట్ల, రక్తపిపాసి పులి తన పిల్లల పట్ల వున్నట్లుగా, ఉదారంగా ఉంటాడు. అతని నుదురు యెత్తుగా ఉంటుంది. సన్నని పొడుగాటి గడ్డం వుంది. పిల్లికిలాగా రెప్పవెయ్యని పసుప్పచ్చని కళ్లు అతనివి. ఉరుముకంటే, మెరుపుకంటే యెక్కువగా ఖాన్లందరూ అతనంటే భయపడతారు. వెయ్యి మంది శత్రువుల్ని యెదిరించి దాడి చెయ్యమని పది మంది సైనికుల్ని ఆజ్ఞాపిస్తే వాళ్లు అలానే చేస్తారు. ఆలోచించడానికి కూడా వాళ్లు ఆగరు, యేమంటే తాము నెగ్గుతామని వాళ్లకి విశ్వాసం – జెంఘిజ్ ఖాన్ యెప్పుడూ జయిస్తూనే ఉంటాడు".

"నా వయసు పెద్దది, నేను యెంతో మంది ప్రసిద్ధులూ పరాక్రమవంతులూ అయిన దళవాయిల్ని చూశాను. కాని నువ్వు వర్ణించి చెప్పేలాంటి వాళ్లని యెన్నడూ కలుసుకోలేదు" అన్నాడు రాయసగాడు.

మహమ్మద్ యాల్‌వాచ్ చేతుల మధ్య చషకాన్ని పట్టుకుని, మధ్య మధ్య మెల్లిగా తలవూపుతూ చెప్పసాగాడు:

"ఘనమైన ఖాఖాన్ తన బలస్లో మూడేళ్లు గడిపాడు. సగం సైన్యాన్ని చైనాలో వుంచాడు. అక్కడి ప్రజలు ఇవాల్టికి కూడా తమ దేశ రక్షణ కోసం పోరాటం చేస్తున్నారు. కాని మిగిలిన సగం సైన్యాల్నీ యెడారుల గుండా, పర్వతాలమీదుగా తనే పశ్చిమ ప్రాంతాలకి నడిపించాడు".

"ఇప్పుడు తాతార్ సైన్యం యెంత ఉంటుంది?"

రాయబారి మగతగా, వణుకుతూ వుండే గొంతుకతో అన్నాడు.

"జెంఘిజ్ ఖాన్ పడమటికి పదకొండు తోమన్‌లని (దళాలని) తీసుకెళ్లాడు. ప్రతి తోమన్‌లోనూ పదివేల మంది ఆశ్వికులు ఉంటారు. ప్రతి ఆశ్వికుడికీ అదనంగా మరో గుర్రం ఉంటుంది, ఒకో అప్పుడు రెండు ఉంటాయి".

"అయితే ఇంకేం తాతార్ ఖాఖాన్‌కి లక్షా పది వేల మంది ఆశ్విక సైనికులున్నారు మొత్తం!" అని అరిచాడు ముసలి రాయసగాడు. "మా పాదుషాకి ఇంతకి నాలుగు రెట్లు యెక్కువ ఉంది. ఆయన మా తండాలన్నిటినీ పవిత్ర యుద్ధానికి పిలిస్తే ఇస్లాంకి యెంతో పెద్ద సైన్యం ఉంటుంది, అజేయంగా".

"ఇదే మాటని నేను ఘనత వహించిన ఖోరెస్మ్ షా అల్లా ఉద్దీన్ మహమ్మద్‌కి చెప్పలేదా? పాదుషా మహమ్మద్ సైన్యంతో పోలిస్తే – ఆయన నూట ఇరవై యేళ్లు పాలించుగాక – తాతార్ సైన్యం చీకటి రాత్రిలో పొగ దుమ్ములాంటిది. తను పడమటికి వెళ్లేటప్పుడు, పచ్చిక బీళ్ల సంచార తండాలన్నీ – ఉయ్‌గర్లు, కిర్ఘిజ్‌లు, అల్తాయిన్లు, కరా కితాయ్‌లు – తాతార్ సైన్యంతో చేరిన మాట నిజమే. అంచేత జెంఘిజ్ ఖాన్ సైన్యం పెరిగి పెద్దదైంది. ఇది కథ కాదు".

రాయబారి మగతగా ఊగాడు. తివాసీమీద మోచేతుల్తో ఆనుకున్నాడు. కాళ్లు బార చాపుకున్నాడు. ఆ అమ్మాయి అతని తల కింద ఆకుపచ్చని తోలు మెత్త పెట్టింది. మీర్జా యూసఫ్ చెవిలో గొణిగింది.

"ఇతనో జిత్తులమారి నక్క. మనకి ఇతను నిజం చెప్పాలను కోవడం లేదు".

"ఈ రాయబారులా! నిజాయితీ ఉన్న రాయబారి నీకెక్కడ దొరుకుతాడు?"

వకీలు లోపలికి వచ్చాడు. వాళ్లంతా చాలా సేపు మౌనంగా కూర్చున్నారు. నిద్రపోయే రాయబారితో యేం చెయ్యాలో తెలీక నిరీక్షించారు.

మహమ్మద్ యాల్‌వాచ్ హఠాత్తుగా మేలుకొని, వెంటనే లేచాడు, యేదో సాకులు గొణుగుతూ.

"నేను తాగేశాను. యేం చెప్పానో తెలీదు. ఈ రాసుకున్నది వ్యర్థం. తగల బెట్టెయ్యండి".

వకీలు మరోసారి రాయబారిని ఇరుకు, చీకటి దారిలో తోట ఒంటిరి గుమ్మం దగ్గరికి తీసికెళ్లాడు. అక్కడ జీను వేసిన గుర్రాలు సిద్ధంగా ఉన్నాయి. తడబడే మహమ్మద్ యాల్‌వాచ్‌ని కష్టంమీద జీను యెక్కించారు రౌతులు. ప్రత్యూషానికి ముందు మసక వెలుతురులో నిద్రపోయే బుఖారా నిశ్శబ్ద వీధుల్లో రౌతులు స్వారీ చేసుకుంటూ పోయి షాగారి గ్రామ ప్రాసాదం దగ్గరికి వచ్చారు.

మర్నాడు షా మహమ్మద్ దగ్గర్నుంచి సమాధానం అందుకుని తాతార్ దౌత్యులు, మహా ఖాఖాన్ శిబిరానికి ప్రాచ్యానికి తిరిగివెళ్లిపోయారు.

# ఘనమైన ఖాఖాన్‌కి నివేదిక

"జెంఘిజ్ ఖాన్ గొప్ప యెత్తరి,
పుష్టిగల శరీర నిర్మాణం వున్నవాడు.
అతని కళ్లు పిల్లి కళ్లల్లా వుండేవి".
(13వ శతాబ్దం నాటి చరిత్రకారుడు జూజాని)

ముగ్గురు ఆశ్వికులు తాతార్ యుర్త్‌ల మధ్య వున్న దారుల్లో హడావుడిగా వెడుతున్నారు. యెగిరే డేగ రెక్కల్లాగా వాళ్లవూలు అంగరఖాలు కొట్టుకుంటున్నాయి. ఇద్దరు పహారా వాళ్లు బల్లేలతో వాళ్లని అడ్డగించారు. ఆశ్వికులు గుర్రాలు దిగి దుమ్ము కొట్టుకుపోయిన అంగరఖాలని తెల్లని ఇసకమీద పారేశారు.

ఈ కొత్తగా వచ్చిన వాళ్లల్లో ఒకడు చారల యెర్ర షేర్వానీ సర్దుకుంటూ అరిచాడు:

"ఖాఖాన్‌కి జయం కలుగుగాక! అత్యవసర సమాచారం!"

చేతులమీద ఎర్ర చారలున్న నీలం బొచ్చు చొక్కాలు తొడుకున్న ఇద్దరు నోకర్లు దగ్గరి యుర్త్‌లోనుంచి పరిగెత్తుకుంటూ వచ్చారు.

"మేం పడమటి దేశంనుంచి వచ్చాం, అక్కడికి మేము ఘనత వహించిన ఖాఖాన్ దూతలుగా వెళ్లాం. మా రాకని తెలియచెయ్యండి. నేను రాయబారి మహమ్మద్ యాల్వాచ్‌ని".

పసుప్పచ్చ గుడారానికి ఉన్న పట్టు తెర తొలగింది. ఆజ్ఞాపించే కంఠం మాట్లాడింది. గుడారం దగ్గర్నుంచి వున్న దారిమీద వున్న యెనిమిది మంది పహారావాళ్లు ఒకళ్ల తర్వాత ఒకళ్లుగా కేక అందుకున్నారు:

"ఘనత వహించిన ఖాఖాన్ ఆజ్ఞ: 'వాళ్లని రమ్మనండి!' "

కొత్తగా వచ్చిన ముగ్గురూ వందనం చేశారు. గుండెలమీద చేతులు కట్టుకుని వాళ్లు గుడారం వేపు వెళ్లారు. ఓ చైనా నౌకరు వాళ్లని లోపలికి తీసికెళ్లాడు. వాళ్లు తలలు పైకి యెత్తకుండానే లోపలికి వెళ్లి తివాసీమీద కూలబడ్డారు.

"చెప్పండి!" అని గాఢమైన గొంతుక వినిపించింది.

మహమ్మద్ యాల్‌వాచ్ పైకి చూశాడు. ఎర్రటి ముతక గడ్డం వున్న కఠినమైన నల్లని ముఖం అతనికి కనిపించింది. విశాలమైన భుజాలమీద నెరసిన జడలు రెండు వేలాడుతున్నాయి. పెద్ద మరకతం పొదిగిన నిగనిగలాడే నల్లని కుళ్లాయి కింద నుంచి రెండు ఆకుపచ్చ పసుపు రంగు కలిసి వున్న కళ్లు గుచ్చిగుచ్చి చూస్తున్నాయి.

"ఖోరెస్మ్ షా అల్లా ఉద్దీన్ మహమ్మద్ నువ్వు పంపిన కానుకలకీ, స్నేహ ప్రతిపాదనలకీ చాలా సంతోషించాడు. నీ వర్తకులందరికీ అన్ని హక్కుల్నీ ఆయన వెంటనే ఇచ్చాడు. కాని ఆయనకి కోపం వచ్చింది..."

"నేనతన్ని 'కొడుకు' అన్నందుకు?"

"మహాప్రభూ! యెప్పటిలాగానే నువ్వు సరిగ్గా వూహించావు. షా కోపంతో యెంత ఉడికి పోయాడంటే నా తల భుజాలమీద గజగజ వణికింది".

ఖాఖాన్ కళ్లు సన్నగా రేఖలా ముడుచుకున్నాయి.

"నువ్వు అనుకుని వుంటావు నిన్ను – " ఖాఖాన్ మందమైన వేలితో గాలిలో అంగవిక్షేపం చేశాడు.

ఆ అంగనిక్షేపం యేమిటైందీ అందరికీ తెలుసు. భయపడతారు. అది జెంఘిజ్ ఖాన్ విధించే మరణ శిక్షకి గుర్తు.

"ఖోరెస్మ్ షా ఆగ్రహాన్ని శాంతిప చేశాను. ఆయన నీకు ప్రణామాలూ, ఉత్తరమూ పంపాడు".

"అతని ఆగ్రహం శాంతిప చేశావా? యెలా?"ఆ కంఠం అనుమానిస్తున్నట్టుగా కనిపించింది. కళ్లు గుచ్చి చూశాయి, వెడల్పవుతూ, కుంచించుకుపోతూ.

షా మహమ్మద్ తనని ఆదరించిన తీరునీ, ప్రధాన వజీరు రాత్రి వేళ వచ్చి యెలా తనని రహస్య మంతనాలకి తీసికెళ్లిందీ పూసగుచ్చినట్టు చెప్పాడు. చెప్పేటప్పుడు తనకి ఖోరెస్మ్ షా ఇచ్చిన ముత్యం తీసి జెంఘిజ్ ఖాన్ అరచేతిలో పెట్టాడు. తనకీ, మహమ్మద్ షాకీ మధ్య జరిగిన దాన్నంతట్నీ చెప్పాడు.

తనమీదనే లగ్నం అయివున్న ఖాఖాన్ చూపు తన అతి రహస్య ఆలోచనలలోకి గుచ్చిగుచ్చి చొచ్చుకు పో ప్రయత్నిస్తున్నట్టు మహమ్మద్ యాల్‌వాచ్‌కి అనిపించింది. అతని చూపు నేలకేసే వుంది.

"నువ్వు తెలుసుకున్నదంతా యిదేనా?"

"నేను మరిచిపోయిందేమన్నా వుందా? నా అసమర్థతని మన్నించు".

యేదో పీలుస్తున్నట్టు చప్పుడైంది. ఖాఖాన్‌కి తృప్తి కలిగింది. అతను మహమ్మద్ యాల్‌వాచ్ భుజంమీద తన పెద్ద చేతిని వేశాడు.

"నువ్వు కపట ముసల్‌మాన్‌ని మహమ్మద్! చీకటి రాత్రిలో పొగ దుమ్ములాంటిది నా సైన్యం అని చెప్పడం మంచి పని చేశావు! షాని అలానే అనుకోనీ! మీ ముగ్గురూ ఈ రాత్రి నాతో భోజనం చెయ్యండి".

రాయబారులు వెళ్లిపోయారు.

ఖాఖాన్ లేచి నుంచున్నాడు. యెగు భుజాలు వంగి వున్నాయి. నల్లని ముతక కోరా బట్టలు తొడుక్కున్నాడు. దానికి బంగారు దట్టీ ఉంది. పెద్ద వికారమైన కాళ్లతో భారంగా అంగలు వేస్తూ గుడారంలో నడిచాడు. ఆ కాళ్లకి తెల్లని తోలు పాదరక్షలున్నాయి. తెర తొలగించి రంగుల అంగరఖాలు తొడుక్కుని, తెల్లని పొగాలు పెట్టుకుని, దుమ్ము కొట్టుకు పోయిన గుర్రాల్ని యెక్కి మెల్లిగా వెళ్లిపోతూ వుండే రాయబారుల్ని చూశాడు.

" 'పెద్ద పిలుపు' (యుద్ధానికి పిలుపు) రోజు వస్తోంది. శుభం కలిగించే నెలబాలుడి కోసం చూస్తున్నాను".

# జెంఘిజ్ ఖాన్ నిద్రలేని రాత్రి

జెంఘిజ్ ఖాన్ వేడి గాలి గొట్టాలపైన వుండే పొయ్యి బల్లలమీద పడుకునేవాడు కాదు. అలాంటి వాటిమీద సుఖంగా బతికే చైనా వాళ్లు పడుకుంటారు. ముస్లిం వర్తకులు పడుకునే మెత్తలమీద పడుకునేవాడు కాదు. కింద గట్టి వుండడమే ఖాఖాన్‌కి ఇష్టం. చైనా నౌకరు దళసరి పాటి బొచ్చు అట్టని పరిచేవాడు. అది బాగా రుద్ది, తివాసీమీద జవునుగా ఉండేది.

మామూలుగా ఖాఖాన్ వెంటనే నిద్రపోయేవాడు. యెక్కువగా కలలు ఉండేవి. తన షామాన్లని గాని, చైనా పండితుడు యెలు చూ చాయ్‌ని గాని ఈ కలల అర్థం చెప్పమనేవాడు. కాని అస్తమానూ ఈ వ్యాఖ్యల్ని నమ్మేవాడు కాదు. తనకి సాటిలేనిదిగా కనిపించే మార్గంలోనే ప్రవర్తించేవాడు. తెల్లవారడానికి ముందే లేచి వెచ్చని నల్ల  బొచ్చు అంగీకప్పుకు పడుకునే తన వేలాది సైన్యం గురించి, గుర్రాల గురించి, తన అసంతుష్టి సైన్యానికి ప్రజలనుంచి తిండి సంపాదించడానికి మంచి దారిని గురించి, వెనక్కాల మంగోలియాలో దిగవిడిచిన తన అయిదు వందల మంది జనాభాని, పిల్లల్ని, బానిసల్ని, నౌకరుల్ని పోషించడం గురించి ఆలోచించాడు. తను దాడి చెయ్యబోయే భూభాగాలకి అసంఖ్యాకంగా గూఢచారుల్ని పంపాడు. వాళ్ల నివేదికలు మననం చేసుకున్నాడు. తన కొడుకుల గురించి అనుకున్నాడు. వాళ్లు అసూయగ్రస్తులై వాళ్లల్లో వాళ్లు దెబ్బలాడుకుంటున్నారు. తన శరీరం నొప్పుల గురించీ, మృత్యువు గురించీ ఆలోచించుకుంటున్నాడు...

ఖాఖాన్ మనసులో ఒక నల్లని ఆలోచన సుళ్లు తిరుగుతూనే వుంది. పడమటికి తను దండయాత్రకి బయల్దేరేటప్పుడు లావుగా వుండే తన ముసలి భార్య బుర్టే అచారం అయినట్టుగా చెప్పింది యుక్తిగా వుండే మాటలు.

"ఓ ఘనమైన ఖాఖాన్!" అని నేల వేపు ముఖం పెట్టి వందనం చేసి, భారంగా శ్వాస పీలుస్తూ అందామె. "నువ్వు నీ సైన్యంతోటి పర్వతాలు దాటి, యెడారులు దాటి, అజ్ఞాత భూఖండాల్లోకి ఇతర ప్రజలతో భీకర యుద్ధాలు చెయ్యడానికి వెడుతున్నావు. నీ ఘనమైన గుండెలో శత్రు బాణం దూసుకుపోవచ్చునీ లేదా పరాయి యోధుడి కరవాలం నీ ఉక్కు శిరస్త్రాణం గుండా దెబ్బ కొట్టవచ్చునీ నువ్వు అనుకోలేదా యెప్పుడూ? ఈ రకంగా

భయంకరమైనది, తప్పించలేనిది జరిగితే" – ఆమె 'మరణం' అనే మాట గురించి అనుకుంది గాని, ఉచ్చరించకూడదని నిర్ణయించుకుంది – "భూమ్మీద నీకు మారుగా నీ పవిత్ర నామం మాత్రమే నిలిచి వుంటే, అప్పుడు మన నలుగురి కొడుకుల్లోనూ యెవరు ప్రపంచ పాలకుడూ, నీ వారసుడూ అవాలని నీ ఆదేశం? నీ సంకల్పాన్ని ముందే సరిఅయిన వ్యవధిలో ప్రకటించు, తర్వాత అన్న దమ్ములు ఒకళ్లని ఒకళ్లు చంపుకునే యుద్ధాలు రాకుండా".

ఆనాటి దాకా యెవళ్లూ అతనికి వయసు పై బడుతోందని గుర్తు చేసే సాహసం చెయ్యలేదు, బహుశా అతని రోజులు ఇక అయిపోతున్నాయని. తను గొప్పవాడనీ, తన బదులు యెవరూ రాలేరనీ, మార్పులేని వాడనీ, తను లేకుండా ప్రపంచం వుండలేదనీ అందరూ తను అనుకుంటున్నట్టే అంటున్నారు. ఒక్క ముసలి, గరిత బుర్టీ మాత్రమే మృత్యువు గురించి తనతో చెప్ప సాహసించింది...

కాని ధైర్యం, తెలివితేటలు వున్న బుర్టీ చెప్పింది నిజమే, తన వారసుణ్ణి గురించి మాట్లాడ్డం. తన నలుగురి కొడుకుల్లోనూ యెవర్ని తన వారసుడిగా ప్రకటించాలి నిజంగా? తన తండ్రి చావుని అందరికంటే యెక్కుగా కోరుకునేవాడు పెంకెఘటం, అహంకారీ అయిన పెద్ద కొడుకు జూచి. ఇప్పుడు జూచికి నలభై యేళ్లున్నాయి. జెంఘిజ్ ఖాన్ నుంచి అధికారం హస్తగతం చేసుకుని దుర్బల ముసలాళ్ల యుర్త్‌కి తండ్రిని పంపెయ్యాలని బహుశా అతని కోరిక. అందుకనే జెంఘిజ్ ఖాన్ జూచిని దూరానికి, సామ్రాజ్యపు అవతలి అంచుకి పంపేశాడు. అతను యేం రహస్యాలోచనలు చేస్తున్నాడో తెలియజెయ్యడానికి గూఢచారుల్నీ పంపాడు.

ఇక రెండో కొడుకు జగతాయ్ తండ్రి చావుకంటే తన ప్రత్యర్థీ అన్నగారూ జూచి చావుని యెక్కువగా కోరుకుంటున్నాడు. వాళ్లిద్దరూ ఒకళ్లనొకళ్లు ద్వేషించుకుని, పోట్లాడుకున్నంత కాలం ప్రమాదం యేమీ లేదు వాళ్లనుంచి. మూడో కొడుకు ఉగేదీయ్‌ని వారసుడిగా ప్రకటించాలని అతను నిర్ణయించుకున్నాడు. ఉగేదీయ్ మెత్తగా వుంటాడు. అతనికి విందు వేడుకలంటే, తన డేగలతో వేటకి పోవడం అంటే, పందేలంటే ఇష్టం. తండ్రిని తోసెయ్యడానికి అతను గొయ్యి తవ్వడు. అలాగే కడసారి వాడు చతుష్టుడు తులీ ఖాన్ కూడా. ఇద్దరికీ కులాసా జీవితం ఇష్టం. దురాశా జ్వాలలు వాళ్లల్లో మండడం లేదు.

అంచేత దండయాత్రకి బయల్దేరే ముందు జెంఘిజ్ ఖాన్ మూడో కొడుకు ఉగేదీయ్‌ని వారసుడిగా ప్రకటించాడు. కాని ఇది పెద్ద కొడుకులిద్దరికీ మరింత కంటకం అయింది, తను నిరంతరం హెచ్చరికగా వుండాల్సి వచ్చింది. ఓ హంతకుడి హస్తం వేస్తుందేమో, చీకట్లోనుంచి విషపూరిత బాణం దూసుకుంటూ వస్తుందేమో, గుడారం తెరలోనుంచి బల్లెం పొడుచుకు వస్తుందేమోనని ప్రతి చోటా చూసుకుంటూ వుండాల్సి వచ్చింది.

అప్పట్నుంచీ జూచినీ, అతని మంటనీ తగినంత దూరంలో అతనికి అప్పగించిన సైనిక నాయకత్వ అగ్రస్థానంలో పెట్టాల్సి వచ్చింది. అతను ప్రసిద్ధుడు కావాలని ప్రయత్నించాడు. తన సైనికుల ఆదరాభిమానాలు సంపాదించాలని ప్రయత్నించాడు. కీర్తి కాంక్ష పట్టింది. అతను పడుచువాడు, దృఢంగా వున్నాడు. పడుచుతనంతో వుండడం మంచిది!...

ఇటూ అటూ దొర్లుతూ ఖాఖాన్ ముసలి బుర్టీ అన్న మాటల్నీ గుర్తు చేసుకున్నాడు, మృత్యువు గురించే అదే పనిగా ఆలోచించాడు. ప్రజల్ని జయించిన మహావీరులందరూ కడకి కిట్టేవాళ్లే. కాని, తను, జెంఘిజ్ ఖాన్ అందరికంటే గొప్పవాడు. ఆ మహా వీరుల్లో యెవడి విజయాలేనా ఇంత విస్తృతంగా ఉన్నాయా?

ఒకప్పుడు మెడమీద కాడితోటి బానిసగా వున్న సాదా నోకరు టెమూజిన్‌ని స్వర్గ దూత జెంఘిజ్ ఖాన్‌గా కురుల్తాయ్‌లో ప్రకటించడం జరగలేదా? వినీలాకాశం శాశ్వతమైతే, దాని దూత అయిన తనూ శాశ్వతంగానే ఉండాలి. ఆవేళే, తక్షణం తన చైనా పండితుడు యెలు చూ చాయ్ సామ్రాజ్యపు అంచులకంటా తన ఆజ్ఞల్ని జారీ చేయించేటట్టు చూడాలి. తక్షణం ఖాఖాన్ వున్న కేంద్రానికి మహిమలు చెయ్యగలిగిన వాళ్లందర్నీ పిలిపించమనాలి. చైనా తావోషిష్‌లని, టిబెట్ మంత్రగాళ్లని, అల్తాయ్ షామాన్‌లని పిలిపించాలి. బలాన్నీ, యౌవనాన్నీ, అమరత్వాన్నీ యిచ్చే ఓషధుల్ని తెమ్మనమని వాళ్లకి ఆజ్ఞలు వెళ్లాలి. ప్రపంచంలో యే పాలకుడూ యెన్నడూ ఇచ్చి ఉండనన్ని గొప్ప కానుకల్ని ఈ ఓషధులకిగానూ వాళ్లమీద తను గుప్పించేస్తాడు.

అతను యెంతో సేపు దొర్లుతూ అలానే పడుకున్నాడు. కాని నిద్రపట్టడం లేదు. ఆఖరికి కునుకు పట్టేవేళకి అతని కాలి బొటన వేలిమీద హఠాత్తుగా కొంచెం నొప్పి అనిపించింది. యెవరో గిల్లుతున్నారు. అతను బెదరలేదు. ఇది సంచారులో బాగా తెలిసిన సంకేతమే. ఖాఖాన్ తల యెత్తాడు. కాని చీకట్లో యేమీ కనిపించలేదు. ఈ సంకేతం అతనికి బాగా గుర్తే: తమ కమ్మని రోజుల్లో తనే అలా బుర్టీతో చేశాడు. అప్పట్లో ఆమె నాజూగ్గా, పచ్చిక బీళ్ల జెరోబా లాగా చురుగ్గా ఉండేది. అప్పట్లో ఆమె మొత్తం కుటుంబం కఠినుడైన తండ్రి దాయి సెచెన్ చీకటి యుర్త్‌లో పరిచిన బొచ్చు అట్టల మీద కలిసే పడుకునేది.

తన కాళ్ల దగ్గర ఉన్నది యెవరు? తనకి సంకేతం ఇచ్చేదెవరు?

జాగ్రత్తగా చేతిని చాచాడు. అతని వేళ్లకి మెత్తటి పట్టు బట్టలు తగిలాయి. ముడుచుకుపోతున్న ఆడపిల్ల శరీరం, నాజూకైనా భుజాలు, వింతగా అల్లిన జుట్టు తగిలాయి. యెవరీమె? అతనామెని దగ్గరికి లాక్కున్నాడు. సన్నని గొంతుక పొడి మాటలు అంది:

"నీ కుసుల్తు, ముచ్చటైన కూలన్ ఖాతూన్ నీ కోసం చచ్చిపోతోంది, పరితపిస్తోంది... ఆమెని ఓదార్చు... నువ్వు... సూర్యుడా, కుసుల్తు – చంద్రమామ..."

"నా పడుచు భార్య కూలన్ ఖాతూన్ పరిచారిక చైనీయురాలయి ఉంటుంది" అనుకున్నాడు. అతను కూలన్ ఖాతూన్‌ని యెప్పుడూ కుసుల్తు అనే పిలిచేవాడు. ఆమె చడీచప్పుడూ కాకుండా చుంచులాగా గుడారంలోకి వచ్చింది. కూలన్ తనని పిలుస్తోంది.

ఖాఖాన్ పెద్ద పాదరక్షల్ని పైకి లాక్కున్నాడు. అవి బొచ్చు అస్తరు వేసికుట్టినవి. జాగ్రత్తగా ద్వారం దగ్గరికి వెళ్లాడు. నిద్రపోతున్న కొడుకులు ఉగేదీయ్, తులీలు లేవకుండా జాగ్రత్తగా వెళ్లాడు. వాళ్లిద్దరూ తన గుడారంలో పక్కనే పడుకున్నారు. మొత్తానికి బయటపడ్డాడు.

# కూలన్ ఖాతూన్ యుర్త్‌లో

“అందం కోసం పందెం వేసే
సంపదలన్నింట అతివని మించే దేదేనా
ఈ అవనిని గలదంటా? అలిగిన చిరుతల
కన్నులు కాదే ఆడువారి వీనీ”.
(మంగోలు పాట)

నిశ్శబ్ద నిశీధిలో పర్వతాలనుంచి చలిగాలి వీస్తోంది. దట్టమైన మేఘాలమాటున చంద్రుడు దాగి ఉన్నాడు. ఇక్కడా అక్కడా మసక నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి. చైనా పరిచారిక ముందు వెళ్లింది. విరిసిన మల్లెల పరిమళం ఆమె వెనక గుబాళిస్తోంది.

భూమిలోనుంచి రెండు నీడలు లేచాయి.

“ఆగండి! యెవరు వెళ్లేది?”

“నల్ల ఇర్తిష్” అని ఆమె జవాబు చెప్పింది.

“లొంగిపోయిన ప్రపంచం” అని పహారావాడు జవాబు చెప్పాడు, సంకేతపదం చెప్పగానే. నీడలు తొలగిపోయాయి.

తెల్లని గుడారం దగ్గరికి వస్తూ ఖాఖాన్ అనుకున్నాడు: “ఇప్పుడే కొత్త తంత్రం పన్నుతుందో” అని. సైన్య మంతనాలనుంచి తెంచుకుని తను ఆమె దగ్గరికి వచ్చినప్పుడల్లా ఆమె పెడమొహంగా ఉండేది. ఇక ఇప్పుడామె చైనా దానిలాగా బట్టలు వేసుకుంది. పట్టు బట్టలు వేసుకుంది. అవి తెలియని పువ్వులు వేటితోనో అలంకరించి ఉన్నాయి. కాసేపు నల్ల బొచ్చు దుప్పటీ ముసుగు కింద మూలుగుతూ పడుకుంది. తను చచ్చిపోతోందట, అతని దృఢమైన పెద్ద చేతి స్పర్శ కావాలట తన చిన్న ఛాతీమీద. మళ్లీ అంతలోనే తల చేతిలో పెట్టుకుని కూర్చుంది. ముఖం కన్నీళ్లతో తడిసిపోయింది. వృద్ధ మంగోలు ఆవిడ పాడే మంగోలు పాటలు – కెరులెన్ పచ్చని నదీ తీరం గురించీ, అనంతమైన పచ్చిక బీటిలో వున్న ఒంటరి సంచార విడిది గురించీ పాడిన పాటలు–వింటూ ఉంది.

చైనా పిల్ల తెల్లని యుర్త్ ద్వారం దగ్గరి తెర యెత్తింది. ఖాఖాన్ లోపలికెళ్లాడు. యుర్త్ మధ్యలో నెగడు మండుతోంది. అది పచ్చిక బీటి దుబ్బుల వేళ్లతో మండే నెగడు. సువాసనగా వుండే పొగ చిన్న చిన్న సుళ్లు తిరుగుతూ గుండ్రటి కప్పుకేసి పైకి పోతోంది. కూలన్ ఖాతూన్ చేతులు మోకాళ్ల చుట్టూ వేసి కూచుంది. కన్ను రెప్పలు సన్నగా ముడిచి రెపరెపలాడే నెగడు మంటకేసే చూస్తూ వుంది. మామూలుగా వుండే పట్టు తివాచీల బదులుగా అక్కడ వూరికే మూడు సాదా బొచ్చు అట్టలు నేలమీద వున్నాయి. ఒక వేపున ప్రయాణం మూటలు గుట్టగా ఉన్నాయి. వాటికి తాళ్లు కట్టేసి ప్రయాణానికి సిద్ధంగా వున్నాయి.

ఖాఖాన్ గుమ్మం దగ్గర ఆగాడు. మెరిసే అతని పిల్లి కళ్లల్లో హుషారైన వెలుగు రేక మిణుకుమంది. “ఇదో – కొత్త పన్నుగడ!” అనుకున్నాడు.

కూలన్ ఖాతూన్ మళ్లీ మామూలు ప్రపంచంలోకి వచ్చింది. చేతులతో కళ్లమీద రాసుకుంది. కళ్ల నల్లని అంచు బొమలు కణతల దాకా వున్నాయి. ఆమె గెంతి, తల వెనక్కి విసిరి, ఖాఖాన్ కాళ్లమీద చేతులతో సాష్టాంగ పడింది. తల నేలకేసి పెట్టింది.

“నన్ను మన్నించు, ఖాఖాన్, అచంచల మూర్తీ, కాలాతీతా! నీకు నిద్రాభంగం చేశాను లేకపోతే నీ ఆలోచనల్ని లేకపోతే నీ యుద్ధ సంప్రదింపుల సమావేశాన్ని ఇక్కడ నేను యెక్కువ కాలం వుండలేను. ఇక్కడ ప్రతి చోటా, ప్రతి మూలా నా కోసమూ, నా చిన్న కొడుక్కోసమూ మృత్యువు పొంచి వుంది. నేను ఆశించవలసింది యేమీ లేదు; యేదీ, యెవరూ నన్ను రక్షించడం జరగదు. నాకో తల్లా, తండ్రా యెవరూ లేరు. నా అన్న దమ్ముళ్లందర్లోనూ ఒక్కడే మిగిలాడు. అతనో సాదా నోకరు. కాని ఒకప్పుడు వాడికీ వెయ్యి మంది నోకర్లు వుండేవాళ్లు. అట్టే రోజులుండదు, మా అన్న చచ్చిపోతాడు”.

“అతను చావడమెందుకని?”

“మా మెర్కిట్‌లంతా, దురదృష్ట తండా వాళ్లమందరం, చచ్చిపోయాం. వాళ్లు మహాకసిగా, క్రూరంగా, పెద్ద పులి కళ్లతో వుండే నీ కొడుకు జూచి నోకర్ల కత్తులకి బలైపోయారు. త్వరలోనే అతనిక్కడికి వస్తున్నాడు. మా మొత్తం జాతినీ, మా తండ్రినీ హత్య చేసిన ఆ అసహ్యకరమైన వాడు నాకు కనిపిస్తాడు. నా తలమీద బండరాయి పడినన్ను పచ్చడి చేసెయ్యబోతూ వుంటే నేను యెందుకుండాలిక్కడ? నన్ను వెళ్లనీ. ప్రతీదీ ప్రయాణానికి సిద్ధంగా ఉంది”.

“జూచి ఖాన్ ఇక్కడికి రాడు. అతను ఇర్గిజ్ నది ఒడ్డున ఉన్నాడు. కొత్త దాడికి తయారవుతున్నాడు. నేనింకా బతికే ఉన్నాను, ఇంకా ప్రపంచ పాలనా భారం నా భుజాలమీదే ఉంది. నీకింక యే రక్షణ కావాలి?”

కూలన్ నాజూకైన వేళ్లతో కారే కన్నీళ్లని తుడుచుకుంటూ, కళ్లని తాకింది.

"నా వెయ్యి మంది నోకర్లలోనూ ఆరో వందకి మీ అన్న జమిల్ హోజ్జిని దళవాయిని చేస్తాను. వెయ్యికి దళవాయి అయిన చహన్‌కి రేపు చెప్తాను ఆరో వంద నిన్నూ, నీ యుర్త్‌నీ, నీ కొడుకునీ కాపాడాలని, కూలన్. నా చేతుల్లో రక్షణ లేదని భయపడే వాళ్లున్నారా?"

కూలన్ కళ్లు నేల వాల్చింది. లోగొంతుకలో, వణికే కంఠంతో అంది:

"ఆ బాణాలు నిన్నూ బెదిరిస్తున్నాయి".

"యే బాణాలు? చెప్పు, యెవరి బాణాలు?" ఖాఖాన్ కూలన్ భుజం పట్టుకున్నాడు.

ఆమె పెదవి కొరుక్కుని, ముడుచుకుపోయి, గుడారం వారకి పారిపోయింది. ఆమె నల్లని జడ బొచ్చు అట్టమీద మెలికలు తిరిగే తాచుల్లాగా యెరిగింది. ఖాఖాన్ ఆమె జడ చివర కాలు వేసి తొక్కి, మెల్లిగా బుసకొట్టేటట్టు అన్నాడు:

"చెప్పు, యెవరు నన్ను చంపదలచుకుంటున్న వాళ్లు?"

కూలన్ యుర్త్ గోడకి కరుచుకుపోయింది.

"మహనీయా! సాటిలేనివాడా! యే ప్రజలూ, యే సైన్యమూ నిన్ను బెదిరించడం జరగదు. కారాకుల్ని పెనుగాలి తుడిచిపెట్టినట్టు నువ్వు వాళ్లని నాశనం చేస్తావు. నీతోబాటుగా అదే గుడారంలో కూర్చుని, నిన్ను రాత్రింబగళ్లు కొలిచే రహస్య శత్రువుల బారినుంచి యెలా రక్షించుకుంటావు? నేనొక్కత్తినే నీకు విధేయంగా వున్నాను, తళతళ మెరిసే మంచుతో కప్పిన నా మాతృదేశపు అందమైన గొప్ప ఆల్తాయ్ పర్వతాన్ని మాదిరిగా నిన్ను ప్రేమిస్తున్నాను".

"అంతా చెప్పు. నీకు తెలిసినదంతా" అని ఖాఖాన్ బుస్సుమన్నాడు, జడమీద కాలువుంది.

కూలన్ ఖాతూన్ కళ్లల్లో ఆకుపచ్చ దుష్ట జ్వాలలు రేగాయి.

"యుర్త్‌లో నెగడు రాజేసే వారసుడు యెప్పుడూ ఖాఖాన్ కడగొట్టు కొడుకే కావాలని పచ్చిక బీటి ముసలాళ్లు అంటారు. పెద్ద కొడుకులు యెదిగి, ఒంటి గుర్రం కళ్లేలు పట్టుకోవాలని తన్నుకులాడతారు. అంచేత తండ్రి వాళ్లని, దూరంలో వుండే వాళ్ల సొంత యుర్త్‌లకి పంపేస్తాడు. అక్కడ వాళ్లు తమ కుటుంబాలు యేర్పాటు చేసుకుంటారు. కడగొట్టు కొడుకు చిన్న వాడుగా వున్నప్పుడు తండ్రి ప్రశాంతంగా తన గుర్రాల్ని మేపుకుంటాడు. నువ్వు నీ కొడుకులందరికీ వాళ్ల కానుకల్ని ఇచ్చావు. వాళ్ల వాటా వాళ్లకిచ్చావు. నీ కొడగొట్టు కొడుకు కుల్కాన్‌ని నీ వారసుడిగా చెయ్యడం యెందుకు మర్చిపోయావ్?"

ఖాఖాన్ జడని వదిలేసి, దీర్ఘ శ్వాస పీల్చి, ఆఖరికి అన్నాడు:

"నేను నిన్నూ, పిల్లాణ్ణీ ఇద్దర్నీ కాపాడుతున్నాను. అందుకనే నా వారసుడిగా ప్రకటించలేదు. మంగోలులు మెర్కిట్ కొడుకుని యెన్నడూ ప్రేమించరు, కొలవరు".

కూలన్ మోకాళ్లమీద వాలింది.

“కాని ప్రపంచంలో అందరికంటే ఘనుడూ, ఉత్తముడూ అయిన మెర్కిట్ కొడుకుని నే ప్రేమించ సాహసిస్తున్నా – నిన్ను ప్రభూ, నా యేలికా, స్వర్గదూతా, యేమంటే నీ తల్లి ఘనత వహించిన యూలన్ మంగోలు కాదు, నా మెర్కిట్ తండాకి చెందినదే”.

జెంఘిజ్ ఖాన్ బెదిరి, నిశిత విశ్వాసం చేసి లేచాడు.

“నువ్వు చెప్పింది నిజమే. వాళ్లు మరిచిపోయారు. పోనీ మర్చిపోనీ! నువ్వన్న మాటలు గుండెలో దాచుకుంటాను. నన్ను యెన్నడూ వదిలివెళ్లకు. నీ తివాసీలు విప్పు. నాయాన్లతోటి యుద్ధ సంభాషణలు అయిపోయాక నీ దగ్గరికి వస్తాను. నా చిన్న చిరుతా, నా ప్రియమైన, కుసుల్తు”.

ఖాఖాన్ భారంగా అడుగులు వేసుకుంటూ గుడారం బయటికి వెళ్లిపోయాడు.

# ఖాఖాన్ వేళ్లతో లెక్క పెట్టడం

తన "కోపభరిత చిరుత" చెప్పిన దాన్ని గురించి ఆలోచిస్తూ ఖాఖాన్ మెల్లిగా దిబ్బ చుట్టూ నడిచాడు. మరోసారి అతని ముందు ఓ నీడ లేచింది. వాళ్లు సంకేతపదాన్ని, జవాబుని అనుకున్నారు – "నల్ల ఇర్తిష్", "లొంగిపోయిన ప్రపంచం". ఖాఖాన్ ఆ కాపలావాణ్ణి గుర్తించాడ. ముసలి నోకరు. తన దండయాత్రలన్నింటిలోనూ తనతో కూడా వున్నాడు.

"నోకర్లు వాళ్లల్లో వాళ్లు యేమనుకుంటున్నారు?"

"మనం గొర్రెలన్నింటినీ తినేస్తున్నామనీ, గుర్రాలు మొదళ్లలో కంటా గడ్డిని మేసేశాయనీ, కత్తులు రక్త దాహంతో వున్నాయనీ వాళ్లు అంటున్నారు. అంచేత, ఘనమైన ఖాఖాన్ మన అందరికంటే తెలివైన వాడనీ, ఆయన అన్నీ చూస్తాడనీ, ఆయనకి అన్నీ తెలుసనీ, త్వరలోనే ఆయన మన కడుపులకీ, మన గుర్రాల కడుపులకీ పుష్కలంగా దొరికే చోటికి నడిపిస్తాడనీ వాళ్లు అంటున్నారు".

"నిజమే, ఖాఖాన్ అన్నీ చూస్తడు, అన్నీ తెలుసు, అన్నీ ఆలోచిస్తాడు. వెయ్యి మంది దళవాయి చహన్ దగ్గరికి పరిగెత్తివెళ్లు, తనతో ఆరు వందల మందిని తీసుకుని తక్షణం అతను తన గుర్రం యెక్కి రావాలని మా ఆజ్ఞగా చెప్పు".

"తక్షణం వెడుతున్నాను, ఖాఖాన్".

"ఆగు! నేను వేళ్లతో లెక్కపెడుతూ తన కోసం ఇక్కడ కొండమీద ఈ చిన్న పచ్చిక మడి దగ్గర నిరీక్షిస్తూ ఉంటానని చెప్పు".

నోకరు చాలా వేగంగా కొండ దిగి వెళ్లిపోయాడు. ఖాఖాన్ మోకాళ్లమీద ఆనుకుని కూర్చున్నాడు. ఆ చీకట్లో వినవచ్చే ప్రతి చప్పుడుకీ హెచ్చరికగా వుంటూ, అచలంగా కూర్చున్నాడు. ఒకటి, రెండు, మూడు, నాలుగు అవి లెక్క పెట్టుకోవడం మొదలుపెట్టి వంద రాగానే ఒక వేలిని కిందికి వాల్చాడు.

చంద్రుడు కాసేపు మేఘాల్లోకి పోతూ, కాసేపు బయటికి వస్తూ దూరపు నిశీధిలో ఆకాశంమీద మెల్లిగా పోతున్నాడు. కొండ చుట్టూతా విశాల వలయంగా పరుచుకున్న నోకర్ల

యుర్త్‌లు ఆ నేపథ్యంలో తీర్చినట్టు వున్నాయి. చీకట్లో మసక చుక్కల్లాగా మేఘాల నీడలో మాయమవుతూ, మళ్లీ స్పష్టమవుతూ వున్నాయి.

ఖాఖాన్ రెండో వంద లెక్కపెట్టుకుని రెండో వేలు ముడవగానే నీడలు యుర్త్‌ల మధ్య పరిగెత్తనారంభించాయి. మసక బీటిమీదకి బోలెడు మంది నోకర్లు దౌడు తీస్తూ హడావుడిగా వచ్చారు. విడిది అంతటా కంఠ్యాక్షర అరుపులు వినవచ్చాయి:

“హెచ్చరిక!”

ఖాఖాన్ నిదానంగా కూర్చునే ఉన్నాడు. మూడో వంద, నాలుగో వంద లెక్క పెట్టాడు. దూరంలో చిన్నగా ఉరుము వినిపించింది. అది పెద్దదైంది. వెయ్యి గుర్రాలు వస్తున్నాయని ఖాఖాన్‌కి అర్థమైంది. గుర్రాలు ఇంకా దగ్గరగా వచ్చి వున్నట్టుండి కొండ పాదం దగ్గర, ఆగాయి. ఖాఖాన్‌కి గుర్రం చెమట పులుసు వాసన వచ్చింది. ఓ క్షణం పాటు ధూళి మేఘం మొత్తం శిబిరాన్ని కమ్మేసింది.

ఖాఖాన్ లెక్కపెట్టుకుంటూ వేళ్లని కిందికి మడుస్తూనే వున్నాడు. గుర్రాల సకిలింపులతోటీ, పదఘట్టనలతోటీ నిండిపోయింది. గట్టిగా, కాహళి వూదినట్టుగా ఖాఖాన్ అరిచాడు:

“చహన్! హోయ్! చహన్!”

“హోయ్! ఇక్కడ వున్నా” అంటూ దీర్ఘంగా సాగదీసిన జవాబు వచ్చింది.

“నేను ఆరు వేళ్లు ముడిచాను. యెందుకింత ఆలస్యం చేశావ్?”

“ఇంకో రెండు ముడచు. మేం జీను లెక్కుతున్నాం!”

మరోసారి చంద్రుడు మేఘాల ఇవతలికి వచ్చాడు. వెన్నెల యుర్త్‌ల వలయంమీద పుచ్చ పువ్వులా విరిసింది. అక్కడకి నోకర్లు అన్ని వేపులనుంచీ పరిగెత్తి వస్తున్నారు. కొంత మంది జీనులతోటి, జీను పట్టాలతోటి పరిగెడుతున్నారు. ఇంకొంత మంది యుర్త్‌లదాకా గుర్రాల్ని నడిపించుకెడుతున్నారు. మరింకొంతమంది అప్పుడే తాము చేరవలసిన తావుకి దౌడు తీస్తున్నారు.

ఖాఖాన్ లెక్క పెట్టుకుంటూనే వున్నాడు. యేడవ వేలుని ముడిచాడు, చుట్టూతా చూశాడు. వెనకనుంచి పదధ్వనులు వినవచ్చాయి. ఇద్దరు నోకర్లు జెంఘిజ్ ఖాన్ జీను వేసిన మీగడ రంగు గుర్రాన్ని నడిపించుకు వచ్చారు. జూలు అందుకుని అతను గుర్రం జీనుమీదకి యెక్కాడు. మెల్లిగా కొండ అంచుకి వెళ్లాడు. యేడుగురు నోకర్లు అతని వెనక బారులు తీరి వచ్చారు. ఒకడు రెపరెప యెగిరే జండా పట్టుకున్నాడు.

అన్ని వేపులనుంచీ నోకర్లూ, గుర్రాలూ హడావుడి పడుతూ వుండడం కనిపించింది. కాని కొంచెం సేపట్లోనే తమతమ స్థానాలు తీసుకోవడం జరిగింది. జెంఘిజ్ ఖాన్ ఇంకా యెనిమిదవ వేలు ముడచలేదు ఆరు దళాల ఆశ్వికులు అతని ముందు క్రమంగా వరసతీరారు.

ఒకోదాంట్లో వంద మంది వున్నారు. ముందు వెయ్యింటి దళవాయి చహన్ అతని అంగరక్షకులూ ఉన్నారు.

"చహన్, నా దగ్గరికి" జెంఘిజ్ ఖాన్ అరిచాడు.

చహన్ కొండ దగ్గరికి దౌడు తీసి ఖాఖాన్‌కి మూడు అడుగుల దూరంలో ఆగాడు.

"కరచా*లందరూ, పచ్చిక బీటి తుంటరులందరరూ పారిపోయిన కొండ దగ్గరికి వెళ్లు. వాళ్ల పశువులన్నిటినీ ఇక్కడికి తోలుకురా. ఒక్క గొర్రెని కూడా విడిచిపెట్టద్దు. వెళ్లు!"

చహన్ గుర్రాన్ని తిప్పి శ్రేణికి దౌడు తీసివెళ్లాడు.

"నా వెనక రండి!"

శ్రేణి కదిలింది. ఒక వరస తర్వాత ఇంకో వరస. ఒక వంద తర్వాత ఇంకో వంద. తెల్లని వెన్నెలలో జాడలో పడిపోయాయి. కొండ అంచున ఖాఖాన్ నిశ్చలంగా నుంచున్నాడు. లెక్కపెట్టుకుంటూ వేళ్లని ముడుస్తూనే వున్నాడు, ఆఖరి ఆశ్వికుడు దూరంలో అదృశ్యం అయ్యేదాకా. అప్పుడు పదో వేలు ముడిచాడు.

"ఆ పొగరుమోతు దంభాలరాయుడు ఖోరెస్మ్ షా ఇలాంటి సైన్యాన్ని నిర్మించగలిగాడా? బుఖారా యుద్ధం వచ్చినప్పుడు త్వరలోనే చూస్తాం".

---

* కరాచా – పచ్చిక మీళ్లమీద వుండే సాదా, బీద సంచారులు.

# తప్పిపోయిన బిడారు

పెద్ద బిడారుని తయారు చేసి, వ్యాపారానికన్నట్టుగా, ఖోరెస్మ్ షా రాజ్యమంతా ప్రయాణం చెయ్యవలసిందిగా జెంఘిజ్ ఖాన్ ముసల్మాను రాయబారుల్ని ఆదేశించాడు. తన సొంత వస్తువులనుంచీ, చైనాలో కొల్లగొట్టిన దాన్నుంచీ సుమారైన మొత్తాన్ని వాళ్లకి అందజేసి, వాటికి వచ్చే డబ్బు పెట్టి చక్కని జౌళి కొనమని వాళ్లని చెప్పాడు. తన అధీనంలో వుండేవాళ్లల్లో ప్రముఖులైన వాళ్లకి దాన్ని బహుకరించవచ్చును.

మహమ్మద్ యాల్‌వాచ్ బోలెడు వస్తువులతో బిడారుని పంపాడు. కాని తనకిగా ఖోరెస్మ్ వెళ్లకూడదనుకున్నాడు. అతనూ, అతని ఇద్దరు మిత్రులూ జబ్బుతో మూలుగుతూ యుర్త్‌ల్లో ఉండిపోయారు. బుఖారాలో తమకి విషప్రయోగం జరిగిందని పైకి చాటారు. బిడారులో అయిదు వందల ఒంటెలున్నాయి. నాలుగు వందల యాభై మంది మనుషులున్నారు. వాళ్లంతా వ్యాపారులనీ, వాళ్ల సహాయకులనీ పైకి చెప్పారు. బిడారు నాయకుడుగా జెంఘిజ్ ఖాన్ తన సొంత మంగోలు నోకరు ఉసున్‌ని నియమించాడు.

తియోన్‌షాన్ పర్వతాల చీలిన తిప్పలు దాటి బిడారు సరిహద్దు ముసల్మాను నగరం ఓత్రార్* చేరింది. అక్కడ బిడారు నాయకుడు ఉసున్ నగర పాలకుడికి షా మహమ్మద్ సంతకం చేసి మైనంతో మొహరు వేసిన ఫర్మానా చూపించాడు. అది మంగోలు వర్తకులకి "ఖోరెస్మ్‌లోని అన్ని నగరాల్లోనూ సుంకం యేమీ లేకుండా వ్యాపార, విహార స్వేచ్ఛని" ఇస్తోంది.

ఓత్రార్ విపణికి కొత్తగా వచ్చిన ఈ బిడారు వింతగానే ఉంది. ఓత్రార్ ప్రజలు యెన్నడూ చూసి ఉండని వింత విలువైన వస్తువుల్ని వర్తకులు తివాసీమీద పరిచారు. లోహపు విగ్రహాలు పూతపెట్టి బంగారంతో చేసినట్టుగా కనిపించాయి. "అదృష్టం ప్రసాదించే" సూర్యకాంతశిలల

---

* ఓత్రార్ – మంగోలు దాడికి ముందు మధ్య ఆసియాలోని గొప్ప నగరాల్లో ఒకటి. 1219లో జెంఘిజ్ ఖాన్ దాన్ని నాశనం చేశాడు. ఆ నగర వాసులందర్నీ హతం చేశారు. తర్వాత తిరిగి నిర్మితమై మధ్య ఆసియ చరిత్రలో దీని పేరు కనిపిస్తుంది. కాని పూర్వపు వైభవం, జన సాంద్రత, సంపదలు యెన్నడూ తిరిగి సమకూరలేదు. ఈ అదృశ్య నగరం ఇవాళ ఇసక తిప్పలతో, శిధిలాలతో ఉంది. ఈ శిధిలాలు కజఖ్‌స్థాన్‌లోని సర్ దార్య తీరాన వున్నాయి. తాష్కెంట్‌కి కొంచెం దూరంలో.

దండలు, పూల జాడీలు, అగరువత్తుల సెమ్మాలు, విలువైన రాళ్లతో చేసిన వింత బొమ్మలు, తేనీటి పాత్రలు, చక్కని చైనా పింగాణీ సామాను, బంగారు పిడి కత్తులు, విలువైన రాళ్లు పొదిగిన ఒరలు ఉన్నాయి. బొరియ జంతువుల బొచ్చు, అడివి నక్కల బొచ్చు, ఆడవాళ్లూ, మగవాళ్లూ ధరించే నల్లని అస్తరు వేసిన రెపరెపలాడే పట్టు బట్టలు, ఇంకా బోలెడు విలువైన వస్తువులు ఉన్నాయి. వీటినన్నిట్నీ చూడ్డానికి జనం గుంపులు గుంపులుగా మూగారు.

ఓత్రార్ నగర పాలకుడు ఖోరెస్మ్ సుల్తానా మాతృశ్రీ తుర్కాన్ ఖాతూన్ మేనల్లుడు. అతని పేరు ఇనాల్‌చిక్ కెయిర్ ఖాన్. తన పరివారాన్ని తీసుకుని మంగోలు బిడారు తెచ్చిన సరుకు చూడ్డానికి అతను విపణికి వెళ్లాడు. వర్తకులు అతనికి కానుకల్ని బహూకరించారు. అప్పుడు దీర్ఘాలోచనా మగ్నుడై అతను తన కోటకి తిరిగివచ్చి ఖోరెస్మ్ షాకి నివేదిక పంపాడు. అందులో ఇలా ఉంది:

"ఓత్రార్‌కి వ్యాపారస్తులుగా వచ్చిన ఈ మనుషులు వ్యాపారులు కారు. తాతార్ ఖాఖాన్ గూఢచారులు. పొగరు మోత్తనంగా ఉన్నారు. ఈ వర్తకుల్లో ఒకడు, హిందువు, నన్ను 'ఖాన్' బిరుదు లేకుండా పేరుతో పిలిచాడు పొగరుగా. అతన్ని నేను కొరడా దెబ్బలు కొట్టించాల్సి వచ్చింది. మిగతా వర్తకులు కొనుగోలుదార్లని వ్యాపారంతో యే సంబంధమూ లేని ప్రశ్నలడుగుతున్నారు. సామాన్య జనంతో ఒక్కళ్లూ ఉన్నప్పుడు 'ప్రపంచంలో యేం జరుగుతోందో మీకు తెలియడం లేదు. మీరు పోరాడ్డం వ్యర్థం అనిపించేవి జరగబోతున్నాయి' అంటున్నారు..."

అలాంటి ఉత్తరంతోటి బెదిరిపోయి ఓత్రార్‌లో మంగోలు బిడారుని బంధించమని ఖోరెస్మ్ షా మహమ్మద్ ఆజ్ఞాపించాడు. బిడారు నాయకుడు ఉసున్‌తో సహా మొత్తం నాలుగు వందల యాభై మందీ అయిపూమచ్చాలేకుండా కోట చీకటి కొట్లలో అంతర్ధానం అయిపోయారు. మంగోలు సామాన్లని బుఖారాలో అమ్మేయ్యడానికి ఓత్రార్ నగర పాలకుడు పంపేశాడు. ఆ వచ్చిన సొమ్ము ఖోరెస్మ్ షా మహమ్మద్‌కే దక్కింది.

బిడారులో ఒక్కగానొక్క చోదకుడు సజీవంగా మిగిలిపోయాడు. అతను తప్పించుకు పారిపోగలిగాడు. మంగోలు చౌకీ దాకా పోగలిగాడు. అక్కడతనికి గంటలున్న మజిలీ గుర్రాన్ని ఇచ్చారు. అతను భయంకరమైన సమాచారంతో జెంఘిజ్ ఖాన్ దగ్గరికి హడావుడిగా వెళ్లిపోయాడు.

# రాయబారికి హాని చెయ్యకూడదు

పౌర్ణమి తర్వాత చంద్రుడు మళ్లీ వంపుగా అయేలోగా తాతార్ పాలకుడి కొత్త దూత బుఖారాలో ప్రత్యక్షం అయ్యాడు. ఇతను ఇబన్ కెఫ్రెజ్ బోఘ్రా. అతని తండ్రి ఖోరెస్మ్ షా తండ్రి తకాష్ కొలువులో ఒకప్పుడు వున్న ఎమీర్. అతనితోబాటు ఇద్దరు పెద్ద మంగోలులు వచ్చారు.

ఈ రాయబారుల్ని కలుసుకోవడానికి ముందు ఖోరెస్మ్ షా మహమ్మద్ కిప్‌చాక్ దళవాయిలతో చాలా సేపు సమావేశం జరిపాడు. వాళ్ల సలహా మేరకి రాయబారుల్ని తలబిరుసుగా, కఠినంగా కలుసుకోవడానికి నిర్ణయించుకున్నాడు. కాని జెంఘిజ్ ఖాన్ ఉద్దేశాలేమిటో తెలుసుకుందుకు వీళ్లు చెప్పేదేమిటో వినాలనీ నిర్ణయించుకున్నాడు.

పెద్ద రాయబారి తల వంచకుండానే వచ్చాడు. అతను మోకరిల్లను కూడా లేదు. నుంచునే మాట్లాడాడు. యుద్ధానికి తయారుగా ఉన్నట్టు, వకీలు నియమావళి ప్రకారం ఆయుధాల్ని గుమ్మం దగ్గర వదిలివచ్చినా.

"పడమటి దేశాల పాలకా! జెంఘిజ్ ఖాన్ సామ్రాజ్యంనుంచి ఓత్రార్‌కి వచ్చిన మా వర్తకులు నీ చేవ్రాలుతో, మొహరు వేసి వున్న ఫర్మానాలని తీసుకుని వచ్చారని నీకు గుర్తు చెయ్యవచ్చాం మేం. ఆ ఫర్మానాలో మా వర్తకులకి వ్యాపార స్వేచ్ఛనిచ్చాడు. నీ పౌరుల్ని వాళ్లని ఆదరించమని ఆదేశించావు. కాని నువ్వు వాళ్లని క్రూరంగా మోసం చేశావు–వాళ్లంతా చనిపోయారు, వాళ్లసరుకుల్ని చేజిక్కించుకున్నావు. మోసమే హీన కార్యమైతే, ఇస్లాం అధినేత అలాంటిది చెయ్యడం ఇంకెంత హీనం?" అన్నాడతను.

ఖోరెస్మ్ షా తీవ్రంగా అరిచాడు:

"నీకు సిగ్గ లేదు. నాతో అలా మాట్లాడ్డానికి నీకెన్ని గుండెలు? మా సేవకులు చేసిన పనికి నన్నెలా నిందించగలవు?"

"ఓ ఘనమైన షా! అయితే, నీ ఉద్యోగి, ఓత్రార్ నగర పాలకుడు నీ శాసనాన్ని ధిక్కరించాడు. కాబట్టి ఈ దుష్ట సేవకుడు ఇనాల్‌చిక్ కెయిర్ ఖాన్‌ని మాకు అప్పగించు, మా ఖాఖాన్ అతనికి తగ్గ శిక్షని విధిస్తాడు. నువ్వు ఈ కోరికని తిరస్కరించావో యుద్ధానికి సన్నద్ధం

కా. అందులో నీ అతి సాహసవంతులైన మనుషులు కూలిపోతారు, బలమైన తాతారు బల్లేలు తమ గమ్యాన్ని అందుకుంటాయి".

ఈ బెదిరింపు మాటల ధ్వనికి ఖోరెస్మ్ షా గాఢ ఆలోచనలో మునిగిపోయాడు. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు, శాంతి కోసం గాని, యుద్ధం కోసం గాని జవాబు ఇప్పుడివ్వాలని తెలుసు. కాని ప్రస్తుతంలో యెక్కువ పొగరు మోత్తనంగా వుండే కిప్‌చాక్ ఖాన్‌లు అరవడం మొదలెట్టారు:

"వదలుబోతుని చంపండి! మనల్ని బెదిరించ ప్రయత్నిస్తాడు! గొప్ప పాదుషా! ఇనాల్‌చిక్ కెయిర్ ఖాన్ మీ అమ్మగారి మేనల్లుడు కాదూ? విశ్వాస రహితులు వేధించి హింసించడానికి అతన్ని వాళ్ల కప్పగిస్తావా? ఈ పొగరుమోతు తల తియ్యమని ఆజ్ఞ ఇయ్యి లేకపోతే మేం ఇతని సంగతి చూస్తాం".

ఖోరెస్మ్ షా పాలిపోయి, నెత్తురు చుక్క లేకుండా శవం మాదిరీ కూర్చున్నాడు. అతని పెదాలు వణికాయి. లోగొంతుకలో అన్నాడు:

"లేదు! ఇనాల్‌చిక్ కెయిర్ ఖాన్ నా విశ్వాసపాత్రుడైన సేవకుడు; అతన్ని అప్పగించను".

అప్పుడు ఒక కిప్‌చాక్ ఖాన్ మంగోలు రాయబారి దగ్గరికి వెళ్లి, గడ్డం పట్టుకుని, ఒక్కవేటుకి దాన్ని తెగ్గోసి ముఖంమీదకి విసిరాడు. రాయబారి ఇబన్ కెఫ్రెజ్ బోఘ్రా బలమైనవాడు, ధైర్యవంతుడు. కాన తిరిగి దెబ్బ కొట్టలేదు. వూరికే అరిచాడంతే:

"పవిత్ర గ్రంథంలో ఉంది: 'రాయబారికి హాని చెయ్యకూడదు' ".

ఖానులు అరిచారు:

"నువ్వు రాయబారివి కాదు, తాతార్ ఖాన్ పాదరక్షల ధూళివి! నువ్వు, ముసల్మానువి, మా శత్రువుల దగ్గర యెందుకు కొలువు చేస్తావు? నువ్వు ద్రోహివి; తాతార్ అశుద్ధానివి! నీ బాపతు వాళ్లకి నువ్వు ద్రోహం చేస్తున్నావ్".

కిప్‌చాక్ ఖానులు అతనిమీద విరుచుకు పడి పొడిచి చంపేశారు. అతని ఇద్దరు మంగోలు సహచరుల్నీ స్పృహ లేకుండా కొట్టేశారు.

ఖోరెస్మ్ షా భూభాగం నుంచి ఆ ఇద్దరు రాయబారుల్నీ చిరిగిన పీలికలతో గెంటేశారు. వాళ్ల గడ్డాల్ని కాల్చేశారు. వాళ్ల గుర్రాల్ని లాగేసుకున్నారు. వాళ్లు కాలినడకన దారి పట్టాల్సివచ్చింది.

# జెంఘిజ్ ఖాన్ ఆగ్రహం

రోజురోజూ ఖాఖాన్ గుడారం బయటికి వచ్చి నిరీక్షిస్తూ దూరంలోకంటా చూసేవాడు. తన గుడారం లోపలికి తిరిగివెళ్లి ఆస్థాన పండితుడు యెలు చూ చాయ్ చెప్పేది వింటూ పట్టు తివాసీలమీద కూర్చుండి పోయేవాడు. ఆయన పొడగరి బక్క పల్చగా ఉండేవాడు. చురుగ్గా, గుచ్చుకు చూసే కళ్లున్న మృదువైన చైనీయుడు.

"గుర్రంమీద కూర్చుని ప్రపంచాన్ని జయించవచ్చు, కాని జీనుమీదనుంచే ప్రపంచాన్ని పాలించడం అసాధ్యం. ధాన్యం నిలవ చేసే విషయం చూసేందుకు, జనం నుంచి సామాన్య స్థాయిలో సుంకాలు వసూలు చేసేందుకు, పన్నులు చెల్లించని వాళ్లందరికీ ఉరిశిక్ష విధించేందుకు ప్రతి ప్రాంతానికీ ఒక పాలెగాణ్ణి నియమించాలి, ఇలాంటి ప్రతి ప్రాంతంలోనూ ఇద్దరేసి నమ్మకస్తులైన వాళ్లని నియమించాలి. వాళ్లని వాళ్ల పాండిత్యాన్ని బట్టి యెంపిక చెయ్యాలి. ఒకతన్ని పాలెగానిగా, రెండో అతన్ని సహాయకుడుగా నియమించాలి. ఆదాయాన్ని పెంచుకుందుకు వ్యాపారస్తులమీద సుంకం వెయ్యాలి. సారాయిమీద, పులుపు ద్రాక్షమీద, ఉప్పుమీద, ఇనుము, వెండి, బంగారం గని పనిమీద పొలాలకి నీరు పెట్టుకునే నీటిసాగుమీద పన్నులు వెయ్యాలి".

"ఇదంతా తెలివిగానే ఉంది" అన్నాడు జెంఘిజ్ ఖాన్.

దూరంనుంచి బోలెడు ఈగల జోరులాగా బయ్‌మంటూ ధ్వని వినవచ్చింది. తర్వాత గంటలు గణగణ మనడం చెవుల బడింది. జెంఘిజ్ ఖాన్ బండగా వుండే చిన్న వేలుని యెత్తి, చదరంగా వుండే తన ముఖాన్ని గుమ్మంకేసి తిప్పాడు. మందమైన తమ్మి వున్న చెవిని రిక్కించి జాగ్రత్తగా విన్నాడు. అతని చెవికి బరువైన బంగారు పోగు వుంది.

"వార్తాహరులు, ఎక్కువ మందే ఉన్నట్టున్నారు..." అన్నాడుజ గుడారం బయటికి వెళ్లాడు.

చిన్న ధూళి మేఘం కనిపించింది. అది వేగంగా జాడలో బడి కదుల్తోంది.

ముగ్గురు రౌతులు హడావుడిగా శిబిరం వేపు వస్తున్నారు. వాళ్లు నల్లని యుర్త్‌ల దగ్గరికి వచ్చారు. అక్కడ ఓ గుర్రం కూలిపోయింది. ఆశ్వికుడు దాని తలమీదనుంచి దొర్లుకుంటూ పడిపోయాడు.

కాపలా వాళ్లు గుర్రాల కళ్లేలు పట్టుకుని వాటిని ద్వారం గుండా నడిపించుకు వచ్చారు. కాపలా వాళ్లు తీసుకువస్తూ వుండగా ఇద్దరు వార్తాహరులు పిల్ల గుర్రాలు, ఆడగుర్రాలు వున్న ఆవరణలోకి వెళ్లారు. అక్కడ జెంఘిజ్ ఖాన్ ఉన్నాడు.

ఖాఖాన్ ఓ తెల్ల ఆడగుర్రం పక్కన మడమలమీద ఆనుకుని కూర్చున్నాడు. కళ్లు సగం మూసుకుని తల్లి యెరుపు పొదుగులోకి ముట్టె తోస్తూ వున్న పిల్ల గుర్రంకేసి చూస్తూ ఉన్నాడు.

ఆ ఇద్దరు వార్తాహరులకీ పీలికలతో కట్లుకట్టి ఉన్నాయి. వాళ్ల ముఖాలు వాచిపోయి ఉన్నాయి. పుళ్లు పడి వున్నాయి. వాళ్లు ఎంత గుర్తుపట్టలేనట్టు మారిపోయారంటే ఖాఖాన్ వాళ్లకేసి తిరిగి అన్నాడు:

“యెవళ్లు మీరు?”

“ఘనమైన ఖాఖాన్! ఒకప్పుడు మేం నీ వేయిమంది దళవాయిలం. ఇప్పుడు శ్మశానం నుంచి తిరిగివచ్చిన వాళ్లం. ఖోరెస్మ్ షా మాతో సరదా తీర్చుకున్నాడు. మా గడ్డాల్ని కాల్పించేశాడు. అవే యోధుల గౌరవానికీ పౌరుషానికీ చిహ్నం”.

“ఇబన్ కెఫ్రెజ్ బోఘ్రా యెక్కడ?”

“నువ్వు ఆదేశించిన మాటల్ని షాతో ధైర్యంగా అన్నందుకు, ఖోరెస్మ్ పంది చుట్టూతా గురగురలాడుతూ ఉండే కుక్కలు చీల్చేశాయి అతన్ని.”

“ఏమిటి! నా రాయబారిని చంపేశారా? విధేయుడు ధైర్యవంతుడు అయిన ఇబన్ కెఫ్రెజ్ బోఘ్రాని?”

జెంఘిజ్ ఖాన్‌కి పిచ్చెక్కిపోయింది. ఇసకని తవ్వి తలమీద పోగు పెట్టుకున్నాడు. చేతులతో ముఖం బరుక్కున్నాడు. చెక్కిళ్లమీద కన్నీళ్లు ధారాపాతంగా కారాయి. దారిమీద యెడ్డిగా, యేవగింపుగా పరిగెత్తాడు. అతని చుట్టూతా ఉన్న అందరూ వెంటవెళ్లారు. ఈ అరుపులకి లేచి వచ్చిన వాళ్లతో వెనకబడ్డ వాళ్ల గుంపు యెక్కువైంది. యేం జరుగుతోందో వీళ్లల్లో యెవళ్లకీ తెలీదు.

ఖాఖాన్ వగురుస్తూ, ఆయాసపడుతూ గుర్రాల్ని కట్టేసిన చోటికి పరిగెత్తిపోయాడు. జీను వెయ్యని గుర్రాన్నొక దాన్ని రాట తాటినుంచి లాగేసి జూలు పట్టుకుని పైకి యెగిరి

దారమ్మటబడి యెకాయెకీని నీలం కొండ దగ్గరికి దూసుకుపోయాడు. యెలు చూ చాయ్, జెంఘిజ్ ఖాన్ కొడుకులు గుర్రాలమీదకి వురిక అతని వెనక్కాల దౌడు తీసికెళ్లారు.

వాళ్లు రాళ్ల పర్వతం దాకా దౌడు తీసి వెళ్లారు. ఖాఖాన్ పైన్ చెట్ల మధ్య ఉన్న కొండ అంచుదాకా వెళ్లాడు. దూరంనుంచి అతను కనిపిస్తున్నాడు. అతను టోపీ తీసేసి పటకా తీసి మెడ చుట్టూ వేసుకున్నాడు.* మెరిసే పెద్ద కన్నీటి చుక్కలు అతని చెక్కిళ్ల నల్లని చర్మంమీదనుంచి జారాయి, ఖాఖాన్ మట్టి రాసుకున్న ఆ చెక్కిళ్లమీదనుంచి.

"అనంతాకాశమా! ధర్మ పరాయణుల్ని కాపాడి, దుష్టుల్ని శిక్షించు! దుర్మార్గులైన ముసల్మానులని శిక్షించు. వింటున్నారా, ధైర్యవంతులైనా నా సైనికులారా! ముసల్మానులు నా రాయబారి ఉసున్‌ని, వ్యాపారం కోసం వెళ్లిన నాలుగు వందల యాభై మంది నిజాయితీపరులైన వర్తకుల్ని చంపేశారు. ముసల్మానులు వాళ్ల సరుకుల్ని కాజేసి, మమ్మల్ని పరిహాసించారు! నా రెండో దూత ఇబన్ కెఫ్రెజ్ బోఘ్రాని చంపేశారు వాళ్లు. పంది కళేబరం మీద బొచ్చుని కాల్చినట్టు మరో ఇద్దరు రాయబారుల గడ్డాల్ని కాల్చేసి దారీ తెన్నూలేని దిమ్మరుల్లాగా వాళ్లని తరిమేశారు, గుర్రాలని లాగేసుకున్నారు. దీన్ని భరించవలసిందేనా?" అని అరిచాడు.

"మమ్మల్ని ముసల్మానులమీదకి నడిపించు! వాళ్ల నగరాలని తగలెడతాం, అందర్నీ హతమారుస్తాం భార్యా బిడ్డలతో సహా. వాళ్ల పశువుల్ని, గుర్రాల్ని తీసేసుకుంటాం".

"వాళ్లకి మంచుకెరటాల్లు లేవు, బిగుసుకు పోయే హిమ తుఫాన్లు లేవు" అని జెంఘిజ్ ఖాన్ గొంతుక ఇంకా హెచ్చుతూ వుండగా అరిచాడు. "అక్కడ సర్వదా వేసవి కాలమే. తియ్యటి పుచ్చకాయలు అక్కడ పండుతాయి. ఒక రుతువులో మూడు పంటలు పత్తి, ద్రాక్ష, పచ్చిక బీటి గరిక పండుతాయి. అలాంటి ఆనందదాయకమైన భూమిని దుర్మార్గులైన ఇలాంటి ముసల్మాన్లకి వదిలెయ్యడం న్యాయమేనా? మనం వాళ్ల భూముల్ని లాక్కుందాం. వాళ్ల నగరాలని నేలమట్టం చేసేద్దాం. వాళ్ల నగరాలున్న చోట బార్లీ చల్లుదాం. వాళ్ల నగరాలున్న చోట మన బలమైన గుర్రాలు మేస్తాయి. మన ప్రియమైన భార్యా బిడ్డలు కాపరం వుండే మన యుర్తులు అక్కడ ఉంటాయి. మీరు సిద్ధంగా ఉన్నారా? మీరు ముసల్మాను భూభాగాలమీదకి వస్తారా?" అని అడిగాడు.

---

*దైవ నిర్ణయానికి పూర్తిగా లొంగిపోతున్న దానికి మంగోలులలో ఇది సూచన.

"వాళ్లు యెక్కడ వున్నారో చూపించు, ఖండఖండాలుగా నరికేస్తాం" అరిచారు తాతారులు.

"షామాన్‌లు లేకుండా కూడా 'చంద్రుడు శుభం'గా ఉన్నట్టే కనిపిస్తోంది నాకు. పడమటికి సైన్యాన్ని నడిపించే వేళ ఇదే" అని జెంఘిజ్ ఖాన్ గట్టిగా అరిచాడు. వెనక్కి తిరిగి అతను మెల్లిగా కొండపైకి యెక్కడం మొదలుపెట్టాడు. అంగరక్షకులు వెనక వెళ్లారు. జెంఘిజ్ ఖాన్ తన ఆలోచనల్లో ఒంటరిగా వుండాలనుకున్న చోట శిఖరాన్ని పరివేష్టించి ఉన్నారు.

# ఉత్తరం రాయడం యెలా

"జెంఘిజ్ ఖాన్‌కి మంగోలు భాష
తప్ప మరోటి తెలీదు, రాయడం తెలీదు".
(అకడెమీషియన్ వి.వి.బార్‌టోల్డ్)

రాత్రి వేళకి ఖాఖాన్ గుడారానికి తిరిగివచ్చి ముఖ్య దళవాయిల సమావేశం యేర్పాటు చేశాడు. వాళ్లల్లో కొంత మంది జెంగిజ్ ఖాన్ యౌవ్వనం రోజుల నాటి పాత మిత్రులు. ఆ రోజులు విజయాలతో నిండినటువంటివి. వాళ్లిప్పుడు వంగిపోయి, పండిపోయి, ఈచుకుపోయి, చెక్కిళ్లమీద చర్మం వేలాడుతూ వున్నారు. మిగతావాళ్లు యువకులు. సాహసకృత్యాలు చెయ్యాలన్న కాంక్షతో రగిలేవాళ్లు. నిశితంగా చూసే ఖాఖాన్ కళ్లు వాళ్లని పైకి తెచ్చాయి. ప్రతి ఒక్కడి కింద పదివేల మంది ఆశ్వికులు ఉన్నారు. యే క్షణంలో యుద్ధం వచ్చినా తయారుగా వుండే సైన్యం వాళ్లది.

దగ్గరగా వృత్యాకారంలో వాళ్లు తివాసీలమీద కూర్చున్నారు. జెంఘిజ్ ఖాన్ వాళ్ల కంటే ఎత్తుగా బంగారు సింహాసనంమీద కూర్చున్నాడు. ఆ సింహాసనం వీపు చైనా కళాకారులు శోభాయమానంగా తీర్చిదిద్దారు. దానిమీద "శుభం కలిగించే మహా కళాలు" పెనవేసుకుని, తమ పొడుగాటి తంతులతో ముంజె రూపంలో ఉన్న "ముత్యం"తో ఆడుకుంటున్నట్టు ఉంటాయి. ఆ సింహాసనం చేతులు కోపంగా చూసే రెండు పెద్ద పులుల ఆకారంలో ఉన్నాయి. బంగారుతో మలిచిన ఈ సింహాసనాన్ని జెంఘిజ్ ఖాన్ చైనా చక్రవర్తి ప్రాసాదంనుంచి తీసేసుకున్నాడు. తన దండయాత్రలన్నిటిలోనూ కూడా తీసికెళ్లేవాడు.

సింహాసనం కుడి వేపున జెంఘిజ్ ఖాన్ ఇద్దరు తమ్ముళ్లు, అతని కడగొట్టు పిల్లలు ఉగేదీయ్, తులీలిద్దరూ ఉన్నారు. యెడమ వేపున ఖాఖాన్ నవవధువు కులాన్ ఖాతూన్ వుంది. మణికట్టునుంచి భుజం దాకా పెట్టుకున్న బంగారు వంకీలతోటి, రాళ్లు పొదిగిన హారాలతోటి మెరిసిపోతోంది. వాళ్లకి బంగారు పాత్రల్లో భోజనాన్ని, కుమిస్‌ని వడ్డిస్తూ, బంగారు ఛషకాల్లో మత్తెక్కించే యెర్ర ద్రాక్షసారాయిని అందిస్తూ చైనా పరిచారకులు చప్పుడు చెయ్యకుండా వాళ్ల వెనక వరసలో తిరుగుతున్నారు.

ఖాఖాన్ యెడమ వేపున, పడుచు పెళ్లాం పక్కన ఇద్దరు రాయబారులు కూచున్నారు – ఆషగంబు, బలవంతుడైన తంగుట్ పాలకుడు బుర్ఖాన్ ప్రతినిధి; దక్షిణ చైనా సుంగ్ చక్రవర్తి దూత మెంగ్ హుంగ్ కూర్చున్నారు. యీ సుంగ్ చక్రవర్తికి ఉత్తర చైనా చిన్ చక్రవర్తి అంటే ద్వేషం. అంచేత మంగోలులతో స్నేహ సంబంధాన్నీ కోరాడు.

ఈ విందులో జెంఘిజ్ ఖాన్ తన బంగారు పాత్రల వైభవాన్ని చూపించీ, రకరకాల భోజన పానీయాలని ఇచ్చీ, ఔదార్యాన్ని ప్రదర్శించీ అతిథులకి ఆశ్చర్యం కలిగించాడు. పెద్ద పెద్ద బంగారు పళ్లెల్లో లేత గుర్రపు వేపుడు మాంసం, అడివిలేడి మాంసం, పచ్చిక బీటి పక్షి మాంసం ఉన్నాయి. మధ్య మధ్యన వింత వింత మిఠాయిలున్నాయి. వీటిని చైనా వంటవాడు చేశాడు. కుమిస్, అయిరాన్, పర్షియన్ యెర్ర మద్యం, పుచ్చకాయల గింజలతో చేసిన చైనా యెర్ర మద్యం ఉన్నాయి. యెన్నో రోజులు ఆశ్వికులు ఉరకలు పరుగులు తీస్తూ గుర్రాలమీద అంచెలుగా తీసుకువచ్చిన అరుదైన దక్షిణాది పళ్లు వున్నాయి. ఈ యెడారి మైదానంమీద, పులులు వేటాడుతూ వుంటే అడివి గుర్రం మందలు సంచరించే ఇలాంటి చోట, ఆ నేపథ్యంలో విందు వింతగా భాసించింది.

విందు బాగా జరుగుతూండడంతోటి సంతుష్టి చెంది జెంఘిజ్ ఖాన్ సింహాసనంమీద కూర్చున్నాడు. కాళ్లు వెనక్కి మడుచుకున్నాడు. చప్పుడు చేస్తూ నమిలి, ఓ ప్రత్యేక పళ్లెంలో నుంచి వేపుడు మాంసం తీసుకున్నాడు. ఆ పళ్లేన్ని అతని ముందు ఓ చైనా నౌకరు మోకరిల్లి పట్టుకున్నాడు. బాగా వున్న మాంసం ముక్కల్ని ఖాఖాన్ తమ ప్రత్యేకం ఆదరం చూపించవలసిన అతిథుల నోట్లో పెట్టేవాడు.

జెంఘిజ్ ఖాన్ చిరచిరలాడుతూ కఠినంగా చైనా రాయబారి మెంగ్ హుంగ్ వేపు తిరిగాడు. అతను చాలా తక్కువ లాగుతున్నాడని అంటు ఆరు పెద్ద ఛషకాలు ఒక దానిమీద ఒకటి తాగాలని అతన్ని ఆజ్ఞాపించాడు. ఆ రాయబారి మారు మాట్లాడకుండా తాగాడు, అతని గౌరవార్థం ఇతర అతిథులంతా పాటలు పాడారు. ఆరో ఛషకం తర్వాత చైనా రాయబారి వెనక్కి పడి నిద్రలోకి జారిపోయాడు. జెంఘిజ్ ఖాన్ వెంటనే విప్పారి, ఉల్లాసంగా అన్నాడు:

"నా అతిథి తప్ప తాగాడు. అంచేత ఇతను నా నేస్తం, నా హృదయంలో భాగం. నా అతిథిని భద్రంగా అతని గుడారానికి తీసుకెళ్లండి. దారిలో అతను దాటే నగరాల పాలకుల ఇతనికి మహా ఆదరం చూపించాలి. అతనికి సారాయి ఇవ్వాలి, కావలసినన్ని విందుల్ని, తేనీటిని ఇవ్వాలి. మంచి వాయిద్యగాళ్లని వేణువులతోటీ, తంబురాలతోటీ వాయిస్తూ దారిలో వెళ్లమనండి. చైనా అతిథి దేని కోసమూ కరువు పడకూడదని మా కోరిక".

నిద్రపోయే రాయబారిని తీసుకుపోయాక జెంఘిజ్ ఖాన్ యెలు చూ చాయకేసి తిరిగి అన్నాడు:

"నా రాయబారి హంతకుడు ఖోరెస్మ్ షా మహమ్మద్‌కి ఉత్తరం రాశావా?"

ఖాఖాన్ ఆస్థాన పండితుడు మృదువుగా అన్నాడు:

"ఇద్దరు మహా నేతల యుద్ధం కోసం సన్నద్ధమవుతూ ఉంటే దానికి తగ్గట్టుగా నేనెలా రాయగలను? జయించిన భూభాగంమీద యెలా ఓ పద్ధతి తీసుకురావాలో, యెలా నీ శాసనాలు అమలు జరగాలో చూడ్డం మట్టుకే నాకు తెలుసు. అంచేత అనుభవజ్ఞుడైన రాతగాడు ఇస్మాయిల్ ఖోజ ఉయిగర్ ఉత్తరాన్ని రాశాడు".

"అతనెక్కడ?"

ఖాఖాన్ రాజ్య ముద్ర అధికారీ, ముసలి కార్యదర్శీ అయిన ఇస్మాయిల్ ఖోజ సింహాసనందాకా వెళ్లి, చుట్టిన కాగితం పత్రాన్ని తన తలమీద ఉంచుకుని మోకరిల్లాడు.

"చదువు!"

ఇస్మాయిల్ ఖోజ చదవడం మొదలెట్టాడు:

"శాశ్వతాకాశం నన్ను సర్వ ప్రజలకీ ఖాఖాన్‌ని చేసింది. గత యేడేళ్లలోనూ నేను కనీవినీ యెరగని పనులు చేశాను. ఇలాంటి సామ్రాజ్యాన్ని ప్రాచీన కాలంనుంచీ యెవళ్లూ యెరుగరు. లొంగి వుండని పాలకుల్ని భీతావహుల్ని చేస్తూ నేను నాశనం చేసేస్తాను. నా సైన్యం వచ్చినప్పుడు అతి దూర ప్రాంతాలు కూడా లొంగి పడి ఉంటాయి. అంచేత, నువ్వు యెందుకని నన్ను గౌరవంగా చూడవు? జాగ్రత్త! – లేదా నువ్వు కూడా నా ఆగ్రహ పవనం చూడాలనుకుంటున్నావా?"

జెంఘిజ్ ఖాన్ సింహాసనంమీదనుంచి గెంతి, ఇస్మాయిల్ ఖోజ చేతిలోనుంచి అతనికి పూర్తిగా చదివే వ్యవధి ఇవ్వకుండానే పత్రాన్ని లాగేశాడు.

"యెవళ్లకీ ఉత్తరం? నాతో మాట్లాడ తగ్గ పాలకుడిగా లేకపోతే పుచ్చు కుక్క కొడుక్కా? శత్రువులతో మాట్లాడే పద్ధతి ఇదేనా? నువ్వూ ముసల్మానువే, నువ్వు ముసల్మాన్ ఖాన్ ముందు తోక ఆడిస్తావు. తనంటే నేను భయపడుతున్నానని షా మహమ్మద్ అనుకోవాలనుకుంటున్నావా?"

తివాసీలోకంటా ముఖం దూర్చేసి, భయంతో గజగజ వణికిపోతూ ఇస్మాయిల్ ఖోజ నేలమీద పడిపోయాడు. ఖాఖాన్ అతన్ని పటకా పట్టుకుని లేపి, గుడారం ద్వారం దాకా ఈడ్చుకుపోయి, ఈసడిస్తూ కాలితో తన్ని బయటికి గెంటేశాడు. వృద్ధ పండితుడు యెలు చూ చాయ పక్కనే కనిపించాడు. వృద్ధ పండితుడు మెత్తగా అన్నాడు:

"నీ రాతగాడి నెరిసిన గడ్డం చూడు! యెన్నేళ్ల కొలువు అతను చేశాడో గుర్తుచేసుకో. నీ పిల్లలకీ, మనమలకీ అతను చదువు సంధ్యలు నేర్పాడు. నమ్మిన సేవకుణ్ణి ఇలా చూడ్డం తగదు...."

జెంఘిజ్ ఖాన్ నిటారుగా భుజాలు యెత్తాడు.

"ఇస్మాయిల్ ఖోజ బానిసలాగా రాసాడు! గర్వంగా మాట్లాడలేదు. మా మనవలకి చదువు సంధ్యలు చెప్పుకోనియ్యమను, ప్రజా పాలకులతో మాట్లాడ ప్రయత్నించవద్దని చెప్పు".

ఖాఖాన్ మళ్లీ గుడారంలోకి వెళ్లి కాళ్లు పైకి పెట్టుకుని సింహాసనం యెక్కాడు. చేతుల్ని కుడి మోకాలిమీద కట్టుకుని, కాళ్లు కింద ముడుచుకుని చాలా సేపు కూర్చుండిపోయాడు. అతని ఆకుపచ్చ కళ్లు విప్పారేవి, మళ్లీ కుంచించుకుపోయేవి. కొత్త రాతగాడు తెల్లని కాగితం తీసుకుని సింహాసనం దగ్గరికి వచ్చాడు. యెలు చూ చాయ అతనికి రాసేందుకు రెల్లు కలం అందించాడు. కాని జెంఘిజ్ ఖాన్ మౌనంగా వుండిపోయాడు. కోపంగా వున్న కళ్లని ముడిచి ఒకే దిశలో తదేకంగా చూస్తూ వుండిపోయాడు. తర్వాత తన ముందు మోకరిల్లి వున్న రాతగానికేసి తిరిగి అన్నాడు:

“ఇలా రాయి: ‘నువ్వు యుద్ధం కావాలని కోరుకున్నావ్, ఇదిగో నీకు యుద్ధం’ ”.

స్వప్నంలోనుంచి మెలుకువ తెచ్చుకున్నట్టుగా జెంఘిజ్ ఖాన్ తన బంగారు ముద్ర తీసి, యెలు చూ చాయ చేతుల్లో నుంచి నీలం రంగు* లాక్కుని పులిమి, దాన్ని పత్రం మీద అదిమాడు. పత్రం పైన, ముద్రలోపల ఈ రాత ఉంది:

దివిలోన దేవుడు,
భువిలోన ఖాఖాన్
దైవబల సమన్వితుడు,
తారల నేలేవాడు.
సకల ప్రజానీకాన్ని
పాలించేవాడి ముద్ర.

నోరు మెదపకుండా కూచున్న అతిథులతో గుడారం నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దాన్ని భంగిస్తూ దాడికి దూసుకుపోయే మంగోలు కేక హఠాత్తుగా బయ్‌మంది:

“హోయ్ య్ య్!...”

గుడారం వెనకాల కట్టేసిన జెంఘిజ్ ఖాన్ అభిమాన పంచకల్యాణి గుర్రాలు తమ యజమాని కంఠం వినగానే జవాబుగా సకిలించాయి. ఒక్క క్షణంలో, శిబిరం అంతటా ఉన్న మంగోలు గుర్రాలు ఆ పిలుపుని అందుకున్నాయి.

యెలు చూ చాయ రెండు చేతులతోటీ ఆ పత్రాన్ని జాగ్రత్తగా అందుకున్నాడు. జెంఘిజ్ ఖాన్ పొడి ముక్కలతో కఠోరంగా అరిచాడు:

“ఉత్తరాన్ని పంపండి! ముసల్మాన్ సరిహద్దుకి! వార్తాహరుడికి తోడు ఇవ్వండి! మూడు వందల మంది ఆశ్వికుల్ని!”

* ఇతర దేశ సార్వభౌములని ఉద్దేశించినప్పుడు జెంఘిజ్ ఖాన్ నీలం ముద్రని వాడేవాడు. మామూలు పత్రాలకి యెరువు ముద్ర వాడేవాడు.

మళ్లీ అతిథులకేసి తిరిగి, ఖాఖాన్ మళ్లీ ఉల్లాసభరితుడయ్యాడు.

"విందుని కొనసాగిద్దాం" అన్నాడు. "మళ్లీ హాయిగా కబుర్లు చెప్పుకుందాం. మన మనసులు ముసల్మాన్ నగరాల్లో త్వరలోనే పరవశిస్తాయి. అక్కడ మనం హుషారుగా వుంటాం! గుర్రాల పొగరేగే చెమటతో దున్నిన పొలాలమీద మబ్బులు కమ్మడం, మగాళ్లు భయంతో పరిగెత్తిపోవడం, ఆడవాళ్లు అడివి జంతువుల్లా మన తోలు ఉచ్చు తాళ్ల చివర అరవడం నాకప్పుడే కనిపిస్తోంది. నదులు సారాలాగా యెర్రగా ప్రవహిస్తాయి. దగ్ధమయ్యే గ్రామాల వెలుగులో పొగ బారిన ఆకాశం ప్రకాశిస్తుంది".

అతను కళ్లు ముడుచుకుని, మందమైన చిన్న వేలిని యెత్తి శిబిరం అంతా ఒక దానికొకటి సమాధానం చెప్పుకుంటూ గుర్రాలు చేసే సకిలింపు విన్నాడు.

అతిథులు గుసగుసలాడుకున్నారు: "యుద్ధం ఇదిగో!" గొప్ప నాయకులకి తగ్గట్టుగా బంగారు ఛషకాల్ని టాకించుకున్నారు ఒకళ్లకొకళ్లు విజయాన్ని కాంక్షిస్తూ. రాబోయే మహత్తర దినాల గురించి మాట్లాడుకున్నారు....

అయిదవ భాగం

# అజ్ఞాత ప్రజల దాడి

# తనని తాను రక్షించుకోలేని వాడు చనిపోతాడు

"మంగోలు దాడి తర్వాత ప్రపంచం
కల్లోలమైపోయింది, ఇథియోపియన్ల జుట్టులాగా.
మనుషులు తోడేళ్ల మాదిరీ అయిపోయారు".
(సైది, 13వ శతాబ్దం)

జెంఘిజ్ ఖాన్ నుంచి యేడు మాటల కఠినమైన ఉత్తరాన్ని అందుకోగానే, ఖోరెస్మ్ షా మహమ్మద్ తన కొత్త రాజధాని అయిన సమర్‌కండ్ చుట్టూ హడావుడిగా దట్టమైన గోడని కట్టెయ్యమని ఆజ్ఞాపించాడు, బ్రహ్మాండమైన నగరం పొడుగు వెడల్పు కొలతల్ని లక్ష్య పెట్టకుండా. ఆ గోడ పొడుగు సుమారుగా పన్నెండు ఫర్‌సాక్*లుంటుంది.

పన్నులు వసూలు చేసేవాళ్లని, ప్రస్తుత సంవత్సరపు సుంకాల్ని వసూలు చెయ్యడమే దుర్ఘటం అయినా, మూడేళ్ల సుంకాల్ని ముందుగానే పిండుకురమ్మని సామ్రాజ్యపు అన్ని వేపులకీ పంపాడు.

విలుకాళ్ల దళాన్ని యేర్పాటు చెయ్యమనీ షా ఆదేశించాడు. ఆ విలుకాళ్లు తమ ఆయుధాలతోటి, కొన్ని రోజులకి సరిపడా ఆహారంతోటీ గుర్రాలమీద తమ తమ యుద్ధ స్థావరాల్లో కలుసుకోవాల్సి ఉంది.

ఆఖరిగా సైహూన్ నది (సిర్‌దార్య) తూర్పు తీరాన ఉండే గ్రామాలని కార కితాయ్ తూర్పు సరిహద్దుదాకా, మంగోలులు ప్రత్యక్షమయే చోటు దాకా, తక్షణం తగలబెట్టెయ్యమని ఆజ్ఞ చేశాడు. షా ఆజ్ఞ మేరకి ఆ గ్రామాల వాసుల్ని తరిమేశారు. మొత్తం ఆ ప్రాంతమంతా బీడైపోయింది. దాంతోటి మంగోలులకి తిండిగాని నీడగాని ఉండవు. కాని ఆగ్రహంతో

---

* అంటే సుమారుగా 84 కిలోమీటర్లు, 55 మైళ్లు.

కుతకుతలాగే ఆ జనాభా కార కితాయ్‌కి పారిపోయారు. మగాళ్లు అక్కడ మంగోలు సైన్యంలో చేరారు.

మహాకళ సంవత్సరం (1220) ఆరంభంలో మహమ్మద్ తన ముఖ్య దళవాయిల, ముఖ్య ఆధ్యుల, పాలెగాళ్ల, నెరిసిన గడ్డం ఇమామ్‌ల అసాధారణ సమావేశాన్ని పిలిచాడు.

కిప్‌చాక్ మైదానాలమీద దాడి తర్వాత, సమర్‌కండ్ తిరుగుబాటు అణిచివేత తర్వాత అతన్ని "అభినవ సికందర్" అనీ, "యోధ మహమ్మద్" అనీ పిలవడం మొదలెట్టారు. అలాంటి వాడినుంచి ఆశ, ధైర్యం ఉద్దీప్తం చేసే సాహసవంతమైన, తెలివైన నిర్ణయాలు వస్తాయని అందరూ ఆశించారు. దగ్గరసా గుమిగూడి తివాసీలమీద కూర్చుని, షా రాక కోసం చూస్తూ, అతని యుద్ధ అనుభవం గురించీ, దేశాన్ని అతను కష్టాల్లో నుంచి బయటపడవేసి వేగంగా విజయానికి యెలా నడిపిస్తాడో దాన్ని గురించీ వాళ్లు మాట్లాడుకున్నారు.

ఖోరెస్మ్ షా సభా మందిరంలోకి వచ్చాడు. మౌనంగా అతి గూఢంగా ఉన్నాడు. అతను కాళ్లు కిందకి మడుచుకుని బంగారు సింహాసనంమీద కూర్చున్నాడు. ముఖ్య ఇమామ్ ప్రార్థన చేశాడు. ఇలా ముగించాడు: "అల్లా పాదుషా అభ్యుదయం కోసం, కీర్తి కోసం కటాక్షలబద్ధ వైభవభరిత ఖోరెస్మ్ భూముల్ని కాపాడు గాక!" అందరూ చేతులు యెత్తారు. వేళ్ల అంచుల్ని గడ్డాలమీద రాసుకున్నారు. షా అన్నాడు:

"మీలో ప్రతి ఒక్కరినుంచీ సహాయం ఆశిస్తున్నాను. యే చర్యలు శ్రేష్ఠమని అనుకుంటున్నారో ప్రతి ఒక్కళ్లూ చెప్పండి".

యెంతో వైదుష్యంతో భూషితుడైన గొప్ప ఇమామ్, వృద్ధ షిహుబుద్దీన్ ఖివాకి మొదట మాట్లాడాడు. ఆయన విశ్వాస స్తంభం అనీ, సామ్రాజ్యపు మూలకంబం అనీ ప్రసిద్ధి పొందాడు.

"మసీదు ఉన్నత వేదిక పైనుంచి నేను సర్వదా చెప్పేదాన్నే ఇక్కడా తిరిగి చెప్తున్నాను. ప్రవక్త ప్రామాణిక హాడిథ్ (ప్రవక్త ప్రవచనాలు) – ఆయన పేరు పూజనీయమూ వైభవభరితమూ అగుగాక! – చెప్తోంది: 'తన జీవిత రక్షణ కోసమూ, వస్తువుల రక్షణ కోసమూ చంపేవాడూ అమర జీవి, షహీద్ అవుతాడు'. ఇప్పుడంతా శాంతి చీకటినుంచి బయటపడి, విధుయతా మార్గంలో నడిచి సాహస కరవాలంతో చింతల సైన్యాల్ని ఛిద్రంచెయ్యాలి.

"మేమంతా రణరంగంలో మా జీవితాల్ని ఒడ్డడానికి సిద్ధంగా వున్నాం" అని సభ మొత్తం అరిచింది.

"కాని మీ సలహా యేమిటి?" అని షా అడిగాడు.

"నువ్వు – మహా నాయకా, నువ్వు అభినవ సికందరా!" అన్నాడు ఇమామ్. "నీ అసంఖ్యాక సైన్యాన్ని సైహూన్ తీరం దగ్గరికి నడిపించు. అక్కడ అటో ఇటో తేలిపోయే పోరులో పాషండులైన మంగోలులతో తలపడు. నువ్వు ఆ సైన్యంమీద నీ సైన్యంతోటి బలంగా,

శక్తులు అలవకుండా వున్నప్పుడే విరుచుకుపడతావు. వాళ్లు ఆసియా యెడారులమీద దీర్ఘ ప్రయాణం చేసి వచ్చిన బడలినుంచి యింకా తేరుకోరు అప్పటికి".

మహమ్మద్ కిందకి చూసి యేమీ అనలేదు, తర్వాత వున్నతన్ని మాట్లాడమన్నాడు.

ఓ కిప్‌చాక్ ఖాన్ అన్నాడు:

"మంగోలుల్ని మన సామ్రాజ్య సరిహద్దుల్లోకి రానివ్వడం ముఖ్యం. మనకి తెలిసిన భూమి కావడంతో సులభంగా వాళ్లని నాశనం చెయ్యగలం".

సమర్‌కండ్, బుఖారాలకి యెత్తైన ప్రాకారాలున్నాయి కాబట్టి వాటి రక్షణ వాటికే వదిలేసి, విశాలమైన జైహున్ (అమూదార్య) నది తీరంమీద తమ రక్షణని లగ్నం చెయ్యాలనీ, ఆ నది మంగోలులు ఇరాన్‌లోకి యిక ముందుకు రాకుండా సహజ అవరోధంగా వుంటుందనీ ఇతర కిప్‌చాక్ ఖాన్లు ప్రతిపాదించారు.

"ఈ పాశవిక దిమ్మరుల్ని నేనెరుగుదును" అన్నాడు ఒక ఖాన్. "వాళ్లు ఓ దేశం గుండా పోతారు, దాన్ని కొల్లగొట్టుకుంటారు. కాని అక్కడ యెక్కువ కాలం ఉండరు. వాళ్లు వేడి తట్టుకోలేరు. వాళ్లకీ వాళ్ల గుర్రాలకీ చలి వాతావరణం అలవాటు. మంగోలులు దేశంమీదకి ముసురుకు వచ్చినప్పుడు మనం మన ప్రియమైన పాదుషాని – ఆయన నూట ఇరవై యేళ్లు పాలించుగాక! – కాపాడుకుందాం, హిందూకుష్ శిఖరాలు దాటి సుదూర ఘజనీకి వెడదాం. అక్కడ ఇంకో పెద్ద సైన్యాన్ని పోగు చెయ్యగలం మనం. అవసరం అయితే ఇంకా అటు వేపు మళ్లవచ్చు. హిందూ దేశం దాకా కూడా. ఈ లోపున మంగోలులు కొల్లగొట్టడంతోటి తృప్తిపడతారు, తిరిగి తమ పచ్చిక బీళ్లకి వెళ్లిపోతారు".

"పిరికివాడి మాటలు" అన్నాడు తైమూర్ మాలిక్.

మహమ్మద్ తన కొడుకు జలాలుద్దీన్‌కేసి తిరిగి అన్నాడు:

"నీ సలహా యేమిటి?"

"నేను నీ సైనికుణ్ణి, నీ ఆజ్ఞ కోసం చూస్తున్నాను".

"నువ్వు, తైమూర్ మాలిక్?"

"విజయం దాడి చెయ్యడంమీదే ఆధారపడి ఉంటుంది! తన భద్రతనే చూసుకునేవాడు, పతనమైపోతున్నాడన్న మాట. బలహీనుడైనా ధైర్యంగా దాడి చేసేవాడు కోపఘూర్ణితమైన పెద్ద పులిని జయిస్తాడు. కొండల వెనక్కి తగ్గి వెళ్లిపోయేవాడు కాళ్ల మధ్య తోక ముడిచినట్టే శత్రువుని ముఖా ముఖీ కలుసుకోవడానికి భయపడుతున్నాడన్న మాట. నేనెప్పుడనగానో నిన్ను అర్థించాను: తాతార్ వేగులు నక్కుతూ వుండే చోటికి నన్ను వెళ్లనీ – నా బాణం సరాసరి దూసుకుపోతుందో లేదా నా కత్తి తుప్పు పట్టిపోయిందో త్వరలోనే చూద్దాం" అన్నాడు తైమూర్ మాలిక్.

“అలాగే కానీ” అన్నాడు మహమ్మద్. “త్వరలోనే కొండ కనుమల్లో మంచు కరిగిపోతుంది. మంగోలులు పర్వతాలమీదనుంచి కిందికి ఫర్గానా లోయలోకి దిగుతారు. నీ కరవాలాన్ని వాళ్ల తలలమీద ప్రయోగించు. నిన్ను ఖోజెంట్ నగర సైన్యాల అధిపతిగా నియమిస్తున్నాను”.

ప్రతి వాళ్లూ కిందికి చూసి తమ వేళ్లు జత చేసుకున్నారు. షాకి తైమూర్ మాలిక్ కుండబద్దలు కొట్టినట్టుగా మాట్లాడ్డంతోటి కోపం వచ్చిందని తెలుస్తూనే ఉంది. తైమూర్ మాలిక్ యుద్ధంలో ఉరవడిగా వున్నట్టుగానే మాటలోనూ మినహాయింపులుంచుకోడు. ఖోరెస్మ్ షా వాగ్ధాటిలోకి స్తోత్రగీతాల మధువుని యెన్నడూ పోసి యెరగడు. ఖోజెంట్‌లో యేదో మామూలు చిన్న దళం ఒకటుంది. తైమూర్ మాలిక్‌లాంటి అతిరధుడికి ఓ వూరూ పేరూ లేని దుర్గాన్ని రక్షించడం గౌరవం కాదు. కాని తైమూర్ మాలిక్ మాటలు కశాఘాతంగా తగిలి మహమ్మద్ అన్నాడు:

“విజయం దాడిలోనే ఉంటుందని తైమూర్ మాలిక్ అంటున్నాడు. కాని యుద్ధానికి గుడ్డి సాహసంకంటే యెక్కువ కావాలి – తెలివి! ఒక్క నగరాన్ని కూడా చిన్న చూపు చూసి, రక్షణ లేకుండా వదలను. మంగోలులు లేదా తాతార్లు గొర్రెతోళ్లు కప్పుకుని మన యెండకి తట్టుకుంటారనీ, ఇక్కడ యెక్కువ కాలం వుంటారనీ కూడా అనుకోను. శాంతియుత ప్రజానీకానికి అత్యుత్తమ రక్షణ మన అభేద్యమైన దుర్గాల గోడలూ–”

“మీ బలమైన హస్తమూ! మీ యుక్తీ” అని గులాములుగా వుండే ఖాన్లు అరిచారు.

“సహజంగానే నా సారథ్యంలో నడిచిన సైన్యం తాతార్ మార్గంలో కఠినమైన, కదిలించరాని శిలగా ఉంటుంది” అన్నాడు మహమ్మద్. “ధైర్యవంతుడైన ఇనాల్‌చిక్ కెయిర్ ఖాన్ ముట్టడించిన ఓత్రార్‌ని అయిదు నెలలు కాపాడి, ఆ రకంగా మంగోలులు ముందుకు రాకుండా ఆపలేదా? అతను పట్టువదలకుండా వాళ్ల దాడులన్నిట్నీ తిప్పికొడతాడు; ఇరవై వేల మంది పరాక్రమవంతులైన కిప్‌చాక్ బలగాల్ని అతనికి పంపే దూరదృష్టి నాకు వుండబట్టి....”

“కెయిర్ ఖాన్‌కి జోహార్!” అని ఖాన్‌లు అరిచారు.

“ఇస్లాం సైన్యంతో పోలిస్తే తాతారు సైన్యం చీకట్లో పొగ దమ్ములాంటిదని నమ్మకస్తులైన అభిజ్ఞులు చెప్పగా విన్నాను. దానికి భయపడ్డం యెందుకు? ప్రజలతోబాటుగా సమర్‌కండ్‌కి లక్షా పది వేల సైన్యాన్నీ, ఐచ్ఛిక దళాల్ని లెక్కలోకి తీసుకోకుండా, చూడ భయంకరంగా ఉండే ఇరవై యుద్ధ గజాలనీ ఇస్తాను. బుఖారాలో యాభై వేల మంది ధైర్యవంతులైన యోధులున్నారు. మిగతా నగరాలన్నిటికీ కూడా ఒకో దానికీ ఇరవై ముప్పై వేల మంది ఉన్నారు. ఈ దుర్గాలన్నిటితోటీ తలబద్దలు కొట్టుకున్నాక జెంఘిజ్ ఖాన్ సైన్యాల్లో మిగిలేది

యేం వుంటుంది? కొత్త సైన్యాలు రావు, అతని సైన్యం వేసవి కాలంలో మంచులాగా కరిగి చక్కాపోతుంది..."

"ఇన్‌షాల్లా! ఇన్‌షాల్లా (తథాస్తు)! అజేయుడైన నాయకుడి అసలు తెలివి యిదీ!" అంటూ ఖాన్‌లు అరిచారు.

దివాన్ అర్జ్ అధినేత వచ్చి షాకి ఓ పత్రం అందించాడు. షా ఆజ్ఞ మేరకి ఓత్రార్‌కి పంపించిన ఇరవై వేల మంది కిప్‌చాక్‌లు ఫిరాయించి మంగోలుల పక్షం చేరి పోయారట. మంగోలు శిబిరాలగుండా అతికష్టంమీద చొచ్చుకుపోయిన ఒక ద్రిమ్మరి దర్వీషునుంచి అందిన వార్తగా అందులో ఈ నివేదిక ఉంది. అందరూ భయపడిపోయి షాకేసి చూశారు, అతని ముఖం చూసి ఆ పత్రంలో వున్న వార్త చెడ్డదో మంచిదో వూహించ ప్రయత్నించారు. షా కనుబొమలు ముడిచి, మెల్లిగా అన్నాడు:

"చాలు! ఇక వేళ దాటి పోనివ్వడానికి లేదు". అతను లేచాడు. ఇమామ్ ప్రార్థన చదవడం విని, అంతఃపురంలోని అంతర కక్ష్యల్లోకి వెళ్లిపోయాడు.

# కుర్బాన్ కిజిక్ సైనికుడవడం

"హోయ్! ఇదిగో! కుర్బాన్ కిజిక్ రా, విదూషకా! నేలని ఇక గీరద్దు చాలు నీకు! ఖోరెస్మ్ షా నిన్ను తన మహాబలగాల ప్రధానిని చేస్తున్నాడు!" గుర్రం దిగకుండానే రౌతు కమ్చీకోల పిడితో కుర్బాన్ రైతు ఇంటి కురచ వంకర తలుపుమీద మోదాడు.

"మనకి కొత్త కష్టం యేం వచ్చిపడింది?" అని కుర్బాన్ తల్లి అరిచింది. ఆమె ముసల్ది. వంగిపోయింది. యెండిపోయింది. కాయగూరల మడిలోనుంచి హడావుడిగా కుంటుతూ వచ్చింది.

"కుర్బాన్‌ని బయటికి తగలడమను! యేం చేస్తున్నాట్ట? పట్టపగలు ముసుగు తన్నేడా? సారా బాగా పట్టించాడా?"

"మాకు సారాకి వేళ యెక్కడిది నాయనా?ll అని ముసల్ది రాగం తీస్తూ అరిచింది. "నీళ్లు వస్తాయేమోనని రాత్రంతా కయ్య దగ్గర చూస్తూ కూచున్నాడు, తన మడికి నీళ్లు పెట్టి తర్వాత ఇరుగుపొరుగు వాళ్లు నలుగురితోటి ఒకేసారి దెబ్బలాట వేసుకున్నాడు. తమ వంతు రాకుండానే వాళ్లు వీడి నీళ్లు తీసేసుకుని తమ చేనులకి పెట్టేసుకోవాలను కున్నారు. ఇప్పుడు కుర్చాన్ పడుకుని మూలుగుతున్నాడు. ఒళ్లంతా గాయాలే".

ముసలావిడ గుడిసె లోపలికి వెళ్లిపోయింది. వెంటనే కుర్బాన్ ఇవతలికి వచ్చాడు. మనిషి ముడతలు పడిపోయి, కళ్లు నులుముకుంటూ, పంచకల్యాణి గుర్రంమీద దూకుడుగా, దివ్యంగా కూచున్న రౌతుకేసి ఇబ్బందిగా చూస్తూ నుంచుండి పోయాడు.

"సలాం, ప్రభూ! యేమి యేలిక ఆజ్ఞ?"

"యేలిక కాదు, గుర్రం, కత్తి, బల్లెం తీసుకుని మ్లేచ్ఛులకి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యడానికి ఖోరెస్మ్ షా తనే స్వయంగా నిన్ను సముఖానికి రమ్మంటున్నాడు".

గుండ్రటి భుజాలూ, పొడుగాటి మెడ వున్న కుర్బాన్ నాలుగు వేళ్లతోనూ వీపు బరుక్కున్నాడు.

"నన్ను యెగతాళి చేస్తున్నావ్, ప్రభూ! నేనా? భలే సైనికుణ్ణే! నాకు బాగా వాడడం తెలిసిన ఆయుధాలల్లా పారా, గరిటేనూ!"

"అదేమో, నాకు తెలీదు, నీకూ అనవరం. గ్రామాధికారులందరికీ ఆ శాసనాన్ని తెలియజెయ్యవలసిందిగా నన్ను హాకిమ్ పంపాడు: గ్రామస్థులందరూ తక్షణం సమావేశం కావాలి – నీకు గనక గుర్రం ఉంటే గుర్రంమీద రావాలి, ఒంటె ఉంటే ఒంటెమీద రేపు నువ్వు నీ ప్రభువు ముందర హాజరు కావాలి, చూసుకో. అతను మిమ్మల్నందర్నీ, నీ అంత అధ్వాన్నంగానూ వున్న సైనికులందర్నీ యుద్ధానికి నడిపిస్తాడు. అక్కడికి యెవడేనా రాకుండా యెగ్గొడితే – తల తెగుతుంది! తెలిసిందా?"

"హేయ్, కుర్బాన్ కిజిక్, యేం జరిగింది?" అని విషయమేమిటో చూడాలని పరిగెత్తుకు వస్తూ పక్క పొలాల్లో పని చేసుకుంటున్న రైతులు అడిగారు.

కుర్బాన్ మాట్లాడలేదు. అతని ఒళ్లు వాళ్లు కొట్టిన దెబ్బలకి ఇంకా సలుపుతూనే వుంది. అతను గుర్రాన్ని నిమిరాడు. దాని పల్చని జూలుని వేళ్లతో దువ్వాడు. చేతుల్ని దాని యెండిపోయిన పక్కటెముకలమీదుగా పోనిచ్చాడు.

"మామీద కోప్పడకు కుర్బాన్. నీకు తెలుసు కదా, కుక్కలు బొమిక ముక్కకోసం కొట్లాడకుంటాయి తర్వాత యెండలో పడుకుంటాయి కలిసి. నీటి కోసం నీ సొంత తమ్ముడే అడివి పశువుగా మారిపోతాడు! అంచేత చెప్పు కుర్బాన్ – పాలకుడి రౌతు యెందుకు వచ్చాడు?" అని తోటి రైతులు అడిగారు.

"యుద్ధం" అన్నాడు కుర్బాన్, జడంగా.

"యుద్ధమా!" అని నలుగురూ అరిచారు. నిశ్చేష్టితులయిపోయారు.

"కాని మనతో యేం పని వాళ్లకి? మనం సైనికులం కామే? మనం గింజలు పండిస్తాం, ప్రభువులు మననుంచి వాటిని పట్టుకుపోతారు. మన మానాన మనని యెందుకు వుండనివ్వరు?"

"ఇంతకీ ఆ రౌతు యేమన్నాడు?"

"అతనన్నాడు – అందరూ యుద్ధానికి పోవాల్ట, మన గడ్డని రక్షించేందుకు. నీకు గుర్రంగాని, ఒంటెగాని వుంటే దాన్ని ఖాన్ దగ్గరికి తీసికెళ్లిపోవాలి".

"జీతం ఇచ్చి పోషించే కిప్‌చాక్‌ల సైన్యం మొత్తం ఖోరెస్మ్ షాకి వుంది. వాళ్లని యుద్ధం చెయ్యనీయండి, అది వాళ్ల పడి! యింత దాకా వాళ్లు రైతులమైన మనతో పోరు చేస్తున్నారు, మన బతుకులు బరువు చేస్తూ".

"ఇప్పుడు వాళ్లకేదో కావాలి, మన దగ్గరి కొస్తున్నారు".

పొరుగు వాళ్లు సెలవు తీసుకున్నారు. అప్పుడు కుర్బాన్ కిజిక్ ప్రయాణానికి సిద్ధం కావడం మొదలుపెట్టాడు.

ముల్లాని చూడ్డానికి మసీదుకి వెళ్లాడు. పెద్ద రస్తా మలుపులో ఉన్న వర్తకుణ్ణి చూడ్డానికి వెళ్లాడు. దారమ్మట పోయే వాళ్ల మాటలు విని ప్రభువు చెప్పింది ఒప్పేనని నామ్మాడు: ప్రతి వాళ్లూ యుద్ధం గురించీ, అజ్ఞాత ప్రజల గురించీ మాట్లాడుకుంటున్నారు.

ఆ తండా సైనికులు ఒకటిన్నర మనిషి యెత్తట, వాళ్లని కత్తులు గాని బాణాలు గాని గాయపరచలేవట, వాళ్లకి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యడం వ్యర్థమట, వదంతిగా వుంది. నువ్వు బతికి బట్టకట్టడానికి ఒక్కటే దారి వుందట – నగర ప్రాకారాల వెనక మూసుకునేనా కూర్చోవాలి లేదా బాడవల్లోకి పారిపోనేనా పారిపోవాలి.

కుర్బాన్ ఆలోచనా మగ్నంగా తిరగివెళ్లాడు. కొంత గడ్డినీ, రెల్లునీ కొట్టి గుర్రానికి వేశాడు. విరిగిపోయిన తుప్పు కొడవలి ముక్కని ఓ గడకి కట్టాడు – అది బల్లెం అన్నమాట. కమ్మరతని దగ్గరికి వెళ్లి పనిలో సాయం చేసాడు. అందరూ షా ఆజ్ఞ మేరకి బుఖారాకి వెళ్లిపోతూ వుండడంతో చెయ్యవలసిన పని బోలెడుంది మరి. కమ్మరిశాలలో పని చేసిన దానికి కుర్బాన్‌కి తొమ్మిది రాగి దిర్హమ్‌లు వచ్చాయి. దాంతోటి అతను దుకాణానికి వెళ్లి కొన్ని మాంసం ముక్కలు కొనుక్కోగలిగాడు.

రోజంతా భూస్వామి పొలంలో పని చేసే సాయంత్రం వేళకి కుర్బాన్ భార్య ఇంటికి తిరిగివచ్చింది. కొద్దిగా గింజలు వేసి డేగిసాడు గంజి కాచి, చిన్న చిన్న మాంసం ముక్కలు పెట్టిన పల్చని రొట్టెలు చేసింది.

మట్టి పాత్ర చుట్టూతా కుటుంబం చేరి మౌనంగా తినడం మొదలెట్టగానే కుర్బాన్,కుటుంబ పెద్దగా హోదా కాపాడుకుంటూ ఓరగా వాళ్లని పరిశీలించాడు.

ముసలి తల్లి, ముగ్గు బుట్టలాంటి తల. పనికి ఆమె నడుం గూని అయిపోయింది. ఆమె పడుచుదనంలో, మృదువుగా అందంగా, నల్లగా మెరిసే కళ్లతో, కిలాకిలా నవ్వుతూ వుండే నాటి రోజుల్ని గుర్తు చేసుకున్నాడు. వరదలతో నిండిన పొలాల్లో మండించే యెండలో పని చేయడం, మోపుల కొద్దీ రెల్లో లేకపోతే దుబ్బో మొయ్యడం – యెడతెగని పని ఆమె నడుం వంచేసి, భుజాల్ని దిగజార్చేసింది.

అతని భార్య. అప్పుడేవన్నె తగ్గిపోతోంది. ముచ్చటైన మృదువైన ముఖంమీద అప్పుడే ముడతలు చోటు చేసుకుంటున్నాయి. రోజుల తరబడి, సాధ్యమైనంత యెక్కువ గుడ్డ నెయ్యాలని, మగ్గం ముందు నేలమీద కూర్చునే ఉండేది. ఆమె చేతులు ముసలామె చేతుల్లాగా ముతగ్గా, పెళుసెక్కిపోయాయి.

నలుగురు పిల్లలూ వరసగా కూచుని, యెంత గబగబా వేటైతే అంత గబగబా గంజి జుర్రేస్తున్నారు. తల్లి వాల్లందరికీ తలా ఇంత మాంసం ముక్కా పంచి ఇస్తోంది. పెద్దవాడు హసన్ పదకొండేళ్ల వాడు. అందమైన బుఖారా నగరాన్ని చూడ్డానికీ, తండ్రిని – అతను ఊహించుకున్నట్టు – చలాకీ అయిన యుద్ధాశ్వంమీద వంగుతూ సన్నగా వుండే బల్లెం,

కత్తి, మెరిసే డాలు పట్టుకుని వుండగా చూడ్డానికీ తనని కూడా తీసుకుపొమ్మని గొడవ చేస్తున్నాడు.

తర్వాతది ఆడపిల్ల. యెదుగుతోంది. తన సిగ్గు గురించిన వూహ తెలుస్తోంది, గుడ్డ పీలికతో ఆచ్ఛాదించుకుంటోంది. ఇక ఇద్దరు చంటి పిల్లలు మడమలమీద కూలబడి గంజిలోకి కూరుకుపోయి బుగ్గలనిండా చేసుకుంటున్నారు. వీళ్లకేమవుతుంది?

తను లేనప్పుడు ఆమె యెలా గడుపుకోవాలో, పొలాలకి యెప్పుడు నీరు పెట్టాలో, కోతలప్పుడు ఇరుగుపొరుగు వాళ్లనుంచి యెలా సాయం పొందాలో, వాళ్లు వచ్చినప్పుడు తిండానికి యేం పెట్టాలో పెళ్లాంతో చర్చిస్తూ కుర్బాన్ రాత్రంతా నిద్రపోలేదు.

మర్నాడు ఉదయం కుర్బాన్ కనుమలోకి వెళ్లి, గుర్రంనిండా దుబ్బు వేసుకుని వచ్చాడు. గుర్రం కాళ్లు తప్ప మరేం కనిపించనంత ఒత్తుగా వేసుకుని వచ్చాడు. దుబ్బుని కత్తిరించి చక్కగా గోడవార పేర్చాడు. మట్టి అలికి, గడ్డి కప్పి నేలలో ఉన్న గుంట గురించి యెవళ్లకీ చెప్పద్దని తల్లికీ పెళ్లానికీ హెచ్చరిక చేశాడు. అందులో కొద్దిగా ధాన్యం గింజలు, వసంత రుతువులో నాటడానికి గోధుమ విత్తనాలు ఉన్నాయి. అవి చాలా కాలం రావాల్సి ఉంది. కుర్బాన్ తిరిగివచ్చేదాకా, అతనికి కూడా, కాసిని మిగులుతాయి.

"ఇంత ప్రయాణం యెలా చేస్తావ్?" అని తల్లీ, పెళ్లాం ఆతృతగా అడిగారు.

"యేం భయపడద్దు. సైనికుడు భూమిమీద బతుకుతాడు" అన్నాడు కుర్బాన్.

# యుద్ధం వచ్చింది

ఇంటిదగ్గర తయారుచేసిన నాటు బల్లెం తీసుకుని బయల్దేరాడు కుర్బాన్. తను యెక్కడికి వెళ్లాల్సిందీ కనుక్కోవడానికి మన్నీడు పెద్ద ఇంటికి వెళ్లాడు. ఆ ఇంటి కాపలావాడు ఇతన్ని తిట్టిపోసి, ఇనాన్స్ ఖాన్ ప్రభువు అప్పటికే తన ఆశ్విక దళంతో వెళ్లిపోయాడని చెప్పాడు. ఆలస్యంగా వచ్చిన యెవళ్లేనా వెనక్కాలే వెళ్లి బుఖారాకి పోయే పెద్ద రహదారిమీద వాళ్లని అందుకోవాలి.

దారంతా ప్రతి చోటా గుర్రాలెక్కిన రైతుల బృందాలు, నడిచి వెళ్లే రైతుల బృందాలూ, పిల్లలతోటీ ఇంటి సామాన్లతోటీ నిండిన రెండు చక్రాల బళ్ల వరసలు కనిపిస్తూనే వున్నాయి. యేడుస్తూ ఉండే ముసలాళ్లూ ముసలమ్మలూ భారంగా కుంటుతున్నారు. సామాను బళ్లు అన్ని వేపులకీ పోతున్నాయి. కొన్ని బుఖారాకి పోతున్నాయి, కొన్ని దక్షిణాది పర్వతాలకేసి పోతున్నాయి.

మర్నాడు సాయంత్రం వేళకి బుఖారా శివార్ల మట్టి గోడలు దూరానికి గోచరమవ ప్రారంభించాయి. కుర్బాన్ అప్పటికి ఒక దర్వీషుతో పరిచయం కలిగించుకున్నాడు. ఆ దర్వీషుకి గడ్డం ఉంది, కళ్లు నల్లగా ఉన్నాయి. అతను తన మూట మోస్తూ వున్న నల్లని గాడిద పక్కన భారంగా నడుస్తున్నాడు. అతని కూడా పదమూడేళ్ల కుర్రాడొకడున్నాడు. వాడు అతన్ని వదలడమే లేదు. పాషండుల మీదకి దాకి వెళ్లే ధైర్యవంతులైన యోధులకి శుభం కలగాలనీ, విజయం సిద్ధించాలనీ దర్వీషు పాటలు పాడుతూనే ఉన్నాడు. కొంత మంది సైనికులు ఓ అట్టునో, ఓ గుప్పెడు గోధుమలనో దర్వీషు గిన్నెలో వేసేవారు.

చీకటి పడే వేళకి నగరం చుట్టూతా వేలాది విడిది నెగళ్లు రాజుకున్నాయి. దర్వీషననుసరించే వెళ్లిన కుర్బాన్ కొన్ని కురచ ఇళ్ల దగ్గరికి చేరాడు. అక్కడనుంచి యెడతెగకుండా, ఒకే స్వరంలో "హు! ఉహుహు" అనే అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి. ఇది ఖాంఖా, దర్వీషుల మఠం. అది జనంతో నిండిపోయింది. తమకి జబ్బులుగాని,

రాబోయే యుద్ధంలో మృత్యువుగాని సంభవించకుండా రక్షణకి దర్వీష్‌లని ప్రార్థనలు చెయ్యమనీ, మహిమలు చెయ్యమనీ అడుగుతూనే ఉన్నారు. దర్వీషులు దుష్టగ్రహ వుచ్చాటన చేశారు, మంత్రాలు చదివారు, పవిత్ర లిపి ఉన్న చిన్న కాగితం ముక్కల్ని ఇచ్చారు.

కుర్బాన్ తన గుర్రాన్ని గోడవార కట్టేసి నెగళ్ల చుట్టూ వెళ్లి తన గుర్రం కోసమూ, నల్ల గాడిద కోసమూ కొంత గడ్డి పోగుచేసుకువచ్చాడు. దర్వీషు తన అట్లనీ, పిండితో చేసి ఇనప చట్టిమీద ఉడికించిన కుడుముల్నీ అతనికి పెట్టాడు.

"సైనికులు భూమిమీదనే బతుకుతారు" అనుకున్నాడు కుర్బాన్.

కుర్బాన్ తన గుర్రాన్ని దగ్గరనే ఉంచుకుని, దాన్ని కట్టేసిన తాటిని తన చేతికి చుట్టుకుని రాత్రంతా నిద్రరాక కుస్తీ పడుతూనే ఉన్నాడు. పరమ కుంటి తొక్కు గుర్రం కూడా బోలెడు ధర పలుకుతోందనీ, యేమంటే ప్రతివాళ్లూ వీలైనంత మేరకి బుఖారాకి దూరంగా వెళ్లాలనుకుంటున్నారనీ, పర్షియ కొండల్లోకో, హిందూ దేశానికో వెళ్లాలనుకుంటున్నారనీ, పాషండులకి అందకుండా పారిపోవాలనుకుంటున్నారనీ నెగళ్ల దగ్గర మాట్లాడుకుంటున్నారు.

తెల్లవారే ముందుగా కుర్బాన్‌కి ఒళ్లు తెలియకుండా నిద్రపట్టేసింది. యెవళ్లో వచ్చి తాడు కోసేసి గుర్రాన్ని తీసుకుపోవడం అతనికి తెలియలేదు.

"పవిత్ర యుద్ధానికి వెళ్లే సైనికుడి గుర్రాన్ని కాజేసిన దొంగని అల్లా శిక్షిస్తాడని వుంది. కాని యీ లోపున దేవుడు అందుకు మారుగా నన్ను బీద ముసలి హాజీ రహీమ్‌ని శిక్షిస్తున్నాడు. యేమంటే దొంగ నా గాడిదని కూడా యెత్తుకుపోయాడు. మనం పవిత్ర బుఖారాకి చేరేటప్పటికి బాధపడాల్సినవి తక్కువ అయాయనీ, గుర్రాన్నిగాని గాడిదనిగాని చూసుకోవాల్సిన పని లేకుండా పట్టణాన్ని దర్శించవచ్చునీ మనం సమాధాన పడాలంతే" అన్నాడు దర్వీషు.

కుర్బాన్ పొడుగాటి బల్లేన్ని భుజంమీద పెట్టుకుని, దర్వీషుతో కూడా వున్న కుర్రాడితో కలిసి ఆ ప్రఖ్యాత నగరాన్ని చూడ్డానికి – "విజ్ఞానాకాశంలో తేజోవంతంగా వెలిగే తార, ఉన్నత బుఖారాని" చూడ్డానికి, వెళ్లాడు.

స్నేహబంధంతో కట్టి వేసుకున్న ఆ ముగ్గురు సహ పథికులూ అనంత ప్రవాహంగా వచ్చే అసంఖ్యాక మూకతోబాటు బుఖారాకి ఈడ్చుకుంటూ వెళ్లారు.

పిచ్చి మొక్కలూ, పొదలూ పెరిగి ప్రాచీన కాలంలో కట్టిన యెత్తు గోడల్ని కమ్మేశాయి. ఆ గోడలు ఇక్కడా అక్కడా శిధిలం అయిపోతూ ఉన్నాయి. వాటికి పదకొండు ద్వారాలున్నాయి. వీటి గుండానే వర్తకుల బిడారాలు ఈ ఇస్లాం కోటని ప్రపంచపుటంచులతో సంధించాయి.

ద్వారం తలుపుల వెనకనుంచే వర్తకుల దుకాణాలూ అంగళ్లూ మొదలయాయి. నానా రకాల వస్తువులూ ఒక దానిమీద ఒకటి పేరుకుపోయిన చిన్న దుకాణాలు వున్నాయి. తత్కాల అవసరాల్ని గ్రహించిన వర్తకులు, ప్రయాణంలో మన్నికగా ఉండే చవకైన గుడ్డలనీ, దారిలో బాగా నిద్రపోవడానికి వీలుగా వుండే మెత్తని బొచ్చు అట్టలనీ, పాసిపోకుండా తేనెతో తయారుచేసి కాల్చిన రొట్టెలు అనీ అరుస్తున్నారు.

బిత్తరపోయిన కాందిశీకులు ప్రతి చోటా ఉన్నారు. తమ పెళ్లాం బిడ్డలతోటీ, తమకున్న కొద్ది పాటి సామాన్లతోటీ నీడ కోసం, రక్షణ కోసం నగరంలోకి పారిపోయి వస్తున్నారు.

రెండవ ప్రాకారపు బ్రహ్మాండమైన ద్వారం శివారుల్నీ లోపలి పట్టణాన్నీ విభజిస్తుంఇ. ఆ పట్టణం షాహ్రిస్తాన్. ఆ ద్వారంగుండా వెడుతూ ఆ ముగ్గురు నేస్తాలూ, గోలగా వుండే వీధిలోనుంచి నిశ్శబ్దంగా వుండే చౌకులోకి మళ్లారు. దాన్ని ఆవరించి మసీదు, మదారసల యెత్తు కమాన్లు వున్నాయి. యాచుకుపోయిన విద్యార్థులు కొన్ని వేలమంది అక్కడ చదువుకుంటున్నారు. వాళ్లల్లో పడుచువాళ్లూ వున్నారు. వృద్ధులూ వున్నారు. “తల బతులి లిమ్”. పవిత్ర ఆరబిక్ గ్రంథాల విజ్ఞానాన్ని సంపాదించడానికి, యెన్నో యేళ్ల అధ్యయనం తర్వాత, కష్టాల తర్వాతా బీదదైన మసీదుకి ఇమామ్‌లవడానికి తంటాలు పడేవాళ్లు వాళ్లు.

చౌకులో శాస్త్రబద్ధంగా ఒక మత ఆరాధన జరుగుతోంది. పవిత్ర గ్రంథంలోని పంక్తుల్లాగా యేక బారున ఉన్న భక్తుల శ్రేణుల, వంద్యులైన నెరిసిన గడ్డపు ఇమామ్ కదలికల్ని అనుసరిస్తూ నిశ్చలంగా నుంచుని వున్నాయి. ఆయన మోకరిల్లి తన ముఖాన్ని నేలకి ఆనుకున్నప్పుడు గాని, చెవులమీదకి చేతుల్ని యెత్తినప్పుడు గాని, కొన్ని వేల మంది నిజమైన భక్తులు యీ కదలికల్ని అనుసరించి అలానే చేశారు. అసంఖ్యాక శరీరాలు లేస్తూ, కిందికి వాలుతూ వున్న శబ్దం మాత్రం చౌకులో పరిచిన రాతి పథంమీద సయ్‌మని వీచే గాలిలాగా పోయింది.

ఆరాధన పూర్తవగానే ఎర్రటి తోక వున్న పంచకల్యాణి గుర్రాన్నొకదాన్ని యెత్తైన మసీదు మెట్లదాకా తీసుకువచ్చారు. ఆ గుర్రానికి బంగారు జరీ పువ్వులు కుట్టిన యెరుపు మఖమల్ పట్టా కప్పి శృంగారం చేశారు.

మసీదు లోపలనుంచి ఆజాను బాహువు, నల్లని గడ్డం ఖోరెస్మ్ షా వజ్రాలు పొదిగిన మంచులాంటి తెల్లని పాగా పెట్టుకుని వచ్చాడు.

షా జన సమూహాన్ని ఉద్దేశించి మాట్లాడాడు:

"ఇస్లాం మతానికి చెందిన వాళ్లంతా ఒకే ప్రజ. మన అత్యుత్తమ రక్షణ పదునైన కరవాలం. నిజమైన ఆస్తికులకి ప్రవక్త ఇలా చెప్పాడు: 'నేను మిమ్మల్ని ఇస్లాం సైనికుల్ని చేశాను. ఈ ప్రపంచంలో అత్యుత్తమమైన ప్రాణులుగా చేశాను. దివిలోను భువిలోను వున్న దానంతటినీ పాలించేవాళ్లుగా ముసల్మాన్లని విధించాను'. అసలైన ఆస్తికులు ప్రపంచ పాలకులని శాసనమై ఉంది. అంచేత మీరు భయపడవలసిందేమీ లేదు. అయినా పవిత్ర గ్రంథం ఇంకా ఇలా చెప్తోంది: 'అల్లా బానిసకి అతని కర్తవ్యమైనట్టు దయ చూపుతాడు'. అంచేత అభయకరవాలం శత్రువుని నిశ్చేష్టుల్ని చెయ్యడానికి మీ ప్రయత్నాలన్నీ అవసరం అవుతాయి. ప్రవక్త ప్రవచించిన దానికి తన సర్వాత్మణా అర్పితమయ్యే అసలైన భక్తుల ఆగ్రహానికి యెదురుగా యేదీ నిలవలేదు. శత్రువు యెక్కడ మీకు కనబడినా నరకండి, వెంటబడి తరమండి! ఆగ్రహంలో శక్తివంతుడైన అల్లా నాస్తికులమీద మనకి విజయాన్ని ఇస్తాడు".

"నాస్తికుల్ని చంపండి! పాషండుల్ని అణగదొక్కండి!" అని గుంపు అరిచింది.

యెర్ర తోక పంచకల్యాణి గుర్రం యెక్కి ఖోరెస్మ్ షా వీడ్కోలు మాటలు కొన్ని చెప్పాడు:

"మీకు మంచి సలహా ఇవ్వడం మా లక్ష్యం: ఇచ్చాం! ఇప్పుడు నాస్తికులైన పాషండుల్ని యెదిరించడానికి సమర్‌కండ్ వెడుతున్నాం. వాళ్లప్పుడే తియెన్‌షాన్ హిమావృత కనుమలనుంచి వెడుతున్నారు, కాని వాళ్లని జాగ్రత్త పడమనండి! దారి మన ధైర్యవంతులైన సైనికులతో అడ్డం పడుతుంది. వాళ్లకి మూడుతుంది. అల్లా మిమ్మల్ని రక్షిస్తాడు".

"సైనికుడైన మహమ్మద్ వర్థిల్లాలి! నాస్తికుల్ని జయించే ఖోరెస్మ్ షా వర్థిల్లాలి!" అంటూ గుంపు అరిచింది. షా, అతని వైభవోపేతమైన కిప్‌చాక్ అంగరక్షకులు ముందుకు వెళ్లడానికి గుంపు చీలిపోయి దారి ఇచ్చింది. "మీరొక్కళ్లే మా శ్రేష్ఠమైన రక్షణ!" అని అరిచాను.

# సైనికుడి రక్ష కత్తిమొన

బుఖారా వదిలిపెట్టి ఖోరెస్మ్ షా మహమ్మద్ హఠాత్తుగా గుర్రాన్ని తిప్పి సమర్‌కండ్‌కి పోయే రాచ బాటమీద గాక దక్షిణాదికి కెలిఫ్‌కి ప్రయాణం చేశాడు. ముఖాన్ని పట్టు శాలువతో కప్పుకుని మౌనంగా స్వారీ చేశాడు. కాసేపు గెంతిస్తూ, కాసేపు దౌడుతీయిస్తూ వెళ్లాడు. పరివారం అతన్ని అనుసరించి వచ్చింది. దారమ్మట తగిలిన పథికులు యెగిరి కందకంలోకి గెంతారు. వాళ్లు ముఖాలు నేల వేపు తిప్పి పడుకున్నారు. ఈ బృందం అటు దాటి వెళ్లినప్పుడు జాగ్రత్తగా పైకి చూశారు. ఇబిలిస్ తరుముకొస్తున్నట్టుగా స్వారీ చేసుకుపోయే వెయ్యి మంది ఆశ్వికుల. వీపులు చూసి నిశ్చేష్టులైపోయారు.

షా దారి తప్పాడని పాదుషా కొడుకు జలాలుద్దీన్‌ని ఒప్పించడానికి ముఖ్య వజీరు మహా ప్రయత్నించాడు. జలాలుద్దీన్ నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు.

"దాంతో నాకేమిటి సంబంధం? నేను మా తండ్రిగారిని అనుసరించి వెడతాను, ఒక వేళ పాదుషా నరకపు భీకర బిలంలోకి దూకాలనుకున్నా సరే".

"యెవరిదీ సంస్థానం?" అని ఖోరెస్మ్ షా వున్నట్టుండి అడిగాడు. నురగలు కమ్మిన పంచకల్యాణి గుర్రాన్ని కళ్లెం పట్టుకులాగాడు. కొరడాతోటి ఒక గోడకేసి చూపించాడు. ఆ గోడకి కూచి తేలిని బురుజులున్నాయి. దాని వెనక్కాల ఠీవిగా ఉన్న పోప్లర్ చెట్లు వరసలో ఉన్నాయి.

"ఇది తైమూర్ మాలిక్ ఖాన్ వేట సంస్థానం. పాత తోటకీ, అడవి జంతువుల వింత ప్రదర్శనకీ ప్రసిద్ధి చెందింది".

"దీన్ని చూడాలి నేను. కాని ధైర్యవంతుడైన తైమూర్ మాలిక్ ఇక్కడ లేడెందుకని?" అన్నాడు షా.

"ఖోజెంట్ దుర్గానికి అధిపతిగా నియమిస్తూ మాట అన్న రోజునే అక్కడికి వెళ్లిపోయాడు".

"తల బిరుసు మనిషి! హడావుడిగా వెళ్లమని నేను అన్లేదు. అతను లేకపోతే నాకు తోచడం లేదు..."

అంగరక్షకులైన వందమంది ఆశ్వికులు స్వాగత సన్నాహాలు చెయ్యడానికి ముందు వెళ్లిపోయారు. ఉగ్రంగా వున్న గుర్రాన్ని అదుపు చేస్తూ మహమ్మద్ వెనక్కాల నింపాదిగా వెళ్లాడు. భారమైనద్వారాలు తెరుచుకున్నాయి. నౌకర్లు ముంగిట్లో పరుగులు తీశారు. తాళాలు కిర్రుమంటూ తిప్పి వాళ్లు పొడుగాటి భరంతుకి దారి తీసే తలుపులు తెరిచారు. బానిసలు బార్లీ మూటల్ని లాగుతున్నారు. సందిళ్ల కొద్దీ గడ్డి మోసుకుపోయారు. రౌతులు దగ్గరి గ్రామానికి దౌడెత్తి వెళ్లి జీనులమీద వేసుకుని గొర్రెలని లాక్కొచ్చారు. ప్రయాణంలో ఉండే వంటవాళ్లు పొయ్యిలు రాజేసి వంటలకి సిద్ధపడ్డారు.

షా గాలి బాగా వచ్చే తోట గోడమీద తమంగంలోకి నిచ్చెన యెక్కి వెళ్లాడు. జలాలుద్దీనూ, ఆ సంస్థానపు వృద్ధ పర్యవేక్షకుడూ వెనక వెళ్లారు.

తమంగంనుంచి సంస్థానం బాగా కనిపిస్తుంది. ఆకుల్లేక ఇంకా చెట్లు బోసిగా వున్నాయి. పచ్చిక మైదానంమీద అనేక అడివి మేకలు యెండాలో చలికాగుతున్నాయి. పొడుగాటి కొమ్ములున్న కొండ పోతుమేక వాటి పక్కన కాపలాగా పడుకుంది.

"కొంచెం ఆవల అటు పక్క, తోట లోపల కంటా, రెండు జతల అడివిపందులున్నాయి, ఈనిన పిల్లల్ని పెట్టుకుని" అన్నాడు పర్యవేక్షకుడు. "రెండు క్రూరమైన చిరుతపులులు బోనులో ఉన్నాయి. వాటిని ఇటీవల కొండల్లోనుంచి తెచ్చారు. పరాక్రమవంతుడైన మా యజమాని తైమూర్ మాలిక్‌కి యీ తమంగం ఇంట్లో కూర్చుని ఆ చిరుతపులులు మేకల్నీ, అడవి పందుల్నీ వేటాడుతూ ఉంటే చూడ్డం సరదా. ఒకో అప్పుడు ఆయనే స్వయంగా వనంలోకి వేటకి వెడతాడు. ఒక్క బాణం దెబ్బకి ఆయన ఓ జంతువుని చంపెయ్యగలడు, బాణం యెక్కడ తగుల్తుందో ముందే చెప్తాడు".

"వెళ్లిపో" అన్నాడు షా కఠినంగా.

కొడుకూ తనూ ఉండిపోయారు. మెల్లిగా మాట్లాడుకున్నారు.

"నాకు బాగా లేదు. వెంటనే మూడు దిశలనుంచి వార్తాహరులు వచ్చారు. నల్లని మేఘాలు అన్ని వేపులా కమ్ముకుంటున్నాయి".

"అదే యుద్ధం" అన్నాడు జలాలుద్దీన్, నిర్లక్ష్యంగా.

"ఎర్ర పులి జెంఘిజ్ ఖాన్ ఓత్రార్ నగరాన్ని పట్టుకున్నాడనీ, ఇనాల్‌చిక్ కెయిర్ ఖాన్‌ని బందీ చేసాడనీ, కసి తీర్చుకోవడానికి వెండిని కరిగించి అతని కళ్లల్లోనూ, చెవుల్లోనూ పొయ్యమన్నాడనీ మొదటి వార్తాహరుడు చెప్పాడు. ఇప్పుడు జెంఘిజ్ ఖాన్ నా వెనకబడ్డాడు".

"రానివ్వండి! అతని కోసం సిద్ధంగానే ఉన్నాం".

"వినాశనం దాపురిస్తూ వున్నా నువ్వు పట్టనట్టే ఉంటావ్".

"మనకి పెద్ద సైన్యం వుంది. ఇంక బెంగ పడాల్సింది దేన్ని గురించి?"

"రెండవ వార్తాహరుడు దక్షిణాదినుంచి వచ్చాడు. తాతారుల యెలగోలు విభాగాలు అక్కడా ఉన్నాయంటున్నాడు".

"యేదో కొద్ది మంది వేగుల వాళ్లు. వసంతం ఆరంభంలోనే ఉంది. పెద్ద సైన్య విభాగం కొండ కనుమల మంచులో ఆగి ఉంటుంది".

"కాని వాళ్లు కొండల్లోనుంచి కిందికి వస్తే గనక హిందూ దేశంకేసి మన తిరోగమన మార్గాన్ని తాతార్‌లు అడ్డగిస్తారు".

"మనం అక్కడికెందుకు తిరోగమించాలి?"

"ఇంకో వార్త ఉంది. మంగోలు దళాలు కిజిల్‌కుమ్ ఇసక మైదానం మీద కనిపించాయట".

"మనం పది వేల మంది తుర్క్‌మెన్ రౌతుల్ని కాపుదలగా అక్కడికి పంపిందాం".

"ఈ తుర్క్‌మెన్లు మంగోలుల్ని ఆపలేరు".

"ఆ లెక్కన జెంఘిజ్ ఖాన్ కొద్ది రోజుల్లో బుఖారా గడప దగ్గర ఉంటాడు. దానికి సిద్ధం కావాలి మనం".

"బహుశా ఈ ఎర్రగడ్డం అడివి జంతువు ఇప్పటికే బుఖారామీదకి పాకుతున్నాడేమో. అతని సైన్యాలు గాలిని పీలుస్తున్నాయి మన కోసం చూస్తూ! ఇక్కడి నుంచి యెంత వేగంగా వీలైతే అంత వేగంగా వెళ్లిపోవాలి" అని మహమ్మద్, చుట్టూతా ఇబ్బందిగా చూస్తూ అన్నాడు, తోటలోని గుబురుల్లోనుంచి దాడి వస్తుందేమోననుకొన్న వాడిలాగా.

జలాలుద్దీన్ మౌనంగా ఉన్నాడు.

"నువ్వేం మాట్లాడవేం?"

"నేను పిచ్చివాణ్ణని నీ భావన. నే చెప్పేదేముంది?"

"నువ్వు మాట్లాడాలని ఆజ్ఞాపిస్తున్నాను".

"అయితే మాట్లాడతాను. నువ్వు నన్ను క్షమించనూ వచ్చు, తల తీయించెయ్యనూ వచ్చు. ఈ శనిగొట్టు జెంఘిజ్ ఖాన్ ఇక్కడికి వస్తూనే వుంటే, మన సైన్యాలు నగరాల ప్రాకారాల వెనక దాంకోకూడదు. వెళ్లి తల పడాలి. నేను యీ కిప్‌చాక్ ఖాన్లందర్నీ రంగంమీదకి తోలేవాణ్ణి – మెత్తగా వుండే రైతుల తోళుల్ల ఒలచడానికి వీళ్లు పోటుమగాళ్లే, కాని యుద్ధ ప్రభంజనం వీచినప్పుడు ఆకుల్లా వణికిపోతారు. వాళ్లని నగర ద్వారంలోకి రాకుండా నిషేధించేవాణ్ణి, వస్తే ఉరిశిక్షే. సైనికుడి రక్ష కత్తిమొన, చురుకైన గుర్రమూనూ. ఎర్ర పులి ఇక్కడికి వస్తోందా? – మరీ మంచిది. అంటే అతను పట్టుకోవాల్సిన దారి మనకి తెలుసు. మన గుర్రాల్ని మళ్లించి అతని వెనకబడదాం, తరుముదాం, దారి అడ్డగిద్దాం, అన్ని వేపులనుంచీ దాడి చేద్దాం, అతని ఒంటెల్ని చంపుదాం, ఎర్ర గడ్డం వెంట్రుకలతోబాటు మాంసం కోసేద్దాం.

సమర్‌కండ్ ప్రాకారం వెనకాల లక్షమంది సైన్యం ఉండి యేం లాభం. ఊరికే గొర్రెల్ని భోంచేస్తారు, గుర్రాలకి సత్తువ తగ్గిపోతుంది".

"నీ తండ్రి ఆజ్ఞల్ని విమర్శిస్తావు. నేనెప్పుడో గ్రహించాను. నేను పతనం అయిపోవాలని చూస్తున్నావు".

జలాలుద్దీన్ కిందికి చూసి విచారంగా అన్నాడు:

"అది నిజం కాదు. ప్రపంచమంతా కదిలిపోయే చెడ్డ రోజుల్లో కూడా నిన్ను విడిచిపెట్టి వెళ్లను. నీకు ప్రియమైన సికందర్‌మీద ఒట్టుపెట్టి చెప్తున్నాను, నేనింత సాధువుగా, అనిశ్చితంగా ఉండే పిచ్చివాణ్ణి. నువ్వు ఒక్కసారి చెయ్యి ఆడిస్తే శత్రువు మీద దూక సిద్ధంగా ఉండే సైనిక శిబిరంగా అవకపోతే ఈ పెద్ద సైన్యం వుండేమిలాభం? మన భార్యా బిడ్డలని రక్షణ కాకుండా, భీతిల్లిన ఆడవాళ్ల దుప్పట్ల ముసుగుల్లో దాగిన సాయుధ యోధులకి రక్షణ నిస్తే ఇంత యెత్తుగోడలవల్ల లాభం యేమిటి? నీకిష్టమైతే నా తల తీయించు. కాని నే చెప్పినట్టు చెయ్యి. నాన్నా, సమర్‌కండ్ వెడదాం పద, నడవండి!"

"ఇరాన్‌కి లేదా హిందూ దేశానికీ! ఇరాన్‌లో పెద్ద సైన్యాన్ని పోగుజేస్తాను!"

"లేదు, పాదుషా, నువ్విప్పుడే ఆచరణకి దిగాలి, నీ చేతిలో ఉన్న బలగంతోటి. ప్రాకారాల వెనక దాంకుని నీ సైన్యమే అనాయకంగా వున్నప్పుడు కొత్త సైన్యానికి శిక్షణ ఇవ్వడానికి వ్యవధి లేదు. ఒక్క రోజులో విజయాన్ని చేకూర్చి పెట్టే సైన్యానికి శిక్షణనివ్వడానికి ఇరవై యేళ్లు పడుతుంది. సమర్‌కండ్ వెడదాం. నేనో సాదా ఆశ్వికుడిలాగా, నీ పక్కనే, యుద్ధం చేస్తాను".

"లేదు, లేదు! నువ్వు బాల్ఖ్ వెళ్లాలని, అక్కడ నాతోబాటు కొత్త సైన్యాన్ని పోగు చెయ్యాలని ఆజ్ఞాపిస్తున్నాను. అదృష్టం నన్ను వంచించింది!..."

"అదృష్టం!" అని జలాలుద్దీన్ కోపంగా అరిచాడు. "యే అదృష్టం? సాహసవంతుణ్ణి అదృష్టం యెందుకు వదిలిపెడుతుంది? నువ్వు అదృష్టం నుంచి దూరంగా పారిపోకూడదు, దాని వెంబడి పడాలి, అందుకోవాలి. జూలు పట్టుకుని దాని వీపుమీద యెక్కాలి. అదీ అదృష్టాన్ని పొందే మార్గం!..."

"ఇక చాలు! బండ బుర్ర యోధుడివి తప్ప నువ్వు మరేం కాలేవు. మహా ఖోరెస్మ్‌ని వినాశనంనుంచి రక్షించలేవు నువ్వు."

ఖోరెస్మ్ షా హడావుడిగా తమంగం నుంచి దిగిపోయి భరంతు దగ్గరికి వెళ్లిపోయాడు. అక్కడ తివాసీలమీద పుష్కలంగా దాస్తర్‌ఖాన్ సర్దివుంది. ప్రార్థన చేసుకుని షా దారుల గురించీ రేవుల గురించీ వాకబు చేస్తూ భోజనానికి ఉపక్రమించాడు. భోజనం అయేదాకా ఆక్కుండానే గుర్రాలకి జీన్లు వెయ్యమని పురమాయించాడు.

# లొంగని తైమూర్ మాలిక్

జెంఘిజ్ ఖాన్ తన కొడుకులు ఉగేదీయ్, జగతాయ్‌లని కొంత సైన్యం ఇచ్చి ఓట్రార్ దగ్గర వుంచి వాళ్లకి చెప్పాడు:

"పాలెగాడు ఇనాల్‌చిక్ కెయిర్ ఖాన్‌ని సజీవంగా పట్టుకొనే దాకా ఓట్రార్‌ని ముట్టడించండి. అతన్ని సంకెళ్లతో నా దగ్గరికి తీసుకురండి. ఈ కసాయి వెధవకి కనీవినీ యెరగని శిక్షని నేనే ఆలోచిస్తాను".

జెండ్‌నీ, ఎంగిఖెంట్‌నీ పట్టుకొమ్మని జెంఘిజ్ ఖాన్ తన పెద్ద కొడుకు జూచికి ఆజ్ఞ ఇచ్చాడు. అతను మిగిలిన సైన్యాల్ని అనేక ఇతర దిశలకి పంచేశాడు.

అలక్ నాయన్‌నీ, అయిదు వేల మంది ఆశ్వికుల్నీ బెనాకెట్ నగరానికి పంపాడు. అక్కడ కిప్‌చాక్‌లు దండు కోటకి రక్షణగా ఉంది. మూడ్రోజుల ముట్టడి తర్వాత నగరవాసులు తమ పెద్దల్ని కరుణ చూపించమని అర్థించడానికి పంపారు. మగవాళ్లందర్నీ నగరం బయట బారులు తీసి నిలబడమని అలక్ నాయన్ ఆజ్ఞాపించాడు. వాళ్లని రెండు బృందాలుగా విభజించాడు – సైనికులు, మామూలు పౌరులు. ఆయుధాల్ని కింద పడెయ్యమని సైనికులని ఆజ్ఞాపించాడు. అప్పుడు మంగోలులు వాళ్లమీదికి ఉరికి బాణా కర్రలతో, కత్తులతో, బాణాలతో వాళ్లని చంపేశారు. మిగిలిన వాళ్లల్లో నుంచి దృఢంగా, పడుచుగా వున్న వాళ్లందర్నీ యెంపిక చేసి, వాళ్లని పశువుల మాదిరీ ముట్టడించిన నగరాల గోడలని కూలగొట్టడానికీ, దాడి తాకిడిని భరించేదానికీ ముందుకు తోశారు.

అలక్ నాయన్ దారిలో ఇతర మంగోలు విభాగాల్నీ, మిత్ర పక్షాల్నీ పోగుజేసుకున్నాడు. దాంతోటి అతని సైన్యం సంఖ్య యెనభై వేల మంది బలం గలదిగా తయారైంది. వాళ్లు ఖోజెంట్ నగరానికి వచ్చారు. అది విశాలంగా వుండి వేగంగా పారే సైహున్ (సిర్‌దార్యా) నదీ తీరాన ఉంది. ఆ నగర వాసులు యెత్తుగా ఉన్న తమ ప్రాకారకుడ్యాల అభేద్యతని నమ్ముకుని లొంగిపోవడానికి నిరాకరించారు.

ఈ నగర సైన్యపు అధిపతి కొత్తగా నియమించిన తైమూర్ మాలిక్. అనుభవజ్ఞుడైన

సైనికుడు. సాహసానికీ, పట్టుదలకీ, నిష్కపట వ్యవహారానికీ పేరు పొందాడు. సైహూన్ నది రెండుగా చీలినచోట మధ్యన చిన్న ద్వీపంలా ఉంది. అక్కడ అతను ఒక ఎత్తైన దుర్గం నిర్మించి ఆయుధాలనీ, ఆహారాన్నీ నిలవచేశాడు.

మంగోలులు వచ్చినప్పుడు, కొరడాలతోటి కొట్టీ కత్తులతో బెదిరించి ఖోజెంట్ గోడల్ని ముట్టడించమని ముసల్మాను ఖైదీల్ని తోలారు. తమ వాళ్లే అయిన సోదర ప్రజతో పోరాటం చెయ్యడం ఇష్టంలేక ఆ నగరవాసులు దాన్ని వదిలేశారు.

తైమూర్ మాలిక్ సాహసవంతులైన వెయ్యి మంది ఆశ్వికుల్ని తీసుకుని, అన్ని పడవల్నీ పట్టుకుని నదిని దాటి ఆ ద్వీపంమీద వున్న కోటలో బిడాయించేసుకున్నాడు. ఖోజెంట్ నగర వాసులు దయ చూపించమని అర్థిస్తూ తమ ముఖ్య పౌరుల్ని మంగోలుల దగ్గరికి పంపి తలుపులు తెరిచారు. మంగోలులు తక్షణం నగరాన్ని ధ్వంసం చేసేశారు.

మంగోలులు ద్వీపంమీద వున్న కోటమీద యుద్ధ సాధనాలతో దాడి చేశారు. కాని రాళ్లూ, బాణాలు అంత దూరం వెళ్లకుండానే పడిపోయాయి. దాంతోటి మంగోలులు ఖోజెంట్ యువకులందర్నీ, బెంకెట్‌లోనూ ఇతర నగరాల్లోనూ పట్టుకున్న ఖైదీలందర్నీ పోగుజేశారు. మొత్తం యాభై వేల మంది అయ్యారు. వాళ్లని వందల కిందా, పదుల కిందా విభజించి మూడు ఫర్‌సాక్లు* దూరంలో ఉన్న పర్వతం దగ్గరకి తోలుకుపోయారు. నదిమీద ఆనకట్ట కట్టడానికి రాళ్లు పోగు చేయించేందుకు అలా చేరారు.

ఈ లోపున తైమూర్ మాలిక్ పన్నెండు తెప్పల్ని తయారు చేయించాడు. అదాహ్యంగా ఉండడానికి తడి బొచ్చు అట్టల్ని మట్టిపూత పెట్టించి పైన కప్పించాడు. ఆ గోడలలో బాణాలు విసిరేందుకు వీలుగా కంతలు పెట్టించాడు. ప్రతి రోజూ వరువాతనే నదీ తీరం వార ఈ తెప్పలు ఆరింటివి పంపాడు. అతని సైనికులు ప్రాణాలకి తెగించిన సాహసంతో మంగోలులమీద దాడి చేశారు. మంగోలుల అగ్ని బాణాలు వీళ్లకి యే ప్రమాదమూ కలిగించకుండా తడి బొచ్చు అట్టలమీద పడిపోయేవి.

రాత్రిళ్లప్పుడు తైమూర్ మాలిక్ కోటలో దండుని తీసుకుని నిద్రపోయే మంగోలుల మీద పడేవాడు. దాంతోటి మంగోలులు నిరంతరం అప్రమత్తంగా వుండాల్సి వచ్చింది.

చైనా యుద్ధ సామాగ్రి నిపుణులు మంగోలులతోబాటు ఉన్నారు. వాళ్లు కొత్త, మరింత బలమైన, సాధనాలని తయారు చేశారు. రాళ్లనీ, బళ్లేలనీ విసిరే వడిసెలలు తైమూర్ మాలిక్ సైనికులకి గొప్ప నష్టం కలిగించాయి. తన పరిస్థితి మహా ప్రమాదంలో పడిపోయిందని చూసి తూమూర్ మాలిక్ డెబ్భై పడవలనీ, తెప్పలనీ తయారు చేయించి రాత్రి చీకటి మాటున తన మనుషులతో, సామానుతో, వాటిల్లోకి ప్రవేశించాడు. అన్ని పడవలనీ హఠాత్తుగా

*సుమారు 21 కిలోమీటర్లు.

మంటలతోనూ కాగడాలతోనూ వెలిగించమని పురమాయించాడు. అవి భీకర వరదలో నది దిగువకి కొట్టుకుపోయాయి, తీవ్ర ప్రవాహవేగంవల్ల.

మంగోలు సైన్యం నది రెండు వేపులనుంచీ వాళ్ల వెనకబడింది. యెక్కడెక్కడ మంగోలులు కనిపించినా అక్కడికల్లా తైమూర్ మాలిక్ పడవలనీ, తెప్పలనీ నడిపించాడు. మంగోలుల్ని బాణాలు విసిరి తరిమేశాడు. పడవలని ఇంకా దిగువకి పోనిచ్చాడు. బెంకెట్ చేరి, నదిమీద మంగోలులు పెట్టిన గొలుసుని ఛేదించుకుని, ఆ పడవలూ, తెప్పలూ వేగంగా కిందికి జారిపోయాయి.

ఇంకా దిగువన మరింత పెద్ద అవరోధాలుండవచ్చని భయపడి, బార్ ఖాలిగెంట్ దగ్గర గుర్రాల మందని చూసి తైమూర్ పడవలని తీరం చేర్చి, తన మనుషుల్ని గుర్రాలెక్కమని పచ్చిక బీటిమీదకి వెళ్లిపోయాడు. మంగోలులు అతన్ని వెంటబడ్డారు. తైమూర్ మాలిక్ సైనికులు ఆగి మంగోలుల్ని తరిమేసి మళ్లీ తమ దారిలో వెళ్లారు.

యెవళ్లూ లొంగి పోదలచుకోలేదు. కొంతమంది మాత్రమే మంగోలు శిబిరాల మధ్యనుంచి రాత్రిళ్లు పోతూ బయటపడ్డారు. కొద్దిమంది సైనికులే మిగిలినా తైమూర్ మాలిక్ పోరాటం సాగించాడు. గుర్రాల సత్తామీద ఆధారపడి ఇంకా ఇంకా పచ్చిక మైదానంమీదకి లోపలికంటా పోయాడు.

అతని ఆఖరి తోడు కూడా చనిపోయాడు, పొదిలో మూడు బాణాలు మాత్రమే మిగిలాయి. అప్పటికి ముగ్గురు మంగోలులు ఇంకా తైమూర్ మాలిక్‌ని వెంబడిస్తూనే వున్నారు. ఒక మంగోలు కంట్లోకి ఒక బాణాన్ని కొట్టాడు, మిగిలిన యిద్దరి మీదకీ తనే ఉరికాడు. వాళ్లు గుర్రాలు మళ్లించి పారిపోయారు.

పొదిలో రెండు బాణాలు మిగిలాయి. వాటితోటే తైమూర్ మాలిక్ యెడారిలో ఒక బావిదాకా పోగలిగాడు. అక్కడ కార కోంచర్ నాయకత్వం కింద తుర్కమెన్‌లు ఉన్నారు. వాళ్లతనికి కొత్త గుర్రాన్నిచ్చారు. దానిమీద అతను ఖోరెస్మ్ చేరగలిగాడు. అక్కడ జెంఘిజ్ ఖాన్‌కి వ్యతిరేకంగా యెక్కువ యుద్ధ సన్నాహాలు చెయ్యడం మొదలుపెట్టుడు.

# మంగోలులు ఇసక తిప్పలు దాటతారు

"ఈ దుర్మార్గ ప్రజలు యెంత
వేగంగా ప్రయాణం చేస్తారంటే, చూడని
వాళ్లెవరూ నమ్మరు".
(క్లావిజో, 15వ శతాబ్దం)

ఒత్రార్‌లో తగలడిపోయిన భవన శిధిలాలు ఇంకా పొగలు చిమ్ముతూనే ఉన్నాయి. గోడలమీద యెక్కి ముసురుకు వచ్చే మంగోలులతో ముట్టడించిన కోటలో ఇనాల్‌చిక్ ఖాన్ ఇంకా మొండిగా పోరాడుతూ, రక్షణ కొనసాగిస్తూనే ఉన్నాడు. అప్పుడు జెంఘిజ్ కాన్ తొమ్మిది తోకల తెల్ల జండాని యెగరేస్తూ, దాడికి సన్నద్ధం కమ్మని తన సైన్యానికి ఆజ్ఞ ఇచ్చాడు.

జెంఘిజ్ ఖాన్ తన కొడుకుల్నీ, ముఖ్య దళవాయిల్నీ పిలిచాడు. వాళ్లందరూ పెద్ద బొచ్చు అట్టమీద గుండ్రంగా కూర్చునాన్నరు. తన సైన్యాన్ని యెవడు యెక్కడికి నడిపించాల్సిందీ ప్రతివాడూ ముందే సమాచారం అందుకున్నాడు. కాని తను తన శ్వేతకేతనాన్ని యెక్కడికి నడిపించబోయేదీ జెంఘిజ్ ఖాన్‌ని యెవడు అడగ సాహసించలేదు.

"నేను లేనప్పుడు, తెలివైన దళవాయి బుగుర్జి నాయన్ మన మొత్తం సైన్యానికి అధిపతిగా ఉంటాడు. ఎలగోలు విభాగాల్ని దాడిలో ఉగ్రంగా వుండే జెజె నాయన్, మాటువేసి దాడిచెయ్యడంలో యెంతో అనుభవంగల సుబుదైలు నడిపిస్తారు. పొలాల్లో వున్న పంటల్ని నాశనం చెయ్యకూడదు, గుర్రాలకి తిండి వుండదు. షా మహమ్మద్‌ని బుఖారాకీ, సమర్‌కండ్‌కీ మధ్య మైదానంమీద కలుసుకుందాం. అతనిమీద మూడు వేపులనుంచి దాడిచేద్దాం. ఖోరెస్మ్ షా ముఖ్య సైన్యాన్ని నాశనం చేశాక, నేను సర్వ ముస్లిం భూభాగాలకీ పాలకుణ్ణి అవుతాను".

సైనికుల రక్షణ దేవుడు సుల్దే – శ్వేతకేతన చిహ్న ధరుడు తీర్థంగా కుమిస్ తాగి జెంఘిజ్ ఖాన్ గుర్రం యెక్కాడు. సైన్యం బయల్దేరింది. ఒక భాగం నది సైహూన్ యెగువకి వెళ్లింది. మరొకటి దిగువకి వెళ్లింది. జెంఘిజ్ ఖాన్ స్వయంగా కిజిల్‌కుమ్ ఇసక జాడల్లో బిడారుల్ని అనుసరించాడు.

పగటిపూట ఫిబ్రవరి నెల యెండ తీక్షణంగా, వేడిగా వుండేది. రాత్రిళ్లు నీటి కుంటలు గడ్డకట్టి, మలుపులు తిరిగిన దారి బంకమన్నుమీద గట్టి పడేది. సైన్యం చప్పుడు చెయ్యకుండా కదిలింది. గుర్రాలేవీ సకిలించేవి కావు. ఆయుధాలేవీ ఖంగుమనేవి కావు. ఎవళ్లూ పాటలు పాడేవాళ్లు కారు. సైనిక విభాగాలు ఒక దాని కొకటి దగ్గరగా ఉండేవి. మజిలీలు తక్కువగా ఉండేవి. సైనికులు గుర్రాల ముందు కాళ్ల గిట్టల దగ్గర నేలమీద పడుకునేవాళ్లు.

రాత్రిళ్లప్పుడు వేగులు మండే కాగడాలతో వెళ్లేవాళ్లు. కొండ పైకంటాయెక్కి సైన్యానికి మంటలతో సంకేతాలు ఇస్తూ, సైన్యానికి దారి చూపిస్తూ, ఒక విభాగం మరో విభాగంతో కలిసిపోకుండా ఆపుతూ ఉండేవాళ్లు. ముస్లిం సైన్యాల్లో తుర్కమెన్ ఆశ్వికులు దీర్ఘపాద అశ్వాలమీద వేగంగా పోయేవాళ్లుగా ప్రసిద్ధి చెందారు. వేటాడే చిరుతపులుల్లాగా వాళ్లు కొండల వెనకనుంచి దాడిచేసి, మంగోలు శ్రేణుల్లోకి చొచ్చుకుపోయి వాళ్లని గందరగోళ పరిచేసి, వచ్చినంత వేగంగానూ వెళ్లిపోయేవాళ్లు. ఉచ్చు తాళ్లతో కట్టి ఖైదీల్ని లాక్కుపోయేవాళ్లు.

ఖోరెస్మ్ ముఖ్య రాజధాని గుర్‌గంజ్‌కి యెడారిమీదుగా తమ సైన్యం పోతోందని మొదట మంగోలులు అనుకున్నారు. రెండ్రోజుల యాత్ర తర్వాత సైహున్ బురదనీళ్లు వెనకబడిపోయి, సూర్యోదయం కాగానే – అదీ వెనకగాక యెడమ వేపున – తమ అశ్వాలు పడమటికి గాక దక్షిణాదికి సుప్రసిద్ధ నగరాలైన సమర్‌కండ్, బుఖారాలవేపు తిరిగాయని వాళ్లు గ్రహించారు.

జెంఘిజ్ ఖాన్ సైన్యం మధ్యలో కులాసాగా పోయే పల్లవర్ణం గుర్రంమీద స్వారీ చేసి వెళ్లాడు. దాని కాళ్లు నల్లగా, గట్టిగా వున్నాయి. దాని వెన్నుమీద నల్లని చారవుంది. సైన్యం మొత్తం వేగంగా, వంగుతూ ఒరుగుతూ వుండే అంగలతో వెళ్లింది. తాతార్లు దాన్ని “అయాన్” లేక “తోడేలు అంగ” అంటారు. ఘనమైన ఖాఖాన్ తన గుర్రంమీద మౌనంగా గూఢంగా కూర్చున్నాడు, వసులుగా ఉన్న కళ్లేల్ని యెడంచేత్తో పట్టుకున్నాడు. అతని కళ్లు ముడుచుకున్నాయి. సన్నగా ఉన్న కళ్లని యెప్పుడో గాని తెరవలేదు. స్వారీ చేస్తూ అతను నిద్రపోతున్నాడో, గాఢమైన ఆలోచనలో ఉన్నాడో తెలీదు. అతని అర్ధనిమిలిత నేత్రాలు దగ్గర్లోనూ, దూరంలోనూ వున్న ప్రతిదాన్నీ దేన్నీ మర్చిపోకుండా నిశితంగా చూస్తున్నాయో అన్నిటినీ చూస్తున్నాయో తెలుసుకోవడం అసాధ్యం.

ఈ యాత్రలో జెంఘిజ్ యేమాత్రం ఆలస్యాన్నీ ఒప్పుకోలేదు. యుర్త్‌లని వెయ్యనివ్వలేదు. తను కూడా మడిచిన బొచ్చు అట్టమీదనే పడుకున్నాడు. పడుకునే ముందు తోలు శిరస్త్రాణాన్ని తీసేసి, నెరిసిన తలకి చెవులు కప్పే రెక్కల కుళ్లాయిని పెట్టుకునేవాడు. దానికి నల్ల బొచ్చు అస్తరు ఉండేది. అతను పడుకునేవాడు. అతని పక్కన నలుగురు నమ్మకస్థులైన అంగరక్షకులు కన్ను ముయ్యకుండా, గాలి బారినుంచీ, మంచు బారినుంచీ ఖాఖాన్‌ని బొచ్చు అట్టలతో కాపాడుతూ, పహారా కాసేవాళ్లు.

# బుఖారా ముట్టడి

"కఠినత్వం అవసరమైన చోట మెతకదనం
పనికి రాదు. మెతకదనంవల్ల శత్రువు
మిత్రుడవడు సరికదా అతని కోరికలు
పెరుగుతాయంతే".
(సైది, 13వ శతాబ్దం)

నిద్రపోవడానికి చోటు కోసం నిరర్థకంగా వెదుకుతూ దర్వీష్ హాజీ రహీమ్, కుర్రాడు తుఘాన్, కుర్బాన్ కిజిక్ రోజంతా బుఖారాలో తిరిగారు. సాయంత్రం వేళకి దుకాణాల తలుపులు మూసేసే చప్పుళ్లు చుట్టూ వినవచ్చాయి. గుంపులు చెదిరి వీధుల్లో నుంచి అదృశ్యం అయిపోయాయి. రాత్రికింత చోటు ఇమ్మని అడగడం యీ ముగ్గురు పథికులకీ వ్యర్థం. ఎక్కడికెళ్లినా అదే జవాబు వినవచ్చింది:

"మాకే చోటు లేదు. వేరే చోట ప్రయత్నించండి".

సత్రాలూ, మఠాలూ పిటపిటలాడిపోయాయి. వాటి యజమానులు యేదో కూచోడానికి పనికొచ్చే అసౌకర్యమైన జాగాకి కూడా బోలెడు దిర్హమ్‌లని వసూలు చేశారు. శాంతి భద్రతలని కాపాడే 'రియిజ్‌లు', కర్రలు పట్టుకున్న పహారా వాళ్లు తోడు రాగా దురుద్దేశాలతో వీధుల్లో తిరిగే అనుమానస్తుల్ని "పశ్చాత్తాప అధోబిలాల్లో"కి గెంటేస్తామని బెదిరించారు.

ఆఖరికి, ప్రాకారం వార బోలోడు గుడిసెలు యేటవాలుగా వున్న చోట కనిపించింది. చదును కప్పు వున్న దానిపైకి యెక్కి, ఓ గుబురు కిందనో, గడ్డి కప్పుకునో దాగివుందామని కుర్బాన్ కిజిక్ సూచించాడు. తనే ముందు పైకి యెక్కి, ఆ ఇద్దరికీ సాయం చేశాడు. అక్కడ వాళ్లు ఒకళ్ల దగ్గరగా ఒకళ్లు తాసుకుని చాటున వున్నారు. దర్వీషు పెద్ద అంగీమీద కప్పుకున్నారు.

రాత్రి చలిగాలి వాళ్లమీద వీచింది. చక్కని మంచు పొర కమ్మింది. అర్థరాత్రిదాకా నగరంలో చప్పుళ్లు వినిపిస్తూనే వున్నాయి. ఆఖరికి మణిగాయి. నిశ్శబ్దంగా ఉంది. రాత్రి

కాపలా వాళ్ల రణగొణ, నగరం నలువేపులనుంచీ ఒక దాన్ని బట్టి ఇంకోటి మొరిగే కుక్కల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దం ఆవరించింది.

యెత్తైన మసీదు గోపురాల పైనుంచి మర్నాడు ఉదయం ముస్లింలు ప్రార్థన గీతాలు చదివే వేళకి ఈ ముగ్గురూ నగర ప్రాకారం పైకి యెక్కారు. ఉత్సుకత, భీతి రేగిన జనంతో ప్రాకారం నిండిపోయింది.

తూర్పు ద్వారం ముందు పెద్ద మైదానంమీద ప్రముఖంగా ఓ గుట్ట వుంది. దానిపైన పెద్ద పసుప్పచ్చ వింత గుడారం వుంది. ఆ గుడారం చుట్టూ ఆశ్వికులు సమ్మర్దంగా కదుల్తున్నారు. వాళ్లు మైదానంమీదకి విడివిడి విభాగాలుగా స్వారీచేసుకు వచ్చారు. నగరం ప్రాకారం చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. బుఖారా నగరవాసులకి వాళ్లు వింతగా కనిపించారు. కోప ఘూర్ణితమైన అడివి పందుల్లాగా వాళ్ల చిన్న గుర్రాలు దూసుకుపోతున్నాయి, గిరుక్కున తిరిగాయి, లేకపోతే హఠాత్తుగా ఆగి మరో వేపు దూసుకుపోయాయి. వాళ్ల ఉక్కు శిరస్త్రాణాలు, ఇనప కవచాలూ, యెండలో తళతళ మెరిశాయి, ధూళి మేఘాల గుండా మిణుక్కుమన్నాయి. ఆశ్వికుల కొత్త విభాగాలు తమ ముందు వేలాది మంది రైతుల మూకల్ని తోలుకుని వచ్చాయి. రైతులు తమ పారల్ని, గడల్ని భుజాలమీద పెట్టుకుని మోసుకొచ్చారు.

ఠీవి ఉట్టిపడే దళవాయి ఒకడు ప్రాకారం గోడమీదకి వచ్చాడు. అతను ఒక హాజిబ్. ఉక్కు శిరస్త్రాణం, వెండిలాంటి కవచం వున్నాయి. కుర్బాన్ దండ కట్టుకుని అతని దగ్గరికి పరిగెత్తి వెళ్లి, అతని అంగీ అంచులు ముద్దుపెట్టుకుని అన్నాడు:

"ఘనమైన ప్రభూ! ఇనాన్స్ ఖాన్ నన్ను గుర్తు పట్టావా? నేను నీ రైతుని, పొలంలో పని చేసే కుర్బాన్ కిజిక్ని. సలాం!"

"నువ్విక్కడెందుకున్నావ్? నీ వంద విభాగంతో వుండకుండా?"

"పాదుషా ఆజ్ఞమేరకి నేను నడిచి బుఖారా వచ్చాను, నాస్తికులతో యుద్ధం చేసేందుకు. దారిలో ఓ దొంగ నా గుర్రాన్ని కొట్టేశాడు – అల్లా వాణ్ణి హతమార్చుగాక! ఇక్కడ రెండ్రోజుల బట్టి నేను పని చెయ్యాల్సిన మా వంద విభాగ దళం నాయకుడి కోసం వెతుకుతూ వున్నాను. కాని ఒక్కళ్లు కూడా నాకేసి చూళ్లేదు. పాదుషా కోసం ప్రాణాలర్పించ సిద్ధపడ్డ సైనికుడికేసి చూడ్డానికే యెవళ్లకీ వ్యవధి లేకపోతే వీళ్లతో పోరాడేవాళ్లెవరు?"

"ఇలాంటి సాహసభరిత మాటలు వింటున్నందుకు నాకు సంతోషంగా వుంది. నీకు బలమైన చేతులు వున్నాయి. పొలంలో కష్టపడి పని చెయ్యడంతోటి నీ నడుం వంగిపోయింది. ఈ యుద్ధంలో నువ్వు మహా వీరుడువి కావచ్చు. నిన్ను నా దళంలోకి తీసుకుంటున్నాను. నాతో రా" అన్నాడు ఇనాన్స్ ఖాన్.

దాంతో కుర్బాన్ దర్వేష్నీ, అతని నేస్తం తుఘాన్నీ వదిలిపెట్టి వెళ్లిపోయాడు.

ఇనాన్స్ ఖాన్ వెనక్కాలే వెళ్లాడు కుర్బాన్. ఆరుబయలు స్థలంమీదకి చేరాడు. అక్కడ గుర్రాలు కట్టేసి వున్నాయి. విడిది నెగళ్లు మండుతున్నాయి. పెద్ద పెద్ద అండాలల్లో అన్నం వుడుకుతోంది. అక్కడంతా మాంసం కొవ్వు వాసన కొడ్తోంది. "ఇక్కడ వీళ్లు మనుషుల్ని వూరికే యుద్ధానికి తోలడమే కాదు తిండి కూడా పెట్తారు" అనుకున్నాడు సంతోషంగా కుర్బాన్.

"హోయ్! ఓరజ్!" అని ఇనాన్స్ ఖాన్ నల్లని గడ్డం, మబ్బు ముఖం వున్న తుర్క్‌మెన్‌ని పిలిచాడు. అతను పొడుగ్గా వున్నాడు. దళవాయిని చూసి అతను వంగి వందనం చేశాడు. "ఇదుగో, ధైర్యవంతుడైన ఒక సైనికుడు నీకు–కుర్బాన్ కిజిక్. మేడి పట్టి పొలంలో బాగానే దున్నేవాడు. ఇప్పుడు యుద్ధంలో మంచి ఆశ్వికుడవుతాడు".

"అతన్ని గుర్రంమీద వుంచనా లేకపోతే కాల్బలంలో పోరాడతాడా?"

"అతనికి కత్తినీ గుర్రాన్నీ యేం కావలసి వస్తే దాన్నీ యియ్యి. అల్లా నిన్ను కాపాడతాడు" అని చెప్పి ఇనాన్స్ ఖాన్ వెళ్లిపోయాడు.

"ఇదిగో నీ గుర్రం" అన్నాడు ఓరజ్, ఇతర గుర్రాలతోబాటు కాకుండా విడిగా కట్టేసిన పెద్ద బూడిద రంగు గుర్రం దగ్గరికి తీసికెళ్లి. "మహా ఉగ్రమైన గుర్రం. అంచేత వెనక వేపునుంచి వెళ్లకు – చంపేస్తుంది. ముందు వేపునుంచి వెళ్లు, వెంటనే కళ్లేలు పట్టుకో. నీకు మచ్చిక అవుతుంది. ఒక్కటే వుంది చిక్కు – వరసలో వుండదు, దౌడు తీసేటప్పుడు బాణంలాగా దూసుకుపోతుంది. అంచేత కళ్లేలు మాత్రం వదలకు. లేకపోతే మనం యుద్ధం మొదలుపెట్టినప్పుడు సరాసరి తాతార్‌ల దగ్గరికి తీసుకుపోతుంది".

కుర్బాన్ హెచ్చరికగా గుర్రం దగ్గరికి వెళ్లాడు. అతను దగ్గరకి రాగానే అది చెవుల్ని వెనక్కి విసిరింది. పళ్లు ఇకిలించి వెనక కాళ్లు చూపించింది. "అల్లా నన్ను కాపాడాలి" అనుకున్నాడు కుర్బాన్. నెగడు దగ్గరికి వెళ్లిపోయాడు. ఓరజ్ అతనికి పెద్ద పాత కత్తినీ, అరిగిపోయిన పసుప్పచ్చ సవారీ పాదరక్షల జతనీ ఇచ్చాడు. కొంచెం వెచ్చటి తిండి తినమని పిలిచాడు. తను ఇతరుల మాదిరీ నిజంగా ఆశ్వ సైనికుణ్ణని కుర్బాన్‌కి అనిపించింది.

సాయంత్రం వేళకి సైనికులందరూ తమ గుర్రాలకి బార్లీ దాణా పెట్టి, కొంత జీను సంచీల్లో పెట్టుకున్నారు. కుర్బాన్ అలానే చేశాడు.

"ఇప్పుడు వేడి వేడి పని మొదలవుతుంది" అని "గుర్రాలెక్కండి!" అంటూ ఓరజ్ అరిచాడు.

అందరూ గుర్రాలెక్కారు. కొంచెం యాతన పడ్డాక కుర్బాన్ తన గుర్రం యెక్కాడు. మిగతా వాళ్లతోబాటుగా బుఖారా ఇరుకు వీధుల్లో బయల్దేరాడు.

"ఇప్పుడు మనం ముట్టడించేవాళ్ల వెంట పడుతున్నాం. మనలో యెంతమంది బయటపడతారో" అన్నాడు కుర్బాన్ పక్కన వున్న రౌతు.

ఆ దళం నగర ద్వారం దగ్గర ఆగింది. అక్కడ కొంత ఆరు బయట స్థలం వుంది. అక్కడికి ఇతర దళాలు వస్తున్నాయి. ప్రస్తుతంలో అయిదు వేల మంది ఆశ్వికులు చేరారు.

అనేక విభాగాల దళవాయిలు ఇనాన్స్ ఖాన్ దగ్గరికి వచ్చారు. అతను వాళ్లకి ఈ సూచనలు ఇచ్చాడు:

"తాతార్ ఖాఖాన్ వున్న పసుప్పచ్చ గుడారంమీద దాడి చెయ్యబోతున్నాం. దొరికిన ప్రతివాణ్ణి చంపెయ్యండి! ఖైదీల్ని పట్టుకోకండి! మనం పోయి తాతార్ శిబిరాన్ని గందరగోళ పరుద్దాం, ఇక మిగిలిన సైన్యానికి ఈ పాషండులతో యుద్ధం చెయ్యడం సులభం. అల్లా ధైర్యవంతులకి సాయం చేయుగాక!"

ఇనపకట్లు వున్న పెద్ద తలుపులు తెరుచుకున్నాయి. రౌతులు నగరంలోనుంచి బయటికి పోవడం మొదలుపెట్టారు. కుర్బాన్ మైదానంమీదకి రాగానే ఆ చీకట్లో అతనికి యేమీ కనిపించలేదు, ముందు పోతూ వున్న ఆశ్వికుల నీడలు, తాతార్ శిబిరంలో మండుతున్న అసంఖ్యాక నెగళ్లు తప్ప. గుర్రాలు మెల్లిగా గెంతుతూ తర్వాత దౌడు అందుకున్నాయి. కుర్బాన్ యెక్కిన బూడిదరంగు గుర్రం అతనెంత అదుపు చేస్తూ వున్నాగానీ, పళ్ల మధ్య కళ్లెంతో వేగం పుంజుకుని సులభంగా మిగతా వాటిని మించిపోతూ వుంది.

అయిదు వేల మంది ఆశ్వికులు హిమపాతంలాగా తాతార్ శిబిరంమీద పడ్డారు. భీకర గర్జాఘోషతో నెగళ్లమీద విరుచుకుపడుతూ మనుషుల్ని కసాపిసా తొక్కేస్తూ, చెల్లాచెదురైన మూటలమీదనుంచీ సంచులమీదనుంచీ పోయారు.

తాతార్లు గుర్రాలమీదకి పాకి అన్ని వేపులకీ దడదడాపోయారు. కుర్బాన్ మిగతా రౌతులతోబాటుగా అరుస్తూ, బరువైన కత్తిని తిప్పుతూ పోయాడు. ఒకణ్ణి గాయపరిచాడు. ఇంకొకణ్ణి తొక్కాడు. తాతార్ ముఖ్య ఖాన్ పసుప్పచ్చ గుడారానికి దౌడు తీసివెళ్లాలని యెంతో గాఢంగా కోరుకున్నాడు.

తమ దళం మొత్తం ఇక ఎంత మాత్రమూ తాతార్‌లని వెంబడించడంలేదనీ, వెనక్కి తిరిగిపోయిందనీ, మరో దిశలో దౌడు తీసిపోతోందనీ హఠాత్తుగా గుర్తించాడు. అతని బూడిదరంగు గుర్రం తల తిప్పి ఇతర రౌతుల వెనక ఉరుముకుంటూ పోతోంది. గుర్రమూ తనూ కలిసి కందకంలో కూరుకుపోకుండా రక్షించు దేవుడా అని అల్లాని ప్రార్థించాడు.

గుర్రాలు చాలా సేపు దౌడు తీశాయి. కాని ఆఖరికి మందగించి నడిచాయి. బుఖారానుంచి పడమటికి పోయే రాస్తామీద యీ విభాగం వెళ్లింది.

రాత్రంతా రౌతులు స్వారీ చేస్తూనే వున్నారు. ఉదయం వేళకి ఇనాన్స్ ఖాన్ ఆగమన్నాడు.

"గుర్రాలని కాసేపు సేద దీర్చుకోనిద్దాం. తర్వాత జైహూన్ నది దగ్గరికి వెళ్లి, దాటి, ఖోరెస్మ్ షా సైన్యాలతోటి కలుద్దాం."

సరిగ్గా ఆ సమయంలో గుర్రాల గిట్టలచప్పుడు, పిచ్చి అరుపులు వినిపించ నారంభించాయి. తాతార్లు రావడం దూరంలో కనిపించింది. భీకర గర్జతోటి వాళ్లు విడిది శిబిరానికి ఉరుముకుంటూ పోయారు. బుఖారా రౌతులు సరిగ్గా జీనుల పడీపడకుండానే, ధైర్యం పోయి, పోరాటం చెయ్యకుండా దౌడు తీసుకుపోయారు. ఆ రకంగా తమ మృత్యువుని తెచ్చుకున్నారు. దాదాపు ఆ సైన్య విభాగన్నంతా తాతార్లు నాశనం చేసేశారు.

కవి అన్నాడు: "మృత్యు భయంతో బతికేవాణ్ణి చావు పట్టుకుంటుంది, వాడు యేడు అంతరాల్లో దాంకున్నాగానీ".

# పోరాటం లేకుండా బుఖారా లొంగిపోతుంది

“తన పంటబోదెని కాపాడుకోలేకపోతే
దాన్ని నాశనం చేస్తారు. మరొకడి మీద
దాడిచేసిన వాడు అవమానం పాలవుతాడు”.
(ఆరబ్ సూక్తి)

ఇనాన్స్ ఖాన్ అయిదువేల మంది సైనికులు “ఘనమైన బుఖారాని” రక్షించడానికి బదులుగా, యుద్ధ కీర్తికి బదులు సిగ్గు మాలిన పలాయానాన్ని స్వీకరించడంతో మిగిలిన ముఖ్య వాసస్థులు – మన్నీళ్లు, ఇమామ్‌లు, ఆలిమ్‌లు, పండితులు, ధనిక వర్తకులు – ముఖ్య మసీదులో సభ జరిపారు. దీర్ఘ సంభాషణ తర్వాత వాళ్లు నిర్ణయించారు:

“వంచిన తల బహుకాలం వుంటుంది. అంచేత జెంఘిజ్ ఖాన్ కొలువు చేద్దాం పట్టండి”.

“మనుషులంతా మనుషులే: తాతార్ ఖాన్ మన విన్నపాలు వింటాడు. మన తల నెరిసిన పెద్ద మనుషులని అతను గౌరవిస్తాడు. ఒక మహా నగరపు పౌరులకి, ‘విద్వత్ ప్రపంచంలో తేజోవంతమైన నక్షత్రంగా’ పేరుగాంచిన నగరవాసులు తన ముందు అణుకువగా లొంగి వుంటున్నందుకు, జాలి చూపిస్తాడు”.

పట్టు అంగరఖాలు, ముఖమల్ అంగరఖాలు తొడుక్కని నగరద్వారాల పదకొండు బంగారు తాళాలని వెండి తళ్లికమీద పెట్టుకుని గుంపుగా పసుప్పచ్చ గుడారంకేసి బయల్దేరారు. ఖాఖాన్ ముఖ్య దుబాసీ గుర్రం యెక్కి వెంటనే స్వారీ చేస్తూ వీళ్ల దగ్గరికి వచ్చాడు. అతను పూర్వం గుర్‌గంజ్‌లో సంపన్నుడైన వర్తకుడు. విదేశాలకి బిడారులతో దీర్ఘ యాత్రలు చేసే రోజుల్లో యెన్నో భాషలు నేర్చుకున్నాడు.

పెద్దల్లో వృద్ధుడు అన్నాడు:

“మా నగరపు ప్రాచీన కుడ్యాలు చాలా దృఢమైనవీ, యెత్తైనవీనీ. వాటిని ముట్టడించాలంటే చాలా యేళ్లు పడుతుంది, చెప్పలేనంత శ్రమ పడాలి. అంచేత జనాభాని

రక్తపాతం నుంచి రక్షించడానికి పాదుషా జెంఘిజ్ ఖాన్ ఘనమైన సైన్యానికి పెద్ద నష్టం కలగకుండానూ, పోరాటం లేకుండానే నగరాన్ని వదిలిపెట్టడానికి వేం సిద్ధంగా వున్నాం-మంగోలు పాలకుడు ఓటమి పొందిన వాళ్లపట్ల దయ చూపించినట్లయితే".

"ఆగండి!" అన్నాడు దుబాసీ.

నిదానంగా అతను పసుప్పచ్చ గుడారానికి వెళ్లి, అంతే నిదానంగానూ పెద్దల దగ్గరికి వచ్చాడు. వాళ్లు భయంతో వణికిపోతున్నారు.

"పెద్దలారా! వినండి ఘనమైన ఖాఖాన్ మాటలు: "గోడల బలమూ, అభేద్యతా రక్షించుకునేవాళ్ల ధైర్యంమీదా బలంమీదా ఆధారపడి వుంటాయి. మీరు గనక పోరాటం లేకుండా లొంగిపోదలచుకున్నట్టయితే ద్వారాలు తెరిచి, నిరీక్షించమని ఆజ్ఞాపిస్తున్నాను".

తలబిరుసుగా వుండే ముఖ్యులైన పెద్దలు గడ్డాలు చేతుల్తో పట్టుకుని అనుమానంగా తలలు ఆడించి ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకున్నారు. వాళ్లు గందరగోళ పడిపోయి, బిత్తరపోయి ఆ నగరవాసులకి యేం మూడుతుందో చూడలేక నగరానికి తిరిగివచ్చారు.

బుఖారా ప్రాచీన ప్రాకారకుడ్యాలు యెంతో గట్టివి, యెత్తైనవి. శాంతియుతంగా బతికే జనాభాకి యెన్నో నెలలు రక్షణ నిచ్చేటటువంటివి. కాని ఆ రోజున దుర్బల హృదయుల గొంతుకనే విన్నారు, ప్రతిఘటించాలి అన్న వాడ్ని పిచ్చివాడన్నారు.

ఆ నగరద్వారాల తాళాలని అప్పగించేసినందుకు దుర్గ రక్షక అధిపతి, అతని దళవాయిలు, సైనికులు ఇమామ్‌లనీ, ముఖ్య పెద్దలనీ, తిట్టి, కొన ఊపిరిదాకా పోరాటం చెయ్యాలని తీర్మానించుకున్నారు. వాళ్లు షాహ్రిస్తాన్ లోపల కాపుదలగా వుండే చిన్న కోటలో మాసేసుకున్నారు.

పదకొండు ద్వారాలూ ఒకేసారి తెరుచున్నాయి. వేలాది తాతార్లు వేగంగా ఇరుకు వీధులలో వచ్చి పడ్డారు. వాళ్లు కచ్చితమైన క్రమశిక్షణతో కవాతు చేసారు. వేర్వేరు దళాలు నగరంలో అనేక భాగాలని ఆక్రమించుకున్నాయి.

మంగోలు సైనికులు అన్ని ముఖ్య వీధుల్నీ ఆక్రమించాక అంగరక్షకుల విభాగం ఒకటి స్వారీ చేసుకువచ్చింది. వాళ్లు తెల్లని గుర్రాలమీద వచ్చారు. గుర్రమూ రౌతూ కూడా మోకాళ్లదాకా ఇనప కవచాలతోటి ఆచ్ఛాదితులై వున్నారు.

యెంపిక చేసిన ఈ వేలమందిలోనూ మధ్యన కనిపించాడతను కూడా: ప్రాచ్య పాలకుడు, అగ్ని జ్వాలలాగా కిజిల్‌కుమ్ ఇసక తిప్పలమీదనుంచి సుళ్లు తిరుగుతూ వచ్చిన వాడు. ముందు మహాకాయుడైన మంగోలు ఒకడు నడిచి వచ్చాడు. అతను తొమ్మిది గుర్రపు తోకలతో వున్న శ్వేతకేతనాన్ని పట్టుకున్నాడు. అతని వెనక ఇద్దరు ఆశ్వికులు జీనులేని ఒక తెల్ల గుర్రాన్ని నడిపించుకువచ్చారు. దానికి ఉగ్రమైన నల్లని కళ్లు ఉన్నాయి. అప్పుడొచ్చాడు మహా ఖాఖాన్.

నల్లని పొడుగాటి అంగీ తొడుక్కుని సామాన్య తోలు ముస్తీబు వేసిన వెడల్పాటి వెన్ను మీగడరంగు గుఱ్ఱంమీద వచ్చాడు.

జెంఘిజ్ ఖాన్ మౌనంగా స్వారీ చేసుకువచ్చాడు. యెత్తరిగా వున్నాడు. భారమైన భుజాలున్నాయి. తోలు పటకాలోనుంచి వంపు తిరిగిన నిడుపాటి కరవాలం నల్లని ఒరలో వేలాడుతోంది. అతని నల్లని శిరస్త్రాణం మెడ వొంపు దగ్గర కాపుగా వుండే పొడుగుతో వుంది. దానికి ఉక్కు నాసికా రక్షణ వుంది. ఇవీ, యే భావమూ ద్యోతకం కాని నల్లని ముఖమూ, కొంచెం నెరిసిన ఎఱ్ఱటి గడ్డమూ, మంగోలు నేత్రాలు – అంతా కూడా ఖోరెస్మ్ షాల జిగేల్‌మనే బంగారు శోభిత వైభవంతోటి పోలిస్తే చాలా వింతగా కనిపించింది.

జెంఘిజ్ ఖాన్ ప్రధాన శృంగాటంలోకి ప్రవేశించాడు. అక్కడ అతని అంగరక్షక దళ ఆశ్వికులు చతుర్భుజంలోని మూడు భుజాలుగా బారులు తీరారు. తోసుకువచ్చే గుంపుని వెనక్కి నెడుతున్నారు. యెత్తుగా వున్న మసీదు మెట్లమీద మత ప్రముఖులు, న్యాయ ప్రముఖులు, ఇతర ముఖ్య పౌరులు వున్నారు.

మంగోలు పాలకుడు మసీదు దగ్గరికి రాగానే జనం అంతా నేలకేసి ముఖాలు దించి పడిపోయారు, గుఱ్ఱం కాళ్ల కింద ధూళిలాగా. ఇలా చెయ్యడం వాళ్లకి వాళ్ల పాదుషా ముందు అలవాటే. కొంతమంది వృద్ధులైన ఆలిమ్‌లు మాత్రం నిటారుగా దండలు కట్టుకుని నుంచున్నారు. పాలకుడి ముందు మోకరిల్లాలి అనే విధినుంచి వాళ్లని వాళ్ల విద్వత్తు విముక్తం చేసింది.

"పాదుషా జెంఘిజ్ ఖాన్ వర్ధిల్లాలి! ప్రాచ్య భానుడు వర్ధిల్లాలి!" అంటూ ఒక పెద్ద సన్నగా కీచుమనే గొంతుకతో గట్టిగా అరిచాడు. మొత్తం గుంపు అంతా క్రమపద్ధతిలేని బృందస్వరంతో యీ మాటల్ని రెట్టించింది.

జెంఘిజ్ ఖాన్ కళ్లు ముడిచి మసీదు యెత్తు కమానుని ఒక్క చూపుతో అంచనావేసి, కమ్చీతో కొట్టి గుర్రాన్ని రాతి మెట్లమీదకి యెక్కించాడు.

"నగర పాలకుడి ఇల్లైన భవంతి ఇదేనా?" అని ఖాఖాన్ అడిగాడు.

"కాదు, ఇది దేవేడి ఇళ్లు" అన్నారు ఇమామ్‌లు.

అంగరక్షకులు పరివేష్టించిరాగా జెంఘిజ్ ఖాన్ మసీదులోని విలువైన వెడల్పాటి తివాసీలమీద లోపలకంటా వెళ్లాడు. మనిషికంటే యెత్తుగా వున్న ఒక వేదికమీద కొరాన్ గ్రంథం తెరిచి వుంది. అది చాలా పెద్దదిగా వుంది. జెంఘిజ్ ఖాన్ అక్కడ గుఱ్ఱం దిగాడు. తన కనిష్ట పుత్రుడు తులీ ఖాన్‌తో కలిసి ఖాఖాన్ గోపురం మెట్లు కొన్ని యెక్కాడు. ఆ గోపురంమీదనుంచే ఇమామ్‌లు మతోపన్యాసాలు చేస్తారు. తెలుపు, ఆకుపచ్చ తలగుడ్డలు చుట్టుకున్న పెద్దలు జెంఘిజ్ ఖాన్ ముందు మూగారు. జేగురు రంగు ముతకగడ్డం వున్న యే భావమూ ద్యోతకం అవని నల్లని ముఖంకేసి రెప్ప వెయ్యకుండా చూస్తూ వుండిపోయారు.

భీకర విధ్వంసంకుడైన అతన్నుంచి దయ వస్తుందో, లేక తీవ్ర ఆగ్రహం వస్తుందోనని నిరీక్షిస్తూ వుండిపోయారు.

"మీ షా కొండంత దుర్మార్గాలు చేశాడు. నేను అతన్ని శిక్షించడానికి దేవుని కొరడాలాగా, శాస్త్రిలాగా వచ్చాను. ఈ క్షణంనుంచీ షా మహమ్మద్‌కి యెవళ్లూ రక్షణగాని, గుప్పెడు మెతుకులుగాని ఇవ్వకూడదని మేం శాసిస్తున్నాం" ఖాఖాన్ అన్నాడు. తర్వాత మసీదు గుమ్మాల దగ్గర తొక్కిసలాడే తన సైనికుల్ని పిలిచాడు:

"వినండి, నా అజేయులైన సైనికులారా! పొలాల్లోనుంచి ధాన్యం తీసుకుపోయారు, మన గుర్రాలకి పెట్టడానికి యేమీ లేదు. గాదులు మాత్రం ధాన్యంతో పూటుగా వున్నాయి. అవి మీకు తెరిచే వుంటాయి. గుర్రాలకి కడుపు పట్టినంత మేత పెట్టండి".

మంగోలుల కేకలతో చౌకు నిండిపోయింది.

"బుఖారా గాదెలు మనకి తెరుచుకునే వున్నాయి. మన గుర్రాలకి మేత పెట్టమని మహా ఖాఖాన్ ఆజ్ఞ ఇచ్చాడు".

గోపురం మీదనుంచి దిగి వస్తూ జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞాపించాడు:

"ఈ పెద్ద లొక్కొక్కళ్ల దగ్గరా ఒకో భగత్తూర్‌ని పెట్టండి! ఈ పెద్దలు యేం దాచుకోకుండా సంపన్న గృహాలన్నింటినీ, ధాన్యాగారాలన్నిటీ్నీ సరుకులతో వున్న దుకాణాలన్నిటీ్నీ చూపించనియ్యండి. రాతగాళ్లు యీ పెద్దలనుంచి సంపన్నులైన వర్తకులందరి పేర్లూ తీసుకుని రాయాలి. ఈ వర్తకులు ఓత్రార్‌లో మా వ్యాపారులని చంపి లాక్కున్న వస్తువులన్నిటీ్నీ నాకు తిరిగి అప్పగించాలి. ఈ నగరంలో వుండే సంపన్నులైన వర్తకులు ఇక్కడికి తిండి తీర్థాలని తీసుకురావాలి. మా సైనికులు శుభ్రంగా తిని, సంతోషంగా ఉండి పాటలు పాడి నాట్యం చేసుకుంటారు. ఇవాళ నేను బుఖారా ఆక్రమణని ముసల్మాన్ దేవుడి మందిరంలో జరుపుకుంటాను".

పెద్దలు మంగోలు సైనికులతో వెళ్లిపోయారు. తర్వలోనే రాగి దేగిసాలు, బియ్యం బస్తాలు, గొర్రె కళేబరాలు, కూజాలు, నూనె డబ్బాలు సారాకుండలు ఒంటెలమీద వేసి తీసుకువచ్చారు.

# కెరులెన్ పచ్చిక మైదానాలు యెంత బాగున్నాయి!

ప్రధాన మసీదు ముందు వున్న చౌకులో నెగళ్లు మండుతున్నాయి. కుతకుత ఉడికే దేగిసాలలో బియ్యం, కొందిన మాంసం నిండుగా వున్నాయి.

మసీదు ప్రవేశద్వారానికి ముందున్న యెత్తు భరంతుమీద పట్టు మెత్తలపైన జెంఘిజ్ ఖాన్ కూర్చున్నాడు. అతని చుట్టూ సైనిక అధికార్లూ, సొంత అంగరక్షకులూ వున్నారు. ఒక పక్కన బుఖారా సంగీతకారులు, అనేక జాతులకి చెందిన పడుచు అమ్మాయిల గమని బృందం – వీళ్లని బుఖారా పెద్దలు పోగుజేశారు – తప్పెట్లునుంచి తాళాలదాకా నానా రకాల వాయిద్యాలమీద వాయిస్తూ వున్నారు.

విశిష్టులైన ఇమామ్‌లూ, ఆలిమ్‌లూ మంగోలుల గుర్రాలని కాసేరు. వాటికి గడ్డి మేత వేశారు. జెంఘిజ్ ఖాన్ దుబాసీ మహమ్మద్ యాలవాచ్ ప్రతిదాన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తూ ఖాఖాన్ పక్కన కూర్చున్నాడు. అతని వెనక ముగ్గురు రాతగాళ్లు గొంతుకూచున్నారు. వాళ్లు అంతకు ముదు అతని దగ్గర వున్న లేఖరుల్లోనుంచి యెంపిక చేసిన వాళ్లు. ఆ ముగ్గురూ రంగురంగుల కాగితం ముక్కలమీద మంగోలు ఠాణాలద్వారా వెళ్లడానికి అనుమతి పత్రాలనీ, ఆజ్ఞలనీ గబగబా రాస్తూ వున్నారు.

ఒక మంగోలు భరంతుమీద వున్న మందిలోనుంచి దారి చేసుకుంటూ, మహమ్మద్ యాల్‌వాచ్ దగ్గరికి వెళ్లి చెవిలో చెప్పాడు:

"మా గస్తీ ఇద్దర్ని పట్టుకుంది – ఒకడు షామాన్ రకంవాడు, యెత్తైన కూచి కుళ్లాయి పెట్టుకున్నాడు. రెండోవాడు కుర్రాడు. మా వాళ్లు ఇద్దర్నీ సఫా చేసేసే వాళ్లే ఇంతట్లోకీ ఆ పెద్దాడు మన భాషలో అన్నాడు: 'మమల్ని యేం చెయ్యకండి! మహమ్మద్ యాల్‌వాచ్ మా పెంపుడు తండ్రి – మా అండా'. షామాన్లనీ, మంత్రగాళ్లనీ యేం చెయ్యద్దని మాకు ఆజ్ఞలు

వున్నాయి. పైగా అతను నీ అండానని అంటున్నాడు. అంచేత వాళ్లమీద ప్రస్తుతానికి చెయ్యి వెయ్యద్దని మా వాళ్లతో చెప్పాను. అతన్ని యేం చెయ్యమంటావు?"

"ఇక్కడికి తీసుకు రా".

ఆ మంగోలు వాడు హాజీ రహీమ్‌నీ, తుఘాన్‌నీ తీసుకువచ్చాడు. మహమ్మద్ యాలవాచ్ రాతగాళ్ల పక్కన కూర్చోమ్మని వాళ్లకి చేత్తో సైగ చేశాడు.

జెంఘిజ్ ఖాన్, సారా విందు అప్పుడు కూడా, బుద్ధి నైశిత్యం కోల్పోయేవాడు గాడు. ప్రతిదాన్నీ గమనించేవాడు. కళ్లతోటే మహమ్మద్ యాలవాచ్‌కి సైగజేశాడు. యాలవాచ్ లేచి అతని దగ్గరికి వెళ్లాడు.

"యెవళ్లు వీళ్లు?"

"నీ ఆజ్ఞమేరకి నేను యెడారి దాటి వెళ్లి, బందిపోట్ల దాడికి గాయపడ్డప్పుడు ఈ మనిషి నన్ను మృత్యు ముఖంనుంచి రక్షించాడు. అతన్ని గురించి నేను శ్రద్ధ పట్టాలికదా?"

"అలాంటి దానిగ్గాను నువ్వతన్ని నెత్తిమీద పెట్టుకోవాలి. సరే చెప్పు, అతనా యెత్తు కూచి కుళ్లాయి పెట్టుకున్నాడేం?"

"అతను విజ్ఞానార్జన చేసే ముస్లిం, గాయకుడు. అతను బొంగరంలాగా తిరగ్గలడు, సత్యవాది. అలాంటి మనుషుల్ని సామాన్య జనం గౌరవించి, భిక్ష ఇస్తారు".

"నా ముందు బొంగరంలా తిరగమను. ముసల్మానులు యెలా నాట్యం చేస్తారో చూస్తాను".

మహమ్మద్ యాల్‌వాచ్ తన స్థానంలోకి వెళ్లి దర్వేషుకి చెప్పాడు:

"దర్వేషుల నాట్యం చూపించమని మా పలకులు ఆజ్ఞ చేస్తున్నారు. జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞలని శిరసావహించకపోతే తల తెగిపోతుంది తెలుసు కదా. నీకు చేతనైనంత బాగా చెయ్యి, పిల్లనగ్రోవిమీద వాయిస్తా".

హాజీ రహీమ్ తన మూటనీ, కాష్‌కుల్‌నీ, దండాన్నీ తివాసీమీద పెట్టాడు. జ్వాజ్వల్యమానంగా మండే నెగళ్ల చుట్టూ కూచున్న వాళ్ల మధ్యకి వెళ్లాడు. బాగ్దాద్‌లో దర్వేష్‌ల మాదిరీ భంగిమ పెట్టాడు – చేతులు చాచాడు, కుడి అరచెయ్యి కిందికి తిప్పాడు, యెడమ అరచెయ్యి పైకి చాచాడు. కొన్ని క్షణాలు నిరీక్షిస్తూ నిశ్చలంగా వుండిపోయాడు. మహమ్మద్ యాల్‌వాచ్ పిల్లనగ్రోవిమీద విచారకరమైన పాట వాయించడం మొదలుపెట్టాడు. అది కాసేపు పిల్లవాడి కూనిరాగంలాగా ఉంది, కాసేపు గిజిగాడు పక్షి భయవిహ్వాలమైన అరుపులా వుంది.

వాయిద్యకారులు మెల్లిగా తప్పెట వాయించారు. దర్వీషు ఒక వృత్తంలో కదలడం మొదలుపెట్టాడు, పాత రాతి పలకల మీద చప్పుడు చెయ్యకుండా జారుతూ కదిలాడు. అదే సమయంలో గిరుక్కున తిరిగాడు కూడా, మొదట మెల్లిగా, తర్వాత క్రమేపీ వేగం హెచ్చిస్తూ. అతని నిడుపాటి అంగీ బుడగలాగా ఉబ్బింది. ఇంకా ఇంకా దీనంగా, ఇంకా ఇంకా భీతి చెందిన పక్షిలాగా పిల్లనగ్రోవి స్వరం హెచ్చింది. కాసేపు నిశ్శబ్దంగా మణిగిపోయేది, తప్పెట మాత్రమే మోగుతూ వుండగా. తర్వాత మళ్లీ దీన రోదనగా మారేది.

ఆఖరికి దర్వీషు బొంగరంలాగా ఒకే స్థితిలో గబగబ తిరిగి, అరచేతులమీద నేల పైన పడ్డాడు. నోకర్లు అతన్ని పైకి యెత్తారు. రాతగాళ్ల పక్కన చేర్చారు. జెంఘిజ్ ఖాన్ అన్నాడు:

"ఈ బుఖారా నాట్యగానికి ఓ ఛషకం సారా అనుగ్రహిస్తున్నాను, సుళ్లు తిరిగే బుర్రకి స్థిమితం వస్తుందని. కాని మా మంగోలు నాట్యగాళ్లు ఇంకా హుషారుగా చేస్తారు, ఇంకా యెక్కువ గెంతుతారు. వాళ్ల పాటలు ఉల్లాసంగా వుంటాయి. ఇప్పుడు మంగోలు గాయకుల్ని వినాలనుకుంటున్నాం".

ఖాఖాన్ ముందున్న ఖాళీ జాగాలోకి ఇద్దరు మంగోలులు గెంతారు. ఒకతను వృద్ధుడు, మరొకడు పడుచువాడు. కాళ్లు మడం వేసి ఇద్దరూ యెదురు బొదురుగా కూచున్నారు. పడుచువాడు పాడాడు:

అంకెకురాని మంద, అలవిలేని అవని
తల్లితోబాటు గోడిగకు తలపు వచ్చు;
తరుణ ఊఢకు తల్లి తలపునకు
వచ్చు తన ప్రసవ సమయాన.

మంగోలులు పల్లవి అందుకున్నారు:

ఓయ్, కలిమి కీర్తులు నావి!

వృద్ధ మంగోలు పాడాడు:

జెంఘిజ్ ఖాన్ని కాంచిన అందరు–
యెంతో కాలం వేచిన లోకం
వీరుడు జెంఘిజ్ కిత్తురు కీర్తి
చేతలతోటీ, పాటలతోటీ.

"జెంఘిజ్ ఖాన్కి జయం!" అంటూ మంగోలులు అరిచారు.

"ఇప్పుడు అందరం వినోదిద్దాం" అందరూ ఈలలు వేసి కదంతొక్కి, చేతులతో చప్పట్లు చరిచారు.

నాట్యగాళ్లు వృత్తం మధ్యలోకి వచ్చేరు. ఒకళ్లకి అభిముఖంగా ఒకళ్లు రెండు బారులు తీరారు. మంగోలు పాటకి, తప్పెట వాయిద్యానికి అనుగుణంగా వాళ్లు నుంచున్న చోటే యెలుగుబంటి కదలికల్ని అనుకరిస్తూ నాట్యంచేశారు. ఆ మాదిరీ వికారంగా వూగారు, తడబడి నడిచారు, ఒకళ్ల మడమల్ని ఇంకొకళ్లు నేర్పుగా తన్నారు. వున్నట్టుండి, గాలిలోకంటా యెత్తుగా యెగురుతూ, కత్తులు దూసి గిరగిర తిప్పాడు. ఆ ఉక్కు కత్తులు మండే నెగడు మంటల యెర్రని వెలుగులో తళక్కుమన్నాయి.

జెంఘిజ్ ఖాన్ తన జేగురంగు ముతక గడ్డాన్ని తన పెద్ద చేతితో రాసుకుంటూ, జ్యోతుల్లా జ్వలించే కళ్లని రెప్ప ఆర్పకుండా చూస్తూ నిశ్చలంగా మౌనంగా కూర్చున్నాడు.

నాట్యం, కదం తొక్కడం ఆగాయి. కొత్త పాటగాడొకడు పిచ్చిగా విజయోత్సవ గీతం పాడాడు. అది జెంఘిజ్ ఖాన్‌కి ఇష్టమైన పాట:

మంగోలులు, మంగోలులు
పచ్చిక బీటి మంగోలులు
నీలి నీళ్ల కెరులెన్
స్వర్ణజలం ఓనన్.
మూడింతలు ముప్పై, మూడింతలు ముప్పై
మూడింతలు ముప్పైనే అణగ దొక్కినాం మనం.
మనుషులుగా వుండి నోళ్లు మట్టి గలిసినారు
అణగ దొక్కినాం మనం.
ఎడారులూ, ఎడారులూ
ఇసుక సైకతాలూ
మహా సికత భూములూ
ఎర్ర ఇసక యెటు విస్తరించెనో!
జనం జనం జనం జనం
మనం జనానికి యములోళ్లం
స్కంధావారం, స్కంధావారం

జెంఘిజ్ ఖానుడి స్కంధావారం
చంపండీ చంపండీ
పిన్నల పెద్దల చంపండీ
సైన్యం కదనం చేసిన చోట
నేల పచ్చగా నిలిచి పోవుగా.
మంగోలులు బతుకుతారు
మంగోలులు బుతుకుతారు
మంగోలులు బతుకుతారు
మరి అందరికీ మరణం!
ప్రపంచాధిపతిని నేను
ప్రపంచాధిపతిని నేను
ప్రపంచాధిపతిని నేను
అని జెంఘిజ్ అన్నాడు.
దాని సంపద నిత్తు మీకు
దాని సంపద నిత్తు మీకు
లోక సంపదలన్ని మీకె
పోయినోళ్ల వారసులా!
బీటి గాలులు వీచిపోవును
బీటి గాలులు వీచిపోవును
అంతులేని బీటి భూములు
నేల అంచుకి పాకి పోవును.
బీటి గాలుల వోలె మనమూ
వీచిపోదుము, పాకి పోదుము
అవధిలేని అబ్ధితోటి
అవని చేరి కలియు తావుకు.

తనకి ఇష్టమైన ఈ పాటని విని జెంఘిజ్ ఖాన్ లయకి వూగి తల ఆడించి, గాఢమైన జీర గొంతుకతో శృతి కలిపాడు. పెద్ద కన్నీటి చుక్కలు అతని కళ్లల్లో నుంచి వుబికాయి.

అతని ముతక జేగురు గడ్డంమీదుగా జారాయి. నల్లని అంగీ అంచుతో కళ్లు తుడుచుకుని గాయకుడికి ఒక బంగారు దీనార్‌ని విసిరాడు. ఆ పాటగాడు దాన్ని లాఘవంగా అంది పుచ్చుకుని, నేలని చుంబిస్తూ ముఖం కిందికి పెట్టి వాలిపోయాడు. జెంఘిజ్ ఖాన్ అన్నాడు:

"అయ్యో, సుదూర కెరులెన్ గురించిన యీ పాట నన్ను విచారభరితం చేసింది. ఇప్పుడు నేను ఉషారుగా ఉండాలి. హేయ్, మహమ్మద్ యాల్‌వాచ్, హుషారైన పాటలు పాడమని, మళ్లీ సంతోషభరితుణ్ణి చెయ్యమనీ ఈ అమ్మాయిలతో చెప్పు".

"నీకిష్టమైన పాటలేమిటో నాకు తెలుసు ఖాఖాన్. ఈ పాటకత్తెలకి చెప్తాను". మహమ్మద్ యాల్‌వాచ్ హుందాగా బుఖారా ఆడవాళ్ల బృందం దగ్గరికి వెళ్లాడు. వాళ్లతో మెల్లిగా చెప్పాడు. "ఇప్పుడు అరుపులు పెట్టేలాంటి పాటని, ఆడతోడేలు తన పిల్లలు పోయినప్పుడు అరిచేటాంటి అరుపు పాటల్ని పాడండి. ముసలాళ్లని కూడా శ్రుతి కలిపేటట్టు చెయ్యండి. లేకపోతే రాజుకి కోపం వస్తుంది. మీ తలమీద జుట్టంతా ఊడిపోతుంది–మీ తలలతోబాటుగా".

ఆడవాళ్లు కూనిరాగం తియ్యడం మొదలుపెట్టారు. మహ్మద్ యాల్‌వాచ్ మంగోలు పాలకుడి దగ్గర తన యుద్ధస్థానానికి హుందాగా వెళ్లిపోయాడు.

ఓ కుర్రవాడు నీలం తలగుడ్డ చుట్టుకుని, నిడుపాటి చారల అంగరఖా తొడుక్కుని ఆడవాళ్ల ముందుకు వచ్చాడు. వాళ్లకేసి తిరిగి అన్నాడు: "భయపడకండి! నేను పాడతాను". మృదువైన స్వచ్ఛమైన స్వరంతో పాడాడు. అతని పాట విషాద మధురంగా వుంది. మండే నెగళ్ల చిటపట శబ్దాలకీ గుర్రాల సకిలింపు లయకీ తప్పెట వాయిద్యాల నాదానికీ అనుగుణంగా వుంటూ సద్దణిగిన చౌకులో వ్యాపించింది.

ఆట పాటల దేశమా
ఓ అందమైన గులిస్తాన్!
రాబోయే కాలంలో
ఇక హాసం వుండదు;
నీ వనాల విభవంలో
మోసులెత్తు చెట్ల కింద
మంగోలుల మనసు తీరు
చిగురు తొడుగు కాలమరుగు.
సాంధ్యరాగ సమయంలో
అనంత ప్రేమికుల యుగాలు తరలె

అనంత నిశీధి సాంప్రతము కమ్ము
జరాఫషాన్ తీరప్రాంతాన్ని;
అనంత నేత్రాలు తేజరిల్లు
అనంత సంధ్యలు కరుగు
ప్రేమ దీధితుల వెలుగు,
కాంచు మంగోలులు మాత్రమే!

అప్పుడు మొత్తం అక్కడి మూక అంతా యేడుస్తూ, రోదిస్తూ అరిచింది:

నశించింది ఖోరెస్మ్! నశించింది ఖోరెస్మ్!

ఒక్కగా నొక్క ఖోరెస్మ్‌వాసి మనిషి, మహమ్మద్ యాల్‌వాచ్ గాయకులకేసి జడంగా, హెచ్చరికగా చూస్తూ బిత్తరపోయి మౌనంగా కూర్చున్నాడు.

"యేమిటా కుర్రాడు పాడుతున్నది? యెందుకంతా యేడుస్తున్నారు?" అని అడిగాడు జెంఘిజ్ ఖాన్. మొదటి పాట రేపిన జ్ఞాపకాలతో అతని కళ్లు యింకా మసకగానే వున్నాయి.

"వాళ్లు నీకిష్టమైన దాన్నే పాడుతున్నారు. గుంపు 'ఓ, ఖోరెస్మ్', అని అరుస్తున్నారు. ఈ పాట వాళ్ల దేశం నాశనం అయిపోతున్నందుకు విలపిస్తున్న పాట. తమ ప్రాచీన వైభవం పోతున్నందుకు వాళ్లు విచారిస్తున్నారు".

జెంఘిజ్ ఖాన్ నల్లని ముఖం ముడతలతో అల్లుకుపోయింది. అతని నోరు కొద్దిగా కదిలింది, అతను చిరునవ్వు నవ్వబోతున్నాడన్నట్టు. అప్పుడు వున్నట్టుండి అతను ఆర్భాటంగా నవ్వాడు, పెద్ద పోతు తోడేలు అరిచినట్టు. బాస బొజ్జమీద పెద్ద చేతులతో వాయించుకున్నాడు.

"అదీ నాకు నచ్చే పాట! ఆ కుర్రాడు బాగానే పాడుతున్నాడు, యేడుస్తున్న వాడల్లే. మహా జెంఘిజ్ ఖాన్ నవ్వినప్పుడు మొత్తం ప్రపంచాన్నంతట్నీ ఏడవనివ్వండి. మొండితనంగా వున్న తలమీద నేను కాలు పెట్టినప్పుడు నా శత్రువు మూలిగి దయ చూపించమని అర్థించడం నాకిష్టం. స్రుక్కిపోయే అతని చెక్కిళ్లమీద కన్నీళ్లు చూడ్డం నాకిష్టం. ఈ విషాదభరిత పాట నాకిష్టం. మళ్లీ మళ్లీ వినాలనుకుంటున్నాను. ఎక్కడి వాడి కుర్రాడు?"

"కుర్రాడు కాదు, యీమె బుఖారానుంచి వచ్చిన అమ్మాయి బింట్ జాంకిజా. ఆమెకి బాగా రాయడం చదవడం వచ్చు, అందుకనే ఆమె విద్వాంసుల మాదిరీ తలగుడ్డ చుట్టుకుంది. షా రాయసగాడు షా గ్రంథాలయానికి పుస్తకాలని యెత్తి రాయడానికి ఈమెని నియమించుకున్నాడు".

‘‘బందీగా తీసుకుపోవడానికి యెలాంటి ఖైదీ! ఇలాంటి అమ్మాయి! నా విందులన్నింటిలోనూ ఆమెనీ విషాదకరమైన పాటని పాడనివ్వండి. ముసల్మానులందర్నీ అది విని యేడవనీయండి, నేను వినోదిస్తాను. బుఖారాలో పట్టుకున్న పడుచు పిల్లలందర్నీ మన సైనికులకి పంచి పెట్టవలసిందిగా ఆజ్ఞ చేస్తున్నాం. కాని ఈమె మాత్రం నాతో వుంటుంది. నేనెక్కడికి వెళ్లినా ఈ అమ్మాయి నాతో వుంటుంది”.

“అలాగే జరుగుతుంది, మహా ప్రభూ!”

జెంఘిజ్ ఖాన్ లేచాడు. చుట్టూతా కూర్చున్న మంగోలులు తక్షణం లేచారు. తమ చేతుల్లోని ఛషకాల్లో వున్న దాన్ని నేలమీద చల్లారు “విజయ దేవుడి గౌరవార్థం”.

“నేను వెళ్లిపోతున్నాను! నా గుర్రాన్ని తీసుకురండి! యీ నగర పాలకుడుగా ఇక్కడ తైయిర్ ఖాన్ వుంటాడు. ప్రతివాళ్లు అతను చెప్పేది శిరసావహించాలి”.

నెగడు మంటలూ, అర్ధచంద్రుడు కాంతిని ప్రసరింపజేస్తూ వుంటే జెంఘిజ్ ఖాన్ వెడల్పాటి వెన్నుగల గుర్రాన్ని యెక్కాడు. అంగరక్షకులు నెగడు మంటలు దాటి, నగర వృద్ధులు చూస్తూ వున్న తమ గుర్రాల దగ్గరికి వెళ్లారు. కొన్ని క్షణాల్లో, రాతి పలకలమీద అశ్వ ఖుర ఘట్టనలు మోగుతూ వుండగా ఆశ్వికుల శ్రేణి చౌకులో నుంచి అవతలి చీకటి వీధిలోకి వెళ్లిపోయింది.

# ద్వితీయ ఖండం

## మంగోలు నియంతృత్వంకింద



మొదటి భాగం

# తుఫాన్ వూడ్చిన ఖోరెస్మ్

# ఆయుధాలు విసర్జించిన వాళ్లకి వినాశనం!

"రాళ్లకేసి శత్రువుల తలలు బద్దలు కొట్టనేనా కొడతాం
లేదా వాళ్లు నగర కుడ్యాలమీద మన శరీరాల్ని వేలాడదీయ నేనా తీస్తారు."
(పాత పర్షియన్ పాట)

మంగోలు సైన్యానికి ఒక క్రమపద్ధతి నిర్మాణం వుంది. దాన్ని జెంఘిజ్ ఖాన్ ప్రవేశపెట్టాడు. ప్రతి రైతుకీ పది, వంద, వెయ్యి విభాగంలో తన స్థానం యేమిటో తెలుసు. వెయ్యి విభాగాలు పెద్ద శాఖలుగా వుండేవి. ప్రతీ దానికీ దాని నాయకుడు వుండేవాడు. సైన్యపు దక్షిణ లేదా వామ పార్శ్వాల అధిపతి నుంచి ఆజ్ఞలు అందుకుంటూ వుండేవాళ్లు. లేదా మంగోలు ఖాన్ స్వయంగానే నడిపించేవాడు.

బుఖారా సంపద్వంతమైన, సమర్ధమైన వీధులు నగరపు ప్రతి మకాంలోనూ వేగంగా దౌడు తీసే మంగోలులతో నిండిపోయాయి. సంచార మంగోలు శిబిరాలతో వ్యాపారం చేసిన ముసల్మాను వర్తకులు తమ ఇళ్ల గోడల వెనక నక్కి చూసే జనానికి ఈ దుబాసీలు నగర నూతన పాలకుడి ఆజ్ఞలని అరిచి చెప్పేవాళ్లు.

జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞల మేరకి నగరంలోని పెద్దల్ని పిలవనంపారు. వాళ్లు బుఖారాలో వుండే సంపన్నులైన వర్తకులందరి పట్టికల్నీ అందజేశారు. ఖోరెస్మ్ షా సైన్యానికి సరఫరాలు చేసే ఆహార సరఫరాల సొంత భాండారాల వివరాలు తెలియజేశారు. అలాగే విలువైన వస్తువుల సొంత భాండారాల్నీ, దుకాణాల్నీ గురించిన వివరాలూ తెలియజేశారు.

భయపడిపోయిన నగర వాసులు ధ్యాన్యం బస్తాలు, బట్టల తాన్లు, కంబళ్లు, విలువైన లోహాల పాత్రలు, నానారకాల వస్తువులు తెచ్చారు. వాటినన్నిట్నీ మసీదుల్లో నిలువ చేశారు. మొత్తంలో మూడింట ఒక వంతుని మంగోలు పాలకుడు జెంఘిజ్ ఖాన్ కోసం పెట్టేశారు.

దుర్గం చుట్టూతా వున్న కందకాన్ని పూడ్చుమని శరీర దారుఢ్యం వున్న వాళ్లని

నియమించారు. ఆ దుర్గంలోనే మొండితనంగా ఇఖ్తియార్ ఖుష్లు తిష్టవేసి కూచున్నాడు. అతనూ అతని సైనికులూ కొనవూపిరిదాకా పోరాటం చెయ్యాలనే నిర్ణయించుకున్నారు.

రెండు రోజుల్లో ఆ కోట ఎత్తు గోడల దగ్గరకి వెళ్లడం సాధ్యపడింది. వాటిపైన సాయుధ రక్షకులు వున్నారు.

మంగోలుల ఆజ్ఞ మేరకి బుఖారా వడ్రంగులు బోలెడు పెద్ద నిచ్చెన్లని తయారు చేశారు. అప్పుడు మంగోలు మూకమీద విరుచుకుపడి వాళ్లని కొరడాలతో క్రూరంగా కొట్టడం మొదలుపెట్టారు.

"ఎందుకిక్కడ నుంచున్నారు? నోళ్లు వెళ్లబెట్టుకుని చూస్తారేం? నిచ్చెనలని గోడలకి చేరవేసి ఎక్కండి."

బుఖారా వాసులు ఒక్కళ్లూ గోడలకేసి కదల్లేదు. వాటి మీద నుంచి ఇటుకలు వడగళ్లలా పడుతూనే వున్నాయి. సలసలకాగే నీళ్లు, వేడి తారు పడుతూనే వున్నాయి.

కాని మంగోలులు బుఖారా వాసుల్ని కత్తులతోటీ, బల్లేలతోటీ పొడిచి, ఆఖరికి నిర్దాక్షిణ్యంగా వాళ్లని నెత్తిమీద మోదడం మొదలుపెట్టారు. బుఖారా వాసులు చేతులని తలకి అడ్డం పెట్టుకుని ముందుకు దుకారు. మంగోలులు వాళ్లని కొడుతూనే వున్నారు. ఇక్కడో వేలు, అక్కడో చెయ్యి నరుకుతూనే వున్నారు.

నిచ్చెనలు ఎక్కమని దుబాసీలు జనాన్ని వేడుకుంటున్నారు.

జనంలోని కొంతమంది అరిచారు:

"నిచ్చెనలు పైకి ఎక్కినా చావే, ఇక్కడ వున్నా చావే. కోటలోకి మన సైనికుల దగ్గరికి పోదాం పదండి. వాళ్లు మనమీద జాలిపడి పోరాటం మానవచ్చు".

బుఖారా వాసులు నిచ్చెనలు అందుకుని గోడలకి చేరేసి పైకి ఎక్కడం మొదలెట్టారు అరుస్తూ:

"మీకు మల్లేనే మేమూ ముసల్మాన్లం. ఆయుధాలు కింద పారేసి, లొంగిపొండి".

గోడలపైన వున్న సైనికులు వీళ్లని దాదాపు పైదాకా ఎక్కనిచ్చి, అప్పుడు కర్రలతో, రాళ్లతో చావగొట్టి, నిచ్చెన్లని కిందికి తోసేశారు. సైనికులు అరిచారు:

"పిరికి కుక్కల్లారా! వెళ్లి మంగోలులతో పోరాడండి. మనం అందరం షహీదుల్లా చచ్చిపోదాం కాని లొంగిపోవద్దు. శత్రువుని యెదిరించడండి!"

ఈ లోపున మంగోలులు చైనా వడిసెలల్ని తీసుకువచ్చారు. వాళ్లు జ్వాలలతో మండే పెద్ద బాణాల్ని కోటలోకి విసిరారు. వాటిని తారులో ముంచిన జనపనారతో చుట్టి, నిప్పు అంటుకునే చమురుల్లో ముంచి విసిరారు. కోటలో మంటలు రేగాయి.

ఆ కోట ముట్టడి పన్నెండు రోజులు సాగింది. ఆఖరికి, దాదాపు దుర్గ రక్షకులందర్నీ చంపేశాక, మంగోలులు కోటలోకి చొచ్చుకుపోయి మిగిలిన వాళ్లని చంపేశారు. వాళ్లు

అప్పటికే గాయాలతోటీ, కాల్పులతోటీ వున్నారు. విస్తారమైన మంగోలు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడి కోటని రక్షించింది నాలుగు వందల మందికి మించి లేరని చూసి మంగోలులు ఆశ్చర్యపోయ్యారు. వాళ్లు చచ్చిపోయారుగాని లొంగిపోలేదు. నగర వాసులందరూ నగరపు ఎత్తైన దృఢమైన గోడలమీదనుంచి అంత పట్టుసడలకుండా రక్షించి వుంటే మంగోలులు ఆరు నెలలకి, ఇంకా చెప్తే యేడాదికి కూడా, మహా పురాతన బుఖారాని పట్టుకుని వుండలేకపోయేవాళ్లు. ఆ నగరవాసులు తామే తెచ్చి పెట్టుకున్న దారుణ కష్టాల్ని అనుభవించి వుండేవాళ్లు కాదు.

బుఖారా వాసులు మసీదుల్లో వున్న మంగోలులకి కానుకల్ని తెచ్చేటప్పుడు ఈ శాసనం వెలువడింది:

"నగరవాసులందరూ ఆడాళ్లతోటీ పిల్ల మేకాతోటీ కలిసి నగరం బయట మైదానంమీదకి వెళ్లాలి. ఇళ్లల్లో తమ వస్తువులనన్నిటినీ వదిలెయ్యాలి. కట్టుబట్టలు తప్ప, కూడా మరేం వుండకూడదు".

దుబాసీలు వ్యాఖ్యానం చేసి వాళ్లకి చెప్పారు:

"మీరేం భయపడక్కర్లేదు. ప్రతి చోటా కాపలా వాళ్లుంటారు. మీ వస్తువులు భద్రంగా వుంటాయి, జాగ్రత్తగా చూస్తారు. నగరవాసుల్ని బయటికి  పంపించడానికి కారణం సరిగా మనుషుల్ని లెక్కపెట్టి సుంకాలు వసూలు చెయ్యడానికి ఒక చోట చేర్చేందుకోసమే. కాని ఈ శాసనాన్ని తప్పించుకుందామని, నగరంలో వుండిపోదామనీ ప్రయత్నించే వాళ్లందర్నీ కనిపించిన చోట కనిపించినట్టుగా చంపెయ్యడం జరుగుతుంది".

తెల్లవారిందగ్గర్నుంచీ బుఖారా వాసులందరూ నగరం బయట మూగడం మొదలుపెట్టారు. తండ్రులు పిల్లల్ని చేతులు పట్టుకుని నడిపించుకు వెళ్లారు. భార్యలు పిల్లల్ని ఎత్తుకు తీసుకెళ్లారు. యేళ్ల తరబడి కూచున్న చోటునుంచి లేవని ముసలమ్మలు, ముసలాళ్లు ఒకళ్లనొకళ్లు ఆసరగా పుట్టుకుని యీడ్చుకుంటూ బయటికి వెళ్లారు.

మంగోలు పహారా ప్రతి వీధిలోనూ వున్నాయి. తలుపులమీద తడుతూ అరిచారు:

"దార్‌ఖల్! ఖోష్‌ఖల్! (రండి ! త్వరగా!)"

నగరవాసుల పదకొండు ద్వారాలనుంచీ బయటికి వెళ్లి మైదానంమీద చేరారు. మొత్తం నగరం చుట్టూతా ఒక వలయంగా యేర్పడ్డారు. పహారా వాళ్లు యెవళ్లనీ వెనక్కి వెళ్లనివ్వలేదు.

''ఘనమైన బుఖారా'' నగర జనాభా ఎంతటిదైందీ అప్పుడు కనిపించింది. మంగోలులకంటే రెండు మూడు రెట్లు ఎక్కువ మంది వున్నారు.

మొదటగా మంగోలులు దుబాసీలతోబాటుగా యెవళ్లు పనివాళ్లో, వాళ్ల వృత్తి యేమిటో వాకబు చేస్తూ అందర్నీ చుట్టి వెళ్లారు. నిపుణులైన పనివాళ్లందర్నీ విడదీసి ఒక చోటకి

తీసుకెళ్లి వుంచారు. తర్వాత దృఢంగా వుండే పడుచు వాళ్లందర్నీ యేరి సాయుధ రౌతులని చుట్టూతా వుంచారు.

తర్వాత మంగోలులు అందంగా కనిపించే ఆడవాళ్లని పడుచు అమ్మాయిల్ని, పిల్లల్ని ఎంపిక చేసి ఒక బృందంగా చేర్చారు. అప్పుడు అందరికీ అర్థం అయింది నిస్సందేహంగా ఇక ఎన్నటికీ కలుసుకోకుండా తమ బంధువులనుంచి విడిపోతున్నామని. వాళ్లు పెద్దగా రోదించడం మొదలుపెట్టారు. వెక్కివెక్కి యేడ్చారు. నిరాశగా అరిచారు.

యేం పట్టకుండా అంబా అని అరిచే ఆవుల్ని వేర్పాటు చేస్తూ, దీనంగా అరిచే మేకల్ని విడదీస్తూ, కొరడాలతో కొట్టి కబేళాకి తోలుకుపోయే కసాయి వాళ్లల్లాగా బుఖారా కొత్త పాలకులు వాళ్లని కొరడాలతో కొట్టి, మెల్ల చుట్టూతా ఉచ్చు తాళ్లు విసిరి, తమ కమ్చీలతో గుర్రాల్ని కొట్టి తోలుతూ వాళ్లని మందలోనుంచి లాగేరు.

మంగోలు భీతి ఎంతలా వుందంటే బుఖారా ప్రజలు ప్రతిఘటించను కూడా ప్రతిఘటించలేదు.

ఆ రోజు భయంకరమైంది. యేడుపులు తప్ప యేమీ వినిపించని రోజు అది. తమ తండ్రులనుంచీ, భర్తలనుంచీ, అన్నదమ్ములనుంచీ శాశ్వతంగా విడిపోతూ విలపించే వాళ్ల ఆక్రందనలు తప్ప యేమీ వినిపించని రోజు. మగాళ్లు నిస్సహాయులైపోయారు. యేమీ చెయ్యలేకపోయారు. కవి అన్నాడు: "నీ కత్తి పిడిని గట్టిగా పట్టుకో, లేకపోతే దాని మొన నీకేసే యెదురు తిరుగుతుంది".

మంగోలులు నగరపు నిర్జన వీధుల్లోకి తిరిగి వెళ్లారు. అన్ని ఇళ్లనీ ధ్వంసం చేసేసి, దోచేసి గుర్రాలమీద వేసుకున్నారు. నగరం ఒక్క సారి మంటల్లో భగ్గుమంది, పొగ ప్రాచీన బుఖారామీద లేచింది సూర్యుణ్ణి కమ్మేస్తూ. భవనాలు తేలికైనవి. మట్టితోటీ, కొయ్యతోటీ కట్టినవి. నగరం ఒక్కసారి పెద్ద జ్వాలకి ఆహుతైపోయింది. ఇటుకలతో కట్టిన ముఖ్యమైన మసీదు, కొన్ని ప్రాసాదాల గోడలు తప్ప యేం మిగల లేదు.

జ్వాజ్వల్యమానంగా లేచే మంటలనుంచి మంగోలులు పారిపోతూ తాము కొల్లగొట్టిన దాన్ని వెనక వొదిలేసి నగరం బయటికి దూసుకుపోయారు. అనేక యేళ్లబాటు నగరం నల్లని శిధిలాల గుట్టలాగా వుంది. గుడ్లగూబలకీ, గుంట నక్కల అరుపులకీ ఆలవాలంగా వుండింది.

# నగర వృద్ధులు సమర్‌కండ్‌కి ద్రోహం చెయ్యడం

"సర్వం లుప్తమైంది, నీ జారత్వమునకు అర్పణమై, నీ
అంగుళులనున్నది గోరింటాకు కాదు – కాదు,రక్తం!"
(రిజా తెవ్‌ఫిక్)

మహాకాళ సంవత్సరం 1220 వసంతరుతు తొలి ప్రాంతంలో జెంఘిజ్ ఖాన్ బుఖారా నుంచి సమర్‌కండ్‌కి దండెత్తి వెళ్లాడు.

సమర్‌కండ్ చేరాక జెంఘిజ్ ఖాన్ 'హరిత' ప్రాసాదంలో విడిది చేశాడు. అది ఖోరెస్మ్ షా పల్లెటి మకాం. ఇక్కడ అతని నలుగురి కొడుకుల సైన్యాలూ వచ్చి కలిశాయి. మంగోలులు పశువుల మాదిరీ కొరడాలతో కొట్టి తరిమిన ఖైదీల గుంపులూ వచ్చి కలిశాయి. ఈ సైన్యాలన్నీ అభేద్య వలయంలాగా నగరాన్ని చుట్టుముట్టాయి.

ఖోరెస్మ్‌లోని నగరాలన్నిట్లోకీ సమర్‌కండే మహా దృఢంగా దుర్గరక్షణ వున్నటువంటిది. ఎత్తుగా, అభేద్యమైన మందంతో వుండే ప్రాచీన కుడ్యాలకి యినప ద్వారాలు వున్నాయి. వాటికి అటూ ఇటూ కోటకొమ్ములున్నాయి. దుర్గం లక్షా పదివేల సైన్యంతో వుంది. వాళ్లల్లో అరవై వేలమంది తుర్కిక్ భాష మాట్లాడేవాళ్లు. వాళ్లల్లో మంది కిప్‌చాక్‌లు. మిగిలిన సైన్యంలో తజిక్, గురియన్, కార కితాయ్ ఇతర తెగలు వున్నాయి. భీకరంగా వుండే ఇరవై పోరాడే యేనుగులున్నాయి. ఖోరెస్మ్ షా వాటిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. దీనంతటికీ తోడుగా మామూలు పౌరులనుంచి సైన్యమూ అప్పటికప్పుడు ఎంచుకోవచ్చు. ఇందులో చేతి వృత్తుల వాళ్లు, వాళ్ల అసంఖ్యాక బానిసలు వుంటారు.

కెయిర్ ఖాన్ లేదా తైమూర్ మాలిక్‌లాంటి సాహసవంతుడూ అనుభవజ్ఞుడూ అయిన యోధుని నాయకత్వం కింద సమర్‌కండ్ ఎక్కువ కాలం లొంగకుండా వుండేదే – సంవత్సరం తక్కువ కాకుండా, సరఫరాలు కొనసాగినంత కాలం. కాని ఖోరెస్మ్ షా సమర్‌కండ్ సైన్యాల ప్రధాన అధిపతిగా తన మేనమామ, అందరూ అసహ్యించుకునే మాతృశ్రీ సుల్తానా తుర్కాన్

ఖాతూన్ సోదరుడు, పోగరుమోతు తుగాయ్ ఖాన్‌ని నియమించాడు – అతనికి సైనికుడిగా యే మాత్రం అనుభవం లేదు.

జెంఘిజ్ ఖాన్ నగరం చుట్టూ గోడల్ని, దుర్గాల్ని, నిండుగా నీటితో నింపిన లోతు కందకాన్ని పరీక్షిస్తూ తిరిగి రెండ్రోజులు గడిపాడు. రక్షణలో ఉండే దుర్బల అంశాల్ని శోధించాడు. దాడి పథకాన్ని ఆలోచించాడు.

తమకి అధికంగా బలముందని ప్రదర్శించుకోవడానికీ, రక్షకులకి బెదురు పుట్టించడానికీ గాను మంగోలులు తమ బందీల మందల్ని సైనికుల్లా ఏర్పాటు చేశారు. ప్రతి పదవ మనిషీ ఒక జెండా మోసేటట్టు చేశారు. సమర్‌కండ్ వాసులకి అది దూరంనుంచి చూస్తే అసంఖ్యాకమైన శత్రు సైన్యంతో చుట్టు ముట్టినట్టు కనిపించింది.

తుర్కిక్ సైనాధిపతులు ఆల్ప్ ఎర్ ఖాన్, స్యుంజ్ ఖాన్, బాలన్ ఖాన్‌లు నగర ద్వారం నుంచి తమ కిప్‌చాక్ సైన్యంతో మంగోలుల మీద దాడి చేశారు. బీకర పోరాటం జరిగింది. ముసల్మానులు కొంతమంది మంగోలుల్ని ఖైదీలుగా పట్టుకున్నా, వెయ్యి మంది దాకా తను సైన్యాన్ని పోగొట్టుకున్నారు. మళ్లీ దుర్గం గోడల వెనక రక్షణ చూసుకున్నారు.

ఆ మర్నాటికే ప్రాకారం గోడలు దాటి బయటికి వెళ్లడమంటే కిప్‌చాక్ సైన్యాలకి ఆసక్తి పోయింది. సమర్‌కండ్ నగర వాసుల్లోనుంచి యేర్పడ్డ ఐచ్ఛిక బృందం కోటలోనుంచి వచ్చి మీద బడ్డారు. మంగోలులు పారిపోతున్నట్టు నటించారు. సమర్‌కండ్ ఐచ్ఛికులు వాళ్లని తరిమి కొట్టి, పొంచికాశారు. మంగోలు సైనికులు అన్ని వేపుల నుంచీ నిరీక్షించి చూస్తూ మీద పడ్డారు. పలాయనం చిత్తగించే వాళ్లందర్నీ నరికేశారు. మనిషి మనిషినీ చంపేశారు. కొంతమంది మాత్రం తప్పించుకుపారిపోయి నగరం లోపలికి పోగలిగారు.

మూడో ఉదయం జెంఘిజ్ ఖాన్ గుర్రం ఎక్కి స్వయంగా సమర్‌కండ్ మీద దాడి నడిపాడు. తన సైన్యాన్ని గోడల చుట్టూతా ఏర్పాటు చేశాడు, కాని ద్వారాలన్నిటి దగ్గరా ప్రత్యేకంగా గట్టి యేర్పాటు చేశాడు. ముసల్మాన్లు నగరం బయటికి రాగానే తమ వింటి బద్దలనుంచి వదిలిన బాణాలతో తాడిస్తూ, దూరంనుంచే కొడుతూ మంగోలులు వాళ్లమీద దాడి చేశారు. మరింత ధైర్యంగల సమర్‌కండ్ వాసులతో పోరు సాయంత్రందాకా రోజంతా సాగింది. రాత్రి రెండు పక్షాలూ తమ తమ శిబిరాలకి తిరిగివెళ్లాయి.

ఆ రాత్రి సమర్‌కండ్‌లోని అతి ప్రముఖ వ్యక్తులు – ముఖ్య ప్రాడ్వివాకులు, పురోహితవర్గ అధిపతి, మసీదుల్ని చూసే ముఖ్య ఇమామ్‌లు అర్ధరాత్రి సమావేశం జరిపారు. మర్యాదగా లొంగిపోవాలని నిర్ణయించారు. ఉదయం నగరంనుంచి ఖాఖాన్ శిబిరానికి బయల్దేరారు. ముట్టడించిన నగరంపట్ల దయ చూపించమని మంగోలు పాలకుణ్ణి అర్థించారు. జెంఘిజ్ ఖాన్ వాళ్లకి తన ఆగ్రహం నుంచి రక్షణ ఇచ్చి, తమ తమ ఇళ్లకి తిరిగి వెళ్లవలసిందిగా అనుమతీ ఇచ్చాడు. ఆ ప్రతినిధులు సంబరపడుతూ తిరిగి నగరానికి వెళ్లిపోయారు. అప్పుడు,

దుర్గంలో మూసేసుకు కూర్చున్న కొంతమంది సాహసవంతులు తప్ప, కిప్‌చాక్ ఖానులు ప్రధాన సైన్యాధిపతి తుగాయ్ ఖాన్‌తో సహా మంగోలు నాయకుడి కొలువులో చేరతామనే విజ్ఞప్తితో అతని ముందు అణకువగా ప్రత్యక్షమయ్యారు. జెంఘిజ్ ఖాన్ దీనంతటికీ అనుగ్రహపూర్వకంగా తలపంకిస్తూ అంగీకరించాడు.

ముట్టడి ఆరవ రోజు ఉదయాన ద్వారాలు తెరుచుకున్నాయి. మంగోలులు ఖోరెస్మ్‌షా రాజధానిలోకి ముసురుకుంటూ పోయారు. వాళ్లు తమ ముందు బందీల గుంపుని నెట్టుకుపోయారు, గోడల్ని బద్దలు గొట్టమని వాళ్లని ఆజ్ఞ చేశారు.

సమర్‌కండ్‌కి యే ప్రమాదమూ జరగదని జెంఘిజ్ ఖాన్ వాగ్దానాలు చేసినప్పటికీ కూడా సమర్‌కండ్‌లోని స్త్రీ పురుషులందర్నీ వందల కింద విభజించి మైదానంమీదకి తోలుకుపోయి నానా రకాల అవమానాలకీ గురిచెయ్యడం జరిగింది. యేదో ప్రత్యేక సందర్భాలలో మినహాయింపు ఇవ్వడం జరిగింది.

నగరం నుంచి వెళ్లిపోయిన వాళ్ల వెనక తమ ఇళ్లల్లో వుండిపోయిన ఎవరి రక్తం చిందించడానికేనా, యే దండన భయమూ లేకుండా, మంగోలులకి అనుమతీ వుందని జనానికి తెలియజేశారు. ఈ ఫర్మానాని ఉపయోగ పెట్టుకుని మంగోలులు చాలా మంది శాంతికాముక ప్రజల్ని హతం చేసేశారు.

ముప్ఫైవేల మంది కిప్‌చాక్ సైన్యం ఆడాళ్లతోటీ పిల్లలతోటీ కలిసి, ఖోరెస్మ్ షా మామ తుగాయ్ ఖాన్ అగ్రభాగాన వుండగా, శత్రువుల కొలువులో చేరడానికి నగరం బయటికి వచ్చారు. వాళ్లని ఆయుధాలని విసర్జించమని మంగోలులు ఆజ్ఞాపించారు. వాటికి బదులుగా మంగోలు ఆయుధాల్ని ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కిప్‌చాక్‌లు జెంఘిజ్ ఖాన్ కొలువులో ప్రవేశించాక మంగోలుల మాదిరీ కనిపించాలని కూడా అన్నారు. దాంతోటి మంగోలులు వాళ్ల తలల్ని అర్ధచంద్రాకారంగా గొరిగారు. మంగోలులు వాళ్లకి శిబిరంలో ప్రత్యేక స్థానాన్ని కేటాయించారు. అక్కడ కిప్‌చాక్‌లు తమ గుడారాల్ని వేసుకుని, కుటుంబాలతో స్థిరపడ్డారు. కాని ఆ మర్నాడు మంగోలులు హఠాత్తుగా వాళ్లమీద పడి వాళ్ల వస్తువులనన్నిట్నీ దోచుకుని వాళ్లందర్నీ హతం చేశారు. బతికిన వాళ్లు చచ్చిపోయిన కిప్‌చాప్‌ల గురించి అన్నారు: “వాళ్లకి పారిపోయే ధైర్యమూ లేదు, పోరాడే ధైర్యమూ లేదు”.

ఆ రాత్రి దుర్గంలోనుంచి సాహసవంతులైన వెయ్యి మంది రౌతులు అల్ప్ ఎర్ ఖాన్ నాయకత్వాన బయటికి వచ్చారు. వాళ్లు ధైర్యంగా మంగోలు శిబిరాన్ని భేదించారు. చీకట్లో అంతర్ధానమయి పోయారు. తర్వాత వాళ్లు జలాలుద్దీన్ సైన్యంలో చేరగలిగారు.

మిగిలిన దుర్గ సైన్యం రక్షణ కొనసాగించింది. తర్వాత మంగోలులు జాకెర్దిన్ కాలవ ఆనకట్టని బద్దలు గొట్టారు. దానికి నిపుణంగా చేసిన దారివుండేది. ఆ నీళ్లు కోట చుట్టూ

వున్న నేలని ముంచెత్తేశాయి. గోడల్ని ముంచేశాయి. దాంతోటి గోడలు కూలిన చోట మంగోలులు చొచ్చుకు పోగలిగారు. లోపల కనిపించిన ప్రతి ఒక్కళ్లనీ చంపేశారు.

సమర్‌కండ్ కోటని పట్టుకున్నాక జెంఘిజ్ ఖాన్ నగరం గుండా గుర్రంమీద వెళ్లాడు. అక్కడ శవాలు గుట్టలుగా పడివున్నాయి. అప్పుడతను తిరిగి పల్లెటి ప్రాసాదానికి వచ్చాడు. వేడిగా వుంటున్న రోజుల్లో అక్కడి చెట్లు చల్లదనాన్ని ఇచ్చాయి. ఆ వేడిని జెంఘిజ్ ఖాన్ తట్టుకోలేకపోయాడు. కుళ్లిపోతున్న శవాల దుర్గంధం వల్ల నగరంలో వుండడం అసాధ్యమైపోయింది. నగరం నుంచి అక్కడుండేవాళ్లు పారిపోయారు.

# ఖోరెస్మ్ షాకి ఆశ్రయం దొరకదు

"మనిషికి గుండె జారిపోయినప్పుడు అతని గుర్రం పరిగెట్టలేదు".
(ప్రాచ్యదేశ సామెత)

మంగోలు ఖోరెస్మ్ గడ్డని విధ్వంసం చేస్తూ వున్నప్పుడు షా మహమ్మద్ చాలా దూరంలో వున్నాడు. పరిస్థితులు ఎలా మారతాయో అని జైహున్ నదీ తీరాన కెలిఫ్ నగరంలో కొంతమంది సైనికులతో వున్నాడు.

"నా లక్ష్యం మంగోలులు జైహున్ నదిని దాటి రాకుండా చూడడం. త్వరలోనే ఇరాన్‌లో కొత్త సైన్యాన్ని కూర్చుకుంటాను. అప్పుడు ఈ పాషండుల్ని తరిమేస్తాను" అన్నాడు.

నది వంపుమీదకి చొచ్చుకు వచ్చిన కొండ కొమ్మున ఒక చిన్న గోపురం వుంది. చుట్టూతా కురచగా చదునైన కప్పుతో వున్న ఇళ్లు వున్నాయి. పాత రాతిగోడ వాటిని లోపల బంధించి వుంచింది.

ఖోరెస్మ్ షా ఇక్కడ వుండి ఆలోచించాడు. గోపురం పైన పహారా వాళ్లు నిరంతరంగా గస్తీ తిరిగేవాళ్లు, ఉత్తర దిక్కుకి చూస్తూ. దూరంలో కొండలమీద జ్వాలలు మండేవి. పగళ్లప్పుడు పొగ సుళ్లు సుళ్లుగా లేచి శత్రు సైన్యాల కదలికల గురించిన సంకేతాల్ని ఇచ్చేది.

సమర్‌కండ్ ముట్టడి మొదలైనప్పుడు ఖోరెస్మ్ షా రెండు సార్లు ముట్టడికి గురైన ఆ నగరానికి సహాయం పంపాడు – మొదటి సారి పది వేల మందిని, రెండవ సారి ఇరవై వేల మందిని. కాని ఆ రెండు సందర్భాల్లోనూ కూడా వాటి సైన్యాధిపతులు రాజధానిలో ప్రవేశించే ప్రయత్నాలేమీ చెయ్యకుండా, కెలిఫ్‌కి సైనికులతోటి కలిసి తిరిగివచ్చారు. సమర్‌కండ్ పతనం యే రోజునేనా గానీ జరగవచ్చుని భావిస్తున్నట్టు, యే సహాయం చేసినా వ్యర్థమయేటట్టూ చెప్పారు.

శోషించిపోయి, గాయపడిపోయిన రెండు వందలమంది రౌతులతో ఇనాన్చ్ ఖాన్ కెలిఫ్‌కి వచ్చాడు. బుఖారానుంచి రాత్రి దాడులు జరిపిన విభాగంలో మిగిలిన వాళ్లు. మంగోలులు ఆ విభాగాన్ని జైహున్ తీరందాకా దొరికిన వాళ్లని చంపేస్తూ తరిమారు. కడకి కొందరు మిగిలారు. వాళ్లలో కుర్బాన్ కిజిక్ ఒకడు.

బుఖారా రక్షణ కోసం అర్పితమైన అంత పెద్ద సైన్యం ఇంత నిష్ప్రయోజనకరంగా, అవమానకంగా పతనమైపోయిందని తెలిసి ఖోరెస్మ్ షా విపరీతంగా చలించిపోయాడు. చాలా సేపు షా స్థిమిత పడలేకపోయాడు, మనసు కూడ దీసుకోలేకపోయాడు. చుట్టు పక్కల ప్రాంతాల ఖానులు తన ఆజ్ఞల్ని నిర్వర్తించడం లేదనీ, పిలిచినప్పుడు తన ముందు హాజరు కావడం లేదనీ కూడా గ్రహించాడు. అన్ని వేపులనుంచీ ద్రోహం చేస్తూ, జెంఘిజ్ ఖాన్ శ్రేణుల్లోకి జనం పారిపోతూ వున్నారన్న వార్తలే వచ్చాయి.

ఖోరెస్మ్ షా మహమ్మద్ పెద్ద పడవ ఎక్కాడు. అతని రౌతులు చిన్న తోలు పెట్టెల్ని పడవలో పెట్టారు. వాటిల్లో బంగారు నగలు నిండుగా వున్నాయి. పడవలోకి అతని ప్రియమైన పంచకళ్యాణి గుర్రాన్ని తీసుకొచ్చారు. పడవ తీరం వదిలింది. ఉరకలెత్తే నీళ్లు దాన్ని దిగువకి తీసుకెళ్లాయి. కాని తెడ్లతోటి నడిపి దాన్ని అవతలి ఒడ్డుకు తీసుకెళ్లాలని పడవ వాళ్లు మహాతంటాలు పడ్డారు.

భారమైన ఆ పడవ, నీళ్లల్లో రాళ్లవల్ల, పర్షియన్ తీరం దాపు చేరలేకపోయింది. తెడ్లు వేసే ఒకతను సన్నగా, పొడుగ్గా వున్నాడు. షాని పడవలోనుంచి అవతలి వేపు తీసుకెళ్లమని అప్పుడు వకీలు అతనికి ఆజ్ఞ చేశాడు. చాలా గొణుక్కుంటూ అతను మహమ్మద్ భారీ కాయాన్ని వీపుమీద ఎత్తుకుని, నీళ్లల్లో దారి చేసుకుంటూ అవతలి ఒడ్డుకి చేరగలిగాడు.

రాళ్ల ఒడ్డుమీద దిగుతూ షా అడిగాడు: "నీ పేరేమిటి? ఎక్కడ్నుంచి వచ్చిన వాడివి?"

"నా పేరు కుర్బాన్ కిజిక్. ఇనాన్చ్ ఖాన్ దగ్గర కమతం తీసుకున్న పొలం చేసుకుంటాను. మా కుటుంబం అక్కడే వుంది. నేను ఆయనతోబాటు బుఖారానుంచి పారిపోయి వచ్చాను. బతికి బయట పడగలిగాను. ఆ రాత్రి మేం దాడి జరిపినప్పుడు తాతార్ ఖాన్ పసుప్పచ్చ గుడారానికి బాగా దగ్గరసా వెళ్లాను. అతన్ని సఫా చేసేద్దామనుకున్నా గానీ యెందుకనో మా రౌతులు బెదిరిపోయి జైహూన్ నది వేపు తిరిగిపోయారు. నా బూడిదరంగు గుర్రం పిచ్చెత్తినట్టు వాళ్ల వెనక దౌడు తీసింది. వెంట్రుక వాసిలో తప్పించుకున్నాం".

"నన్ను ఇంతకు ముందెప్పుడన్నా చూశావా?"

"లేదు. నిన్నెప్పుడూ దర్శించలేదు. కాని బోలెడు విన్నాను. మా దగ్గర పిండి పన్నులు వసూలు చేసేటప్పుడు హాకిమ్ ఎప్పుడూ అంటాడు: 'యిది షా కోసం!' అని. అందుకని మేం ఎప్పుడూ నీ గురించి అనుకుంటాం..."

ఖోరెస్మ్ షా నవ్వాడు. వకీలుని ఒక బంగారు దీనార్‌ని అడిగి దాన్ని కుర్బాన్‌కి ఇచ్చాడు.

"ఈ కుర్బాన్ సైనికుణ్ణి నా దగ్గర వుండనియ్యి. కందకాలు దాటడం బాగా తెలుసు. ఇతను నాకు నిజం చెప్తాడు".

"చిత్తం, మహా ప్రభూ!" అన్నాడు కుర్బాన్. "నిన్ను ఎత్తుకు తీసుకెళ్లడం కష్టం కాదు, పెద్ద ధాన్యం బస్తాని మొయ్యడం లాంటిదే. కాని మొదటగా నన్ను అవతలి ఒడ్డుకు వెళ్లనియ్యండి. నా చెప్పులు అక్కడ వదిలేశాను".

“వెళ్లు”.

పడవలో కుర్బాన్ అవతలి ఒడ్డుకు వెళ్లాడు.

షా పంచకల్యాణి గుర్రంమీద నిట్రపాటి కొండ దారిలో వెడుతూ వుంటే అవతలి ఒడ్డున గలభా చెలరేగింది. ప్రతి వాళ్లూ తూర్పు దిక్కుకే చూపిస్తున్నారు. అక్కడ మందమైన పొగ చుట్టలు చుట్టలుగా అయిదు సుళ్లలో కొండమీదనుంచి ఆకాశంలోకి లేస్తోంది. భయపడుతూ వున్న హెచ్చరిక సంకేతనం అదే: శత్రువు పెద్ద సైన్యంతో వస్తున్నాడు.

“అన్ని పడలనీ వడిలోకి దింపండి” అని షా ఆజ్ఞాపించాడు. “మంగోలులు ఈ ఒడ్డుకి రాకూడదు!” అంటూ షా తన గుర్రాన్ని కొరడాతో అదిలించాడు.

షా కోసం వెదుకుతూ జెబె నాయన్, సుబుదై భగత్తూర్‌ల నాయకత్వం కింద ఇరవై వేలమంది తాతార్‌లు జైహున్ ఒడ్డుకి వచ్చారు.

వాళ్లు నది దాటకుండా వాళ్లని అక్కడ అడ్డగించేవాడే లేడు. నదీ తీరాలు వెల్లడిగా వున్నాయి. కెలిఫ్ నగరవాసులందరూ పారిపోయారు. అక్కడ పడవలు యేమీ లేవు. కాని “పదండి ముందుకు, ఆగద్దు” అన్న జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞ మేరకి తాతార్లు కొయ్యతో తొట్టెలాంటి దాన్ని దేన్నో చేసి, ఆవు చర్మాలతో వాటిని కప్పి వాటిల్లో తమ ఆయుధాల్నీ, సామాన్లనీ పెట్టారు.

గుర్రాల్ని నీళ్లల్లోకి నడిపిస్తూ తాతార్లు వాటి తోకలు పట్టుకున్నారు. ఈ తొట్టెల్లాంటి వాటినీ పట్టుకున్నారు. ఎలా వుందంటే గుర్రం మనిషిని లాగుతున్నట్టూ, మనిషి తొట్టెని లాగుతున్నట్టూ కనిపించింది.

ఈ రకంగా తాతార్లందరూ వడిగా ప్రవహించే జైహున్‌ని ఒక్క రోజులో దాటారు.

కాని ఖోరెస్మ్ షా పడమటికి వేగంగా స్వారీ చేసుకుపోతూ అప్పటికే చాలా దూరం వెళ్లిపోయాడు.

మహమ్మద్‌ని అనుసరించి వెళ్లిన సైన్యంలో అధికభాగం కిప్‌చాక్‌లు. వాళ్లు అతనిమీద కుట్రపన్నారు. కాని యెవళ్లో జాగ్రత్తగా వుండమని హెచ్చరించారు. మహమద్ తను పడుకోవాల్సిన గుడారం నుంచి ప్రతిరోజూ సాయంత్రం వెళ్లిపోయేవాడు. ఒక ఉదయం చూస్తే గుడారం పై గుడ్డ జల్లెడలాగా తూట్లు పడివుంది, కిప్‌చాక్ బాణాలు దూసుకుపోయి.

ఖోరెస్మ్ షా భయం ఎక్కువైంది. తడవ తడవకీ దిశ మారుస్తూ, ఎక్కడ సురక్షితంగా వుంటుందో తెలియక, గబగబా పోతూనే వున్నాడు. ప్రతి చోటా, అక్కడ వుండే జనాన్ని తమ నగర రక్షణ దృఢం చేసుకొమ్మనీ, కుడ్యాల గట్టితనంమీద ఆధారపడమనీ, పోరు తప్పించుకొమ్మనీ అర్థిస్తూనే వున్నాడు. ఇది ప్రజల్ని మరింత భీతావహుల్ని చేసింది, చాలా మంది కొండల్లోకి పారిపోయారు.

నిషాపూర్ పట్టణం కొండల వెనక వుంది. అక్కడికి చేరుకునే దాకా మహమ్మద్ విశ్రాంతి తీసుకోలేదు, తన భయాల్ని విందులలో, వేడుకలలో ముంచలేదు.

మంగోలులు పట్టుసడలకుండా మహమ్మద్ జాడలోనే వెళ్లారు, అతన్ని గురించి వాకబు చేసుకుంటూ. మంగోలులు నిషాపూర్ కూడా వస్తున్నారన్న వార్త రాగానే తను వేటకి వెడుతున్నానని ప్రకటించి షా తన జాడల్ని కమ్మేసుకుంటూ కొంతమంది రౌతులు అనుసరించి రాగా దౌడు తీసుకుపోయాడు.

దారిలో తుస్, జావా, రేయిలాని ఇతర నగరాలనీ ధ్వంసం చేసుకుంటూ మంగోలులు నిషాపూర్ చేరారు. నిషాపూర్ నుంచి ఖోరెస్మ్ షా ఎక్కడికి పోయిందీ చూడ్డానికి అన్ని వేపులకీ చిన్న దళాల్ని పంపించారు. ప్రతి నగరాన్ని, గ్రామాన్ని తగల బెట్టేస్తూ, ఆడవాళ్లని, వృద్ధుల్ని పిల్లల్ని ఎవళ్లనీ వదలకుండా మొత్తం ధ్వంసం చేసేశారు.

మహమ్మద్ మళ్లీ తగినంత సైన్యాన్ని పోగు చేసుకున్నాడు. హమాదాన్ నగరం దగ్గర ఇరవై వేల మంది సైన్యం వుండగా ఖోరెస్మ్ షాని హఠాత్తుగా తాతార్ సైన్యాలు చుట్టుముట్టాయి. వాళ్ల సైన్యంలో అధిక భాగాన్ని హతం చేసేశారు. మహమ్మద్ రైతు బట్టలు వేసుకుని మైదానంమీద జరిగిన యుద్ధంలో పాల్గొన్నాడు. అదే తాతారులతో ఖోరెస్మ్ షా కడపటి సంఘర్షణ. మంగోలు దళాలు ముసల్మాను దళాలకంటే ఎక్కువ లేకపోయినా తన సొంత భద్రతనే చూసుకుంటూ షా విజయం సాధించలేకపోయాడు.

తాతార్లు షాని గుర్తించలేక బాణాలతో కొట్టి అతని గుర్రాన్ని గాయపరిచారు. షా దౌడు తీసుకువెళ్లిపోయి కొండల్లో దాంకున్నాడు. మంగోలులు ఇక్కడ ఖోరెస్మ్ షా జాడ యేమీ పట్టుకోలేకపోయారు.

తాతార్లు అక్కడినుంచి పడమటికి వెళ్లారు. జెంజాన్‌కీ కాజ్‌విన్‌కీ వెళ్లారు. బెక్‌తెగిన్, క్యూచ్‌బక్ ఖాన్‌ల నాయకత్వం కింద ఉన్న ఖోరెస్మ్ సైన్యాన్ని నాశనం చేశారు. ఆజిర్‌బైజాన్‌ని దాటి ముఖాన్ మైదానాలమీదకి వెళ్లారు. అక్కడ జార్జియన్లతో పోరు చేశారు.

తాతార్లు ఎక్కడెక్కడికి వెళ్లినాగానీ అక్కడ వుండలేదు. తమకి తక్షణం అవసరమైన ఆహారాన్నీ బట్టలనీ లాక్కుని, బంగారాన్నీ వెండినీ మాత్రమే తీసుకువెడుతూ సాగిపోయారు. జెంఘిజ్ ఖాన్ జారీ చేసిన ఆజ్ఞలని దృష్టిలో కచ్చితంగా వుంచుకుంటూ వాళ్లు రాత్రిం బగళ్లు, అతి తక్కువ మజిలీలు చేస్తూ, ఖోరెస్మ్ షా మహమ్మద్ కోసం వెదుకుతూ వెళ్లారు.

జనావాసాలున్న చోట మేలుజాతి గుర్రాలని ఎంచుకుని ముందుకు దౌడు తీయించుకుంటూ పోయారు. ప్రతి ఆశ్వికుడికీ రెండేసి గుర్రాలున్నాయి. చాలా మందికి ఇంకా ఎక్కువ వున్నాయి. దౌడు తీయించుకుంటూ వాళ్లు వెడుతూ తాతార్లు ఒక గుర్రంమీదనుంచి ఇంకో గుర్రంమీదకి మారేవాళ్లు. ఈ రకంగా వాళ్లు చాలా దూరం ఇరవై నాలుగు గంటల్లో పోగలిగారు. అసలు ఎవళ్లూ వూహించని చోట ప్రత్యక్షమయ్యే వాళ్లు.

# అబెస్కున్ సముద్రంలో ద్వీపం

"ఎవళ్లు నా సైన్యాన్ని తిరిగి ఇచ్చి,
నా ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటారు?
యెవళ్లు నా భూభాగాన్ని
శత్రువునుంచి తీసుకుని నాకు ఇస్తారు?"
(తురుష్క గాథ నుంచి)

దయానూయ్ ప్రాంతానికి వచ్చి అమూల్ నగరం దగ్గర మహమ్మద్ దాంకున్నాడు. ఆ చుట్టుపక్కల ఎమీర్లు అతని దగ్గరికి వెళ్లారు. తమ విధేయతని ప్రకటించి, అతన్ని కొలవడానికి అంగీకారం తెలియజేశారు. పూర్వం షాకి వున్న పెద్ద బలగంలో యే మాత్రం మిగల్లేదు. పూర్తిగా నీరసించిపోయి, జబ్బు పడి, తను ఇంకా విశ్వసించగలిగిన ముఖ్య ఎమీర్ల సలహా అడిగి మూలిగాడు:

"ఈ తాతారు తుఫాన్ నుంచి కాస్త విశ్రాంతి, పూరట పొందగలిగే ప్రదేశం ఏదైనా ఈ భూమ్మీద వుందా నాకు?"

షా చెయ్యదగ్గ అత్యుత్తమమైన పని ఒక పడవ ఎక్కి అబెస్కున్ సముద్రం (కాస్పియన్ సముద్రం)లో వున్న ద్వీపంమీద రక్షణ పొందడమేనని వాళ్లంతా ప్రకటించారు. ఈ సలహాను సరించి షా ఓ చిన్న ఏకాంత ద్వీపంమీదకి వెళ్లాడు. అది సముద్రం మధ్యలో ఉంది. బావురుమంటూ ఉంది. మనుషులున్న జాడలేదు.

కొంచెం తర్వాత మహమ్మద్ కొడుకులు ద్వీపంమీదకి వచ్చారు – ఉజ్‌లా షా, అక్ షా, జలాలుద్దీన్‌లు. ఇక్కడ ఖోరెస్మ్ షా ఒక ఫర్మానా జారీ చేశాడు. చిన్న కొడుకు ఉజ్‌లా షా బదులుగా ఇంతకుముందు తను అవమాన పరిచి, ఏవగించుకున్న జలాలుద్దీన్‌ని సింహాసనానికి మళ్లీ వారసుడిగా నియమించాడు.

"ఇప్పుడు జలాలుద్దీన్ ఒక్కడే దేశాన్ని రక్షించగలవాడు. అతనికి శత్రువంటే భయం లేదు. శత్రువుని ఎదిరించడానికి వెళతాడు కూడా. జలాలుద్దీన్ విజయం సాధించి, అల్లా

నాకు అధికారాన్ని తిరిగి అప్పగిస్తే గనక దయ ధర్మం మాత్రమే నా సామ్రాజ్యమంతటా పరిపాలన చేస్తాయని నేను ప్రమాణం చేస్తున్నాను" అన్నాడు షా.

ఖోరెస్మ్ షా అప్పుడు జలాలుద్దీన్ నడుముకి వజ్రపు పిడి వున్న తన కత్తిని కట్టాడు. అతనికి సుల్తాన్ బిరుదు ఇచ్చాడు. అతనికి విధేయంగా వుండి, లొంగి వుంటాయని చిన్న కొడుకులచేత ప్రమాణం చేయించాడు.

ఖోరెస్మ్ షా కత్తిని అందుకుంటూ జలాలుద్దీన్ అన్నాడు:

"ఖోరెస్మ్ సామ్రాజ్యం ఇప్పటికే తాతార్ల వశం అయిపోయింది. ఇప్పుడు నాకు అధికారాన్ని అప్పగించారు. పేరు తప్ప యేమీ మిగలని సైన్యాల ఆధిపత్యం నాకు వచ్చింది. సైన్యాలు చెల్లా చెదురయిపోయాయి ప్రభంజనం తర్వాతి ఆకుల్లాగా. ముసల్మాన్ భూభాగాలమీద ఆవరించిన ఈ చీకటి రాత్రిలో నేను యుద్ధజ్వాలల్ని కొండలమీద రగిలిస్తాను. సాహసవంతులైన మనుషుల్ని పోగు జేస్తాను".

జలాలుద్దీన్ తండ్రి దగ్గర సెలవు తీసుకుని, పోరాటాన్ని తిరిగి సాగించడానికి వెళ్లిపోయాడు. మిగిలిన కొడుకులు కూడా వెళ్లిపోయారు. మహమ్మద్ ఒక్కడూ అబెస్కున్ సముద్రంలోని ఇసక ద్వీపంమీద వుండిపోయాడు.

తారుపూసి వికారంగా వున్న పడవ తీరాన్నుంచి లోసబురకి పోగానే ఖోరెస్మ్ షా మహమ్మద్ దానికేసే చూస్తూ విచారకరమైన ఆలోచనలతో తీరంమీద వుండి పోయాడు. తుర్కమెన్ కళాసీలు పెద్ద పలితవర్ణం తెరచాపని ఎత్తారు. షా కొడుకులు, ఆస్తరాబాద్ ఎమీర్ దండలు కట్టుకుని పడవలో నుంచున్నారు, పాదుషా చూపు తమ మీదనే వుండగా పక్కకి తిరిగే సాహసం చెయ్యలేక.

పడవ చాలా దూరం పోయింది. కాని మహమ్మద్ ఆలోచనల్లో మునిగిపోయి అలాగే నుంచుండి పోయాడు. ఆఖరికి పొడారిన వేడి ఇసకపై పడుకుని నిద్రపోయాడు. ఎండ వెచ్చదనం అనుభవిస్తూ, సముద్ర గాలికి హాయిగా పడుకున్నాడు.

గలగల చప్పుడుకీ, గుసగుసలాగే మాటలకీ మెలుకువ వచ్చింది. అతనికీ మాటలు వినిపించాయి: "అతను గొప్పవాడు, బలవంతుడు!..."

నిర్జన ద్వీపంమీద యే కంఠాలై వుండవచ్చివి? మళ్లీ శత్రువులా? షా చుట్టూతా చూశాడు. ఒక ఇసక దిబ్బ పైన వున్న వెలి ఆకుపచ్చ గడ్డి గుబురు వెనక నల్లని గొర్రె తోలు టోపీ పెట్టుకున్న ఒక తల ఒక్క క్షణం కనిపించి మాయమైపోయింది. మహమ్మద్‌కి దగ్గర ఆయుధాలేమీ లేవు – విల్లు, అమ్ములు, గొడ్డలి యుర్త్‌లో వుండిపోయాయి. షా గబగబా ఇసక దిబ్బ యెక్కాడు. కొంత మంది మనుషులు ఇసక పర్రలమీద పరిగెత్తిపోతూ వున్నారు. వాళ్ల మధ్యలో ఒక భయంకరమైన ప్రాణి గోచరించి. వికారంగా నాలుగు మోకాళ్లమీద దొర్లుకుపోతున్న ప్రాణి.

"ఆస్తరాబాద్ పాలకుణ్ణి ఆజ్ఞాపించాను నన్ను పూర్తిగా నిర్జనమైన ద్వీపంమీద వదలమని. ఈ మనుషులెక్కడి నుంచి వచ్చారు?" బెదిరిపోయి మహమ్మద్ యుర్త్‌కి గబగబా వెళ్లిపోయాడు. పొగ దాని పైన సుళ్లు తిరిగింది. గుడారం ముందున్న జాగాలో, అర్ధవలయాకారంగా ఓ పన్నెండు వింత ఆకారాలు కూర్చుని వున్నాయి. వీళ్లు ఎలాంటి మనుషులై వుంటారు? మనుషుల రూపమే లేదే? పెద్ద సెగ్గడ్డలు, కుళ్ళిపోయే పుళ్లు, ఎర్రబడి ఉబ్బిన బొర్ర ముక్కులూ వీళ్లూ, అసలెవరు?

"ఎవరు నువ్వు? ఇక్కడికెందుకొచ్చావ్? వాళ్లు మమ్మల్ని అన్ని చోట్లనుంచీ తరిమేశారు, ఇక్కడికొచ్చాం?" అన్నారు వాళ్లు.

"ఇంతకీ మీరెవరు?"

"అల్లా శాపగ్రస్తులం మేము. మేమీ ద్వీపంమీదకి వచ్చి చేపలు పట్టుకు బతుకుతున్నాం".

"కనిపించడలాం?" అన్నాడింకొకడు. "మేం కుష్ఠు వాళ్లం. బతికుండగానే శిథిలం అయిపోతున్నాం, శవాలల్లాగా. ఈ మనిషిని చూడు. ఇతని వేళ్లన్నీ వూడిపోయాయి. ఈ మనిషికేమో కాళ్లు పోయాయి. చేతులు మోచేతులదాకా పోయాయి. ఎలుగుబంటిలాగా చతుష్పాత్తులా తిరుగుతాడు. ఇతనున్నాడు, కళ్లు పోయాయి. ఈ మనిషికి నాలిక పోయింది, వీడు మూగ..."

మహమ్మద్ యేమీ అన్లేదు. సుదూర తీరానికి నల్లని చుక్కలాగా పోయిన పడవ గురించి అనుకున్నాడు.

"మమ్మల్ని కాపాడమని ఎప్పుడూ అల్లాని వేడుకున్నాం. మామీద ఆయన దయ చూపించి నిన్ను మా దగ్గరికి పంపాడు".

"నేను మీకు ఎలా సాయం చెయ్యగలను?"

ఒక మనిషి లేచాడు. మిగిలిన వాళ్లకంటే దృఢంగా, ఎత్తరిగా వున్నట్టు కనిపించాడతను. చేతిలో గొడ్డలి పట్టుకున్నాడు.

"నేను మన సోదరత్వపు షేక్‌ని. ఇక్కడ శాపగ్రస్తుల ఈ రాజ్యంలో అందరూ నా ఆజ్ఞని శిరసావహించాలి. నన్ను ఎదిరించిన వాడు చచ్చిపోతాడు. నువ్వు బలంగా ఆరోగ్యంగా వున్నావు. నిన్ను మా బృందంలోకి తీసుకుంటున్నాం. నువ్వు మా వలలు ఈడ్చి, ఆహారం, నీళ్లూ తేవాలి. మాకందరికీ దీనికి దగ్గ బలం లేదు. మాకు అల్లా పంపించిన ఈ యుర్త్‌లో దేగిసా, బియ్యం, పిండి, నూనె, మాంసం కొవ్వు వున్నాయి. ఇప్పుడు నువ్వు మాతో వుండు. బట్టలు విప్పెయ్యి".

మహమ్మద్ వెనక్కి తిరిగి ఆయాస పడుతూ ఒడ్డుకి పరిగెత్తిపోయాడు. కుష్ఠు రోగులు అతని వెంటబడ్డారు. ఇసక తిన్నెమీద చేరి అతన్ని పరిశీలించారు. ఖోరెస్మ్ షా ఎండు పుల్లలు యేరి గుట్టపోసి నిప్పు చేశాడు. నల్లని దట్టమైన ధూమం వర్తులంగా ఆకాశంలోకి లేచింది.

"వాళ్లు తీరంమీద ఈ పొగని చూస్తారు. పడవ మళ్లీ వెనక్కి వస్తుంది. నన్ను మళ్లీ వెనక్కి గట్టుకి తీసుకుపోతుంది" అని మహమ్మద్ గొణుక్కున్నాడు. పడవని గురించి తప్ప మరిదేన్ని గురించీ అనుకోలేదు. పడవ మసగ్గా వున్న దూరంలోకి దృష్టి పథంనుంచి మాయమైపోయింది. "అక్కడ యుద్ధం, తాతారు రౌతులు ప్రతి చోటా పసికడుతూ వున్నారు. కాని కనీసం వాళ్లు సజీవంగా వున్న మనుషులు. వాళ్ల రక్త మాంసాలు సజీవంగా వున్నటువంటివి. వాళ్లు యుద్ధం చేస్తారు, బాధపడతారు, యేడుస్తారు, నవ్వుతారు. ఈ జీవన్మృతుల ద్వీప వాసం తర్వాత వాళ్ల మధ్య బతకడం స్వర్గమే".

పదిహేను రోజుల తర్వాత అన్న మాట ప్రకారం పడవ ద్వీపానికి తిరిగివచ్చింది. అందులో రౌతులు కొంత మందితో బాటు ఖోరెస్మ్ షా సైనిక దళవాయి తైమూర్ మాలిక్ వున్నాడు. వాళ్లకి ఖోరెస్మ్ షా వెంటనే కనిపించలేదు. పూర్తిగా దిగంబరుడై అతను తీరంమీద పడి వున్నాడు. తలమీద ఒక కాకి వుంది, కళ్లని పొడుస్తోంది.

తైమూర్ మాలిక్ ద్వీపం చుట్టూ తిరిగాడు. భయపడిపోయిన కుష్ఠు వాళ్లు పొదల వెనక దాంకుని కనిపించారు. ద్వీపంమీద యేం జరిగిందని వాళ్లని అడిగాడు. వాళ్లు చెప్పారు:

"పడవలో వచ్చిన వాళ్లంతా నేలమీద వాలి ఈయనకి దణ్ణం పట్టడం చూశాం. ఈయన్ని పాదుషా అని పిలిచారు. ఈయన్ని ఇక్కడ వదిలేశారు. కాని, కుష్ఠు రోగి ఒక షా గాని సుల్తాన్ గాని కట్టుకొన్న బట్టల్ని వేసుకుంటే వాడి గాయాలుపోయి బాగవుతాడని తెలిసిన పెద్దలు అంటారు. అందుకని ఈయన బట్టలు తీసేసుకున్నాం. మాతోబాటు కలిసి భోజనం చెయ్యమన్నాం. ఆయనకి అన్నం తెచ్చి పెట్టాం, కాని తిన్నాడు కాదు. అలా అక్కడే అంత సేపూ కూర్చుండి పోయాడు, నిప్పు రాజేస్తూ. లేకపోతే చడీచప్పుడు లేకుండా ఇప్పుడున్నట్టుగా పడుకునేవాడు. ఆయన బట్టలన్నీ భద్రంగా వున్నాయి. ఈ మనిషి సుల్తాన్ కాదని మాకు తెలుసు, యేమంటే మాలో యెవళ్లకీ బాగవలేదు".

"వీళ్లని చంపేద్దామా?" అని ఒక రౌతు అరిచాడు.

"మన కత్తులతో వద్దు, లేకపోతే వీళ్ల విషపూరిత రక్తంతో వాటి తేజోవంతమైన ధారలు మకిలి అయిపోతాయి" అన్నాడు ఇంకో సైనికుడు. కుష్ఠు రోగుల షేక్ పొట్టలోకి ఒక బాణాన్ని కొట్టాడు. పిచ్చి కేకలు పెడుతూ ఆ కుష్ఠు రోగి పారిపోయాడు. మిగిలిన వాళ్లు సత్తున కొద్దీ పిక్క బలం చూపించి అతని వెనక పరిగెత్తారు.

"వాళ్లని వాళ్ల మానాన వదిలెయ్యండి!" అన్నాడు తైమూర్ మాలిక్. "అల్లా శిక్షకి ఇప్పటికే గురయ్యారు. వాళ్లందరికంటే ఎక్కువ విచారంగా వుంది నాకు. నా జీవితమంతా ఖోరెస్మ్ షా గొప్పతనం కోసం పోరాడాను. రక్తం చిందించాను, ఖోరెస్మ్ షా అజేయుడైన అభినవ సికందర్ అని నమ్మి. పరీక్షా సమయం వచ్చినప్పుడు భయమెరగని ముసల్మాను సైన్యాన్ని మహత్తర విజయానికి నడిపిస్తాడని విశ్వసించాను. ఇవాళ నా గాయాలని చూస్తే

సిగ్గవుతున్నది. నా యౌవన దినాల గురించి, ఎడారి మరీచక రక్షణలో వృథా చేసిన ఆ రోజుల గురించి, విచారిస్తున్నాను. ప్రపంచాన్ని జయించగల విశాల సైన్యం ఉండిన మనిషి అక్కడ పడివున్నాడు. ఇవాళ కాకిని తోలడానిక్కూడా చేతిని ఆడించలేని స్థితిలో వున్నాడు. అందరూ ఈయన్ని మర్చిపోయారు. తన దిగంబరత్వాన్ని కప్పుకోవడానికి షల్వార్ గాని, సమాధికి మాతృదేశపు పిడికెడు మట్టి గాని లేకుండా అక్కడ పడి వున్నాడు. నేను చాలా కాలం సైనికుడిగా వున్నాను. నా జీవితం ఎలా మోసపోయిందోనన్న ఆలోచనకి నాలో మండే జ్వాలల్ని యే కన్నీళ్లూ ఆర్పలేవు".

తైమూర్ మాలిక్ వంపు తిరిగిన తన దీర్ఘ కరవాలాన్ని దైసి, కాలు దానిమీద వేసి విరిచాడు. తన పాగాని తీసి ఖోరెస్మ్ షా శరీరంమీద కప్పాడు. ఒక్క చిన్న ప్రార్థన మంత్రాన్నీ చదివాడు. రౌతులు కత్తులతోటి ఇసక తవ్వి ఆ సమాధిలో ఒకప్పుడు సకల ముసల్మాన్ పాలకులలోనూ మహాబల సంపన్నుడైన ఖోరెస్మ్ షా మహమ్మద్ శవాన్ని పూడ్చారు. కసాయి వాడి కత్తి కింద నక్కుతూ అంతమయే మేకపిల్ల లాగా దిక్కు మాలిన రీతిలో అతని గాథ అంతం అయింది.

తైమూర్ మాలిక్ ఆ ద్వీపాన్ని వదిలిపెట్టి తన రౌతులతోబాటుగా జలాలుద్దీన్‌ని వెదకడానికి వెళ్లాడు. అతనికి తండ్రి మరణ వార్తని చెప్పాలనుకున్నాడు. చాలా యేళ్ల తర్వాత సాదా దర్వీషు దుస్తులు వేసుకుని అతను అరేబియాలో, ఇరాన్‌లో, హిందూదేశంలో సంచరిస్తూ వుండగా అతన్ని చూశారని కొందరు అంటారు.

# కుర్బాన్ కిజిక్  ఇంటికి బయల్దేరడం

"ఇంకా గట్టిగా తెడ్లు వెయ్యండి! వూ! ఇంకా గట్టిగా".

వడికి ఎదురు వెళ్లి, వేగంగా ప్రవహించే జైహూన్ నీళ్లతో కుస్తీ పట్టి పడవ మెల్లిగా తీరం చేరింది.

కుర్బాన్ తను వదిలివచ్చిన రాతి తీరంకేసి చూశాడు. కొండ శిఖరంపైన పంచకళ్యాణి గుర్రంమీద మహమ్మద్ ఇంకా కనిపిస్తూనే వున్నాడు. కుర్బాన్ నీళ్లల్లోకి గెంతి తీరంకేసి పోయాడు. కోటలోనుంచి భీతిల్లిన జనం వీపులమీద మూటలు మోస్తూ కొండ దిగువకి పరిగెత్తుతున్నారు. ఒకళ్లనొకళ్లని తోసేసుకుంటూ వాళ్లు పడవల్లోకి గెంతారు, అరుస్తూ:

"తాతార్లు వస్తున్నారు! రక్షించుకోండి!"

కుర్బాన్ కోటగోడలదాకా వున్న కొండమీదకి ఎక్కాడు. అక్కడినుంచి అతనికి చారలు, ఎరుపు రంగు వున్న అంగరఖాలు పసుప్పచ్చని రాతి మైదానంమీద భయవిహ్వాలంగా గందరగోళంలో తమని తాము రక్షించుకోవడానికి పరిగెత్తడం కనిపించింది. దూరంలో ధూళి మేఘం ఒకటి చేరువవుతూ వస్తోంది.

"వాళ్లు తాతారు!" అనుకున్నాడు కుర్బాన్. రాళ్లవల్లా, ముళ్లవల్లా తన కాళ్లు ఎలా చీలిపోతున్నాయో గమనించకుండా ఎండిపోయిన బీటిమీద పరిగెత్తి పారిపోయాడు.

అతను ఎత్తైన గుంజ వున్న ఒంటరి శ్మశానం దిబ్బ చేరే దాకా పరిగెడుతూనే వున్నాడు. దాని వెనకాల దాంకుని వూపిరి పీల్చుకుని, బయటికి చూడ్డం మొదలెట్టాడు.

ఆ ధూళి మేఘంలోనుంచి ఎర్ర గొర్రె తోలు అంగరఖాలు తొడుక్కున్న రౌతులు అప్పటికీ దృష్టికి ఆనుతున్నారు. కొంత మంది రౌతులు ముఖ్య విభాగంనుంచి విడిపోయి మైదానంమీద సరాసరి దౌడుతీసుకుపోయారు. కాందిశీకులని పారిపోకుండా అడ్డగించారు. కత్తులు మెరిశాయి. మనుషులు పడిపోయారు. తాతార్లు గిర్రున తిరిగి, ఆగి, గుర్రాలు దిగకుండా వంగి చెల్లాచెదురైన మూటల్ని పోగు చేసి మళ్లీ దౌడు తీసిపోయారు, తమ సైన్యం దగ్గరికి.

కుర్బాన్ చేతులమీదా మోకాళ్లమీద పాకి పొడి గొంద దగ్గరికి వెళ్లి, దిగి, పరిగెత్తి పారిపోవడం మొదలుపెట్టాడు.

అక్కడా అక్కడా జనం కనిపించారు. "మృత్యువు దు:ఖాల లోయ"నుంచి కుర్బాన్ వచ్చాడని తెలిసివాళ్లంతా అతని చుట్టూ చేరి బుఖారా గతి యేమైందనీ, ఖోరెస్మ్ షా పారిపోవడం గురించీ అడగడం మొదలుపెట్టారు. తమ నెగళ్ల పక్కన వచ్చి కూర్చోమ్మని పిలిచారు. నిప్పులమీద కాల్చిన రొట్టెల్ని పెట్టారు. చెవులప్పగించి విన్నారు.

ఒక చోట గొయ్యిలో కుర్బాన్‌కి జనం గుంపుగా కనిపించారు. వాళ్లు అతని దగ్గరికి వచ్చి నెగడు పక్క కూర్చున్నారు. అంతా తాతార్ల గురించే మాట్లాడుకుంటున్నారు. తమకి వాళ్లు కనిపించిన సందర్భాల గురించే మాట్లాడుకుంటున్నారు.

"అంతా ఒక వూరి వాళ్లమే. మాకిలా జరిగింది. మా వాళ్లు పదిమంది వీధుల్లో నుంచుని మాట్లాడుకుంటున్నారు. అప్పుడొక తాతారు వూళ్లోకి వచ్చాడు. వాడు యెకాయెకీన మా వాళ్ల దగ్గరికి వెళ్లి ఒకళ్ల తర్వాత ఒకళ్లని చంపెయ్యడం మొదలెట్టాడు. ఆ ఒంటరి ఆశ్వికుడిమీదకి చెయ్యి ఎత్త సాహసించిన వాడు ఒక్కడు లేడు. కంచెగుండా పారిపోగలిన వాళ్లు, మాకు మల్లే, బతికారు".

"నేను విన్నది ఇదీ. ఒక మనిషి పొలంలో పని చేసుకుంటూ వుంటే ఒక తాతారు చూశాడు. తాతార్ చేతిలో ఆయుధం యేమీ లేదు ఆ మనిషిని చంపడానికి. తాతార్ భయంకరమైన గొంతుకతో అరిచాట్ట: 'తలకాయ నేలమీద వుంచు, కదలద్దు' అని. యేం జరిగిందనుకున్నారు? ఆ మనిషి తల నేలమీద పెట్టాడు. తాతార్‌వాడు కొల్లగొట్టిన సామాను వున్న గుర్రం దగ్గరకి దౌడు తీసుకుపోయాడు. అక్కడొక కత్తి వుందట, తిరిగి వచ్చి ఈ మనిషిని చంపేశాడు".

ఆ రకంగా వాళ్లు విచారంగా నెగడు దగ్గర కూర్చుని తమ దేశం కష్టాల గురించి విచారంగా మాట్లాకున్నారు. కుర్బాన్‌కి కాసిని రొట్టె ముక్కలు పెట్టి, కొంచెం జావ ఇచ్చారు.

హఠాత్తుగా పైనుంచి ఒక భయంకరమైన గొంతుక అరించింది:

"హేయ్! మిమ్మల్నే! ఒకళ్ల చేతులు ఒకళ్లు వెనక విరిచి కట్టెయ్యండి!"

పైన, గొయ్య అంచున, తుప్పు రంగు గుర్రంమీద ఒక తాతార్ రౌతు వున్నాడు.

"ఓయ్ నాయనోయ్! మనకి చావు దాపురించింది బాబూ" అని యీ మనుషులు మూలిగారు. పటకాలు తీసేసి కిమ్మన్నాస్తిగా ఒకళ్ల చేతులు ఒకళ్లు కట్టేసుకోవడం మొదలుపెట్టారు.

"ఆగండి ఒక క్షణం" అన్నాడు కుర్బాన్. "వాడొక్కడే వున్నాడు. వాణ్ణి మనం చంపలేమా? పారిపోలేమా?" అని అడిగాడు.

యేమిటీ? యుద్ధం చెయ్యడమే?"

"మనం ఒకళ్ల చేతులు ఒకళ్లం కట్టేసుకుంటే వాడు మనల్ని చంపేస్తాడు. దాని బదులు వాణ్ణే చంపడం మంచిది! మనం బతికి బయటపడతాం!"

"అబ్బెబ్బె! అలాంటి పని చెయ్యడానికి దమ్మెవరికుంది?"

వాళ్లు వొణుకుతూ చేతులు కట్టేసుకోవడం మొదలుపెట్టారు.

కుర్బాన్ తలవంచి, మూటలోనుంచి యేదో బహుమతీ తీస్తున్న వాడల్లే దాన్ని పట్టుకుని, తాతార్ దగ్గరికి కొండ యేటవాలు యెక్కాడు.

ఆ రౌతు పడుచు వాడేం కాదు. అతని గడ్డంమీద నెరసిన వెంట్రుకలు పల్చగా వున్నాయి. ఎండకి కమిలిన అతని ముఖం వార్ధక్యపు ముడతలతో వుంది. చీలినట్టున్న రెప్పల మధ్యనుంచి కళ్లు కోపంగా చూస్తున్నాయి.

"యేమిటిది?" అనడిగాడా రౌతు మూటని అందుకోవడానికి ఒంగుతూ.

కుర్బాన్ అతని తలనీ, చేతి అంది పుచ్చుకున్నాడు. గుర్రం బెదిరి పక్కకి గెంతింది. కుర్బాన్ వదల్లేదు. తాతారు వాడు గుర్రంమీదనుంచి పడిపోయేదాకా పట్టుకునే వున్నాడు. అప్పుడు వాణ్ణి కత్తితో నరికేశాడు, గొర్రెని నరికినట్టుగా.

కుర్బాన్ నుంచుని చుట్టూ చూశాడు. నెగడు దగ్గర వున్న వాళ్లల్లో ఒకడు పిక్క సత్తున కొద్దీ పారిపోతున్నాడు. మిగతా వాళ్లు దాంకుని గొంది నుంచి తొంగిచూస్తున్నారు. ఇద్దరు బయటకి వచ్చారు.

"వాడు చచ్చాడు" అన్నాడొకడు, తాతార్‌మీద వాలి.

"వాడి దగ్గరున్న దాన్నంతటినీ మనం సమంగా పంచుకుందాం" అన్నాడింకొకడు, చచ్చిన వాడి గొర్రె తోలు కోటు లాక్కుంటూ. చొక్కా లేకుండా బోసిగా, చామన చాయగా వున్న ఒంటిమీద చచ్చిన వాడు దాన్ని తొడుకున్నాడు.

అందరూ గుర్రాన్ని చుట్టుముట్టి దాన్ని పట్టుకోవడానికి కుర్బాన్‌కి సాయం చేశారు. అప్పుడు కుర్బాన్ అన్నాడు:

"మీక్కావలసిందాన్నంతటినీ మీరు తీసుకోండి. కాని ఈ తుప్పు గుర్రం మాత్రం నాదే. ఇది మంగోలు గుర్రం కాదు, కనిపిస్తోంది కదా - మన రైతులనుంచి కాజేసిన గుర్రం ఇది. నా మడి దున్నుకోడానికి దీన్ని వాడుకుంటాను".

"మనం బొమ్మ బొరుసూ వేద్దాం దీని కోసం" అన్నాడొకడు, గుర్రం కళ్లేలు మణికట్టుకి చుట్టుకుంటూ.

“చూడు! తాతారు వాడు బతికేవున్నాడు, లేస్తున్నాడు!” అని కుర్బాన్ అరిచాడు. ఆ మనిషి భయపడి కళ్లేలు వదిలేసి పారిపోయాడు.

గు(రంమీద వున్న అతిబరువుగా దాన్ని తప్ప మిగిలిన మూటలనీ బస్తాలనీ అన్నిటినీ విప్పి కింద పడేశాడు కుర్బాన్. గు(రం జీనుమీదకి ఎక్కి అరిచాడు:

“మీరు! మంచి రౌతులు అవుతారు! – ఎవడన్నా వస్తున్నాడని వినగానే పురుగుల్లాగా పారిపోవడం! మీలో గనక పౌరుషమున్న మగాళ్లు ఎవళ్లన్నా వుండి వుంటే మనం తాతార్‌లనీ, మంగోలులనీ తరిమెయ్యడమే కాదు, మనల్ని మొత్తం దోచుకున్న ఖోరెస్మ్ షాలని, సుల్తాన్‌లని, బెక్‌లని, ఖాన్లని కూడా తరిమేసి వుండేవాళ్లం. కాని మీరు ఒట్టి బొద్దింకలు, కంతలో నక్కి దాంకుని, చప్పుడు వినిపిస్తే ఒణికి చచ్చిపోతూ వుంటారు! అంతెందుకు? యే బాపతు తాతార్ వాడేనా మిమ్మల్ని పిప్పి చేసేస్తాడు! – సరే, సెలవ్, కాని కుర్బాన్ కిజిక్‌ని గుర్తుపెట్టుకోండి!” కుర్బాన్ చేతిని వూపాడు. మైదానంమీద దౌడు తీయించుకుంటూ వెళ్లిపోయాడు.

# కుర్బాన్ కుటుంబంకోసం వెదకడం

కుర్బాన్ బుఖారా దగ్గరికి వచ్చే కొద్దీ ధ్వంసం అయిన గ్రామాలూ, సగం శిధిలమైన కళేబరాలూ యెక్కువగా కనిపిస్తూనే వున్నాయి. పొట్టలు ఉబ్బరించి, కొవ్వెక్కిన కుక్కలు శవాలనుంచి మెల్లిగా దూరం పోతున్నాయి. మొరగకుండా తోకల్ని యీడ్చాయి.

నిర్జనంగా వున్న చోట కుర్బాన్ తాతార్ జీనుమీదనుంచి ఆ మిగిలిన తోలు సంచీని దింపి కొల్లగొట్టిన బంగారం దొరుకుతుందని ఆశపడుతూ విప్పాడు. అందులో వేర్వేరు పరిమాణాల కమ్మరి సమ్మెట్లు ఉన్నాయి. కమ్మరి పట్టకారు, ధాన్యం మూట, ఉడకపెట్టిన మాంసం, పన్నెండు అట్లు ఉన్నాయి. బంగారం యేది? ఓ పాత గుడ్డలో చుట్టపెట్టిన తోలు అడపం కుర్బాన్‌కి కనిపించింది. అందులో రొఖ్ఖం వుంది – బంగారం కాదు, కాని కాసిని వెండి, రాగి నాణేలు. కాని ఈ దిర్హమ్‌లు కూడా తన చిన్న మడికి కావలసిన వాటిని కొనగలవు. వీటికి తోడు బుగ్గన పెట్టుకున్న ఖోరెస్మ్ షా బంగారం దీనార్ వుండనే వుంది.

కొన్ని గ్రామాల్లో జనం అప్పుడే పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. పంట బోదెల్లో నీళ్లు సరిగా రావడం లేదనీ లేకపోతే అసలు రావడం లేదనీ, కొన్ని పొలాలు ఎండిపోయాయనీ, కొన్ని మురిగిపోయాయనీ, మట్టీ విత్తనాలూ కొట్టుకుపోయాయనీ కుర్బాన్‌తో తమ గోడు వెళ్లబోసుకున్నారు.

దుశ్శకునం ఆవరించుకోగా కుర్బాన్ స్వారీ చేసుకువెళ్లాడు. తన మడి చెక్క పక్క వంపు తిరిగిన పంట బోదె వార వున్న పాత పోపార్లర్ చెట్టు కనిపించే వేళకి అప్పుడే చీకటి పడుతోంది.

బోదెలో నీళ్లు పారుతున్నాయి. ప్రశాంత నిశీధిలో, మసక వెన్నెల కాంతిలో, ఇంటిని సమీపించాడు. పెరటి గుమ్మం బార్లా తెరిచి వుంది. గుర్రం దిగాడు. శాలలో కట్టాడు. గుమ్మం దగ్గరికి వెళ్లాడు. దుండలు అడ్డం పెట్టి మూసి వుంది. చిటుక్కుమనే శబ్దం లేదు, గాలి పీల్చే చప్పుడు లేదు, తలుపు వెనకనుంచి యే చప్పుడూ లేదు.

కుర్బాన్ పిడికెడు గడ్డి యేరి గుర్రానికి వేశాడు. తర్వాత బాగా తెలిసిన వూనికలమీద కాళ్లు పెట్టి కప్పు పైకి యెక్కాడు. అక్కడ పాత జొన్న కట్టలమీద పడుకున్నాడు.

తొలి వేకువ జామున శీతపవనం వీస్తూ వుండగా కుర్బాన్ ఇబ్బందిగా గుడిసె కప్పుమీద దొర్లుతున్నాడు. అప్పుడతనికి వింత ధ్వని వినిపించింది, దూరంలోని మూలుగులాగా. కుర్బాన్ విన్నాడు. మూలుగు మళ్లీ వినిపించింది. చెవులు జాగ్రత్తగా వుంచి మళ్లీ విన్నాడు. యెవరీ మూలిగేది?

కుర్బాన్ కప్పుమీదనుంచి దిగి గుర్రం దగ్గరికి పరిగెత్తాడు. అతను తోలు సంచీలోనుంచి సమ్మెట తీశాడు. గుడిసె తలుపు బద్దలు కొట్టి లోపలికి వెళ్లాడు. చీకటిగా వుంది. తను బల్లమీద చేతులతో కెలికేశాడు, ఒక శరీరం తగిలింది. ముఖం తడిమి తలని గుర్తుపట్టాడు. చచ్చిపోయినట్టు పడివుంది. లోగొంతుకలో ఆమె మూలుగుతోంది:

"నాకు తెలుసు నాయనా, నువ్వు తిరిగివస్తావని. కుర్బాన్ మమ్మల్ని వదిలిపెట్టడు..."

"కాని మిగిలిన వాళ్లు యేరీ?"

"అందరూ కొండల్లోకి పారిపోయారు. నేను ఇల్లు చూసుకుందుకు వెనక దిగడిపోయాను. కాని నీరసపడిపోయాను. నేను చచ్చిపోయాననే వాళ్లు అనుకుని వుంటారు. తలుపు మూసేశారు. అవును నాయనా, నువ్వు వచ్చావు అంతా చక్కబడుతుంది..."

కుర్బాన్ నిప్పు రాజేసి దానిమీద కుండ పెట్టి కాసిని గింజలు వేశాడు. గుడిసెకి వెలుతురు వచ్చి వెచ్చబడింది. అతని తల్లి చిక్కిపోయి నీరసంగా వుంది. యెండిపోయిన పెదాలు గొణిగాయి.

"వెనక్కి తిరిగివచ్చావు, నాయనా!"

కుర్బాన్ గుర్రాన్ని బంజరుమీదకి తీసుకెళ్లి మేతకి వదిలేశాడు. దాన్ని ఆనుకునే చిన్న మడి వుంది – చిన్న ముక్క, చెయ్యంత! దీంతోటి కుటుంబాన్ని పోసించడం యెలాగ? పైగా సగం పంటని భూకామందుకి ఇవ్వాలి. అప్పటికే సగం కలుపు మొక్కలతో నిండిపోయింది. ఇంకా దూరంలో ఇరుగుపొరుగు వాళ్ల భూములు ఉన్నాయి. వాటిమీద కూడా కలుపు మొక్కలు పెరిగిపోయి వున్నాయి, యెవళ్లూ కనిపించలేదు. ఇంకా దూరంలో కమ్మరిశాల, ముసలి కమ్మరి సకావ్‌కులి ఇంటి గోడలు కాలి నల్లబడిపోయాయి. గుడిసె చుట్టూ వున్న చెట్ల ఆకులు మెలి తిరిగి యెండిపోయాయి.

కాని వున్నట్టుండి కుర్బాన్‌కి పొలాలమీద తిరుగుతూ ఒంటరిగా ఒకతను కనిపించాడు. అతను వంగి యేదో చేస్తున్నాడు. బహుశా బోరెకి అడ్డం తీస్తున్నాడేమో.

"హోయ్!" అని కుర్బాన్ అరిచాడు.

ఆ మనిషి నిటారుగా లేచి కళ్లకి చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు చూడ్డానికని.

"హేయ్, కుర్బాన్ కిజిక్!" అని అతను అరిచాడు. ఇద్దరూ బోదెవారమ్మటే ఒకళ్లకేసి ఒకళ్లు గబగబ పరిగెత్తి చేతులు చాచి, కుడి భేజంమీద ఒకళ్లకొకళ్లు అదుముకున్నారు. అతను కుర్బాన్ పొరుగువాడు, ముసలి సకాన్‌కులి, అప్పటికే తాత అయ్యాడు.

"ఆహా ! యేం రోజులు!" అన్నాడా ముసలతను, చొక్కా చేత్తో కళ్లు తుడుచుకుంటూ.

"నీ కుటుంబం ఎలా వుంది? నీ ఆవు బాగుందా? గాడిద పని చేస్తోందా, గొర్రెలు ఈనాయా?" అని కుర్బాన్ అడిగాడు.

"ఈ గొర్రె తోలు అంగరఖాల వాళ్లు వచ్చి ఇరుగుపొరుగు వాళ్ల పశువులనన్నిట్నీ తోలుకుపోయారు. నా నాలుగు గొర్రెల్నీ జీన్లమీద వేసుకుపోయారు, నా బుల్లి మనవణ్ణిని. మిగిలిన కుటుంబం కొండల్లోకి పారిపోయింది. వాళ్లు వస్తారని చూస్తున్నాను, ఆకలికి చచ్చిపోకుండా వుంటే. నా ఆవూ గాడిదా మిగిలిపోయాయి. వాటిని వెనక్కి తీసుకొచ్చాను".

"కాని మా కుటంబం ఎక్కడ?" అని కుర్బాన్ అడిగాడు. జవాబు కోసం యెదుర చూస్తూ గాలి కూడా పీల్చలేదు.

"నువ్వు అదృష్టవంతుడివి! – నీ భార్య నిన్న రాత్రి తిరిగివచ్చింది. మా శిథిలమైన ఇంట్లో మాతో వుంది. అదుగో, ఆమే వస్తోంది పొలాలమీద..."

కుర్బాన్‌కి దూరంనుంచి పరిచితమైన యెర్ర దుస్తులు కనిపించాయి.

"సరే, యేమిటి, సకావ్‌కులి?" అని ముసలతనితో అన్నాడు. "నీకు ఆవూ, గాడిదా వున్నాయి. నాకు గుర్రం వుంది. మొత్తం కలిపి మన చెక్కల్ని దున్నుదాం. ప్రతి చోటా యుద్ధమూ, దండయాత్రలూనూ. నిన్న కిప్‌చాక్ మన్నీళ్లు, ఇవాళ మంగోలు ఖాన్‌లు. ఎప్పటికి వీళ్లు వదుల్తారో! యేమైనా మనం రైతులం – ఆగలేం! విత్తులు చల్లాల్లి. మనల్ని మనమే చూసుకోకపోతే యెవళ్లు చూస్తారు? ఎవరు తిండి పెడతారు?"

"నువ్వన్నది నిజమే. కాలం ఆగదు. నేలకి విత్తనాలు కావాలి. దున్నాలి. నీళ్లుపెట్టాలి..."

# మాతృశ్రీ సుల్తానా
# తుర్కాన్ ఖాతూన్ పారిపోవడం

భయంకర మహాకాళ సంవత్సరం 1220వ వసంతరుతువులో మవరాన్నహర్ మొత్తం జెంఘిజ్ ఖాన్ అధికారంలో వుంది. విలువైన ఆస్తి వారసత్వంగా సంక్రమించిన భూకామందులాగా మంగోలు ఖాఖాన్ ఒక పద్ధతినీ, పౌర జీవితాన్నీ పున:స్థాపించడంలో తీరికలేకుండా మునిగిపోయాడు. జెంఘిజ్ ఖాన్ అన్ని నగరాల్లోనూ తాతారు దండుని పెట్టాడు. స్థానిక పాలకుల్ని నియమించాడు. వాళ్లకి మంగోలు సలహాదార్లని నియమించాడు. దాంతోటి ప్రతీదీ ఖాఖాన్ అప్రమత్త, నిరంతర పర్యవేక్షణలో ఉంటుంది.

జైహూన్ కింది ప్రాంతాలే ఇంకా లొంగకుండా వున్నాయి. అది ఖోరెస్మ్ గుండెకాయ. అక్కడనే ఖోరెస్మ్ షాల రాజధాని గుర్‌గంజ్ వుంది. మంగోలు ఆక్రమిత ప్రాంతాల మధ్యలో అది తాళ్లు కోసేసిన గుడారు మాదిరీ వుంది. ఈ ప్రాంతం మీద ఆధిపత్యం సంపాదించాలని జెంఘిజ్ ఖాన్ తీర్మానించుకున్నాడు. దాని దాడిని తన కొడుకులు జూచి, జగతాయ్, ఉగేదీయ్‌లు ముగ్గురికీ అప్పగించాడు. తన సైన్యంలో కొంత భాగాన్ని వాళ్లకి ఇచ్చాడు. జగతాయ్, ఉగేదీయ్‌లు దక్షిణం నుంచి జైహూన్ తీరం వారనే గుర్‌గంజ్‌కి వెళ్లారు. కాని స్వతంత్ర భావాలున్న జూచి తచ్చాడాడు: తన సైన్యంతోటి జెండ్ దగ్గర ఉండిపోయాడు. అడివి గాడిదల్ని వేటాడుతూ కాలం గడిపాడు. సంచార శిబిరాల నుంచి గుర్రాల్ని పోగుచేశాడు. ఖాఖాన్‌కి ఇష్టమైన తెలుపు మీగడ రంగు వాటిని మాత్రమే ఎంచుకునేవాడు.

జెంఘిజ్ ఖాన్ తన ముఖ్య సైన్యానికి ఆగమని ఆజ్ఞ చేసి, శీతకట్టు జైహూన్ తీరంమీద గడప నిశ్చయించుకున్నాడు. ఖోరెస్మ్ షా అతి ప్రముఖ ఉద్యోగుల్లో ఒకడైన దనీష్‌మండ్ హాజిబ్ జెంఘిజ్ ఖాన్ కొలువులో వున్నాడు. గుర్‌గంజ్‌కి అతన్ని పంపాడు. అక్కడికి చేరాక దనీష్‌మండ్ హాజిబ్ మాతృశ్రీ సుల్తానా తుర్కాన్ ఖాతూన్ దగ్గరికి వెళ్లి జెంఘిజ్ ఖాన్‌కి ఆమెతో పేచీ లేదనీ, ఆమె కొడుకు ఖోరెస్మ్ షా మహమ్మద్‌తో మాత్రమేననీ, జెంఘిజ్ ఖాన్ పట్ల దారుణంగా ప్రవర్తించిన దానికంటే షా తన తల్లికి ఎక్కువ అవమానం తలవంపులు

కలిగించినందుకు అతన్ని దండించాలనీ ప్రకటించాడు. తుర్కాన్ ఖాతూన్ గనక జెంఘిజ్ ఖాన్ సార్వభౌమత్వాన్ని అంగీకరిస్తే ఆమె పాలన కింద వున్న ప్రాంతాలని మన్నించి, రక్షిస్తాడనీ చెప్పాడు.

కాని తన మంగోలులతో మాత్రమే గౌరవంగా వుంటూ, మేకని చంపి కబాబ్ చేసుకుందామనే ఉద్దేశంతో బూరా వూది వేటగాడు మేకని వల్లో వేసుకున్నట్టు ఇతర ప్రజలతో వ్యవహరించే పాలకుడి మాటని కుటిల తుర్కాన్ ఖాతూన్ నమ్ముతుందనుకోవడం అంత సంభవం కాదు.

దనీష్మండ్ హాజిబ్ గుర్గంజ్‌కి వచ్చిన సమయంలోనే కెలిఫ్ నుంచి పడవలు వచ్చాయి. ఒక పడవలో సాదా రైతులాగా వేషం వేసుకున్న ఇనాన్చ్ ఖాన్ వున్నాడు. అతను ఖోరెస్మ్ షా ఉత్తరాన్ని తీసుకొచ్చాడు. జైహూన్ తీరంమీద వున్న కోటని తను వదిలేస్తున్నట్టు పాదుషా తల్లికి తెలియజేశాడు. తను ఖురాసాన్‌కి వెడుతున్నాడు. అక్కడ సైన్యాన్ని పోగు చేస్తాడు. తూర్కాన్ ఖాతూన్‌ని వచ్చి అక్కడ తనతో కలవమన్నాడు. ఆమె తనతోబాటు మొత్తం అంత:పుర పరివారాన్నంతటీనీ తీసుకురావాలి. జెంఘిజ్ ఖాన్‌ని నమ్మకూడదు.

ఈ వార్త తుర్కాన్ ఖాతూన్‌ని ఎంతగానో బెదర గొట్టేసింది. ఖోరెస్మ్‌లో వుండడం ప్రమాదకరం అని గుర్తించి ఆమె పెద్ద బిడారుని తయారు చెయ్యమని పురమాయించింది. ఖోరెస్మ్ షా భార్యలనీ పిల్లలనీ అందర్నీ పోగు చేసింది. ఒంటెలమీద జవహరీని, విలువైన వస్తువులనీ నింపి దక్షిణం దిక్కుగా కారకూమ్ ఇసక తిప్పలమీద కోపెట్ దాఘ్ పర్వతాల వేపు వెళ్లిపోయింది.

వెళ్లిపోయే ముందు తన మనవలకి ప్రత్యర్థులు తల యెత్తకుండా చూడాలని నిర్ణయించుకుంది. వయస్సుతో నిమిత్తం లేకుండా షా ప్రాసాదంలో బందీలుగా పెట్టుకున్న పిల్లలందర్నీ తీసుకుని పడవలమీద యెక్కించి జైహూన్ నది లోతుగా వుండే చోటకంతా తీసుకుపొమ్మని, అక్కడ కాళ్లకి బండరాళ్లు కట్టి నీళ్లల్లోకి దొర్లించెయ్యమనీ ముఖ్య తలారికి పురమాయించింది. ఖోరెస్మ్ భూస్వామ్య పాలకుల కొడుకులు, ఇరవై యేడు మందినీ ముంచేశారు, ఒక్కణ్ణి తప్ప.

అందర్లోకీ తుర్కాన్ ఖాతూన్ ఓమర్ ఖాన్‌ని మాత్రం వదిలింది. అతను తుర్క్‌మెన్ భూముల్లోని యాజెర్ పాలకుడి కొడుకు. తనే అక్కడికి పోతూ వుండడంవల్ల ఆమె అలా చేసింది. ఓమర్ ఖాన్‌కీ అతని నౌకర్లకీ యెడారి దారి తెలుసు. కారకూమ్ ఇసక మైదానాలమీద కష్టమైన ప్రయాణం పదహారు రోజులు సాగింది. వాళ్లు ఆ కాలంలో యేం గొణక్కుండా, విధేయంగా ముసలి సుల్తానాని కొలిచారు.

కాని బిడారు యాజెర్ పొలిమేరకి చేరగానే, పర్వతాల రాతి శిఖరాలు గోచరమవగానే ఓమర్ ఖాన్ నిద్రపోయేదాకా ఆగి, అతని తల నరకమని తుర్కాన్ ఖాతూన్ ఆజ్ఞ జేసింది.

చొరసాధ్యం కాని ఇలాల్ కోట వేపు బిడారుని తిప్పింది. అది ఒక ఒంటి రాతికొండ పైన వుంది. ఇక్కడ ఆమె తన పరివారం అంతటితోటీ, షా మహమ్మద్ కోసం వెదుకుతూ మంగోలు దళాలు పొరుగున ప్రత్యక్షం అయేదాకా, వుంది.

ఆమె తక్షణం పారిపోయి, తన మనవడు జలాలుద్దీన్ రక్షణ కింద వుండాలని ఒక అంగరక్షకుడు ప్రతిపాదించాడు. జలాలుద్దీన్ ఇరాన్‌లో సైన్యాన్ని సమీకరిస్తున్నాడు మంగోలులకి వ్యతిరేకంగా పోరాడ్డానికి. ప్రతివాళ్లూ అతని సాహసాన్ని గురిచీ, అతని సైన్యపు సంఖ్యని గురించీ మాట్లాడుకుంటున్నారు. శత్రువుని అతను తరిమెయ్యగలడనీ అనుకుంటున్నారు.

“యెన్నటికీ వెళ్లను” అని ఆమె యేవగింపుగా అరిచింది. “మంగోలు కత్తి వేటుకి చావనేనా చస్తాను గాని. ఏమిటి? ఆ యేహ్యామైన తుర్క్‌మెన్ దాని కొడుకు అనుగ్రహం అడిగేటంత అధ్వాంగా పతనమవుతానా? నా ఘనమైన కిప్‌చాక్ రక్తం ప్రసరించే సొంత మనుషులు వుండగా అతని రక్షణ కిందకి పోతానా? అంతకంటే జెంఘిజ్ ఖాన్‌కి బందీని అవుతాను, అతన్నుంచి తిట్లూ దూషణలూ భరిస్తాను”.

త్వరలోనే మంగోలులు వచ్చి కోటని ముట్టడించారు. బయటి ప్రపంచానికీ, లోపల వున్న వాళ్లకీ యే సంబంధమూ లేకుండా తెగ గొట్టేసి కొండ చుట్టూతా గట్టి వలయంగా యేర్పడ్డారు. ముట్టడి నాలుగు నెలలు సాగింది. కుండల్లో ఆఖరి నీటి బొట్లు కూడా అయిపోయాక, నూతులు యెండిపోయాక, తుర్కాన్ ఖాతూన్ లొంగిపోవడానికి నిర్ణయించింది. మంగోలులు మాతృశ్రీ సుల్తానాతోబాటుగా ఖోరెస్మ్ షా మొత్తం జనానానీ, పిల్లల్నీ పట్టుకున్నారు. మగపిల్లలందర్నీ వున్న చోటనే నరికేశారు. షా భార్యలనీ, కూతుళ్లనీ, తుర్కాన్ ఖాతూన్‌నీ జెంఘిజ్ ఖాన్ శిబిరానికి పంపారు. మొత్తం పరివారాన్నీ అంగరక్షకులనీ మంగోలులు ఖతం చేసేశారు.

మంగోలు పాలకుడు ఖోరెస్మ్ షా కూతుళ్లని తన కొడుకులకీ అనుచరులకీ ఇచ్చేశాడు. దుష్ట ముసలి సుల్తానా తుర్కాన్ ఖాతూన్‌ని తన విందుల దగ్గర ప్రదర్శనార్థం వుంచేశాడు. ఆమె గుమ్మం దగ్గర కూర్చుని, విదారకమైన పాటలు పాడుతూ వుండేటట్టు చేశారు. జెంఘిజ్ ఖాన్ తను నమిలిన బొమికల్ని ఆమెకి విసిరేవాడు.

ఒకనాటి ఖోరెస్మ్ తిరుగులేని పాలకురాలు, “సకల ప్రపంచ స్త్రీలకీ మహారాజ్ఞి”గా తనని పిలుచుకున్న తుర్కాన్ ఖాతూన్ ఆ రకంగా బతువెళ్లబార్చింది.

రెండవ భాగం

# మహా ఖోరెస్మ్ కడపటి దినాలు జలాలుద్దీన్ జెంఘిజ్ ఖాన్‌ని యుద్ధానికి రమ్మనడం

"విత్తులు చల్లిన గానీ, ఆమని
పంటలు వుండవు,
ప్రాణం ఒడ్డిన గానీ, శత్రు
నిర్జయం జరుగదు".
(సైది, 13వ శతాబ్దం)

ఖోరెస్మ్ షా దగ్గర సెలవు తీసుకున్నాక, జలాలుద్దీన్, అతని మారుటి సోదరులు ఉజ్‌లా షా, అక్ సాలు డెబ్బై మంది ఆశ్వికులతోటీ కారకూమ్ దాటి ఖోరెస్మ్ రాజధాని గుర్‌గంజ్ చేరారు.

ఖోరెస్మ్ షా మహమ్మద్ తన శాసనాన్ని మార్చాడనీ, సుల్తాన్ జలాలుద్దీన్‌ని తన వారసునిగా నియమించాడనీ గొప్ప బెక్‌లందరికీ తెలియజేశారు. ముందటి వారసుడు ఉజ్‌లా షా దాన్ని ధృవీకరించినా, కిప్‌చాక్ రక్తంలేని సుల్తాన్‌ని అంగీకరించడానికి కిప్‌చాక్ ఖాన్లు తిరస్కరించారు. రహస్యంగా కుట్ర పన్ని జలాలుద్దీన్‌ని చంపెయ్యాలని వాళ్లు తీర్మానించుకున్నారు.

కెలిఫ్ నుంచి తిరిగివచ్చిన ఇనాన్చ్ ఖాన్ ఈ కుట్రని గురించి అతన్ని హెచ్చరించాడు.

రాత్రివేళ యెవళ్లూ చూడకుండా తైమూర్ మాలిక్‌తోటీ మూడు వందల మంది తుర్క్‌మెన్‌లతో కలిసి అతను గుర్‌గంజ్ వదిలి, కారకూమ్ అవతలగా దక్షిణం వేపు వేళ్లాడు.

కొద్ది రోజుల్లో ఈ చిన్న బృందం చాలా దూరం పోయింది. ఆ దూరానికి బిడారులకి పదహారు రాత్రుల విడిది పడుతుంది. ఆ బృందం నాసా నగరం చేరింది. కోపెట్ దాఘ్ పర్వత పాదం దగ్గరి పచ్చిక బీటిమీద యుర్త్‌లు వున్నాయనీ, దగ్గర్లోనే బందం వేసిన కొత్త రకం గుర్రాలు మేస్తున్నాయనీ వేగుల వాళ్లు వార్త తెచ్చారు. వాళ్లు ఖాయంగా మంగోలులే అయివుంటారు. వాళ్లు కనీసం యేడు వందల మంది వుంటారు.

త్రైమూర్ మాలిక్ అన్నాడు:

“మన గుర్రాలు ఈ దీర్ఘ ప్రయాణంవల్ల అలిసిపోయినా మనల్ని ఇంకా మంగోలు శిబిరానికి తీసుకుపోయే శక్తి వాటికి వుంది. శత్రువుని నాశనం చెయ్యడం ఎలాగో మనం తెలుసుకుని ఉండాలి”.

“ధైర్యవంతుల్నే విజయలక్ష్మి వరిస్తుంది” అన్నాడు జలాలుద్దీన్.

ఇసక తిప్పల్లోనుంచి హఠాత్తుగా బయట పడుతూ జలాలుద్దీన్ నాయకత్వం కింద వున్న విభాగం తెగించిన కోపావేశంతో మంగోలు శిబిరంమీద విరుచుకుపడింది. పోరాటం భీకరంగా సాగింది. యే పక్షమూ జాలి చూపించమని అడగలేదు, చూపించలేదు. మంగోలులు నిలవలేక కలగాపులగంగా పారిపోయారు. భూగర్భ మాళిగలలో శరణు జొచ్చారు. కొద్ది మంది మాత్రం పారిపోగలిగారు.

మంగోలులమీద తుర్క్‌మెన్‌లు విజయం సాధించిన తొలి సంఘర్షణ ఇదే. అప్పటిదాకా మంగోలులు ప్రతి వాళ్లల్లోనూ తాము అజేయులమనే భయ భావాన్ని కలిగించారు. జలాలుద్దీన్ అన్నాడు:

“మంగోలులు గనక ఆరు బయట మైదానం మీద కాకుండా నాసా ప్రాకార కుడ్యాల వెనక వుండి వుంటే ఈ అలిసిపోయిన గుర్రాలమీద వాళ్లని తప్పించుకోవడం అసాధ్యం అయివుండేది మనకి. వాళ్ల గుర్రాల్ని ఎంత గబగబా వీలైతే అంత గబగబా పట్టి జీనులు వెయ్యండి. ఇంకా దీర్ఘ ప్రయాణం వుంది”.

రౌతులందరూ హడావుడిగా తాజాగా వున్న మంగోలు గుర్రాలమీద యెక్కారు. దక్షిణం వేపు నిషాపూర్ నగరానికి కొండ దార్లమ్మట పోయారు.

కొన్ని రోజుల తర్వాత ఖోరెస్మ్ షా మిగిలిన కొడుకులిద్దరూ – ఉజ్‌లా షా, అక్ షాలు – కిప్‌చాక్ కానుల నుంచి ద్రోహం జరగచ్చని భయపడి నాసా చేరుకున్నారు. వాళ్లతోబాటు పెద్ద పరివారం వుంది. మంగోలు ఠాణాలని యెవళ్లూ చూడకుండా దాటిపోవాలని వాళ్లు ప్రయత్నించారు, కాని అందర్నీ చుట్టు ముట్టేసి చంపెయ్యడం జరిగింది.

ఈ లోపున జలాలుద్దీన్ యెక్కడా విశ్రాంతి తీసుకోకుండా నిషాపూర్, జూజెన్, హెరాట్‌లు దాటి ఇంకా ఇంకా ముందుపోయాడు. ఒక కొండ దుర్గం అధిపతి అక్కడ వుండమని అతన్ని ఆహ్వానించాడు. ప్రాచీన కుడ్యాలు అభేద్యమైనవని నమ్మాడు.

జలాలుద్దీన్ జవాబిచ్చాడు:

“నాయకుడనేవాడు ఆరు బయట క్షేత్రంలో పని చెయ్యాలి, గోడల వెనక బిడాయించి కూర్చోకూడదు. గోడలు ఎంత గట్టివైనా సరే, వాటిని జయించే మార్గం చూస్తారు మంగోలులు”.

బుస్త్ దగ్గరికి చేరేటప్పటికే జలాలుద్దీన్‌కి చెప్పుకోదగ్గ సైన్యం పోగయింది. ఖోరెస్మ్ షా బెదిరిపోయిన సైన్యాల్ని కూడదీశాడు అతను. ఇక్కడ అతను అమిన్ అల్ ముల్క్ సైన్యంతో

కలిశాడు. ఖాండహార్‌ని ముట్టడించిన మంగోలు సైన్యాన్ని చెల్లాచెదురు చేశాడు. అక్కణ్ణుంచి ఘజనీ చేరాడు, ఒకప్పుడు ఖోరెస్మ్ షా దాన్ని అతనికి అప్ప చెప్పాడు. అక్కడ ఆ ప్రాంతపు బెక్‌లందరూ అతనికి విధేయంగా వుటామని ప్రకటించారు.

ఇప్పుడు జలాలుద్దీన్‌కి ముప్పై వేల మంది తుర్క్‌మెన్ సైనికులు వున్నారు. ఇంకా అంతమంది ఆఫ్ఘన్, కరులుక్ తదితర తండాల నుంచి వచ్చి చేరారు.

అరవై వేల మంది ఆశ్విక, పదాతి సైన్యంతోటి జలాలుద్దీన్ మంగోలుల దగ్గరకి దండు వెళ్లి పెర్వన్ అనే చిన్న పట్టణం దగ్గర విడిది చేశాడు. అది కాబూల్ నదిలోకి ప్రవహించే లోగర్ నది జన్మ స్థానం దగ్గర వుంది.

ఇక్కడనుంచి అతను తొఖారిస్తాన్‌మీదకి దాడి చేసి వరియన్ దుర్గాన్ని ముట్టడించిన ముకాజెక్ కింద వున్న మంగోలు సైన్యాన్ని మట్టి కరిపించాడు. మంగోలులు వెయ్యి మంది చనిపోయారు. హడావుడిగా పాంజిర్ నది దాటి వెనక్కి తగ్గారు. వంతెనలని పోతూపోతూ ధ్వసం చేసి, జెంఘిజ్ ఖాన్ దగ్గరికి తిరిగివెళ్లారు.

జెంఘిజ్ ఖాన్ దగ్గరికి జలాలుద్దీన్ చిన్న జాబు నిచ్చి దూతని పంపాడు.

"మనం యుద్ధంలో కలుసుకో దగ్గ చోటు చెప్పు. అక్కడ నీ కోసం చూస్తూ వుంటాను".

జెంఘిజ్ ఖాన్ ఆ ఉత్తరానికి జవాబివ్వలేదు. కాని ముకాజెక్ సైన్యం ఓడిపోయినందుకు, జలాలుద్దీన్ ధైర్యానికీ ఇబ్బంది పడ్డాడు. అతన్ని యెదిరించడానికి తన సవతి తమ్ముడు షికి ఖుతుకు నాయన్ కింద నలభై వేల మంది ఆశ్విక దళాన్ని పంపాడు.

జలాలుద్దీన్ మంగోలులతో తలపడ్డానికి ధైర్యంగా ముందుకు వెళ్లాడు. యుద్ధం పెర్వన్‌కి ఒక ఫరసాక్ (నాలుగు మైళ్లు) దూరంలో మైదానంమీద జరిగింది. యుద్ధానికి ముందు జలాలుద్దీన్ తన సైన్యానికి ఈ కింది ఆజ్ఞని జారీ చేశాడు:

"వీరులారా! భేరీలు మోగేదాకా ఆశ్వాల జనాన్ని వృథా చెయ్యకండి! ఆ క్షణం దాకా గుర్రాలనెక్కవద్దు. అప్పటిదాకా మీరు మీ వీపులకి గుర్రాల కళ్లేల్ని కట్టుకుని, కాలి నడకనే పోరు చెయ్యండి".

యుద్ధం రెండు రోజులు సాగింది. రెండవ రోజున షికి ఖుతుకు నాయన్ తన మంగోలు సైనికులు అలిసిపోయారనీ, వాళ్ల బలం తగ్గి పోతోందనీ, శత్రువుని ఓడించడం అసంభవం అనీ గ్రహించి ఒక కుతంత్రం చేశాడు. బొచ్చు అట్టలతోటి బొమ్మల్ని చేయించి వాటిని గుర్రాలమీద పెట్టించాడు. మొదట్లో ఈ చిట్కా నెగ్గింది. ముస్లిం సైన్యం వూగులాడింది. కాని జలాలుద్దీన్ తన వాళ్లకి కొత్త ధైర్యాన్ని ఇచ్చాడు. వాళ్లు ఉత్సాహంగా యుద్ధం చెయ్యసాగారు.

ఆఖరికి జలాలుద్దీన్ భేరీలు మోగించమని ఆజ్ఞ ఇచ్చాడు. అందరూ గుర్రాలనెక్కారు. తన ఆశ్వికుల్ని అతను దాడికి నడిపించాడు. మంగోలు సైన్యం మధ్యలో పడి దాన్ని రెండుగా

చీల్చాడు. అప్పుడు మంగోలులు పారిపోయారు, అలిసిపోని గుర్రాల మీద జలాలుద్దీన్ ఆశ్వికులు వున్నారు. వాళ్లు పారిపోయే శత్రువుని సునాయాసంగా పట్టుకుని ఖతం చేసేశారు.

పెర్వన్ యుద్ధం గురించీ, అజేయులైన మంగోలుల పరాజయం గురంచీ వార్త పర్వతాలమీదా, మైదానాలమీదా వ్యాపించింది. బాల్ఖ్ దుర్గాన్ని ముట్టడించిన మంగోలు సైన్యం తక్షణం ముట్టడి ఎత్తేసి ఉత్తరాదికి మళ్లింది. మంగోలులు ఆక్రమించిన కొన్ని నగరాల్లో అక్కడి పౌరులు తిరుగుబాటు చేసి మంగోలు దండుల్ని ఖతం చేశారు. అప్పుడు జెంఘిజ్ ఖాన్ తన మామూలు తంత్రాలకి దిగాడు. జలాలుద్దీన్‌తోబాటు వున్న ఖాన్‌లు దగ్గరకి గూఢచారుల్ని పంపాడు. వాళ్లు గనక ధైర్యవంతుడైన ఆ సుల్తాన్‌ని వదిలిపెట్టేస్తే బంగారం మూటలు యెత్తిన ఒంటెల్ని ఇస్తానని వాగ్దానం చేశాడు.

జలాలుద్దీన్ శిబిరంలో కొల్లగొట్టిన దాన్ని పంచుకోవడం విషయమై త్వరలోనే పేచీలు మొదలయ్యాయి. ఒక అరబ్బీ గుర్రం విషయంలో తగూపడి ఒక కిప్‌చాక్ ఖాన్ తన కొరాడాతోటి సుమారైన దళానికి అధిపతిగా వున్న అగ్రాక్‌ని మొహంమీద కొట్టాడు. జలాలుద్దీన్ వాళ్లని శాంతిప చెయ్యలేకపోయాడు. దీని తర్వాత ఆఫ్ఘన్ల నాయకుడైన ముజాఫర్ మాలిక్, కర్లూక్‌ల నాయకుడైన ఆజమ్ మాలిక్, తన కెల్జ్ సైనికులతో కలిసి అగ్రాక్ జెంఘిజ్ ఖాన్ ఉచ్చులో పడి జలాలుద్దీన్ సైన్యంనుంచి తమ సైనికుల్ని ఉపసంహరించు కున్నారు. ఇతర తండాల వాళ్లని కొరడాతో కొట్టే సాహసం వున్న కిప్‌చాక్‌ల పొగరు మోత్తనం గురించీ, గర్వం గురంచీ మొరపెట్టుకున్నారు.

జలాలుద్దీన్ యేమీ చెయ్యలేకపోయాడు. ఒక్కొక్కళ్లనే యెదిరించి జెంఘిజ్ ఖాన్ సునాయాసంగా తన శత్రువులనందర్నీ జయించెయ్యగలడని చెప్పాడు. కాని వృథా అయి పోయింది. అతని సైన్యం సగం వెళ్లిపోయింది. అమిన్ అల్ ముల్క్ కింద వున్న తుర్క్‌మెన్‌లు తప్ప యేమీ మిగల్లేదు.

షికి ఖుతుకు నాయన్ జెంఘిజ్ ఖాన్ దగ్గరికి తిరిగివెళ్లి పెర్వన్ యుద్ధం గురించి వివరాలు చెప్పగానే, జెంఘిజ్ ఖాన్ ఎప్పటి మాదిరిగానే నిబ్బరంగా, యే భావమూ వ్యక్తం చెయ్యకుండా గూఢంగా వుండిపోయాడు.

కాని అతను తక్షణం తన సైన్యాలన్నిట్నీ యెక్కడెక్కడ నుంచి వీలవుతుందో అక్కణ్ణుంచల్లా పోగు చేసి విస్తారమైన బలగాన్ని తయారు చేశాడు. తన ఆశ్వికుల్ని యెంత వేగంగా పొమ్మన్నాడంటే దారిలో తిండి వండుకునే అవకాశం లేకపోయింది. అతను యెకాయెకీ ఘజనీకి వెళ్లి దారి అంతమైన చోట సామానంతా వదిలేసి కొండల మార్గాలమ్మట ప్రయాణం చేశాడు.

# సింధు నదీ తీర యుద్ధం

"నిన్ను గుర్రం అని పిలవను. సోదరుడని
పిలుస్తాను. నువ్వు సోదరుడికంటే
మెరుగు".
(కితాబి కోరకుద్)

తన మిత్రపక్షాలు ఫిరాయించి వెళ్లిపోయాక జలాలుద్దీన్ తను కోరుకున్నట్టుగా మైదానంమీద పోరాటాలకి వెళ్లలేకపోయాడు. దక్షిణాదికి వెనక్కి తగ్గాడు. వేగంగా ప్రవహించే విశాలమైన సింధు నది అడ్డం వచ్చింది.

సుల్తాన్ జలాలుద్దీన్ సింధు నదిని దాట ప్రయత్నిస్తున్నాడని విని అతనిమీద విరుచుకు పడడానికే జెంఘిజ్ ఖాన్ నిర్ణయించుకున్నాడు. రాత్రంతా సైన్యాన్ని నడిపించి ప్రభాత సమయానికి శత్రువుని చూశాడు. మంగోలులు మూడు దిక్కులనుంచి సుల్తాన్ సైన్యాన్ని చేరవస్తున్నారు. కొన్ని అర్ధవలయాలుగా వ్యాపించిన మంగోలులు వంగిన వింటిలాగా వున్నారు. సింధు నది వింటినారిలాగా భాసించింది.

జలాలుద్దీన్ ముసల్మాన్ సైన్యం మధ్యలో తన స్థానంలో వున్నాడు. చుట్టూతా యెంపిక చేసిన సైనికులు ఏడు వందలమంది వున్నారు. జెంఘిజ్ ఖాన్ కొండమీద నుంచుని యుద్ధాన్ని నడిపిస్తున్నాడు. అతన్ని చూసి సుల్తానూ, అతని ఆశ్వికులూ మహా ఆగ్రహంగా దాడిలోకి దూకారు. మంగోలుల్ని వెనక్కి తరిమేరు. మంగోలు పాలకుడు కూడా వెనక్కి తిరిగి గుర్రాన్ని కమ్చీతో కొట్టి పారిపోయాడు.

కాని హెచ్చరికగా వుంటూ, దూరదృష్టిగల జెంఘిజ్ ఖాన్ యుద్ధానికి ముందుగానే ధైర్యవంతులైన పది వేల మంది సైనికుల్ని దాచి వుంచాడు. వాళ్లు ఉరికిమీద పడి జలాలుద్దీన్ మీద దాడి చేశారు. అతన్ని వెనక్కి గెంటారు. అప్పుడు అమిన్ అల్ ముల్క్ కింద వున్న తుర్క్‌మెన్‌ల దక్షిణ విభాగంకేసి వెళ్లారు. అతని శ్రేణుల్ని ఛిన్నాభిన్నం చేశారు. వాటిని సైన్యం మధ్యకి గెంటారు. అది అప్పటికే గందరగోళంలో పడి, లొంగిపోతూ వుంది.

అప్పుడు మంగోలులు యెడమ విభాగాన్ని భగ్నం చేశారు. జలాలుద్దీన్ మధ్యాహ్నం దాకా తన ఆశ్వికులతో కలిసి పోరాటం కొనసాగించాడు. తనకి మామూలుగా వుండే హెచ్చరిక

కోల్పోయి, మతిభ్రమించిన పులిలాగా మొదట ఎడమ వేపూ తరువాత కుడి వేపూ విరుచుకుపడ్డాడు.

మంగోలులు ఖాఖాన్ ఆజ్ఞని పాటించారు – "సుల్తాన్‌మీదకి బాణాలు వెయ్యకండి" – జలాలుద్దీన్ చుట్టూతా వలయం క్రమేపీ కుంచించుకుంది. శత్రు శ్రేణులని భగ్నం చేసుకుపోవడానికి అతను తెగించి పోరాడాడు. పరిస్థితి పరమ విషమంగా తయారైందని గ్రహించి సుల్తాన్ తన తుర్క్‌మెన్ అశ్వం యెక్కాడు. శిరస్త్రాణాన్నీ కవచాన్నీ విసిరేశాడు. కత్తిని మాత్రం వుంచుకున్నాడు. గుర్రాన్ని తిప్పి యెత్తైన కొండ శిఖరం పైనుంచి గుర్రంమీద అల్లకల్లోలంగా నల్లగా వున్న సింధు నది నీటిలోకి దూకాడు. నదిని ఈది దాటి, నిట్రగా వున్న ఒడ్డు యెక్కి జలాలుద్దీన్ కత్తిని ఝుళిపించి జెంఘిజ్ ఖాన్ మీదకి తిరస్కారం విసిరి, దుబ్బుల్లో మాయమైపోతూ దౌడు తీసి వెళ్లిపోయాడు.

జెంఘిజ్ ఖాన్ ఆశ్చర్యంతో నోరు నొక్కుకుని తన కొడుకులకి జలాలుద్దీన్‌ని చూపించి అన్నాడు: "యే తండ్రికేనా ఇలాంటి కొడుకు వుండాలి!"

సుల్తాన్ నీళ్లల్లోకి ఉరకడం చూసిన మంగోలులు అతని వెనక్కాలే ఉరుకుదామనుకున్నారు. కాని జెంఘిజ్ ఖాన్ వాళ్లని ఆపాడు.

వాళ్లు జలాలుద్దీన్ సైన్యాన్ని మొత్తం ధ్వంసం చేసేశారు. ఆ సైనికులు జలాలుద్దీన్ తల్లినీ, భార్యనీ మంగోలు హస్తాలనుంచి కాపాడేందుకు గాను వాళ్లని నీళ్లల్లోకి తోసేశారు.

జలాలుద్దీన్ యేడేళ్ల కొడుకు మాత్రం సజీవంగా మిగిలాడు. మంగోలులు అతన్ని బందీగా పట్టుకున్నారు. అతన్ని జెంఘిజ్ ఖాన్ దగ్గరికి తీసుకువచ్చారు. ధైర్యంగా వాలకం పెట్టి ఖాఖాన్ కేసి యేవగింపుగా చూస్తూ అతన్నుంచి ఆ కుర్రాడు పక్కకి తిరిగిపోయాడు.

"శత్రు దుంపని సమూలంగా నాశనం చెయ్యాలి. ఇంతటి సాహసికులైన ముసల్మాను వంశీకులు నా మనవల్లని నాశనం చేస్తారు. అంచేత ఈ కుర్రాడి గుండెని నా వేట కుక్కకి ఆహారంగా పెడతాను" అన్నాడు జెంఘిజ్ ఖాన్.

తన నైపుణ్యం అంతా ఘనమైన ఖాఖాన్‌కి ప్రదర్శించగలిగే అవకాశం వచ్చింది కదా అని చేటంత ముఖం చేసుకుని ఇకిలిస్తూ మంగోలు తలారి అంగీ చేతులు పైకి మడిచి ఆ కుర్రాడికేసి వెళ్లాడు. మంగోలు రీతిలో అతన్ని వెనకనుంచి ఒక్క ఉదుట్న ఒడిసి పట్టుకుని కత్తితోటి ఛాతీ కసక్కున చీల్చి, పక్కటెముకల కింది చేతులు పెట్టి పొగలు కక్కే చిన్న గుండెకాయని తీసి జెంఘిజ్ ఖాన్ దగ్గరికి తీసుకెళ్లాడు.

సింధు నదీ తీరం మీద ఈ యుద్ధం తర్వాత సుల్తాన్ జలాలుద్దీన్ అనేక ప్రాంతాలలో తిరుగుతూ, ధైర్యంగల మనుషుల దళాలని పోగు చేసుకుని చాలా యేళ్లు మంగోలులకి వ్యతిరేకంగా పోరాడాడు. కాని మంగోలుల్ని కూలదోసేటంత సైన్యాన్ని యెన్నడూ పోగు చేసుకోలేకపోయాడు.

# హాజీ రహీమ్ రాయసకాడు అవడం

మహమ్మద్ యాలవాచ్ మంగోలు కరవాలంనుంచి హాజీ రహీమ్‌ని రక్షించి, అతనిమీద తన రక్షణ వస్త్రాన్ని కప్పిన ఆ సాయంత్రం నుంచీ ఆ దర్వీషు అతన్ని అనుసరించే వెళ్లాడు. ఆ దర్వీషుని అనుసరించి నీడలాగా ఆ కుర్రాడు తుఘాన్ వెళ్లాడు.

మహమ్మద్ యాలవాచ్ మవరాన్నహార్ కొత్త పాలెగాడు జెంఘిజ్ ఖాన్ కొడుకు జగతాయ్ ఖాన్‌కి ముఖ్య సలహాదారు అయ్యాడు. జగతాయ్ విందులు వినోదాల్లో మునిగి తేలేవాడు. మహమ్మద్ యాలవాచ్ అతని కోసం కప్పాలు వసూలు చేసేవాడు. తాతార్లు అంకించుకున్న విలువైన వస్తువుల పట్టీ తయారు చేసేవాడు. మంగోలు పచ్చిక బీళ్లకి బానిసల పెద్ద మందలని పంపేవాడు. ఇళ్ల పట్టీలు తయారు చేసేవాడు. బెక్‌లు పాడుపెట్టిన అంతస్తుల పట్టీలు తయారు చేసేవాడు. కొత్త పన్నులని ప్రకటించేవాడు. వాటిని పోగు చెయ్యడానికి ప్రత్యేకం సిబ్బందిని నియమించేవాడు.

మహమ్మద్ యాలవాచ్ హాజీ రహీమ్‌ని తన కోశాగార రాయసగానిగా నియమించాడు.

హాజీ రహీమ్ స్థానంలో వున్న యెవళ్లేనా తాము అదృష్టవంతులమనే భావిస్తారు. అతను యెవళ్లో వదిలిపెట్టిన చిన్న ఇంట్లో వుండేవాడు. తన సొంతంలాగానే దాన్ని వాడుకోవచ్చు. చల్లని సాయంత్రం వేళల్లో హాజీ రహీమ్ తన తమ్ముడు తుఘాన్‌కి బీజగణితం, ఆరబ్బీ సాహిత్యం బోధించేవాడు.

కాని హాజీ రహీమ్ సుఖాన్వేషి కాదు, సత్యాన్వేషి. అతని హృదయంలో అశాంతి జ్వాల మండుతూనే వుండేది. తను చేస్తూ వున్న పనితో సమాధాన పడలేకపోయేవాడు. ప్రతి రోజూ వందలాది మంది యేదో పనిమీద కోశాగారానికి వచ్చేవాళ్లు. మామూలుగా, శాంతియుత ప్రజలమీద మంగోలుల పీడనకి సంబంధించిన పితూరీలే వుండేవి. మొత్తం దేశం అంతా నూతన విజేతల యేలుబడిలోనే వుండేది. వాళ్లు ప్రజల్ని గొర్రెల మందని తోడేళ్లల్లా చూసేవాళ్లు.

అప్పుడు హాజీ రహీమ్ తనలో అనుకున్నాడు: “చాలు! తన ప్రజల శత్రువుకి సేవచేసేవాడికి మంచి మాటలకి బదులు శాపనార్థాలు తగుతాయి” – తన హృదయాన్ని

కొరికేదాన్ని గురించి న్యాయంగా నివేదించుకోవాలని తీర్మానించుకుని మహమ్మద్ యాలవాచ్ దగ్గరికి వెళ్లాడు.

మహమ్మద్ దర్వీషు చెప్పిందంతా విని అన్నాడు:

“గాయాలతో నిండి పోయి, నీరసంగా బాధతో వున్న నీ కన్న తల్లిని వదిలి పెట్టాలనుకుంటావా?”

“నా ప్రజల్ని బానిసల్ని చేసిన వాళ్ల కొలువు చెయ్యను”.

“అయితే ఖాయంగా నన్నూ నువ్వు లుచ్ఛా కింద జమకట్టాలి. మరి నేనూ నా ప్రజల్ని బానిసల్ని చేసిన వాళ్ల కొలువు చేస్తున్నాగా? దానికి నా సమాధానం ఇదీ. మన పాలకుడైన గొప్ప ఖాఖాన్ జెంఘిజ్ ఖాన్‌కి ముఖ్య సలహా దారుడున్నాడు, చైనా వాసియెలు చూ చాయ్. ఆయన ఎప్పుడు నిర్భయంగా జెంఘిజ్ ఖాన్‌తో సత్యమే చెప్తాడు. ఆయనొక్కడే జనాభాని వృథాగా చంపకుండా ఖాఖాన్ని అదుపు చేస్తాడు, ఇలా చెప్తూ: ‘నువ్వు జనాన్నందర్నీ చంపేస్తే నీకూ, నీ మనవళ్లకీ పన్నులు యెవరు కడతారు?’ జెంఘిజ్ ఖాన్ ఆయన చెప్పింది విన్నాక లక్షలాది బందీలకి క్షమాదానం చేస్తాడు. జెంఘిజ్ ఖాన్ కొడుకుతో కూడా నేనిలాగే చేయించాలని ప్రయత్నిస్తున్నాను. మన ముసల్మాన్ జనాభాని పూర్తిగా హతం అయిపోకుండా కాపాడుతున్నాను”.

“నేను నా ప్రజలతో వుంటాను. కాని నాకు వేరే పని ఇయ్యి. రక్తం మరకలతో నిండిన బట్టల పద్దులు రాయలేను, మనుసుల కన్నీళ్లని చూడలేను” అన్నాడు హాజీ రహీమ్.

“సరే మంచిదే. ముఖ్యమైన పని ఇస్తాను”.

“వింటున్నాను, హుజూర్”.

“జెంఘిజ్ ఖాన్ పెద్ద కొడుకు జూచి ఖాన్ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల పాలెగాడు. తన భాగంగా ఖోరెస్మ్ ఉత్తర భూముల్ని అందుకున్నాట్ట. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు వెళ్తున్నాడని విన్నాను”.

“నే చెప్పగలిగింది: గుర్‌గంజ్‌లోని కమ్మరులూ రాగి పని వాళ్లూ పోరాటం చెయ్యకుండా బుఖారా, సమర్‌కండ్ వాసుల మాదిరీ నగరాన్ని వదలరు”.

“నేను జూచి ఖాన్‌కి ఉత్తరం పంపాల్సి ఉంది. కాని దారిలో కిజిల్‌కుమ్ యెడారిలో గుంపులు పోగయి మంగోలులమీద దాడి చేసి వాళ్లని నాశనం చేస్తున్నారు. తమ నాయకుడిగా యెవళ్లో “నల్ల బట్టల రౌతు” వున్నాట్ట. అతని పేరు కార బుర్గుతట. అద్భుతమైన నల్ల గుర్రంమీద వుంటాట్ట. యెవళ్లు వెంబడించినా దొరకడట. అతను కిజిల్‌కుమ్‌లో అన్ని చోట్లా హఠాత్తుగా కనిపిస్తాడట, బోలెడు బోలెడు దూరాలు ప్రయాణం చేస్తూ. వున్నట్టుండి అయిపూమచ్చా లేకుండా మాయమైపోతాడట. సైతానే అతనికి సాయపడతాట్ట”.

"ముస్లింలలో ఇంకా ధైర్యవంతులున్నారని ఈ 'నల్ల బట్టల రౌతు' రుజువు చేస్తున్నాడు' అన్నాడు హాజీ రహీమ్.

"నేను జూచి ఖాన్‌కి రాసిన ఉత్తరాన్నే నీకిస్తాను. నువ్వు దాన్ని దాచెయ్యి. మంగోలు పహారా వాళ్లు గాని యీ 'నల్ల బట్టల రౌతు' గాని కనిపెట్టలేకుండా. లేకపోతే నిన్ను, నన్నూ ఇద్దర్నీ నాశనం చేసిన వాడివి అవుతావు".

హాజీ రహీమ్ కళ్లు వాల్చేడు. "యెలాంటి జాబు అయివుంటుందది? పంపించే వాణ్ణి నాశనం చేసేటటువంటిది?" అనుకున్నాడు. మహమ్మద్ యాలవాచ్ కదలకుండా నుంచున్నాడు. అతని చూపు దర్వీషు ఆలోచనలని గుచ్చుకుపోతున్నట్టుగా వుంది. అతను గడ్డంమీద చెయ్యి వేసుకున్నాడు. అతని పెదాలమీద చిరునవ్వు లాస్యం చేసింది.

"ఈ ఉత్తరాన్ని జూచి ఖాన్‌కిస్తాను. యెవళ్లూ దాన్ని చదవరు. నా చేతి దండంలో బోలు చేసి అందులో పెడతాను. దాన్ని మైనంతో మూసేస్తాను. కాని దాన్ని ఘనమైన ఖాన్ దగ్గరికి తీసుకెళ్లడం సాధ్యమేనా? అతనిప్పుడు కిప్‌చాక్ పచ్చిక బీళ్లమీద యుద్ధాలు చేస్తున్నాడు. కనిపించిన అందర్నీ చంపేస్తూ సంచార దండులు దేశాన్ని పీడించేస్తున్నాయక్కడ. తోట దారిలో నీ కాలికింద పాకే ఆ రుద్ర పురుగులాంటి వాణ్ణి నేను. నీ బలమైన చెయ్యి అభయం లేకపోతే నాకేం జరగుతుంది? నాకు 'నల్ల గుర్రం రౌతు' అంటే భయం లేదు. కాని మొదటి మంగోలు చౌకీ దగ్గర కాపలావాడు నన్ను పట్టుకుని ముక్కలు ముక్కలు కింద కోసేస్తాడు".

మహమ్మద్ యాలవాచ్ వంగి చిన్న యెర్రని ఆరుద్ర పురుగుని తీసి పాలిన అరచేతి మధ్యలో పెట్టుకున్నాడు. ఆ పురుగు హడావుడిగా వేలి చివరదాకా పరిగెత్తింది. రెక్కలు చాచి యెగిరిపోయింది.

"ఈ ఆరుద్ర పురుగులాగా నువ్వు వెడతావు, వెయ్యి మంది సైనికులు చొచ్చుకుపోలేని చోటికి. పవిత్ర దర్వీషుగా నువ్వు మళ్లీ నీ పాత అంగీ వేసుకో, నీ అణకువైన గాడిదని తీసుకో, దానిమీదకి పుస్తకాలు యెత్తు. మంగోలు చౌకీలు నిన్ను ఆపకుండా వుండేందుకు గాను నీకు స్వర్ణశ్యేనం పైస్తాని ఇస్తా".

"కాని నా తమ్ముడి విషయం యేం చెయ్యను? తుఘాన్‌తోటి?"

"నీశిష్యుడిగా అతన్ని కూడా తీసుకెడతావు. జూచి ఖాన్ శిబిరానికి వెళ్లగానే వాడు సైనికుడవడం నేర్చుకుంటాడు. అనుభవజ్ఞుడైన రౌతు అవుతాడు. నీ దారి సులభం అవుగాక".

"భయపడద్దు. నేను వెడతా".

"నీ ప్రయాణ గమ్యం చేరుకున్నాక నా కోసం ప్రార్థన చెయ్యి. నీకు శుభం కలగాలని కోరే ముసలివాణ్ణి నేను".

# నల్ల బట్టల రౌతు

సాయంత్రం వేళ హాజీ రహీమ్, తుఘాన్ బయల్దేరారు. గిట్టలతో టకటక వెదుతోన్న గాడిదమీద వున్న మూటల్లో పుస్తకాలున్నాయి. ఆరబిక్, పర్షియన్ కవుల రచనల పత్రాలు వున్నాయి. కొన్ని రోజులకి సరిపడా ఆహారం ఉంది.

ఒకో అప్పుడు దూరంలో ధూళి మేఘం కనిపించేది. అప్పుడంతట్లోకీ చెట్ల వెనక నుంచి బోలెడు మంది మంగోలు రౌతులు దూకి వచ్చేవాళ్లు, ఒక ముఖ్య అధిపతిని చుట్టి లేదా మెల్లిగా నడిచే ఒంటెలని కాపలా కాస్తూ తగిలేవాళ్లు. వాటిమీద ధాన్యం మూటలు వుండేవి. ఒక మంగోలు వాళ్లల్లోనుంచి విడిగా వచ్చి హాజీ రహీమ్ దగ్గరికి దౌడు తీసివెళ్లి అరిచేవాడు:

"ఎవరు నువ్వు? యెక్కడికి పోతున్నావ్?"

హాజీ రహీమ్ మౌనంగా టోపీ వెనక్కి నెట్టి నుదుటికి చుట్టుకున్న పట్టీని బయటికి కనిపించేటట్టు చేశాడు. ఎగిరే డేగ బొమ్మ బంగారు ఫలకం దానికి జత చేసి ఉంది. అప్పుడు కొరడా ఎత్తిన చెయ్యి క్రమేపీ దిగింది. ఆ మంగోలు అరిచాడు: "సెలవ్! వెళ్లు!" గుర్రాన్ని గిరుక్కున తిప్పి తన వాళ్లతో కలవడానికి దౌడు తీసి వెళ్లిపోయాడు.

నిర్జనంగా వున్న ఒక చోట ఓ గుట్ట వెనకనుంచి నలుగురు రౌతులు హఠాత్తుగా దూకి వచ్చి దారికి అడ్డం నిలబడ్డారు.

"ఆగు!" అని ఒక ముసలతను అరిచాడు. "నీ పేరేమిటి?" అని అడిగాడు.

"సమృద్ధిగా, సంతోషంగా సంపదలు నీవి! నా పేరుతో నీకేం పని నాయనా?" అన్నాడు దర్వేషు.

"నిన్నెరుగుదును నేను! నువ్వు నానుంచి పారిపోలేవు! నువ్వు ముసల్మాన్ మహమ్మద్ యాలవాచ్ రాయసగాడివి, వాడు నీచంగా మంగోలులకి అమ్ముడుపోయాడు. ప్రజల్ని కొల్లగొట్టుకోవడంలో వాడికి నువ్వు సాయపడ్డావు. అందుగ్గాను నా కత్తి మొనని ఇప్పుడు రుచి చూద్దువు గాని".

"నువ్వన్న దాంట్లో నిజం రెండు ముక్కలే. మిగిలిందంతా నల్లని అబద్ధాల మురికి నీరే".

"యేమిటబద్ధాలు?" అని ముసలి రౌతు కోపంగా అరిచాడు, ఒరలోనుంచి ఒంపు తిరిగిన కత్తిని తీశాడు.

"నేను గౌరవనీయులైన మహమ్మద్ యాలవాచ్‌కి రాతగాడన్నది నిజం. నాకు చావు తప్పదన్నదీ నిజమే, అది నాకు వస్తుంది కూడా. ఎవరు మృత్యువు నుంచి తప్పించుకోగలరు? కాని నేను ఎప్పుడూ యెవళ్లనీ దోచుకోలేదు. మంగోలులు కాజేసిన వాఇ పద్దులు పెద్ద కాగితాలమీద రాశానంతే. ఫిర్యాదులు పట్టుకుని మహమ్మద్ యాలవాచ్ దగ్గరికి వచ్చిన వాళ్ల అర్జీలు రాసానంతే. అతన్ని జోక్యం చేసుకొమ్మని వాళ్లు అర్థించే వాళ్లు".

"నీ పొడుగాటి పాగాని, దాని కింద వున్న తలతోబాటుగా పోగొట్టుకోకుండా వుండాలంటే, మాతో రా పారిపో ప్రయత్నించవద్దు" అన్నాడా ముసలాడు.

"నన్ను రమ్మని పిలిచిన యెవళ్ల దగ్గరికేనా సదా వెడతా" అని దర్వీషు నిదానంగా జవాబిచ్చాడు. "కాని నువ్వు నీ పేరు చెప్పావు కాదు. మమ్మల్ని వినాశన బిలంలోకి నడిపించినట్లయితే అల్లా ముందు యెవరి పేరుని నిందించను?" అన్నాడు.

"అలా నిన్ను విచారించే ముందే 'నల్ల బట్టల రౌతు' నిన్ను విచారిస్తాడు. మా నాయకుడితోటి నీకు పరిహాసం కాదు" అన్నారు మిగిలిన వాళ్లు.

ఇంకా ఉత్తరం దిక్కుకు పోతూ వాళ్లు యెక్కువ ప్రయాణం చేశారు. హాజీ రహీమ్ మిగతా వాళ్లతో కలిసి భగభగమండే నెగడు దగ్గరికి వచ్చేటప్పటికప్పుడే చీకటి పడింది. వాళ్లు ఒక యెండిన వాగు సందులో వున్నారు. దర్వీషువీ, తుఫాన్‌వీ చేతులు వెనక్కి మడిచి కట్టేశారు. ఉచ్చుతాడు వాళ్ల మెడల్లో వుంది, వాళ్లు చీకట్లో పారిపో ప్రయత్నిస్తారని. ఉచ్చుతాటితో వాళ్లని ముందకు లాగుతూ ముసలి రౌతు నెగడుదాకా నడిపించుకువెళ్లాడు. అక్కడ వాళ్లని మోకాళ్లమీద వాలమని ఆజ్ఞాపించాడు. నల్లగాడిదల పక్కన నడిపించుకెళ్లాడు. నెగడు దగ్గర నల్ల బట్టల రౌతు కూర్చున్నాడు.

"ఈ నల్ల బట్టలు వేసుకున్న మనిషిని ఎక్కడ చూశాను?" అనుకున్నాడు హాజీ రహీమ్, ఆ తుర్క్‌మెన్‌కేసి చూస్తూ. "ఇతనే 'నల్ల బట్టల రౌతు' అయివుంటాడు" అనుకున్నాడు. ఆ తుర్క్‌మెన్ నల్లని కఫ్తాన్ తొడుక్కున్నాడు. నల్లని టోపీ పెట్టుకున్నాఆడు. అది తల వెన్కి నెట్టి వుంది. దగ్గర్లోనే యెత్తుగా, కర్రి మొద్దులాంటి గుర్రం వుంది. నెగడు చుట్టూతా పీలికలు కట్టుకున్న ఓ ఇరవై మంది రౌతులున్నారు. కాని వెండి పిడితో మెరిసే ఆయుధాలు వాళ్ల దగ్గరున్నాయి. వాళ్లు బందీలకేసి చూశారు. కొంతమంది చిరునవ్వు నవ్వుతూ, కొంతమంది ముటముటలాడుతూ చూశారు.

ఒక రౌతు నల్ల గాడిదమీద నుంచి సంచీని దింపాడు. బొత్తెడు అట్లు, యెండు ద్రాక్ష పళ్లు, పుచ్చకాయ, పాసిన జున్ను ముక్క తీశాడు. తర్వాత పిండి మూట తీసి దాన్ని జాగ్రత్తగా కింద పెట్టాడు. తర్వాత ఇంకో మూట దింపాడు. అందులో రాత పరికరాలు, సిరా బుడ్డీ, కొన్ని పుస్తకాలు, కాగితం చుట్టలు, కవచ పరికరాలు వున్నాయి.

గుండ్రటి కళ్లు వున్న ఆ రౌతు ఓ పుస్తకం తీసి, చేతుల్లో పట్టుకు తిప్పి కొన్ని పేజీలు తిరిగేసి అన్నాడు:

"బహుశా ఇవి నిడుపు గడ్డం ఇమామ్‌లు ఆకలికి మాడే బక్కపల్చని పండితుల బుర్రల్ని బద్దలు గొట్టడానికి వాడే నీతులా, సూక్తులా గ్రంథాలేమోనే?"

"కాదు, ఘనమైన సైనికా. ఇది గొప్ప సికందర్, ప్రపంచ విజేత గురించిన గ్రంథం" అన్నాడు హాజీ రహీమ్.

"హోయ్! ఈ బ్రహ్మాండమైన సైనికుణ్ణి గురించి వినాలనుకుంటున్నాను. కాని నీకు వ్యవధి లేదు. నీ ఆత్మని ఇజ్రాయిల్ తీసుకుపోవడానికి సిద్ధంగా వున్నాడు".

హాజీ రహీమ్‌ని పట్టుకున్న ముసలాడు గాడిదని పక్కకి తీసికెళ్లాడు. తన పటకాలో నుంచి నిదానంగా పొడుగాటి సన్నని కత్తిని తీశాడు. అలాంటి కత్తిని కసాయి వాళ్లు గొర్రెల్ని కొయ్యడానికి వాడతారు. తన కొమ్ములాంటి చేత్తోటి దర్వీషు గడ్డం పట్టుకున్నాడు.

"హేయ్ తాతా, కొంచెం ఆగు" అని యెవళ్లో అరిచారు. "మిగతా పుస్తకాల్లో యేముందో తెలుసుకుపోయిన మన సర్దారు అనుకుంటున్నాడు" అన్నాడు.

సగం బిగుసుకుపోయిన దర్వీషు బొంగురుగా అన్నాడు:

"వాటిల్లో ఒకటి మైదానాల ప్రఖ్యాత వేటచిరుత, బిడారుల పాలిటి సింహస్వప్నం కార బుర్గుత్ గురించి..."

"ఆగు! అతన్ని వదులు" అని నాయకుడు అరిచాడు. శ్రద్ధగా పుటలు తిప్పడం మొదలుపెట్టాడు. సైనికులతో యుద్ధం చేస్తూ వున్న బొమ్మలు చూశాడు.

ముసలాడు తిట్టు తిట్టి హాజీ రహీమ్‌ని తోసి, వదిలిపెట్టాడు.

"నల్ల బట్టల రౌతు" పసుప్పచ్చ తోలు అట్ట వున్న పుస్తకాన్ని పక్కన తివాసీ మీద పెట్టి అన్నాడు:

"వేగుచుక్క కోసం నిరీక్షించడం యెంతో సేపు అక్కర్లేదు. నాస్తికుల ఈ సేకుల్ని శిక్షించడానికి మనం త్వర పడక్కర్లేదు. ఈ ద్రిమ్మరి చెప్పేది విందాం. యే సాహసవంతుడైన వీరుణ్ణి గురించేనా చెప్తాడేమో చెప్పనివ్వండి".

తుఘాన్ గొణిగాడు:

"ఇలా మోకాళ్లమీద అవమానంగా వాలి అతనికి కథ చెప్తావ్? ఒక్క మాట చెప్పద్దు. పోన్లే మనిద్దర్నీ చంపెయ్యనీ, వెంటనే".

"ఓపిక పట్టు! రాత్రి చాలా వుంది. భవిష్యత్తు అంతా ఆశ్చర్యకరమైన వాటితో నిండి వుంది" అన్నాడు హాజీ రహీమ్.

"అతన్ని మాట్లాడనివ్వండి" అని కొన్ని గొంతుకలు అరిచాయి. "స్వేచ్ఛా విహంగంకంటే పంజరంలో పిట్ట బాగా పాడుతుంది" అన్నారు.

"అయితే వినండి! రెండు శృంగాల సికందర్ గురించి గాని రుస్తుమ్ గురించి గాని సొహ్రాబ్ గురించి గాని మీకు చెప్పను. పేరు మోసిన బందిపోటు కార బుర్గుత్ గురించి, తుర్క్‌మెన్ అమ్మాయి గుల్ జామిల్ గురించి చెప్పాను..."

గుల్ జామిల్ పేరు వినబడగానే బందిపోటు నాయకుడు దర్వీషుకేసి నిశితంగా చూశాడు, అతని కనుబొమ్మలు ఆశ్చర్యంతో పైకి లేచాయి. అతను కుడి వేపు వాలి పడుకున్నాడు. మోచేతిమీద ఆనుకుని అతను తలకి రెండు చేతులూ చోటు పెట్టుకున్నాడు. కథ చెప్పనుద్యుక్తుడైన ఇతనికేసి మండే నల్లని కళ్లు శోధిస్తున్నట్టు చూశాయి.

# హాజీ రహీమ్ చెప్పిన కథ

"ఆమె గబగబా దాటి పోగానే,
ఆమె బట్టల గాలి నన్ను తాకింది".
(ప్రాచ్య గాథ)

"గుల్ జామిల్ తుర్క్‌మెన్ యెడారిలోని ఒక పేద గ్రామంలో వుండే బీద అమ్మాయి" అని హాజీ రహీమ్ మొదలుపెట్టాడు. "గుల్ జామిల్‌కి బోలెడు పాటలు తెలుసు"అన్నాడు. "ఈ పాటలన్నిటీన్నీ గుల్ జామిల్ తన తాత కోరకుడ్ చోబన్ దగ్గర నేర్చుకుంది. ఆయన యెన్నో యేళ్లు గొర్రెలు కాశాడు. తన పిల్లనగ్రోవిమీద పాటలు పాడేవాడు. తన జీవితమంతా బీదరికంతోటే గడిపాడు. గ్రామంలో గొర్రెలకాపరిగా వున్నప్పుడు ఒక యుర్త్‌నుంచి ఇంకో యుర్త్‌కి వెళ్లి తిండి సంపాదించుకునేవాడు తనకి గ్రామంలో సొంత యుర్త్ వున్నా. తనలాగే అదీ ఇప్పుడు వొంగిపోతూ వుండేది.

"అతను భార్య చనిపోయిందగ్గర్నుంచీ ఒంటరిగానే వుండేవాడు. అప్పుడతని కొడుకులిద్దరు ఖోరెస్మ్ షాకీ, స్వేచ్ఛా ఆఫ్ఘన్ కొండ జాతుల వాళ్లకీ జరిగిన యుద్ధంలో చచ్చిపోయారు.

"కోరకుడ్ చోబన్ తన మనవరాల్ని, గొర్రెల్ని తోడేలునుంచి కాపాడినట్టుగా, పెంచుకున్నాడు. మైదానంమీద మందతోబాటు తిరుగుతూ, వీపుమీద తోలు జోలెకట్టుకుని యీ పిల్లని తీసుకెడుతూ వుండేవాడు. ఒకో అప్పుడు 'మే' అని అరిచేజబ్బు మేక పిల్లతోబాటుగా మోసుకెళ్లేవాడు.

"ఆఖరికి యెదిగిన తన మనవరాలికి వరుణ్ణి చూడవలసిన సమయం వచ్చింది. కాని కలీమ్ – యేమంటే అలాంటి పిల్లకి ఒంటెలు, గుర్రాలు, ఆవులు, గొర్రెలు యేమైనా వస్తాయి. అప్పుడిక తాతగారికి దరిద్రం అనేది ఉండదు. తన బొచ్చు అట్టమీద పడుకుని కావాల్సినంత కుమిస్ తాగచ్చు. పగళ్లు మేఘాలకేసీ, రాత్రిళ్లు నక్షత్రాలకేసీ చూస్తూ గడిపెయియ్యెచ్చు. తన మనవరాలూ, మనవరాలి మొగుడూ పశువుల్ని కాసుకుంటారు.

“కోరకుడ్‌కి మనవరాలి పెళ్లి చేసే తొందర లేకపోయింది. పడుచు గుల్ జామిల్‌ని పెళ్లాడతామని వచ్చిన వాళ్లందరికీ కన్యాశుల్కం పెంచేస్తూనే వుండేవాడు. దాంతోటి వచ్చిన వాళ్లందరూ దిగాలుగా వెనక్కి తిరిగి వెళ్లిపోయేవాళ్లు, ఒకప్పటి గొర్రెలకాపరి దురాశకి ఆశ్చర్యపడుతూ వుండేవాళ్లు. కాని ఒకతను మళ్లీ తిరిగివచ్చి, సంబంధం అడిగాడు. ఆ మనిషి రాచబాటల ప్రసిద్ధ చిరుతపులి, బిడారుల సింహస్వప్నం, బందిపోటు కార బుర్గుత్.

“ ‘నీకు ఆ పిల్లంటే ఇష్టంగా వుంటే కలీమ్ గురించి వెనకా ముందూ చూడవు’ అన్నాడు కార బుర్గుత్. ముసలి కోరకుడ్ అడిగినవన్నీ ఇస్తానని వాగ్దానం చేశాడు. కాని ఆ బందిపోటు వచ్చిన యే రాత్రీ కోరకుడ్ జవాబివ్వలేదు, ఇంకా ఆలోచిస్తున్నాననేవాడు.

“కాని సైతాన్ ఆ ముసలాడితో ఆడుకుంటున్నాడని తెలుస్తూనే వుంది. ఒక్క దెబ్బతో ఆ ముసలాడికి ఒంటెలు, గుర్రాలు, గొర్రెలు పోయాయి. ఒక రోజు షాగారి రౌతులు గ్రామంలోకి సుంకాల వసూళ్ల నిమిత్తం వచ్చారు. బోలేడు గుర్రాల్నీ పశువుల్నీ తోలుకుపోయారు. గుల్ జామిల్‌నీ తీసుకుపోయారు. షా యేలుబడి కింద వున్న వాళ్లు అతి సౌందర్యవంతులైన అమ్మాయిల్ని షాకి అర్పించాలని అన్నారు.

“అర్ధరాత్రి బందిపోటు కారబుర్గుత్ దౌడు తీస్తూ కోరకుడ్ చోబన్ యుర్త్‌కి వెళ్లాడు. రాత్రంతా పన్నులు వసూలు చేసిన రౌతుల వివరాలన్నీ అడిగాడు. మొత్తం అంతా ముసలాడినుంచి ముక్కముక్కా రాబట్టాక అన్నాడు:

‘గుల్ జామిల్‌ని వెతికి నీకు అప్పగిస్తాను. కోరకుడ్ తాతా అప్పుడు మనం పెద్ద విందు చేసుకుందాం. ఆమెని నా యుర్త్‌కి తీసుకుపోతా, ఆమె నా పెళ్లాం అవుతుంది’. కార బుర్గుత్ గుర్రంమీదకి ఎగిరి రాత్రి చీకట్లో మాయమైపోయిడు’.

ఈ మాటలతోటి హాజీ రహీమ్ హఠాత్తుగా ఆపు చేసి మూలిగి, ఓ పక్కకి ఒరిగిపోయాడు.

“కాని తర్వాత యేం జరిగింది? ఆ బందిపోటు ఆమెని పెళ్లాడాడా?” అని నెగడు చుట్టూ వున్న రౌతులు అడిగారు.

“ఆఁ, అతనికీ ఆ అందమైన అమ్మాయికీ యేం జరగలేదని?” అన్నాడు హాజీ రహీమ్ మూలుగుతూ. “కాని ఈ కథ కొనసాగించలేను. ఈ తాళ్లు నా ఒంటిని కోసేస్తున్నాయి. నాకు సొలైపోయింది” అన్నాడు.

“తాళ్లు విప్పండి” అని నల్ల బట్టల రౌతు ఆజ్ఞాపించాడు.

“నా తమ్ముడికి కూడా – గంట్లు పడిన అతని చేతుల్ని విప్పండి” అన్నాడు హాజీ రహీమ్.

ముసలి తుర్కమెన్ గొణుక్కుంటూ ఇద్దరి చేతుల కట్లూ విప్పాడు. వాళ్లు మరింత సుకాసీనులై కూర్చున్నాక దర్వీషు చెప్పసాగాడు:

“ఒక సారి షా కొడుకు జలాలుద్దీన్ దారి తప్పిపోయాడు, ఓ జంతువుని వెంబడిస్తూ. అతని అనుచరులు వెనక వుండిపోయారు. ఆకలితోటీ దాహంతోటీ నీరసం ఒచ్చి పడిపోయేటట్టు వుంది అతనికి. అతనికి వృద్ధ కోరకుడ్ చోబన్ గుడిసె కనిపించింది. కోరకుడ్ సగౌరవంగా అతన్ని ఆదరించాడు. తన యుర్త్‌లో సేద దీర నిచ్చాడు. సరిగ్గా ఆ సమయంలోనే కార బుర్గుత్ యుర్త్‌లోకి వెళ్లాడు. అతను చాలా సేపు తన శత్రువు కొడుకుతోటి మాట్లాడాడు, అతనెవరైందీ తెలియక. వాళ్లు సెలవు తీసుకుని వెళ్లిపోయేటప్పుడు షా కొడుకు కార బుర్గుత్‌ని తన పల్లెటి ప్రాసాదం తిల్లాలలో సందర్శించవలసిందిగా పిలిచాడు. అప్పుడు ఆ బందిపోటు గ్రహించాడు అతనే తను అసహ్యించుకునే షా కొడుకు అని. కాని అతిథి మర్యాద ఆచారం ప్రకారం వచ్చిన వాడికి పూర్తిగా గౌరవం చూపించాలి. అంచేత కార బుర్గుత్ అతనికి యే అవమానవమూ తల పెట్టలేదు, యువ ఖాన్‌కి అతిథిగా వెడతానని మాట ఇచ్చాడు.

“కార బుర్గుత్ తిల్లాల ప్రాసాదానికి వెళ్లినప్పుడు షా కొడుకు అతన్ని సంతోషంగా ఆదరించి, విందు వినోదాలతో, మేళతాళాలతో సంతోషపెట్టాడు. ప్రత్యేకగాయక బృందం పాత వీర గాథలు పాడింది. రాత్రి కార బుర్గుత్ తన దారిన పోతానన్నాడు. కాని పొద్దుటిదాకా వుండమని ఖాన్ అతన్నడిగాడు. తను అతనికి కాపలా తోడిచ్చి పంపుతాడు, కార బుర్గుత్‌కి నగరం శివారు దాటేదాకా యే భయమూ వుండదు.

‘కార బుర్గుత్‌ని యెదిరించిన సాహసించే వాడెవడు?’ అన్నాడు ఆ బందిపోటు. ‘నా మీద గనక దాడి చెయ్యాలని అనుకుంటే ఇరవై మంది ఆశ్వికులకి కూడా నా కత్తి భయపడదు’.

“కాని అతను బయటికి వెడుతూనే ఓ పెద్ద చేపల వల అతనిమీద పడింది. అతని చేతులకి బందం పడిపోయింది, అతను కత్తిని తిప్పలేకపోయాడు. రౌతులు అతన్ని ఈడ్చారు, అతన్ని కట్టేసి విచారణ జరిపేందుకు చిత్రహింసల స్థానంలో పడేశారు.

“రాత్రి ముఖ్య తలారి జహాన్ పహ్లావన్ కార బుర్గుత్‌ని విచారించడం మొదలు పెట్టాడు. కణకణ మండే బొగ్గులు ఒంటిమీద వేసి యువ ఖాన్ తోటకి అతను ఎందుకు వెళ్లాడో చెప్పమని నిగ్గదీశాడు.

‘తాతార్ ఖాన్ దగ్గరనుంచి అత్యుత్తమమైన అశ్వాన్ని కాజేస్తానని నేను బెక్‌కి వాగ్దానం చేశాను’ అని కార బుర్గుత్ అన్నాడు.

“ఇలా అడగడంతో, హింసించడంతో జహాన్ పహ్లావన్‌కి ఆఖరికి అలుపొచ్చింది. ఈ మొండి రౌతుని ‘దండన శిఖరానికి’ తీసుకుపొమ్మని ఆజ్ఞ చేశాడు.

“వాళ్లు కార బుర్గుత్‌ని చీకట్లో యెత్తైన శిఖరం దగ్గరికి తీసుకెళ్లారు. తలారులు అతన్ని దగ్గరసా చుట్టుముట్టి వెళ్లారు. యెవరో అతని చెవిలో గుసగుసలాడారు: ‘కుడి వేపు చెయ్యి పెట్టి ఇనప కొక్కెం పట్టుకో’ అని. తన చేతుల్ని కట్టేసిన తాడు వసులైందని, యెవరో అదృశ్య నేస్తం కోసేసినట్టుగా, అతను హఠాత్తుగా గ్రహించాడు. తనని తాను రక్షించుకోవడానికి సిద్ధంగా

వున్నాడనే అభిప్రాయాన్ని కలిగించకుండా కార బుర్గుత్ విధేయంగా శిఖరం దగ్గరికి వెళ్లి, సుళ్లు తిరిగిన యెత్తైన మెట్లు యెక్కాడు. పైన చివర్న కాగడా మసక వెలుతురులో కురచ తలుపు తెరుచుకుంది. వాళ్లు లోపలికి గెంటేద్దామని ప్రయత్నించినప్పుడు ఆ బందిపోటు గబగబాకుడి చేతి తాటిని వసులు చేసుకుని, తడుములాడితే పెద్ద ఇనప కొక్కెం తగిలింది. యెవళ్లో అరిచారు: 'ఒక్క కుక్క తగ్గింది!' తలుపు ధనామని మూసుకుంది. కార బుర్గుత్ కటిక చీకట్లో వూగులాడుతున్నాడు, కాళ్ల కింద యేం తగల్టం లేదు..."

హాజీ రహీమ్ పుల్లని పాలు గుటుక్కున మింగి చెప్పాడు:

"ఈ లోపున షా కొడుకు తన తోటలో కులాసాగా గడుపుతున్నాడు. ఉన్నట్టుండి, ప్రతి చోటా వుండే అతని విశ్వాస పాత్రులైన మిత్రుల్లో ఒకడు అతని దగ్గరికి వెళ్లాడు. అతని అతిధిని తోట గోడల బయట పట్టుకున్నారనీ షా పహారా వాళ్ల సర్దార్ దగ్గరికి తీసుకెళ్లారనీ, 'దండన శిఖరం'లో పడేశారనీ చెప్పాడు.

"యువ ఖాన్ ఆగ్రహంతో అట్టుడికి పోయాడు. వంద మంది ఆశ్వికులతోటి జలాలుద్దీన్ నగరంలోకి దౌడు తీసుకుంటూ వెళ్లి, యెకాయెకీని పాత శిఖరం దగ్గరికి వెళ్లాడు. రౌతులు గొడ్డళ్లతో తలుపులు బద్దలు కొట్టారు. జలాలుద్దీన్ మెట్లెక్కి శిఖరందాకా వెళ్లాడు. అక్కడ ఇంకో తలుపు బద్దలు కొట్టాల్సి వచ్చింది.

"తలుపు తెరుచుకోగానే వాళ్లు నిశ్చేష్టులైపోయారు. సరిగ్గా గుమ్మం దగ్గరే నల్లని శూన్యం. కుడి వేపున గోడపైన ఇనప కొక్కెం పట్టుకుని వేలాడే మనిషి. రౌతులు అతన్ని జాగ్రత్తగా పట్టుకుని, మెట్ల దగ్గరికి లాగారు. జలాలుద్దీన్ వెలుగుతూ వున్న కాగాడాని తీసుకుని బిలంలోకి చూశాడు. లోతుల్లో నుంచి జ్వలించే కళ్లు పైకి చూశాయి. ఆ అంధకారం అరుపులతో నిండిపోయింది. ఖాన్ వెలిగే కాగడానికిందికి విసిరేసాడు. అది దొర్లుకుంటూ లోతుల్లోకి పడిపోయింది, మనుషుల్ని తినే పెద్ద బొచ్చు కుక్కల్ని చెదరగొడుతూ.

'నేను గనక షాని అయితే ఈ భయంకరమైన కుక్కల్ని ఈ శిఖరం నిర్మించినవాడ్ని తినేసేటందుకు వుసి గొల్పుతారని శపథం చేస్తున్నాను' అన్నాడతను.

"రౌతులు నగరం గుండా స్వారీ చేసుకుపోయారు. రాతి ద్వారాల బయటకీ వచ్చినప్పుడు మాత్రమే, అంతం లేని పచ్చిక బీటి మైదానం తమ ముందు విస్తరించుకున్నప్పుడే జలాలుద్దీన్ తను విడిపించిన కార బుర్గుత్‌తోటి అన్నాడు:

'షా తలారి చేతుల్లో పడ్డానికి నిన్ను కావాల్సికి నేను ఆహ్వానించాలని నువ్వు అనుకోవచ్చు'.

'నాకలాంటి అనుమాన పుటాలోచనలు లేవు. నా యెడారికి నన్ను పోనివ్వండి అక్కడ, అక్కడ బోసి ఇసక తప్ప మరేం లేదు, గడ్డి పల్చగా ఉంటుంది, ఉప్పు నీరు. కాని అక్కడ ఈ అందమైన భవనాలు, ఎత్తు శిఖరాలు బలమైన గోడలు వున్న ఇక్కడకంటే ఎక్కువ స్వేచ్ఛ సంతోషం వున్నాయి'.

'నిన్ను ఆపను. నీకు కావలసిందేమన్నా ఉందా? నీకు చెయ్యగలిగింది? నావల్ల నువ్వు బాధ పడ్డావు కదా'.

'నాది ఒక్కటే ప్రార్థన. వాల్లు నా మీద వల విసిరినప్పుడు నా కత్తిని తీసుకుపోయారు. దాన్ని నేను తిరిగి సంపాదించుకునే దాకా నీ రౌతుల మెరిసే కరవాలాల్లో ఒక దాన్ని నాకు ఇవ్వగలవా?'

"యువ ఖాన్ తన కత్తినే తీసి కార బుర్గుత్‌కి ఇచ్చాడు. అది వజ్రాలతో, కెంపులతో మణులతో అలంకృతం అయివుంది.

'దీన్ని గౌరవంగా ధరించు. మన ప్రజల శత్రువుల మీదనే దీన్ని వాడు, బిడారుల శాంతికాముక పథికులమీద కాదు! నువ్వు ఇప్పుడు యెక్కిన కర్రి గుర్రం నీదే'.

'మరో ప్రార్థన' అన్నాడు కార బుర్గుత్.

'చెప్పు'.

'షా ప్రాసాదంలో జరిగేదంతా తెలిసిన వాడివైన నువ్వు, తుర్క్‌మెన్ తండాకి చెందిన అమ్మాయి గుల్ జామిల్ యేమైందో చెప్పగలవా? షా దుండగీల్లు ఆమెని షా ప్రాసాదానికి తీసుకుపోయారు'.

'చెప్పగలను. ఈ అమ్మాయి గుల్ జామిల్, షా ఆజ్ఞ మేరకి ప్రాసాదపు ఒక తోటలో, ఒక ప్రత్యేక యుర్త్‌లో వుంది. కాని ఆ పిల్ల గర్వంలో మొండిగా వుంది. షా ఇష్టాన్ని వ్యతిరేకించిన వాళ్లకి పట్టిన గతే ఈ పిల్లకీ పడుతుందని నా భయం'.

'చాలు నీ రుణం వుంచుకోను, ప్రాణదాతా. యెప్పుడన్నా నా అవసరం నీకు పడితే నన్ను పిలు. నేను తక్షణం వస్తా, సప్త సముద్రాలూ దాటి రావాల్సివున్నాగానీ' అన్నాడు కార బుర్గుత్.

కార బుర్గుత్ తన కర్రి గుర్రాన్ని తిప్పి దౌడు తీసుకుంటూ యెడారిలోకి వెళ్లిపోయాడు. త్వరలోనే దారి మార్చి, తోటల వెనక దాగిన మహా అందమైన నగరం సమర్‌కండ్‌కి వెళ్లే రాస్తా పట్టాడు.

"కార బుర్గుత్ యెంతగానో ఆలోచనల్లో మునిగిపోయాడు, రౌతుల గుర్రాలు పేగులు తెగే వేగంతో దౌడు తీసివచ్చాయి. అవి అతన్ని దాదాపు తొక్కేసేవే. వాళ్లు అరుస్తున్నారు:

'హేయ్! దారి! తప్పుకో! షాకి వార్తాహరులు! షాయే స్వయంగా అందుకోవాల్సిన లేఖ!'

"అనేక మంది ఆశ్వికులు ధూళి మేఘంలో ముందుకు హడావుడిగా దూసుకు పోతున్నారు. వాళ్ల వెనక బిగుతుగా లాగుతున్న ఉచ్చు ఉంది. ఆ ఉచ్చు తాడు అంచుజీను వంపు దగ్గర కట్టి ఉంది. గుర్రంమీద తాళ్లతో కట్టేసి వున్న దూత, గుర్రం ముందుకు యెగిరినప్పుడల్లా, అటూ ఇటూ వూగుతూ, ముందుకు యెత్తి కుదేసి నట్టవుతున్నాడు. అతని తల భుజాలమీద యెగిరి పడుతోంది.

“ఆ దూత గుర్రం కడపటి ప్రయత్నాలు చేస్తోందన్నది తెలుస్తూనే వుంది. అది ఆయాస పడుతోంది, తడబడుతోంది. ముందు దౌడు తీస్తూ వున్న రౌతు గుర్రానికి తాళ్లమీదే పోతోంది.

వున్నట్టుండి, పూర్తిగా దౌడుతో వున్నప్పుడు, గుర్రం తడబడింది, నేల కూలింది. రౌతులు ఆగారు, గుర్రాలు దిగి కూలిన గుర్రాన్ని లేవనెత్తబోయారు. కాని లాభం లేకపోయింది. దాని ముక్కు పుటాల్లోనుంచి రక్తం దుమ్ము కొట్టుకుపోయిన పథం మీదకి స్రవించింది.

దూత పడిపోయిన చోటే ఉండిపోయాడు. వూపిరి పీల్చుకోలేకపోయాడు. ‘షాకి కూతురి దగ్గరినుంచి ముఖ్యమైన పత్రం, ఆమెని కోట బురుజు ముట్టడించారు. సమర్‌కండ్ వాసులు మొత్తం షా తల్లార్లమీద, సుంకర్లమీద కత్తి గట్టి లేచారు’.

కార బుర్గుత్ అతని దగ్గరికి వెళ్లి అన్నాడు:

‘నీ ఉత్తరం సంచీ ఇలా యియ్యి. నేను ఆ ఉత్తరాన్ని షాదుషాకే అందిస్తా. నిద్రపో. ఈ ఉత్తరం ఇవ్వాల్సిన తొందరలో వున్నట్టు నువ్వు లేవని నాకు తెలుసు. నిన్ను వాళ్లు ఇలా లాగడం యెందుకో కూడా నాకు తెలుసు. ఈ చెడ్డ వార్త తెచ్చినందుకు షా నీ తల తీయిస్తాడు కాబట్టి’.

వార్తాహరుడు కార బుర్గుత్‌కి ఉత్తరాన్ని ఇచ్చాడు. కార బుర్గుత్ అరిచాడు: ‘పదండి ముందుకు! రౌతులందరూ మరో సారి దౌడు తీసారు షా రాజధానికి.

వెంటవచ్చిన రౌతులతోబాటుగా కార బుర్గుత్ ప్రాసాదపు యెత్తు ద్వారందాకా వెళ్లాడు. ఓ ముసలి కొజ్జా ఆ దూతని మెలి తిరిగిన దారులమ్మట తీసికెళ్లాడు. హఠాత్తుగా ఓ గోడ వెనకనుంచి అతివ ఆర్తనాదం వినిపించింది: ‘రక్షించండి!’ నాకు కడపటి ఘడియలు దాపురించాయి!’ అని.

ఆ మృదువైన కంఠం, ఇప్పుడు భయంతో దయ వేడుకుంటూ అరిచే అరుపు, కార బుర్గుత్ తెలుసుకోలేడా? జలాలుద్దీన్ తనకిచ్చిన కత్తిని దూశాడు, ఆ పిచ్చి కొజ్జాని తలుపు తెరవమని ఆజ్ఞాపించాడు. కార బుర్గుత్ మందిరంలోకి లంఘించాడు. అంతా తివాసీలు పరిచివున్నాయి. కాని గదిలో యెవళ్లూ లేరు. ఒక మూల పర్షియన్ శాలువాల గుట్టమీద నల్ల మచ్చల చిరుతపులి వుంది. తన పంజాలతోటీ ఒక తివాసీని ముక్కలుగా చింపబోతోంది. ఆ తివాసీ కిందనుంచి మూలుగులు అణిగి వినవస్తున్నాయి.

రెండు దెబ్బలతోటి కరవాలం రౌతు చిరుతపులిని చంపి తివాసీని పక్కకి లాగాడు. దాని కింద రొప్పుతూ వుంది భయంతో వణికిపోతున్న గుల్ జామిల్.

‘అబలమీద యే రాక్షసుడు ఈ అడివి జంతువుని వదలగలడు?’ అని కార బుర్గుత్ అరిచాడు.

ఆ గదిలోకి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ షా తనే వచ్చాడు. ఆగ్రహంతోటి నుంచున్న పళంగా ఆ మనిషిని, తన పెంపుడు చిరుతని చంపిన మనిషిని, ఉరితీయించాలనుకున్నాడు.

కాని కార బుర్గుత్ చక్కగా అతనికి ఉత్తరాన్ని అందించాడు. సమర్కండ్లో తిరుగుబాటు జరిగిందనీ, తన కూతురిమీద దాడి జరిగిందనీ తెలిసి కార బుర్గుత్ని గురించి ఇక పట్టించుకోలేదు. కార బుర్గుత్ గుల్ జామిల్ని యెత్తుకుని తనే తన చేతులతో తోటలోని తెల్ల గుడారం దగ్గరికి తీసుకెళ్లాడు. ఎడారినుంచి వృద్ధులు నగరానికి ఆ మర్నాడు ఆమె గౌరవార్థం బిడారుతో వచ్చి గుల్ జామిల్ని తన సొంత గ్రామానికి తీసుకువస్తారని చెప్పాడు.

"కాని ఆ మర్నాడు ఆ వృద్ధుల్ని గుల్ జామిల్ దగ్గరికి వెళ్లనివ్వలేదు. వాళ్లని ప్రాసాదం బయటికి గెంటేశారు. పాదుషాని హత్య చెయ్య ప్రయత్నించినందుకు దండనగా గుల్ జామిల్ని రాతి 'శాశ్వత విస్మృత శిఖరం'లో పడేశారని అన్నారు. అక్కడ చచ్చేదాకా వుండిపోతుంది".

"అయితే ఆమె చచ్చిపోయిందా?" అని ఒకళ్లు అడిగారు. హాజీ రహీమ్ మెల్లిగా జవాబు చెప్పాడు,

"లేదు. గుల్ జామిల్ ఇంకా జీవించే వుంది. గుర్గంజ్ రాతి శిఖరంలో బందీగా వుంది".

"దర్వీష్, చెప్పు, ఇదంతా నీకెలా తెలుసు?" అని 'నల్ల బట్టల రౌతు' అడిగాడు తివాసీ మీదనుంచి లేస్తూ. "నువ్వు చెప్పిందంతా కథ కాదు, నిజంగా జరిగింది" అన్నాడు.

"మైదానాల మీద తిరిగే పథికులం అనేక మందిని చూస్తాం, బోలెడు విషయాలు వింటాం".

"బెక్ రౌతుల్లారా!" అన్నాడు నల్ల బట్టల రౌతు తన వాళ్లకేసి తిరిగి. "తయారుకండి, పొద్దున్నే గుర్గంజ్కి పోదాం".

"మీరు గుర్గంజ్ పోవాలనుకుంటే త్వరపడండి" అన్నాడు హాజీ రహీమ్. "తాతార్ ఖాన్ కొడుకులు బ్రహ్మాండమైన సైన్యాలతో మూడు వేపులనుంచీ గుర్గంజ్కి వెళ్తున్నారు. వాళ్లు నగరాన్ని వలయంగా చుట్టుముట్టేస్తారు, అప్పుడిక మీరు వెళ్లలేరు" అన్నాడు.

"దర్వీష్, నువ్వు కూడా మాతో రా" అన్నాడు నల్ల బట్టల రౌతు. "నీకూ, నీ వాడికీ రెండు గుర్రాల్ని ఇస్తాను. మూడ్రోజుల్లో మనం గుర్గంజ్ గడప దగ్గరుంటాం".

# జెంఘిజ్ ఖాన్ ముగ్గురు కొడుకులు గుర్‌గంజ్ గురించి పోట్లాడుకోవడం

ప్రాచీన నగరం మెర్వ్‌ని పట్టుకుని ధ్వంసం చెయ్యమని కనిష్ఠ పుత్రుడు తులీ ఖాన్‌నీ, సైన్యాల్ని తీసుకుని ఖోరెస్మ్ రాజధాని గుర్‌గంజ్‌ని జయించమని పెద్ద కొడుకులు జూచి, జగతాయ్, ఉగేదీయ్‌లనీ జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞాపించాడు.

తమ పెద్దన్న జూచికంటే ముందుగానే నగరాన్ని పట్టుకోవాలని జెంఘిజ్ ఖాన్ కొడుకులు జగతాయ్, ఉగేదీయ్‌లు వేగిరపడ్డారు. యేమంటే ఒకవేళ జూచి అక్కడికి మొదట చేరితే జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞ ప్రకారం కిప్‌చాక్ పచ్చిక బీళ్లతోబాటుగా మొత్తం ఖోరెస్మ్ అంతటికీ ఆధిపత్యంలో అతను ఉంటాడు.

తన వాటాకి వచ్చిన భవిష్యత్ రాజధాని సంపదల్ని తమ్ముళ్లతో పంచుకోవాల్సి వస్తుందని కోపగించి జూచి ఖాన్ వెనక వుండిపోయాడు. అడివి గుర్రాల్ని వెటాడ్డంలో కాలం గడిపేసి, భుజాలు యెగరేసి అన్నాడు:

"యెలా అయినా ఒకటే – నేను లేకుండా వాళ్లు గుర్‌గంజ్‌ని పట్టుకోలేరు. వాళ్లని తలలు పగల గొట్టుకోనీయండి".

కాని దురాశగా అసూయగా వుండే జగతాయ్ ఒక రోజున ఛషకాలు నింపుకుంటూ శపథం చేశాడు:

"జూచికి చాలా పెద్ద వాటా వచ్చింది. మంచి మంచి భూములన్నీ తనకే కావాలంటాడు. వాడికి గుర్‌గంజ్ ఇవ్వను. దాన్ని మొదట శిధిలం అయేటట్టు చూస్తాను".

గుర్‌గంజ్ ఖోరెస్మ్ షా వంశీయుల రాజధాని. కిప్‌చాక్ ఖాన్‌ల వైభవభరిత నగరం. సంపద్వంతులైన వర్తకులు, నిపుణులైన పనివాళ్లు వున్న నగరం. బహు భాషల బానిసల సమూహం వున్న నగరం. మవరాన్నహోర్‌లో మంగోలు దాడి తర్వాత ఆందోళనాభరిత కాలం గడిపింది.

క్రూరమైన హస్తంతో నగరాన్ని అదిమి పెట్టిన మాతృశ్రీ సుల్తానా తుర్కాన్ ఖాతూన్ పారిపోయిన తర్వాత, ఖరెస్మ్ షా వంశరక్తం మొత్తం నిష్క్రమించిం తర్వాత, కళకళలాడే ఆ రాజధాని కిప్‌చాక్ ఖాన్ల అధికారం కింద వుంది. కిప్‌చాక్ బెక్ ఖుమార్ తెగిన్ ఖోరెస్మ్ సుల్తాన్‌గా ప్రకటించేసుకున్నాడు. అందరూ అతనికి బేషరతుగా లొంగిపోయారు. నెరసిన గడ్డం ఇమామ్‌లు అతని కోసం మసీదుల్లో ప్రార్థనలు చెయ్యడం మొదలెట్టారు.

పైకి మాత్రం గుర్‌గంజ్ పాత జీవితమే గడుపుతోంది. ప్రతి రోజూ యెత్తైన గోపురాల నుంచి ఆస్తికులకి ప్రార్థనలు చెయ్యమనే పిలుపులు అందుతూనే వున్నాయి. విపణి వీధిలో వర్తకులు తమ సామాన్ల పక్క యింకా కూర్చుంటూనే వున్నారు, ఖాతాదార్లని రమ్మంటూనే వున్నారు. అనంత జన సమూహం ఇరుకు వీధుల్లో గుమిగూడుతూనే వున్నారు. కాని నగర వాణిజ్య, క్రియా జీవితం రోజు రోజుకీ చచ్చిపోయింది.

వర్తకం దిగనాసిల్లి పోయిందని వర్తకులు ఫిర్యాదు చేశారు. కొంతమంది మూసేశారు. కొనుగోలుదార్లు వూరికే ధరవరలు అడిగేవాళ్లు. పెదాలు విరిచేవాళ్లు. తలలు ఆడించే వాళ్లు, కాని యేమీ కొనేవాళ్లు కాదు ధరలు అప్పటికీ సగానికి సగం తగ్గిపోయినా.

తిండి సామాను అనేదల్లా మాత్రం పెరిగింది. ప్రతివాళ్లూ హడావుడిగా పిండి, అపరాలు, యెండు ద్రాక్ష కొనేస్తున్నారు, దిగుమతీ ఆగిపోతుందని గ్రహించి.

వీధి మొగల్లో చిన్న బృందాలు గుసగుసలాడేవి.

“తాతార్లు వస్తున్నారు. తాతార్లు పెద్ద శక్తిగా వస్తారు. తాతార్లు మన నగరాన్ని ముట్టడిస్తారు. గోడలు యెత్తుగా, గట్టిగా వున్నాయి. ముట్టడి చాలా కాలం సాగుతుంది. గుర్రాలనీ, గొర్రెలనీ అన్నింటినీ తినేస్తాం, అప్పుడేమవుతుంది? యెక్కడ దాంకుంటాం? యెక్కడికి పారిపోతాం?”

ఒంటెల బిడారులు నగరం దాటి బయటికి పోతూ వుండేవి. బస్తాలకి బదులు వాటి మూపురాలమీద బుటట్టలు వేలాడేవి. వాటిల్లోనుంచి మాంఘిష్‌లాక్ తుర్క్‌మెన్‌ల దగ్గరికి పోయే ఆడవాళ్లనీ పిల్లలవీ ముఖాలు కనిపించేవి. అదే సమయంలో ఇతర బిడారులు నగరంలోకి వచ్చేవి - గుర్రాలమీద, బళ్లమీద, గాడిదలమీద. పెద్ద బెక్‌ల కుటుంబాలు తమ జమీలనుంచి పారిపోయి నగరపు దృఢ కుడ్య రక్షణ కోసం, గుర్‌గంజ్ గోడల వెనక్కి వచ్చేస్తున్నాయి.

మంగోలులు హఠాత్తుగా రోజు మధ్యలో వచ్చారు. యేం జరుగుతోందో యేమిటో యెవళ్లూ గుర్తించలేదు. దక్షిణం ద్వారంనుంచి మైదానం మీదుగా పశువుల మందని తోలుకుంటూ సంచారులు వస్తున్నారు. గొర్రెలూ, ఆవులూ కాలవమీద వంతెన పైన లోపలికి వచ్చే దారిలో మూగాయి.

వున్నట్టుండి హఠాత్తుగా రెండు వందల మంది ఆశ్వికులు కిప్‌చాకుల్లాగా, తుర్క్‌మెన్‌ల లాగా కాకుండా వింతగా దుస్తులు వేసుకుని పశువులు వేసిన ధూళి మేఘాల్లో నుంచి

వచ్చారు. చిన్నవైనా వేగంగా వుండే గుర్రాలమీద ఈ ఆశ్వికులు తోలేవాళ్లని పోరి గెంటేస్తూ పశువుల్నీ, గొర్రెల్నీ చుట్టు ముట్టారు.

యింతలో ఆ రౌతులు మొండిగా వున్న అనేక మంది పాలేర్లని చంపేశారు. కమ్చీలని ఛళ్లుమని దూస్తూ మాట్లాడకుండా తాము వచ్చిన దారినే మందల్ని తోలుకుంటూ వెళ్లిపోయారు. పెద్ద కాలవ వంతెన మీదుగా తోలుకుపోయారు, మెల్లిగా, హడావుడి పడకుండా అదృశ్యం అయిపోయారు.

నగరంలో హెచ్చరిక చేశారు. సుల్తాన్ ఈ పొగరుమోతు దొంగల్ని పట్టడానికి, శిక్షించేటందుకు గాను వాళ్లని సజీవంగా పట్టి తెచ్చేందుకు వెయ్యి మంది కిప్‌చాక్‌లని పంపాడు.

# కథ ముగింపు తెలుసుకోవడానికి

# కార కోంచర్ బయల్దేరడం

"నీదు నడక చూడ అమిత
అద్భుతంబు
నీదు పలుకు సోక నర్పింతు
హృదయమ్ము".
(పాత పర్షియన్ పాట)

మంగోలుల్ని తప్పించుకుని కార కోంచర్ ఇసక తిన్నెలమీదకి జైహూన్ నదికి వెళ్లాడు. దూరంలో మంగోలు దళాలు వెడుతూవుండడం అడపాదడపా కనిపించింది. రౌతులు అందరూ గుర్‌గంజ్ కేసి ఉత్తర దిశగా వెడుతున్నారు.

కార కోంచర్‌తోబాటుగా ఇద్దరు తుర్క్‌మెన్‌లు స్వారీ చేసుకు వెళ్తున్నారు – ఎప్పుడూ నోరు మెదపని కుర్రాడూ, గడ్డం దర్వీషు.

రాత్రి బాగా పొద్దుపోయాక, నెలకంక మసక వెన్నెలలో ఆ ప్రయాణీకులు విశాలంగా ప్రవహించే తీరం చేరారు. రెల్లుగుండా అడవి పంది జాడ వెంబడి వెళ్లి నది ఒడ్డుకి చేరారు. ముందరితట్టు యెత్తైన తలవరస వున్న పడవలు అనేకం నీళ్లమీద పోతున్నాయి. అవి మనుషుల్నీ, గుర్రాల్నీ, గొర్రెల్నీ తీసుకుపోతున్నాయి. పడవలమీద తీసుకెళ్లమని ప్రయాణీకులు అడిగారు.

"నిజమైన ఆస్తికులు నిజమైన ఆస్తికుల్ని కష్టాలలో వదలరు" అని ఒక పడవవాడు అన్నాడు.

చుక్కానీ వాడు పడవని తీరం చేర్చాడు. అందర్నీ గుర్‌గంజ్‌కే తీసుకెళ్లడానికి ఒప్పుకున్నాడు.

దృఢంగా వున్న ఆ పెద్ద పడవ ప్రయాణీకుల్నీ, వాళ్ల గుర్రాల్నీ యెక్కించుకుంది. నాలుగు రోజుల తర్వాత పడవ విశాలమైన కాలవలోకి వెళ్లింది. ఆ కాలవ గుర్‌గంజ్‌ని రెండు

భాగాలుగా చేస్తోంది: యెత్తు గోడలు చుట్టూతా వున్న పాత పట్టణం, తోటల్లోని మల్బర్రీ చెట్ల మాటున దాగిన ఇళ్లు వున్న శివారు ప్రాంతాలు.

కార కోంచర్ తన బోడ్లోనుంచి తోలు అడపం తీశాడు. అది గట్టిగా తాడుకట్టి వుంది. పది దినార్లని లెక్కపెట్టి పడవ యజమాని వెడల్పాటి చేతిలో పెట్టాడు.

"మళ్లీ మనం కలుసుకుంటామో లేదో తెలీదు. కనీసం నీ పేరేనా చెప్పు".

"నన్ను కమ్మరి కెరిగుల్ అంటారు" అని పడవవాడు నవ్వి అన్నాడు.

కార కోంచర్ కాలవ అవతల ధూళి మేఘం వస్తూ వున్న దూరంలోకి చూస్తున్నాడు.

ధూళిలో వాళ్లకి గుర్రాల ముట్టెలు కనిపిస్తున్నాయి. గుర్రాల మెడలమీదకంటా వాటిన కిప్చాక్ రౌతులు కనిపిస్తున్నారు. వాళ్లు అరుస్తూ గుర్రాలని కొడుతున్నారు. దూరంలో జడమైన చప్పుడూ, గరగరలాడే గొంతుకల గర్జ వినవస్తున్నాయి.

కిప్చాక్లు సుడిగాలిలా వంతెనమీద దూసుకుపోయారు.

"వాళ్లు వస్తున్నారు, సరిగ్గా వెనకనే వున్నారు. ప్రాణాలు కాపాడుకోండి" అని కళవిళ పడిపోయి అరుస్తున్నారు.

కిప్చాక్లు ద్వారంలోకి దూసుకువచ్చారు. కార కోంచర్ అతని సహచరులు వాళ్ల వెనక వచ్చారు. ద్వారం మూసుకుంది. పహారావాళ్లు భారమైన అడ్డకొయ్యలని పెట్టారు. ఒక రౌతు ఆగి పహారావాళ్లతో అన్నాడు:

"కొత్త సుల్తాన్ ఖుమార్ తెగిన్ రెండు వందల మంది మంగోలుల్ని పట్టుకొమ్మని పంపాడు. వాళ్లు మన పశువుల్ని తోలుకుపోయారు. మమ్మల్ని చూసి వాళ్లు పశువుల్ని వదిలేసి బెదిరిన యెలకల్లాగా పారిపోయారు. వాళ్లు మనకి వల పన్నారేమో యెవళ్లకి తెలుసు? తిల్లాల తోట దగ్గర, పొంచి వున్న ఈ ఆటవిక పాషండులు రెండు వేల మంది హఠాత్తుగా మా మీదకి వురికారు. అన్ని వేపులనుంచీ మమ్మల్ని చుట్టుముట్టారు. దూరం నుంచి బాణాలతో కొట్టారు, రౌతులు పడిపోగానే గుర్రాల్ని పట్టుకున్నారు. చాలా మంది గట్టి వాళ్లు చచ్చిపోయారు. మా దళంలో మిగిలిందంతా ఇంతే, ఇలాంటి కబేళాలోకి పంపి మమ్మల్ని సుల్తాన్ యేం జేస్తున్నాడు?"

"కాని అలాంటి పందిని సుల్తాన్గా యెందుకు పెట్టుకున్నారు?" అని కార కోంచర్ అరిచాడు.

వాళ్లంతా అటు తిరిగి చూశారు: సుల్తాన్ గురించి అలాంటి మాట అనగల ధైర్యవంతుడెవడు?

కాని కార కోంచర్ పెద్ద గొంతుకతో అంటూనే వున్నాడు:

"అల్లా, వాళ్ల పిరికితనం ఖోరెస్మ్ ముసలి పాడు కుక్క సుల్తానా తుర్కాన్ ఖాతూన్నీ, ఆమె పందికొక్కుల్నీ ఖోరెస్మ్ నుంచి తరిమేశాయి. చదునుమట్టు షా మహమ్మద్ కూడా

పారిపోయాడు. కుక్కలు అతని శవాన్ని పీక్కు తింటున్నాయి. నక్కల గుంపుని ఉప్పెన తుడిచి పెట్టేసింది. ఇప్పుడేమో మీరు పొలంలో దిష్టిబొమ్మ ఖుమార్ తెగిన్‌ని తెచ్చుకున్నారు! పురుగులు పట్టన మేకల మందకి కూడా అతన్ని రైతు ఎవడు కాపలాపెట్టడు. మరి మీరేమో అతన్ని సైన్యాధ్యక్షుణ్ణి చేసి నగర రక్షణ అప్పగించారు! మీ వీపుల మీద ముల్లు కర్ర లేకుండా బతకడం యెలాగో మీకు తెలీదు..."

అతని మాటలకి ద్వారం దగ్గర వున్న పహారా వాళ్లు, సైనికులు అవాక్కయిపోయారు.

"నల్ల బట్టల రౌతు కలేజా! అయినా అతనన్నది నిజమే! ఖుమార్ తెగిన్ యుద్ధం అన్నది యెన్నడూ చెయ్యలేదు. నిజాయితీగా వుంటాడని గాని తెలివైన వాడనిగాని యెవళ్లూ యెన్నడూ వినలేదు. సుల్తానా తుర్కాన్ ఖాతూన్ కొంగు పట్టుకు వేళ్లాడేవాడని తప్ప మరేం అతన్ని గురించి యెవళ్లకీ తెలీదు. ఇలాంటి సుల్తాన్‌ని పెట్టుకుని మనం అంతా పోగొట్టుకున్నట్టే."

కార కోంచర్ గుర్‌గంజ్ రాచబాటమీద మెల్లిగా స్వారీ చేసుకు వెళ్లాడు. అతని కఠినమైన కళ్లు వీధుల్లో మూగే జనాన్ని చూస్తూ వుండిపోయాయి. అతను తన సహచరులతో అన్నాడు:

"విపణికి వెళ్లండి. మెర్దన్ పూటకూళ్ల ఇల్లు ఎక్కడని అడగండి. ప్రతి వాళ్లకీ తెలుసు. అక్కడ వుండండి".

"శాశ్వత విస్మృత శిఖరం" ఖోరెస్మ్ షా ప్రాసాదం పక్కనే వుంది. ఒక భాగం చౌకు వేపు వస్తుంది. దాని బయట నుంచుని కార కోంచర్ కిటికీలకి మారుగా వున్న చిన్న గుండ్రటి కంతలకేసి చూసి అనుకున్నాడు: "వీటిల్లో యే చిన్న కంత ఆమెని దాచింది, యెడారి పువ్వుని? ఆమె బతికే వుందా? బతికే వుంటే మధురమైన ముఖ సౌందర్యాన్ని కాపాడుకునే వుందా? మెరిసే కళ్ల కాంతినీ, ఆడపిల్లల చేతి మృదుత్వాన్నీ కాపాడుకునే వుందా? ఈ భయంకరమైన బురుజులో మగాళ్లకి మతులు పోతాయి, ఆడవాళ్లు ముసలి తొక్కులైపోతారు. బహుశా గుల్ జామిల్ గోడకి సంకెళ్లతో కట్టేసి ఈ పాటికి –'' అతను వణికాడు, తను యేం చూడబోతున్నాడోనని ఊహించి ఇప్పుడే పోరాడుతూ చచ్చిపోవడం మెరుగు తన జీవిత జ్యోతిని విరూపంగా పిచ్చి వదరుబోతు అయి మారిపోయిన స్థితిలో చూసేకంటె...

బురుజు పాదం దగ్గర, కురచ ఇనప గుమ్మం వార గడ్డం పహారా వాడొకడు జోగుతున్నాడు. అతని మోకాళ్లమీద వంగిన కత్తి వుంది. అతని పక్కన పరిచిన కంబళీమీద కాసిని అట్లూ, కాసిని నల్లని దిర్హమ్‌లున్న కొయ్య పాత్ర వున్నాయి. ఖైదీల కుటుంబాలు ఇప్పుడు వాళ్ల గురించి పట్టించుకోవడం లేదు. ఆ కుటుంబాలిప్పుడు తమ గురించే ఆలోచించుకుంటున్నాయి. తాము ఎలా బతికి బయటపడాలి అని. కాని వాతాయన కంతల్లోనుంచి యెండిపోయిన చేతులు, అణిగిన అరుపులు విన వచ్చాయి.

"నిర్భాగ్య దరిద్రులమైన మమ్మల్ని గుర్తుంచుకొన్నారా? అంధకారంలో బతికే వాళ్లకి ఓ రొట్టె ముక్క విసరండి!"

"హేయ్, ముసలి తాతా! ఇలా రా" అని కార కోంచర్ పహారావాణ్ణి పిలిచాడు.

అతను నిద్రమగత విడిచి ఆ రౌదుమీద దృష్టి లగ్నం చేశాడు. కాని కదిలే ప్రయత్నం చెయ్యలేదు.

"యేం కావాలి?"

కార కోంచర్ అతని దగ్గరికి వెళ్లాడు. అతను నుంచున్నాడు.

"ఇదిగో కొంత రొఖ్ఖం. చెప్పు, బురుజులో కొత్త ఖైదీలు చాలా మంది వున్నారా?"

"వున్నారే అనుకో, నీకేమిటి సంబంధం?"

"చాలా మంది పాత ఖైదీలు కూడా వున్నారేమోనే?"

"వాళ్లు గనక ఇంకా ఆ మురికికీ, నల్లులకీ, ఆకలికీ చావకుండా వుంటే ఇంకా బోలెడు మంది ఆశ కొక్కెం పట్టుకు వేలాడుతూ వుంటారు".

"ఇదిగో ఇంకో దినార్. చెప్పు, ఆడ ఖైదీలు యెక్కువ మంది వున్నారా?"

"ఇద్దరు ముసలి ముండలున్నారు. సుల్తాన్ బంధించాడు, వాళ్లు మంత్రగత్తెలు. అతను జబ్బు పడాలని వాళ్లు అనుకున్నారు".

"పడుచు అమ్మాయిలు లేరా?"

"నన్ను విసిగిస్తున్నావేమిటి? ఎవరు నువ్వు న్యాయాధికారివా తలారుల సర్దారువా, మసీదు ముఖ్య ఇమామ్‌లలో ఒకడివా, యెవరివి? నీతో మాట్లాడుతూ కనిపించడమే! బహుశా నువ్వు బందిపోటువేమో, ఖూనీకోర్లయిన కొంతమంది నీ వాళ్లని కాపాడాలనుకుంటున్నావేమో. ఇదుగో నీ డబ్బు, ఫో అవతలికి".

కార కోంచర్ కొరడా యెత్తి ఆ కాపలావాణ్ణి కొట్టబోయాడు. ఇంతట్లోకీ ఎవరిదో చెయ్యి అతన్ని ఆపింది. అతను తిరిగి చూశాడు. భుజాల దాకా జుట్టు వేలాడుతూ మొత్తం చింకి పాతలతో వున్న పొడుగాటి వృద్ధుడొకడు కొరకొర చూసే కార కోంచర్‌కి కనిపించాడు.

"నీకిక్కడ మా పద్ధతులు తెలియవులా వుంది. అందుకే కాపలావాడితో ఇలా మాట్లాడుతున్నావ్. పద పోయి మాట్లాడుకుందాం, నీకు విషయాలు వివరిస్తాను. చూడు, నువ్విక్కడ మాట్లాడుతూ వుంటే ఇక్కడ పది మంది ఇప్పుడే గుమ్మంలో నుంచి వచ్చారు, తలార్లు సుల్తార్‌గారి జాందర్లు! వాళ్లు సర్వదా ఈ తావుని ఓ కంట కనిపెట్టే వుంటారు. నిన్ను బంధించడానికి వస్తున్నారు. గబగబా పోదాంపద: నన్ను నమ్ము, వెనక రా".

కార కోంచర్ గుర్రాన్ని అదిలించి ఆ వింత వృద్ధుడి వెనక వెళ్లాడు. పక్క వీధిలో ఆ వృద్ధుడు వేగం హెచ్చించి తర్వాత గుడ్డి సందులోకి తిరిగాడు. అక్కడ ఆగాడు.

"నేను మాట్లాడుతూ వుంటే ఆశ్చర్య పడకు. ఒక యేడాదిగా మా యజమానికి ఆమారం తీసుకెడుతూ బురుజుకి వెడుతున్నాను. ఆయన్ని వాళ్లు చీకటి కొట్లో బంధించారు. ఆయన పేరు మీర్జా యూసఫ్. ఖోరెస్మ్ షా మహమ్మద్ రాయసగాడు. షా ఆయనంటే అనుగ్రహం

చూపించాడు, ఆయనంటే ఇష్టం. కాని ముసలి నక్క తుర్కాన్ ఖాతూన్ ఖోరెస్మ్‌లో 'ఆగ్రహపు మహా కరవాలం, శక్తికి బల్లెం' అయింది. మీర్జా యూసఫ్‌ని బురుజు చీకటి కొట్లోకి తోయించింది".

"యెందుకని?"

"యెందుకంటే ఆయన తన గ్రంథంలో ఆమెని 'శక్తివంతమైన ఖోరెస్మ్ అంగీమీద నల్లని మచ్చ' అన్నాడు. ఆమె నీచత్వాన్నంతనీ వర్ణించాడు. ఆమెకీ విషయం చెప్పారు. నేనిప్పుడు నగరంలో అడుక్కుంటూ తిరుగుతున్నాను. దురదృష్టవంతుడైన వృద్ధుడికి దాన్ని తీసికెళ్లి పెడుతున్నాను. ఈ అజ్ఞాత ద్రిమ్మరులు నగరంలోకి చొచ్చుకురావడం కోసం చూస్తున్నాను. వాళ్లు జనాన్ని ఖతం చేసేస్తారు ఈ జాండర్లు యెలకల్లా పారిపోతారు. నేను బురుజు దగ్గరికి వెళ్లి ఈ లుచ్ఛా కాపలావాణ్ణి నా చేతులతో పీకపిసికి చంపేస్తాను. ఖైదీలందర్నీ విడిపించేస్తాను. వాళ్లతో వృద్ధ మీర్జా యూసఫ్‌ని కూడా. అప్పుడు మా దేశం వెళ్లిపోతాను".

"మీ దేశం చాలా దూరం వుందా?"

"ఆఁ! నేను రష్యన్‌ని. నన్ను సక్లాబ్ అంటారు. కాని మా భాషలో తాతస్లావ్కో".

కార కోంచర్ ఆలోచనలో పడ్డాడు.

"చెప్పు బెక్ యోధుడా! ఎవరి కోసం వెతుకుతున్నావ్? బహుశా నేను సాయం చెయ్యగలనేమో" అన్నాడు ఆ ముసలతను.

"ఈ బురుజులో యెవళ్లేనా ఆడవాళ్లున్నారా? ఇద్దరు ముసలమ్మలు మాత్రం వున్నారని కాపలా వాడన్నాడు".

"వాళ్లల్లో యెవళ్లనా తుర్క్‌మెన్‌లున్నారా?"

ముసలాడు ఓ క్షణం ఆలోచించాడు.

"చూస్తాను. ఈ ముసలి కాపలా వాడికి డబ్బంటే ఇష్టం. తను చింకి పాతలు వేసుకుంటాడు, గాని ధనికుడే. ఖైదీల కిమ్మని వాడికిచ్చిందాంట్లో సగం కూడా వాళ్లకి ఇవ్వడు. మిగిలిందంతా తనే వుంచేసుకుంటాడు. వాడికో ఇల్లూ, తోటా, యెనమండుగురు పెళ్లాల జనానా వున్నాయి. నీకు సాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను. ఆ చెట్టు కింద పాత గుమ్మం చూశావా? అక్కణ్ణే మా ముసలి యజమాని మీర్జా యూసఫ్ వుంటూ వుండేవాడు. ఆయన దగ్గర ఒక విద్యార్థిని బింట్ జాంకిజా వుండేది. పుస్తకాలు తిరగ రాయడంలో ఆయనకి సాయపడేది. కాని ఆమె బుఖారాకి వెళ్లిపోయింది, మాయమైపోయింది. అందుకని నేను ఒంటిరినైపోయాను..."

"నిన్ను నమ్ముతున్నాను, పెద్దాయనా సక్లాబ్. నన్ను నువ్వు మోసం చేస్తావని అనుకోను. రేపు ఉదయం ఇక్కడికి వస్తాను..."

# గుర్‌గంజ్‌ని పట్టుకోవాలంటే –
# దాన్ని ధ్వంసం చెయ్యాలి

ఖోరెస్మ్‌కి చేరింతర్వాత మంగోలు సైన్యం వెంటనే రాజధాని ముట్టడికి పూనుకోలేదు. మొదటగా మంగోలులు, గుర్‌గంజ్ చుట్టూతా గ్రామాలలో చెదిరిపోయారు. గ్రామస్థుల్ని ఖైదీలకి మళ్లే తమ శిబిరాలకి తోలుకుపోయారు. జెంఘిజ్ ఖాన్ ఇద్దరు కొడుకులూ – ఉగేదీయ్, జగతాయ్‌లు – తిల్లాల ప్రాసాదంలో సిద్ధపడ్డారు. వాళ్ల సైన్యాధిపతులు హడావుడిగా యంత్రాలనీ, పెద్ద వడిసెల్లనీ, చక్రాలమీద నడిచే “తాబేళ్ల”నీ నిర్మించ పూనుకున్నారు. చాలా దూరం నుంచి తీసుకువచ్చిన చైనా నిర్మాణ నిపుణులు గబగబా నగరాన్ని పట్టడానికి సాయపడే దాడి యంత్రాల్ని నిర్మించ పూనుకున్నారు.

ఒక చిక్కు యేమంటే చుట్టు పక్కల వూళ్లో రాళ్లు లేకపోయాయి. విసరడానికేమీ లేకపోయింది. మల్బరీ చెట్లనుంచి దుంగల్ని పెద్ద కొయ్య బంతుల్లా కోసి అవి తగినంత బరువు యెక్కేదాకా నీళ్లల్లో నానబెట్టాలని చైనా వాళ్లు ప్రతిపాదించారు.

మంగోలులు విడివిడి దళాలుగా నగరంలోని చాలా దిశలలో ప్రత్యక్షమై ద్వారాల గుండా ఇవతలికి వచ్చే రౌతులమీద దాడి చేశాయి. వీళ్లని మాటునుంచి బయటికి వచ్చేటట్టు చెయ్యడానికి గాను వాళ్లు పారిపోయారు. కాని గుర్‌గంజ్ సైనికులకి గుణపాఠాలు వున్నాయి. వాళ్లు గోడల వెనక్కి రక్షణ కోసం పారిపోయారు.

నగరంలో సైన్యానికి అధిపతిగా సుల్తాన్ ఖుమార్ తెగిన్ వున్నాడు. అతని ముఖ్య సర్దారులు బుఖారా రక్షకుడు ఒగుల్ హజీబ్, ఎర్‌బుకా పహ్లవన్, ఆలీ దురుగియ్‌లు. యుద్ధ మండలిలో సుల్తాన్ ఖుమార్ తెగిన్ మంగోలుల నుంచి వచ్చిన సంతకంలేని కాగితాలు చదివాడు. ద్వారాలు తెరవమనీ, మంగోలుల్ని నమ్మమనీ వాళ్లు యెవళ్లకీ హాని చెయ్యరనీ వాటిల్లో వుంది.

“వాళ్లతో యేదో సర్దుబాటు కొస్తే పోలా?” అని సుల్తాన్ అడిగాడు. “వాళ్లకి పెద్ద కన్నం ఇచ్చి, శాంతియుతంగా సమస్యని అంతం చేసుకోవడం మెరుగు, మొత్తం జనాభాని దారుణ హింసలకి, హత్యకి, అగ్నిమంటలకి ఆహుతి చెయ్యడం కంటే” అన్నాడు.

ఒగుల్ హాజీబ్, ఇతరులూ జవాబు చెప్పారు:

"పాదుషా! మంగోలులు బుఖారాలో, సమర్‌కండ్‌లో, మెర్వ్‌లో ఇతర నగరాలో చేసిన వాటిని మర్చిపోయావు. అక్కడ కూడా అక్కడి వాళ్లు దయ చూపించమని అడిగి ఆయుధాలు కింద పెట్టారు. వాళ్లల్లో భేషైన పనివాళ్లని యెంచి మంగోలులు తమ శిబిరాలకి పంపేశారు, మిగిలిన జనాభాని ఇనప గుబ్బలున్న గదలతో కొట్టి చంపేశారు".

"అయినా కూడా మంగోలులకి కావలసిందేమిటో కనుక్కోవాలి".

ఆ సాయంత్రం సుల్తాన్ ఖుమార్ తెగిన్ చిన్న పరివారాన్ని తీసుకుని గుర్‌గంజ్ బయటికి వెళ్లి ఉగేదీయ్, జగతాయ్‌లు విందు చేసుకుంటూ వున్న ప్రాసాదానికి వెళ్లాడు. వాళ్ల ముందు సామంతుడిలాగా చేతులు కట్టుకు నిలబడ్డాడు.

"యేం తెచ్చావ్? గుమ్మాల బంగారు తాళాలు యేవి?" అని యెకసక్కెంగా ఉగేదీయ్ అడిగాడు.

"ప్రాచ్య దేశ పాలకుడు జెంఘిజ్ ఖాన్ ఔన్నత్యం ముందూ, శక్తి ముందూ నేను మోకరిల్లుతున్నాను. ఆయన్ని కొలవాలనుకుంటున్నాను, ఇతర బెక్‌ల మాదిరీ".

"మాకు కావలసింది గుర్‌గంజ్, నీలాంటి ఫిరాయింపు దార్లు కాదు" అన్నాడు ముసురు ముఖం జగతాయ్. "నీ మాటని నమ్మగలమా నువ్వు నీ సొంత ప్రజల్ని వదిలేసి వాళ్లకి వ్యతిరేకంగా వెళ్లదలచుకున్నప్పుడు? – ఇతన్ని బంధించండి!" అన్నాడు.

తలారులు ఖుమార్ తెగిన్‌నీ, అతని బృందాన్నంతట్నీ పట్టుకున్నారు. వాళ్ల బట్టల చీల్చేసి, రక్తం చిందించకుండా వాళ్ల నడుములు విరిచేసి నందులోకి విసిరేశారు. అక్కడ వాళ్లింకా బతికుండగానే నక్కలూ, కుక్కలూ పీక్కుతినేశాయి.

జెంఘిజ్ ఖాన్ పెద్ద కొడుకు జూచి ఖాన్ సైన్యంతో గుర్‌గంజ్‌ని చేరేటప్పటికే ఆ నగరం మంగోలు సైనికులతో దగ్గరగా చుట్టిముట్టి వుంది. వడిసెలలని గోడలదాకా తీసుకువెళ్లేందుకు గాను మూడు వేలమంది మంగోలులు, పెద్ద బృందం ఖైదీలు కాలవమీద వంతెనని మరమ్మత్తు చేస్తూవున్నారు. హఠాత్తుగా, తుర్క్‌మెన్ కార కోంచర్ నాయకత్వాన ఆశ్విక విభాగం ఒకటి దూకుడుగా గుర్‌గంజ్ ద్వారం దాటి బయటికి వచ్చింది. వాళ్లు పనిచేస్తూ వున్న మంగోలులమీద ఉట్టి పాటున పడ్డారు. అందర్నీ ఖతం చేసేసి వంతెనమీద శవాల గుట్ట పోగేశారు. ఈ విజయం ముట్టడికి గురయిన వాళ్లకి ఉత్సామాన్నిచ్చింది.

అప్పుడు మంగోలులు మొత్తం సైన్యాన్ని నగరానికి తీసుకువచ్చారు. తమ ముందు అనేక వేలమంది బందీలైన గ్రామస్థుల్ని నడిపించారు. గోడలని ఆవరించి వున్న కందకాలని పూడ్చమని వాళ్లని బలవంతం చేశారు. ఆ తర్వాత ముట్టడి యంత్రాలని లాగడం, నగరాన్ని ముంచెత్తడం సాధ్యమయ్యాయి. గట్టిగా నీళ్లల్లో నానిన కొయ్యబంతుల్ని, దహ్యనీయ తైలాల

చైనా జాడీలని వడిసెలలు విసిరాయి. మహా జ్వాలలు రేగి చెక్కఇళ్లు విపరీతంగా అంటుకుపోయాయి. వాటిని ఆర్పడం అసాధ్యం అయింది.

ఉత్తరాన జూచి ఖాన్ సైన్యాలు ఇంకా కచ్చితంగా పనిచేశాయి. బందీలు గోడల కింద గుహ తవ్వారు. మంగోలులు నగరంలోకి చొచ్చుకుపోయారు. భీకర పోరాటం తర్వాత ఉత్తరపు బురుజు మీద జెంఘిజ్ ఖాన్ కొడుకు పెద్ద శ్వేత పతాకం యెగిరింది.

ఇది జగతాయ్‌కి అసూయనీ, ఆగ్రహాన్నీ కలిగించింది. అతను విభాగం తర్వాత విభాగాన్ని గుర్‌గంజ్ గోడలకేసి పంపుతూనే వున్నాడు. కాని కుడ్య రక్షకులు అనూహ్యమైన పట్టుదలని చూపించారు. గోడలపైకి యెక్కే వాళ్లమీద ఇటికలు విసిరారు. సలసలకాగే నీళ్లనీ, మరిగే తారునీ వాళ్లమీద దిమ్మరించారు. దాంతో వాళ్లు కాల్పులకి బొబ్బ లెక్కిపోయి గుంపులు గుంపులుగా పడిపోయారు.

# "శాశ్వత విస్మృత శిఖరం"లో కార కోంచర్

సక్లాబ్‌ని కలుసుకుందామని చెట్టు కింద వున్న పాత గుమ్మం దగ్గరికి కార కోంచర్ చాలా సార్లు వెళ్లాడు. ఆఖరికి అతన్ని కలిశాడు. ఆ ముసలాడు ముందటిలాగా చింకి పాతల్లో లేడు. చారల అంగీ తొడుక్కుని తలకి నీలం గుడ్డ చుట్టుకున్నాడు.

"మన్నించు, ధైర్యంగల బెక్ యోధుడా! నేను చూసిందీ చేసిందీ వెంటనే నీకు చెప్పలేకపోయాను. శిఖరం పహారా వాడు మాట్లాడాడు కాదు. యెన్ని రకాలుగానో వాణ్ణి కదిపాను, శిఖరం వూడ్చి, ఆలికి ముగ్గులు పెట్తానన్నాను. కాని వాడికి పిచ్చి యెక్కువైందంతే. కాని తన కొంపలో రోజుకి రెండట్లు పెడితే పనిచేస్తాయని అనగానే సంబరపడ్డాడు. తన యెనమండుగురు భార్యలకీ కాపలా పెట్టాడు నన్ను. వాడి దుష్ట ముసలి ప్రథమ భార్యకి దెబ్బ తగిలించగానే నాకీ అంగీ, పాత తలగుడ్డ బహుమతీగా ఇచ్చాడు.

"పెళ్లాల గురించీ, అంగీల గురించీ ఈ చెత్తంతా యేమిటి?" అన్నాడు కార కోంచర్ మండిపడుతూ. "నీకు అయిదు బంగారు నాణేలు ఇచ్చేను. యేం చేశావ్? నాక్కావలసింది కనిపెట్టావా లేదా?" అని అడిగాడు.

"కనిపెట్టాననుకో. నాజర్ బోబొ నోరు మెదపక పోతే వాడి పెళ్లాలూ మెదపరా యేం? యెప్పుడో వాళ్లు వాణ్ణుంచి అంతా రాబట్టారు, నేను వాళ్లనుంచి రాబట్టాను... శిఖరం ఖైదులో అనేక చిన్న గదులున్నాయి. ఈ గదుల దగ్గరికి పోవడం కష్టం. చినికిపోయిన తాళ్ల బద్దీ పట్టుకుని జవజవలాడే మేడ మెట్ల మీదుగా వెళ్లాలి".

"అయితే ఇప్పుడు ఈ గదుల్లో యెవళ్లున్నారు?"

"ఖోరెస్మ్ షాకి ఆగ్రహం తెప్పించిన వాళ్లు. కాని ఒక గదిలో, సరిగ్గా సరంబీ కింద, ఒక పడుచు తుర్క్‌మెన్ అమ్మాయి వుంది".

"ఆమె పేరు? –" అతనా ముసలాడి భుజం పట్టుకున్నాడు.

"ఆమె పేరు గుల్ జామిల్‌ట".

"తక్షణం అక్కడికి తీసికెళ్లు నన్ను".

"యెవళ్లేనా 'తక్షణం' యెలా చేస్తారు? రెండు వేల మంది జాండర్లు కోట లోపల యింకే పనీ లేక చచ్చేటంత విసుగెత్తి కూర్చున్నారు. యెవడేనా దూసుకువస్తారా అని వేళ్లు దురద పెట్టి కూర్చున్నారు. నువ్వేమో యెకాయెకీ శిఖరం దగ్గరికి పోతానంటావు. నిన్నే శిఖరంలో పడేస్తారు".

"ఛప్ నోర్మూయ్యి, పిరికి పందా! శిఖరం దగ్గరికెళ్లి అక్కడ నా కోసం చూస్తూ వుండు. నే ఒచ్చి అందర్నీ తాట ఒలుస్తాను" కార కోంచర్ గుర్రాన్ని కొరడాతో కొట్టి ధూళి మేఘం కమ్ముకుంటూ వుండగా ఇరుకు సందులో మాయమైపోయాడు.

కమ్మరం వాళ్లు, రాగి పని వాళ్లు, కవచాలు చేసేవాళ్లు పని చేస్తూ ఉన్నారు. కాని ఆ పని అర్థమనస్కంగానే వుంది. పూర్తి ఒత్తిడితో పని చేస్తున్న వాళ్లు ఆయుధాలు తయారు చేస్తున్న వాళ్లే. ప్రళయం ముంచుకొస్తూ వుంటే రాగి పాత్రలు, కూజాలు, నగిషీ పనులు, గుర్రాలు ముస్తీబుకి అలంకారాలు యెవరికి కావాలి?

కొంత మంది కమ్మరం వాళ్లు కొట్లాడుకుంటూ, తిట్టుకుంటూ కార కోంచర్‌కి కనిపించారు. కఠినంగా కనిపించే రౌతు రాక వాళ్ల కుతూహలాన్ని పెంచింది. వాళ్లు గమ్మునైపోయారు. ఈ నల్ల బట్టల రౌతుకి యేం కావాలో?

"హేయ్! కమ్మర్లూ, ఇనప చేతుల వాళ్లూ, ఇత్తడి ఛాతీలూ! యెంత కాలం ఈ ఖాన్లూ, బెక్‌లూ మనతో ఆడుకుంటారు? ఒకప్పుడు మిమ్మల్ని పన్నులతో పీల్చి పిప్పి చేసిన వాడు ఖోరెస్మ్ షా. అతను బంగారం నింపిన భోషాణాలతో ఇరాన్‌కి పోయాడు. అదృష్టవశాత్తూ దుష్ట జిత్తులమారి నక్క అతని తల్లీ ఆ దారే పట్టిపోయింది. ఇప్పుడు తనకి తనే ఎన్నుకున్న సుల్తాన్ ఖుమార్ తెగిన్ శత్రు పక్షానికి పోయాడు, బహుశా ఈ పాటికి గుర్‌గంజ్‌లోకి చొచ్చుకుపోవడానికి గోడ ఎక్కడ బలహీనంగా వుందో వాళ్లకి చెప్పే వుంటాడు. ఎంత కాలం కళ్లు మూసుకుని మళ్లీ ఇంకో సుల్తాన్ మిమ్మల్ని దగా చెయ్యడం కోసం నిరీక్షిస్తారు? దేనికి మీ నిరీక్షణ? పదండి కోటకి పోయి ఈ దుర్గంధ భూయిష్టమైన గూటిని కూలగొడదాం, శిఖరపు ఇనప తలుపుల్ని బద్దలు కొట్టి ఖైదీలని చీకటి కొట్లోనుంచి విడిపిద్దాం. అక్కడున్న వాళ్లేం బందిపోట్లూ హంతకులూ కారు. సుల్తాన్‌కి ఇష్టంలేని విషయాలు చెప్పిన నిజాయితీ పరులు!"

"పదండి పోదా! ఖోరెస్మ్ షాల కోటని ధ్వంసం చేద్దాం. శిఖరాన్ని కూలగొడదా" అని అరిచారు కమ్మర్లు.

"మీ సమ్మెట్లు, పట్టకార్లు, చిత్రికలు అన్నీ తెండి. గొలుసుల్ని విరగ్గొట్టడానికవసరమైన అన్నిటినీ తెండి. మొత్తం తెచ్చి, చీకటి కొట్లలోనుంచి అవసానదశలో వున్న మీ సోదరుల్ని విడిపించండి".

కమ్మరం వాళ్లు సమ్మెట్లనీ, కత్తుల్నీ, బల్లేల్నీ అంది పుచ్చుకుని ఒక గుంపుగా కోటకేసి బయల్దేరారు.

కొంతమంది జాండర్లు వీళ్లని యెదిరించి, తరిమెయ్యడానికి ఇవతలికి వచ్చారు. వీళ్లు వాళ్లని చంపేసి మడతొక్కేశారు. కమ్మర్లు కోటని ముట్టడిస్తూ వుంటే, శిఖరం ఇనప తలుపుల్ని బద్దలు కొట్టడానికి కొంతమంది కార కోంచర్‌కి సాయం చేశారు. పహారావాడు నాజర్ బోబొని యెత్తి కుదేసి పక్కన పడేశాడు. ఖైదీలని తన సొంత బిడ్డల్లా యెప్పుడూ చూసుకున్నానని అతను మూలిగాడు.

కమ్మర్లు వెంటనే ఇనప తలుపుల్ని తెరిచారు.

ఖైదీలు బయటకి యెక్కి రావడం మొదలుపెట్టారు. చింకిపాతలతో వున్నారు. మురికి వోడుతూ వున్నారు. వాళ్ల గోళ్లు బారుగా పెరిగి వున్నాయి. వాళ్ల జుట్టు అడివి జంతువుల బొచ్చులా పెరిగి వుంది. ఎన్నో యేళ్లు చీకటి కొట్లలో వుండడంవల్ల వాళ్లు సగం గుడ్డి అయి తలలు గోడలకి కొట్టుకున్నారు. చేతుల్తో దారి తడుముకున్నారు. నవ్వుతున్నారు, యేడుస్తున్నారు. మరో సారి స్వేచ్ఛా జీవుల మధ్యకి, పగటి వెల్తురులోకి రావడం అనే అదృష్టాన్ని నమ్మలేకపోతున్నారు.

కార కోంచర్ మండే కాగడా తీసుకుని శిఖరం లోపలికంటా వెళ్లాడు. చెమ్మగా, ముక్కగా వుంది అక్కడ. ప్రార్థన గొణుగుతూ, భయపడిపోయి ముందు వున్న పహారా వాణ్ణి గెంటేశాడతను. పహారావాడు జవజవలాడుతూ వున్న మెట్లు యెక్కాడు.

కార కోంచర్ వంపు తిరిగిన సరంబీ దగ్గరికి యెక్కి సరాసరిపోగానే పహారావాడు ఇక ఇనప గుమ్మం దగ్గర ఆగిపోయాడు. ఇనప కమ్ములు కట్టిన చిన్న నలు చదరపు కంత వుంది అక్కడ.

"ఇక్కడ జనాభాలోని ఒక ఆడమనిషిని 'చచ్చిపోయే దాకా' శాశ్వతంగా బంధించారు. ఆమె షా మహమ్మద్‌మీదే చెయ్యి యెత్తే సాహసం చేసింది" అన్నాడతను.

కార కోంచర్ తలుపులోని చిన్న కంత దగ్గర కన్ను పెట్టాడు. చిరిగిన కంబళీ ముక్క అతనికి కనిపించింది.

ఇంతట్లోకీ ఒక నీడ అతని ముందు తచ్చాడింది. అతనికి ఒక నల్లని ముఖం కనిపించింది. నిశ్చల దృక్కుతో నల్లని పెద్ద కళ్లు అతనికేసి చూశాయి.

"నేను" అనగలిగాడంతే అతను.

బలహీనంగా, పిరికిగా వున్న గొంతుక గొణిగింది:

"నీ ముఖం వెలుతురులో పెట్టు, నాక్కనిపిస్తుంది".

కార కోంచర్ వెనక్కి అడుగేసి, కాగడా యెత్తి పట్టుకున్నాడు. "అడవి జంతువు పంజా దెబ్బమచ్చ నీ ముఖం మీద కనిపిస్తోంది. నువ్వే, యెవ్వరూ యేదీ ఆపలేని నువ్వే".

ఓ కమ్మరి సమ్మెటతో తాళం బద్దలు కొట్టాడు. ఇనప తలుపు తెరుచుకుంది. గుల్ జామిల్ చేతులతో ఒళ్లు కప్పుకుని ఇంకా కూర్చునే వుంది.

"నా బట్టలన్నీ చిరిగిపోయాయి. నీ ముందు నుంచో లేను".

కార కోంచర్ వెనక్కి అడుగు వేసి, ఆ పడుచు కమ్మరితో చెప్పాడు:

"నువ్వు ఆడమనిషిని చూడకూడదు. నీ చొక్కా ఆమెమీదకి విసురు. నీకింకోటి ఇస్తా, పట్టుది". అతను శిఖరం కప్పుకేసి తిరిగి మెట్లు యెక్కాడు. అవి ఇరుగ్గా వున్నాయి. సగం శిథిలం అయిపోయాయి.

చుట్టూతా అంతటా అతనికి పొగ సుళ్లు కనిపించాయి. రవ్వలు, మంటలు రేగుతూ ఆకాశానికి లేచాయి. నగరం మంటల్లో వుంది. నగర కుడ్యాలవార ధూళి మేఘాల్లో రౌతులు కదుల్తున్నారు. దూరంలో వున్న శిఖరంమీద జూచి ఖాన్ యేడుతోకల తెల్ల జండా యెగురుతోంది.

కమ్మరతని చొక్కా వేసుకుని గుల్ జామిల్ కప్పుమీదకి వచ్చింది. నాజుగ్గా సన్నగా వున్న యువకుడిలా వుంది. కనుబొమ్మలు ఆశ్చర్యంగా యెత్తి నగరంకేసి చూసింది.

"గుర్‌గంజ్‌కి యేమైంది? గోడల వార పరిగెత్తే ఆ భయంకరమైన మనుషులెవరు?"

"యుద్ధం ఇక్కడికీ వచ్చింది. గుర్‌గంజ్‌ని ముట్టడించారు. ఇప్పటి నుంచీ నువ్వూ నేనూ కలిసి యుద్ధం చేద్దాం. యుద్ధ జ్వాలలూ, విచారకరమైన నీ కన్నీళ్లూ మనల్ని యేకం చేశాయి" అన్నాడు కార కోంచర్.

"ఈ భయంకరమైన బురుజులో నేనన్నీ మర్చిపోయాను. ద్వేషించడం ఒక్కటే నే మరిచిపోలేదు. నీతో యెక్కడికన్నా వస్తాను. ఆగ్రహంతో చిందులు తొక్కే ఆడపులిలాగా, యేం పట్టించుకోని పాత గుల్ జామిల్‌లాగా కాదు..."

మంగోలులు దాడి చెయ్యమని తోలిన బందీల నిరంతర తాడనకే నగరంలో యెక్కువ భాగం ధ్వంసం అయిపోయింది. అయినా గుర్‌గంజ్ నివాసులు తెగించిన ఆగ్రహంతో తమని తాము రక్షించుకోవడం కొనసాగిస్తూనే వున్నారు. మంగోలులు ఒక పేట తర్వాత ఇంకోటిగా నగరాన్ని పట్టుకున్నారు. ఆరుబయట మైదానంలో గుర్రాలమీద యుద్ధం చెయ్యడానికి అలవాటుపడ్డ మంగోలులకి, కాలిపోతూ పడిపోతూ దారికి అవరోధం అవుతూ వున్న ఇళ్ల శిథిలాల ఇరుకు వీధుల్లో వెళ్లడం కష్టంగానే వుంది. కాని పట్టుదలగా ముందుకి పోయారు. తమ నిడుపాటి బాణాలని గురితప్పకొట్టి రక్షకుల్ని ముంచెత్తేశారు.

యుద్ధం చేసే వాళ్లందర్లోకీ తెగించి పోరాడేవాళ్లు గుర్‌గంజ్ చేతి వృత్తుల వాళ్లు, తమని బందీలుగా పట్టుకుపోతే యేం మూడేదీ వాళ్లకి ముందే తెలుసు. దృఢంగా, నైపుణ్యంతో వున్న వాళ్లని మంగోలులు సుదూర పచ్చిక బీళ్లకి పంపేస్తారు. ఇక యేం విలువలేని ఇతరులని చంపేస్తారు.

పెద్ద ఆడవాళ్లూ, చిన్న అమ్మాయిలూ తమ తండ్రులతోబాటు, భర్తలతోబాటు, అన్నదమ్ములతోబాటు పక్కపక్కనే ఇళ్ల కప్పులమీద నుంచి, గోడలమీదనుంచి పోరాడేరు.

వాళ్లు బాణం దెబ్బలకి ఒరిగిపోతే ఆడాళ్లు కొత్త బాణం దెబ్బలు తగలకుండా ఇటికలతోటీ, మట్టితోటీ గాయపడ్డ వాళ్ల చుట్టూ గోడ కట్టేవాళ్లు. ఖోరెస్మ్ విషాదపతన గాథలో గుర్‌గంజ్ రక్షణ అతివింతైన పుటని లిఖించింది.

నగరంలో ఇక మూడు పేటలు మాత్రమే పట్టుబడకుండా మిగిలిపోయినప్పుడు హింసకి, తాకిడికి నలిగిపోయిన గుర్‌గంజ్ రక్షకులు లొంగిపోవాలని నిర్ణయించుకున్నారు. దయ చూపించమని అర్థిస్తూ జూచి ఖాన్ దగ్గరికి దూతల్ని పంపారు. జెంఘిజ్ ఖాన్ కొడుకు జవాబిచ్చాడు:

"ఇంతకుముందే దీన్ని గురించి యెందుకనుకోలేదు? నగరంలోకి నా సైన్యాలు వచ్చినప్పుడే యెందుకు లొంగిపోలేదు? ఇప్పుడు యెంతో మంది నా మంచి సైనికుల్ని నష్టపోయాక మిగిలిన వాళ్ల ఆగ్రహానికి కళ్లెం వెయ్యగలనా లేక కొల్లగొట్టకుండా ఆపగలనా? మీకు దయ చూపించను".

మంగోలులు నగరంలోకి చొచ్చుకుపోయారు. కొంతమందిని బందీలుగా పట్టుకున్నారు, మిగిలిన వాళ్లని చంపేశారు. ఆస్తినంతనీ కొల్లగొట్టేశారు.

ఖాన్ జగతాయ్ ఆజ్ఞమేరకి మంగోలులు ఆనకట్టని బద్దలు కొట్టేశారు. ఖోరెస్మ్ మణి గుర్‌గంజ్ తన అన్నగారి చేతిలోకి పోవడం అతనికి ఇష్టం లేక అలా చేయించాడు. నీళ్లు ఆ మహా నగరాన్ని వరదతో ముంచెత్తేశాయి. భవనాలని ధ్వంసం చేసేశాయి. ఆ నగర ప్రాంతం చాలా యేళ్ల తర్వాత కూడా నీళ్లల్లో మునిగే వుండిపోయింది. తాతార్లనుంచి పారిపోయిన వాళ్లు సుళ్లు తిరిగే నీళ్లల్లో మునిగిపోయారు లేదా శిథిలాల్లో నాశనం అయిపోయారు.

జలప్రళయంలా విజృంభించిన నీళ్లు ఖోరెస్మ్‌లోని అనేక ఇతర నగరాలనీ ముంచేశాయి. నది గమనమే మారింది. తర్వాత చాలా కాలం ఇసక మైదానాల మీదుగా అబెస్కున్ సముద్రంలోకి ప్రవహించింది.

కార కోంచర్ గాని, గుల్ జామిల్ గాని యేమైందీ హాజీ రహీమ్‌కి తెలీలేదు. చాలా కాలం తర్వాత హాజీ రహీమ్ జానపద కథకుల ద్వారా కార కోంచర్ గురించి కథలు విన్నాడు. జల ప్రళయంలో సుళ్లు తిరిగే వరదలో కార కోంచర్, గుల్ జామిల్ కొట్టుకుపోయారు. కథకులు "నిజమై ప్రేమకి మృత్యువు తప్ప వేరే ముగింపు లేదు" అనే సూక్తితో ముగించారు. వినేవాళ్లు ఆ పడుచు పిల్ల దురదృష్టానికి విచారపడితే ఓ కథకుడు అంటాడు: "తెలిసిన వాళ్లనుకునే మనుషులు నాకు మరో సంగతీ చెప్పారు. కార కోంచర్ జైహున్ నీళ్లల్లో చనిపోలేదు. అతను తన కర్రి గుర్రం మీద నది వరదలో ఈదాడు. గుల్ జామిల్‌ని రక్షించాడు. ఆమెని కారకూమ్ లోపలికంటా తీసుకుపోయాడు. తన యుర్త్‌కి తీసుకుపోయాడు. అక్కడ వాళ్లు చాలా కాలం సుఖంగా బతికారు, మీ అందర్లాగానే అని నేను ఆశిస్తాను నిజంగా".

# యువ బటూ ఖాన్ దగ్గర హాజీ రహీమ్

"దుర్బలంగా వున్న కూనని యేవ
గించుకోకు-అది సింహంది కావచ్చు".
(అరబ్ సామెత)

విధ్వంసక మంగోలు దుండగీళ్లనుంచి ప్రయాసమీద హాజీ రహీమ్ బయటపడి జూచి ఖాన్ శిబిరానికి చేరగలిగాడు. అతని కూచి కుళ్లాయి నుదుటి దగ్గర కట్టుకున్న స్వర్ణశ్యేన ఫలకం అతన్ని రక్షించింది. మంగోలు మహా సామ్రాజ్యపు వాయవ్యమూల ప్రాంతాన్ని పాలించేవాడి తెల్ల యుర్త్‌కి చేర్చగలిగింది. మంగోలు పాలకుణ్ణి పరివేష్టించి వున్న వాళ్లల్లో అతనితో విభేదించ సాహసించగలవాడు జెంఘిజ్ ఖాన్ పెద్ద కొడుకు జూచి ఖాన్ అక్కడే అని హాజీ రహీమ్ విన్నాడు. జెంఘిజ్ ఖాన్ తన మొదటి కొడుకుని నమ్మడనీ, తనకి వ్యతిరేకంగా కుట్ర చేస్తాడని అతన్ని అస్తమానూ అనుమానిస్తాడనీ కూడా విన్నాడు. అందుకనే జెంఘిజ్ ఖాన్ అతన్ని బహుదూరంలో మారుమూల వున్న ప్రాంతానికి పాలకుడుగా నియమించాడట. అక్కడ ఇంకా చాలా భూమిని జయించాల్సి వుంది. జెంఘిజ్ ఖాన్ తన కొడుక్కి చెప్పాడు: "పశ్చిమాన, మంగోలు గుర్రం గిట్టలు పోగలిగినంత మేరా, భూములన్నిట్నీ నీకు ఇస్తున్నాను".

తెల్ల యుర్త్‌లో జూచి ఖాన్ కురచతఖ్తుమీద కూర్చున్నాడు. కాళ్లు మడం వేసుకుని పాదాలు లోపలికి పెట్టుకున్నాడు. తండ్రిలాగే అతనూ పొడుగు. అవే యెలుగుబంటి కదలికలు. అవే ఆకుపచ్చ కళ్ల జడ దృక్కులు. నల్లని మీసాలతో నల్లని కురచ గడ్డంతో గడ్డంలేని మంగోలుల మధ్య భిన్నంగా వున్నాడు. అతని గడ్డంలోకి జడ అల్లిన గుర్రపు జూలు చిన్న పంది తోకలా వుంది. దాన్ని జూచి ఖాన్ కుడి చెవిమీద పెట్టుకున్నాడు. తఖ్తుముందర మహా మంగోలు పాలకుడి అనుగ్రహాన్ని అర్థిస్తూ ఖానులు, ఆలిమ్‌లు, వర్తకులు సామాన్య జనం గుంపుగా వున్నారు. వాళ్లు మోకాళ్లమీద వాలారు. నేలమీదకి వంగి వినయంగా అణుకువగా వున్నారు.

"ఈ హుక్! యా హాక్" అని అరుస్తూ, వంగి వున్న అనుంగు అనుచరుల్ని దాటి పెద్ద అంగలు వేసుకుంటూ సరాసరి జూచి ఖాన్ తఖ్తు దగ్గరికి వెళ్లి హాజీ రహీమ్ తన దండంమీద ఆనుకుని నుంచున్నాడు.

జూచి ఖాన్ ధమధమలాడే కళ్లని దర్వీష్‌మీద నిలిపి అడిగాడు:

"యేం కావాలి నీకు కిప్‌చాక్ షామాన్?"

మహా వజీరు మహమ్మద్ యాలవాచ్ నుంచి ఉత్తరాన్ని తెచ్చానని హాజీ రహీమ్ చెప్పాడు.

"యెందుకింత ఆలస్యం చేశావ్? ఈ ఉత్తరం వస్తుందని యెప్పుడనగానో చూశాను".

"నేను గుర్‌గంజ్ ముట్టడిలో ఉండిపోయాను".

"అయితే నా శత్రువులతో కలిసిపోయావన్న మాట".

"అవును, వైద్యుడిగా క్షతగాత్రులకి సాయపడ్డాను".

హాజీ రహీమ్ తన దండం బోలుని మూసిన మైనం మూతని విప్పదీసి చుట్టిన కాగితాన్ని తీశాడు. దానికి యెర్ర ముద్ర వేసి వుంది. జూచి ఖాన్ రాయసాగాడు ఆ కాగితాన్ని చాచి దానికేసి ఆశ్చర్యంగా చూశాడు.

మూడే మూడు ముక్కలున్నాయి: "ఈ మనిషిని నమ్ము!"

"చాలు, స్పష్టమైంది. మా అబ్బాయి బటూ ఖాన్‌ని పిలవండి!" అన్నాడు జూచి ఖాన్.

నోకర్లు హడావుడిగా వెళ్లిపోయి తిరిగివచ్చారు. వాళ్ల ముందు ఒక విల్లు, మూడు యెర్ర బాణాలు* పట్టుకున్న తొమ్మిదేళ్ల కుర్రాడొకడు వచ్చాడు. చేత్తో పట్టుకుని నడిపించుకొస్తున్న ఇద్దరు ముసలాళ్ల చేతుల్లోనుంచి గుంజుకున్నాడు. జూచి ఖాన్ దగ్గరికి పరిగెత్తి వెళ్లి తన పద్ధతిలో మోకాళ్లమీద వాలి, తివాసీని నుదుటితో తాకి, ఎగిరి, చుట్టూ వున్న వాళ్లందరికేసీ మెరిసే తేనె రంగు కళ్లతో చూశాడు.

"వీడు నా కొడుకు బటూ ఖాన్" అన్నాడు జూచి, కుర్రాడి వంక చూస్తూ. "మా వాడికి నా కొత్త ప్రజలైన ఖోరెస్మ్ జనాల భాషని చదవడమూ రాయడమూ నేర్పడానికి పండితుడైన మీర్జాని పంపమని విధేయుడైన మహమ్మద్ యాలవాచ్‌ని అడిగాను. నువ్వు అలాంటి ఉపాధ్యాయుడివి కాగలవా?" అని అడిగాడు.

"తుర్క్‌మెన్, పర్షియన్, ఆరబిక్ గ్రంథాలని చదవడం యీ పిల్లవాడికి నేర్పగలను, సంతోషంగా" అన్నాడు హాజీ రహీమ్. "మసీదుల్లో ఇమామ్‌ల మాదిరిగా పవిత్ర గ్రంథాల్ని వ్యాఖ్యానించలేనంతే. ప్రపంచ యాత్రలని గురించి చెప్పే పుస్తకాలు, మంచీ చెడూ గురించి చేప్పే పుస్తకాలు, మాతృ భూమి పట్ల ప్రేమని గురించి చెప్పే పుస్తకాలు, ప్రతి మనిషిపట్లా

---

* మూడు యెర్ర బాణాలు: పెద్ద ఖాన్‌కి సంకేతం.

అనుసరించవలసిన కర్తవ్యం గురించి చెప్పే పుస్తకాలు మాత్రమే నాకు బాగా తెలుసు..."

"అదే లాభం, మంచిది కూడా" అన్నాడు జూచి. "అలాంటి ఉపాధ్యాయుడు నా కొడుకు శరీరం మీద వుండే పచ్చిక బీటి అనాగరికతని ఒలిచేస్తాడు. ఇతన్ని ప్రజల పాలకుడిగా చెయ్యాలి. బటూ నీ కొత్త గురువుని కొలు. మీర్జా, నా కొడుకుని బెత్తంతో కొట్టడానికి నీకు అనుమతీ ఇస్తున్నాను..."

ఆ కుర్రాడు అటు తిరిగిపోయాడు.

"ఆయన నాకు యుద్ధాల గురించీ, యోధుల గురించీ చెప్తే, సరే, వింటాను".

హాజీ రహీమ్ ఆ కుర్రాడికి జవాబు చెప్పాడు:

"యవన విజేత రెండు శృంగాల సికందర్ దండయాత్రల గురించి నీకు చెప్తాను. ఆ రాజు, వయసులో చిన్న వాడైనా, యెన్నో దేశాలు జయించాడు. ఆయా రాజులకి తనకంటే యెక్కువ ఆయుధాలు, పెద్ద ఖజానాలు, యెక్కువ సైన్యాలు వుండేవి. అయినా గానీ వాళ్లందర్నీ సికందర్ ఓడించేశాడు".

ఆ కుర్రాడు దర్వేషుకేసి తిరిగి ఆసక్తిగా చూశాడు.

"సికందర్ అలాంటి విజయాలని యెలా సాధించాడు?" అని జూచి ఖాన్ అడిగాడు.

"సికందర్‌నే యీ ప్రశ్న అడిగినప్పుడు ఆయన అన్నాడట: 'జయించిన దేశం ప్రజల్ని నేను అణగదొక్కలేదు...' "

జూచి ఖాన్ కొడుకుకేసి చూశాడు.

"మా తండ్రి అద్వితీయ అత్యున్నత జెంఘిజ్ ఖాన్ సగం ప్రపంచాన్ని జయించాడు. రెండు శృంగాల సికందర్ మిగిలిన అర్ధభాగాన్ని జయించాడు. నీకు మిగిలేదేమిటి జయించడానికి బటూ ఖాన్?"

"నేను సికందర్ భూములన్నిట్నీ తీసుకుంటా!...."

ఆ నాటినుంచీ హాజీ రహీమ్ జూచి ఖాన్ శిబిరంలో వుండి అతని కొడుకు బటూ ఖాన్‌కి గురువయ్యాడు. అతనికి కొన్ని యేళ్లు చదువు చెప్పాడు, జూచి ఖాన్ హఠాత్తుగా చనిపోయే నాటిదాకా. ఒక సారి వేటలో జూచిఖాన్ జింకని వెంటాడుతూ న నోకర్ల నుంచి విడిపోయి రెల్లులో తప్పిపోయాడు. చాలా వెదికిం తర్వాత వాళ్లకి దొరికాడు. మంగోలు ఆచారం ప్రకారం అతని నడుం విరిచేరు. హంతకులు అదృశ్యం అయిపోయారు, యెన్నటికీ వాళ్లని కనిపెట్టలేకపోయారు. జెంఘిజ్ ఖానే వాళ్లని పంపాడనీ వదంతులు వున్నాయి. జూచి ఇంకా సజీవంగానే వున్నా ఒక్క మాట కూడా అనలేకపోయాడు, చెయ్యి కదపలేకపోయాడు. అతని కళ్లు మాత్రమే విచారంగా, మబ్బుగా చూసేవి, శాశ్వతంగా మూసుకుపోయేదాకా.

ఆ సమయంలో, ప్రఖ్యాత యోధుడు సుబుదై భగతూర్, పశ్చిమాన ఒక దండయాత్ర చేసి తిరిగివచ్చాడు. అతను ఆ కుర్రాడు బటూ ఖాన్‌ని తన జీనుమీదకి యెత్తి అన్నాడు:

"మా యజమాని జూచి ఖన్‌కి పట్టిన గతే నీకూ పడుతుంది. నువ్వు నాతోటి చైనా రా. అక్కడ సూనికుడవడం నేర్చుకుందువి గాని. నీకు నా కొడుక్కిలాగే బోధిస్తా నిన్ను మహా యోధుణ్ణి చేస్తా".

బటూ ఖాన్ వెళ్ళిపోయేక హాజీ రహీమ్ మళ్లీ ఒంటరి పథికుడయ్యాడు. వరదలప్పుడు గుర్‌గంజ్‌లో మాయమై పోయిన తన తమ్ముడు తుఘాన్ కోసం యెంతగానో భాదపడ్డాడు.

హాజీ రహీమ్ యెన్నో నగరాలని సందర్శించాడు. క్రూర మంగోలు దాడి అప్పుడు ఖోరెస్మ్ వాసులు అనుభవించిన విచారకరమైన ఆ రోజుల్ని ప్రత్యక్షంగా చూసిన వాళ్లని ప్రతి చోటా అడుగుతూనే వుండేవాడు. నమ్మకస్తులైన వాళ్లనుంచి సమాచారం రాసుకున్నాడు. ఆఖరికి, జెంఘిజ్ ఖాన్ యెలా గొప్పవాడైందీ, యెలా మొత్తం ప్రపంచాన్ని జయించదలచుకున్నదీ, యెక్కడెక్కడికి మంగోలులు వెళ్లినా యెలా నిర్ధామ ధూమంగావించిందీ తెలియజేసే మహత్తర గ్రంథం రాయాలని హాజీ రహీమ్ నిర్ణయించుకున్నాడు.

మూడవ భాగం

# కల్క నదీ తీర యుద్ధం జెంఘిజ్ ఖాన్ శాసనం

"వాళ్లవి రాక్షస రూపాలు, భయం పుట్టిస్తారు. వాళ్లకి గడ్డాలు లేవు, చెదురు మదురుగా చుబుకంమీద కొన్ని వెంట్రు కలుండేవి. వాళ్ల కళ్లు సన్నగా చురుగ్గా వుండేవి. వాళ్ల గొంతుకలు సన్నగా కీచుగా వుండేవి. దిట్టంగా వుండేవాళ్లు. దీర్ఘయుష్కులు".
(అర్మీనియన్ చరిత్రకారుడు కిరియా కోస్, 13వ శతాబ్దం)

మహాకాళ సంవత్సరం 1220లో జెంఘిజ్ ఖాన్ తన సముఖానికి ఇద్దరు నాయకుల్ని రమ్మని పిలిపించాడు. వాళ్లు కష్టభూయిష్టమైన పనులని నిర్వహించడంలో ఆరితేరిన వాళ్లు – వయసుమళ్లిన ఒంటికంటి సుబుదై భగత్తూర్, యువకుడైన జెబెనాయన్. ఆ ఇద్దరూ తక్షణం జెంఘిజ్ ఖాన్ పట్టు గుడారంలో హాజరయ్యారు. బంగారు సింహాసనం ముందు బొచ్చు అట్టమీద వాలేరు. జెంఘిజ్ ఖాన్ కుడి మోకాలిమీద చేతులు కట్టుకుని, యెడమ కాలిమడమమీద ఆనుకుని కూర్చున్నాడు. పచ్చ పొదిగిన గుండ్రటి బంగారు పూత కూళ్లాయి నుంచి నలుపు బూడిద రంగు చారలు వుండే నక్క తోకల వేలాడాయి. యే భావమూ వ్యక్తం కాని అతని ఆకుపచ్చని పిల్లి కళ్లు గూఢంగా నిశ్చలంగా వంగి వందనం చేస్తూ వున్న ఆ భగత్తూర్లకేసే చూశాయి. అతను బొంగురుగా తగ్గు స్వరంలో అన్నాడు:

"పసుప్పచ్చ చెవి కుక్క కొడుకు ఖోరెస్మ్ షా మహమ్మద్ రహస్యంగా తన సైన్యాన్ని వదిలిపెట్టేశాడని గూఢచారులు చెప్తున్నారు. తన జాడల్ని కప్పేసుకుంటూ పారిపోయాట్ట. మహమ్మద్ని జైహూన్ నది అవతల రేవుల దగ్గర ఇటీవల చూశార్ట. ఖోరెస్మ్ షాలు వందల యేళ్లుగా కూడబెట్టిన చెప్పలేనన్ని సంపదల్ని కూడా తీసుకుపోయాట్ట. కొత్తగా పెద్ద సైన్యాన్ని అతను తయారుచేసుకోక ముందే అతన్ని పట్టుకోవాలి. మీకు ఇరవై వేల మంది అశ్వికుల్ని ఇస్తున్నాను. మనం పోరాడగలమా? అని మీరు ఆగి ఆలోచించుకునేటంత సైన్యం షాకి

వుందనుకుంటే పోరు చెయ్యకండి. కాని తక్షణం నాకు యీ విషయం తెలియజెయ్యండి... అప్పుడు తోఖూచర్ నాయన్‌ని పంపిస్తా. మీరిద్దరూ కలిసి జయించలేని దాన్ని అతను జయిస్తాడు... మహమ్మద్‌ని గొలుసులతో బంధించేదాకా వెనక్కి రాకండి. పరాజితుడైన షా ఒకవేళ కొంతమంది అనుచరులతో కలిసి దుర్గమ పర్వతాల్లోకో, చీకటి గుహల్లోకో పారిపోతే లేదా ఇంద్రజాలికుడి మాదిరీ మనుషుల కళ్ల ముందు నుంచి అదృశ్యం అయిపోతే అప్పుడా భూభాగాలన్నిట్నీ ఉప్పెనలాగా ముంచెత్తెయ్యండి... లొంగిపోయిన నగరాలన్నిటినీ క్షమించండి. కఠినుడైన పాలెగాణ్ణీ, సైన్యాన్నీ దిగవిడచండి... మిమ్మల్ని ప్రతిఘటించిన ప్రతి నగరాన్నీ మట్టంచెయ్యండి. ఇటికమీద ఇటిక వుండకూడదు, అంతా బూడిదైపోవాలి, మట్టిలో కలిసిపోవాలి! నా కోరికలు మీకు కష్టమైనవి కావనుకుంటా..."

జెబె నాయన్ తల పైకెత్తి అడిగాడు:

"ఒకవేళ షా మహమ్మద్ దైవాత్తూ తప్పించుకొని ఇంకా ఇంకా పడమటికి పారిపోతే యెంత కాలం అతన్ని వెంబడించి నీ బంగారు గుడారంనుంచి దూరంగా వుండం?"

"ప్రపంచపుటంచులదాకా వెన్నాడండి, కడపటి సముద్రం చేరేదాకా. ఇక మీరు వెళ్లచ్చు".

ఇద్దరు దళవాయిలూ మోకాళ్లమీదనుంచి లేచి, వెనకడుగు వేసుకుంటూ గుడారం బయటికి వెళ్లారు.

అదే రోజున ఇరవై వేల మంది మంగోలు తాతారు ఆశ్వికులతో వాళ్లు పశ్చిమ ప్రాంతాలకి దౌడు తీసి వెళ్లిపోయారు.

# "మహానేత"కి నివేదిక

జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞ మేరకి అతని ఇద్దరు సైన్యాధిపతులు జెబె నాయన్, సుబుదై భగతూర్‌లు పారిపోయిన ఖోరెస్మ్ పాలకుడు షా మహమ్మద్ జాడ కోసం వెతుకుతూ రెండేళ్లు గాలించేశారు. వాళ్లకి యేమీ దొరకలేదు. తన స్వదేశాన్ని వదిలిపెట్టిన ఖోరెస్మ్ షాని అందరూ పరిత్యజించారనీ, అబెస్కున్ సముద్రంలోని యేకాంత ద్వీపంలమీద అతను చనిపోయాడనీ జనవదంతివల్ల వాళ్లకి తెలిసింది.

అప్పుడు, మహా వీరుల యుద్ధాల గురించి ప్రాచీన గీతాలు పాడ్డం తెలిసిన ఒక జెబె, సుబుదైలు పిలిపించి "అద్వితీయ మహానేత"కి తమ నివేదికని జాగ్రత్తగా పాడి వినిపించారు. ఆ మాటల్ని అతను తొమ్మిది సార్లు* వల్లించేటట్టు చేశారు. జెంఘిజ్ ఖాన్ శిబిరానికి అతన్ని పంపారు. ఆ దూత రక్షణకి నమ్మకస్తులైన మూడు వందల మంది నోకర్లని అప్పగించారు.

ప్రయాణం అంతా కూడా ఆ దూత మంగోలు నీలి పచ్చిక మైదానాల గురించీ, అరణ్య పర్వతాల గురించీ, విడిది నెగళ్లలాగా ప్రకాశించే కెరులెన్ అమ్మాయిల గురించీ ప్రాచీన పాటలు పాడాడు. కాని, ఒక్క సారి కూడా భగతూర్‌లు తనకి చెప్పిన పాటలోని పదాలు పాడలేదు. మహా ఖాఖాన్ ముఖ్య శిబిరం చేరి, పవిత్ర వితర్ది మంటలతో శుద్ధి అయి, తుర్‌గాడ్‌లు (అంగరక్షకులు) కాపలా వున్న యెనిమిది మజిలీలు దాటి, ఆ దూత పసుప్పచ్చ గుడారం దగ్గరికి వెళ్లాడు. బంగారు ద్వారం ముందు ఆగాడు. ద్వారానికి అవతలి వేపున వింత శోభతో రాజిల్లే రెండు అశ్వాలునుంచున్నాయి – ఒకటి పాలల్లా తెల్లగా వుంది, మరొకటి మీగడ రంగుతో వుంది. రెండూ తెల్లని తాళ్లతోటి పోతబంగారు గుంజలకి కట్టేసి వున్నాయి.

ఈ వైభవానికి నిశ్చేష్టుడైన దూత ముఖం నేల వేపు వుంచి, ఇద్దరు భారీ తుర్‌గాడ్‌లు తమ చేతులతో యెత్తేదాకా అలానే పడిపోయాడు. వాళ్లతన్ని గుడారంలోకి యీడ్చి జెంఘిజ్ ఖాన్ ముందున్న తివాసీమీద పడేశారు.

---

* మంగోలు సైన్యాధిపతులకి రాయడం తెలీదు. ముఖ్యమైన నివేదికలు పంపాల్సి వుండడం చేత, దూత వక్రీకరిస్తాడేమోనన్న భయం చేత పద్యాల రూపంలో దాన్ని కూర్చారు. దాన్నా దూత కంఠస్థం చేస్తాడు. మంగోలులలో తొమ్మిది అదృష్టం కలిగించే సంఖ్య.

మోకాళ్లమీద వాలి, కళ్లు మూసుకుని తను కంఠస్థం చేసిన నివేదికని దూతగానం చేశాడు. పాత మంగోలు జానపద గీతాలు పాడడానికి తను అలవాటు పడ్డ పద్ధతిలో గట్టిగా పాడాడు:

“సార్వభౌములకి అనుంగు దాసులు
సుబుదై భగతుర్, జెబె నాయన్‌లు
మోకరిల్లుతూ చేయు విన్నపము:
ఖండితవాల సృగాలం కొడుకు
మహమ్మద్ షా ఖోరెస్మ్ పాలకుడు
కుష్ఠ కొంపలో చచ్చిపోయెను,
వాడి కూన ఆ జలాలు జెట్టి
ఇరాన్ కొండలు దాటిపోయెను,
జాడలేకనే జారిపోయెను.
అంతటితో అది ముగిసెను గాక -
తదుపరి వత్తుము కాకసస్‌నకు
దారి అంతటా పోరు సల్పుతూ
వారి కత్తుల తుప్పుదుల్పుతూ
వారి సేనల సంఖ్య కొల్చుతూ
కిప్‌చాక్ పచ్చిక బీళ్లమీదకూ
ఒక్కుమ్మడిగా దూరి వచ్చెదము
అక్కడనే మన అశ్వము లాగు.
దారిని మేము గుర్తు పట్టుదుము
పచ్చిక బీటిని వెతికి పట్టుదుము
మహా ప్రభువుల అశ్వము మేయును.
యేమంటే మరి ప్రళయ భీకరముగ
ప్రభువులు వత్తురు పడమటి దిక్కుకు
మంగోలు చేతితో అవని గ్రహింతురు.*
తురంగ ఖురముల నభిషేకించే

---

*కొంత మంది యుద్ధ చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం కల్కా నదీ తీర యుద్ధంతో ముగిసిన సుబుదై భగతుర్ దాడి, జెంఘిజ్ ఖాన్ తలపెట్టిన తూర్పు యూరప్ దాడికి సమగ్ర సైనిక గూఢచారి పరిశీలన. మంగోలుల, తాతార్‌ల ఈ దాడి జెంఘిజ్ ఖాన్ చనిపోయిన పన్నెండేళ్ల తర్వాత క్రీ.శ. 1237లోనే జరిగింది. అతని మనమడు బటూ ఖాన్ దాన్ని నిర్వహించాడు.

హరిత తరంగపు అంతిమ సంద్రం
తీరందాకా యెదురు లేదుగా
మన దారిని అడ్డే శక్తి లేదుగా.
మన కరవాలాలకి తెగిన తలలకు
ఇంతకు ముందు యెన్నడు యెరుగని
గోరీ దిబ్బలు నిర్మింతుముగా.
దిబ్బలమీద దిక్కుల చాటగ
తమ పవిత్ర నామం చెక్కిన శిలను
యెంతో యెత్తున ప్రతిష్ఠింతుము.
అప్పుడు మాత్రమె ఆఖరు సారిగ
కదనాశ్వములను కళ్లెంపట్టి
వెనక్కి తిప్పి పదచిహ్నముల
జాడని బట్టి చేరగవత్తుము
త్వదీయ బంగరు గుడారంబునకు.

ఈ పాటని పాడ్డం ముగించాకనే ఆ దూత మొదటి సారిగా తన పాలకుడి క్రూర నేత్రాలని చూశాడు. నిశ్చేష్టుడైపోయి మళ్లీ ముఖం నేల వాల్చుకుని పడిపోయాడు. జెంఘిజ్ ఖాన్ బోర్లపడ్డ దూతకేసి మగతగా చూశాడు, బహిర్గత స్వగతంలాగా అన్నాడు:

"నీకు అడివి బాతులాంటి కంఠం వుంది... నువ్వు బహుమతీ సంపాదించేవు..." సింహాసనం చేతిమీద వేళ్లాడుతూ వున్న పసుప్పచ్చ పట్టు సంచీలో తడిమి అతను మురికి పంచదారని* తీసి, వణికిపోతూ వుండే దూత నోట్లో పోశాడు. అప్పుడు ఖాఖాన్ అన్నాడు:

"జెబె నాయన్, సుబుదై భగత్తూర్‌లని శ్లాఘించడం మరీ తొందర పడ్డం అవుతుంది. వాళ్ల దండయాత్ర విజయవంతం అవునో కాదో చూడాలి నేను... నా జవాబుని వేరే దూత ద్వారా పంపుతాను".

ఒక యేడు గడిచింది. పడమటికి వెళ్లిన మంగోలుల వార్త యేమీ అందలేదు. ఒక రోజున జెంఘిజ్ ఖాన్‌తన సచివుడి తోటి కొన్ని మాటలు మాట్లాడేడు. తన ముద్రవేసిన ఉత్తరాన్ని (అందులో సంగతులు యేమిటో యెవళ్లకీ తెలీదు) గంటలు కట్టిన దూతద్వారా పంపమని ఆజ్ఞ చేశాడు. ఆ దూత కుళ్లాయిలో డేగ యీక పెట్టాలి. అతి త్వరగా జరపాల్సిన

---

* చెరకు నుంచి తయారు చేసిన పంచదార అప్పట్లో ఒక ఐశ్వర్యం కింద, లెక్క చాలా హెచ్చు ధరపలికేది.

పనికి సంకేతం. ఆ దూత రక్షణకని పది వేల మంది ఆశ్వికులతో వున్న సైన్యాధిపతి తోఖూచర్‌కి అప్పగించాడు.

"జెబె నాయన్, సుబుదై భగతూర్‌లు కనిపించేదాకా ప్రపంచపుటంచులకేనా వెళ్లు. అక్కడ నీ కళ్ల ముందే ఈ దూత ఉత్తరాన్ని సుబుదై భగతూర్ చేతికే అందిస్తాడు. వాళ్లు చాలా దూరం వెళ్లారు, వాళ్లని మూడు వైపులనుంచీ ఆందోళనగా వున్న ముప్ఫై మూడు తెగల వాళ్లు ఒత్తిడి చేస్తూ వుంటారు. వాళ్ల సహాయార్థం వెళ్లే వేళ అయింది".

అదే రోజున తోఖూచర్, అతని దళం, ప్రపంచ పుటంచులదాకా వేగిర పడిపోతున్న మంగోలుల్ని వెదకడం కోసం, పశ్చిమానికి వెళ్లింది.

# కడపటి సముద్రం కోసం వెతకడం

"శీఘ్ర పాదముల తురగాల్లారా
పదండి ముందుకు,
ప్రజల భీతి మీ ఛాయలకంటెను
మరింత త్వరగా పరుగు లెత్తును".
(మంగోలు పాట)

రెండు పెద్ద నల్ల త్రాచులు శీతకట్టు అంతా పడుకుని పాత ప్లేన్ వృక్షపు వేళ్ల కిందనుంచి అడవి బయలుమీదకి పాకి వచ్చి వసంతరుతు యెండలో వెచ్చబడి తమ ముందు పారిపోయే జంతువుల్లోనూ, అరుస్తూ యెరిగిపోయే పక్షుల్లోనూ భీతాంగం రేకెత్తించి దారులమ్మట మెలి తిరుగుతూ చుట్టలు చుట్టుకుంటూ పాకిపోతాయి. అదే విధంగా ఆ రెండు మంగోలు తోమన్లూ సాగిపోయాయి. ఉరవడిగా వుండే జెబె నాయన్, హెచ్చరిగ్గా, జిత్తులమారిగా వుండే సుబుదై భగత్తూర్‌లు కోలాహలంగా వున్న అనేక వర్ణశోభిత అశ్వాల మందని నడిపిస్తూ, సాగుతూ, భీతాంగమెత్తిన నగరాల్ని పరివేష్టించిన పొలాల్ని అణగదొక్కుతూ, సర్వదా పశ్చిమానికి పోతూ మెలి తిరిగి, సుళ్లు తిరిగి సాగిపోయారు. వాళ్ల వెనక పొగ చిమ్మే శిధిలాలూ, కాలి ఉబ్బిన కళేబరాలూ మిగిలిపోయేవి.

జెంఘిజ్ ఖాన్ సైన్యపు ఎలగోలు దళం ఉత్తర ఇరాన్ మీదుగా వెళ్లింది. ఖార్, సిమ్‌నాన్, కూమ్, జెంజాన్ తదితర నగరాల్ని ధ్వంసం చేసుకుంటూ వెళ్లింది. మంగోలులు సంపద్వంతమైన నగరం హమాధాన్‌ని మాత్రం వదిలారు. దాని పాలకుడు ముందుగానే పెద్ద రాయబారుల్ని మంగోలుల్ని కలుసుకుందుకు పంపాడు. జీను వేసిన గుర్రాల మందనీ, బట్టల సరుకు యెత్తిన రెండు వందల ఒంటెల్నీ కానుకగా పంపాడు. మంగోలులకి కజ్‌విన్‌లో బలమైన ప్రతిఘటన యెదురైంది. అక్కడి వాళ్లు నగర వీధుల్లో పొడుగాటి కత్తులతో తెగించి పోరాటం చేశారు. మంగోలులు కజ్‌విన్‌ని దగ్ధం చేశారు.

చలిగా వుండే శీతకట్టు నెలల్ని మంగోలులు రెయి* నగరంలో గడిపారు. అన్ని వేపులనుంచీ గొర్రెల మందలు, మంచి గుర్రాలు, బట్టలు తాన్లు యెత్తిన ఒంటెలు వచ్చాయి.

* ప్రస్తుతం వున్న టెహెరాన్‌కి బయట వున్న నగరం.

అక్కడ మంగోలులు వసంత రుతువు కోసం ఆగారు.

ఇరాన్ పర్వతాల సానువులు వసంతరుతు యెండలో ఆకుపచ్చగా అయినప్పుడు మంగోలులు ఆజర్‌బైజాన్ గుండా వెళ్లారు. మహా సంపద్వంతమైన నగరం తబ్రిజ్ వాళ్లకి విలువైన కానుకల్ని పంపింది. వాళ్ల లొంగుబాటుని స్వీకరించి మంగోలులు నగరాన్ని ముట్టుకోకుండా దాటి వెళ్లిపోయారు. వాళ్లు కాకసస్ వేపు వెళ్లారు. అర్రానా రాజధాని గంజా వేపు వెళ్లారు. కాని మంగోలులు నగరాన్ని ధ్వంసం చెయ్య సాహసించలేదు. వెండినీ, బట్టలనీ ఇమ్మని అడిగారు. వాటిని వాళ్లకి ఇచ్చారు. వాళ్లు జార్జియాకి వెళ్లారు.

జార్జియా పెద్ద సైన్యం దారిలో అడ్డం వచ్చింది. ముఖ్య బలగాల్ని తీసుకుని సుబుదై ముందు వెళ్లాడు. అయిదు వేల మంది ఆశ్వికులతో జెబె పొంచి మాటువున్నాడు. మొదటి దెబ్బకి మంగోలులు పారిపోతున్నట్టు నటించారు. జార్జియన్లు జాగ్రత్త అంతా మర్చిపోయి వాళ్లని వెంబడించారు. మాటులో నుంచి జెబె తాతార్లు జార్జియన్లమీదకి లంఘించారు. సుబుదై ఆశ్వికులు అన్ని వేపులనుంచీ జార్జియన్లమీద పడ్డారు. వాళ్లని హతం చేశారు. పదమూడు వేల మంది జార్జియన్లు పోరులో హతం అయ్యారు.

పర్వత కనుమలతో, వీరులైన జనాభాతో వున్న దేశం లోపలికంటా పోవడానికి మంగోలు సైన్యం భయపడింది. కొల్లగొట్టిన సంపద తీసుకుని దాన్ని వదిలిపెట్టేసింది. కాకసస్ పర్వత కనుములు తమ చుట్టూతా ఆవరించినట్టు సైనికులకి అనిపించింది. వాళ్లు తమ గుర్రాలు మెయ్యగలిగిన పచ్చిక బీళ్ల కోసం తహతహలాడారు. హెమాకా నగరవాసుల్ని హతంచేసి మంగోలులు షిర్వన్‌లో వున్న దెర్బెంట్‌కి వెళ్లారు. ఈ కోట దుర్గను పర్వతంమీద వుంది, ఉత్తరాది దారికి అవరోధంగా వుంది. జెబె నాయన్ షిర్వన్ షా రషీద్‌కి దూతని పంపాడు. అతను కోట లోపల బంధించుకుని కూర్చున్నాడు. దూత వార్త ఇదీ:

"నీ ప్రముఖ బెక్‌లని పంపించు, మనిద్దరి మధ్యా శాంతి చేసుకుందాం".

షిర్వన్ పాలకుడు ఉన్నత వంశీకులైన వృద్ధ బెక్‌లని పది మందిని పంపాడు. జెబె ఒక గర్విష్టి బెక్‌ని ఇతరుల కళ్ల ముందు హతం చేసి, అధికారికంగా అడిగాడు:

"నాకు నమ్మకమైన సహాయకుల్ని ఇవ్వండి, నా సైన్యాలు పర్వతాలు దాటిపోతాయి. అప్పుడు మిమ్మల్ని వదిలేస్తాను. సహాయకులు నమ్మక ద్రోహం చేస్తే అందరికీ ఇదే గతి పడుతుంది".

అతనడిగిందానికి లొంగి వుంటామని షిర్వన్ బెక్‌లు జవాబు చెప్పారు. మంగోలు సైన్యాన్ని, దెర్బెంట్ తప్పించి, కొండ కనుమల గుండా తీసికెళ్లి కిప్‌చాక్ మైదానాలకి దారి చూపించారు. మంగోలులు అప్పుడు వృద్ధ దూతల్ని వదిలిపెట్టి, ఇంకా ఉత్తరానికి పోయారు.

# ఆలన్‌ల, కిప్‌చాక్‌ల దేశంలో

ఉత్తర కాకసస్‌లో జెబె, సుబుదైలు ఆలన్‌ల దేశం చేరారు. విశాలమైన ఉత్తర ప్రాంత పచ్చిక బీళ్లనుంచి వచ్చిన లెజ్గిన్, సర్కేషియన్, కిప్‌చాక్ యోధులు ఆలన్‌ల సహాయార్థం అక్కడ సమాయత్తమయ్యారు.

మంగోలులు అక్కడ రాత్రి పడేదాకా పగలంతా వాళ్లతో యుద్ధం చేశారు. కాని బలాబలాలు సమంగానే వుండి పోయాయి. యే పక్షానికీ విజయం చేకూరలేదు.

అప్పుడు జెబె అత్యంత ప్రముఖ కిప్‌చాక్ ఖాన్ కోత్యన్‌కి ఈ కింది ఉత్తరంతో గూఢచారిని పంపాడు:

"తాతార్లమైన మేమూ, కిప్‌చాక్‌లైన మీరూ ఒకే రక్తం వాళ్లం. కాని మీరు మీ సోదరులకి వ్యతిరేకంగా ఇతర జాతులతో చేరారు. ఆలన్‌లు మీకూ, మాకూ కూడా పరాయి వాళ్లే. యెవళ్లూ ఇంకొకళ్లతో యుద్ధం చెయ్యకూడదని అనుల్లంఘనీయ సంధిని కుదుర్చుకుందాం. ప్రతిఫలంగా మీరు కోరినంత బంగారాన్నీ, విలువైన బట్టలనీ మీకు ఇస్తాం. అప్పుడు, ఆలన్‌లతోటి మా అంతట మేమే తలపడేటట్టు మమ్మల్ని వదిలి మీరు వెళ్లిపోవచ్చు".

మంగోలులు అనేక విలువైన కానుకలు యెత్తిన బోలెడు గుర్రాల్ని కిప్‌చాక్లకి పంపారు. కిప్‌చాక్ ఖాన్లు కానుకలకి ఆశపడి, విద్రోహపూరితంగా రాత్రిపూట ఆలన్‌లని వదిలేసి, తమ సైన్యాల్ని ఉత్తరానికి తీసుకుపోయారు.

అప్పుడు మంగోలులు ఆలన్‌లమీద పడి, వాళ్ల గ్రామాలు ధ్వంసం చేసేసి ప్రతిదాన్నీ కూలగొట్టేసి, దగ్ధం చేసేసి, హతం చేసేసి వాళ్లని నాశనం చేసేశారు. ఆలన్‌ల జెంఘిజ్ ఖాన్‌కి పూర్తి లొంగుబాటుని ప్రకించారు. వాళ్ల సైన్యంలో ఒక భాగం మంగోలు సైన్యంతో చేరిపోయింది.

తమ వెనక ఇక ఆలన్ పదును కత్తులకి యెంత మాత్రమూ భయపడనవసరం లేక, జెబె, సుబుదైలు తమ తోమన్లని, ఉత్తరాదికి పచ్చిక బీళ్లమీదుగా కిప్‌చాక్ శిబిరాలకేసి హఠాత్తుగా నడిపించారు. ఒప్పందాన్ని నమ్ముకుని సురక్షితంగా వున్నామని విశ్వసిస్తూ కిప్‌చాక్ ఖాన్లు తమ విడివిడి దళాలతో తమ సొంత శిబిరాలకి వెళ్లిపోయారు. మంగోలులు త్వరలోనే వాళ్ల

వెంటబడి వాళ్ల శిబిరాల్ని ధ్వంసం చేసేసి వస్తువుల్నీ, తాము కిప్‌చాక్‌లకి వాళ్ల ద్రోహానికిగాను ఇచ్చిన కానుకలకంటే యెన్నో రెట్లు విలువైన వస్తువుల్నీ దోచుకుపోయారు.

దూరంలో యెక్కణ్ణో పచ్చిక బీళ్లమీద వున్న కిప్‌చాక్‌లు మంగోలుల దాడి వార్త విని తమ ఆస్తుల్ని ఒంటెల మీద వేసుకుని వీలైనన్ని చోట్లకంటా పారిపోయారు. కొంత మంది బాడవల్లోకి, కొంత మంది అడవుల్లోకి పారిపోయారు. చాలా మంది ఇంకా దూరం రష్యన్ల భూముల్లోకీ పారిపోయారు.

పారిపోయే కిప్‌చాక్‌లని మంగోలులు దాన్ తీరందాకా వెంబడించారు. కజార్ (నల్ల) సముద్రపు నీలి నీళ్లదాకా తరిమారు. అక్కడ చాలా మంది మునిగిపోయారు. బతికి బయట పడ్డ కిప్‌చాక్‌లు గొర్రెలకాపరులుగా, అశ్వపోషకులుగా మారి, మంగోలులు ప్రతి చోటా పట్టుకున్న పశువుల్నీ గుర్రాల్నీ వాళ్లు కాసేరు.

అప్పుడు మంగోలులు కజార్ (క్రైమీయా) ద్వీపకల్పంమీదకి చొచ్చుకుపోయి, సముద్ర తీరాన వున్న సంపద్వంతమైన కిప్‌చాక్ నగరం సుదాక్‌మీద దాడి చేశారు. మంగోలులు వస్తున్నారని విని సుదాక్ నగర వాసులు పారిపోయారు. కొంతమంది కొండల్లో దాంకున్నారు. కొంత మంది పడవలెక్కి త్రెబిజాండ్‌కి సముద్రం దాటిపోయారు. జెబె, సుబుదైలు నగరాన్ని కొల్లగొట్టారు. తిరిగి కిప్‌చాక్ శిబిర ప్రాంతానికి విశ్రాంతి తీసుకోవడానికి ఉత్తరాదికి వెళ్లిపోయారు. అక్కడ యేడాదికి పైగా వున్నారు.

బానిసలు దున్నిన ఫలవంతమైన క్షేత్రాలూ, పుష్కలమైన పచ్చిక బీళ్లూ, పుచ్చకాయల తోటలూ, గుమ్మడి కాయల తోటలూ ఇక్కడ వున్నాయి. బలిసిన ఆవుల మందలూ, మంచి ఉన్ని ఇచ్చే గొర్రెలూ వున్నాయి. మంగోలు సైనికులకి ఈ పచ్చిక బీళ్లు వచ్చాయి. వాళ్ల గుర్రాలు ఓనన్, కెరులెన్ తీరాల్లో మాదిరీ స్వేచ్ఛగా వున్నాయని అన్నారు. కాని తమ సొంత మంగోలు పచ్చిక బీళ్లు వాళ్లకి ఇంకా ప్రియమైనవి. మరి యే ఇతర మైదానాల కోసమూ వాళ్లు వాటిని వదులుకోరు. ప్రపంచ విజయాన్ని సాధించి మంగోలులందరూ ఒక్కటే కోరుకున్నారు–తమ సొంత కెరులెన్ తీరానికి పోవడం.

జెబె, సుబుదైలు కిప్‌చాక్ ముఖ్య నగరం షరుకాన్‌లో* యెక్కువ కాలం వుండలేదు. అక్కడ నేల లోపలికి పునాదులున్న రాతి భవనాలున్నాయి. విదేశీ వస్తువుల నిల్వలతో వున్న భాండారాలున్నాయి. కాని అధిక భాగం అది యుర్త్‌లతో వుండేది. వాటిల్లో కిప్‌చాక్ ఖాన్లూ, సాదా సంచారులూ కూడా వుండేవాళ్లు. వసంతరుతువులో అంతా పచ్చిక బీళ్ల శిబిరాలకి వెళ్లారు. శీతకట్టులో తిరిగి నగరానికి వెళ్లారు.

* కొంత మంది విజ్ఞుల ప్రకారం కిప్‌చాక్ నగరం షరుకాన్ ప్రస్తుతం హార్కొవ్ ప్రాంతంది అట. ఈ పేరు ఆ పాత నగరం పేరు నుంచి వచ్చింది

మంగోలుల రాకతోటి, దాడి జరుగుతుందని భయపడి, విదేశీ వర్తకులు పచ్చిక బీళ్లమీద వ్యాపారం మానుకున్నారు. షరుకాన్ నగరాన్ని ధ్వంసం చేసి తగలబెట్టేశారు. పాడు పడిపోయింది. మంగోలులు తూర్పుకి లుకోమోర్యేకి (అజోవ్ సముద్ర తీర ప్రాంతానికి) వెళ్లిపోయారు.

అక్కడ మంగోలులు గాలినుంచి రక్షణగా కొండల మధ్య ఖాళీ జాగాల్లో తమ కుర్యెన్‌లని వేసుకున్నారు. ప్రతీ కుర్యెనూ కొన్ని వందల యుర్త్‌ల వలయంగా వుండేది. వీటిని కిప్‌చాక్‌ల నుంచి తీసుకున్నారు. ఒకో కుర్యెన్‌లో వెయ్యి మంది సైనికులు వుండే వాళ్లు. ప్రతి వలయం మధ్యలోనూ యెత్తైన గుర్రపు తోకల లాంఛనం తోటి వేయింటి సర్దార్ పెద్ద యుర్త్ వుండేది. ఈ యుర్త్‌ల పక్కన ఇనప ఊచలకి కట్టేసి గుర్రాలు జీను వేసి సర్వదా దాడికి సిద్ధంగా వుండేవి. వాటికి కళ్లేలు గట్టిగా కట్టేసి వుండేవి. మిగతా గుర్రాలు కిప్‌చాక్ గొర్రెలు కాపర్ల కింద పెద్ద మందలుగా పచ్చిక బీటిలో మేస్తూ వుండేవి.

జెంఘిజ్ ఖాన్ ప్రకటించిన కచ్చితమైన నియమావళిని మంగోలు సైన్యం అనుసరిస్తూనే వుంది. శిబిరాలని మూడు వరసలలో కాపలా వాళ్లు చుట్టి వుండేవాళ్లు. పచ్చిక బీళ్లల్లో బుల్గార్ల, రష్యన్ల, ఉగ్రియన్ల* దేశాలకి పోయే ముఖ్య జాడలమీద రహస్య చౌకీలని పెట్టారు. మంగోలులు పచ్చిక బీటిమీద తిరిగే ప్రతి ఒక్కళ్లనీ పట్టుకుని, ప్రశ్నించేవాళ్లు, పక్క తెగల గురించి యేదన్నా సమాచారం తెలిసిన వాళ్లని జెబె నాయన్ దగ్గరికి తీసికెళ్లిపోయేవాళ్లు, మిగిలిన వాళ్లని చంపేసేవాళ్లు.

చాలా మంది నోకర్లకి వాళ్ల యుర్త్‌ల్లో మంగోలు భార్యలు కూడా వుండేవాళ్లు. భర్తలతోపాటుగా సొంత పచ్చిక బీళ్లనుంచి దండయాత్రలకి వచ్చేవాళ్లు. ఇంకా దారిలో పట్టుకున్న ఆడవాళ్లూ పిల్లలూ వుండేవాళ్లు. మంగోలు ఆడవాళ్లు సరిగ్గా నోకర్లలాగానే బట్టలు వేసుకునేవాళ్లు. చూడగానే యెవళ్లు యెవళ్లైందీ చెప్పడం కష్టం. ఒకో అప్పుడు పోరాటంలో పాల్గొనేవాళ్లు, కాని మామూలుగా ఆడవాళ్లు ఒంటెల్నీ పెరికె గుర్రాల్నీ బళ్లనీ చూసుకునేవాళ్లు. కొల్లగొట్టింది పంపకానికి వాటిమీద వుండేది. ఆడవాళ్లు బందీలని కూడా చూసుకునేవాళ్లు. బందీల చట్టలమీద యజమాని ముద్ర వుండేది. వాళ్లకి వాళ్ల వాళ్ల పనులని అప్పగించేవాళ్లు. ఈ బందీలతోబాటుగా ఆడవాళ్లు ఆవులనీ, ఒంటెలనీ, గుర్రాలనీ పాలు పితికేవాళ్లు. మజిలీలప్పుడు రాగి డేగిసాల్లో, మట్టి పాత్రల్లో అన్నాలు వండేవాళ్లు.

దండయాత్ర జరుపుతూ వుండగా పుట్టిన చిన్న పిల్లలూ, బందీలుగా పట్టుకున్న చిన్న పిల్లలూ బళ్లమీద కూర్చునేవాళ్లు, లేకపోతే జీన్లకి కట్టి తోలు వలాసాల్లో కూర్చునే వాళ్లు.

---

* ఈనాటి హంగరీవాళ్లు తత్సంబంధీకులు.

ఒకో అప్పుడు ఇద్దరేసి ఒకోసారి ఒక్కళ్లూ కూర్చునేవాళ్లు. వాళ్లు పెరికె గుఱ్ఱాలమీదా లేకపోతే స్వారీ చేసే మంగోలు ఆడవాళ్ల వీపులమీదా వుండేవాళ్లు.

మంగోలు శిబిరాలకి కొంత దూరంగా పచ్చిక బీళ్లమీద దారిలో మంగోలులతో కలిసి చేరిన అనేక తండాల గుడారాలు పరుచుకు వుండేవి. అక్కడ తుర్క్‌మెన్‌ల రంగుల గుడారాలు వుండేవి. తంగుత్‌ల యెఱ్ఱ గుడారాలుండేవి. బలూచిల నల్ల గుడారాలుండేవి. ఆలన్‌ల లేకపోతే యేదో తెలియని అజ్ఞాత తండా రౌతుల ముతకవీ వుండేవి. దాడి భారాన్ని మేసేందుకు గాను మంగోలులు వీళ్లందర్నీ మూకగా ముందు తోలేవాళ్లు. యుద్ధం అయిపోయాక మంగోలులు తమ వాటాగా తీసుకోగా మిగిలిందేమన్నా వుంటే వీళ్లు తీసుకునేవాళ్లు.

# కల్క నదీ తీరాన తాతార్ శిబిరంలో

సుబుదై భగతుర్ తన గుడారాన్ని యెత్తైన కొండమీద వెయ్యమని ఆజ్ఞాపించాడు. అక్కడ్నుంచి సముద్రం కనిపిస్తుంది. మెల్లిగా పారే బురద నీటి నది ముఖ ద్వారం దగ్గర వుందది.

కాస్త విశ్రాంతి, మజిలీ దొరుకుతాయని ఆశిస్తూ నోకర్లు ఆతృతగా భగతుర్ ఆజ్ఞని మన్నించేరు. పన్నెండు ఒంటెలు అనేక యుర్తలని తెచ్చాయి. అవి మడచడానికి వీలైనవి. మిగిలిన ఒంటెలమీద కూచిగా వున్న బొచ్చు అట్ట టోపీలు పెట్టుకున్న కిప్‌చాక్ ఆడబందీలు వచ్చారు.

సుబుదై ముటముటలాడుతూ అడిగాడు:

"మూడు యుర్తలెందుకు?"

"ఒక దాంట్లో నువ్వు నీ విషయాల గురించి ఆలోచించుకో. రెండోది నీకిష్టమైన వేట చిరుతల కోసం; మరి మూడోది లేకుండా మీకు జరగదు. అందులో ఆడ్డం పొడ్డం తెలిసిన కిప్‌చాక్ ఆడబందీలు భేషైన వాళ్లు వుంటారు".

సుబుదై నోకర్లకి అడ్డం చెప్పాడు:

"ఉగా! (వద్దు!) గుర్‌మనే చిరుతల్ని రెండో దాంట్లో పెట్టండి. మూడో దాంట్లో నాకు అన్నం వండడానికి ముసలి సక్లాబ్‌ని పెట్టండి. దండయాత్ర అప్పుడు ఆడవాళ్లతో బెడద పడదల్చుకోలేదు. వాళ్లని వంద సర్దార్లకి ఇవ్వండి".

మూడో దాంట్లో సక్లాబ్ తన వంట పాత్రలనీ పెద్ద కొయ్య తెడ్డులనీ తీసుకుని చేరాడు. పొడుగాటి పల్చని కత్తి అతని పటకానుంచి వేలాడుతోంది. అతను యెత్తరిగా, సన్నగా, యెముక పుష్టిగల బానిస. నెరిసిన బొచ్చు వున్న వాడు. అతన్ని తాతార్లు ఆస్తరబాద్ దగ్గర పట్టుకున్నారు. నోకర్లు సుబుదైకి చెప్పారు: "ఈ మనిషి రష్యన్ తెగవాడు. ఇతను ఖోరెస్మ్ షా మహమ్మద్‌గారి మీర్జాకే వంటవాడు. పారిపోయాడు. తన మాతృభూమికి పారిపో ప్రయత్నించాడు. ఇతను అన్ని భాషలూ మాట్లాడతాడు. అన్ని రకాల వంటకాలూ చెయ్యడం

తెలుసు ఇతన్ని ఇతని పెంపుడు కొడుకు తుఘాన్‌తో సహా పట్టుకున్నారు. ఈ కుర్రాడు సక్లాబ్‌కి వంటలో సాయం చేస్తాడు". అప్పుడు సుబుదై కోప్పడి అన్నాడు:

"నాక్కావలసిందల్లా ముసలాయన సక్లాబ్ వంట చెయ్యడం. యే సహాయకులూ నాకక్కర్లేదు. ప్రతివాడూ కుండల దగ్గరికి చేరాలనే చూస్తాడు. ఈ కుర్రాడు తుఘాన్‌కి కత్తి ఇచ్చి ఓ ముసలి గుర్రాన్ని పారెయ్యండి. ముందర వుండే వంద దగ్గరికీ అతన్ని పంపండి. యెలా యుద్ధం చెయ్యాలో నేర్చుకొమ్మనండి. మంచి సైనికుడయితే మంచి గుర్రాన్ని , జీనునీ, డాలునీ సంపాదిస్తాడు. చెడ్డ సైనికుడైతే మొదటి పోరుకే చచ్చిపోతాడు. మరేం నష్టం లేదు!..."

కల్క నది యెగువన, ఒక శ్మశానం దిబ్బమీద రెండవ మంగోలు నాయకుడు జెబె నాయన్ తన యుర్త్ వేసుకున్నాడు. ఆకుపచ్చ మైదానం చుట్టూతా పరుచుకుని వుంది. దాని కావల కొండలమీద చౌకీలు గొలుసులాగా వున్నాయి.

జెబె, సుబుదైలు నిద్దర్నీ జెంఘిజ్ ఖాన్ కలిపే పదమటికి ఒకే దండయాత్రకి పంపినా, ఒకళ్లతో ఒకళ్లకి పడేది కాదు. యెప్పుడూ దెబ్బలాడుకుంటూనే వుండేవాళ్లు. ఒకళ్ల తప్పులు ఒకళ్లు మించడానికి ప్రయత్నించేవాళ్లు. ఈ ఇద్దరు ప్రత్యర్థుల్నీ జెంఘిజ్ ఖాన్ కలిపి వుంచడంలో యేదో పన్నుగడ లేకపోలేదు. అతను తరచుగా తన ఇతర నోకర్లతో కూడా ఇలానే చేసేవాడు, ఇద్దరిద్దర్ని ఒకే దండయాత్రలో పంపేవాడు. పోటీదార్లు ఒకళ్లని మించాలని ఒకళ్లెప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటారు...

దాడిలో జెబె ఎప్పుడూ ఉరవడిగా ముందుకే దూసుకుపోయేవాడు. అతని బలగాలు తరచుగా ప్రమాదకరమైన పరిస్థితుల్లో పడిపోయేవి. తోసుకువచ్చే శత్రువు దాడినుంచి నైపుణ్యం వెనక్కి తగ్గేవాడు. అన్ని వేపులనుంచీ విపత్కర స్థితి ముంచుకు వచ్చేటప్పుడు సుబుదై ముందుకు వెళ్లి రక్షించేవాడు. అతను శత్రువుమీద భారీ మంగోలు ఆశ్వికదళంతో దగ్గరగా చుట్టుముట్టేవాడు. నోకర్లకీ, గుర్రాలకీ కూడా చైనా ఇనప కవచాలు వుండేవి.

యెత్తరిగా, నిటారుగా, అసలు చిరునవ్వు నవ్వకుండా వుండే జెబె పోరాటం తర్వాత గాజులాంటి, నిశ్చల నేత్రాలతో, దుమ్ము కొట్టుకుపోయి, రక్తం మరకలతో సుబుదై దగ్గరికి వచ్చేవాడు. మకాం నెగడు దగ్గర కూర్చుని తనేం తప్పులు చెయ్యలేదనీ, శత్రువు సంఖ్య చాలా యెక్కువగా వుందనీ సుబుదైకి చెప్పేవాడు. సుబుదై మరో సారి జెబెని రక్షించిన వాడైనందుకు తృప్తిపడి చిరునవ్వు నవ్వేవాడు. యెప్పుడూ తప్పుల్ని సమర్థించుకోవద్దని అనేవాడు.

జెబెకి గర్వం, ఆత్మస్థైర్యం యెక్కువ. కోపిష్టి. అరవై అడుగుల దూరం నుంచి నేలమీద పరిగెత్తే ఉడుత తలని బాణంతో గురి చూసి కొడితే యెన్నడూ తన గురి తప్పదని అనుకునేవాడు. అతను గురి తప్పకుండా కొట్టే నేర్పరితనంవల్లా ఉరవడివల్లా అతనికి జెబె (బాణం) అనే పేరు వచ్చింది.

చుబుకంమీద నెరిసిన వెంట్రుకలు పుంజీలుగా వున్న సుబుదై ముసలివానిలాగా కనిపిస్తాడు. అతని వయసెంతో యెవళ్లకీ తెలీదు. యువకుడుగా వున్నప్పుడు అతనికి భుజంమీద గాయం అయింది. కండరాలు తెగిపోయాయి. అప్పట్నుంచీ అతని కుడి చెయ్యి వంకరగానే వుండిపోయింది. అన్ని పనులూ యెడం చేత్తోటే చేసేవాడు. అతని ముఖంమీద యెడమ కనుబొమకడ్డంగా కత్తి గంటు వుంది. యెడమ కంటి గుడ్డు చుట్టూతా చర్మం ముడుచుకుపోయి వుండేది. కన్ను పోయింది. కుడి కన్ను విప్పారి అతను కలుసుకున్న వాళ్లందరిలోనుంచీ సరాసరి చూస్తూ దూసుకుపోతున్నట్టు వుండేది.

సుబుదై పంజాలు కొరుక్కుపోయిన ముసలి నక్కలాగా జిత్తులమారిగా, హెచ్చరికగా వుండేవాడనీ, బోనులో చిక్కిన చిరుతలాగా చిర్రుబుర్రులాడే వాడనీ నోకర్లందరూ అనే వాళ్లు. సుబుదై నడిపిస్తే మీకు శత్రువంటే భయం అక్కర్లేదు, మీకు యెన్నడూ ప్రమాదం రాదు.

ప్రపంచపు అంచుల్ని తాకే కడపటి సముద్రానికి దాడి చేస్తూ పోవాలని జెబె మొండిగా కలగనేవాడు. పాట పాడే దూతద్వారా జెంఘిజ్ ఖాన్‌కి పంపిన నివేదికని జెబె కూర్చాడు. సుబుదై వూరికే తల వూపి, నవ్వుతూ అంగీకారం తెలియజేశాడు.

దారమ్మటపోయే పథికుల్ని పచ్చిక బీళ్లమీద కాసే వేగులు జెబె దగ్గరికి తీసుకువచ్చే వాళ్లు. అతను వాళ్లని పడమటి దేశాల్లో వుండే తెగల గురించీ, ఉత్తరాదిన వుండేవాళ్ల గురించీ, వాళ్ల దగ్గరికి పోయే దారుల గురించీ, అక్కడ వుండే నదుల గురించీ, రేవుల గురించీ రకరకాల వివరాలు అడిగేవాడు.

# దిమ్మరి ప్లోస్కిన్యాని తాతార్లు పట్టుకోవడం

ఒక రోజున వేగుల వాళ్లు అంతకు ముందు యెన్నడూ కలుసుకోని తెగవాళ్లని కొంతమందిని పట్టుకువచ్చారు. వాళ్లు మనుషుల్ని రేవు దాటించే మరగాళ్లు. వాళ్లు యెత్తరిగా వున్న విశాల భుజస్కులు. వాళ్లకి పెద్ద గడ్డాలు వున్నాయి.

"యెవళ్లు మీరు? యెక్కడి నుంచి వచ్చారు?" అని జెబె అడిగాడు.

మిగిలిన వాళ్లకంటే వెడల్పాటి భుజాలూ, యెత్తూ వున్న ఒకతను కిప్‌చాక్ భాషలో అన్నాడు:

"మమ్మల్ని దిమ్మరులంటారు. మేం పచ్చిక బీటిమీద తిరుగుతాం. మా తండ్రులూ, తాతలూ ఇక్కడికి పచ్చిక బీళ్లమీదకి పారిపోయి వచ్చారు, రాజుల నుంచి పారిపోయి, స్వేచ్ఛని కాంక్షిస్తూ..."

"మీ యజమానుల్ని మన్నించక పారిపోయి వచ్చారంటే మీరు బందిపోట్లూ, దిమ్మరులూ అయివుండాలి?"

"కాదు, మేము బందిపోట్లమూ కాదు, పూర్తిగా దిమ్మరులమూ కాదు. మేం స్వేచ్ఛాజీవులం, స్వేచ్ఛగా వేటాడేవాళ్లం, చేపలు పట్టేవాళ్లం".

"నువ్వెవరు? నువ్వే?" అని జెబె పొడుగాటి దిమ్మరిని అడిగాడు.

"నన్ను ప్లోస్కిన్యా అంటారు. మా దిమ్మరులు నన్ను తమ నాయకుడిగా యెన్నుకున్నారు".

జెబె తక్షణం సుబుదై భగతూర్ దగ్గరికి ఇలా వర్తమానం చేస్తూ నోకర్లని పంపాడే:

"రా! మనకి కావాల్సిన బందీలు దొరికారు".

నోకర్లు దౌడు తీస్తూ తిరిగివచ్చి ఈ సమాధానం తెచ్చారు: "సుబుదై భగతూర్ తన తివాసీమీద కూర్చున్నాడు. అతని పక్కన బస్తా చిక్కుడు గింజలున్నాయి. 'రావటం లేదు. తీరిక లేదు' అని అంటున్నాడు..."

జెబె పట్టుబడిన దిమ్మర్లని కాపలాలో వుంచి, తనతో ప్లోస్కిన్యాని తీసుకుని, నోకర్లు పరివేష్టించి వుండగా, సుబుదై దగ్గరికి వెళ్లాడు.

సుబుదై తన యుర్త్‌లో పట్టు పర్షియన్ తివాసీమీద కూర్చున్నాడు. అతను యెడం చేత్తో చిక్కుడు గింజలు తీసుకుని జాగ్రత్తగా వాటిని వింత దీర్ఘ పంక్తుల్లాగా అమరుస్తున్నాడు.

"యెవరితను?" అని సుబుదై అడిగాడు. ఓ క్షణం సేపు తదేకంగా చూసే ఒంటి కంటిని ప్లోస్కిన్యామీద వుంచి మళ్లీ గింజలకేసి తిరిగాడు. "కూర్చో, జెబే నాయన్" అన్నాడు.

సుబుదై చేతులు గబగబా గింజల్ని కదిలిస్తూ వుండడం పరిశీలించి, తను బందీలనుంచి విన్న దాన్ని జెబె వివరించాడు. ప్లోస్కిన్యాని దారి చూపించేవాడుగా వాడుకోవాలని సూచించాడు.

"కిప్‌చాక్ ఖాన్లు యేం చేస్తున్నారు?" అని సుబుదై అడిగాడు.

"వాళ్లు చచ్చేటంత భయపడుతున్నారు. మీ తాతార్ల షరుకాన్ నగరానికి వచ్చినప్పుడు కిప్‌చాక్ ఖాన్లు పారిపోయారు – కొంత మంది రష్యన్ దేశానికి, కొంత మంది బాడవల్లోకీ".

సుబుదై గింజలతో ఆడుకోవడం మానేసి, తదేకంగా ప్లోస్కిన్యాకేసి చూశాడు.

"రష్యన్ సైన్యం ఇప్పుడెక్కడుంది?"

"దేవుడికి తెలియాలి".

సుబుదై వణికాడు. అతని ముఖం నల్లబడింది. విశాలంగా తెరిచిన కన్ను ఆగ్రహంతో మండింది. వంగిన వేలితో దిమ్మరిని బెదిరించాడు.

"నీకు తెలిసిందంతా చెప్పు. జాడల్ని మరుగు పరచద్దు, లేకపోతే నిన్ను బొండకొయ్యకి వేసి పైన ఇరవై మంది నోకర్లని వుంచుతా. అప్పుడు మూలుగుతావు, పిండుకుపోతావు, చస్తావు..."

"యెందుకు చెప్పను?"

సుబుదై ఒకటి, రెండు సార్లు దిమ్మరిమీదకి అనుమానపు దృక్కులు పోనిచ్చి, మళ్లీ గింజల్ని యేరడం మొదలుపెట్టాడు, ఆఖరికి బున్‌మన్నాడు:

"విను, పచ్చిక బీటి దిమ్మరీ! సరిగ్గా వున్నదున్నట్టు నువ్వు అంతా నాకు చెప్తే నీకు బహుమతీ ఇస్తాను. ఇక్కడ చూడు, ఈ గింజల్ని. ఈ గింజల వరస చూడు: అది దాన్ నది. ఇక్కడున్న ఈ పొడుగాటి వరస – ఇది ద్నీపర్. చూపించు రష్యన్ నగరం కీయెవ్ యెక్కడుంది?"

ప్లోస్కిన్యా ఒక అడుగు ముందుకు వేసాడు. కాని ఇద్దరు మంగోలు భటులూ అతనిమీదకి లంఘించి కత్తితో వున్న అతని పటకాని తెంపేశారు. అప్పుడా దిమ్మరి జాగ్రత్తగా మోకాళ్లమీద వాలి, సుబుదై దగ్గరికి ఈడ్చుకుంటూ వెళ్లాడు.

"ఆం! కనిపిస్తోంది!" అన్నాడతను, కనుబొమలు ముడుచుకుని. "అది మా ద్నీపర్ నది... ఇది ద్నీపర్ ముఖద్వారం, సముద్రం వార... ఇక్కడ చిన్న నది కల్కా వుంది, మనం ఇక్కడ ఉన్నాం. వూరికే విను ప్రఖ్యాత ఖాన్: ద్నీపర్ నది ఉత్తరాన్నుంచి దక్షిణాదికి నిబ్బరంగా ప్రవహించదు. అది వంగిన చేతిలా వుంటుంది. దానికి వంపు వుంది. సరిగ్గా అక్కడ, భుజం వున్న చోట – అదే కీయెవ్; కింద ఇక్కడ మటికట్టు దగ్గర, ఇది నల్ల సముద్రం.

ఇక్కడ మోచెయ్యి పచ్చిక బీటిమీదకి చొచ్చుకు వుంటుంది – అక్కడ, అది ఖోర్తిత్సా ద్వీపం, ద్నీపర్ మధ్యలో. ఇక్కడ ఖోర్తిత్సా దగ్గర రష్యన్లు సైన్యాల్ని పోగు చేసుకుంటున్నారు". ప్లోస్కిన్యా ద్నీపర్ నది వంపుని చూపించడానికి గింజల్ని మార్చాడు.

"ఇక్కడి నుంచి కీయెవ్‌కి యెంత దూరం?" అని సుబుదై అడిగాడు. అతను గుప్పెడు బంగారు నాణేల్ని గింజలతోబాటుగా సంచీలోనుంచి తీసి తన పక్కన పెట్టుకున్నాడు.

ప్లోస్కిన్యా కళ్లు మెరిశాయి.

"కాని మీకు కీయెవ్‌తో యేం పని? రష్యన్లు కీయెవ్‌ని వదలరు. కీయెవ్‌కి చాలా దూరం ఇక్కడినుంచి".

"గుర్రంమీద కీయెవ్‌కి వెళ్లడానికి యెంతకాలం పడుతుంది?"

"ఇక్కడినుంచి కీయెవ్‌కి ఒకే గుర్రంమీద దేశానికి అడ్డం పడిపోతే పన్నెండు రోజులు పడుతుంది. గుర్రాల్ని మార్చుకుంటే ఆర్రోజులుల".

"ఇప్పుడు అర్థమయ్యేటట్టు మాట్లాడుతున్నావ్".

"కాని రష్యన్లే పచ్చిక బీటిమీద యెకాయెకీ కీయెవ్‌కి వెళ్లరు. వాళ్లు పడవమీద 'మోచేతి'దాకా వెడతారు – ఇక్కడ ఈ వంపుదాకా, ఖోర్తిత్సా ద్వీపందాకా. అక్కడ అవతలి వేపు దాటతారు. అక్కణ్ణుంచి లుకోమోర్యేకి అడ్డదారి వుంది. మంచి గుర్రం మహా అయితే మూడు నాలుగు రోజుల్లో వెడుతుంది. గుర్రాలు మార్చుకుంటే రెండు రోజులు".

"రెండ్రోజులేనా?" అని సుబుదై ఆశ్చర్యంగా అడిగాడు. "రష్యన్లు రెండ్రోజుల్లో ఇక్కడికి ద్నీపర్ నుంచి వెళ్లలేరు" అన్నాడు.

"చూడు, ఇక్కడ, వంపు దగ్గర ఖోర్తిత్సా నుంచి, మా రష్యన్లు కిప్‌చాక్ శిబిరాల మీద చాలా సార్లు దాడి చేశారు. బళ్లు లేకుండా వెడితే అక్కడికి రెండు మూడు రోజుల్లో వెడతారు".

సుబుదై, విలువైన సమాచారం అందుకుని, సంబరపడినట్టే కనిపించింది. అతను నవ్వేడు. మోకాలు చరుచుకున్నాడు. కుమిస్ తెమ్మని పురమాయించాడు. అతను ప్లోస్కిన్యాని జాడల గురించి, నదులమీద రేవుల గురించీ వివరంగా అడిగాడు. రష్యన్ల సైన్యం గురించీ, వాళ్లకి వున్న గుర్రాల గురించీ అడిగాడు.

"రష్యన్ల సైన్యాలు యెంత పెద్దవి?"

"ఇరుగుపొరుగు రాకుమారులందరూ తమ సైన్యాల్ని ఖోర్తిత్సాకి తీసుకురాగలిగితే – కీయెవ్, చెర్నిగొవ్, స్మొలేన్స్క్, గాలిచ్ లాంటి పెద్ద నగరాలనుంచీ, ఇంకా అనేక చిన్న ప్రాంతాల నుంచీ, అప్పుడు మైదానాలమీదకి వచ్చే పదాతి దళాలు, విలుకాళ్లు, ఆశ్వికులు సుమారుగా యాభై వేలమంది వుండచ్చు".*

---

* ప్లోస్కిన్యా మంగోలుల్ని బెదిరించడానికి రష్యన్, కిప్‌చాక్ సైన్యాల సంఖ్యని యెక్కువ చేసి చెప్పాడు. నిజానికి ఆ సంఖ్య చాలా తక్కువ. చరిత్రకారులు కచ్చితమైన అంకెల్ని ఇవ్వలేదు.

"అయితే రష్యన్లకి అయిదు తోమన్లున్నాయన్న మాట?" అని సుబుదై అన్నాడు. అయిదు బంగారు నాణేల్ని ద్నీపర్ నది ఖోర్తిత్సా వంపుమీద పెట్టాడు. అక్కడ నుంచి పచ్చిక బీటమీదకి సాగడం మొదలవుతుంది. "కిప్‌చాక్‌లకి యెంత మంది రౌతులున్నారు?"

"మరో యాభై వేల మంది వుండచ్చు. ఇప్పటికే ద్నీపర్ ఇవతల బ్రహ్మాండమైన కిప్‌చాక్ సైన్యం వుంది".

సుబుదై మరో అయిదు బంగారు నాణేల్ని పరిచాడు.

"అయితే మనకి వ్యతిరేకంగా మహా అయితే పది తోమన్ల రష్యన్లు కిప్‌చాక్‌లు వుంటారు కదా" అన్నాడు సుబుదై మౌనంగా గూఢంగా వున్న జెబెకేసి తిరిగాడు. "నీకు గుర్తుందా జెబె నాయన్, నల్ల ఇర్తిష్ దాటి ఖోరెస్మ్‌కి మనం వెళ్లినప్పుడు మనకి యెలాంటి సైన్యం వుండిందో? జెంఘిజ్ ఖాన్ దగ్గర్నుంచి మనం నేర్చుకున్నదేమన్నా వుందేమో చూపిద్దాం".

"నేను చేసిన పనికి నాకేదన్నా ఇయ్యి, మహా ఖాన్" అని ప్లోస్కిన్యా అన్నాడు.

"ఉగా! (లేదు!) నేనెవళ్లకీ డబ్బియ్యను. వాళ్లే నాకు తెచ్చి ఇస్తారు. దాన్నం తట్నీ అజేయుడైన మా నాయకుడు జెంఘిజ్ ఖాన్‌కి పంపిస్తా.... అయినా నీకో బహుమతీ వుంటుంది. నీకు కొడుకులున్నారా?"

"దేవుడి దయవల్ల నలుగురు". "యెక్కడున్నారు? దూరంగా వున్నారా?"

"వాళ్లు దాన్ అవతల రేవుల దగ్గరున్నారు".

"వాళ్ల దగ్గరికి వందమంది ఆశ్వికుల్ని పంపిస్తాను. ఇక్కడికి రెప్పపాటులో వాళ్లని తీసుకొస్తారు. రష్యన్ సైన్యాలమీద గూఢచారి పనిచేసి యెంత మంది సైనికులున్నదీ కనిపెట్టి తెలియజెయ్యమని నువ్వు వాళ్లతో చెప్పు. రష్యన్ నాయకులు యేమనుకుంటున్నారో విని తెలుసుకొమ్మని చెప్పు. తర్వాత వీలైనంత వేగంగా వచ్చి నాకు ప్రతీదీ వివరంగా చెప్పమను. అప్పుడు నిన్నూ, నీ కొడుకుల్నీ కూడా వదిలిపెట్టేస్తాను, నీకో పన్నెండు గుర్రాలనీ, తలా గుప్పెడు బంగారాన్నీ ఇస్తాను – దేనికి తడుములాడుతున్నావ్?"

ప్లోస్కిన్యా కదలకుండా నుంచుని, కాళ్లు యెడంగా పెట్టి, గట్టిగా నిట్టూర్చి అన్నాడు:

"మహా ఖాన్, నా తల తీయించెయ్యి, కాని నా కొడుకుల్ని వాళ్ల మానాన వాళ్లని వుండనియ్యి".

సుబుదై బుసకొట్టి, పిడికిలితో తివాసీమీద కొట్టాడు.

"నాతో అలా మాట్లాడ్డానికి నీకెన్ని గుండెలు! హేయ్, నోకర్లూ, మా గౌరవనీయుడైన అతిథిని చిరుతపులుల యుర్త్‌లోకి తీసికెళ్లి, కాపలా మూడింతలు చెయ్యండి. ఇతనికి ఖాన్ మాదిరీ భేషైన తిండి పెట్టమని సక్లాబ్‌తో చెప్పండి..."

# కీయెవ్‌లో ప్రమాద సూచన

"మీ పొరపొచ్చెముల తోడ
తెత్తురు పాషండులను
రష్యా గడ్డకు
మీ పోరువల్ల
పోదుము
కిప్‌చాక్‌ల చేతుల బడి".
(ఈగొర్ ఇతిహాసం)

కిప్‌చాక్‌లు హఠాత్తుగా లంఘించి ద్నీపర్ నది యెడమ వేపు నిట్రపాటి తీరంమీద రేవు పడవని తెల్లవారుతూ వుండగా పట్టుకున్నారు. వాళ్లు రేవు పడవలోకి వెళ్లి, సరంగుల్ని బెదిరించి, వాళ్లని పారిపోకుండా అడ్డగించారు. వాళ్లు చాలా యెక్కువ మంది వుండడంవల్ల నీళ్లు లోపలికి వచ్చి పడవ ఒరిగింది. తెల్లటి మచ్చలున్న గుర్రం మీద లావుపాటి ముసలి కిప్‌చాక్ ఖాన్ వచ్చాడు. అతనితోబాటు వంద మంది రౌతులు వచ్చారు. ఒకడు ఉత్సాహంగా ముందు వెళ్లాడు. అతను గుర్రపు తోకలూ, రాగి గంటలూ గుత్తులు కట్టిన ఖాన్ సంకేతాన్ని నిడుపాటి గడకి తగిలించి మోసుకెళ్లాడు. మరొకడు భేరీ వాయించాడు. మరో ఇద్దరు కీచుమంటూ తుత్తురాలు వాయించారు. మరో రౌతు అదుపు లేకుండా బుసకొట్టే గుర్రంమీద కూర్చుని కమ్చీ సర్‌మని దూశాడు, ఖాన్‌కి రేవు దగ్గరికి దారి చెయ్య ప్రయత్నిస్తూ.

చూస్తూ చుట్టూ నుంచున్న మూకలో శల్యావశిష్టంగా దుమ్ము కొట్టుకుపోయిన దిమ్మరి ఒకడున్నాడు. కిప్‌చాక్‌లు "ఎడారి భూముల"* నుంచీ భీకర అజ్ఞాత తండా "తాతార్‌ల" నుంచీ పారిపోయారు. ఆ తాతార్లకి గడ్డాలే లేవు, వాళ్ల ముక్కులు చప్పిడివి, వాళ్ల తలలమీద దయ్యానికి మాదిరీ చిక్కులు పడ్డ నిడుపాటి జుట్టు కొంచెం వుంది. వూరికే ఈ పాషండులైన తాతార్లని చూసి జనం చచ్చి పడిపోయారు" అని అతను చెప్తున్నాడు.

* "ఎడారి భూములు" – నల్ల సముద్రం వార వున్న పచ్చిక బీళ్లు.

"వాళ్లు యెల్లాంటి వాళ్లు? చెప్పు, పుణ్యపధికుడా – నువ్వు పండితుడిలా, తెలిసిన వాడివిలా కనిపిస్తున్నావ్".

ఆ దిమ్మరి పొడుగాటి దండంమీద ఆనుకుని మాట్లాడ్డం మొదలెట్టాడు:

"వాళ్లు, తాతార్లు అంటారు. యెప్పుడూ వినలేదు వాళ్ల గురించి. వాళ్లు భిన్న భాషలు మాట్లాడతారు. కిప్‌చాక్‌లు మన వాళ్లని హతం చేసి, బానిసల్ని చేసుకున్నట్లుగానే – వీళ్లకీ వాళ్లు అలానే చేశారు. తాతార్లు వాళ్లని వూరికే జయించి, తరిమెయ్యడమే కాదు మొత్తానికి తుడిచి పెట్టేస్తారు, వాళ్ల ప్రాంతంమీద తిష్టవేస్తారు..."

కుడి తీరంనుంచి, తారు పూసిన పెద్ద పడవల్లో కీయెవ్ మహా రాకుమారుడి సైనికులు వచ్చారు. వాళ్లు ఆ మూకని తరిమేశారు. రేవు చుట్టూతా ఖాళీ జాగా చేశారు, వృద్ధ కిప్‌చాక్ ఖాన్ పడవ యెక్కడానికి వీలుగా.

ఖాన్ కమ్మీమీద తోలు తొడుగు వున్న చేతిని ఆన్చి నుంచున్నాడు. ఎర్రటి పట్టు అంగీ తొడుక్కున్నాడు. దానికి నల్ల బొచ్చు అస్తరు వుంది. యెత్తైన ముత్యాల అలంకారంతో వున్న కూచి కుళ్లాయి పెట్టుకున్నాడు. చేతిని వంపు తిరిగిన కరవాలం పిడిమీద వుంది. అది వజ్రాలు పొదిగి మెరుస్తోంది.

ఖాన్ ఠీవిగా, రాజసంగా వున్నాడు, పైకి నిబ్బరంగానే వున్నాడు. అతని కళ్లు మాత్రం ద్నీపర్ నది నల్లని నీళ్లకేసి ఓర చూపులు చూస్తూ బెదిరి వున్నాయి.

ఖాన్ ఉదారంగా చెల్లించాడు. సరంగులకి చాలా గుప్పిళ్ల వెండి నాణేలు ముట్టాయి. పట్టుదలగా లాగారు. రోజంతా ఆ పెద్ద బిడారుని దాటించారు: బుటా అలంకారం తివాసీ కప్పిన యెంపికైన గుర్రాలు, భయంతో అరిచి గీపెట్టే ఒంటెలు, మెళ్లమీద కంటా వంపులు తిరిగిన నిడుపు కొమ్ముల ఆవులు, బాగా ముస్తాబు చేసిన పడుచు విదేశీ ఆడ బానిసలు. మొత్తం కీయెవ్ మహా రాకుమారుడికీ ఇతర రష్యన్ రాకుమారులకీ కానుకలు.

ఇతనే వృద్ధ కిప్‌చాక్ ఖాన్ కొత్యాన్ అనీ, "ఎడారి భూమిలో" తిరుగుతూ తన ముద్ర కొట్టిన లక్ష గుర్రాల అధిపతి అనీ గుంపులో జనం అనుకున్నారు.

"కొత్యాన్ – పచ్చిక బీళ్ల యజమాని. గొప్ప పోరాడే సైన్యాన్ని పోగు చెయ్యగల ఒక్కగానొక్కడు. అతను కీయెవ్‌కి వూరిలే వెళ్లడం లేదు. కిప్‌చాక్ ఖాన్లందరూ తమ కుటుంబాలతోటి రష్యన్ భాగంకేసి హడావుడిగా వెళ్లిపోతున్నారు. వారు ద్నీపర్ నది అన్ని వంతెనలపైనుంచీ, రేవులనుంచీ దాటుకుపోతూ వున్నారు. కిప్‌చాక్ సైన్యాలు కవచాలతోటీ, డాలులతోటీ, బల్లేలతోటీ గుర్రాలమీద నీళ్లలోకి పోతున్నాయి. యేం జరగబోతోంది? వీళ్లకి దుష్టబుద్ధి లేదా? కిప్‌చాక్‌లు ఉల్లాసకరమైన పాటలేంపాడ్డం లేదు. ఒంటె మూలుగులాగా యేడుపు పాటలే".

కీయెవ్ మహా రాకుమారుడు మస్తిస్లావ్ రొమానొవిచ్ ప్రాసాదంలో జరగబోయే సభ కోసం ప్రతీదీ సిద్ధం అవుతోంది. పెద్ద రాకుమారులూ, చిన్న వాళ్లూ కూడా వస్తారని అనుకుంటున్నారు. ఖాళీ గుర్రాలతోటి వాళ్ల దగ్గరికి వార్తాహరుల్ని పంపారు. రష్యా గడ్డని రక్షించడానికి వాళ్లకి రమ్మని విజ్ఞప్తి చేశారు.

తగినంత మర్యాదలు చూపిస్తూ ఆ ప్రముఖ అతిథుల్ని ఆదరించడం కీయెవ్ రాకుమారుడికి అంత తేలిక కాలేదు. వాళ్లల్లో ప్రతివాడూ తన పరివారంతో వచ్చాడు. గొప్ప రాకుమారుడైతే మరింత పెద్ద పరివారం వుండేది. కీయెవ్ ఉగ్రాణం వాళ్లు కీయెవ్‌లో వున్న రొట్టెలు చేసేవాళ్లనీ, కసాయి వాళ్లనీ మాంసం తిను బండారాలు చెయ్యమనీ, గోధుమ రొట్టెలు చెయ్యమనీ, వాటిని ప్రాసాదం ముంగిట్లోకి బళ్లకెత్తించమనీ నియమించారు. కీయెవ్ రాకుమారులకి మనోమాఖ్ రాకుమారుడు వున్న వంద యేళ్ల నాటి అదే వైభవం ఇప్పుడు లేదు. అప్పట్లో మొత్తం రష్యన్ భూభాగాలు – కీయెవ్, పెరెయస్లావ్ల్, స్మొలేన్స్క్, సూజ్‌దాల్, రొస్తోవ్ కీయెవ్ మహా రాకుమారుడికి ఆధిపత్యంలో వుండేవి. సంపద్వంతమైన సుదూర నొవ్‌గొరొద్ కూడా అతని కింద వుండేది. ఇక రాకుమారులందరూ అతనికి లొంగి వుండే వాళ్లు, కిప్‌చాక్‌లు తలయెత్త సాహసించే వాళ్లు కాదు. రష్యా కీర్తిని యెల్లల ఆవలకంటా పాకించాడు. కాని యేళ్లు గడిచాయి. మనోమాఖ్ వంశం చీలిపోయి చెదిరిపోయింది. రాకుమారులు నగరాలనీ, తాలూకాల్నీ తమ కొడుకులకీ, అన్నదమ్ముల పిల్లలకీ మనవళ్లకీ పంచేశారు. ఇప్పుడు కీయెవ్‌ని పాలించే మస్తిస్లావ్ రొమానొవిచ్ దుర్బలుడు, పరిత్యక్తుడు. గత ఇరవై యేళ్లలోనూ రష్యన్లతోటి యుద్ధాలవల్ల నగరంలో జరిగిన విధ్వంసం దాన్ని బలహీనం చేసే శక్తిని హరింపచేసింది, శుష్కింప చేసింది. గాలిచ్‌వాసులు, వ్లదీమిర్‌వాసులు, సూజ్‌దాల్‌వాసులు, దుష్టబుద్ధి రాకుమారులు పిలుచుకువచ్చిన కిప్‌చాక్‌లు ప్రాచీన రాజధానిని కొల్లగొట్టి తగలబెట్టేశారు.

అన్ని వినాశనాలనుంచి తేరుకోవడం కీయెవ్ పౌరులకి తేలికగా లేదు. కిటికీలు ధ్వంసం అయి, తలుపులు బద్దలు కొట్టి యెన్నో ఇళ్లు శిధిలాల్లో వున్నాయి.

మరో సారి వినాశనం పచ్చిక బీటిమీదనుంచి వస్తోంది. యెన్నడూ పొత్తుకుదరని రాకుమారుల్ని, గర్వంగా మొండిపట్టుగా వుండేవాళ్లని, మరింత వైభవభరిత సింహాసనం, మరింత లాభదాయకం అయిన నగరం కోసం, మరింత జనాభా గల తాలూకు కోసం తమలో పోట్లాడుకునే వాళ్లని, ఇది దగ్గరికి చేర్చింది. పాత శత్రువులు కిప్‌చాక్‌లని కూడా సహాయం అర్థిస్తూ చేతులు కట్టుకుని కీయెవ్‌కి పరిగెత్తి వచ్చేటట్టు చేసింది. దీనంగా, అణగారిపోయి వాళ్లు రాకుమారుడి ముంగిట్లో గుంపులుగా మడమలమీద కూర్చున్నారు. రష్యన్ రాకుమారులు రావడం మొదలవగానే కిప్‌చాక్‌లు వాళ్ల దగ్గరికి పరిగెత్తి వాళ్ల గుర్రాల కళ్లేల్ని ముద్దుపెట్టుకుని అణకువగా చేతులు చాచి అరిచారు:

"మీ సైన్యాల్ని సమకూర్చండి! మా పచ్చిక బీళ్లమీదకి రండి! మమ్మల్ని రక్షించండి! భయంకర శత్రువుని తరిమెయ్యడానికి మాకు సాయం రండి!"

రాకుమారులు తమ తమ పరివారంతోటి కీయెవ్ రాకుమారుడి ప్రాసాదం ముంగిట్లో సమావేశం అయ్యారు. దెబ్బలాడుకుంటూ ఒకళ్లకొకళ్లు దూరంగా వుండిపోయారు. లేదా అవతల వాళ్లు యేం చెప్తున్నారో వినేందుకు వాళ్ల దగ్గరికి వెళ్లేవాళ్లు. కీయెవ్ ప్రాసాద అధికారులు యెంత బతిమాలినా ప్రాసాదపు కొలువు మందిరంలోకి వెళ్ల నిరాకరించారు.

కిప్‌చాక్ ఖాన్ కొత్యాన్ మిగిలిన వాళ్లతో కలిసి ముంగిట్లో వున్నాడు. యెప్పటిలాగానే తల బిరుసుగా వున్నాడు. అతని పక్క ఛాతీమీద చేతులు కట్టుకుని, మబ్బుగా, కదలకుండా కూచి కుళ్లాయిలు పెట్టుకుని పచ్చిక బీటి సలహాదార్లు నుంచున్నారు. వాళ్ల ముఖాలు బీటి గాలులకీ యెండకీ కమిలివున్నాయి. రాకుమారులు రావడం మొదలవగానే ఎవళ్లు యెవరైందీ, వాళ్ల పేర్లు యేమిటైందీ, యెవళ్లు ప్రత్యేకం పలుకుబడిగల వాళ్లైందీ అధికారంగల వాళ్లైందీ ఖాన్‌కి చూపిస్తూ వున్నాడొక వృద్ధ దుబాసీ. అతను పచ్చిక బీటి దిమ్మరుల్లో ఒకడై వుంటాడు. కొత్యాన్ గౌరవం చెయ్యనవసరం వున్న వాళ్లని బేరీజు వేసి, వంగి వందనం చేస్తూ, కష్టంమీద వేళ్లని నేలకి ఆనిస్తూ, హుందాగా నిటారుగా నిలబడుతూ, నెరిసిపోతూ వున్న నల్ల మీసాల్ని నిమురుకుంటూ యీడ్చుకుంటూ వెళ్లాడు. యెప్పుడూ అవే మాటలు మాట్లాడాడు:

"మాకు సాయం చెయ్యి! సోదరుడిగా వుండు! మనందరం ప్రమాదాన్ని యెదుర్కొంటున్నాం. మనం కలిసి వుంటే దాన్ని తరిమెయ్యగలం. నా చిన్న కానుకని తృణీకరించవద్దు, యెవర్నీ మర్చిపోను. అందరికీ గౌరవం చేస్తాను – బట్టలతో, గుర్రాలతో, పశువులతో, ముచ్చటైన పడుచు బానిసలతో".

సూర్యుడు నడినెత్తికెక్కాడు. రాకుమారులు ఒకళ్లకొకళ్లు ఇంకా దూరంగానే నుంచున్నారు. ప్రాసాదపు ముంగిట్లో గట్టిగా గోల చేస్తూ వాదులాడుకుంటూనే వున్నారు. ఎవళ్లు ముందు కీయెవ్ రాకుమారుడి ప్రాసాదం మెట్లెక్కి వెడతారా అని అందరూ చూస్తూనే వున్నారు. రాకుమారుడు మస్తిస్లావ్ రొమానొవిచ్ యెవళ్ల కోసమో ఇంకా నిరీక్షిస్తున్నాడని గుసగుసలు వినిపించాయి. బహుశా ఉత్తరాది నుంచి దూతల కోసమేమో, శక్తువంతుడు తలబిరుసు మనిషీ అయిన సూజ్‌దాల్ రాకుమారుడు యూరి వ్సేవొలొదొవిచ్ నుంచి వచ్చే దూతల కోసం. అతను తనే వ్లదీమిర్‌లో ఒక సభ జరుపుతున్నాడు. బీదరికం పాలైన కీయెవ్ రాకుమారుల సభకి రావడం లేదు అతను. గాలిచ్ రాకుమారుడు మస్తిస్లావ్ ఉదాత్ని* కూడా కనిపించడం

* అతని సమకాలికులు గాలిచ్ రాకుమారుణ్ణి మస్తిస్లావ్ 'ఉదాత్ని' లేదా అదృష్టవంతుడు అని పిలిచే వాళ్లు.

లేదు. అతనే అందరికంటే యెక్కువగా ఈ సమావేశానికి నలుగుర్నీ రమ్మని పిలిచాడు. అతని దూతలు ప్రతివాళ్ల దగ్గరికీ వెళ్లి "ప్రమాదం తప్పించుకోలేనట్టుగా ముంచుకొస్తోంది. తక్షణం రండి!" అని పిలిచారు.

హఠాత్తుగా ఉద్వేగం ముంగిట్లో ఆవరించుకుంది. వాళ్లు గుసగుసలాడుకోవడం మొదలెట్టారు:

"మస్తిస్లావ్ ఉదాత్ని వచ్చిదు!" – ప్రతి వాళ్లూ ఆ రాకుమారుణ్ణి చూసే కుతూహలం కొద్దీ ముందుకు తోసుకు రాబోయారు. విజయవంతంగా నడిపిన దండయాత్రలకీ, విజయాలకీ అతను ప్రసిద్ధుడు.

మస్తిస్లావ్ ఉదాత్ని వయసు మీరిన వాడైనా సునాయాసంగా నడిచాడు. వాలిన మీసాన్ని వేలి చుట్టూతా మెల్లిగా మెలితిప్పుతూ యెవళ్ల కోసమో నన్నట్టుగా గుచ్చుకుచూసే నల్లని కళ్లతో చురుకైన చూపు ఆ సమూహం మీద విసిరి అతను నిశ్చలంగా నుంచున్నాడు. యుద్ధం దుస్తులు వేసుకుని, అతను జరీ శిరస్త్రాణం పెట్టుకున్నాడు. అది యెండలో మెరుస్తోంది. బంగారు నగిషీ చెక్కిన తేలిక కవచం వేసుకున్నాడు. అతను నడుస్తూ వుంటే అతని యెర్ర అంగీ అంచులు గాలికి కొట్టుకున్నాయి. అతను ముంగిట్లో ఒక మూల వున్న కొత్యాన్‌ని చూసి సరాసరి అతని దగ్గరికి వెళ్లాడు. కొత్యాన్ చేతులు చాచి అతన్ని కలుసుకోవడానికి గబగబా వెళ్లాడు. వాళ్లు ఒకళ్ల భుజం ఒకళ్లు పట్టుకున్నారు. కొత్యాన్ తన తలని గాలిచ్ రాకుమారుడి ఛీతీమీదకి వంచాడు. కొత్యాన్ తెల్లని టోపీ దుమ్ములో పడిపోయింది. కొప్‌చాక్ ఖాన్ భుజాలు మెలితిరుగుతూ వణకడం ప్రతివాళ్లూ చూశారు.

"అతను యేడుస్తున్నాడు – యేడవనీయండి!" అని గుంపు గుసగుసలాడుకుంది. "వీళ్లు మన వాళ్లని యెన్నో సార్లు బందీలుగా పట్టుకున్నారు: ఇప్పుడు వీళ్లకి తెలుస్తోంది కన్నీళ్లు కార్చడం యేమిటో! మస్తిస్లావ్ కొత్యాన్ ఖాన్ కూతుర్ని పెళ్లాడాడు, అంచేత అతను ధనికుడైన మామగారికి వత్తాసు వుండాలి..."

మస్తిస్లావ్ ఉదాత్ని వచ్చాడని ప్రాసాదం పహారావాళ్లు తెలియజేశారు. అయినా మస్తిస్లావ్ రొమానొవిచ్ ఆలస్యం చేశాడు, తన బంధువుని కలుసుకుందుకు ప్రాసాదం మెట్లమీదకి రాలేదు. పాత పుళ్లు ఇంకా సలుపుతున్నాయి. మస్తిస్లావ్ ఉదాత్ని కొత్యాన్‌ని కాగలించుకుని ముంగిట్లో ఒక మూలకి అతన్ని తీసుకుపోయాడు. లోగొంతుకలో మాట్లాడుకుంటూ అక్కడ వాళ్లు చాలా సేపు వుండిపోయారు.

మరో సారి ముంగిట్లో కదలిక వచ్చింది. ఉద్రేకభరిత రావాలు వినిపించాయి.

"రొస్తోవ్ యువ రాకుమారుడు వసీల్కో కాన్‌స్తంతీనొవిచ్ వచ్చాడు".

ముంగిట్లో దారుఢ్యమైన యువ యోధుడు నడిచివచ్చాడు. మెరుపు నూనూగు అతని చుబుకంమీద కమ్మీ కమ్మకుండా వుంది. గాలిచ్ మస్తిస్లావ్‌లాగా అతనూ యుద్ధం దుస్తులు

వేసుకుని వున్నాడు. కవచం, ఉక్కు శిరస్త్రాణం, పటకా దగ్గర పొడుగ్గా నిటారుగా వుండే కత్తి. అతని వేషం అట్టహాసంగా లేదు. అతని యెర్ర అంగీ మాసిపోయి వుంది. అతని బట్టలన్నీ దుమ్ము కొట్టుకుపోయి వున్నాయి, బురద మరకలతో వున్నాయి. అతను అప్పుడే గుర్రం దిగాడని తెలుస్తూనే వుంది. అతని పక్కన ఒక ముసలతను నడిచాడు. నిడుపాటి నెరిసే వెంట్రుకలు అతని భుజాలమీద పడుతున్నాయి. భుజంమీద ముతక చర్మం తాటినుంచి ఓ తంబూరా వేలాడుతోంది.

"అతనే అంధుడైన గాయకుడు, ప్రఖ్యాత గాయకుడు గ్రెమిస్లావ్! అతను కిప్‌చాక్‌లని చాలా సార్లు ఓడించాడు. కాని ర్యజాన్ రాకుమారుడు గ్లెబ్ అసూయ కొద్దీ అతన్ని చీకటి కొట్లో బంధించి, కళ్లు పీకించి, మూడేళ్లు నిర్బంధించాడు. చీకట్లో ఊరట కోసం గ్రెమిస్లావ్ పాటలు కూర్చుకున్నాడు. పాటలవల్ల చీకటి కొట్లోనుంచి అతన్ని బయటికి తీసుకువచ్చారు. అప్పట్నుంచీ ఓ నగరంనుంచి ఇంకో నగరానికి పాత కాలం కథలు గానం చేస్తూ తిరిగాడు. గ్రెమిస్లావ్ పాట వింటాంలా వుంది!"

యువ రాకుమారుడు వసీల్కో ఆప్యాయంగా నవ్వుతూ పెద్ద రాకుమారులకి మన్నన చేస్తూ అక్కడందరితోటీ కలిసిపోయాడు. ఆ రాకుమారులే స్వయంగా అతన్ని పలకరిస్తూ ముందుకు వచ్చారు:

"సూజ్‌దాల్‌ల విషయం యేమిటి? వాళ్లు వస్తారా? నువ్వు వాళ్ల పొరుగునేగివుంట, వాళ్లిక్కడ యెందుకు లేరో నీకు తెలిసేవుండాలి. సూజ్‌దాల్ మహా రాకుమారుడు యూరి వ్సేవొలొదొవిచ్ నీకు స్వయానా మేనమామ; అతన్ని ఒప్పించారా?"

"ఇంకా ఆలోచనలో వున్నాడు. వస్తాడో లేదో – యెవడికి తెలుసు..."

రాకుమారుడి ప్రాసాదం మెట్లమీద ఇద్దరిద్దరుగా పదిమంది అంగరక్షకులు ప్రత్యక్షమయ్యారు. అందరూ ఎంపికైన వాళ్లే. కవచాలు, శిరస్త్రాణాలు ధరించి, చిన్న బల్లేలతో ముచ్చటగా, వైభవభరితంగా, ఉన్నారు. వాళ్లు మెట్లు దిగి వచ్చి, కింద రెండు వేపులా నుంచున్నారు. మస్తిస్లావ్ రొమానొవిచ్ కోసం నిరీక్షించారు. అతను బంగారు దేగ చివర వున్న దండంమీద ఆనుకుని మెల్లిగా వచ్చాడు. అతనికి కటువైన కళ్లు నిటారైన కనుబొమలు వున్నాయి. ఆ కళ్లు అలిసినట్టుగా, విచారంగా వున్నాయి. చివళ్లు కొంచెంగా దువ్విన నెరిసిన గడ్డం, ఛాతీమీద శిలువ, బంగారు విగ్రహం, బరీబుటా కఫ్తాన్ మొత్త రాకుమారుడి వేషం రుషి వాలకంలా వుంది. యుద్ధ వ్యాకులతకంటే యెక్కువగా పవిత్ర జాగరాల గురించీ, అర్థరాత్రి ప్రార్థనల గురించీ తెలియజేస్తున్నాయి. రాకుమారుడు కొంచెంగా కుంటుతూ మెట్లు దిగి ఆఖరి చీడీమీదనుంచున్నాడు.

"స్వాగతం! గౌరవనీయ అతిథులారా!" అన్నాడు విచారంగా, వ్యాకులంతో భారమైనట్టు కనిపించే స్వరంతో.

ముంగిట్లోనుంచున్న రాకుమారులందరూ, యెవడికి వాడు తను చెప్పేదే వినిపించాలనే ప్రయత్నంతో ఒక్క సారే అరిచారు.

"యెందుకు మమ్మల్ని పిలాచావు? ఆటవిక కిప్‌చాక్‌లని రక్షించడానికా? వాళ్లని అణగదొక్కడం జరిగితే మంచిదే. వాళ్లు లేకపోతేనే బాగుంటుంది. వాళ్లంతట వాళ్లని రక్షించుకోనీ – చూస్తూ వుందాం!"

లావుపాటి ఖాన్ కొత్యాన్ గుంపులోనుంచి దారి చేసుకుంటూ, మెట్లదాకా దొడ్డికాళ్లతో ఈడ్చుకుంటూ గబగబా వచ్చాడు. మొదటగా వేళ్లతో నేలని తాకాడు, తర్వాత బంగాలు జరీ రాచ దుస్తులు తాకాడు. ఉద్రేకంతో గద్గదికమై అన్నాడు:

"తండ్రీ! నిన్ను ప్రార్థిస్తున్నాను! నువ్వెప్పుడూ నాపట్ల ఆదరంగానే వున్నావు, నేనూ నీపట్ల అల్లానే వున్నాను. మాకు తండ్రిలాగా వుండు! జెంఘిన్ ఖాన్ పంపిన ఈ భయంకర మనుషుల్ని తరిమెయ్యడంలో మాకు సాయం చెయ్యి. వాళ్లు మా గడ్డమీద తోడేళ్లలా దూసుకువస్తున్నారు, ఈ దుష్ట జాతి తాతార్లనేవాళ్లు. ఇవాళ మా భూమినంతటినీ మానుంచి తీసేసుకున్నారు. రేపు నీ దగ్గరికి వచ్చి, మీ రష్యా భూముల్ని తీసేసుకుంటారు. మమ్మల్ని రక్షించు! మా రక్షణకి రాకపోతే మేం నాశనం అయిపోతాం, మిమ్మల్ని రష్యన్లని రేపు నాశనం చేసేస్తారు. మనమంతా ఐక్యం అయి ఒక్క సైన్యం కావాలి".

మస్తిస్లావ్ ఉదాత్ని రాకుమారుడు నిబ్బరంగా, గబగబ అంగలు వేసుకుంటూ ముందుకు వచ్చి రాతి మెట్లు యెక్కాడు.

"ప్రఖ్యాత రాకుమారులారా, గౌరవనీయ సైన్యాధిపతులారా, సకల వీర రష్యన్లారా!" అన్నాడు మస్తిస్లావ్. "మనమంతా పవిత్ర రష్యా దేశపు బిడ్డలం కాదా? పాత కజ్జాలు కోట్లాటలు, కిప్‌చాక్‌లతో యుద్ధాలు మరిచిపోదాం. మనం వాళ్లతో యుద్ధం చేశాం, బందీలుగా పట్టుకున్నాం, వాళ్లు మన నేలని ధ్వంసం చేశారు... కాని ఇప్పుడు కష్టకాలం దాపురించింది కిప్‌చాక్‌లకీ మనకీ కూడా. కొత్త, అజ్ఞాత శత్రువు మన మీద దాడి చేస్తూ వుంటే కిప్‌చాక్‌లతో యుద్ధంకంటే స్నేహం మెరుగు! పాషండ జెంఘిజ్ ఖాన్ తాతార్లకి వ్యతిరేకంగా వీళ్లకి సాయం చెయ్యకపోతే కిప్‌చాక్‌లు అటువేపు పోవచ్చు. శత్రువు బలం ఇంకా యెక్కువ గావచ్చు".

ప్రఖ్యాత మస్తిస్లావ్ రాకుమారుడు చెప్పేది ఆ గుంపు ఉగ్గబట్టుకుని వింది. అప్పుడు గొణుగుళ్లు వినిపించాయి:

"పిలవని అతిథులు రావడం ఇది మనకి మొదటి సారి కాదు. వాళ్లు వెంటబడేది కీయెవ్ రాకుమారుడ్ని, అతన్ని వాళ్ల గురించి బాధ పడనివ్వండి!..."

ఆ గుంపు గొణిగింది. వాళ్లకి తెలుసు రాకుమారుల మధ్య సోదర ప్రేమ లేదనీ, ఉమ్మడి సంకల్పం లేదనీ. యేనాటి నుంచో వున్న వైషమ్యం, పాత పుళ్లు వాళ్లని సలుపుతునన్నాయి.

మంత్రాలు చదవడం వినిపించింది. పర్వదినాల్లో మతాధిపతులు వేసుకునే డాబుట్టల వూరేగింపు ఒకటి సరిగ్గా ఆ సమయంలో రాకుమారుల మధ్య రగులుకునే ఉద్రేకాలనీ, పోట్లాటలనీ శాంత పరిచేందుకు వచ్చింది.

కీయెవ్ రాకుమారుడు రాజగురువు ముందునుంచున్నాడు. చేతులు రెండూ జోడించి తల వంచాడు. ఆ వృద్ధుని హస్తాన్ని చుంబించి శుభం అని చెప్తూ మెల్లిగా అన్నాడు:

"మాకు ఉపదేశం చెయ్యి, పవిత్ర మూర్తీ! రాకుమారుల్ని కలిసికట్టుగా ఐక్యమత్యంతో సంఘీభావంతో వుండమని, తమ పాత కొట్లాటలని మరిచిపొమ్మనీ బోధించు".

రాజగురువు మెట్లెక్కి, మూడు దిశలా అక్కడ చేరిన సమూహాన్ని ఆశీర్వదిస్తూ, తను తయారు చేసుకున్న ఉపన్యాసాన్ని మొదలెట్టాడు:

"నా ప్రియమైన సోదరులారా, పుత్రులారా! పవిత్ర పదం ప్రకారం భక్తిగా ఆచరించడం నేర్చుకోండి. మంచి పనులకే పరిమితం కండి, మన ప్రభువు పేరుమీద! జిహ్వని అదుపు చేసి, మనసుని అణకువ కావించి, శరీరాన్ని లొంగి వుండేటట్టు చేసుకుని మీ ఆగ్రహాన్ని అణగదొక్కండి!..."

వినయంగా తలవంచి కీయెవ్ రాకుమారుడు నుంచున్నాడు. గాలిచ్ మస్తిస్లావ్ జనంపైగా ఇబ్బందిగా చూశాడు. వినిపించని గొణుగుళ్లతో పెదాలు కదలడాన్నీ, అసంతృప్తి ముఖాలనీ గమనించాడు. రాజగురువు కొనసాగించాడు:

"మిమ్మల్ని దోచుకుంటే తృప్తి పడండి, చింత పడకండి; మిమ్మల్ని ద్వేషించి వెన్నాడితే ఒపిగ్గా వుండండి, భరించండి. మిమ్మల్ని తిడితే మౌనంగా వుండండి! మన ప్రభువు మూడు సద్గుణాలతో శత్రువుని నిర్జించడం యెలాగో మనకి నేర్పాడు: పశ్చాత్తాపం, కన్నీళ్లు, దాతృత్వం..."

మస్తిస్లావ్ జాగ్రత్తగా నలుగురు పరితోదర్శకులు దగ్గరికీ వెళ్లి, మెల్లిగా అన్నాడు:

"ఈయనకి మతి తప్పింది. కంపు చేస్తున్నాడు. యెవళ్లకి కన్నీళ్ల గురించీ పశ్చాత్తాపం గురించీ బోధిస్తూ వుంట? రాకుమారులకి చెప్తున్నాడు–నౌకర్లకీ, దాసులకీ కాదు! యేదో స్తోత్రగీతమో మరోటో యెత్తుకోండి, తలా ఒక గొర్రెనీ ఇస్తాను!"

రాజగురువు గొణుగుతూనే వున్నాడు, కాని నలుగురు పరితోదర్శకులూ వున్నట్టుండి అలంకార పద భూయిష్టమైన గీతం యెత్తుకున్నారు. దాన్ని మతాధిపతులందరూ, కుర్రాళ్లూ కంచు కంఠాలతో అందుకున్నారు. రాకుమారుడి ఇంట్లో వుండే అధికారులు ఆశ్చర్యపడ్డ రాజగురువు చుట్టూతా వచ్చి, ప్రాసాదంలోకి వెళ్లడానికి రాతి మెట్లు యెక్కడంలో సాయపడ్డారు.

రొస్తోవ్ యువ రాకుమారుడు వసీల్లో పై మెట్టుకంటా యెక్కాడు.

"నేనిక్కడికి చాలా ఉత్తరాదినుంచి, శక్తివంతమైన రొస్తోవ్‌నుంచి హడావుడి పడుతూ వచ్చాను. మన రష్యా గడ్డ కోసమూ, క్రైస్తవ విశ్వాసం కోసమూ మీకు చెప్పదలచుకున్నది

ఇదీ. సైన్యాల్ని సమీకరించమనీ, రష్యా భూముల్ని రక్షించడానికి రెక్కలు కట్టుకు రమ్మనీ కీయెవ్ రాకుమారుడు మస్తిస్లావ్ రొమానొవిచ్ నుంచి అత్యవసరంగా వార్తాహరులు మా వద్దకి వచ్చారు. నేను నా చిన్న దళాన్ని కూడా తీసుకొచ్చాను. కాని మనందర్లోకీ బలసమన్వితుడైన సూజ్‌దాల్ రాకుమారుడు యూరివ్సేవొలొదొవిచ్ ఇంకా మీనమేషాలు లెక్క పెడుతున్నాడు: తాతార్లు సూజ్‌దాల్‌కి వస్తారా లేక పక్కకి మళ్లిపోతారా అని. ఇక్కడ మీరూ ఉన్నారు అదే పని చేస్తూ – యెవళ్ల గురించి వాళ్లే అనుకుంటున్నారు. మన పవిత్ర రాజగురువులు యుద్ధానికి పని కొచ్చే ముక్కలు చెప్పడం లేదు, కాటికి కాళ్లు చాచుకున్న ముసలాడికి చెప్పే మాటలు చెప్తున్నాడు–పశ్చాత్తాపం, కన్నీళ్లు.... చేతులు కట్టుకు లొంగి వుంటే మనం శత్రువుని ఆపలేం, రష్యా గడ్డనీ రక్షించలేం...”

“నిజం! వసీల్కో చెప్పింది నిజం!” అని గుంపు అరిచింది.

“అజ్ఞాత, దుష్ట ప్రజ త్వరగా, దౌడు తీస్తూ వస్తోంది. పిలవకుండా వచ్చే ఈ అతిథులకి హార్దిక స్వాగతం చెప్పాలి. ఇప్పుడే శాశ్వతంగా వాళ్లని వదిలించుకోవాలి. తాతార్లకంటే రెక్కల్లేవు. వాల్లు ద్నీపర్‌మీద యెగిరి యేం రాలేదు. ఒక వేళ యెగిరినా నేలమీదకి దిగాల్సిందే. అప్పుడు దేముడు మనకి చూపించిందాన్ని చేదాం...”

“కత్తులతోటీ కఠారుటతోటీ వాళ్లని యెదిరిద్దాం!”

“అలా అయితే మన పరాక్రమవంతులైన రాకుమారుల్ని మస్తిస్లావ్ రొమానొవిచ్ ఆహ్వానిస్తున్నాడు. మెట్లెక్కి వచ్చి ఒక తివాసీమీద ఆయన్ని పరివేష్టించి కూర్చోనీయండి, పాత ఆచారం ప్రకారం. అప్పుడు నిర్ణయించండి–పాషండులైన శత్రువుని కన్నీళ్లతో, పశ్చాత్తాపంతో కలుసుకోవడమో లేకపోతే మన తండ్రుల కరవాలాలతోటీ, రాటు తేలిన గండ్ర గొడ్డళ్లతోటీ కలుసుకోవడమో!”

“రాకుమారుడు వసీల్కో చెప్పింది నిజమే!”

“పదండి లోపలికి” అని అన్ని వేపులనుంచీ అరుపులు వచ్చాయి.

“కాని యెవరు నాయకుడు? సైన్యాల్ని యెవళ్లు నడిపిస్తారు? మస్తిస్లావ్ రొమానొవిచ్ నాయకత్వం కింద నేను రాను” అవి యెవళ్లో అరిచారు.

“మిగిలిన వాళ్లు అన్నారు:

“గాలిచ్ మస్తిస్లావ్‌ని అధిపతిగా వుండనియ్యండి–అతన్ని ‘ఉదాత్ని’ అని వూరికే అన్లేదు. అతను విజయం సిద్ధింపజేస్తాడు”.

ఇరవై ముగ్గురు రాకుమారులు కీయెవ్ రాకుమారుడి ప్రాసాదం మెట్లు యెక్కి పైకి వెళ్లారు. చాలా సేపు సమావేశం జరిపారు గాని యేకాభిప్రాయానికి రాలేకపోయారు. వాళ్లు లుకోమోర్యే తాతార్ శిబిరంమీద దాడి చెయ్యాలని మస్తిస్లావ్ ఉదాత్ని వాదించాడు. “అక్కడ పోగుపెట్టిన వస్తువుల్ని మనం పట్టుకోగలం, మనం ఐశ్వర్యవంతులవుతాం–

రాకుమారులు మాత్రమే కాదు, అతి సామాన్య సైనికుడికూడా కనీవినీ యెరగని సంపదలొస్తాయి".

లుకోమోర్యే శిబిరంమీద దాడి సూచన చాలా మంది రాకుమారులకి నచ్చింది. కాని సకల సైన్యాలకీ ఉమ్మడి నాయకుడుగా యెవరుండాలా అన్నదానిమీద వాళ్లు యేకాభిప్రాయానికి రాలేకపోయారు.

ఈ లోపున పచ్చిక బీళ్లమీదనుంచి ఒక దిమ్మరి హడావుడి పడుతూ వచ్చాడు. గుర్తు తెలియని తాతార్లు చాలమంది గుంపుగా ద్నీపర్‌కేసి వస్తున్నారని అతను చెప్పాడు. తాతార్లమీద దాడి చెయ్యాలన్న నిర్ణయాన్ని ఇది త్వరపరిచింది. వాళ్లు అప్పటికే ఖోర్తిత్సా ద్వీపం రేవులమీదుగా ద్నీపర్‌ని  దాటేస్తున్నారు.

రాకుమారులు అంగీకారానికి వచ్చారు. ప్రతి రాకుమారుడూ తన సైన్యాన్ని నడిపిస్తాడు, దాన్ని విడిగా వుంచుకుని ఇతరులకి అడ్డం రాడు. లుకోమోర్యేకి మొదట వెళ్లి, తాతార్‌లు కొల్లగొట్టిందాన్ని యెవడు పట్టుకున్నా అందరు రాకుమారులూ కలిపి దాన్ని పంచుకుంటారు.

తమ ప్రమాణాన్ని నిలబెట్టుకుందుకు అందరూ శిలువని చుంబించారు. ఒక రాకుమారుడు వేరే వాళ్లతో పేచీకి దిగితే అప్పుడందరూ కలిసి వాడిమీదకి వెడతారు. తర్వాత వాళ్లు తమలో తాము ముద్దుపెట్టుకున్నారు. కీయెవ్ మస్తిస్లావ్, మస్తిస్లావ్ ఉదాత్నిలు దాన్ని తప్పించుకుందుకు తలలు వెనక్కి తిప్పారు.

రాకుమారులు తివాసీమీదనుంచి లేస్తూ వుంటే రాకుమారుడు వసీల్కో మబ్బుగా, విచారంతో చీకుపడి వున్నాడు. అతను విచారంగా మెట్లమీదకి వెళ్లాడు. అక్కడ పాత గాయకుడు గ్రెమిస్లావ్ అతని కోసం చూస్తున్నాడు.

"యేం బాగా చెయ్యలేదు మేం" అన్నడు వసీల్కో. "పోరాడే పద్ధతి అదికాదు. తాతార్‌లు కొల్లగొట్టిందాని వెంబడి పడ్డం కాదు, శత్రువుని చెల్లాచెదురు చేసి నాశనం చెయ్యాలి. అప్పుడు శత్రువు మళ్లీ తల యెత్తడు. కాని విడివిడిగా, ఒకళ్లకొకళ్లు ముఖం కనిపించకుండా తిప్పేసుకుని వెళ్లడం – అది ఘోరమైన విపత్తు".

వెచ్చటి రాత్రి వచ్చింది. రాకుమారుల ప్రాసాదంమీద తేజోవంతమైన నక్షత్రాలు మెరిసాయి. ఆరుబయట భోజనాల వడ్డన కోసం పొడుగాటి ఓక్ మేజాలు సర్దివున్నాయి. అతిథులందరూ ఓక్ బల్లలదగ్గర చేరి, రాకుమారుడి భోజన పదార్థాలనీ, వేయించిన బాతుల్నీ రుచి చూస్తూ మౌనంగా వుండిపోయారు. నౌకర్లు వెలిగే కాగడాల్ని పట్టుకుని మేజాల వెనకనుంచున్నారు. కాగడా జ్వాలలు యెర్ర కాంతి వృద్ధ గాయకుడు గ్రెమిస్లావ్‌మీద పడి ప్రకాశమానం చేస్తోంది. అతను ప్రాసాదద్వారం దగ్గర పైన చిట్టచివరి మెట్టుమీద కూర్చున్నాడు. అతని వేళ్లు మంద్రంగా తంబూరా తీగల్ని మోగిస్తున్నాయి. కళ్లులేని యెర్ర గుంటల్ని ఆకాశంకేసి యెత్తి అతను పాత కాలపు ఇష్టమైన గాథని పాడాడు.

కిప్‌చాక్‌లకి వ్యతిరేకంగా ఈగొల్ రాకుమారుడి సాహస కృత్యాల్ని గురించి, రాకుమారుల మధ్య కొట్లాటల గురించి, ఈ వ్యర్థ యుద్ధాల్లో యెంతో మంది రష్యన్ పరాక్రమవంతులు కూలిపోవడం గురించీ, నష్టపోవడం గురించీ యెలా రాకుమారుల మధ్య అసూయలు "శత్రువుకి రష్యా భూముల ద్వారాలు తెరిచా"యో దాన్ని గురించీ పాడాడు.

విన్న వాళ్లల్లో చాలా మంది సాలోచనగా తలల్ని చేతులమీద ఆన్చుకున్నారు, ఆశ్చర్యపడుతూ: అలాంటి ప్రమాదం తమ ముందు వుందా, రాకుమారుల మధ్య ఇప్పుడూ, యెప్పుడూ వుండే విభేదం, పరస్పర శత్రుత్వం రష్యా మాతృభూమి రక్షణ అనే గమ్యానికి అంతులేని వినాశనాన్ని దాపురింపు చేస్తాయా?...

# సుబుదై భగత్తూర్ పథకం

సుబుదై భగత్తూర్ తన వెయ్యి మంది సర్దారుల్లోనూ పది మందిని పిలిచాడు. జెబె పదిమంది సర్దారులతో కూడా వచ్చాడు. అందరూ, ముసలాళ్లూ పడుచువాళ్లూ కూడా, యుర్త్‌లో ఒక వలయంగా కూర్చున్నారు. జెబె చెప్పదలచుకున్నది విన్నారు. వాళ్ల తలల పైగా చూస్తూ, తనేదో దూరంలో వున్న వాటిని చూడగలుగుతున్నట్టు, జెబె మాట్లాడాడు.

"కీయెవ్ సంపద్వంతమైన నగరం. ప్రార్థనా మందిరాల కప్పులు యెత్తుగా కల్తీలేని బంగారంతో మలామా చేసిన గుమ్మటాలతో వుంటాయి. ఈ బంగారు కప్పుల్ని చీల్చేసి, బంగారు గుర్రాన్ని పోత పోయించి, ఆయన శ్వేతాశ్వంలాగా, జెంఘిజ్ ఖాన్ గుడారం ముందు నిలబెడదాం".

"జెంఘిజ్ ఖాన్‌కి బంగారు అశ్వాన్ని తెచ్చి ఇద్దాం!" అన్నారు మంగోలులు.

"రష్యన్లకి చాలా మంది ఖాన్లున్నారు. ఈ ఖాన్లు ఒకళ్లమీద ఒకళ్లు కుక్కల్లాగా పడతారు. అంచేత వాళ్లని అణగదొక్కడం కష్టం కాదు. యెవళ్లూ ఈ ఖాన్లని ఒకటిగా చెయ్యలేకపోయారు, మరి వాళ్లకి జెంఘిజ్ ఖాన్ లేడు".

"జెంఘిజ్ ఖాన్‌లాంటి మరొకడు భూమ్మీద దొరకడు!"

"మనం గబగబా రష్యన్ భూములమీద విరుచుకు పడాలంటాను. ఈ మూల నుంచి ఆ మూలకి వాళ్లని దగ్ధం చెయ్యాలి, కీయెవ్‌ని పట్టుకోవాలి – ముందే" అని జెబె ఆగాడు.

"యేమిటి ముందే?" అని సర్దార్లు అడిగారు.

"ఏకైక, సర్వం సహాధిపతినుంచి మన నివేదికకి జవాబు రాక ముందే..."

"కాని తన కోసం ఆగమని జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞాపిస్తాడు. ఆయన తనే కీయెవ్ రావాలనుకుంటున్నాడు" అని మంగోలులు అరిచారు. "మనం ఇప్పటికే బుఖారా, సమర్‌కండ్, గుర్‌గంజ్‌లాంటి మహా నగరాలని పట్టుకున్నాం, కీయెవ్‌ని పట్టుకోవడం కష్టం కాదు. మనం తక్షణం కీయెవ్‌ని పట్టుకోవాలి".

కుటిలంగా, హెచ్చరికంగా వుండే సుబుదై యేమంటాడోనని అందరూ చూశారు. అతను గుచ్చుకుంటూ చూసే కంటి చూపుతో ఒకళ్ల తర్వాత ఒకళ్లకేసి చూస్తూ సగం అటు తిరిగి కూర్చున్నాడు.

"జెబె నాయన్ అనుకున్నట్టుగా రష్యన్లని అణగదొక్కడం అంత సులువు కాదు" అన్నాడు వేయింటి సర్దారు గెమ్యాబెక్.

"రష్యన్లు కిప్‌చాక్‌లు చాలామంది వున్నారు, లక్ష మంది. మనం కొద్ది మందిమే వున్నాం ఇరవై వేల మందిమి. నానా గోత్రీకుల గుంపు తోమన్ ఒకటి–వెనక తగ్గితే కాకుల్లాగా చెదిరిపోతారు వీళ్లు. రష్యన్ భూముల్లోకి వెళ్లడం మనకి కష్టం. వాళ్లు చాలా మంది, యెంతో పెద్ద సైన్యంతో వున్నారు. మనం యెన్నటికీ కీయెవ్‌కి వెళ్లలేం... ఇప్పుడు మనం తిరిగి వెనక్కి వెళ్లిపోవాలి, జెంఘిజ్ ఖాన్ బలమైన చేతి కిందకి..."

"కాని మర్చిపోయావా పరాక్రమవంతుడైన భగత్తూర్ గెమ్యాజెక్, చైనీయులు రష్యన్లకంటే యెక్కువ వున్నారు. అయినా నువ్వు నేనూ ఇతర భగత్తూర్‌లూ వాళ్ల భూముల్లోకి చైనా మహా కుడ్యం గుండా చొచ్చుకుపోయాం" అన్నాడు జెబె.

సుబుదై కదిలాడు, తల పంకించాడు. అందరూ మాట్లాడకుండా అతనికేసి తిరిగారు.

"మనం పథకం వేసుకునేటప్పుడు మనకంటే ముందు జెంఘిజ్ ఖాన్ యేం చేశాడో అనుకుందాం. తర్వాత మనం వున్న స్థానంలో వుంటే ఇప్పుడేం చేసేవాడో అనుకుందాం. మొదటిది శత్రువుని మోసం చెయ్యాలి–అతని బొచ్చుని నిమిరితే శత్రువు కులాసాగా పంజాలు సవరించుకుంటాడు, వీపుమీద చేరతాడు. కళ్లు మూసుకుంటాడు. అప్పుడు మనం లంఘించి పీక ఉత్తరించాలి" అన్నాడు సుబుదై మెల్లిగా.

అందరూ తిన్నగా కూర్చుని ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకున్నారు. ఇప్పుడు అంతా స్పష్టమైంది, యేం చెయ్యాల్సిందీ. ఇప్పుడిక వెనక్కి వెళ్లడం గురించి ఆలోచన లేదు, మహా ఖాఖాన్ బలమైన చేతి అభయం కిందకి... సుబుదై కొనసాగించాడు:

"రష్యన్లు చాలా మందే వున్నారు. వాళ్లు యెంతో బలమైన వాళ్లు. మనల్ని, ఒంటె కాలితో మిడతల్ని తొక్కినట్టు, తొక్కెయ్యగలరు. కాని రష్యన్లలో ఐకమత్యం లేదు. వాళ్ల రాకుమారులు యెప్పుడూ తమలో తాము దెబ్బలాడుకుంటారు. వాళ్ల సైన్యం–అన్ని దిక్కులకీ పచ్చిక బీటిమీద తిరుగుతూ పోయే ఆంబోతుల మందలాంటిది. కాని రష్యన్లకి వాళ్ల జెబె వున్నాడు. అతన్ని భగత్తూర్ మస్తిస్లావ్ అంటారు. ఈ మస్తిస్లావ్ యెన్నో యుద్ధాలు చేసినవాడనీ, యెప్పుడూ విజయం తప్ప ఇంకోటి యెరగడనీ అంటారు. కాని తమ మస్తిస్లావ్ కష్టాల్లోకి దూకేదాకా చూసి అప్పుడు రక్షణకి వెళ్లేటందుకు తగ్గ జాగ్రత్త, హెచ్చరికల సుబుదై భగత్తూర్ రష్యన్లకి లేదు..."

“ఈ మస్తిస్లావ్‌ని పట్టుకుని, జెంఘిజ్ ఖాన్ దగ్గరికి తీసుకుపోదాం!” అని అరిచారు మంగోలులు.

“మస్తిస్లావ్‌ని పట్టుకుని అతని బంగారు శిరస్త్రాణాన్ని కొట్టిన వాడే అతన్ని జెంఘిజ్ ఖాన్ దగ్గరికి స్వయంగా తీసికెడతాడు, నేను మాట ఇస్తున్నాను” అన్నాడు సుబుదై.

సమావేశం చాలా సేపు సాగింది. అందరూ మెల్లిగా మాట్లాడుకున్నారు, మంగోలు నాయకుల నిర్ణయాలని నోకరు పహారావాళ్లు వినకూడదని.

మర్నాడు తన ఆశ్విక తోమన్‌తోటి జెబె పడమటికి వెళ్లాడు. సుబుదై ఇతర తోమన్‌తోటి కల్క నదీ తీరాన వెనక దిగడిపోయాడు. గుర్రాలు మేసి, తుది దెబ్బతీయడానికి అక్కడ సిద్ధమవుతాయి.

# ద్నీపర్ నదీ తీరంలో మంగోలులు

వేసవి మామూలుకంటే వేడిగా వుంది. వడగాడ్పులు చాలా రోజులు వీచాయి. త్వరగా పెరిగే గడ్డి వాడి వాసిల్లి పోవడం మొదలెట్టింది. యెండ నిప్పులు చెరిగింది, సుబుదై తీక్షణమైన కంటిలాగా.

జెబె నాయన్ తన తోమన్‌ని అయిదు భాగాలుగా విభజించాడు. రెండు వేల గుర్రాలున్న ఒక భాగంతో అతను మందు ద్నీపర్ నది దగ్గరికి వెళ్లిపోయాడు. మిగిలిన నాలుగు భాగాలనీ చుట్లు తిరిగిన దారిలో పచ్చిక బీళ్లమీద నడిపించాడు. అనేక వందల యేళ్లుగా ఆ దారి కాళ్ల కింద అణిగి నలిగింది.

తాతార్లు విశాలమైన పచ్చిక బీళ్లమీద అటూ యిటూ దౌడు తీసుకుపోయారు. యెక్కడెక్కడ కిప్‌చాక్ శిబిరాలు మందలతో కనిపించినా వాళ్లని దారిమీదకి తీసుకురావడం జరిగింది.

వంద నోకర్ల అధిపతిగా జెబె విశాలమైన ద్నీపర్ దగ్గరికి చేరాడు. నది యెండలో తళతళలాడుతోంది. నల్లగా తారు పూసిన పడవలు సాఫీగా వున్న నీలం నీళ్లమీద పోతున్నాయి.

"చూడండి, అక్కడ రష్యన్ సైనికులు" అన్నాడు దుబాసీ.

ఒడ్డున ఒక గుట్టమీద ఇనప శిరస్త్రాణాలతోటీ, చిన్న బల్లేలతోటీ రష్యన్ సైనికులు వున్నారు. కళ్లకి యెండ తగలకుండా చేతులు అడ్డం పెట్టుకుని వాళ్లు దూరంగా పచ్చిక బీటిమీదకి చూస్తున్నారు. కిప్‌చాక్‌లు కాక యేదో అజ్ఞాత తండా ఆశ్వికులు రావడం చూసి వాళ్లు నది దగ్గరికి పరిగెత్తి పడవల్లో అవతలి తీరానికి వెళ్లిపోయారు

జెబె కూచిగా వున్న శిరస్త్రాణం పెట్టుకుని యెండలో కంచులా వున్న ముఖం ముటముటలాడుతూ వుంటే నది పైన కూచి కొండమీద గుర్రాన్ని ఆపాడు. కళ్లు సన్నగా చేసి, రెప్ప వెయ్యకుండా అవతలి ఒడ్డున గుట్టలతో వున్న నేలని అలా చూస్తూనే వుండి పోయాడు. అక్కడ మైదానంమీద విస్తరించుకున్న శిబిరం వుంది. బళ్లు వరసలు తీరి నుంచున్నాయి. ఏడికోలలు సైకి తిరిగి వున్నాయి. నానా రంగులూ వున్న గుర్రాల మంద మేస్తోంది. పదాతి సైనికులూ, ఆశ్వికులూ మైదానంమీద తిరుగుతున్నారు. వాళ్ల ఆయుధాలమీదా, కవచాలమీదా యెండ మిరుమిట్లు కొలుపుతూ ప్రకాశిస్తోంది.

కొన్ని పడవలు తీరం దగ్గర యీడ్చుకుంటూ సాగుతున్నాయి. బ్రహ్మాండమైన నది వడితో తంటాలు పడుతూ తెడ్లవాళ్లు భారంగా లాగుతున్నారు వాటిని. యెవళ్లో ఒక పడవలోనుంచి అరిచారు:

“హేయ్, పిలవని అతిథులారా! యేం కావాలి మీకు? యే గాలికి కొట్టుకు వచ్చారిక్కడికి?”

జెబె తీసుకువచ్చిన యిద్దరు పచ్చిక బీటి దిమ్మరులు ఆ పడవలనుంచి వచ్చే కేకల్ని అనువదించి చెప్పారు.

“మేం మీ కోసం చూట్టం లేదు, కిప్‌చాక్‌ల కోసం చూస్తున్నాం” అని దుబాసీలు జెబె బదులు అరిచారు. “కిప్‌చాక్‌లు మా బానిసలు, పాలేర్లు. మీరు వాళ్లని చంపెయ్యండి, వాళ్ల బళ్లూ పశువులూ మీరు తీసేసుకోండి. కిప్‌చాక్‌లు మా శత్రువులు, మిమ్మల్ని కూడా వాళ్లు యేళ్ల తరబడి దోచుకుంటున్నారు. మీతో మాకు పేచి లేదు, శాంతి కావాలి. మీతో యుద్ధం చెయ్యం”.

పడవలనుంచి మళ్లీ అరుపులు వచ్చాయి:

“మీ దూతల్ని పంపండి! వాళ్లతో మాట్లాడతాం”.

“కాని యెవళ్లతో మాట్లాడతారు వాళ్లు? మీ పెద్ద నాయకులెవరన్నా వున్నారా?”

“ఇక్కడ చాలా మంది రాకుమారులున్నారు మాకు. వాళ్లు మీ దూతలతో ఒప్పందానికి వస్తారు!”

జెబె నలుగురు నోకర్లనీ, దుబాసీగా ఒక పచ్చిక బీటి దిమ్మరినీ యెంపిక చేశాడు. వాళ్లని అవతలి ఒడ్డుకు వెళ్లమన్నాడు. వాళ్లు కీయెవ్ ముఖ్య రాకుమారుడి కోసం వెతికి అతనికి చెప్పాలి: కిప్‌చాక్‌ల పశువుల్నీ సామాన్లనీ లాక్కుని, రష్యన్లు వాళ్లని తరిమెయ్యాలి. ఒక సారి కిప్‌చాక్‌లని వాళ్లు పచ్చిక బీళ్లమీదకి తరిమేస్తే తాతార్లు కిప్‌చాక్‌లని మట్టు పెట్టేస్తారు.

నలుగురు నోర్లూ ఇబ్బందిగా కాళ్లతో తన్నుకుని, కొరడాలతో వీపులు గోక్కుని అన్నారు:

“రష్యన్లతోటి మాట్లాడ్డానికేముంది? యెకాయెకీని వాళ్లతో పోరు మొదలు పెట్టలేమా?”

జెబె అన్నాడు:

“అయితే నేనే వెడతాను, ఎవళ్లు అఖ్ఖర్లేదు దుబాసీ తప్ప”.

నోర్లు అరిచారు:

“వద్దు! వాళ్ల దగ్గరికెళ్లద్దు. నువ్వు లేకపోతే ఈ సైన్యం యేమవుతుంతి? తల్లి తోడేలు లేకుండా తోడేలు కూనలు యేం చేస్తాయి? అక్కడ వాళ్లు నిన్ను బతికుండగానే చర్మం ఒలి చేస్తారు. ఇక్కడే వుండు. మేం వెడతాం”.

నలుగురు నోకర్లూ దిమ్మరితోబాటుగా నదీ తీరం దగ్గరికి వెళ్లారు. ఒడ్డున వున్న రష్యన్లని పిలిచారు. ఒక పడవ వచ్చి మంగోలు దూతల్ని తీసికెళ్లింది.

రాత్రి వేళ గొర్రెతోలు అంగీ తొడుక్కుని నెగడు పక్కన జెబె పడుకున్నాడు. రష్యన్ల దగ్గరికి వెళ్లిన దూతలు తిరిగి రావడం కోసం చూస్తున్నాడు. వాళ్లు రాలేదు. కిప్‌చాక్‌లు వాల్లని చంపేశారు.

జెబెకి రాత్రంతా నిద్రపట్టలేదు. చీకటి ఆలోచనలు, సంభాషణల్లోని ముక్కలు, పరిచితమైన ముఖాలు ముందు దూసుకుపోయాయి. అతను కాసేపు ఆగ్రహంతో కుతకుతలాడి పోయాడు, కాసేపు కునుకు తీశాడు...

ఇప్పుడు తను రష్యన్లతో యుద్ధాలు యెదుర్కొంటున్నాడు. వాళ్లు పారిపోరు, శత్రువుమీదకి తామే దాడిచేస్తారు. విజయం కష్టభూయిష్టం. చైనాలో విజయాల వల్ల వచ్చిన కీర్తి అంతా యిట్టే జారిపోయే సమయం వచ్చింది.

ఈ పచ్చిక బీటిమీద తన తల పోనేనా పోవాలి లేదా రష్యన్లనీ కిప్‌చాక్‌లనీ ఘనంగా జయించిన వాడనీ మస్తిస్లావ్ బంగారు శిరస్త్రాణాన్ని తన పాలకుడి దగ్గరికి తెచ్చిన వాడనీ ఖాఖాన్ బంగారు గుడారంలో జెబె పేరు ప్రతి వాళ్ల పెదాలమీదా వుండనేనా వుండాలి.

నోకర్లు అతన్ని పొద్దుటే లేపారు.

“చూడు అవతలి వేపున యేం జరుగుతోందో... రష్యన్లు నదిమీద వారధి కట్టేటంతగా పడవల్ని పోగు చేశారు. వాళ్ల బళ్లు అప్పుడే నీటి అంచుదాకా వచ్చాయి. వాళ్లు సమూహంగా అశ్విక, పదాతి సైన్యాన్ని పోగు చేశారు. వాళ్లు త్వరలోనే మనవేపు వచ్చేస్తారు. మనం యేం చెయ్యాలి? వాళ్లని రాకుండా ఆపాలి”.

“వాళ్లని రానియ్యండి. దూరంనుంచే చూసి పచ్చిక బీటిలో వెనక తగ్గండి” అని జెబె ఆజ్ఞాపించాడు.

# రష్యన్లూ కిప్‌చాక్‌లూ పచ్చిక బీటిమీదకి రావడం

"...రష్యన్లు, కిప్‌చాక్‌లూ తాతార్లని
అణగదొక్కాలన్న కాంక్షతో రగిలిపోయారు.
బలహీనత కొద్దీ, భయం కొద్దీ తాతార్లు
తమతో పోరు చెయ్యడానికి ఇష్టపడక
పారిపోతున్నారని వాళ్లు అనుకున్నారు. దాంతోటి
ఉరవడిగా వెంబడించారు. తాతార్లు
వెనక్కి వెనక్కి పోతూనే వున్నారు.
రష్యన్లు, కిప్‌చాక్‌లూ పన్నెండు రోజులు
వాళ్లని వెంబడించారు".
(చరిత్రకారుడు ఇబన్ ఆల్ అథిర్, 13వ శతాబ్దం)

జెబె నాయన్ పల్చని యెర్ర గుర్రం సునాయాసంగా ఒంటి మిట్టపైకి దౌడు తీసింది. జెబె నిశ్చలంగా గుర్రంమీద కూర్చున్నాడు. దగ్గర పడుతూ వున్న రష్యన్ సైనిక విభాగాలమీద నుంచి దృష్టి మళ్లించు కోలేకపోతున్నాడు.

రౌతులు ముందు వచ్చారు. దళంలోని కొంత మంది సైనికులు బారు తీరి దారిమీద వ్యాపించారు. కొంత మంది విశాల మైదానంమీద చెదిరిపోయారు. మందమైన ధూళి మేఘాలు వాళ్ల పైన లేచాయి. వాళ్లకి చిన్న బల్లేలు వున్నాయి. ధూళి మేఘాల్ని గాలి చెదర గొట్టినపుడు బళ్లు కనిపిస్తున్నాయి. రష్యన్‌లు నుంచి కొల్లగొట్టిన సంపదని ఆశించారు. దాన్ని మోసుకెళ్లడానికి ఖాళీ బళ్లని తెచ్చారు. మిగతా బళ్లల్లో వాళ్ల ఆయుధాలు, దేగిసాలు, గోధుమ బస్తాలు వున్నాయి.

జెబె కళ్లేలు బిగించాడు. వేళ్లే వేళ అయింది... రష్యన్లు మిట్టమీద ఒంటి రౌతుని పసికట్టారు. కొంత మంది రష్యన్లు, కిప్‌చాక్‌లూ దళంనుంచి విడిపోయారు. వేగంగా అతని దగ్గరికి దౌడు తీసుకుంటూ వస్తున్నారు. మరో ఆశ్విక దళం పచ్చిక బీటిమీద అడ్డం పడింది,

అతను వెనక్కి పోతే అడ్డడానికని. కాని జెబె తన యెర్ర గుర్రం అంటే వూరికే ఇష్టపడడు, అతని తోమన్‌లో మహా శ్రేష్టంగా పరుగు తీస్తుంది అది.

జెబె గుర్రాన్ని వేగిర పరిచాడు. సందులోకి పోవాలి. అక్కడ గెమ్యాబెక్ వందల మందీ పొంచి మాటులో వున్నారు. తాతార్ వేగులు గడ్డిలో దాంకున్నారు. జరిగేదంతా జెబె పారిపోవడం, రష్యన్లు రావడం రెండు కూడా స్పష్టంగా చూడగలుగుతున్నారు.

కాని రష్యన్లు ఇంకా దగ్గరిగా వచ్చారు... వాళ్లకి భేషైన గుర్రాలున్నాయి. మంచి అశ్వికులు ముందుకు తోలుతున్నారు. అతని దారికి అడ్డం రావాలని వస్తూవున్న వాళ్లనుంచే మహా ప్రమాదం ముంచుకొస్తోంది. పక్కకి తిరగడం అసాధ్యం. యెడమ వేపు సందూ ప్రమాదకరమైన అంచులు, కుడి వేపున రష్యన్లు.

వాళ్లు తొమ్మండుగురున్నారు... ఆఖరి ముగ్గురూ వెనక బడిపోతున్నారు... ముందున్న ఆరుగురూ అతన్ని చుట్టుముట్టడానికి విస్తరించుకుని వున్నారు.

శత్రువు మరీ దూరంలో లేడు... ఇనప శిరస్త్రాణాల కింద యెండకి కమిలిన వాళ్ల ముఖాలు జెబెకి ఆనుతున్నాయి... యెర్ర డాళ్లని అడ్డం పెట్టుకుని రష్యన్లు స్వారీ చేస్తున్నారు; ఒకతను చాలా యువకుడు. అతని ముఖం యెర్రగా వుంది, కళ్లు నల్లవి. మరో అతనికి కిందికి వాలే నిడుపాటి మీసాలున్నాయి. మరీ దగ్గరగా వున్నవాడు మెరిసే యెర్ర కఫ్తాన్ తొడుక్కున్నాడు – నల్ల గుర్రంమీద వున్న కిప్‌చాక్. అతని చేతిలో ఉచ్చుతాటి పగ్గం వుంది...

జెబె గురి చూశాడు,అతని బాణం గురి తప్పదు. జెబె బారుగా తన బాణం గురి చేశాడు. ఆ కిప్‌చాక్ చేతులు యెగరేసి జీనుమీదనుంచి పడిపోయాడు. గుర్రం బెదిరిపోయి రౌతు లేకుండానే తల యెత్తి దౌడుతీసింది. దాని నిడుపాటి జూలు గాలికి యెగిరింది.

పడుచు రష్యన్ సైనికుడు దగ్గరగా వున్నాడు... కొన్ని క్షణాల్లో గుర్రాలు ఢీకొంటాయి. అతను గురి చూసి తన చిన్న బల్లేన్ని గట్టిగా విసిరాడు. కాని అది వూరికే ఆ తాతారు ఉక్కు కవచంమీద దూసుకుపోయింది. జెబె రెండో బాణం ఆ పడుచు వాడి నిప్పులు కక్కే నల్ల కళ్ల మధ్యకి యెక్కు పెట్టాడు. కీర్తికి సెలవు, ఎర్రటి యెండకి సెలవు, నువ్వు పుట్టిన గడ్డకి సెలవ్!

జెబె వెనక్కి చూళ్లేదు. అతని కళ్లు ముందున్న గడ్డిమీద వెతికాయి. గెమ్యాబెక్ సైనికులు యేరి? అరుగో అక్కడ! చాలా మంది సందునుంచి బయటికి వచ్చారు. చెదిరిపోయి, విడివిడిగా వున్న రష్యన్లని యెదిరించడానికి పిచ్చి అరుపులు అరుస్తూ దౌడు తీస్తున్నారు.

రష్యన్ సైనికులు గబగబా మళ్లీ పోగయి, దగ్గరసా వరసగా యేర్పడ్డారు. వాళ్ల యెర్ర డాళ్లు కింద కూచిగా పైన గుండ్రంగా వున్నాయి. స్థిరంగా, బెదిరించే వరసలో వున్నాయి. సైనికులు కొత్తగా పదును పెట్టి మెరుస్తూ వున్న కత్తుల్ని దూసి తాతార్ల మీదకి భీకరంగా లంఘించారు.

కాని గెమ్యాబెక్, అతని నోకర్లు జెబె ఆజ్ఞని గుర్తు పెట్టుకున్నారు: బాణాన్ని కొట్టగలిగేటంత దూరం వెళ్లి అక్కడ వెనక్కి గుర్రాల్ని తిప్పి, రష్యన్లకి ఆశ్చర్యం కలిగేటట్టు పారిపోతూ వాళ్లని దాటిపోయేట్టు బాణాల వర్షం కురిపించారు. మళ్లీ పచ్చిక బీటిమీదకి అతివేగంగా దౌడు తీసుకుపోయారు.

రష్యన్లు పిచ్చి అరుపులు అరుస్తూ వాళ్లని వెంబడించారు. వాళ్లిక క్రమపద్ధతిలో ఒక తీరులో స్వారీ చెయ్యడం లేదు. పారిపోయే తాతార్లని పట్టెయ్యాలని దౌడు తీస్తున్నారు. రష్యన్ల భేషైన గుర్రాలు త్వరలోనే వెనకబడ్డ పది మంది తాతార్లని అందుకున్నాయి. తాతార్లని చంపేశారు. రష్యన్లు వాళ్ల చెప్పుల్ని లాక్కున్నారు. ఆయుధాలని తీసేసుకున్నారు, తాతార్ల గుర్రాల్ని యెక్కేశారు.

అంగరక్షకులు చుట్టూ వుండగా జెబె తాతార్లకీ రష్యన్లకీ మొదట జరిగిన పోరుని చాలసేపు చూడలేదు. అతను సందులో కిందికి దిగాడు. అక్కడ నేలలో నుంచి ఒక జల వస్తోంది. గుర్రానికి నీళ్లు పెట్టాడు. మొత్తం తాతార్ దళానికి వెనక్కి పొమ్మని ఆజ్ఞ చేశాడు.

గెమ్యాబెక్ దళంలో తిరిగివచ్చిన రౌతులు తమ నాయకుడు బల్లెం వేటుకి గాయపడ్డాడనీ, గుర్రంతో పడిపోయాడనీ, రష్యన్ రౌతులు అతన్ని చుట్టుముట్టారనీ, కాని పచ్చిక బీటిమీదకి పారిపోగలిగాడనీ, కిప్‌చాక్‌లు తరిమారనీ చెప్పారు.

ఆ రాత్రి దిమ్మరి దుబాసీల సాయంతో బందీగా పట్టుకున్న రష్యన్‌ని జెబె ప్రశ్నించాడు. ఇది సాహసికుడైన గాలిచ్ రాకుమారుడు మస్తిస్లావ్ ఉదాత్ని ఎలగోలు దళం అని వాళ్లు చెప్పారు. అతని కింద గాలిచ్, వొలీన్స్క్ మనుషులున్నారు. వాళ్లు ద్నియెస్తర్ నది దిగువకి పడవల్లో సముద్రందాకా వచ్చారు. తీరంవారే ద్నీపర్ ముఖ ద్వారందాకా వచ్చారు. ద్నీపర్ యెగువ ఖోర్తిత్సా ద్వీపం చేరారు. తాతార్లకీ వ్యతిరేకంగా నడిచే సైన్యాలన్నీ అక్కడ పోగవుతాయి.

"రాకుమారులకి ఒకళ్లతో ఒకళ్లకి పడదు. యెవడి సైన్యం వాడు విడిగా వుంచుకున్నాడు. దేని అధిపతి దానికే. సైన్యం మొత్తానికి ఒక అధ్యక్షుడు లేదు, సైనికులందరూ మస్తిస్లావ్ ఉదాత్నిని సర్వ సైన్యాధ్యక్షుడిగా చెయ్యమని అడిగినా. మస్తిస్లావ్ ఉదాత్నికి యుద్ధ తంత్రం బోలెడు తెలుసు, అతను ధైర్యవంతుడు సాహసికుడు. కాని కీయెవ్ మస్తిస్లావ్ రొమానొవిచ్ ఇతనికి వ్యతిరేకం. ఆయన అస్సలు ఒప్పుకోలేదు, తనే అందరికంటే పెద్ద అనీ, గొప్ప రాకుమారుణ్ణనీ ఆయన భావం".

కిప్‌చాక్‌లు యెంత మంది వున్నారు అని జెబె అడిగాడు. చాలా మందే వున్నారని బందీ చెప్పాడు. వాళ్ల సైన్యం ద్నీపర్ యెడమ వేపున, ఖోర్తిత్సాలో రష్యన్ సైన్యంతో కలవడానికి హడావుడి పడుతూ వస్తోంది. కొంతమంది ముందుగా మస్తిస్లావ్ ఉదాత్నితో వుస్తున్నారు.

"తాతార్ సైన్యం గురించి రష్యన్లు యేమనుకుంటున్నారు?" అని జెబె అడిగాడు.

"తాతార్లు వూరికే 'సాదా' సైనికులనీ, కిప్‌చాక్‌లంత వాళ్లు కూడా కాదనీ అంటారు వాళ్లు. అందుకనే రాకుమారులు తాతార్లు పట్టుకున్న కొల్ల సంపదని చేజిక్కించుకోవడానికి ఇంత బహిరంగంగా తాతార్ శిబిరంమీదకి వస్తున్నారు. కాని తాతార్లు మంచి సైనికులని నాకిప్పుడు తెలిసింది, వాళ్ల బాణాలు గురితప్పవు".

తాతార్లని ఇంకా ఇంకా పచ్చిక బీటిమీదకి ఓహటించమనీ, రాత్రిళ్లు దీపాలేం వెలిగించవద్దనీ, రష్యన్ బందీని పీకలు కత్తిరించమనీ జెబె ఆజ్ఞ చేశాడు.

రాత్రిపూట తాతార్ వేగులు, పచ్చిక బీటి దిమ్మరులు రష్యన్ శిబిరం దగ్గరికి గుట్టుగా వచ్చి వాళ్లేమనుకుంటున్నారో విన్నారు. చుట్టూతా బళ్లు పెట్టి లోపల యేర్పడ్డ వలయంలో రష్యన్లు తమ శిబిరాన్ని యేర్పాటు చేసుకున్నారు. కిప్‌చాక్‌లు తమ సొంత శిబిరంలో వున్నారు. నెగడు మంటలు దగ్గర ఆడుకుంటూ పాడుకుంటూ వున్నారు. తాతార్లు తమని తరిమేసిన తమ శిబిర భూమికి పోతున్నామనే ఆలోచనతో సంబర పడుతున్నారు.

# తాతార్ ఉచ్చు

గబగబా ముందుకు వచ్చే రష్యన్ విభాగాలని కనిపెడుతూ జెబె, అతని తాతార్లూ వెనక్కి తగ్గారు. ఒకో అప్పుడు ముందుకు వస్తూ వున్న కిప్‌చాక్ వేగులతో కొట్లాటలు వచ్చాయి గాని యుద్ధాలు జరగలేదు.

దూరంగా ముందుకు పోవాల్సివచ్చి రష్యన్లు మధ్య మధ్య, వసంతరుతు పచ్చిక బీళ్లమీద మేసే కిప్‌చాక్ పశువుల్ని పట్టుకోవడానికి, ఆగేవాళ్లు. ఆ మందల్ని అక్కడికి జెబె ఆజ్ఞ మేరకి తోలారు. రష్యన్, కిప్‌చాక్ సైనికులు వచ్చేదాకా వాటిని అక్కడ తాతార్ కాపరులు చూసేవాళ్లు. అప్పుడు కాపర్లు తిరిగి తాతార్ సైన్యానికి పారిపోయేవాళ్లు.

రష్యన్ల బలం వృధా కావడానికి జెబె చెయ్యగలిగిన దంతా చేశాడు. వాళ్ల అప్రమత్తతని తగ్గించడానికీ, వాళ్లు ఆగి యెద్దు మాంసం మెక్కడానికీ, యే ప్రమాదమూ లేదని భావించుకోవడానికీ చెయ్యగలిగినదంతా చేశాడు. రష్యన్ విభాగాలు యెప్పుడూ విడివిడిగానే సాగాయి. పర్యాయతః ఒక దాన్నుంచి ఒక దానికి దూరం యెక్కువైపోయేది. దుమ్ము దారిమీద వ్యాపించి పోయేవి. రాత్రిళ్లు విడిది చేస్తూ తమ బళ్లతోబాటుగా తమని చుట్టి వుండే కంచెల్ని పెట్టుకోవడం కూడా మానుకున్నారు.

సైనికులు దండయాత్రవల్లా, పట్టుకున్న పశువులవల్లా తృప్తి పడ్డారని కొత్త రష్యన్ ఖైదీలు చెప్పారు. "ఇప్పుడు మనకి గొర్రె తోలు అంగరఖాలు వస్తాయి. యెద్దు చర్మం కొత్త చెప్పులు తయారు చేసుకోవచ్చు". ఇంకా సైనికులు అన్నారు: "తాతార్ల బలమైన సైన్యం యెక్కడ? తాతార్లకంటే యెక్కువ సంఖ్యలో కిప్‌చాక్ యెద్దులున్నాయి. లుకోమోర్యే చేరేదాకా వాళ్లని తరుముతూనే వుంటాం మనం. ఒక్క తాతార్ కూడా కనిపించడు!"

ఒక దళం మిగిలిన వాటికంటే క్రమశిక్షణతో వుంది. దాని సైనికులు కలిసికట్టుగా నడిచారు. పచ్చిక బీటిమీద అడ్డదిడ్డంగాపోలేదు. రాత్రిళ్లప్పుడెప్పుడూ బళ్లని వలయంగా పెట్టి అన్ని దిక్కుల్లోనూ కాపలా వాళ్లని పెట్టారు. కీయెవ్ మహా రాకుమారుడు మస్తిస్లావ్ రొమానొవిచ్ సైన్యం అది. కీయెవ్ సైన్యం మిగిలిన వాటికంటే వేర్పాటుగానే వుంది. కొంతమంది కాలినడకన వెళ్లారు, కొంతమంది భారమైన యుద్ధాశ్వాలమీద. పచ్చిక బీళ్లమీద

మేస్తూ, తిరిగే కిప్‌చాక్ పశువుల్ని పట్టుకోవడానికి వాళ్లూ అప్పుడప్పుడు ఆగే వాళ్లు. అప్పుడు రాగి డేగిసాలలో మాంసం వంటకం వండుకుతిని, పొద్దుటిదాకా గుర్రు కొట్టి నిద్రపోయేవాళ్లు.

తాతార్ల గుర్రాలంత చురుకుగా పరిగెత్తే గుర్రాలు కాపు రష్యన్లవని తాతార్లు అన్నారు. వాటికి అంత ఓపికా వుండదట. రష్యన్ల బాణాలు దూరం పోవు. అయినా బాహాబాహీ యుద్ధంలో రష్యన్లు గట్టివాళ్లు. నిడుపాటి పిడి వున్న వాళ్ల గొడ్డళ్లతో బాగా యుద్ధం చేస్తారు. రష్యన్లు దిట్టంగా వున్న ధైర్యవంతులైన యోధులు. అలా అని తాతార్లు అన్నారు.

రష్యన్ దళాలతో ప్రతి పోరు తర్వాతా తాతార్లు పచ్చిక బీటి లోపలికంటూ పారిపోయేవారు. సందుల్లోకి పోయీ కొండల వెనక దాంకునీ దాటిపోయేవారు.

పగటి పూట వేడిగా, ఉక్కగా వుండేది. మాడ్చేసేటట్టు ప్రకాశించే సూర్యుడికి అడ్డంగా ఒక్క మేఘం తునక కూడా వుండేది కాదు. కదం తొక్కే కాళ్ల కిందనుంచి దుమ్ము మేఘాలు లేచేవి. గుర్రాలకీ, మనుషులకీ ఉక్కిరిబిక్కిరి అయిపోయేది. కొన్ని దళాలు జాడ వదిలి, పచ్చిక బీటిమీద కొత్త జాడలు చేస్తూ పోయేవి. కాని అక్కడ కూడా పొడారిపోయిన మట్టి కాళ్ల పైన పోగడి, నల్లని ధూళి మేఘం సైన్యం మొత్తాన్ని ఆవరించేది.

యెండ వేడికి సెలయేళన్నీ యెండిపోవడం మొదలెట్టాయి. సైనికులు గొణగడం ఆరంభించారు: "తాతార్ల వెనకబడ్డానికి యెందుకు మనం పచ్చిక బీటిమీదకి వచ్చాం? ఇంటికి పోయే వేళ అయింది. పట్టుకున్న కిప్‌చాక్ పశువుల్ని పట్టుకుపోవచ్చు..."

# సుబుధై భగతూర్ యుద్ధానికి తయారవడం

వృద్ధ నాయకుడు రెండు రోజులు చుట్టూతా వున్న ప్రదేశాన్ని పరిశీలిస్తూ, మంగోలులకి అనుకూలంగా ఉండే యుద్ధరంగాన్ని యెంచుకుంటూ గూఢచారి శోధనలో తిరిగాడు.

మరగలు కక్కే గుర్రాలమీద ముగ్గురు వార్తాహరులు వచ్చారు.

'జెబె నాయన్ వెనక్కి తగ్గుతున్నాడు... పొదుగాటి గడ్డాలున్న వాళ్ల దళం ముందకు వస్తోంది. వాళ్లు 'భగతూర్ మస్తిస్లావ్' నాయకత్వం కింద వున్నారు... కిప్‌చాక్ ఖాన్ యారువ్ నాయకత్వాన వాళ్లతో వున్నారు..."

యుద్ధానికి ముందు వాటి సాయంత్రం సుబుదై కొండమీద తన యుర్త్‌కి తిరిగివచ్చాడు. అక్కడ శృంగంతో వున్న అయిదు తోకల చిహ్నం పక్కన పది నిడుపాటి బల్లేలు భూమిలోకి దిగేసి వున్నాయి. వాటికి మొత్తం సైన్యపు వేయింటి సర్దార్ల చిహ్నాలు వున్నాయి. ఇప్పుడు మొత్తం సైన్యం యుద్ధానికి సమాయత్తమై వుంది. మైదానంమీద శిబిరం కలకలం వ్యాపించి వుంది.

వృద్ధ మంగోలు నాయకుడికి నిద్ర పట్టడం లేదు. విశ్రాంతి తీసుకోవడానికి సర్దుకునే శిబిరం ధ్వనులు మణిగిపోతూ వుంటే వింటూ పడుకున్నాడు. యుర్త్ కొయ్య చట్రంలోనుంచి నెగడు మంటలు జ్వాలలు కనిపిస్తున్నాయి. వాటి చుట్టూతా కూర్చున్న సైనికుల ముఖాలు యెర్రటి కాంతిలో ప్రకాశిస్తున్నాయి. మాటలు పొడిపొడిగా చెవులబడుతున్నాయి. ఆకురాతిమీద ఇనప కత్తుల్ని పదును పెడ్తున్నట్టున్నాయి. యెవళ్లో పాడుతన్నారు:

"ఇంక నీకు లేదు ఓ సైనికా
నీదు సొంత కెరులెన్!
నీవు కడచు జాడ, ఓ సైనికా
మగిడి తేదు నిన్ను;
నీదు శల్యాలు, ఓ సైనికా
ధవళిత మవుతాయి మైదానంపై..."

ఓ కోపిష్టి గొంతుక అరిచింది:

"ఛప్! మాకు వణుకు పుట్టిస్తావు! తీతువు పిట్ట వింటుంది నువ్వు పాడేది".

పాట ఆగిపోయింది. అక్కడా ఇక్కడా అరుపులు వినవచ్చాయి: "ఆగండి! యెవరటు పోతూ వుంట?" సుబుదై భారంగా లేచి ఆనుకుని కూర్చున్నాడు. గుర్రం గిట్టల చప్పుడు దగ్గర పడింది. స్వారీ చేస్తున్న వాళ్ల గోల దగ్గర పడింది. ఓ తుర్గాడ్ లోపలికి వచ్చాడు.

"తోఖూచర్ నాయన్ వచ్చాడు, మొత్తం తోమన్ని కూడా తీసుకొచ్చాడు–వెయ్యి మంది రౌతులు".

"యెందుకొచ్చారు?"

"నాయన్ కొండపైకి వెళ్తున్నాడు నిన్ను చూడ్డానికి".

సబుదై దగ్గుతూ, మూలుగుతూ యుర్త్ బయటికి వెళ్లాడు. చీకట్లో ఇనప శిరస్త్రాణం పెట్టుకున్న పొడగరి సైనికుడి బాహ్యాకృతి రేఖలు గొచరమయాయి.

"ఆకాశ దేవత నిన్ను ఆశీర్వదించుగాక! బంగారు గుడారంనుంచి యెకాయెకీ వచ్చాను నీ గుడారం పక్కన నా చిహ్నం నిలపడానికి".

"ఇంతవరకూ దారికడ్డం వచ్చిన అందరితోటీ నువ్వు లేకుండా నెగ్గుకొచ్చాను..."

"ప్రతి మంగోలుకీ ఆ విషయం తెలుసు. నీతో మాట్లాడాల్సింది వుంది".

ఇద్దరు సైన్యాధిపతులూ యుర్త్ లోపలికి వెళ్లారు. తోఖూచర్ నాయన్ సుబుదై పక్కన బొచ్చు అట్టమీద కూర్చుని మెల్లిగా చెప్పాడు. ఆఖరి మంగోలు సైన్యం కోసం వెతుకుతూ పడమటికి వెళ్లమని జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞ ఇచ్చాడుట. ప్రత్యేక దూతద్వారా పంపిన మహా ఖాఖాన్ ఉత్తరం గురించీ చెప్పాడు.

సుబుదై చాలా సేపు నిశ్శబ్దంగా తల ఆడిస్తూ, గుర్రుమంటూ కూర్చుండి పోయాడు.

తోఖూచర్‌మీదకి వాలాడు. అతని చెవిలో మెల్లిగా మాట్లాడుతూ అన్నాడు:

"ఖాఖాన్ ఉత్తరంలో యేముందో నాకు తెలీదు... శిరసా వహించాల్సిందే. ఆయన మనకి శుభం కలగాలని కోరుతూ వుండచ్చు. లేదా ఇంటికి తిరిగి రమ్మని మనల్ని ఆజ్ఞాపిస్తూనూ వుండవచ్చు... అలా అయితే మా సైనికులు యుద్ధానికి ఆగరు... కాని రష్యన్లు రేపు ఇక్కడికి వస్తారు. సరిగ్గా యుద్ధానికి ముందు నేను వెనక్కి వెళ్లిపోతే వాళ్లేమను కుంటున్నారు?... జెంఘిజ్ ఖాన్ సైనికులకి రష్యన్ గడ్డం అనిపించాలంతే గుర్రాల తోకలు చూపిస్తారు అంటారు..."

సుబుదై మాట్లాడలేదు. చాలా సేపు గుర్రుమంటూ, ఆలోచిస్తూ వుండిపోయాడు.

"నేనా ఉత్తరం చూళ్లేదు... దాన్ని గురించి నాకేం తెలీదు... ఇప్పుడు నిద్రకి ఉపక్రమిస్తా. కోడి కూతప్పుడు రష్యన్లమీద దాడి చెయ్యబోతున్నాను... సుల్దే దేవుడు, గలై దేవుడు, మత యితర దేవతలు కత్తినుంచీ, బాణంనుంచీ నన్ను రక్షిస్తే అప్పుడు యుద్ధం తర్వాత మళ్లీ కలుద్దాం, సైన్యం అంతటి ముందూ జెంఘిజ్ ఖాన్ ఉత్తరాన్ని యిద్దువుగాని... సెలవ్!"

తెల్లవారకట్ల సుబుదై కునుకు తీశాడు. పుంజు హఠాత్తుగా కూసి రెక్కలు చరుచుకుంది. ముసలి సక్లాబ్ యుర్త్‌లోకి వచ్చి మంట రాజేశాడు. పక్క యుర్త్‌లో వున్న ఇద్దరు సామాన్లు, పుంజు కూతని అనుకరిస్తూ "కొకొకొక్కొరోకో" అని కీచుమన్నారు.

సుబుదై సక్లాబ్‌కేసి ప్రశ్నార్థకంగా చూశాడు యేమిటి సంగతి? అన్నట్టు. ముసలి రష్యన్ బానిస బొచ్చు అట్టమీద పట్టు దాస్తర్‌ఖాన్ పరిచి ప్రత్యేకం గంభీరంగా కనిపించాడు. అతని నెరిసిన జుట్టు మధ్యకి పాపిడి తీసుకున్నాడు. పైకి దారంతో కట్టుకున్నాడు. యెండకి కమిలి, ముడతలు పడ్డ మెడమీద ఎలుగుబంటి దంతాల హారం వుంది. సక్లాబ్ అవతలికి వెళ్ళి అన్నం, కొందిన మాంసం తీసుకువచ్చాడు. సుబుదై ముందు పట్టు గుడ్డమీద పళ్లెం వుంచి, నాలుగు నాలుగుగా కలిపిన పల్చని చదును అట్లు పక్కన పెట్టాడు.

"కారం వేసిన గుర్‌గంజ్ పలావ్ యిది..."

"ఎలుగుబంటి దంతాల హారం వేసుకున్నావేం? మీ రష్యన్ సోదరుల్ని చూసి సంబరం చేసుకుంటున్నావా?..." సుబుదై అన్నం దగ్గరకంటా ముక్కు పెట్టి అనుమానంగా వాసన చూశాడు.

"విష! చచ్చిన మీ తండ్రికి పెట్టు" అని బుస్‌మని సుబుదై పళ్లేన్ని పక్కకి తోసేశాడు.

"నేను బానిసని, కుక్క కన్నా కనాకష్టంగా వున్న వాణ్ణి, కాని నా యింత జీవితంలోనూ యెవళ్లకీ హాని చెయ్యలేదు" అన్నాడు సక్లాబ్ వినయంగా.

సుబుదై ముఖం ముడిచాడు.

"దీన్ని తీసుకుపో! సుబుదై భగత్తూర్ ప్రార్థన చేసుకోవాలి".

కుంటుతూ, చీదుకుంటూ ఆ వృదధ మంగోలు నాయకుడు బయటికి వచ్చి యుర్త్ బయట నిలబడ్డడు. ముందునాటి రాత్రే సైన్యానికి ఆజ్ఞ చేశాడు: "తొలి కోడి కూసినప్పుడు కొండల వెనక పాతు దగ్గర చేరండి".

అన్ని వేపులనుంచీ రౌతులు దౌడు తీసి వచ్చారు. నగారాలు మోగాయి. భేరీలు దద్ధరిల్లాయి. గుర్రాల్ని పురికొల్పే సైనికుల అరుపులు అంతటా నిండిపోయాయి.

యుర్త్ పక్క నెగడు ముందర ఇద్దరు వృద్ధ షామాన్లు కూర్చున్నారు. వాళ్లు యెత్తు కుళ్లాయిలు పెట్టుకున్నారు. బొచ్చు గొర్రె తోలు అంగీలు, ఉన్ని భాగం బయటికి తిరిగి, టకటక చప్పుడు చేసే గిలకలత వేలాడుతున్నాయి. అధిపతి కనిపించగానే షామాన్లు అరిచి, భేరీలు వాయించి, నెగడు చుట్టూతా వృత్తంలో నాట్యం చెయ్యడం మొదలెట్టారు.

తుర్గాడ్‌లు గుర్రాల్ని తెచ్చారు. రెండు జీను గుర్రాలు బదలాయించుకోవడానికి. ఆరు పెరికె గుర్రాలు. ఇవి భారమైన తోలు సంచీల్ని మోస్తాయి. యీ సంచీల్లో సుబుదై తను కొల్లగొట్టిన బంగారాన్ని దాచాడని వదంతి.

సుబుదై గోధుమ రంగు బొచ్చు పెరికె గుర్రం దగ్గరికి వెళ్లి ఓ తుర్గాడ్‌కి సైగ చేశాడు. ఇద్దరు తుర్గాడ్‌లు గుర్రాల కళ్లేలు పట్టుకున్నారు, దాని జూలు దువ్వారు దాన్ని నెగడు దగ్గరికి తీసికెళ్లారు. అక్కడ సక్లాబ్ అన్నం గిన్నె పట్టుకునుంచున్నాడు. సుబుదై బాగా వున్న తన యెడమ చేత్తో గుప్పెడు అన్నం నిప్పులోకి విసిరి, దీర్ఘ స్వరంతో ప్రార్థన చేశాడు:

వినుము గలై ఖాన్ అరుణజ్వాలా
నీదు తండ్రిగా చెకుముకి రాయి
నీదు తల్లియే కఠినపు ఉక్కు;
నీకు తెత్తు నొక బలిదానాన్ని
పసిండి నూనె పట్టగ గరిటెడు
నల్లని సారా నిండుగ లొట్టెడు,
కొవ్విన గొర్రెలు కప్పము కడుదుము.
చల్లగ చూడుము దేవా మమ్ముల
శక్తి నిమ్ము మా కదనాశ్వములకు
యెన్నడు మా గురి తప్పకుండుగా.

ఇద్దరు షామాన్లు సుబుదైని అందుకుని ప్రార్థనని వల్లించారు. తప్పెట మోత లయకి అనుగుణంగా చదివారు. ఆ సైన్యాధిపతి ముగించగానే షామాన్లు సక్లాబ్ చేతిలోనుంచి అన్నం గిన్నె లాక్కుని, నేలమీద కూచుని, చప్పుడు చేసి నములుతూ ఆబగా అన్నం మింగేశారు.

సుబుదై నాజూకైన కత్తిని దూసి గోధుమ రంగు గుర్రం భుజంమీద గంటుకోశాడు. ఆ జంతువు గెంతింది. నల్లని రక్తం దాని పట్టు చర్మంపై నుంచి కారింది. సుబుదై గుర్రం భుజాల నడిమి భాగాన్ని పట్టుకుని, గంటుమీద పెదాలు నొక్కిపెట్టి రక్తం పీల్చాడు.

తుర్గాడ్‌లు నిశ్చలంగా నుంచున్నారు. యుద్ధానికి ముందు తమ నాయకుడు నునువెచ్చటి రక్తంతో తృప్తి పడడం అణకువగా చూశారు.

కొండపైకి ఉక్కు శిరస్త్రాణం, కవచం వున్న సైనికుడొకడు దౌడు తీసుకుంటూ వచ్చాడు. కనుబొమలదాకా అతను దుమ్ము కొట్టుకుపోయి వున్నాడు. అతన్ని గుర్తు పట్టడం కష్టం. సుబుదై గోధుమ రంగు గుర్రంనుంచి తల యెత్తి అతన్ని చూశాడు. అతని వొక కన్నూ ప్రశ్నిస్తున్నట్టు వెలిగింది, అతని ముఖంమీద రక్తం చెదిరి వుంది.

"యెవరు నువ్వు భగత్తూర్?"

ఆ సైనికుడు తన అరచేతిని గుర్రం భుజంమీద తెరుచుకున్న గంటుమీద పెట్టి, ఆ రక్తసిక్తమైన చేత్త సుబుదై బట్టలని తాకాడు.*

---

* ఆయురారోగ్యాలని కోరే మంగోలు ఆచారం.

"యేదీ చిరకాలం వుండదు, సర్వకాల అధిపతీ! పైన మాసిపో, లోపల కండబట్టు! నేను జెబె నాయన్‌ని".

"రష్యన్లు యేరి?"

"దగ్గరగానే వున్నారు! చాలా దగ్గరగా! త్వరలోనే ఇక్కడకి వచ్చేస్తారు... నా వందేసి మంది బలగాలూ వాళ్లతో పోరుతూ, పారిపోతున్నాయి ఇక్కడికి వాళ్లని తెస్తున్నాయి... నేను మూడు వందల మందిత మస్తిస్లావ్ కోసం చూస్తున్నాను... అతను తన దళంతో ముందు వస్తున్నాడు... అతన్ని సజీవంగా పట్టుకోవాలని వుంది".

"జాగ్రత్త అతను నీమీద తన పంజాని పెట్టకుండా చూసుకో".

సుబుదై తన శబలాశ్వం యెక్కాడు. ముగ్గురు మంగోలులు అతని ముందు వరసగా వెళ్లారు. మధ్య వాడు అయిదు గుర్రపు తోకలతో వున్న శృంగ చిహ్నం పట్టుకున్నాడు. సుబుదై మెల్లిగా కొండ దిగువకి మైదానంమీదకి నడిపించుకు వెళ్లాడు. అక్కడ వంద మంది తుర్గాడ్‌లు నిరీక్షిస్తున్నారు. కొంత దూరంలో పొడారిపోయిన బీటిమీద మందగా రౌతులు వెడుతన్నారు.

# యుద్ధం ఆరంభమవడం

"రష్యన్లు యుద్ధానికి సిద్ధం అవకముందే
తాతార్లు మహా బలగాల్తో వాళ్ల
మీద పడ్డారు, రెండు పక్షాలూ కనీవినీ
యెరగని పరాక్రమంతో పోరాడాయి".
(చరిత్రకారుడు ఇబన్ ఆల్ అథిర్, 13వ శతాబ్దం)

కల్క నది నిట్రపాటి తీరంమీదకి మొదటగా వచ్చి చేరినవి గాలిచ్ రాకుమారుడు మస్తిస్లావ్ ఉదాత్ని గుర్రం దళాలు. వాటి వెనక సేనాధిపతి యారున్ కింద కిప్‌చాక్ రౌతులు వచ్చారు. మస్తిస్లావ్ తాతార్లు పాడు పెట్టిన మసిబారిన యుర్త్‌ల వలయం దగ్గరికి వచ్చాడు. చాలా వాటిల్లో తివాసీలు, బొచ్చు అట్టలు, ధాన్యం బస్తాలు ఇంకా అలానే వున్నాయి. నెగళ్లలో చితుకులు ఇంకా కణకణ వెలుగుతూనే వున్నాయి.

"తాతార్లు కుందేళ్లల్లా పారిపోయారు. వాళ్లని ఇక అందుకలేం. ఇంకా యెంత కాలం ఇలా వెడతాం? ఈ యెండకి చావొచ్చింది" అన్నారు సైనికులు.

రాకుమారుడు మస్తిస్లావ్ ఉదాత్ని సిద్ధహస్తుడైన సైనికుడు. అతను జీవితం మొత్తం యుద్ధంలో గడిపాడు. యే కొంత రాబట్టగలగినా యుద్ధం అనేదాన్ని ఎవరితోనేనా చేస్తాడు. వదిలిపెట్టిన తాతారు శిబిరం చూసి అతను సంబరపడలేదు. శిబిరాన్ని కాదు, తాతార్లనే అతను పట్టుకోవాలనుకున్నాడు. ఆగమని మస్తిస్లావ్ అన్నా, యుద్ధానికి, సన్నద్ధం కమ్మని కవచాల వేసుకోమని సైన్యానికి ఆజ్ఞ ఇచ్చాడు. తన చిన్నల్లుడు దనీల రొమానొవిచ్ నాయకత్వాన వొలీన్‌స్క్ దళాన్ని గూఢచారి పర్యవేక్షణకి పంపాడు. చిరాకు యెక్కువ పుతున్న సేనాధిపతి యారున్ కూడా తన మనుషుల్ని దుర్భలంగా వున్న వాళ్ల వెంటబడమన్నాడు. యేమంటే తాతార్లు దుర్బలులైపోయారని అందరూ అనుకున్నారు.

త్వరలోనే రాకుమారుడు దనీల దగ్గర నుంచి దౌడు తీసుకుంటూ ఒక దూత వచ్చాడు:

"తాతార్లు వస్తున్నారు! ఇక్కడికి వచ్చేశారు! వేగులు గుట్టలమీద కనిపించారు... మమ్మల్ని చూసి మాయమైపోయారు. మనం యేం చేద్దాం?"

రాకుమారుడు కొత్త గుర్రాన్ని తెమ్మన్నాడు. అతని మనుషులు మూడు జీను గుర్రాల్ని తెచ్చారు. వాటిల్లో రెండు ఉగ్రిక్ గుర్రాలు, నల్లని జూలు వున్న గోధుమ రంగువి. దృఢంగా వెడల్పాటి వెన్నుతో వున్నవి. దుమ్ము కొట్టుకుపోయి అవి కొంచెం వడిలినట్టు కనిపించాయి. మూడవది తన మామగారు కిప్‌చాక్ ఖాన్ కొత్యాన్ కట్నంగా ఇచ్చింది. యెత్తరిగా, పొడ రంగులలో యెర్రటి మచ్చలున్న తుర్క్‌మెన్ అశ్వం. అది పొగరు గుర్రం. 'అత్కాజ్' అని మారు పేరు. ఇద్దరు కిప్‌చాక్ కాపర్లు కళ్లేలు పట్టుకుని వూగుతూ దాన్ని అదుపు చెయ్యడానికి శ్రమ పడుతున్నారు.

మస్తిస్లావ్ అత్కాజ్‌మీద యెక్కిర కళ్లెం అదిమి పట్టుకుని నది దగ్గరికి స్వారీ చేసుకుపోయాడు. గుర్రాలకి నీళ్లు పెట్టమని యుద్ధ శ్రేణిల బారులు తీరమనీ రౌతులకి ఆజ్ఞ యిచ్చాడు. తాతార్లు యేదేనా పన్నుగడ చేస్తారని అతను అనుమానించలేదు. బలహీనతవల్ల భయపడి పారిపోతున్నారనే అతను అనుకున్నాడు. అంచేత వాళ్లని వెంబడించి చెల్లాచెదురుచేసి హతం చెయ్యాలి.

నది అవతలి వేపు చేరి, తన రౌతులు గుర్రాలకి నీళ్లు పెట్టడం పూర్తి చేసేదాకా మస్తిస్లావ్ ఆగాడు.

"దేవుడు మనని ఆశీర్వదించుగాక! ఈ పాషండ తాతార్లని ఖండిద్దాం! ఈ హంతక జాతికి జాలి చూపించద్దు! పదండి!" అని అరిచాడు మస్తిస్లావ్.

మొత్తం విభాగం మామూలు పరుగు తీస్తూ ముందుకు సాగింది. సైనికులు తక్షణం ఘోరమైన పోరాటం జరుగుతుందని ఆయుధాలు సవరించుకున్నారు.

మస్తిస్లావ్ ముందున్న మైదానంమీదకి చూశాడు. తాతార్, రష్యన్ ఆశ్వికులు నల్లని ధూళి మేఘాలల దౌడు తీశారు. అది తన పద్దెనిమిదేళ్ల అల్లుడు రాకుమారుడు దనీల రొమానొవిచ్ నాయకత్వం కింద వున్న వొలీన్‌స్క్ దళం. ఇప్పుడతని నీలం కేతనం కనిపిస్తోంది. దానికి బంగారు జరీ వుంది. రాకుమారుడు దనీలని అతని సైనికులు అన్ని వేపులనుంచీ ముసరుకుంటూ వచ్చే తాతార్లనుంచి రక్షిస్తూ పరివేష్టించి వున్నారు. తాతార్లకి రక్తం కారే దెబ్బలు తగుల్తున్నాయి, పడిపోతున్నారు. కాని తమ నిడుపాటి, వంగిన కత్తులతో యుద్ధాన్ని సాగిస్తూనే వున్నారు.

కిప్‌చాక్‌లు చాలా దూరంలో వున్నారు. మస్తిస్లావ్‌కి కిప్‌చాక్ రౌతులు కనిపిస్తున్నారు. వాళ్ల సేనాధిపతి యారున్ వాల సంకేత కేతనం ముందు రెపరెపలాడుతోంది. ధూళి మేఘంల కొండలకేసి దౌడు తీసిపోతున్నారు. మస్తిస్లావ్ యెడమ వేపు వెళ్లాలనుకున్నాడు, కొండలగుండా చొచ్చుకుపోవాలని. యుద్ధం గనక కొండల ఆవలకంటా సాగితే తాతార్లని పక్క భాగంలో

పట్టుకుని, కిప్‌చాక్‌లకు సహాయం వెళ్లాలనీ అనుకున్నాడు. అతను తన దళాన్ని కొండల్లో కనుమగుండా తీసికెళ్లాడు, యెత్తైన చోటికి యెక్కి తను చూసిం దానితో నిశ్చేష్టుడైపోయాడు...

మైదానంమీద కొత్త తాతార్ సైన్యం వుంది. వాళ్లు చాలా మంది వున్నారు. కాపు కాస్తూ వున్నారు. ఆ రౌతులు నిశ్చలంగా, నిశ్శబ్దంగా నుంచున్నారు. వాళ్ల ఇనప శిరస్త్రాణాలు, మెరిసే కవచాలు, చేతుల్లో పొడుగ్గా వంపు తిరిగిన కత్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శ్రేణి తర్వాత శ్రేణి, విభాగం తర్వాత విభాగంగా తాతార్లు మైదానంమీద వ్యాపించుకున్నారు. యెంతమంది వున్నారు? పది వేలు? పదిహేను? ఇరవై వేల మంది?

ఇదీ తాతారు బలగాలు ఆఖరి భయంకర దినం దాకా దాంకుంటూ పోవాల్సిన పద్ధతి! ద్నీపర్ వార దారి మీద దాడి చేసి పారిపోయిన చిన్న దళాలన్నీ కుయుక్తుల తాతార్ మాయలే!

ఇలాంటి ఘోరమైన తప్పు చేసి, తన అనుంగు సైనికుల్ని ఉచ్చులోకి నడిపించడమా, తాతార్ల వంకర కత్తులు అప్పుడే యుద్ధానికి తయారుగా వుంటే? తనకి యెలా వ్యవధానం వస్తుంది? రష్యన్ సేనలు తమకి యేం ప్రమాదం లేదనుకుని దీర్ఘ పథంమీద వ్యాపించుకుని వున్నాయి. ఆ రష్యన్ సైన్యాలకి యెలా వర్తమానం చెయ్యాలి? "మన రష్యన్ సైన్యం తాతార్లకంటే తక్కువేం కాదు. కాని దాన్నీ యిలా గంభీరమైన, అజేయమైన బలంగా యెందుకు పోగు చెయ్యలేం? యే రాకుమారుడి మట్టుకు ఆ రాకుమారుడు యెందుకు విడిగా వుండాలి? కావలసిందల్లా ఒక రోజు తెరిపి, రష్యన్ సైన్యాలన్నిట్నీ ఐక్యం చెయ్యడానికి. అప్పుడు తాతార్ల బలగంతో తూగచ్చు".

వేళ మించిపోయింది! త్వరలోనే తాతార్లు కదులుతారు, ముప్పై వేల తాజా గుర్రాల దెబ్బకి దారిలో వున్న ప్రతీదీ తుడిచి పెట్టుకుపోతుంది... "మృత్యువు అప్రతిష్టని తుడి చేస్తుంది" అనుకున్నాడు మస్తిస్లావ్. గుర్రాన్ని కమ్చీతో కొట్టాడు. పచ్చిక బీటి గుర్రం వెనక కాళ్లమీద లంఘించి పిచ్చి దౌడు తీసింది. అది కొండ దిగువ మైదానంమీదకి దౌడు తీసింది. కిప్‌చాక్ ఆశ్వికులు కొండల వెనకనుంచి బయటికి వచ్చారు, మస్తిస్లావ్ కింద వున్న గాలిచ్ దళంతో తలపడి చెదరగొట్టి, ఓ వరసా పద్ధతీ లేకుండా దౌడు తీసి, దారిలో అడ్డం వచ్చిన అన్నిట్నీ తోసేస్తూ పోయారు. యువ దనీల రొమానొవిచ్ గుర్రం వాళ్లతోబాటు దౌడు తీసింది. అతను యెక్కువగా ఛాతీమీద గాయపడ్డాడు. కష్టంమీద, గుర్రం జూలు పట్టుకుని వేలాడుతూ, జీనుమీద వుండగలిగాడు.

తాతార్లు చిత్రమైన నిశ్శబ్దంతో, చౌక్కాల కుడి చేతులు పైకి మడుచుకుని, వంకర కత్తుల్ని పైకెత్తి పట్టుకుని సన్నిహిత శ్రేణుల్లో మైదానంమీద నడిచారు. ఒక్క అరుపూ లేకుండా కల్కా నదీ తీరం మీద ముందుకు సాగుతూ వున్న యీ రౌతులు సాంద్ర విభాగం మౌనంగా కదలడంలో యేదో దుష్ట సూచకమైంది గోచరించింది.

గుర్రాల బుస, జడంగా వున్న వాటి గిట్టల చప్పుడు లేదా యేదో పరాగ్గా తగిలిన ఆయుధం చప్పుడు మంగోలు సైన్యపు నిశ్శబ్దాన్ని భంగించేవి. ఆ సైన్యం ఒకే సంకల్పంతో, ఒక గమ్యంతో పోత పోసినట్టు వుంది.

తాతార్లు నదిని దాటారు. అవతలి ఒడ్డు యెక్కారు. అప్పుడు మాత్రమే భేరీలని మోగించారు. పిచ్చి అరుపులు అరుస్తూ రష్యన్ శిబిరంమీద విరుచుకుపడ్డారు. అక్కడ భీతాంగం యెత్తిపోయిన కిప్‌చాక్‌లు పారిపోవడం అప్పటికే కనిపించింది. బళ్ల వృత్తం శిబిరం చుట్టూ హడావుడిగా యేర్పాటు చేశారు.

మొదటి రష్యన్ దళం ఆగకుండా తాతార్లు దౌడు తీశారు. రష్యన్ సైన్యం వెనక వెడుతూ వున్న దీర్ఘమైన మెలికలు తిరిగిన సామాన్ల దండుమీద దాడి చేశారు.

దారిమీద విస్తరించుకున్న రష్యన్ దళాలు చూసాయి కిప్‌చాక్ దళాలూ, రాకుమారుడు మస్తిస్లావ్ ఉదాత్ని పారిపోవడం. అతని యెర్ర అంగీ గాలికి ఉబ్బరించింది దౌడు తీస్తూ వుంటే.

చాలా మంది రష్యన్లు బళ్లు వదిలిపెట్టేసి గుర్రాలు యెక్కి ద్నీపర్ దగ్గరికి హడావుడిగా వెళ్లారు. మిగిలిన వాళ్లు తమ బళ్లని వలయంగా యేర్పాటు చేసారు. దాడి చేసే తాతార్లని తమ గండ్రగొడ్డళ్లతో యెదిరించారు.

తాతార్ సైన్యంలో ఒక విభాగం కీయెవ్ రాకుమారుడు మస్తిస్లావ్ రొమానొవిచ్ శిబిరాన్ని ముట్టడించింది. అతను పది వేల మందితో వచ్చాడు. పదాతి దళం వుంది, ఆశ్వికులు వున్నారు. అతను మిగిలిన విభాగాలతో సంబంధం పెట్టుకోలేదు. మస్తిస్లావ్ ఉదాత్ని ఉద్దేశాలేమిటైందీ అతనికేమీ తెలీదు. తను, యెవరి సాయం అక్కర్లేకుండా "దుష్టవాయువు ఇక్కడికి విసిరిన జెంఘిజ్ ఖాన్ తాతార్లని" నాశనం చేస్తానని గప్పాలు కొట్టాడు.

యీ చెడ్డ రోజున మధ్యాహ్నం కీయెవ్ సైనికులు తమ శిబిరాన్ని కల్క నదీ తీరంమీద యేర్పాటు చేసుకున్నారు. వాళ్ల ఆచారం ప్రకారం వాళ్లు బళ్లని వలయంగా యేర్పాటు చేశారు, భయపడ్డ కిప్‌చాక్‌లు పారిపోతూ వుండగా.

కీయెవ్ సైన్యంలో వున్న పదకొండు మంది రాకుమారులు కూడా అన్నారు:

"చావొచ్చింది! మనం దృఢంగా నిలబడాలి".

వాళ్లు ఒకళ్లనొకళ్లు ముద్దుపెట్టుకుని కొన వూపిరిదాకా పోరాడాలని నిర్ణయించుకున్నారు.

కీయెవ్ సైనికులు బళ్లని దగ్గరగా జరిపారు. యెర్ర డాలులతో తమని అడ్డం పెట్టుకున్నారు, బళ్ల చక్రాల వెనక దాంకున్నారు. వాళ్లు తాతార్ల సైన్యంమీదకి బాణాలు విసిరారు. తమ కత్తులతోటీ, గండ్రగొడ్డళ్లతోటీ వాళ్లతో పోరాడారు.

# "భయంకర, విపత్కర ప్రళయం..."

పొడారిపోయిన విశాల మైదానంమీద ధూళి మేఘాలు రేగాయి. ధూళి మేఘం బాగా సాంద్రంగా వున్న చోట మనుషులు హతం అయిపోతున్నారు. గుర్రాలు రౌతులేకుండా పరిగెట్టాయి. క్షతగాత్రుల అరుపులతో దిక్కులు నిండిపోయాయి. ఆగ్రహభరితమైన అరుపులు, ఢంకా ధ్వానం, తుతారల హోరు అంతటా నిండిపోయాయి.

వందమంది యెంపిక చేసిన తుర్గాడ్లతోటి సుబుదై భగతూర్ కొండమీద నుంచున్నాడు. వార్తలు తెమ్మని అతను తన రౌతుల్ని పంపాడు. భగతూర్‌లు యెలా సాగిస్తున్నారు? కొత్త రష్యన్ బలగాల జాడ యేమన్నా వుందా? యే వేపు నుంచేనా ప్రమాదం ముంచెత్తుతుందా? కాని వార్తాహరులు యెప్పుడూ అదే వార్తతో తిరిగివచ్చేవాళ్లు. ప్రతి చోటా మంగోలులు జయిస్తున్నారు. రష్యన్లు ద్నీపర్ దగ్గరికి దారి యిచ్చేస్తున్నారు. పోరుతూ, గాయపడుతూ, పడుతూ, యుద్ధం చేస్తూనే వున్నారు. శరణు అడగడం లేదు. ఒకళ్లని కూడా బందీగా పట్టుకోవడం జరగలేదు.

"తోడేలు జాతి! తోడేలులాగే చస్తారు" అన్నారు సుబుదై.

కీయెవ్ సైన్యం చుట్టూతా బళ్లని పెట్టుకుందనీ, బాణాల్తోటీ గొడ్డళ్లతోటీ పోరుతోందనీ తెలిసి సుబుదై అక్కడికి దళం తర్వాత దళాన్ని పంపిస్తూనే వున్నాడు. ఆజ్ఞ యిచ్చాడు: "బళ్లని లాగెయ్యండి! వలయాన్ని ఛేదించండి! చుట్టు పక్కల వున్న పచ్చిక బీటికి నిప్పు పెట్టండి".

మంగోలులు బల్లేల్ని విసురుతూ, నిడుపాటి బాణాల్ని వేస్తూ, యినప ములుకుల బాణాల్ని విసురుతూ, యెండిన రెల్లుని మండిస్తూ రష్యన్ డాలులమీదకి విరుచుకుపడ్డారు. కాని రష్యన్లు దృఢంగా నిలవరించారు. బాణాలని వర్షింపచేస్తూ ఆశ్వికుల్ని తాడించారు. తాతార్లు రష్యన్ వలయాన్ని ఛేదించలేకపోయారు.

సుబుదై ఆజ్ఞల మేరకి శిబిరంలో వుండే నానాగోత్రీకుల్నీ, నానారకాల తండాల వాళ్లనీ గుంపుగా పోగు చేసి రష్యన్ శిబిరంమీదికి తోశారు. తమ సైనికుల్ని కాపాడుకోవడం కోసమని అలా చేశారు. వాళ్లు రష్యను బళ్లు యెక్కి, కత్తులు ఇనప గదలు వూపుతూ, ఒకళ్లనొకళ్లు

పిచ్చి అరుపుల్తో ఉసికొల్పుకుంటూ వెళ్లారు. నిడుపాటి పిడివున్న గొడ్డళ్లతోటి, కత్తులతోటి, కదలతోటి, రష్యన్లు వాళ్లని యెదిరించారు. తిప్పి కొట్టారు. దాడి చేసిన వాళ్లు తలలు పగిలిపోతూ వుండగా వెనక్కి పడ్డారు...

మూడవ రోజున సుబుదై పచ్చిక బీటి దిమ్మరి నాయకుడు ప్లోస్కిన్యాని పిలిచాడు. అతను బేజారు పడి, చిక్కిపోయి నీరసంగా ఆకలితో వున్నాడు. పొడుగ్గా, శక్తివంతంగా వుండే ప్లోస్కిన్యా యిప్పుడు గట్టిగా నిలబడలేకపోయాడు. మంగోలులు అతన్ని వెనక్కాల బాకులతో పొడుస్తూ ముందుకునెట్టారు. అతను తడబడుతూ దాదాపు ప్రతి అడుక్కీ పడిపోతూనే వున్నాడు. సుబుదై అన్నాడు:

"నీ సోదరులు రష్యన్ల దగ్గరికెళ్లు. ఆయుధాలు కింద పడెయ్యమని వాళ్లతో చెప్పు. ఇళ్లకు పొమ్మను. వాళ్లని వాళ్ల మానాన వదిలేస్తాం. ఇలా చెయ్యి, నీకు స్వేచ్ఛని ఇస్తా".

ప్లోస్కిన్యా సంకెళ్ల గొలుసుని చేత్తో యెత్తి రష్యన్ శిబిరం వేపు వెళ్లాడు. అతని మెడకి చుట్టిన ముతక చర్మం పట్టీ చివర పట్టుకుని ఇద్దరు మంగోలులు వెనక వెళ్లారు. రష్యన్ల బళ్ల వలయానికి కొన్ని అంగల దూరంలో అతను ఆగిపోయాడు. రష్యన్లు బళ్లు యెక్కి వింత అస్థిపంజరం మనిషిని ఆశ్చర్యపోయి చూశారు. అతని మెడమీద భారమైన కాడి వుంది. ఒకళ్లు అతన్ని గుర్తించారు: "అతను ప్లోస్కిన్యా గుఱ్ఱాల కాపరి – అతను కిప్‌చాక్ గుఱ్ఱాల్ని కీయెవ్‌కి తోలుకెళ్లేవాడు, కిప్‌చాక్ ఖాన్లకి దుబాసీగా పని చేసేవాడు".

ప్లోస్కిన్యా రష్యన్లకేసి అరిచాడు:

"యుద్ధం కొనసాగించడం వృధా అని మీకు చెప్పమని తాతార్ ఖాన్, సుబుదై భగత్తూర్ నన్ను ఆజ్ఞాపించాడు. మీరు అతన్ని శరణు వేడితే మిమ్మల్ని మీ ఇష్టం ఒచ్చినట్టు చేసుకోనిస్తాడు. కాని ఒకటి, మీరు అన్నిటినీ వదిలేసి వెళ్లిపోవాలి – మీ గొఱ్ఱెతోలు అంగీలు, బళ్లు, గొడ్డళ్లు. తాతార్లకి అవి కావాలి, వాళ్లవి దాడిలో చాలా ఖర్చయి పోయాయి".

"నువ్వు విరిగిన గుఱ్ఱాలని మాకు అమ్మినప్పటిలాగానే అబద్ధాలు కూస్తున్నావ్ ముసలోడా".

"అవన్నీ అబద్ధాలు! అతను చెప్పేది వినకండి!" అని కొంతమంది ముసలి సైనికులు అరిచారు. "మన కత్తులతోటి ద్నీపర్ దాటుకుంటూ వెళ్లడం మెరుగు. సగం మందిమి దాటి వెడతాం. కాని కత్తీ, గొడ్డలీ లేకపోతే మన బొమికలు బీటిమీద మిగిలిపోతాయి" అన్నారు.

కాని తను నిజమే చెప్తున్నానని ప్లోస్కిన్యా ప్రమాణం చేశాడు. అతను మెడమీద వేలాడుతున్న శిలువని తీసి ముద్దుపెట్టుకుని, యేడుస్తూ అన్నాడు:

"వెనకనుంచి తాతార్లు కత్తులతో పొడుస్తూ వుంటే వేరే యెందుకు చెప్తానయ్యా?"

తాతార్లు తలలు ఆడించి, బొటన వేళ్లు యెత్తి తమ దుబాసీ చెప్పేది నిజమేనని ప్రకటించారు.

వృద్ధ సైనికులకి ఇష్టం లేకపోయినా తమ ఆయుధాల్ని తాతార్లకి వదిలెయ్యవలసిందిగా కీయెవ్ రాకుమారుడు మస్తిస్లావ్ రొమానొవిచ్ ఆజ్ఞాపించాడు. అప్పుడు కీయెవ్ సైనికులు కడపటి వీడ్కోళ్లు చెప్పుకుని, కాగలించుకుని, ఒకళ్ల తర్వాత ఒకళ్లు ఒక గుట్టగా ఆయుధాల్ని విసేరేశారు. నది దగ్గరికి పరిగెత్తి పోవాలన్నది వాళ్ల మొదటి వూహ. మూడ్రోజులుగా నీళ్లు యెరగరు. సైనికులు శిబిరాన్ని వదిలిపెట్టాక, ఇంటి జాడ పట్టారు. తమ మాతృదేశాన్ని చూస్తామన్న సంబరంలో నిటారుగా వున్నారు. అప్పుడు తాతార్లు వెంబడించి వాళ్లని ఖతం చేసేశారు.

ఇక ఇప్పుడు శూన్య విస్తార మైదానంమీద, ఆయుధాలు లేక, అంతం తప్పదు. రష్యా చాలా దూరంలో వుంది, యిక శరణు లేదు!

మంగోలు కీయెవ్ రాకుమారుడి వెంట వున్న పదకొండు మంది రాకుమారుల్నీ విడగొట్టారు. సుబుదై భగతుర్‌తో విందుకి రమ్మని పిలిచారు. అనేక మంది తాతారు రౌతులు పహారా వుండి, మంగోలు శిబిరం దగ్గరికి తీసుకెళ్లారు.

సుబుదై భగతుర్ తన వందమంది తుర్‌గాడ్ అంగరక్షకులతోటీ కీయెవ్ శిబిరం నుంచి కొంత దూరం వెళ్లాడు, హత్యా కాండని చూడ్డానికి. నిరాయుధులైన రష్యన్లు చేతనైనంత మేరకి యుద్ధం చేశారు. రాళ్లు విసిరారు. మట్టి ముద్దలు విసిరారు. గాయపడ్డ మనుషులు తాతార్లని పట్టుకుని, వాళ్లని జీన్లమీదనుంచి యీడ్చి, వాళ్ల వంకర కత్తుల్ని లాక్కుని పోరాటం సాగించారు. ఒక యెత్తరి రష్యను బండి ఇరుసు మాను శిబిరం నుంచి తెచ్చుకున్నాడు. దాన్ని గదగా వాడాడు. తన మీదకి వురికే ఆశ్వికుణ్ణి కొట్టాడు. కాని దెబ్బ గుర్రం నెత్తిమీద పడింది. గుర్రం వెనక కాళ్లమీద లేచి, తొట్రు పడి ఆశ్వికుడితో సమా వాలిపోయింది. పడిపోయిన మంగోలుల మీద దూకి రష్యన్ అతని కత్తి లాక్కుని చంపేసి, గుర్రంమీదకి గెంతి కత్తితో ఝుళిపించుకుంటూ వెళ్లాడు. ధూళి మేఘాలు అంతా కమ్ముకున్నాయి.

కాని బలగాలు సరిసమంగా యెంత మాత్రమూ లేవు. రష్యన్లు ఓడిపోయారు.

సుబుదై భగతుర్ కొంత అంచుకంటా వెళ్లాడు. అక్కణ్ణుంచి రౌతుల్నీ పోరాటాన్నీ చూశాడు. ఉత్తరం నుంచి మూడు ధూళి మేఘాలు రావడం చూసిన మొదటి వాడతనే.

"యేమిటది?" అని సుబుదై ఉత్తరానికి చూపించి అడిగాడు.

"యెద్దుల మందని తోలుకొస్తూ వున్న కిప్‌చాక్‌లు" అని తుర్గాడ్లు జవాబు చెప్పారు.

"కాదు! అది మరో శత్రు సైన్యం! హెచ్చరిక చెయ్యండి! తక్షణం సైనికుల్ని పోగవమనండి! చచ్చిన రష్యన్ల చెప్పులు వూడబీకే వ్యవధి లేదు. కొత్త యుద్ధం మొదలవుతోంది!" అన్నాడు సుబుదై.

నగారా మోగింది. అన్ని వేపులనుంచీ ఇతర మంగోలు తుతారలు జవాబిచ్చాయి. రష్యన్లు ఇంకా పోరాడుతూ వున్న దారిని మంగోలు రౌతులు వదిలిపెట్టి కొండ వేపు దౌడు

తీశారు. అక్కడ సుబుదై అయిదు తోకల చిహ్నం నిశ్చలంగా శిలావిగ్రహంలాగా గుర్రంమీద కూచున్న నాయకుడు పక్క వున్నాడు.

ఉత్తరం వేపునుంచి పచ్చిక బీటిమీదుగా ధూళి మేఘాలు ఇంకా ఇంకా దగ్గరగా వచ్చాయి. దుమ్ములేచి గాలిలో దట్టంగా కమ్ముకుంది. క్రమేపీ గాలికి కొట్టుకుపోతోంది. సుబుదై మౌనంగా దానికేసి చూశాడు. అతని తుర్గాడ్లు మెల్లిగా అనుకుఆన్నారు:

"మూడు సైన్యాలున్నాయి. అవి యేమిటో? కిప్‌చాక్‌లవి కాకపోతే రష్యన్ రౌతులయి వుండాలి. ముందున్నది రెల్లు. ఇప్పుడు వాళ్లు బాడవలోనుంచి వస్తున్నారు. అందుకనే దుమ్ము లేదు... అదుగో, వాళ్లు!"

రెల్లు ముందర మైదానంమీద తెలుపు, ఎరుపు గుర్రాలమీద మొదటి ఆశ్వికులు వచ్చారు. అన్ని వేపులనుంచీ, నేల యీనినట్టు రౌతులు వచ్చారు. ఇంకా ఇంకా యెక్కువగా వచ్చారు. కొంచెం సేపట్లోనే మైదానం అంతా ఆంక్రమించారు.

కొంత సేపు రౌతులు వున్న చోటనే వుండిపోయారు, తమ శ్రేణుల్ని ఒక పద్ధతికి తెచ్చుకుంటున్నట్టు. వాళ్లు అర్ధచంద్రాకారంగా యేర్పడ్డారు. మూడు మూడు అంచుల జండాల కనిపించాయి – మధ్యలో నలుపు బంగారం వర్ణం. అర్ధచంద్రాకారం శృంగం దగ్గర రెండు ఎర్రటివి.

తాతార్లు నిరాయుధులైన కీయెవ్ రష్యన్లని చంపుతూ ధూళి మేఘం కమ్ముకుపోయి, కొంత సేపటిదాకా కొత్త సైన్యం రాకని గమనించలేదు. యీ గోల సాగింది, క్రమేపీ పడమటికి ద్నీపర్‌కేసి పోతూ...

ఉన్నట్టుండి కొత్తగా వచ్చిన సైన్యపు కేంద్రం చెవులు చిల్లులు పడేటట్టు అరుస్తూ యెకాయెకీ పోరాటంలోకి దూకింది. కుడి పార్శ్వం చీలిపోయి పడమటికి తాతార్ల వెనక్కి పోయింది. వాళ్లని చీల్చింది. ఎడమ పార్శ్వం మెల్లిగా క్రమేపీ వేగం హెచ్చిస్తూ సుబుదై భగత్తూర్ వున్న కొండ దగ్గరికి దౌడు తీసింది.

ఆ వృద్ధ మంగోలు నాయకుడు కొన్ని క్షణాలే సందిగ్ధంగా వున్నాడు. అతను అరిచాడు: "నా వెనక రండి!" గుర్రాన్ని కొరడాతో కొడుతూ అతను కొండ దిగివకి వేగంగా దౌడు తీయిస్తూ వెళ్లాడు. కాని రష్యన్లు అతన్ని వెంబడించలేదు. వాళ్లు ద్నీపర్‌కేసి పారిపోయే రష్యన్లకి సాయం వెళ్లారు.

సుబుదై ఆగాడు. దారిమీద విస్తరించుకున్న మంగోలు విభాగాల్ని తిరిగి పిలవడానికి అనేక మంది నోకర్లని పంపాడు. తక్షణం వాళ్లు కల్క నదీ తీరానికి రావాలని ఆజ్ఞ పంపాడు.

"ఇంతదాకా పోరు మనదే" అన్నాడా వృద్ధ నాయకుడు. "రష్యన్లు మహా తోడేలు జాతి. ఇంకో రష్యను సైన్యం హఠాత్తుగా పచ్చిక బీటిమీదకి రావచ్చు, మన మాతృదేశం నుంచి మనని వేర్పాటు చేసెయ్యొచ్చు. మన గుర్రాల్ని వెనక్కి తిప్పే వ్యవధి అయింది".

జెబె నాయన్ మూడు వందల ఆశ్వికుల అగ్రభాగాన గుర్రాల్ని మారుస్తూ, ఒక్క సారీ ఆగకుండా ద్నీపర్ వేపు దౌడు తీశాడు. అతనితోపాటు వచ్చిన దుబాసీ ప్లోస్కిన్యా గాయపడ్డ రష్యన్లని అడిగాడు:

"మస్తిస్లావ్ ఉదాత్ని యెక్కడ?"

దెయ్యంలాంటి బూడిద రంగు గుర్రంమీద సుడిగాలిలా రివ్వున అతను దూసుకుపోతూ వుండడం చూశామని యెవళ్లో అన్నారు.

జెబె ద్నీపర్ ఒడ్డు చేరాడు. తీరంనుంచి నల్లని పడవ వెళ్లడం కనిపించింది. అందులో మస్తిస్లావ్ అంగీ యెర్రగా కనిపించింది. ఆ రాకుమారుడు వెనక తట్టున కూర్చున్నాడు. వెనక్కాల యీదుకు వస్తూన్న గుర్రం కళ్లెం పట్టుకున్నాడు. మస్తిస్లావ్ బంగారు శిరస్త్రాణం అస్తమయ సూర్యుని కాంతిలో తళతళలాడింది. కాని అతను తను వదిలిపెట్టిన విపత్కర తీరంకేసి చూళ్లేదు.

జెబె తన శ్రేష్ఠమైన బాణాన్ని తీసి బిర్రుగా వుండే వింటి నారికి తగిలించి లాగాడు. ఆ బాణం పడవకి కొద్దిలో తప్పి నది నీళ్లల్లో పడిపోయింది. జెబె గుర్రం మీదనుంచి వురికి ముఖం నేలకి తిప్పి పడ్డాడు. చేతులతోటి పొడారిపోయిన గడ్డిని తీసుకుని పిచ్చి కోపంతో కొరికాడు...

అతను లేచి ఎర్ర అంగీ మెరుపుతో వెనక్కి వెనక్కి పోతూ వున్న పడవకేసి ఆఖరు సారి చూశాడు, ఎవళ్లమీద కోపం తీర్చుకోవాలో తెలియక. తర్వాత వంపు తిరిగిన కత్తిని దూసి ఇప్పుడిక ఉపయోగంలేని పచ్చిక బీటి దిమ్మరి ప్లోస్కిన్యాని ఖండించాడు.

జెబె తన గుర్రంమీదకి దూకి, పోరు జరిగే బోటునుంచి దౌడు తీసుకుంటూ పోయాడు.

కల్క యుద్ధంలో యెంతోమంది రష్యన్ యోధులూ, అజ్ఞాత వీరులూ చనిపోయారు.

ఆయుధాలు వదలకుండా ధైర్యంగా పోరాడిన రష్యన్లు ద్నీపర్ని చేరారు. అక్కడ వున్న పడవలు వాళ్లని అవతలి ఒడ్డుకు తీసుకెళ్లాయి. కాని తాతార్ల మాట నమ్మి గొడ్డళ్లూ ఆయుధాలూ వదిలేసిన వాళ్లు ఒక్కళ్లుకూడా మిగలకుండా హతం అయిపోయారు.

# ప్రాణావశిష్టులమీద తాతార్ విందు

"...బందీలుగా పట్టుకున్న రాకుమారుల్ని
బల్ల చెక్కల కింద అణగ్గొణ్ణి
చంపేశారు. వాళ్లమీద బల్ల చెక్కలు పెట్టి
వాటిమీద మంగోలులు విందుకు కూర్చున్నారు.
ఆ రకంగా యీ రాకుమారులు
చచ్చిపోయారు".
(ట్రోయిట్సా క్రానికల్)

యెత్తైన మిట్టమీద, కల్క నది తీరాన, సుబుదై భగత్తూర్ తన వేయింటి సర్దార్లని తన వందింటి సర్దార్లని యుద్ధ దేవుడు సుల్దే పవిత్ర పండగ విందుకి పిలిపించాడు. చిరచిరలాడుతూ బొచ్చుతో వుండే వృద్ధ షామాన్ బేకి దాన్ని యేర్పాటు చెయ్యాలన్నాడు. అతను యెత్తైన టోపీ పెట్టుకున్నాడు. భుజాలమీద యెలుగు చర్మం వుంది. దానిమీద అన్ని రకాల జంతువుల పంజాలు వున్నాయి. విగ్రహాలు, గజ్జెలు వున్నాయి. పెద్ద డోలుని వాయిస్తూ అతను ఒక వృత్తంలో నాట్యం చేశాడు. దాని మధ్యలో కీయెవ్ మహా రాకుమారుడు మస్తిస్లావ్ రొమానొవిచ్, పదకొండు మంది ఇతర రష్యా రాకుమారులు – వీళ్లు అమాయకంగా నమ్మే మనుషులు – వున్నారు. వాళ్ల కాళ్లూ చేతులూ కట్టేశారు.

లయబద్ధంగా తల ఆడిస్తూ తాతార్లు ఆ ఖైదీలమీద గొప్పలు పోయారు, రాకుమారుడు మస్తిస్లావ్ ఉదాత్ని లేడని విచారించారు – అతనుండాలని యెంతగానో అనుకున్నారు. అతను "రష్యన్ జెబె" అని పేరు గడించాడు.

షామాన్ బేకి ప్రార్థనలు గీమని చదివాడు. బొచ్చుగా వున్న కనుబొమలకి డోలు కొట్టుకున్నాడు. పిట్టలాగా కూశాడు. గుడ్లగూబలాగా గుయ్‌మన్నాడు. ఎలుగుబంటి లాగా అరిచాడు. తోడేల్లాగా కూత పెట్టాడు. యుద్ధ మహా దేవుడు సుల్దేతోటి అతని "దైవ సంభాషణ" అది. ఆయన కృపవల్ల అప్పుడే మంగోలులకి విజయం వచ్చింది.

"వినండి సుల్దేకి ఆగ్రహంగా వుంది" అని షామాను గాండ్రించాడు. "సుల్దేకి మళ్లీ ఆకలిగా వుంది. మానవ బలి కోరుతున్నాడు..."

వేలమంది తాతార్లు గుట్ట చుట్టూతా మైదానంమీద కూర్చున్నారు. వాళ్లు నెగళ్లు రాజేసి చిన్న గుర్రప్పిల్లల్ని ఖతం చేశారు.

రష్యన్ బళ్లనుంచి చీల్చుకువచ్చిన యెడికోలల్ని చెక్కల్ని తాతార్లు తెచ్చారు. వాటిని కాళ్లూ చేతులూ కట్టేసిన రాకుమారులమీద వేశారు. మూడు వందల మంది తాతారు సర్దార్లు ఈ బల్లలమీద కూర్చున్నారు. కుమిస్ పానీయం నింపిన ఛషకాల్ని యెత్తి యుద్ధ దేవుడు, మంగోలు రక్షకుడు సుల్దేని స్తోత్రం చేసి "ప్రపంచాన్ని కుదిపేసే"వాడైన అజేయ జెంఘిజ్ ఖాన్‌ని కీర్తించారు. ప్రఖ్యాత రష్యన్ రాకుమారులకి పూటగా చెల్లించే సొమ్ముని చీదరించుకుని తాతార్లు స్వర్గ దూత జెంఘిజ్ ఖాన్ సైన్యాలతో యుద్ధం చెయ్య సాహసించిన రాకుమారుల్ని తమ దేవుడు సుల్దేకి బలి ఇచ్చాడు. భగత్తూర్‌లు గట్టిగా నవ్వేరు. కలప చెక్కల కిందనుంచి అణిగి చచ్చిపోతూ వున్న రాకుమారుల మూలుగులూ అంతేగట్టిగా వచ్చాయి. ఆ మూలుగులూ యేడ్పులూ క్రమేపీ తగ్గిపోయాయి. కడకి మంగోలు సైనికుల విజయ గీతంలో మణిగిపోయాయి:

"మంగోలులు, మంగోలులు
పచ్చిక బీటి మంగోలులు
        నీలి నీళ్ల కెరులెన్
        స్వర్ణజలం ఓనన్;
మూడింతలు ముప్పై, మూడింతలు ముప్పై
మూడింతలు ముప్పైనే అణగదొక్కినాం మనం,
        మనుషులుగా వుండి నోళ్లు మట్టిగలిసినారు,
        అణగదొక్కినాం మనం!
ఎడారిలో, ఎడారులూ!
యెడారిలో యిసిక పర్రలూ,
        నలభై యెడార్ల మహా తిన్నెలూ
        యిసిక యెంతగా యెర్రబడెనోగా!
మనుష్యులూ, మనుష్యులూ,
మనుషులకే మేం చావు తెత్తుమూ
సైన్యాలూ, సైన్యాలూ
మహా జెంఘిజ్ ఖాన్ సైన్యాలూ".

విందు జరుగుతూ వుండగా మంగోలు సైన్యాధిపతి తోఖూచర్ నాయన్ లేచి, వూళ సంకేతం ఇచ్చాడు. వేటాడే విలుకాళ్లని కొట్టమని అది సంకేతంగా వుండేది. ఆ పిలుపు పరిచితమే. అంతా మౌనంగా అయిపోయారు. తోఖూచర్ యోధులకి పిలుపు ఇచ్చాడు:

“మహా జెంఘిజ్ ఖాన్ మనుషులందర్లోకీ వేత్త... ఆయన వంద రోజులకి, వెయ్యి యేళ్లకి జరగబోయే వాటిని ముందే దర్శిస్తాడు... ఆయన నన్నిక్కడకి మహా యోధుల తోమన్‌తోటి, అజేయ వ్యాఘ్రాలు జెబె నాయన్, సుబుదై భగతూర్‌లు యెక్కడున్నారో చూడమని పంపాడు. మీకు పంపగలిగిన అత్యుత్తమ కానుక యుద్ధ దినాన కొత్త సైనికుల్నీ, బలగాల్నీ ఇవ్వడమేనని ఖాఖాన్ నాతో అన్నాడు...”

“తోఖూచర్ జిందాబాద్! సరిగ్గా సమయానికి వచ్చావ్!”

తోఖూచర్ కొనసాగించాడు:

“మహా ప్రపంచ పాలకుడు మిమ్మల్ని గుర్తుంచుకున్నాడు. తన వీలునామాని నాద్వారా పంపాడు. ప్రత్యేక దూత అతని పవిత్ర పత్రాన్ని తెచ్చాడు. పదివేల ఆశ్వికులు అతన్ని విలువైన వజ్రాన్ని కాపాడినట్టు కాపాడారు. ఇక్కడికి అతన్ని సురక్షితంగా చేర్చారు. చూడండి, ఇడుగో”.

సుబుదై భగతూర్ ముందుకి ఒక ముసలి దొడ్డికాళ్ల మనిషి వచ్చాడు. గజ్జలు వేలాడుతున్నాయి అతనిమీద. డేగ యీకల కుళ్లాయి పెట్టుకున్నాడు. ఛాతీలోనుంచి తోలు గొట్టాన్ని తీశాడు. దాని లోపల జెంఘిజ్ ఖాన్ మొహరు వున్న పత్రం వుంది. వంకర వేళ్లతోటి సుబుదై గొట్టానికి బిగించిన మైనాన్ని పీకాడు. ముసల్మాన్ తలగుడ్డ కట్టుకున్న నెరిసిన గడ్డం రాతగాడు తను ముందు దాన్ని చదువుకుని సుబుదై చెవిలో గొణిగాడు. సుబుదై నుంచుని అరిచాడు:

“మహా ఖాఖాన్ ఆజ్ఞ! మేం శిరసావహిస్తాం”.

సుబుదై భగతూర్ కొనసాగించాడు:

“అజేయ ప్రభువు యిలా రాశారు:

“యీ కబురు అందుకున్నాక గుర్రాల ముట్టెల్ని యింటి వేపు తిప్పండి. ప్రపంచాన్ని స్వాధీనంలో వుంచుకోవడం గురించి చర్చించే కురుల్తాయ్‌కి (మహాసభకి) రండి.

“దేవుడు ఆకాశంలో వున్నాడు, భూమ్మీద ఖాఖాన్‌దే శక్తి. గోళాల పాలకుడి ముద్ర, సకల ప్రజాధిపతి ముద్ర”.

నేలవేపు ముఖాలు పెట్టిన వాలిన మంగోలుల వీపులకేసి సుబుదై చూశాడు. తన చేతిని యెత్తాడు.

“ఇప్పుడు మాట్లాడుతున్నాను, వినండి”.

అందరూ మోకాళ్లమీదే వుండి తలలు పైకి యెత్తారు, వూపిరి బిగపట్టి “కొరికేసిన పంజా చిరుతపులి”కేసి చూశారు.

“ఇవాళ మనం విందు చేసుకుంటాం. రేపు సూర్యోదయం వేళ పాలకుడి బంగారు గుడారం వేపు ముఖాలు తిప్పుదాం. ఆలస్యం చేసిన వాణ్ణి – అణగ దొక్కడం జరుగుతుంది”.

సైనికులందరూ సంతోషంతో అరిచారు. మరోసారి అరుపులతోటీ, పాటలతోటీ కూర్చుని, విందు  కొనసాగించారు.

ఆ మర్నాడు ఉదయం సూర్య నమస్కారం చేసి కుమిస్ అర్ఘ్యం యిచ్చి మంగోలులు గుర్రాలు యెక్కారు. వాళ్లు తమ ముందు పశువల్ని, చింకి పాతలు తొడుక్కుని ఆకలికి మాడే బందీలు తోలుకెళ్లారు. కొల్లగొట్టిన వస్తువులు నింపిన బళ్లనీ, బాగా గాయపడ్డ మంగోలులు వున్న బళ్లనీ యెద్దులు లాగాయి. అవి అనంతంగా కీచుమని చప్పుడు చేస్తూ పచ్చిక బీటిమీద పోయి ధూళి మేఘాల్లో అదృశ్యం అయిపోయాయి. మంగోలు సైన్యం ముందు సుబుదై భగత్తూర్ వెళ్లాడు. అతను జీను సంచీలో మస్తిస్లావ్ రొమానొవిచ్ తలని తీసికెళ్లాడు. దానితోబాటుగా బంగారు పూత పెట్టిన ఉక్కు శిరస్త్రాణం, అతని మెళ్లో వేలాడే బంగారు శిలువ కూడా వున్నాయి. ప్రపంచాన్ని కుదిపిన అజేయ జెంఘిజ్ ఖాన్ బంగారు సింహాసనం ముందు యీ విలువైన సంచీని పెట్టాలి. అనే అతని ఆలోచన. దానికి చిరునవ్వు లాంటిది అతని దుమ్ము కొట్టుకుపోయిన గంటు ముఖంమీద దూసుకు పోయింది...

సైన్యం వెనక తన వందమంది వేగులతోటీ విషణ్ణంగా జెబె వెళ్లాడు. అతను కొల్ల సంపదేమీ తీసుకెళ్లడం లేదు. నీలి నీళ్ల కెరులెన్, స్వర్ణ జలం ఓనన్ గాలిహోరులాగా దీర్ఘ ప్లుతంలో వున్న మంగోలు బీళ్ల గురించి పాట పాడుకుంటున్నాడు.

మంగోలులు ఈశాన్య మూలకి ఇతిల్ నది (వోల్గా నది) దగ్గరికి అవతలికి వెళ్లారు. ఉరల్స్ దక్షిణం నుంచి ఖోరెస్మ్ మైదానందాకా వెళ్లారు. కిప్‌చాక్ మైదానాలు మంగోలు కఠిన సైన్యం వెళ్లిపోయాక స్వేచ్ఛగా అయ్యాయి. వాళ్లు వచ్చినంత హఠాత్తుగానూ, ఆశ్చర్యకరంగానూ అదృశ్యం అయిపోయారు. వాళ్లు వెళ్లిపోయిం తర్వాత కొన్ని కిప్‌చాక్ తండాలు శిధిలమైన తమ శిబిరాలకి వచ్చాయి. మిగిలిన ఉగ్రిక్ బీళ్ల దగ్గరకి, దాన్యూబ్ దిగువ భాగాలకి పోయాయి. తాతార్లు యిక యెన్నటికీ తిరిగి రారని రష్యన్, కిప్‌చాక్ రాకుమారులు అనుకున్నారు. రోజు తర్వాత రోజు తమ "పాత కక్షలతో కొట్లాట్లతో" గడిపారు. కొత్త యుద్ధానికి సన్నద్ధం అవలేదు. తాతార్లు మరింత భీకర యుద్ధాన్ని పడమట దిక్కున చెయ్య సంకల్పిస్తున్నారప్పటికే అని అనుమానించనూ లేదు...

నాల్గవ భాగం

# జెంఘిజ్ ఖాన్ మరణ గుర్రాలు యిళ్ల దారి పట్టాలని జెంఘిజ్ ఖాన్ ఆదేశం

సుల్తాన్ జలాలుద్దీన్‌తోటి సాహసోపేతమైన యుద్ధం తర్వాత జెంఘిజ్ ఖాన్ అనుభవజ్ఞులైన తన సైన్యాధిపతులు బాల నోయన్, దుర్బాయ్ భగతుర్‌లని ఆ సుల్తాన్‌ని హిందూ దేశందాకా తరమమని పంపాడు. వాళ్లు అనేక దార్లమ్మట వేగంగా వెళ్లారు. కాని అతని జాడ దొరకలేదు. దారిలో ఖతం చేస్తూ, దగ్ధం చేస్తూ మంగోలులు జలాలుద్దీన్ మిత్రులు అగ్రాక్, ఆజమ్ మాలిక్ ఖాన్‌ల నగరాలని నాశనం చేశారు.

మంగోలులు పెద్ద పరిమాణాల తెప్పల్ని తయారు చేశారు. వాటిమీద వడిసెలలనీ, విసరడానికి వీలైన రాళ్లనీ పెట్టారు. ఆ తెప్పల్ని సింధు నది దిగువకి తోసుకుపోయి ముల్తాన్ నగరం చేరారు. రాళ్లని విసిరే యంత్రాలతోటి నగరాన్ని ముంచెత్తడం మొదలు పెట్టిరు. అభేద్యమైన గోడలు, కొత్త హిందూ సైనికులు అలా వస్తూనే వుండడం, భరించలేని వేడి గొర్రెతోలు అంగీలు తొడుక్కున్న మంగోలులకి యిబ్బంది కలిగించాయి. ముట్టడి యెత్తేసి, జెంఘిజ్ ఖాన్ వున్న కొండల దగ్గరికి వెళ్లిపోయారు.

ఇక్కడ జెంఘిజ్ ఖాన్ కనిష్ట పుత్రుడు, అతని తల్లి కూలన్ ఖాతూన్ జబ్బుపడ్డారు. బొచ్చు తివాసీలు కప్పుకుని పట్టు మెత్తలమీద వాళ్లు పడుకున్నారు. గజగజ వణికించే చలి కుదుపూ జ్వరం. జెంఘిజ్ ఖాన్ ప్రతిరోజూ వాళ్ల దగ్గరికి వెళ్లి చూసేవాడు. పంచదార బిళ్లల్ని వాళ్ల నోళ్లల్లో పెట్టేవాడు. ఆ రోజు యెలా వుందో కనుక్కునేవాడు.

కూలన్ ఖాతూన్ వెక్కి, మొత్తం శరీరం అంతా నొప్పిగా వుందని చెప్పింది.

“యీ కొండ దేవతలు, యీ దుష్ట ప్రదేశంలో వున్న వాళ్లని పీడిస్తారు. కొండల పగుళ్లల్లోనుంచి పొగలు యెలా పాకుతూ వస్తున్నాయో చూడు. నీ సైన్యాలు చంపిన చిన్న పిల్లల దయ్యాలు అవి... నేనూ, నా బుజ్జి కొడుకూ కుల్కాన్ ఇక్కడ చచ్చిపోతాం. కెరులెన్ నీలి నీళ్లు మనల్ని నయం చేస్తాయి. మన సొంత మంగోలు పచ్చిక బీళ్లకి పోదాం”.

జెంఘిజ్ ఖాన్ కనుబొమలు పైకి యెత్తాడు. యీల వేసి, రాగం తీసి, ఆఖరికి అన్నాడు:

"నేను జయించలేని శత్రువు నాకు యింత వరకూ తటస్థ పడలేదు. ఇప్పుడు నేను మృత్యువుని జయించాలనుకుంటున్నాను. నువ్వు, మొండిగా చెప్పిన మాట వినకుండా వుండే కూలన్ ఖాతూన్ నాతో వుంటే మృత్యువు నిన్ను ముట్టకోదు. నానుంచి వెళ్లిపోతే, పాత్ర కింద దాచిన విషం, చీకట్లో కొట్టే బాణం నిన్ను మేఘాల అవతలకి తీసుకుపోతాయి..."

జెంఘిజ్ ఖాన్ తన సలహాదారుల్లో మహావేత్త అయిన యెలు చూ చాయకేసి తిరిగాడు.

"షామాన్లని మంత్రగాళ్లని, వైద్యుల్ని, విదుల్ని తీసుకొస్తానని అన్నావు, అమరత్వాన్ని ప్రసాదించే మందు చేసేవాళ్లని. యేరీ వాళ్లింకా కనిపించరేం?"

"వాళ్ల కోసం నమ్మకస్తులైన మనుషుల్ని పంపాను. వాళ్లు త్వరలోనే వస్తారు. కాని నువ్వు సైన్యంతోటి యెంతో వేగంగా, యెంతో దూరం పోతూనే వున్నావు, ఈ వృద్ధులు నిన్ను అందుకోలేకపోతున్నారు."

కూలన్ ఖాతూన్ ఇంకా ఇంకా బలహీనపడిపోతోంది, ఆమె సొగసు సౌందర్యం వాసిపోతున్నాయి, అని జెంఘిజ్ ఖాన్ కనిపెట్టాడు. ఆమె చిన్న కొడుకు కుల్కావ్ కూడా ఇంకా పాలిపోతూ, చిక్కిపోతూ తల్లి పక్క పడుకున్నాడు. ఖాఖాన్‌కి వికలం అయింది. యేదీ ప్రశాంతి నివ్వడం లేదు. అతను యెక్కువగా మృత్యువు గురించి మాట్లాడుతున్నాడు. ఆయుర్దాయాన్ని పెంచుకునే మందులనిమ్మని వైద్యుల్ని అడుగుతున్నాడు. చాలా మంది వైద్యులు మంత్ర విహిత ఔషధాలు ఇచ్చారు. ఆ ఔషధాల్ని వాళ్లనే తాగమని జెంఘిజ్ ఖాన్ వైద్యులకి ఆజ్ఞ చేశాడు. తర్వాత వాళ్ల తలల్ని నరికించాడు, మంఉ ఫలితం యేమవుతుందోనని.

బాల్తన్ కోట ముట్టడి అప్పుడు పోరులో శత్రువు వడిసెల బల్లెంలాగా వున్న బాణాన్ని విసిరితే అది తన ప్రియమైన మనుమడు, జగతాయ్ కొడుకు ముతుఖాన్‌ని నేల కూల్చింది. ముతుఖాన్ అన్ని ముసల్మాన్ భూములకీ సర్వాధినేత ఖాఖాన్ కావాల్సి వుంది. యాదృచ్ఛికంగా వచ్చిన బాణం అతన్ని కూల్చింది. అతను చనిపోయాడు. అప్పటినుంచీ ఖాఖాన్ మహా వికల మనస్కుడైపోయాడు.

అప్పుడు జెంఘిజ్ ఖాన్‌కి తెలిసింది. గుడ్డి ఆడ ఒంటె తన్నినట్టు మృత్యువు దెబ్బ కొడుతుంది – ఒకణ్ణి తన్నుతుంది, అతని ప్రాణవాయువు పోయింది. మరొకడు యీడ్చుకుంటూ వార్ధక్యం వచ్చే దాకా బతుకుతాడు.

మనమడి చావుతోటి జెంఘిజ్ ఖాన్‌కి పట్టలేనంత ఆగ్రహం వచ్చేసి తక్షణం బాల్తన్‌ని పట్టమని సైన్యానికి ఆజ్ఞ ఇచ్చాడు. అతని సైనికులు గోడల్ని కూలగొట్టి, నగరంలోకి పోగలిగారు. అందర్నీ కత్తికి బలిచేశారు. యెవర్నీ ఖైదీలుగా పట్టుకోవద్దని జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞ చేశాడు. మొత్తం ఆ ప్రాంతాన్ని నిర్ధామ ధూమం చేశాడు. సజీవమైందేదీ అక్కడ నిలవకుండా చేశాడు. ఒకప్పుడు నగరం వున్న చోటు "మవు కుర్గాన్"గా ("కన్నీళ్ల కొండ") పేరు పొందింది. ఆనాటినుంచీ అక్కడ యెవళ్లూ స్థిరపడలేదు. ఆ స్థలం అంతా మరుభూమిగానే వుండిపోయింది.

కొల్లగొట్టిన సంపదతోటి శిబిరంలో వున్న సైనికులు తమ సొంత ప్రాంతపు శిబిరాలకి వెళ్లిపోవడం గురించే యెప్పుడూ మాట్లాడుకునేవాళ్లు, కాని కఠినంగా వుండే ఖాఖాన్‌కి అలా అని యెవళ్లూ చెప్ప సాహసించలేకపోయేవాళ్లు. అసలతను యేమనుకునేదీ కచ్చితంగా యెవళ్లకీ తెలీదు. రేపతను యేం అనుకుంటాడో యివాళ యెవళ్లూ చెప్పలేరు – తన సైన్యాల్ని, వెనక్కి తిప్పి పంపుతాడో లేదా మళ్లీ కొన్నేళ్లు కొత్త భూములమీద అక్కడి ప్రజల్ని అగ్నికి ఆహుతి చేస్తూ గడిపే నూతన దండయాత్రలు నడుపుతాడో యెవళ్లకీ తెలీదు.

ఆఫ్ఘన్ కొండ దారుల్లో చాలా కాలం మకాం చెయ్యడంతోటి సైన్యాలు గొణుక్కుంటున్నాయప్పటికే. అక్కడేమో గుర్రాలకి తగినంత గడ్డి లేదు. అప్పుడు కులాన్ ఖాతూన్ ఇంటికి తిరిగిపోయే వేళ అయిందని ఖాఖాన్‌ని ఒప్పించే కోరికతో మహా సలహాదారు యెలు చూ చాయతో మంతనం చేసి ఓ కథ అల్లింది. యిద్దరు నోకర్లు దాన్ని కంఠతా పట్టి జెంఘిజ్ ఖాన్‌కి చెప్పేటట్టు చేశాడు యెలు చూ చాయ. ఆ యిద్దరూ కాపలా తావుకి వెళ్లి జెంఘిజ్ ఖాన్ దర్శనం కావాలనీ, తమకి ముఖ్య సమాచారం, అద్భుతమైంది వుందనీ అన్నారు.

యెలు చూ చాయ వాళ్లని జెంఘిజ్ ఖాన్ దగ్గరికి తీసికెళ్లాడు. వాళ్లు కథని చెప్పారు:

"కొండల్లో దారి తప్పిపోయిన మాకు ఒక చోట లేడిలాంటి వింత జంతువు తగిలింది. ఆకుపచ్చ రంగులో వుంది. గుర్రం తోక వుంది. ఒక్క కొమ్ము వుంది. ఆ జంతువు మంగోలు భాషలో అరిచింది. 'మీ ఖాన్ యింకా వేళ మించిపోక ముందే వెనక్కి తిరిగి వెళ్లిపోవాలి' అని".

జెంఘిజ్ ఖాన్ నిశ్శబ్దంగా ఆ కథని విన్నాడు, కాని ఒక కనుబొమ యెత్తి తన ముందు మోకరిల్లిన భగత్తూర్లకేసి దీక్షగా చూశాడు.

"యీ మాయ జంతువుని చూసిన రోజున మీరు యెక్కువ కుమిస్ తాగారా?"

నిజంగా తాగడానికి వుండి వుంటే తాము చాలా సంతోషించే వాళ్లమనీ, కాని పట్టిపోయిన కొండల్లో గుర్రం పాలు సరేసరి మేక పాలు కూడా దొరకడం దుర్ఘటమనీ చెప్పి నిజమే చెప్పిన దానికి గుర్తుగా బొటన వేళ్లని యెత్తారు.

జెంఘిజ్ ఖాన్ యెలు చూ చాయకేసి తిరిగాడు.

"భూమి, సముద్రం, ఆకాశం వెల్లడి చేసే రహస్యాల గురించిన పుస్తకాలన్నీ నీకు తెలుసు. ఇలాంటి జంతువు గురించిన కథ యెన్నడన్నా విన్నావా?"

యెలు చూ చాయ పెద్ద గ్రంథం తీశాడు. అనేక రకాల జంతువులనీ ప్రపంచంలో పక్షులవీ, చేపలవీ బొమ్మలూ, రేఖాచిత్రాలూ వున్నాయి. ఆయన పుటలు తిప్పి అన్నాడు:

"యీ మాయ జంతువుని 'గోతువాన్ రుషి' అంటారు. అన్ని భాషలూ తెలుసు. అది మన భగత్తూర్‌లకి చెప్పిందాన్ని బట్టి మహా ప్రపంచ రక్త పాతం జరగబోతోందని తెలుస్తోంది. నీ మహా సైన్యం పడమటి దేశాల్ని అణగదొక్కి యిప్పటికి నాలుగేళ్లు అయింది. అంచేత మహా నభం నిరంతర హత్యాకాండతో అలిసిపోయి తన సంకల్పాన్ని నీకు తెలియజెయ్యడానికి

జంతువు గోతువాన్‌ని పంపింది, ప్రభూ. ఆకాశానికి లొంగిపో, యీ భూములమీద బతికేవాళ్లని వదిలిపెట్టు. అది నీకు శాశ్వతానందాన్ని తెలుస్తుంది. లేకపోతే ఆకాశానికి ఆగ్రహం వచ్చి ఉరుములు కురిపిస్తుంది. చైనా రుషుల పాత గ్రంథంలో వున్న మాటలు యివీ".

యెలు చూ చాయ్ గంభీరంగా, తూచి తూచి మాట్లాడాడు, ప్రవక్తలాగా, మంత్రం చదివినట్టు మాట్లాడాడు. జెంఘిజ్ ఖాన్ కళ్లు ముడిచి తన సలహాదారుడి కేసి అలా చూశాడు. అప్పుడు భగత్తూర్‌లకేసి చూశాడు. వాళ్లు అతని ముందు మోకరిల్లి వున్నారు. మొదట ఒకణ్ణి పిలిచాడు. తర్వాత రెండో వాణ్ణి పిలిచాడు. కిందికి వంగి వాళ్ల చెవుల్లో యేదో మెల్లిగా చెప్పాడు. వాళ్లు యేదో తిరిగి మెల్లిగా అతనికి చెవిలో చెప్పారు.

తర్వాత ఖాఖాన్ సంతృప్తి పడినట్టు కనిపిస్తూ వెళ్లిపోవడానికి భగత్తూర్‌లకి అనుమతీ ఇచ్చాడు. వాళ్లు తాగగలిగినంత కుమిస్‌ని ఇమ్మనమని ఆజ్ఞ చేశాడు.

"ఈ భగత్తూర్‌లు మంచి వూహ వున్న వాళ్లు, చురుకు బుద్ధి వాళ్లూనూ. వాళ్లకీ ప్రోత్సాహం ఇవ్వాలి. ఈ జంతువు గోతువార్ యెలా తిరుగుతూ వుండిందీ అని విడివిడిగా అడిగాను. పెద్ద అంగలతో పరిగెత్తిందని ఒకడన్నాడు, దౌడు తీసిందని ఒకడన్నాడు. యెంత తాగినా మంగోలు వాడు అలాంటి పరిగిత్తే జంతువుని చూసి పొరపాటు పడ్డు. యేమైనా ఇవాళ నాకర్థమైంది, యుద్ధాలతో సైనికులకి అలుపొచ్చిందని. సొంత బీళ్లమీదకి మనసు మళ్లిందనీ, అంచేత ఆకాశ దేవత సంకల్పం యీ జంతువు గోతువాన్ ద్వారా దాన ప్రకారం చేస్తాను. సైనికుల్ని యిళ్ల దారి పట్టేటట్టు సొంత ప్రాంతాలకి పోయేటట్టు చెయ్యాలని తీర్మానించుకున్నాను.

ఆ మర్నాడు జెంఘిజ్ ఖాన్ నిర్ణయం విన్న సైనికులందరూ మహా సంతోష పడిపోయారు. పాటలు పాడారు. ప్రయాణానికి తయారయ్యారు.

జెంఘిజ్ ఖాన్ మొదట హిందూ దేశం గుండా, టిబెట్ గుండా వెళ్లాలనుకున్నాడు. అందుగ్గాను హిందూ దేశపు చక్రవర్తి ఇల్తుమిష్‌కి ఢిల్లీ నగరానికి దూతలని పంపాడు. కాని కొండ కనుమలు ఇంకా మంచుతో కప్పుడిపోయి వున్నాయి. ఆ చక్రవర్తి జవాబు పంపడం ఆలస్యం చేశాడు. సైన్యాన్ని సమకూర్చుకుని, అధిపతిగా జలాలుద్దీన్‌ని పెట్టాడు.

ఈ లోపున మంగోలు పచ్చిక బీళ్లనుంచి వార్తలు వచ్చాయి. యెప్పుడూ అసంతృప్తిగా వుండే తంగుత్‌లు కొత్త తిరుగుబాట్లు చేస్తున్నారట. యెలు చూ చాయ గ్రహగతుల్ని గుడించీ, షామాన్లు దైవ సంకల్పాలు వూహించీ హిందూ దేశం గుండా వెళ్లవద్దనే ఖాఖాన్‌కి సలహా ఇచ్చారు.

అప్పుడు జెంఘిజ్ ఖాన్ తను వచ్చిన దీర్ఘ పథంమీదనే యింటికి తిరిగి వెళ్లాలని తీర్మానించాడు. అతని ఆజ్ఞ మేరకి స్థానిక వాసులు కొండ కనుమల మంచుని శుభ్రం చెయ్యడం మొదలుపెట్టారు. వసంతరుతు ఆరంభంలో మంగోలు సైన్యం బయల్దేరింది.

# జెంఘిజ్ ఖాన్‌కీ రుషికీ ఉత్తరాలు

నల్ల ఇర్తిష్ యెగువ ప్రాంతాల మజిలీలప్పుడు కూడా జెంఘిజ్ ఖాన్‌కి తన ఆరోగ్యం గురించీ, ఆయువుని వృద్ధి చేసుకోవడం గురించీ బెంగ యెక్కువై, అనుభవజ్ఞులైన వైద్యుల్ని పిలిపించాడు. మహిమాన్వితుడైన రుషి చాంగ్‌చున్ గురించి విన్నాడు. ఆయన భూనభాల సకల రహస్యాలనీ పట్టాడట. అమరత్వం పొందడానికి కూడా దారి తెలుసుకున్నాట్ట. యీయన్ని గురించి మహా సలహాదారుడూ, జ్యోతిష్కుడూ అయిన యెలు చూ చాయ్ ఇలా చెప్పాడు:

"చాంగ్‌చున్ యెన్నో సాధించిన మహానుభావుడు. మేఘాల దగ్గరికి వెళ్లే వరం యేనాటినుంచో యీయనకి వుంది. కొంగ రెక్కలమీద యెగిరి వెళ్లేవాడు. వేరే జంతువులుగా మారే పరకాయ విద్య తెలుసు. ఇహలోక సంపదలన్నిట్నీ త్యజించి ఆయన ఇతర తాపసులతో కలిసి కొండల్లో వుంటాడు. మానవుడికి దీర్ఘాయుస్సునీ, అమరత్వాన్నీ ప్రసాదించే మంత్ర విహిత తాయెత్తు కోసం అన్వేషిస్తున్నాడు. ఆలోచనల్లో మునిగిపోయి ఒకో అప్పుడు సమాధిలోకి వెళ్లిపోతాడు. ఒకో అప్పుడు కదలకుండా నిశ్చలంగా వృక్షంలాగా రోజుల తరబడి నుంచుంటాడు. ఒకో అప్పుడు ఉరుములాగా గర్జిస్తాడు. లేకపోతే గాలిలాగా అలవోకగా పోతాడు. యెన్నో చూశాడు, యెన్నో విన్నాడు, ఆయన చదవని పుస్తకం లేదు".

ఈ అద్భుతమైన మనిషికోసం వెతకమని జెంఘిజ్ ఖాన్ సమర్థుడైన తన చైనా రాజనీతిజ్ఞుణ్ణి శాసించాడు. అతనికి ఒక బంగారు పైస్తా ఇచ్చాడు. దానిమీద కోపఘూర్ణితమైన పులి బొమ్మ వుంది. "యీ మనిషికి పూర్తి అధికారాలు వున్నాయి, నేను ప్రయాణం చేస్తున్నట్టే" అని చెక్కి వుంది.

ల్యుచుంగ్‌లు చేతిలో చాంగ్‌చున్‌కి జెంఘిజ్ ఖాన్ సొంత ఉత్తరం పడింది. అది ఇలా వుంది:

"అతి భోగపరాయణతవల్ల, గర్వంవల్ల చైనాని ఆకాశ దేవత నిరసించింది. కాని ఉత్తరాది పచ్చిక బీటి వాసినైన నాకు అలాంటి చెడుగులు లేవు. నేను సాదా, నిరాడంబర జీవితం గడుపుతున్నాను. నాకు భోగాలంటే అసహ్యం, అన్ని విషయాలలోనూ పొదుపరిగా వుంటాను. నేను యెప్పుడూ అవే బట్టలు వేసుకుంటాను. అదే భోజనం చేస్తాను. నా బట్టలు గుర్రాలు కాపరి బట్టలంతటి ముతకవి. నా తిండి ఆవు మేత అంతటి మొరటుంది.

"యేడు సంవత్సరాల్లో నేను యెన్నో గొప్ప పనులు చేశాను. భూమిమీద అన్ని దేశాల్లోనూ నా జెండాని యెగర వేశాను. ఇలాంటి సామ్రాజ్యాన్ని, మా పూర్వులు హూణులు సంచార తండాల వాటినుంచీ యెరగరు.

"నేను మహత్తర విధిని నిర్వహించాలి. నా భుజాలమీద యెంతో భారం వుంది. నా పాలన అసంపూర్తిగా వుండిపోయిందని నా భయం. మనుషులు పడవని తయారు చేస్తే తెడ్లని కూడా తయారు చేస్తారు, నీళ్లమీద దాన్ని తీసికెళ్లడానికి. అందుచేత ప్రపంచాన్ని పాలించడానికి నేను యుక్తిపరులని పిలుస్తాను. సహాయకుల్ని యెంపిక చేస్తాను.

"నేన్వు సత్యాన్వేషివని, మహోన్నత జీవితాన్ని గడుపుతున్నావనీ, మహర్షీ, నేను విన్నాను. ఎంతో నైపుణ్యంతో, అధ్యయనంతో నువ్వు ప్రకృతిని పఠించావు. నువ్వు యెంతో కాలం కొండ సానువుల్లో వున్నావు, ప్రపంచానికి దూరంగా వున్నావు.

"కాని నేను యేం చెయ్యగలను? విశాలమైన పర్వతాలు, మైదానాలు మనల్ని దూరం చేశాయి. అందుచేత నీ దగ్గరికి నా నమ్మిన సలహాదారుడు ల్యుచుంగ్‌లుని వేగమైన గుర్రాలతోటీ, బండితోటీ పంపుతున్నాను. యిన్ని వేల లీ* ల దూరానికి భయపడక, మహర్షీ, నా దగ్గరికి యీ దీర్ఘ ప్రయాణం చేసి రమ్మని అడుగుతున్నాను.

"దూరాల్ని గురించి గాని, అనంతమైన యిసక తిన్నెల గురించి గాని అనుకోవద్దు. నా ప్రజలమీద జాలి చూపించు. నామీద ప్రేమ కొద్దీ నువ్వు అలా చేస్తే, ఆయుష్షుని పెంచుకునే రహస్యం చెప్పు.

"మహా 'తావోని' (అత్యున్నత సత్యం) చొచ్చుకపోయి, అందరికీ శుభం కోరుతూ, నువ్వు నా కోరికని తిరస్కరించవని ఆశిస్తున్నాను.

"యీ మాటలవల్ల నా నిజమైన ఆజ్ఞలు నీకు వెల్లడి అయి వుంటాయి".

చేత్తో యీ ఉత్తరం తీసుకుని ల్యుచుంగ్‌లు దీర్ఘ ప్రయాణం ఆరంభించాడు. ఎడారుల మీదా, పర్వతాలమీదా ప్రయాణం కట్టాడు. ఖాఖాన్ సంకల్పాన్ని నెరవేర్చడానికి గుర్రాల్ని మజిలీల దగ్గర మార్చుకుంటూ వేగంగా వెళ్లాడు. ఆఖరికి చైనా చేరి యెత్తైన పర్వతం యెక్కి చీకటి లోయలో ప్రాచీన రుషి కోసం వెతికాడు. అతను ఇప్పుడు దాదాపు పీలిక అయిపోయిన నారబట్టలు కట్టుకున్నాడు. ఆయనే ప్రఖ్యాత చాంగ్‌చున్. జెంఘిజ్ ఖాన్ కబురు విని ఆయన మొదట కరాఖండీగా రానని అన్నాడు.

ఆఖరికి జవాబు రాశాడు. దాన్ని ల్యుచుంగ్‌లు అత్యవసర దూతద్వారా మహా ఖాఖాన్‌కి పంపాడు. కాని తను మాత్రం ఆ ముని దగ్గర వుండిపోయాడు. ఖాఖాన్‌కి కోపం వస్తుందని భయపడ్డాడు. చాంగ్‌చున్ యింకా బలవంతం చెయ్యవచ్చని ఆశించాడు.

---

* లీ–చైనా దైర్ఘ్యమానం, అర కిలోమీటరు సుమానం.

ఆ చైనా రుషి రాసింది యిదీ:

"పర్వతాలలో నివశించే సత్యాన్వేషి చాంగ్‌చున్ దూరంనుంచి వచ్చిన అధిష్టాన ఆదేశాన్ని అందుకున్నాడు. నిజం, సముద్రం దగ్గర వుంటున్న మొత్తం చైనా ప్రజ గర్వంలో తెలివి పోగొట్టుకుంది. ప్రపంచ వ్యవహారాలలో నా శక్తులు జడం. నేను సత్యాన్వేషణలోనూ అధిక అభ్యుదయం సాధించలేకపోయాను, నేను వూహించదగ్గ అన్ని మార్గాలలోనూ తంటాలు పడినా. చనిపోలేదు, కాని వార్ధక్యం వచ్చేసింది. నా కీర్తి విదేశాల కంటా వ్యాపించినా నేను యితరులకంటే యే మాత్రం రుషిత్వం వున్నవాణ్ణి కాదు. దీనంతటివల్లా నేను సిగ్గుతో కుమిలిపోతున్నాను. ఒక మనిషి రహస్య ఆలోచనలు యెవళ్లకి తెలుస్తాయి?

"మొట్టమొదటి అలాంటి అసాధారణ ఉత్తరం వచ్చాక నేను పర్వతాల్లో దాంకుందా మనుకున్నాను. లేదా సముద్రం దగ్గరికి పారిపోదామనుకున్నాను. కాని తర్వాత నీ పరమ ఆజ్ఞని ప్రతిఘటించకూడదని నిర్ణయించుకున్నాను. మంచులో దీర్ఘ ప్రయాణం చేసి నా పాలకుడి ముందు నిలబడడం నా విధిగా పరిగణించాను. ఆయన ఆకాశ దేవత వరంవల్ల సామసం, ప్రాచీన కాలంనుంచీ ఇప్పటిదాకా తెలిసిన అన్ని హద్దులనీ మించిన తెలివీ పొందిన వాడు. అందుకనే విజ్ఞులైన చైనీయులూ, ఆటవిక అనాగరికులూ అతన పాలన కిందకి వచ్చారు.

"ప్రయాణంలో గాలీ దుమ్మూ అనంతంగా వుంటాయి. ఆకాశం మేఘావృతమై నల్లబడుతుంది. నేను వృద్ధుణ్ణి, దుర్బలుణ్ణి. కష్ట సహిష్ణుతలేదు. ఇంత దీర్ఘ ప్రయాణం చేస్తే నీ దగ్గరికి చేరలేననే భయంగా వుంది.

"నేను గనక నీ దగ్గరికి రాలేకపోతే, ప్రజా పాలకుడా, యుద్ధం, శాంతిలాంటి వ్యవహారాలు నా అధికారంలో వుంటాయా? అందుచేత యేలిన వారు దయచేసి నాకీ విషయాన్ని తెలియ చెయ్యమని కోరుతున్నాను: నేను రావాలి, ఆఖ్ఖర్లేదా? నా చర్మం ముడతలు పడిపోయింది. నా శరీరం శుష్కించి పోయింది. నీ జవాబు నర్థిస్తూ.

"మహాకాళ సంవత్సరం, మూడవ నెల".

జెంఘిజ్ ఖాన్ ఈ ఉత్తరం అందుకుని చాలా సంబరపడ్డాడు. దూతకి ధారాళంగా కానుకలిచ్చాడు. కొత్త ఉత్తరం జవాబుగా ఇచ్చాడు:

"నా దగ్గరికి వచ్చిన వాడు నాతో వుంటాడు. నాకు దూరంగా పోయిన వాడు నాకు వ్యతిరేకం. నేను యుద్ధం చేస్తాను, యెంతో శ్రమ తర్వాత విశ్రాంతి అనుభవించే వ్యవధి వుంటుందని. భూమ్మీద సమస్తమూ నేను చెప్పింది శిరసావహించే దాకా నేను ఆగను. యీ లక్ష్యం కోసం నేను గొప్ప కఠినత్వాన్ని చూపిస్తాను, అజేయులైన సైనికుల్ని సర్వదా నడిపిస్తాను. నువ్వు సులభంగా ప్రయాణం చెయ్యగలవని నాకు తెలుసు. కొంగల రెక్కలమీద నా దగ్గరికి యెగిరి రాగలవు. దారిలో వున్న యెడారులు అనంతమైనవైనా నీ దండాన్ని చూడ్డానికి నేను యెక్కువ నిరీక్షించక్కర్లేదు. నీ వార్తకి జవాబు ఇది. నా ఆలోచనలు నీకు తెలిసే వుంటాయి. ఇక యెక్కువ చెప్పను".

# నన్ను అమరుణ్ణి చెయ్యి!

మహా ఖాఖాన్ నుంచి రెండవ ఉత్తరం అందుకున్నాక ఆ చైనా రుషి యీ దీర్ఘ ప్రయాణం చెయ్యడానికి అంగీకరించాడు. ఆయన చైనా ప్రాసాదపు అందమైన గాయనిలు, నాట్యకత్తెలు కూడా వుండే బిడారుతో ప్రయాణం చెయ్యడానికి అంగీకరించలేదు. వాళ్లని చైనానుంచి జెంఘిజ్ ఖాన్‌కి పంపాడు. అంచేత అతనికి పదాతి సైనికులని వెయ్యి మందినీ, ఆశ్వికులని మూడు వందల మందినీ ప్రత్యేక కాపలాగా పంపారు. చాంగ్‌చున్ యిరవై మంది శిష్యుల్ని తీసుకుని వెళ్లాడు. ఒకతను అతని దినచర్య గ్రంథాన్ని* కూర్చాడు. అందులో తన దేశికుల సూక్తులనీ, గీతాలనీ పొందుపరిచాడు.

చాంగ్‌చున్ తాయితీగా ప్రయాణం చేశాడు. ప్రతి నగరంలోనూ ఆగాడు. మంగోలు నగర పాలకులు అతన్ని సగౌరవంగా ఆదరించారు. వైభవభరితమైన విందులు ఏర్పాటు చేశారు. వాటిని ఆ రుషి తిరస్కరించాడు. అన్నం, కొన్ని పళ్లూ తీసుకునేవాడు.

రెండేళ్ల ప్రయాణం తర్వాత చాంగ్‌చున్ జైహున్ నది తీరానికి చేరాడు. తెర్మెజ్ దగ్గర అవతలి ఒడ్డుకి దాటాడు. అక్కడ జెంఘిజ్ ఖాన్ సొంత వైద్యుడు ఆయన్ని కలిశాడు. ఆ రుషి కొన్ని పద్యాలు అతనికి యిచ్చాడు. తన దీర్ఘ ప్రయాణం ముగిసే సమయంలో దాన్ని కూర్చాడు. ఇలా చెప్పాడు:

"నేను పర్వతాల్లో వుండే సాధువుని. మహా ఖాఖాన్ సైనిక శిబిరానికి ఆయనకి సత్యం చెప్పేటందుకే వచ్చాను. అది గనక అర్థం అయితే ప్రపంచం సంతోషిస్తుంది".

శిథిలమైన బాల్ఖ్ నగరంగుండా చాంగ్‌చున్ ప్రయాణం చేశాడు. అక్కడ కుక్కల మొరుగుళ్లు తప్ప యేం వినిపించవు. అక్కడ వుండే వాళ్లందరూ పారిపోయారు. నాలుగు రోజుల ప్రయాణం తర్వాత చాంగ్‌చున్ జెంఘిజ్ ఖాన్ శిబిరం చేరాడు.

చాంగ్‌చున్ అఖయ్యా తైషీతో కలిసి కఠినుడైన పాలకుడి దగ్గరికి వెళ్లాడు. అఖయ్యా తైషీ సమర్‌కండ్ నుంచి వచ్చిన జెంఘిజ్ ఖాన్ సత్రప్. అతనికి చైనా, మంగూలు భాషలు వచ్చు.

---

* చాంగ్‌చున్ ప్రయాణానికి సంబంధించిన యీ దినచర్య "పడమటికి ప్రయాణం" ఇంకా లభ్యమవుతోంది.

తావోయిష్టు రుషులందరిలాగా చాంగ్‌చున్ గుడారంలోకి వెళ్లాగానే గౌరవ పురస్సరంగా వంగి, రెండు చేతులూ జోడించాడు. ఆ రుషులు చైనా చక్రవర్తి ముందు యెన్నడూ మోకరిల్లలేదు, నేలకి ముఖాలు ఆన్చలేదు.

ఖాఖాన్ ముందు శుష్కించిపోయిన ఒక ముసలి మనిషి వున్నాడు. అతని చర్మం యెండిపోయింది. ఎండకీ, గాలికీ కమిలింది. లలాటం యెత్తుగా వుంది. మాడుమీద కొద్దిపాటి నెరిసిన వెంట్రుకలు వున్నాయి. అతను భిక్షుకుడిలా వున్నాడు. తాళ్లతో కట్టుకున్న చెప్పులు, పీలికలైన అంగీ. కాని అతను నిబ్బరంగా, నిర్భయంగా "ప్రపంచ మహాధినేత"కేసి చూశాడు. తివాసీమీద కూర్చున్నాడు.

జెంఘిజ్ ఖాన్ రెప్ప వెయ్యకుండా వృద్ధ రుషికేసి చూశాడు. అతన్నుంచి తను మోక్షాన్ని అర్థించాడు. జెంఘిజ్ ఖాన్ తన అతిధి మాదిరీ సాదా నల్ల నారబట్టలు వేసుకున్నాడు. అతని గడ్డంలోని వెంట్రుకలు వార్ధక్యపు తెల్లదనంతో రుషికి మాదిరీ అంచులు నెరిసి వున్నాయి. కాని వాళ్ల జీవిత పథాలు వేరు. చైనా రుషి మనుషులనుంచి దూరం పోయి యేకాంత వాసంలో వుండిపోయాడు. తన యావజ్జీవితాన్నీ జ్ఞాన సముపార్జనలో గడిపాడు. మనుషుల్ని జరా, రుజ మృత్యుబాధల నుండి రక్షించడానికి మార్గం అన్వేషిస్తూ వున్నాడు. తనని సహాయం అర్థించిన వాళ్లందరికీ సాయపడ్డాడు. ఖాఖాన్ మహా సైన్యాలకి అధినేత. ప్రజల్ని విధ్వంసం చెయ్యడానికీ భూముల్ని బీడు పెట్టేటట్టు చెయ్యడానికీ సైన్యాల్ని పంపాడు. అతని విజయాలన్నీ వేలాది మందిని చంపడంవల్ల వచ్చినవే. ఇప్పుడు జీవిత కడపటి సంవత్సరాల్లో, యీ శుష్కించిన వృద్ధుడికి జెంఘిజ్ ఖాన్‌ని పునఃయౌవనంతో బలంగా చేసే పని, మృత్యువు హస్తాల నుంచి శాశ్వతంగా అతన్ని విముక్తుణ్ణి చేసే పని పడింది. ఆ మృత్యువు ఇంకా ఇంకా దగ్గరగా మహా ఖాఖాన్‌ని చేరుతోంది, త్వరలోనే అతన్ని ఇలమీద మహా శక్తివంతుడైన అతన్ని, మట్టి కలుపుతుంది.

ఇద్దరు వృద్ధులూ చాలా సేపు నిశ్శబ్దంగా వుండిపోయారు. అప్పుడు జెంఘిజ్ ఖాన్ అడిగాడు:

"ప్రయాణం బాగా జరిగిందా? నువ్వు విడిది చేసిన నగరాలో నువ్వు కోరుకున్నవన్నీ దొరికాయా?

"మొదట్లో వాళ్లు నాకు కావలసిన అన్నిటికంటే భోజన పదార్థాలు యెక్కువ ఇచ్చారు. కాని నేను నీ సైన్యాలున్న గ్రామాలగుండా వెళ్లినప్పుడు ప్రతి చోటా యుద్ధ చిహ్నాలు, విధ్వంసం కనిపించాయి. యేం తినాలన్నా దొరకడం కష్టం అయింది" అన్నాడు చాంగ్‌చున్.

"ఇక్కడ నీకు యేం కావాలన్నా దొరుకుతుంది. ప్రతి రోజూ నాతో భోజనం చేద్దువుగాని".

"వద్దు, నాకు అలాంటి అనుగ్రహం అక్కర్లేదు. మచ్చిక కాని పర్వత వాసిని సాదాగా, తన మానాన బతుకుతుంది".

నౌకర్లు కుమిన్ తెచ్చారు. రుషి వద్దన్నాడు. ఖాఖాన్ అన్నాడు:

"నీ దారిన నువ్వు వుండు. నీ ఇష్టం. మనం ప్రత్యేకం మాట్లాడుకుందాం. వెళ్లి రా".

చాంగ్‌చున్ లేచి, చేతులు జోడించి, గౌరవపూర్వకంగా వందనం చేసి, వెళ్లిపోయాడు.

మంగోలు సైన్యం తిరిగి ఉత్తరాది వేపు మవరాన్నహార్ గుండా వస్తోంది. ప్రయాణం అప్పుడు జెంఘిజ్ ఖాన్ చాలా సార్లు ఆ రుషికి ద్రాక్షసారా, పుచ్చకాయలు, అనేక రకాల భోజన పదార్థాలు పంపాడు.

ఒకసారి మజిలీ అప్పుడు అతిముఖ్యమైన సంభాషణ జరపడానికి తను నిరీక్షిస్తూ వుంటానని జెంఘిజ్ ఖాన్ చాంగ్‌చున్‌కి కబురు పంపాడు.

శిబిరం సద్దు మణిగేటప్పుడు, భేకాల రావాలు యింకా ఎక్కువ అయేటప్పుడు అఖయ్య త్రైషీ రుషి చాంగ్‌చున్‌ని మహా ఖాఖాన్ పసుప్పచ్చ గుడారానికి తీసికెళ్లాడు.

చాంగ్‌చున్ సింహాసనం ముందు తివాసీమీద కూర్చున్నాడు. ఆయన అన్నాడు:

"నేనో కొండ మనిషిని. సత్యాన్వేషణ చేస్తూ యెన్నో ఒట్టి పర్వతాల్లో తిరిగాను – సత్యాన్వేషణ అంటే పరమోత్కృష్టమైన, సౌందర్యమయమైనదేదో దాన్ని అధ్యయనం చెయ్యడం. నేను యేకాంత ప్రశాంత ప్రదేశాల్లో వుండడానికి ఇష్టపడతాను. కొండలమీదా, గుట్టలమీదా తిరుగుతాను. అక్కడ నేను ఒంటరిగా ఆలోచనలో మునిగి వుంటాను. కాని ఇక్కడ చక్రవర్తి గుడారం పక్క సైనికుల గోల, గుర్రాల సకిలింపులు, బళ్ల చప్పుడూ తప్ప యేం లేవు. నా ఆలోచన అందువల్ల కలత చెందివున్నాయి. అంచేత నీ సైన్యానికి ముందు గాని, లేదా వెనక గాని వచ్చే అనుమతీ యివ్వకూడదా? కొండ మనిషికి ఇది పెద్ద వరం".

"నువ్వు ఇష్టపడ్డట్టే కానీ" అన్నాడు ఖాఖాన్.

అప్పుడు అడిగాడు:

"చెప్పు, పిడుగు యేమిటి? మేఘాల కావల వున్న దేవుళ్లకి మనుషులమీద కోపం వచ్చినప్పుడు చేసే గర్జ అని మా మంత్రగాళ్లు అంటారు. అది నిజమా? మనుషులు వాళ్లకీ, ఉచితమైనట్టుగా, నల్లని జంతువుల్ని గాక వేరే రంగు జంతువుల్ని బలుల ఇచ్చినందుకా వాళ్ల కోపం? ఈ విషయాలు నిజమా?"

"గొప్పవైనా, తక్కువవైనా బలుల ఇచ్చినందుకు గాదు మనుషులంటే ఆకాశానికి కోపం. నల్లనివి కాకుండా ఎర్రటివీ, తెల్లటివీ, బొల్లివీ అయిన గొర్రెలనీ, గుర్రాలనీ బలులు ఇచ్చినందుకూ కాదు. నేనూ మీ షామాన్ల తప్పు మాటలు విన్నాను. మనుషులు వేసవిలో నదుల్లో స్నానం చెయ్యకూడదనీ, నీళ్లల్లో బట్టలు ఉతకకూడదనీ, బొచ్చు అట్టలని చుట్టచుట్ట కూడదనీ, పుట్టగొడుగుల్ని యేరకూడదనీ వాళ్లు చెప్పే మాటలు. అలా చేస్తే ఆకాశానికి కోపం వచ్చి భూమ్మీదకి భీతిని ఉరుములు మెరుములు రూపంలో పంపుతుందని అంటారు వాళ్లు. వీటివల్ల మనుషులు ఆకాశాన్ని అవమానపరచరు, చెడ్డ పనులవల్ల అవమాన

పరుస్తారు.... మానవుల దుష్టక్రియలు మూడు నేల రకాల్లోనూ పరమహేయమైంది కన్న తల్లిదండ్రులపట్ల అగౌరవం అని కొండ మనిషినైన నేను ప్రాచీన గ్రంథాల్లో చదివాను. నీ మనుషులు తల్లిదండ్రుల్ని గౌరవించరని యీ ప్రయాణంలో నేను చాలా సార్లు చూశాను. తాము విందులు చేసుకుంటూ వుంటారు, కాని వాళ్ల తల్లిదండ్రులు, అమ్మమ్మలు తాతలు ఆకలితో మాడుతూ వుంటారు. తల్లిదండ్రుల పట్ల నిర్దయగా వుండే పిల్లలుంటే ఆకాశానికి కోపం వస్తుంది, ఆగ్రహంగా విరుచుకుపడుతుంది. వాళ్లని నాశనం చెయ్యడానికి ఉరుముల్నీ మెరుముల్నీ పంపుతుంది. నీ ప్రజలకి తెలివినీ, రుజువర్తననీ ఇయ్యి, యేలికా!"

"రుషి చెప్పింది నిజం!" అన్నాడు జెంఘిజ్ ఖాన్. చాంగ్‌చున్ మాటలని చైనా భాషలోనూ, మంగోలు భాషలోనూ రాయమని రాతగాళ్లకి చెప్పాడు. దాన్ని బట్టి పిల్లలకి తల్లిదండ్రుల విషయంలో ఒక శాసనాన్ని ఇవ్వచ్చు.

బంగారు పళ్లేల్లో రకరకాల రుచ్య పదార్థాల భోజనాన్ని వడ్డించగానే చాంగ్‌చున్ ఓ గుప్పెడు అన్నం, యెండిన కొన్ని ద్రాక్షపళ్లు, తీసుకున్నాడు. ఖాఖాన్ అన్నాడు:

"పవిత్ర మూర్తీ! ముసలివాడికి యౌవనాన్ని ప్రసాదించి, దుర్బల శరీరంలోకి నూతన జవాన్ని పాదుకొల్పే ఔషధం వుందా అని చాలా కాలంగా నిరీక్షిస్తున్నాను. నా జీవితం ఆగకుండా, నిరంతరంగా మహా నది జలంలా ప్రవహించేటట్టు చేసే ఔషధం నీ దగ్గర లేదా? మనిషిని అమరుణ్ణి చేసే మందు లేదా?"

చాంగ్‌చున్ కళ్లు వాల్చాడు. వేళ్ల చివళ్లు మౌనంగా దగ్గరకి చేర్చాడు.

"నీ దగ్గర ఇప్పట్లో అలాంటి మందు లేకపోతే, పోనీ యెలా తయారు చెయ్యాలో తెలుసా? లేదా యీ రహస్యం తెలిసిన యింకో రుషినీ, మంత్రగాణ్ణీ నువ్వు యెరిగి వుంటే చెప్పు. నాకు యౌవనం కూడా అక్కర్లేదు. ఇప్పుడున్నట్టుగానే ముసలితనంతో నెరిసిపోయి వుండనీ, కాని అంతం లేకుండా ఆయుర్దాయం వుండాలి. నా భుజస్కంధాల మీద మహా మంగోలు సామ్రాజ్యాన్ని మొయ్యాలి, దీన్ని నేను నా చేతులతో నిర్మించాను..."

ఖాఖాన్ నిశ్శబ్దంగా వున్నాడు. మండే కళ్లు వృద్ధుడైన రుషి శుష్కించిన వదనం మీదే లగ్నం అయివున్నాయి. రుషి గాఢంగా నిట్టూర్చి, కఠినంగా వుండే ఖాఖాన్‌కేసి చూసి చూపు తిప్పుకుని మెల్లిగా చెప్పాడు:

"నేను మహా గ్రంథాలనన్నిట్నీ పఠించాను. మహా చైనా విద్వాంసులు రాసిన వాటిని చదివాను. నాకు యిక మిగిలిన రహస్యాలు లేవు. నిజం యేమిటో చెప్తానంతే. మనుషుల్ని బలసంపన్నుల్ని చేసేవి చాలా వున్నాయి. రోగాల్ని నయం చేసి జీవితాన్ని కాపాడేవి వున్నాయి కాని మనిషిని అమరుణ్ణి చేసే ఔషధాలు లేవు..."

జెంఘిజ్ ఖాన్ ఆలోచనా మగ్నుడై చాలా సేపు మౌనంగా వుండిపోయాడు. రాయసగాళ్లు రాస్తూ వుంటే రెల్లు కలాలు చప్పుడు చేస్తూ వున్నాయి. ఆ చప్పుడు ఆగిపోయింది. మైనం వత్తి చిటపటమనే చప్పుడు మాత్రమే వినిపిస్తోంది. ఆఖరికి ఖాఖాన్ అన్నాడు:

"మా మంగోలులకి ఓ సామెత వుంది 'నిజం చెప్పేవాడు హఠాత్తుగా చనిపోతాడు' అని. చెప్పేవాణ్ణి చంపేసే నిజాన్ని మనుషులు ఇష్టపడరు... అంచేత మనుషులందరూ అబద్ధాల పుట్ట పేరుస్తారు... కాని నువ్వు, మహనీయా, నన్ను చూడ్డానికి వేల కోసుల దూరం వచ్చినా నిజం చెప్పడానికి జంకలేదు – అమరత్వం పొందే మార్గాలు లేవు అని! నువ్వు నిజాయితీపరుడివి, నికార్సైన వాడివి! నీకేదన్నా కోరిక వుంటే అడుగు, అది నెరవేరుతుందని వాగ్దానం చేస్తున్నాను".

చాంగ్‌చున్ చేతులు జోడించి ఖాఖాన్ ముందు వంగాడు.

"నాది ఒక్కటే ప్రార్థన పర్వతాలు దాటి, మంచుమీదుగా అది అడగడానికి నీ దగ్గరికి వచ్చాను: యీ క్రూర యుద్ధాలకి స్వస్తి చెప్పు ప్రజలకి సుఖ శాంతులు వెల్లి విరిసే బ్రతుకు యియ్యి".

జెంఘిజ్ ఖాన్ కళ్లు విశాలంగా తెరిచాడు. తర్వాత భారంగా ముఖం చిట్లించాడు. అతని పెదాలు వణికాయి. గట్టిగా గాలి పీల్చాడు. చాలా గట్టిగా గర్జించాడు, ఆ గర్జనకి రాతగాళ్ల రెల్లు కలాలు కాగితంమీద గిలుక్కుపోయాయి.

"శాంతిని తేవాలంటే యుద్ధం కావాలి!... 'నువ్వు శత్రువుని చంపితే చుట్టూతా శాంతి వుంటుంది' అని పచ్చిక బీళ్ల మా ముసలాళ్లు అన్నప్పుడు వాళ్లకి తెలుసు విషయం. కాని నేనింకా నా పాత శత్రువు తంగుట్ చక్రవర్తి బుర్ఖాన్‌ని చంపలేదు. ఇంకా అవతలి అర్ధప్రపంచం నా కిందకి రాలేదు... ఇలాంటి విషయాల్ని నేను భరించగలనా? నువ్వు రుషివి, కాని నువ్వడిగింది జరగదు. ఇక యెప్పుడూ అలాంటి వాటిని అడగద్దు".

జెంఘిజ్ ఖాన్ లేచాడు. సింహాసనం చేతులు పట్టుకుని కోపంతో ఒణుకుతూ బుసకొట్టాడు:

"నువ్వు వెళ్లచ్చు".

# మంగోలులు తమ సొంత స్థావరానికి పోవడం

జెంఘిజ్ ఖాన్ శిబిరం మార్చాలని కోరుకుని సమర్‌కండ్‌నుంచి సైహూన్ నది దగ్గరికి తన సైన్యాన్ని నడవమని ఆజ్ఞ చేశాడు. అప్పుడు ఖోరెస్మ్ సుల్తానా తుర్కాన్ ఖాతూన్‌నీ, షా జనానాలో వుండే ఒకనాటి ఇతర ప్రముఖ బందీ స్త్రీలనీ మంగోలు సైన్యం వెళ్లే దారి అంతటా నుంచుని ఖోరెస్మ్ సామ్రాజ్య పతనం గురించి దుఃఖిస్తూ పాటలు పాడేటట్టు చేశాడు.

పొట్టేలు సంవత్సరం 1223 ఆరంభంలో జెంఘిజ్ ఖాన్ సైహూన్ నది తూర్పు తీరంమీద తన శిబిరం వేశాడు. అక్కడ జెంఘిజ్ ఖాన్ కొడుకులు జగతాయ్, ఉగేదీయ్, తులీ అతని కురుల్తాయ్‌కి హాజరు కమ్మని పిలుపునందుకుని కలిశారు. గర్విష్టి పెద్ద కొడుకు, జూచి రాలేదు. తన కొడుకులతో, ఖాన్లతో ముఖ్య సర్దార్లతో కలిసి జెంఘిజ్ ఖాన్ సభ జరిపాడు. రాబోయే పదమూడు సంవత్సరాలలో కడపటి సముద్రం అంతం దాకా పడమటి దేశాలని మొత్తం జయించాలన్న తన పథకాన్ని చర్చించాడు.

మర్కట సంవత్సరం 1224లో జెంఘిజ్ ఖాన్ తిరిగి మంగోలులను పచ్చిక బీళ్లకి నడిపించాడు.

ఓ పెద్ద పులి వేటాడిన జంతువుని కడుపునిండా తిని భారంగా, ఉబ్బిన పొట్టని యీడ్చుకుంటూ, మందమైన రెల్లులోకి విశ్రమించడానికి పోయినట్టే జెంఘిజ్ ఖాన్ సైన్యం బ్రహ్మాండమైన సంపదతోటి ఇంటి దారి పట్టింది. ప్రతి సైనికుడికీ కొన్ని పెరికె గుర్రాలు, ఒంటెలు, యెద్దులు వున్నాయి. సైనికులతోబాటుగా గొర్రెలు, కీచుమని చప్పుడు చేసే చెకడా బళ్లు వున్నాయి. ఆ బళ్లమీద బట్టలు, తివాసీలు, ఆయుధాలు, రాగి పాత్రలు, యితర సామాన్లు వున్నాయి. అవన్నీ ముసల్మాన్ల దగ్గర కొల్లగొట్టినవే. గుర్రాలమీద, ఒంటెలమీద, బళ్లమీద మంగోలు ఆడవాళ్లూ పిల్లలూ ఇతర తెగల ఆడవాళ్లూ, పిల్లలూ వున్నారు. వాళ్ల పక్క బందీలు అనంతంగా చింకిపాతలతో దినపాదాలతో వచ్చారు.

మొత్తం పటాలం అంతా మెల్లిగా సాగింది. యెక్కడ పచ్చిక బీళ్లున్నా ఆగింది. ప్రయాణం శీతకట్టులోనూ వేసవిలోనూ సాగింది. నీళ్లులేని, రాతి మధ్య ఆసియా మైదానాలమీద ప్రయాణ కష్టాలు భరించలేకపోయిన బందీలనీ, గుర్రాల యెద్దుల శల్యాలనీ తను ప్రయాణించిన దానికి జాడగా ఆ సైన్యం వదిలింది.

వసంత రుతువులో జెంఘిజ్ ఖాన్ తన సొంత కెరులెన్ పచ్చిక బీటికి వెళ్లాడు. అతని పసుపు గుడారం వేశారు. బుఖి సుచేగు దగ్గర ఆగాడు. అక్కడ ముఖ్య సర్దారుల, అతి విశిష్ట అధిపతులనీ సమావేశ పరిచాడు. పచ్చిక బీటిమీద దివ్యమైన విందు యేర్పాటు చేశాడు. అలాంటి దాన్ని అంతకు ముందు యెరగరు. విందు జరిగిన మూడ్రోజుల తర్వాత జెంఘిజ్ ఖాన్ పడుచు భార్య కూలన్ ఖాతూన్ చనిపోయింది. ఖాఖాన్ సోదరుల ఆ చావుకి కారణమని వదంతి. కాని నిజం దేవుడెరుగు...

ఆ మరుచటేడు కొడిపెట్ట సంవత్సరం 1225లో జెంఘిజ్ ఖాన్ తన సొంత శిబిరాల్లో గడిపాడు. 'జాసో'ని ప్రకటించాడు. అది మంగోలు ప్రజల్ని "బుద్ధి సంతోషాల పథం" మీద నడిపించాలి.* అలా అని తన శాసనాలకి జెంఘిజ్ ఖాన్ పేరు పెట్టాడు.

---

* ఈ గ్రంథంలో కొన్ని భాగాలు మాత్రమే ఇప్పుడు లభ్యం అవుతున్నాయి.

# దండయాత్రలో చనిపోవాలని జెంఘిజ్ ఖాన్ నిర్ణయం

తంగుట్ చక్రవర్తి బహిరంగంగా తనని ధిక్కరిస్తున్నాడని తెలిసి జెంఘిజ్ ఖాన్ స్థిమితంగా వుండలేకపోయాడు. తంగుట్ చక్రవర్తి బుర్ఖాన్‌ని శిక్షించాలని తను చేసిన శపథాన్ని ఖాఖాన్ మర్చిపోలేదు. దండుకి సిద్ధమయ్యాడు. తన కొడుకులకి కబురు పంపాడు. తనే సైన్యాన్ని నడిపిస్తానని తెలియజేశాడు.

మళ్లీ ముగ్గురు కొడుకులూ వచ్చారు గాని, పొగరుమోతు పెద్ద కొడుకు జూచి రాలేదు.

ఖాఖాన్ రెండో కొడుకు, మవరాన్నహార్ పాలకుడు జగతాయ్‌కీ అతని అన్న జూచికి యెప్పుడూ పడదు. అతను కుటుంబ సమావేశంలో అన్నాడు:

"జూచికి తన సొంత భూములకంటే కిప్‌చాక్ గడ్డమీద యెక్కువ ప్రేమ. అతను ఖోరెస్మ్‌లో కిప్‌చాక్‌ల మీద మంగోలు చెయ్యి పడనివ్వడు. జూచి బహిరంగంగా సిగ్గు లేకుండా అన్నాడు: 'ముసలాయన జెంఘిజ్‌కి మతి చెడింది. ఈ భూములన్నిటినీ నాశనం చేస్తున్నాడు, ప్రజల్ని తగలేస్తున్నాడు' అని. ఒకనాడు వేటలో నాన్నగారిని చంపేద్దామని జూచి పథకం. ముసల్మాన్లతోటి స్నేహం కుదుర్చుకున్నాడు, యెప్పుడు మంగోలు ఆంతరంగిక ఓర్దులోకి రాడు".

జెంఘిజ్ ఖాన్‌కి కోపంతో మండిపోయింది. తన తమ్ముడు ఉచిగిన్‌ని నమ్మకస్తులైన మనుషుల్ని తోడిచ్చి ఖోరెస్మ్‌కి పంపాడు. జూచి తక్షణం తండ్రి ముందు హాజరు కావాలని ఆజ్ఞ చేశాడు. "తను గనక రాకుండా ఖోరెస్మ్‌లోనే వుండాలనుకుంటే, గుట్టు చప్పుడు కాకుండా ఖతం చేయించెయ్" అని జెంఘిజ్ ఖాన్ ఉచిగిన్‌కి రహస్యంగా చెప్పాడు.

తనకి జబ్బుగా ఉండడంవల్ల రాలేకపోతున్నానని జూచి కబురు చేసి కిప్‌చాక్‌లతో పచ్చిక బీటిమీద వుండిపోయాడు. కాని జూచి ఖాన్ పూర్ణారోగ్యంతో వున్నాడని పెద్ద వేటలకి కూడా వెడుతున్నాడనీ, అంచేత మహా ఖాఖాన్ రహస్య ఆజ్ఞలని నిర్వర్తించేందుకు వెనక దిగడి పోతున్నామనీ నమ్మకస్తులైన దూతలు రాసారు.

జగతాయ్ ప్రస్తుతంలో సమర్‌కండ్‌కి తన విభాగం పాలనకీ తిరిగివచ్చాడు. జెంఘిజ్ ఖాన్ తన అభిమాన పాత్రులైన ఇద్దరు కొడుకులు ఉగేదీయ్, తులీలతోటి శునక సంవత్సరం 1226 ఆరంభంలో తంగుట్‌లకి వ్యతిరేకంగా దండు నడిపాడు. ఓంగన్ తలన్ ఖుదున్ చేరాడు. అక్కడ అతనికి భయంకరమైన కల వచ్చింది. ఆసన్న మృత్యువు గురించి మాట్లాడ్డం మొదలుపెట్టాడు. యింకో సైన్యం నాయకత్వంలో వున్న కొడుకులకి కబురుపెట్టాడు.

ఆ మర్నాడు తెల్లవారుతూనే ఉగేదీయ్, తులీ వచ్చారు. వాళ్లకి భోజనాలు బాగా పట్టాక జెంఘిజ్ ఖాన్ యుర్త్‌లో వున్న అందర్నీ వెళ్లిపొమ్మన్నాడు.

"నేను నా కొడుకులతోటి యేకాంతంగా మాట్లాడాలి. చాలా గోప్యంగా చర్చించవలసిన వ్యవహారాలు వున్నాయి. మీరంతా వెళ్లిపొండి" అన్నాడు.

ఖాన్లు, ఇతర ముఖ్యులూ వెళ్లిపోగానే జెంఘిజ్ ఖాన్ తన కొడుకులిద్దర్నీ పక్కన కూర్చోబెట్టుకున్నాడు. మొదట జీవితం గురించి కొన్ని మాటలు చెప్పి, ప్రభుత్వ నిర్వహణమీద కొన్ని మాటలు చెప్పి యిలా అన్నాడు:

"నేను చెప్పిందాన్నంతట్నీ జాగ్రత్తగా గుర్తుంచుకోండి, నాయనా! నాకు ఇష్టం లేకపోయినా ఆఖరి యుద్ధానికి నాకు వేళ వచ్చిందని గుర్తుంచుకోండి. మంగోలు యుద్ధ దేవుడు సుల్దే సహాయంతోటి నేను కనీవినీ యెరగనటువంటి వైశాల్యం వున్న సామ్రాజ్యాన్ని, ఒక పక్కనుంచి యింకో పక్కకి యేడాది ప్రయాణం పట్టే సామ్రాజ్యాన్ని జయించి పెట్టాను. ఇప్పుడు ఇదే నా కడపటి ఆజ్ఞ, కోరిక: శత్రువుల్ని నిర్జించండి, మిత్రుల్ని శ్లాఘించండి! కాని అలా చెయ్యాలంటే మీరు సర్వదా యేకాభిప్రాయంలో వుండాలి. కలిసి ఒక్కలా ఆచరించాలి. అప్పుడు మీ బతుకు సుఖమయంగా, సంతోషదాయకంగా వుంటుంది మీకు. మీ సామ్రాజ్య వైభవం చూసి ఆనందిస్తారు. నా వారసుడు, నేనిప్పటికే ప్రకటించినట్టుగా, ఉగేదీయ్. నేను పోయాక అతన్ని మహా ఖాఖాన్‌గా చాటాలి. శ్వేత చామర గౌరవాన్ని ఇవ్వాలి. బలంగా, భయంకరంగా మొత్తం సామ్రాజ్యానికీ, మంగోలు ప్రజలకీ అగ్రభాగాన వుండాలి. నేను చనిపోయిన నా 'జాస్సో'ని మార్చ సాహసించకండి, అమలు పరచడం మరవకండి. మీ అన్నలు జూచి, జగతాయ్‌లు ఇక్కడికి రాలేనందుకు నాకు చాలా బాధగా వుంది. పాపం! నేను పోయాక వాళ్లు నేను చేసిన పనిని నాశనం చెయ్యరనీ, తమలో తాము పోట్లాడుకోరనీ, సామ్రాజ్యాన్ని వినాశనం పాలు చెయ్యరనీ, గందరగోళ పరచరనీ ఆశిస్తాను. మనుషులందరూ ఇంటి దగ్గర చనిపోవాలని కోరుకున్నా, నేను నా సైనికుడి కీర్తికి కలికి తురాయిలా వుండాలని కడపటి యుద్ధానికి వెడుతున్నాను. ఇక మీరు వెళ్లచ్చు!"

జెంఘిజ్ ఖాన్ సైన్యంతో దండయాత్రకి వెళ్లాడు. దారిలో వున్న నగరాల పాలకులూ, అనేక తండాల అధినాయకులూ ఒకళ్ల తర్వాత ఒకళ్లు తమ లొంగుబాటుని చాటుతూ వచ్చారు. ఒక ఖాన్ ముత్యాలున్న పెద్ద పళ్లెంతో వచ్చి "మేం లొంగిపోతున్నాం" అన్నాడు. కాని ఆ

మహాఖాన్ తన అవసాన దశ వచ్చిందని ఆ ముత్యాలగురించి పట్టించుకోలేదు. వాటిని తన సైన్యం ముందు పచ్చిక బీటిమీద చల్లమని ఆజ్ఞ చేశాడు. సైనికులు వాటిని యేరుకోవడానికి పరిగెత్తారు. కాని చాలా ముత్యాలు మట్టిలో కలిసిపోయాయి. చాలా కాలం తర్వాత జనం వాటి కోసం వెతికి సంపాదించారు.

"నాకిప్పుడు ముత్యాల పళ్లేలకంటే ఒక్క రోజు ఆయుర్దాయం యెక్కువ విలువైంది" అన్నాడు జెంఘిజ్ ఖాన్. ఆందోళన, భయం అతన్ని ఆవరించాయి.

ఆ సమయంలో తంగుట్ చక్రవర్తి జెంఘిజ్ ఖాన్‌కి దూతల్ని పంపాడు. జెంఘిజ్ ఖాన్ వాళ్లని కలుసుకోలేదు. ఆ దూతలు యెలు చూ చాయకి వార్తకి అందజేశారు:

"మా చక్రవర్తి చాలా సార్లు మహా ఖాఖాన్‌ని ధిక్కరించాడు. పర్యవసానంగా మంగోలులు మా దేశంమీదకి దండెత్తి వచ్చిన ప్రతి సారీ మా వాళ్లని చంపి, మా నగరాల్ని కొల్లగొట్టారు. ఇందులో అర్థం లేదు. మేం లొంగిపోతున్నాం జెంఘిజ్ ఖాన్‌ని కొలుస్తాం. పరస్పర స్నేహ సహకారాల్ని అర్థిస్తున్నాం".

యెలు చూ చాయ వాళ్లకి యిలా బదులు చెప్పాడు:

"ఖాఖాన్ జబ్బుగా వుంది. జెంఘిజ్ ఖాన్‌కి నయం అయేదాకా తంగుట్ చక్రవర్తిని ఆగమని చెప్పండి".

జెంఘిజ్ ఖాన్‌కి రోజు రోజుకీ దిగజారింది. అవసానం సమీపించిందని గ్రహించి ఇలా ప్రకటించాడు:

"నేను చనిపోయినట్లయితే ఆ వార్తని తెలియజెయ్యకండి. యేడవ్వద్దు, గోలపెట్టద్దు. మన శత్రువులు అది తెలిసి సంబరపడతారు. తంగుట్ చక్రవర్తి, ప్రజలు కానుకలతోటి ద్వారాలు తెరవగానే వాళ్లమీద పడి నాశనం చెయ్యండి".

మహా ఖాఖాన్ తొమ్మిది మడతల బొచ్చు అట్టలమీద పడుకున్నాడు. మెత్తటి తోలు బాలీసు తల కింద వుంది. నల్లని బొచ్చు పచ్చడం కాళ్లమీద వుంది.

పొడుగాటి, శుష్కించిన శరీరం సీసంలాగా వుంది. ప్రపంచాన్ని కుదిపిన మనిషి సరిగ్గా కదల్లేకపోయాడు, భారమైన తలని యెత్తలేకపోయాడు.

అతను ఒక పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు, తను శ్వాస పీల్చిన ప్రతిసారీ చుంచు చేసే కీచు ధ్వని లాంటిది యెలా వస్తోందో విన్నాడు. ఈ చుంచు యెక్కడ వుందో తెలియలేదు. ఆఖరికి పట్టుకున్నాడు. అది తన ఛాతీలో వుంది. శ్వాస పీల్చడం మానేసినప్పుడు చుంచు కదల్లేదు. ఆ చుంచు తన జబ్బు. లోపల వుంది.

యెండిపోయిన పెదాలని సరిగ్గా కదపలేక ఖాఖాన్ గొణిగాడు:

"నా ఒక్క చేతి కిందికి నీలి ఆకాశపు మంగోలు బీళ్ల అసంఖ్యాక తండాలని పోగు చేసుకున్నప్పుడు ఇంతటి బాధ నేను యెరగను... అప్పుడు బాధ పడ్డాను, నా గుర్రాల కడుపు

పట్టీలని లాగి, ఇనప రికాబుల్ని విరగొట్టాను.... కాని యిప్పుడీ బాధకి అవధులు లేవు... మన ముసలాళ్లు అంటారు 'రాతికి చర్మం లేదు, మనిషికి శాశ్వతత్వం లేదు'. అది నిజం!"

జెంఘిజ్ కలత నిద్రలో తనని తాను మర్చిపోయాడు. కాని చుంచు ఇంకా యెక్కువగా కీచుమంది. పక్కన ఒక సారి యేదో దిగబడినట్లైంది. శ్వాస తెగింది.

ఖాఖాన్‌కి స్పృహ వచ్చేటప్పటికి యెలు చూ చాయ్ అతని మోకాళ్ల దగ్గర కూర్చుని వున్నాడు. అతను జెంఘిజ్ ఖాన్ అంత పొడగరి. ఆ పండిత వృద్ధు ఆ జబ్బు మనిషిపైన దృష్టి లగ్నం చేసి చూశాడు. ఖాఖాన్ అన్నాడు:

"యేమిటి... మంచి లేక చెడు...?"

"నీ దుబాసి మహమ్మద్ యాలవాచ్ బుఖారానుంచి వచ్చాడు. అక్కడ..."

"నేనడిగేది నిన్ను.... జీవితంలో... నేను... చేసిన మంచి... చెడు" అని జెంఘిజ్ ఖాన్ గొణిగాడు.

యెలు చూ చాయ్ ఆలోచించాడు. జీవితం చాలించి వెళ్లిపోయే మనిషికి యే జవాబు చెప్పాలి? ఒక వంద చిత్రాలు అతని మనసులో హఠాత్తుగా యెగిరిపోయాయి. సుదూర నీలి ముసుగు కమ్మిన ఆసియా పర్వతాలు, మైదానాలు కనిపించాయి, అక్కడి విశాలమైన నదులు రక్తంతోటీ కన్నీళ్లతోటీ కలిసి నల్లబడి కనిపించాయి... శిధిలమైన నగరాలు కనిపించాయి. పొగకి నల్లబడ్డ గోడలు, ఖండాలుగా తరిగి, ఉబ్బిపోయి అక్కడ గుట్టలుగా పోగుపడ్డ వృద్ధుల, స్త్రీల, పిల్లల కళేబరాలు, వికసించే జీవితం వుండవలసిన యువకుల కళేబరాలు, జ్వాలల గర్జాఘోష, భవనాలు కూలిపోయే చప్పుడు కనిపించాయి. క్షమ నర్థిస్తూ వున్న స్థానిక వాసుల్ని ఖతం చేస్తూ మంగోలులు ఇచ్చిన జవాబు గుర్తు వచ్చింది. అది యెన్నటికీ మరుపు రాదు... "ఇది 'జాస్సో' జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞ...."

కుళ్లిపోతున్న శవాల దుర్భర వాసన తట్టుకోలేక చావగా మిగిలిన కొద్దిమందీ శిధిలాలలో నుంచి పారిపోయి బాడవల్లోకి కాందిశీకులుగా పోయారు. ప్రతి క్షణం మంగోలులు తిరిగి వస్తారనే భయపడ్డారు. ఉచ్చు పడుతుందనే భయపడ్డారు. తమని ఆది క్రూర బానిసత్వంలోకి లాగుతుందనే భయపడ్డారు. ఒక చిత్రం అంధత్వం ప్రాప్తింపజేటంత స్పష్టంగా యెలు చూ చాయ్ ముందు దూసుకుపోయింది. ఛిన్నం అయిన సమర్‌కండ్ గోడలవార శుష్కించిన ముసలి ఒంటె వెనక్కి వాలిపడుకుంది, దాని కళ్లు గాలిలో తేలి వున్నాయి. భయంతో నిండిన దాని కళ్లల్లో జీవం యింకా కనిపిస్తోంది. ఆకలితో పాలిపోయిన కొంతమంది ఒకళ్లతో ఒకళ్లు పోరాడారు. వాళ్ల మోచేతులదాకా రక్తమే. ఆ ఒంటె పేగులని కడుపు చీల్చి పెరిగి వున్న చోటనే ఆబగా మింగుతున్నారు... "ప్రపంచాన్ని కుదిపిన వాడు" నోట మాట లేక, శల్యాల్లాంటి కాళ్లతోటీ, శుష్కించిన చేతులతోటీ ఆ ఒంటెలాగా వున్నాడు, అదే మృత్యు భీతి అతని అర్ధనిమీలిత నేత్రాలలో కనిపిస్తోంది... అలాగానే వారసులు తమలో తాము

పోరాడుకుంటూ, ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ, రక్తసిక్త పైతృకాస్తి తనుకలని తెంచుకోవడం కోసం...

"బహుశా – నీకు గుర్తు లేదేమో – ?... చెప్పు!"

యెలు చూ చాయ్ గొణిగాడు:

"నీ జీవితంలో నువ్వు యెన్నో బ్రహ్మాండమైన, భయంకరమైన పనులు చేశావు. నీ యుద్ధాల గురించీ, చర్యల గురించీ, మాటల గురించీ చరిత్ర రాసినప్పుడే బేరీజు వెయ్యడం జరుగుతుంది..."

"నేను ఆజ్ఞాపిస్తున్నాను... పిలవండి... పండితుల్ని... రాయాలి... పుస్తకం... నా యుద్ధాల గురించి, చర్యల గురించి... మాటల..."

"అలాగే జరుగుతుంది".

యుర్త్‌లో నిశ్శబ్దం ఆవహించింది. వుండీ వుడిగీ మంట టప్‌మని పేలేది. పైకప్పులోని కంతలోనుంచి గాలి విసురు సుళ్లు తిరిగే పొగని బెదరగొట్టేది.

మళ్లీ సన్నగా మాట వినిపించింది:

"నేను చేసిన... అత్యుత్తమ... ఆc... పని... యేమిటి?"

చనిపోతున్న అతన్ని వూరడించదలచుకుని యెలు చూ చాయ్ జవాబు చెప్పాడు:

"నువ్వు చేసిన అత్యుత్తమ కృషి నీ శాసనం, 'జాసో' వాళ్లు గనక దీన్ని మన్నిస్తే నీ వారసులు పదివేల యేళ్లు ప్రపంచాన్ని పాలిస్తారు".

జెంఘిజ్ ఖాన్ నిశ్చలంగా పడి వున్నాడు. అతని కళ్లు మూతపడ్డాయి. ముక్కు శిఖరంలాగా వుంది. కణతలు వాలి వున్నాయి.

చప్పుడు చెయ్యకుండా మహమ్మద్ యాలవాచ్, చైనా వైద్యుడు, ముఖ్య షామాన్ యుర్త్‌లోకి వచ్చారు. ఖాఖాన్ కాళ్ల దగ్గర మోకాలిమీద వాలి, వాళ్లు నిశ్శబ్దంగా వున్నారు. అతను మగత విడిచి మాట్లాడే క్షణం కోసం చూస్తూ వున్నారు. ఖాఖాన్ కళ్లు తెరిచాడు. అతని చూపు మహమ్మద్ యాలవాచ్‌మీద వాలింది.

"మా అబ్బాయి... జగతాయ్... పడమటన... యెలా పాలిస్తున్నాడు?"

మహమ్మద్ యాలవాచ్ హుందాగా, ఠీవిగా వున్నాడు. యెర్ర అంగరఖా తొడుక్కున్నాడు. మంచులాంటి తెల్లని తలగుడ్డ కట్టుకున్నాడు. పెద్ద బొజ్జమీద చేతులు కట్టుకుని నేలకంటా వంగి వందనం చేశాడు.

"మణిపూసలాంటి నీ కొడుకు జగతాయ్ ఖాన్, మంగోలు భగత్తూర్‌లు సైహున్, జరాఫ్‌షాన్ తీర పాలితులూ నీ ఆరోగ్యం కోసం, దీర్ఘ పాలన కోసం ప్రార్థిస్తున్నారు".

"మా పెద్దబ్బాయి... జూచి ఖాన్... ఉత్తరాది ప్రజల్ని యెలా పాలిస్తున్నాడు?"

మహమ్మద్ యాలవాచ్ చేతులతో ముఖం కప్పుకున్నాడు. మంగోలు ఆచారం ప్రకారం ఒక మనిషి బంధువు చనిపోతే చనిపోయిన వ్యక్తిని పేరు పెట్టి చెప్పడం మర్యాద కాదు. ఇప్పుడా వ్యక్తి "పవిత్ర ఆత్మ". అంచేత అతన్ని గురించి మరో పద్ధతిలో ఒక విధంగా మర్యాదైన రీతిలో, సూటి మాటలతోగాక వేరే మాటలతో ప్రస్తావిస్తూ చెప్పాలి. అంచేత మహమ్మద్ యాలవాచ్ ప్రస్తుత విషయాన్ని తప్పించి యెక్కడ్నో మొదలుపెట్టి తన జవాబు చెప్పాడు:

"ఉత్తర ప్రాంతాలకి పాలకుడుగా నియమిస్తూ నీ ఫర్మానా అందుకుని తను యుద్ధ ప్రయత్నాలని ఆరంభిస్తున్నానని బెక్‌లకి చెప్పాడు..."

"నాకు వ్యతిరేకంగా?"

"లేదు, మహా ప్రభూ! అతని పదునైన బల్లేలు పడమటికి తిరిగాయి, బుల్గార్లకి, కిప్‌చాక్‌లకి, సస్సిన్లకి, రష్యన్లకి వ్యతిరేకంగా. కాని ఆ దండయాత్ర అసలు మొదలవలేదు. సైనికులు తమ శిబిరాలకి తిరిగి వెళ్లిపోయారు. మబ్బులు లేని రోజున పిడుగు లాగా ఘోర విపత్తు నెత్తిమీద పడింది".

"వివరించు".

"ఖాన్‌కి తగినట్టు వుండే పెద్ద వేటని పచ్చిక బీటిమీద యేర్పాటు చేశారు. రెల్లుని తాడించి, అడివి పందుల్ని, తోడేళ్లని, పులుల్ని ఇవతలికి తోలడానికి అయిదు వేలమంది నోకర్లు మైదానంమీద విస్తరించుకున్నారు. అడివి మేకల్నీ, అడివి గుర్రాలనీ బయటికి తరిమేస్తూ విస్తారమైన ప్రాంతంలో అయిదు వేలమంది ఆశ్వికులు గాలించారు. సాయంత్రం వేట తర్వాత, విడిది నెగళ్లు మండి, విందు ఆరంభమవబోయే సమయానికి నోకర్లు అతను యెక్కడున్నదీ కనిపెట్టలేకపోయారు. అనేక యుద్ధాల్లో దూసుకు వచ్చే బాణాలకి కూడా గాయపడకుండా నెగ్గుకు వచ్చిన వీరుడతను. యెంతో వెతికారు ఆఖరికి చూస్తే యెలా వున్నాడు? పచ్చిక బీటిమీద ఒంటరిగా పడి వున్నాడు, బతికే వున్నాడు, ఒక రక్తం చుక్క కారలేదు, కాని ఒక్క మాటా అనలేదు. అతని కళ్లు మాత్రం ఆగ్రహంతో చూశాయి మాట్లాడుతున్నట్టు..."

"అతను... అతను... చనిపోలేదు కదా?"

"అనేక విజయాల కీర్తి ధగద్ధగలతో, నీకు యెంతో ఆప్తుడూ, ప్రియమైనవాడు అయిన ఆ భగత్తూర్ చనిపోయాడు. యే అజ్ఞాత దెయ్యాలో అతని నడుం విరిచాయి".

జెంఘిజ్ ఖాన్ ముఖం మెలికలు తిరిగింది. అతని చేతులు నల్ల పచ్చడాన్ని ఒడిసి పట్టాయి. అతను గొణిగాడు:

"ఉచ్‌గిన్‌కి దూకుడెక్కువ. గొప్ప భగత్తూర్, సమర్థుడైన సైన్యాధిపతీ యిక లేడు.... యెవళ్లూ అతని స్థానాన్ని ఆక్రమించలేరు. ఇప్పుడు – ఖోరెస్మ్‌ని యెవళ్లు పాలిస్తున్నారు?"

"మీ మనవడు బటూ ఖాన్, తెలివైన తల్లి నేతృత్వం కింద. ఆమె నోకర్లని పిలిచి కొడుకుతో కలిసి యెత్తు గుట్ట చివరకంటా వెళ్లారు. బటూ ఖాన్ తండ్రిగారి గోధుమరంగు గుర్రంమీద కూర్చున్నాడు. ఆ భీకర యువకుడు నోకర్లని చూసి అరిచాడు:

"వినండి భగత్తూర్‌లారా! నలుమూలలా ప్రపంచాన్ని జయించిన విజేతలారా! మీ కత్తులు తప్పు పడుతున్నాయి. నల్లని రాతిమీద పదును పెట్టండి. నేను మిమ్మల్ని పడమటికి తీసికెడతాను, మహా నది ఇతిల్‌మీదుగా, పిరికి పందలున్న ప్రదేశాలకి భీతి కలిగిద్దాం. మా తాత జెంఘిజ్ ఖాన్‌గారి సామ్రాజ్యాన్ని ప్రపంచపుటంచుల దాకా విస్తరింప చేస్తాను... నా తండ్రిని చంపిన దెయ్యాల్ని పట్టి సజీవంగా అండాల్లో వుడికిస్తానని ప్రమాణం చేస్తున్నాను".

జెంఘిజ్ ఖాన్ నెరిసిపోయి భయంకరంగా వున్నాడు. అతని కళ్లు తారట్లాడుతున్నాయి. మోచేతులమీద లేచి భారంగా శ్వాస పీలుస్తూ ఆయాసంతో అన్నాడు:

"యౌవనంతో వుండడం బాగుంటుంది... మెడమీద కాడి వున్నాగానీ... నీ విజయాలన్నీ ముందే వుంటాయి... కాని బటూ ఇంకా చాలా చిన్న పిల్లాడు. తప్పులు చెయ్యొచ్చు అతన్ని కూడా అణగ దొక్కేస్తారు... నేను ఆజ్ఞ ఇస్తున్నాను... బటూతోపాటు పాలించడానికి... అతనికి యెప్పుడూ సలహాదారుగా వుండడానికి.... నమ్మకస్తుడైన హెచ్చరికగా వుండే సుబుదై భగత్తూర్‌ని... నియమిస్తున్నా... అతను వాణ్ణి సురక్షితంగా కాపాడతాడు... యుద్ధ తంత్రం నేర్పుతాడు... బటూ నా విజయాలని కొనసాగిస్తాడు... ప్రపంచంలో మంగోలు చేతి నీడని విస్తరింపజేస్తాడు..."

జెంఘిజ్ ఖాన్ పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు. యెడమ కన్ను ముడుచుకుంది. కుడి కన్ను భయంకరంగా మండుతూ తన పక్కన మోకరిల్లిన మనుషులకేసి చూసింది.

కళ్లు వాల్చి అందరూ చాలా సేపు నిశ్శబ్దంగా వుండిపోయారు. కవి మాటలు వాళ్లకి స్ఫురించాయి:

"నిస్సహాయులైన నల్గురు మనుషులు
రాజ వైద్యుడు, షామాను, దర్వేషు, కార్తాంతికుండు,
చేరిరి ఓట మెరుగని సైన్యాధినేత చెంత
ముందు, మంత్రాలు, తాయెత్తు జాతకాలు చేత పట్టి.
కాని చేయగలిగినట్టిదేమి గలదు".

ఆ నిశ్శబ్దంలో బయట గుర్రం సకిలించింది. ఒణికిపోతూ అందరూ ఖాఖాన్‌కేసి చూశారు. అతని కుడి కన్ను మెరుపు తగ్గి మసకబారిపోయింది.

జెంఘిజ్ ఖాన్ చాలా కాలంగా తనతో ఒక శవ పేటికని తీసుకెడుతున్నాడు. అది ఒకే ఓకు చెట్టు దుంగతో దొలిచింది. లోపల బంగారు పూత పెట్టింది. రాత్రి రహస్యంగా అతని కొడుకులు దాన్ని యుర్త్‌లోకి తీసికెళ్లేవాళ్లు. సైనికుడి వేషంతో జెంఘిజ్ ఖాన్ని అందులో

పెట్టారు. అతని చేతులు ఛాతీమీద మడిచి వున్నాయి. పదునైన కత్తి పిడిని పట్టుకుని వున్నాయి. అతని నల్ల ఉక్కు శిరస్త్రాణం మెరుగుపెట్టి ఉంది. కళ్లు మూసుకుని వదనం కఠినంగా వుంది. ఆ శిరస్త్రాణంతో పోలిస్తే వదనం ఇంకా తెల్లగా వుంది. శవపేటికలో అతనితోబాటుగా అతని విల్లంబుల్నీ, బాకునీ, చెకుముకి రాళ్లనీ, బంగారు పాన పాత్రనీ పెట్టారు.

ఖాఖాన్ ఆజ్ఞని శిరసావహించి సైన్యాధిపతులు అతని మృతి వార్తని రహస్యంగా వుంచారు. తంగుట్ నగరాన్ని ముట్టడించడానికి ఉద్యుక్తులయారు. గౌరవ పురస్సరంగా కానుకలు పట్టుకుని శాంతి నర్థిస్తూ తంగుట్‌లు నగర ద్వారం బయటికి రాగానే మంగోలులు వాళ్లమీద విరుచుకు పడి అందర్నీ ఖతం చేసేశారు. అప్పుడు నగరంలోకి చొచ్చుకుపోయి దాన్ని శిథిలం చేసేశారు.

జెంఘిజ్ ఖాన్ శవపేటికని బొచ్చు అట్టలతో చుట్టబెట్టి, రెండు చక్రాల బండి మీద పెట్టారు. దాన్ని పన్నెండు యెద్దులు లాగాయి. మంగోలులు ఆ విధంగా ఇంటి దారి పట్టారు. సొంత ప్రాంతానికి పోయేదాకా తమ పాలకుడి మరణ వార్తని యెవళ్లూ చెప్పకుండా వుండేందుకు గాను, దారిలో కనిపించిన సజీవమైన ప్రతి దాన్నీ భగత్తూర్‌లు చంపేశారు. చచ్చిపోయేటప్పుడు మనుషులకీ జంతువులకీ కూడా ఇలా చెప్పడం జరిగింది:

"మేఘాల్లో వున్న సామ్రాజ్యానికి పో, అక్కడ మన పవిత్ర పాలకుడి కొలువు చెయ్యి!"

మెర్కిట్‌లని, చైనీయులని, కిప్‌చాక్‌లని, జార్జియన్లని, ఇరానియన్లని, ఆలన్లని, రష్యన్లని జయించిన ప్రపంచ విఖ్యాత భగత్తూర్ జెంఘిజ్ ఖాన్ సంతాన సమయంలో మహా సర్దారు జెబె నాయన్ ఇలా అన్నాడు:

"ఒక సారి, 'మన సామ్రాజ్యాన్ని నిర్మించిన మహనీయుడు' బుర్ఖాన్ ఖల్దూన్ కొండలో వేటాడుతున్నాడు. కొండ సానువుమీద ఒక నిర్జన ప్రదేశంలో ఆయన ఒక పాత చెట్టు కింద కూర్చున్నాడు. ఇప్పుడు కీర్తి శేషులైన ఆయనకి ఆ చోటు నచ్చింది. యెత్తైన సెడారు చెట్టు మేఘాలని తాకే ఆ చోటు ఆయనకి నచ్చింది. 'యీ తావు అడవి లేడి మేతకి బాగుంటుంది, నా శాశ్వత నిద్రకీ బాగుంటుంది. యీ చెట్టుని గుర్తుంచుకో' అని ఆయన నాతో చెప్పాడు".

ఖాఖాన్ సర్దారులు అతని ఆజ్ఞని మన్నించి కొండమీద ఆ చోటు వెదికారు. అక్కడ చాలా పెద్ద సెడారు చెట్టు పెరిగింది. దాని నీడన కింద భూమిలో జెంఘిజ్ ఖాన్ శవపేటికని పెట్టారు.

క్రమేపీ అడవి యెంతో సాంద్రంగా పెరిగింది. లోపలికి యెవళ్లూ చొచ్చుకు పోలేకపోయారు. గోరీ దిబ్బని చూడలేకపోయారు. ఆ చోటుకి పోకుండా నిషేధం జరిగింది కాని దాన్ని కాపలా కాసే పాత కాపలా వాళ్లు కూడా అక్కడికి దారి కనుక్కోలేకపోయారు.

# ఉపసంహారం  మంగోలుల జాడ

"ఓ హిమావృత పర్వతమా
పాషండులకు బానిసగా నన్ను కాంచితీవు
శృంఖలా బద్ధ హస్తాల తోడ
చరియించితి నెవ్విధంబు
వారి తాడన కాసి కొంటు.
యెటుల తల కాసుకుంటి
నెవ్వరైన నా రోదన వింటి రా
నీవు తక్క, హిమావృత పర్వతమా!"
(ఖివాన్ బానిస పాట)

జైహూన్ నదీ తీరంనుంచి తూర్పుకి పోయే పెద్ద బాటమీద యెన్నో యుగాలుగా సంపద్వంతమైన బిడారులు సమూహాలు వెళ్లాయి. కాని మంగోలుల రాకతోటి అవన్నీ కట్టడిపోయాయి. బాటమీద వ్యాపార కేంద్రాలు, సత్రాలు పాడు పడిపోయాయి. క్షీణించిపోయాయి. వాటి ద్వారాలూ, తలుపులూ పోయాయి. సైనికులు తమ విడిది నెగళ్ల కోసం వాటిని విరిచేశారు. నీళ్లు లేక మహా ఉద్యాన వనాలు యెండిపోయాయి. నీటి బోదెల్ని శుభ్రం చేసి నీరు పారించేవాళ్లు యెవళ్లూ లేకపోయారు.

విదేశీ అంగీ తొడుక్కున్న ఒక యువ రౌతు, కులాసాగా దుమ్ము రాస్తామీద స్వారీ చేసుకుపోతూ కనిపించాడు. అలాంటిది అక్కడ వింత, కొత్త దృశ్యం. అతని నల్లని అరబ్బీ గుర్రం గిట్టలు దుమ్ములో క్రమం తప్పకుండా కొట్టుకున్నాయి.

దారి మలుపులో అతనికి కొంత మంది మంగోలులు కనిపించారు. యెత్తుగా, కిర్రుమంటూ చప్పుడు చేసే చక్రాలున్న బళ్లు రెండు మెల్లిగా ముందుకు సాగాయి. ప్రతి బండిలోనూ సామాన్లు గుట్టగా వున్నాయి. చెరో దానిమీదా మంగోలు ఆడమనిషి కూర్చుంది. మగవాడిలాగా వేషం వేసుకున్నారు వాళ్లు. నక్క బొచ్చు టోపీ, గొర్రె తోలు అంగరఖా

వేసుకున్నారు. బళ్లకి కట్టిన యెద్దులకేసి అలా అరుస్తూనే వున్నారు. కాని అవి యేం పట్టించుకోకుండా ధూళి మేఘంలో రాక్కుంటూ పోయాయి.

బళ్ల వెనక ముగ్గురు అర్ధనగ్న బానిసలు యీడ్చుకుంటూ వెళ్లారు. వాళ్లు అలిసిపోయి వున్నారు. వాళ్ల చేతులు వెనక కట్టేసి వున్నాయి. ఒక ఆడమనిషి దాదాపు నీరసంతో పడిపోతోంది. వాళ్ల పక్క నాలిక వేలాడేసుకుని పెద్ద బొచ్చు కుక్క నడిచింది. ఒక మంగోలు కుర్రాడు, సుమారు యేడేళ్ల వాడు, చెవులమీదకి పడే రెండు జళ్లతోటి ఆ బందీలని దూళ్లని తోలినట్టు తోలుతున్నాడు. మెల్లిగా పోయే ఆవుల మందని హడావుడిగా తోలే వాడిలా తోలుతున్నాడు.

ఆడబానిస యేడుస్తూనే వుంది: "నన్ను వదలండి! నేను తిరిగివస్తాను! మా అమ్మాయి వెనక దిగడిపోయింది... నేనే ఆమెని తీసుకువస్తాను".

"నీకు కూతురెందుకు?" అని ఒక వృద్ధ మంగోలు గుర్రంమీద ధూళి మేఘంలో నుంచి ఇవతలికి వస్తూ, అడిగాడు. "నువ్వు తాటితో బండిని వెనక్కి లాగేస్తున్నావ్. నీతోబాటు మరో పిచ్చిదాన్ని లాగ్గలవా? నిన్ను నువ్వే లాక్కో లేకుండా వున్నావు!"

ముసలి మంగోలు కొరడాతో ఆడమనిషిని కొట్టాడు. ఆమె ముందుకి పరిగెత్తి బోయింది. కాని పడిపోయింది. ఆమెని బండికి కట్టిన తాడు బిగుతయి ఆమెని నేలమీద లాగింది. బండిమీద వున్న మంగోలు ఆడమనిషి అరిచింది:

"నువ్వు మరీ దురాశగా వున్నావు, పూర కుక్క! ఇదేమన్నా కుంటి గొర్రె అయితే నేనే మోకాళ్లమీద కూర్చో పెట్టుకుందును. యేమైనా నీకు గొర్రె నుంచి మాంసం, చర్మం వస్తాయి. కాని ఇలాంటి పశువువల్ల ఉపయోగం యేముంది? మన కెరులెన్ తీరానికి ఇంకా చాలా దూరం వుంది... ఆమెని అవతల పారెయ్యండి!"

"ఆమె చచ్చిపోదు! నడవగలదు!" అని ముసలి మంగోలు కోపంగా అరిచాడు. "ఈ కాకి నాతో వుంటుంది, ఈ ముగ్గురు మనుషులూనూ. నా యుర్త్‌కి తీసికెడతాను. మన ఇరుగుపొరుగు వాళ్లు తలా ఇరవై మంది బానిసల్ని తీసుకెడుతూ వుంటే మనం నలుగుర్ని కూడా తీసికెళ్ల లేకపోతున్నాం. రండి, పశువులూ, నడవండి!"

ఆ మంగోలు యీడ్చుకుంటూపోయే ఆడమనిషిని కొరడాతో కొట్టాడు. ఆమెని బండికి కట్టిన తాడు తెగింది. ఆమె నేలమీద పడిపోయింది. బళ్లు సాగిపోయాయి. వృద్ధ మంగోలు గుర్రాన్ని ఆపి, విసుగ్గా రెక్క వేసి, తమని అందుకున్న యువ రౌతుని చూసాడు:

"ఆమె బతుకుతుందనుకుంటున్నావా? లేదా? కొనుక్కో. చవగ్గా అమ్మేస్తాను. రెండు బంగారు దీనార్లు మాత్రమే".

"చీకటి పడేదాకా బతకదు. రెండు రాగి దిర్హమ్‌లు ఇస్తాను".

"సరే కానియ్యి! నువ్వన్నది నిజమే. బతకదు! అప్పుడదీ రాదు".

ఆ మంగోలు రౌతు ఇచ్చిన రెండు నాణేల్ని బొడ్లో దోపుకుని బళ్లని అందుకోవడానికి వెళ్లిపోయాడు.

రౌతు వెనక్కి తిరిగి చూడకుండా యెండిపోయిన నేలమీద దౌడు తీసుకు వెళ్లిపోయాడు.

రాతి శిధిలాలు దగ్గర పడ్డాయి. బ్రహ్మాండమైన కమాను కింద భారమైన ద్వారాలు బార్లా తెర్చుకుని వున్నాయి. వాటికి ఇనప గుబ్బలున్నాయి. అవి పళ్లేలంత పెద్దవిగా వున్నాయి.

"అవే పాత ద్వారాలు. వీటిగుండా ఒకప్పుడు దర్వీష్ హాజీ రహీమ్, రైతు కుర్బాన్ కిజిక్ వెళ్లారు. కుర్రవాడు తుఘాన్ వెళ్లాడు. ఇప్పుడు తుఘాన్ పెద్ద వాడయ్యాడు. చెయ్యి తిరిగిన సైనికుడయ్యాడు. కాని ఇల్లూ వాకిలీలేని దిమ్మరి. ఘనమైన బుఖారాలో తిండీ, పడక లేక తిరుగుతున్నాడు. ఒకప్పుడీ నగరం సంపదతో తులతూగింది".

గుర్రం జాగ్రత్తగా నడిచింది. నిశ్శబ్ద మృత నగరంలో దారి చేసుకుంటూ వెళ్లింది. అదిగో ముఖ్య చౌకు... ఒకప్పుడు రాజ ఠీవి ఉట్టిపడే భవనాలు, గుంపులు గుంపులుగా జనం వున్న చోటు అది. ఇప్పుడా చోటు శిధిలాల గుట్టతో వుంది. మధ్యలో గుర్రాల యెముకలు తెల్లగా మెరిశాయి. నీలి ఆకాశంలో జేగురు రంగు రాబందులు మెల్లిగా రెక్కలు నిశ్చలంగా చాచుకుని పోతున్నాయి.

మసీదు మెట్ల దగ్గర గుర్రం ఆగింది. ఇకిలిస్తూ, బుసకొడుతూ, చెవులు వెనక్కి పెట్టుకుంది. ముందు, రాతి వితర్దిమీద, పెద్ద కొరాన్ గ్రంథం వుంది. దాని పుటలు వానకి నాని, ముడతలు పడి, గాలికి కదులుతున్నాయి.

"యీ మెట్లమీదుగా మీగడ రంగు గుర్రం యెక్కి మంగోలుల కఠిన పాలకుడు జెంఘిజ్ ఖాన్ వెళ్లాడు. తన చదును ముఖం సైనికులకి తిండి పెట్టమని ఇక్కడ అతను బుఖారా పెద్దలని ఆజ్ఞాపించాడు. అప్పుడు ఈ చౌకు నెగడు మంటల్తో వెలిగింది. వేయించే గొర్రెల వాసనతో నిండింది. ఇంకా ఆ మంటల జాడలు రాతి పలకల మీద కనిపిస్తాయి".

తుఘాన్ గుర్రం దిగి, అంగీ పరిచి, మెట్లమీద కూర్చున్నాడు. గుర్రం కళ్లేలు పట్టుకుని యెండిన రొట్టె ముక్క చేత్తో పట్టుకున్నాడు.

రాతి గుట్టలా వెనక యేదో కదిలింది. శుష్కించిపోయిన అస్థిపంజరంలాంటి ఆడమనిషి గుట్టలా వున్న ఇటికల్ని తప్పించుకుంటూ ఇవతలికి వచ్చింది. ఇంకా ఆమె వంటిమీద కాసిని గుడ్డ పీలికలు వేలాడుతున్నాయి. ఆమె తుఘాన్ దగ్గరికి వచ్చింది. రొట్టె ముక్కమీదనుంచి ఆబగా, ఆశగా చూసే కళ్లని తిప్పుకోలేక చెయ్యి చాచింది.

తుఘాన్ కాసిని ముక్కలు ఆమెకి పెట్టాడు. ఆమె యేదో ఘనమైన దాన్ని అందుకుంటున్నట్టు, పవిత్రంగా దాన్ని అందుకుని కొంచెం పక్కకి వెళ్లి మోకాళ్ల మీద పడింది. ఉబ్బిన పెదాల దగ్గర ఒక ముక్కని పెట్టుకుంది. కాని తటక్కున చేతిని మళ్లీ తీసేసుకుంది. ఆ

ముక్కల్ని రాతి పలకమీద సమానమైన ముక్కలుగా చేసింది. చేతులకి అంటుకున్న ముక్కల్ని జాగ్రత్తగా నాకి పలిచింది:

"రండి, చిన్న కూనలూ, బాన కడుపులూ! ఇక్కడ మన వాడే ఒకడున్నాడు. భయపడద్దు".

నల్లని కంతలో నుంచి మొదట ఒకటీ, తర్వాత మూడూ జీబురు తలలు, చిన్న పిల్లలవి, ఇవతలికి వచ్చాయి. ఆ రాళ్లమీద వెంపర్లాడుతూ, ఒకళ్లకొకళ్లు అంటిపెట్టుకుని, ఆ పిల్లలు మెల్లిగా ఆమె దగ్గరికి వచ్చారు. నగ్నంగా, యెండకి కమిలి, అస్థిపంజరాల్లాంటి శరీరాలతో పొట్టలు మాత్రం బంతుల్లా ఉబ్బి వున్నారు వాళ్లు. నల్లని కంతలో నుంచి మరో యిద్దరు పిల్లలు వచ్చారు. వాళ్లు నుంచుందామనే ప్రయత్నం కూడా చెయ్యలేదు. ముందుకి కాళ్ల చేతుల మీద పాకారు. ఉబ్బిన కుడుపుల మీద చేతులు ఆన్చి చతికిల పడ్డారు.

రొట్టె కోసం చాచిన చేతుల్ని ఆమె ముద్దపెట్టుకుని కొన్ని ముక్కల్ని వాళ్ల తెరిచిన నోళ్లల్లో కుక్కింది.

తుఘాన్ ఆమెకి ఆఖరి ముక్కని యిచ్చాడు. గుర్రాన్ని కళ్లెం పట్టుకు నడిపించుకు వెళ్లాపోయాడు.

తుఘాన్ సమర్‌కండ్‌కి వెళ్లాడు. బిడారులు తగల్లేదు. ఇక్కడా అక్కడా ఒంటరి రైతు ఒకడు తగిలాడు. ఒకటి రెండు సార్లు మంగోలు ఆశ్వికుడొకడూ అరా పక్కనుంచి పోయారు. పొలంలో పని చేసే రైతులు కాళ్లు తెగ్గొట్టేసినట్టు నేలకి ఆనుకుపోయారు. పాకి, కయ్యలో దాంకున్నారు. రౌతుల ధూళి మేఘం కొండల వెనక మాయమైపోగానే భీతాంగం యెత్తిన రైతులు మళ్లీ బయటికి పాకి నేలని గీకడం మొదలుపెట్టేవాళ్లు.

# సమ్మర్దంగా వుండే సమర్‌కండ్ యెక్కడ?

కొన్ని రోజుల తర్వాత అన్ని చోట్లా శ్మశానం దిబ్బలే వున్న ఆటవిక నిర్జన ప్రాంతంలో యెత్తైన చోట తుఘాన్ ఆగాడు. ఆ యెత్తుమీద నుంచి అతనికి నది ఆకుపచ్చని లోయ కనిపిస్తుంది. ఆ ఒడ్డునే ఒక నాటి ప్రసిద్ధ సమర్‌కండ్ శిధిలాల గుట్టలు వున్నాయి. చదును కప్పులున్న యిళ్లు ఇంకా వున్నాయి. కాని మవరాన్నహార్ ఒక నాటి రాజధాని సంచలనం యేమీ లేదు. ఒకప్పుడది లక్షపలక్షల నిపుణులైన పని వాళ్ల శ్రమతో సందోహంగా వుండేది.

శిధిలమైపోతూ, వానకి నానిపోయిన కోట గోడలు నగరపు లోపలి భాగంలో వున్నాయి. ఖోరెస్మ్ షాల కడపటి వాడు మహమ్మద్ కట్టిన యెత్తు మసీదు, రెండు యెత్తైన గోపురాలు కాలిన అవశేషాలు అక్కడ వున్నాయి.

ఓ కుంటి ముష్టివాడు తుఘాన్ దగ్గరికి యెగురుతూ వచ్చి, చర్మం ఆరిపోయిన చేతిని పీలికల్లోనుంచి బయటికి చాచాడు.

"ఆకటికి మాడిపోయే వాడికి అన్నం పెట్టయ్యా, యోధుడా, అల్లా నిన్ను యుద్ధంలో చల్లగా చూస్తాడు! నీ పరాక్రమవంతమైన గుండెకి తగలకుండా బాణాన్ని పక్కకి తోసివేస్తాడు!"

"కాని నగరం యెక్కడ? సుల్తానుల, షాల వైభవభరిత రాజధాని యెక్కడ? సంపద్వంతులైన వర్తకులు, సమ్మర్దంగా వుండే అంగళ్లు, కర్మాగారాల సమ్మెటచప్పుళ్లు యేవి?" అని తుఘాన్ అడిగాడు. ముష్టివాడిని అడుగుతున్న దాని కంటే తనకి తనే యెక్కువ యిలా ప్రశ్నించుకుంటున్నట్టు వుంది.

"అంతా పోయింది" అన్నాడా ముష్టివాడు. "మంగోలులు ఇక్కడికి వచ్చారు. వాళ్లు దేనన్నా మిగులుస్తారా? నగరానికి యేమైందని నువ్వు అడుగుతున్నావ్. మనుషుల్లో ఒక భాగాన్ని మంగోలులు క్రూరంగా చంపేశారు. మరొక భాగాన్ని పచ్చిక బీళ్లకి తోలుకుపోయారు. మిగిలిన వాళ్లు పర్వతాల్లోకి పారిపోయారు. వాళ్లల్లో చాలా మంది చచ్చిపోయారు...."

"నగరం మధ్యలో వుండే శిఖరాలు యేమయ్యాయి?"

"నీ గుర్రాన్ని తిప్పి ఆ శిఖరాల నుంచి వెళ్లిపో. అవి చీకటి కొట్లు. మంగోలు ఖాన్లు యీ మృత నగరంలో యీ చీకటి కొట్లని అట్టే వుంచారు. మంగోలు తలార్లు వాటిల్లో వుంటారు. ఇనప గుళ్ల గదలతోటి నికృష్ట ఖైదీల బుర్రలు బద్దలు కొడతారు".

తుఘాన్ కొండ సానువు దిగి చేసుకుపోయాడు. మృత నగరంలో దారి వెతుక్కుంటూ ఒక దుర్గం దగ్గరికి వచ్చాడు. దానికి రెండు పాత యెత్తైన శిఖరాలున్నాయి. కఠినంగా, నిశ్శబ్దంగా వున్నాయి. ఆ గోడల దగ్గర నేలమీద ఖైదీల నిర్భాగ్య బంధువులు వున్నారు. బల్లేలు పట్టుకున్న కాపలావాళ్లు ద్వారం దగ్గర వున్నారు.

"యెక్కడి నుంచి వచ్చావ్? వెళ్లిపో" అని ఒక కాపలావాడు అరిచాడు.

"యీ శిఖరం పహారవాణ్ణి చూడా" అన్నాడు తుఘాన్.

"యేం లోపల పడదామనా?"

"బహుశా, మా అన్న అక్కడ వుంటే".

"చవట వెధవలు చాలా మందే వున్నారు. కాని అక్కడ యెక్కువ కాలం వుండరు. అక్కడ వున్న గొయ్యి దగ్గరికి తీసుకుపోతాం, యినప గదతో తల బద్దలు కొడతాం. వెళ్లి గోతిలోకి చూడు. అక్కడ మీ అన్న శవం కనిపించవచ్చు. అతగాడి పేరుమిటి?"

"అతను దర్వేష్, పుస్తకాలు రాస్తాడు. హాజీ రహీమ్ బాగ్దాదీ".

"బారు జుట్టు పిచ్చి వాలకం దర్వేషేనా? ఇంకా బతికే వున్నాడయ్యోయ్. అతనిక్కడ చాలా కాలంగా వుంటున్నాడు".

"శాశ్వతంగా, చనిపోయేదాకానా?"

"చాలు యింక! నీ గుర్రాన్ని కట్టేసి పెరట్లోకి రా. పాలకుడితో మాట్లాడు. ఆయనిల్లు అదుగో అక్కడుంది. తలుపు పక్కన ఓ కుండ వేలాడుతోంది. ఆరు దిర్హామ్‌లకి తక్కువ లాభం లేదు. ఆయన నీతో మాట్లాడతాడు".

తుఘాన్ గుర్రాన్ని కట్టేశాడు. ద్వారం గుండా వెళ్లాడు. నగర పాలకుడు ఇంటి మిద్దెమీద ఉన్నాడు.

తుఘాన్ తలుపు వార వేలాడుతూ వున్న మట్టి కుండని చూశాడు. పది రాగి దిర్హామ్‌లని వేశాడు. పాలకుడు తుఘాన్‌కేసి ముటముటలాడుతూ చేశాడు.

"సుబుదై భగత్తూర్ తోమన్‌లో పనిచేసే ముసల్మాన్ సైనికుణ్ణి. ఆయన అనుమతీతోటి మా బంధువుని చూద్దామని వచ్చాను. ఇదిగో నా పైస్తా" తుఘాన్ చిన్న కొయ్య పలకని చూపించాడు. అది ఓ తాటికి కట్టి మెళ్లో వేలాడుతోంది. దానిమీద యేదో రాత వుంది, ఓ పక్షి బొమ్మ చెక్కి వుంది.

పాలకుడు దాన్ని చేత్తో తిప్పి తిగిరి తుఘాన్‌కి ఇచ్చేవాడు.

"నికృష్టుల చీకటి కొట్టుకి రావడం యెందుకని నువ్వు?"

"మా అన్న కోసం వెతుకుతున్నాను. దర్వీషు హాజీ రహీమ్ బాగ్దాదీ. ఆయనిక్కడ లేడా?"

"అల్లా వాణ్ణి శపించి మనల్ని కాపాడు గాక, నిన్నూ నన్నూ, అతనితో యేం సంబంధం వున్నా".

"ఆయన యెందుకు చీకటి కొట్లో వున్నాడు? ఆయన నాకు తెలిసిన మట్టుకి నిజాయితీపరుడే".

"ఓ మంచి నిజాయితీపరుడు అతను. అతనికి పవిత్ర గ్రంథాలంటే యేవగింపు. సిగ్గు లేకుండా స్వేచ్ఛా ఆలోచన చేస్తాడు. సర్వేశ్వరుడు అల్లా పేరు యెప్పుడూ తలవడు. అతనికి దుఃఖం తప్ప మరేం రాదు. సజీవ దహనం అయిపోతాడు. అతనికి జరగబోయేది అదీ!"

తుఘాన్ కొంచెం సేపు ఆలోచించి అన్నాడు:

"ఇవి దారుణమైన ఆరోపణలు. కాని అతని కోసం నన్ను యేదేనా చెయ్యనీయండి, కొంచెం పరిస్థితులు చక్కబడ్డానికి".

"అనవసరంగా పొద్దు పుచ్చకు. మహమ్మద్ యాలవాచ్ కోరిక మేరకి ఇతన్ని బతకనిస్తునానరు. మహమ్మద్ యాలవాచ్ ఖాన్ జగతాయ్ పాలకుడి ముఖ్య వజీర్. మహా జెంఘిజ్ ఖాన్ జీవిత, కృత్యాల గురించిన పుస్తకం పూర్తి చేస్తేనే గాని అతన్ని వదలరు".

"అయితే హాజీ రహీమ్ ఆ పుస్తకాన్ని పూర్తి చేస్తే అతన్ని వదిలిపెడతారా?"

"బయటికి వచ్చి ఏం జేస్తాడు? ఒక వేళ పశ్చాత్తాప పడినా అతని జన సమూహం ముందు శిఖరం పైన వేదికమీదకి తీసుకు వచ్చి చేతులూ నాలిక తెగ్గోస్తారు. అందుకనే అతను ఆ పుస్తకం రాస్తున్నాడు, రెండేళ్లుగా. ఇంకో ముప్పై యేళ్లు అలా రాస్తూనే వుంటాడు యీ ఖర్మ తప్పించుకోవడానికి". తుఘాన్ అన్నాడు:

"హాజీ రహీమ్ నా పోషకుడు. నాకు అరబిక్ చదవడం రాయడం నేర్పాడు. నేను ఆకలికి మాడిపోతూ వుంటే తిండి పెట్టాడు. పుణ్య కార్యాల కోసం నా బంగారు తినార్‌ని త్యాగం చేస్తాను..." తుఘాన్ బంగారు నాణెం చూపించాడు. "మహా పాలకా, దయచేసి అవకాశం ఇచ్చి పాపిష్టి వాణ్ణి హాజీ రహీమ్‌ని చూడనిస్తావా?"

"బంగారు దినార్‌ని యియ్యి. పక్క పెరట్లోకి వెళ్లు. అక్కడ నీ పిచ్చి అన్నతో నీ చిత్తం వచ్చినంత సేపు వాగు".

తుఘాన్ బంగారు దినార్‌ని గోపురం పాలకుడి చేతిలో పెట్టి, పెద్ద ద్వారం గుండా వెళ్లాడు.

# ఇనప బోనులో

ఆ చిన్న పెరడులో ఆ మూల గోడకి నల్లని నలు చదరపు కంత వుంది. ఇనప బద్దీలు కమ్మీ వుంది. పీలికల పోగులో చీకట్లో యేదో కదిలింది.

బోనుకి దగ్గర నేలదాకా జీరాడే శాలువా కప్పుకున్న సన్నవి విగ్రహం వుంది. అలాంటి శాలువాని దిమ్మరి లులీ తెగ ఆడవాళ్లు వేసుకుంటారు.

తుఘాన్ మెల్లిగా ముందుకు వెళ్లాడు. ఆ అమ్మాయి తల యెత్తింది. పరిచితమైన ఆ ముఖం అతన్ని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. అదే బంగారు వదనం, ముచ్చటైన కళ్లు; కాని దిలాసాగా వుండే పాత చూపు పోయింది. ఒక యీషణ్మాత్ర దృక్కు. ఆ అమ్మాయి అటు తిరిగిపోయింది. వుహుఁ - తను పొరపాటు పడలేదు - ఆమె బింట్ జాంకిజా.

తుఘాన్ యింకా దగ్గరికి వెళ్లాడు. బోనులోకి చూశాడు. నిటారుగా కూర్చునే చోటు లేదు అక్కడ. వాలి గూనిగా వుండాల్సిందే. చీకట్లో అతనికి జడలు కట్టిన నల్లని జుట్టు కనిపించింది. రగిలే చురుకు కళ్లు కనిపించాయి. పీక్కుపోయిన ముఖంలో వచ్చిన భయంకరమైన మార్పు వున్నా కూడా తుఘాన్ హాజీ రహీమ్‌ని పొరపడ్డు. దర్వీషు బోను కమ్మీల దాకా పాకి వచ్చి, జుట్టు పెరిగిన ముఖాన్ని వాటిమీద అన్నాడు.

“సరిగ్గా వేళకి వచ్చావు తుమ్ముడూ. దగ్గరికి రా, తుఘాన్. నా కడపటి కోరిక విను. ఇప్పుడు వాళ్లకి కావలసినదంతా రాశాను. కాని దాన్ని చదివాక నన్నూ, నా పుస్తకాన్నీ కూడా దగ్ధం చేస్తారు... నేను వాళ్లకి మళ్లే జేగురు గడ్డం జెంఘిజ్ ఖాన్‌ని స్తోత్రం చెయ్యలేదు లేదా ఖోరెస్మ్‌ని జయించిన తాతార్లని కీర్తిస్తూ తేనె పాటలు రాయలేదు, ఆడవాళ్లనీ పిల్లల్నీ క్రూరంగా చంపన దుర్మార్గులు. నేను నిజం రాశాను. నా కళ్లతో చూసిందాన్నా రాశాను. నేను చెయ్యగలిగిన దంతా చేశాను. ఇక ఆఖరి ఘడియలు వస్తున్నాయి నాకు...”

తుఘాన్ మెల్లిగా అన్నాడు:

“మనల్ని తాళ్లతో కట్టేసి ‘నల్ల బట్టల రౌతు’ కార కోంచర్ కత్తి మన నెత్తి మీద వేలాడినప్పుడు యెడారితో నువ్వునాతో యేం చెప్పావో గుర్తుందా? ‘యింకా ఆశని వదులుకునే వేళ అవలేదు. రాత్రి దీర్ఘం, కాని యింకా ముగియలేదు’ అని చెప్పింది నువ్వు కాదూ.

అందుకనే నేను నేర్చుకున్న దాన్ని మళ్లీ చెప్తున్నా: 'ఆశని చంపుకోకు – రాత్రి మొదలవలేదు' ".

హాజీ రహీమ్ తక్షణం, యేదో హఠాత్ శక్తి ఆవేశించినట్టు, చురుగ్గా అయ్యాడు. తుఘాన్ మెల్లిగా చెప్తూనే వున్నాడు. గబగబా లోగొంతుకలో గొణిగాడు:

"విను, అన్నా, జాగ్రత్త. నేను చెప్పినట్టు చెయ్యి. నీకు మూడు నల్లని చిన్న గుళ్లు ఇస్తాను. వాటిని మింగెయ్యి. అప్పుడు చచ్చిపోయినట్టు నిశ్చేష్టంగా వుండిపోతావు నీకే బాధా అనిపించదు. నీకు చక్కని కలలు వస్తాయి. యేదో కొండలమీద యెగిరి ఒక లోయలోకి పోతున్నట్టుగా వుంటుంది. అక్కడ కమ్మని పువ్వులుంటాయి. మంచులా తెల్లగా వుండే గుర్రాలు మేస్తూ వుంటాయి. గడ్డి నిడుపుగా నిగనిగలాడుతూ వుంటుంది. బంగారు జిహ్వాల పక్షులు మధురమైన పాటలు పాడుతూ వున్నట్టనిపిస్తుంది. నువ్వు పదహారేళ్లు కుర్రాడిగా వున్నప్పుడు ప్రేమించిన అమ్మాయి మళ్లీ కనిపిస్తుంది..."

"అవును, మెలుకువ వచ్చాక మళ్లీ యీ యినప కమ్మీలు సిద్ధం అవుతాయి. వద్దు, అలాంటి కలలు వద్దు".

"కొంచెం తాళి నే చెప్పేది విను. నువ్వింకా కలల పర్వత లోయలో వున్నప్పుడే, తెరలేని విస్మృతిలో పరవశిస్తూ వున్నప్పుడే, నేను ఖైదు కావలావాడి దగ్గరికి వెళ్లి నువ్వు చచ్చిపోయావని చెప్తాను. నీ శవాన్ని పూడ్చడం అవసరం అని చెప్తాను. అప్పుడతను గుమ్మం తెరుస్తాడు, కొక్కెంతో నిన్ను బయటికి లాగుతాడు, నిన్ను ఉరితీసిన వాళ్ల గొయ్యిలో పడేస్తాడు... నువ్వు ఓర్చుకోవాలి ఆ నొప్పిని, అది యెంత యెంత యెక్కువగా వున్నా. మూలగవద్దు, లేకపోతే వాళ్లు ఇనప గదతో నీ తలబద్దలు గొడతారు... కాని అర్ధరాత్రి వేళ నువ్వింకా గోతిలో వుండగానే, నక్కలు నక్కుతూ నీ మాంసం తిండానికి వస్తూ వుండగానే, నేను ముగ్గురు రౌతులతో అక్కడ వుంటాను. నిన్నో పెద్ద గుడ్డలో చుట్టి త్వరగా మోసుకుపోతాం, నగరం బయటికి, నిర్జన ప్రాంతానికి... నీకు మళ్లీ స్పృహ వస్తుంది. నా గుర్రం నీకిస్తాను. నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్లిపో తూర్పుగ్గాని, పడమరగ్గాని. మళ్లీ జీవించు..."

"నిజమే నువ్వన్నది. రాత్రి ఇంకా మొదలవలేదు. నేను మంచులాంటి తెల్ల గుర్రాలున్న లోయకి వెడతాను... ఆ మాయ గుళ్లు యియ్యి" హాజీ రహీం చేతిని చాచాడు.

తుఘాన్ ఓ రంగు సంచీలోనుంచి మూడు నల్లని చిన్న గుళ్లు తీసి హాజీ రహీమ్‌కి ఇచ్చాడు. అతను వటిని మారు మాట్లాడకుండా మింగేశాడు. తనకి తనే యేదో గొణుక్కోవడం మొదలుపెట్టాడు. ఆ గొణుగుడు క్రమేపీ మణిగిపోయింది. ఆఖరికి యేం వినిపించలేదు. అతను వూగి పక్కకి వాలి పోయాడు....

కాపలావాడు బల్లెం పట్టుకుని బోను దగ్గరికి వచ్చాడు.

"నువ్విక్కడ చాలా సేపు యీ చీకటి కొట్టు క్షుద్రంతో వున్నావని పాలకుడు అంటున్నాడు".

"ఆ ఖైదీకి యిక మీ పాలకుడి బెడద లేదు. చచ్చిపోయాడు".

కాపలావాడు అతనికేసి అనుమానంగా చూసి బల్లేన్ని కమ్మీలగుండా లోపలికి పెట్టి దర్వీషుని కుదిపాడు.

"కదలడంలా. చచ్చాడు నిజమే... సరే, యీ పిచ్చి దర్వీష్ శవాన్ని గోతిలో పారెయ్యాలి. అతన్ని పూడ్చి పెట్టదలచుకుంటే కానీ యీ రాత్రికే తయారవు. తెల్లవారే వేళకి నక్కలూ కుక్కలూ మింగేస్తాయి. యెముకలు కూడా దొరకవు... ఓ బాగుంది, మీకు దాతృత్వం యెక్కువ! మనమంతా యెప్పుడో ఒకప్పుడు వెళ్లి పోవాల్సిన వాళ్లమే..."

# పుస్తకం ఆఖరి పుట

"ఓపిగ్గా భరించిన వాడు తన
కృషికి సత్ఫలితాన్ని కడకి చూస్తాడు".
(హాజీ రహీమ్)

తుఘాన్, బింట్ జాంకిజాలు కలిసి మౌనంగా ఆ నిశ్శబ్ద శూన్య శిథిల నగరం వీధుల్లో వెళ్లారు. తుఘాన్ కళ్లేలు పుచ్చుకుని గుర్రాన్ని నడిపించుకు వెళ్లాడు. పాడుపడ్డ ఇళ్ల గోడల మధ్య గుర్రపు గిట్టల చప్పుడు జడంగా ప్రతిధ్వనించింది.

"ఆ భయంకర దినాల్లో నీకేం జరిగింది?"

"మంగోలులు నన్ను బుఖారాలో పట్టుకుని ఖోరెస్మ్ పతనం గురించి విచారకమైన పాటలు తమ ఆటవిక పాలకుడి ముందు పాడించారు. అతనికి నా పాట నచ్చింది. నన్ను చైనా పాటకత్తెలతో వుంచాడు. వాళ్లని కూడా తీసుకెడుతూ వుండేవాడు. వాళ్లతో బాటు, మనుషుల్ని నాశనం చేసిన అతనితోబాటు అతను యెక్కడికి వెళ్లినా కూడా ప్రతి చోటికీ వెళ్లాను. ఒక రోజున జెంఘిజ్ ఖాన్ కళ్లు పోట్లుగా వున్నాయన్నాడు. ఆకాశంలో ఒక చంద్రుడికి మారుగా ఇద్దరు చంద్రుళ్లు కనిపిస్తున్నారన్నాడు. పచ్చిక బీటిమీద ఒక జింకకి బదులుగా మూడు జింకలు దూసుకుపోతున్నాయన్నాడు. తనని దుష్ట శక్తులు పట్టుకున్నాయనుకున్నాడు. మంగోలు షామాన్లు పూజలు చేసి, జెంఘిజ్ ఖాన్ ముందు నాట్యం చేశారు. కాని దుష్ట శక్తుల్ని తరమలేకపోయారు. వైద్యులకి అతని దగ్గరికి వెళ్లడానికి భయపడ్డారు. అతని భయంకరమైన కళ్లల్లోకి చూడ్డానికి వాళ్లకి భయం. కాని ఒక రోజున ఓ ముసలి ఆరబ్ వైద్యుడు జెంఘిజ్ ఖాన్ శిబిరానికి వచ్చాడు. అతని పేరు జిన్ జబన్. ధైర్యంగా ప్రపంచ విజేతకి వైద్యం చెయ్యడం మొదలెట్టాడు. నిజంగానే జెంఘిజ్ ఖాన్‌కి తగ్గించాడు. ఆ ఆటవిక పాలకుడు సంతోషపడి బహుమతీగా యేం కావాలో కోరుకొమ్మన్నాడు. ముసలి వైద్యుడు మణిమాణిక్యాలు అడగలేదు. ఒక గాయకికేసి వేసు చూపించాడు: నేను ఆమెని! నన్ను వైద్యుడికిమ్మని జెంఘిజ్ ఖాన్ ఆజ్ఞాపించాడు. ఆ ముసలాడు నన్ను అంతఃపురంలో బంధించాడు.

నేను పారిపోయాను. గుడిసెలతో సంచారం చేసే అగ్ని ఆరాధకులు లులి తెగవాళ్లు ఆదరించారు నన్ను. మనం వాళ్లని యెంతో అసహ్యించుకునేవాళ్లం. నల్లని ముసుగు వేసుకుని వాళ్లలాగా తిరిగాను, నన్నెవరూ దగా చెయ్యలేదు... అప్పట్నుంచీ నేను లులి తెగతోనే వున్నాను. హాజీ రహీమ్‌ని యీ బోనులో పెట్టారని తెలిసి అతనికి తిండి తెచ్చి పెడుతూ వున్నాను. అతని రాతకి సాయపడ్డాను".

"నువ్వు – నీ కష్టాలు నీకుండగా అతనికి సాయం చేశావు?"

"ప్రతి మూడ్రోజులకీ చీకటి కొట్టు దగ్గరికి భోజనం పట్టికెళ్లేదాన్ని. భోజనంతోబాటు హాజీ రహీమ్‌కి కొన్ని కాళీ కాగితాలు దొంగతనంగా చేరవేసేదాన్ని. ప్రతీ సారీ అతను రహస్యంగా నాకు అంతకు ముందు మూడ్రోజుల్లోనూ రాసిన రాగితాలని అందించేవాడు. వాటిని నా యుర్త్‌లో సాపు రాసి తిరిగి హాజీ రహీమ్‌కి అందేంచేదాన్ని. ప్రతి మూడ్రోజులకీ ఒక సారి ఖోరెస్మ్‌మీద మంగోలు దాడికి సంబంధించిన కొత్త రాత కాగితాలు తీసెకెళ్లేదాన్ని. యీ లోపున హాజీ రహీమ్ చీకటి కొట్లో తన గ్రంథాన్ని రాస్తూ వుండేవాడు. నా చేత్తో తిరగరాసిన రెండో ప్రతిని తయారుచేసేదాన్ని".

"చాలా విలువైన పని చేశావు. హాజీ రహీమ్ పుస్తకాన్ని దుష్టబుద్ధి ఇమామ్‌లు తగలబెట్టేసినా యింకా మరో ప్రతి మిగిలే వుంటుంది. మన మనవలూ, ముని మనవలూ జెంఘిజ్ ఖాన్ దుర్మార్గ కృత్యాల గురించి తెలుసుకుంటారు..." అన్నాడు తుఘాన్.

విచాలంగా, బురద నీళ్లు ప్రవహించే నదీ తీరం దగ్గరికి వచ్చారు వాళ్లు. అక్కడ లులి తెగ పొగబారిన ఉన్ని యుర్త్‌లు వున్నాయి. అక్కడ వో చెట్టుకింద తివాసీ పరిచి వుంది.

బింట్ జాంకిజా తివాసీమీద కూర్చుని అంది:

"హాజీ రహీమ్ చాలా నీరస పడిపోయాడు, ఆ చలిబారిన బోనులో. కాని యెన్నడూ విచారపడలేదు, తన ఆలోచనల వేడితో వెచ్చబడ్డ వాడికి మల్లే. అక్షరాలని కూర్చడం అతనికి కష్టం అయిపోతూ వుంది. చూడు యీ పంక్తులు యెలా వంకరగా వున్నాయో. అతని చెయ్యి వణికేది. ఆఖరి పుటలో హాజీ రహీమ్ చెప్పేది విను:

'వికసించే మా గడ్డమీదకి క్రూర మంగోలుల రాక గురించిన నా కథ ఆఖరి పుటల్ని అరిగిపోయిన నా రెల్లు కల్లం రాసింది. యీ గ్రంథం రాసిన వాడి సంకల్పం ఇంకా దృఢంగానే వుంది. శాంతియుతంగా బతికే ప్రజల్ని క్రూరంగా అణగదొక్కిన ఆటవికుడు జెంఘిజ్ ఖాన్‌ని యెదిరించి పోరాటంలో అనువులు అర్పించలేకపోయిన దుర్బల హృదయులైన ఖోరెస్మ్ మనుషుల గురించి యింకా చెప్పాలని వుంది.

'ఖోరెస్మ్ వాసులందరూ కలిసి కట్టుగా నిలబడి ఒక్క మనిషిలా వుండి వుంటే, మన దేశపు శత్రువులమీద కత్తులనీ కోపాన్నీ యెక్కు పెట్టి వుంటే, ఆగ్రహంత పోరాడి తమ స్వార్థం మరిచిపోయి వుంటే, ఆ పొగరుమోతు మంగోలులూ వాళ్ల జేగురు గడ్డం పాలకుడూ

ఖోరెస్మ్‌ని ఆరు నెలలు పట్టి వుంచుకోలేకపోయేవాళ్లు. యెన్నటికీ పచ్చిక బీళ్లమీద సుదూరంగా తిరుగుతూ వుండేవాళ్లు.

'ప్రత్యర్థులలో అనైక్యం, పిరికితనం, భయం యెక్కువ ఉండడంవల్ల మంగోలులు విజయం సాధించారు, తమ వంగిన కత్తుల శక్తివల్ల కాదు. ధైర్యవంతుడైన జలాలుద్దీన్ చూపించాడు దృఢ సంకల్పం వున్న చిన్న దళం అయినా యెలా మంగోలు దుండగీళ్లతో పోరాడగలదో...

'కాని మొద్దు బారిపోయే నా వేళ్ల మధ్యనుంచి కలం జారిపోతోంది. సంచారి దర్వీష్ శక్తి సన్నగిల్లుతోంది, రోజులు గడుస్తున్నాయి, అవసానం సమీపిస్తోంది. నేను కవి మాటల్లో చెప్పగలనంతే:

'వసంతరుతు వానలాగ
శీతకట్టు గాలిలాగ
యౌవన దినాలు గడిచిపోయె.
జీవిత మైదానంలో
యింకా పడుకుని వున్నా,
కాని బిడారు దళ నాయకుడు
ఒంటెలకి బరువెత్తెను
పయనానికి తయారయ్యె...' "

బింట్ జాంకిజా సన్నని నల్లని వేలిని పెదాలకి అదిమింది. ఆ వేలికి మూడు వెండి ఉంగరాలున్నాయి. కొంచెం సేపు కనుబొమలు ముడుచుకుని ఆలోచనల్లో వుండి పోయింది. తర్వాత జాగ్రత్తగా కాగితాలని పేర్చి రంగు పీలికతో కట్టింది. మెరిసే నల్లని కళ్లని తుఘాన్ ముఖంకేసి తిప్పి, మెల్లిగా అంది:

"లులి తెగలోని ముగ్గురు సాహసవంతులైన యువకుల్ని తెస్తాను. తలారి గొయ్య దగ్గరికి వెడదాం. హాజీ రహీమ్‌ని వెనక్కి తెద్దాం. నిజంగా రాత్రి దీర్ఘం, ఇంకా ముగియలేదు! అతన్ని వెనక్కి తెద్దాం!..."